
హెచ్.వాన్‌డామ్

పిల్లలకు సంఘచరిత్రలోని కథలు

సమస్త జనులకు బోధించుడి



DEPUTAATSCHAP BIJBELVERSPREIDING

ఉచిత పంపిణీకి మాత్రమే
For Free Distribution Only

విషయసూచిక

I. సంఘ చరిత్ర అనగానేమి?

1. సంఘ చరిత్ర అనగా నేమి 8

II. ఆది సంఘము
క్రీ.శ. 0 - 500

అపోస్తలుల బోధ

2. మీరు వెళ్ళుడి.... 10
3. సర్వలోకమునకు 12
4. సంఘజీవితము 14

క్రైస్తవుల హింస

5. హింస 16
6. పాలికార్ప్ (క్రీ.శ. 69-156) 18
7. జస్టిన్ మార్టర్ (క్రీ.శ. 114-165) 20
8. బ్లాండీన మరియు పాంటికస్ 22
9. పర్‌పెచ్‌వా మరియు ఫెలిసిటాస్ 24

క్రైస్తవ విశ్వాసపు వాదన (డిఫెండింగ్)

10. దైవ సంబంధ సమర్థవాదకుడైన టర్టూలియన్ (క్రీ.శ 160-230) 26
11. మార్సియన్ మరియు కేనన్ 28
12. కేటకూంబ్స్ 30

క్రైస్తవ విశ్వాసపు గుర్తింపు

13. కాన్‌స్టాంటైన్ మహా చక్రవర్తి 32
14. అద్భుత మార్పులు 34

సంఘములో తప్పుడు బోధలు

15. ఇంకనూ సమాధానము లేదు - ఏరియస్ దుర్బోధ 36
16. అతనేషియస్ మరియు ఏరియస్ 38
17. సంఘము మారనారంభించెను 40

ఋషులు మరియు సన్యాసులు

18. సన్యాసులు - ఆంథోని 42
19. సన్యాసులు మరియు సన్యాస ఆశ్రమములు 44

సంఘ పితరులు

20. ధీరుడైన బిషప్ ఆంబ్రోస్ 46
21. అగస్టీన్ - (క్రీ.శ.354-430) - 1 48
22. అగస్టీన్ - 2 50
23. అగస్టీన్ - 3 52
24. అగస్టీన్ మరియు పెలేజియస్ (క్రీ.శ. 360 - 435) 54

రోమా సామ్రాజ్య పతనం

25. అటవికుల చొరబాటులు - క్లోవిస్ (క్రీ.శ. 465-511) 56

III. మధ్యయుగాలలో సంఘము
క్రీ.శ. 500 - 1500

ఉత్తర యూరోప్‌లో సువార్తను ప్రకటించుట

26. ఐర్లాండులో క్రైస్తవ్యము - ప్యాట్రిక్ 58
27. పోప్ గ్రెగరి ద గ్రేట్ 60
28. తప్పుడు బోధ 62
29. విల్లిబ్రార్డ్ మరియు బోనిఫేస్ 64
30. చార్లీమేన్ మరియు క్రైస్తవ్యము యొక్క వ్యాప్తి 66

తూర్పు మరియు పశ్చిమ సంఘము

31. తూర్పు సంఘము - గొప్ప విభజన 68

చక్రవర్తి మరియు పోప్ మధ్య అధికార ఘర్షణ

32. అంధకార ఘడియలు 70
33. క్లుని - చీకటి సమయములో ఆశాకిరణము 72

పరిశుద్ధ దేశమునకు దండయాత్రలు

34. యాత్రలు 74
35 మతయుద్ధములు 76

సన్యాసక్రమము మరియు తప్పుడు బోధకులు

36. క్లెయిర్‌వాక్స్ వాడైన బెర్నార్డ్ - మర్మయోగి (క్రీ.శ. 1090-1153) 78
37. మెండిక్యంట్ ఆర్డర్స్ - అసిసి వాడైన ఫ్రాన్సిస్ (కీ.శ. 1181-1226) 80
38. మధ్యయుగములో పోప్ అధికారము 82
39. వాల్డెన్సియన్‌లు 84

40. బహిష్కరింపబడ్డ పోప్ 86

సంఘ సంస్కరణ పూర్వగాములుగా ఉన్నవారు

41. గెరార్డ్ గ్రూట్ మరియు ఆధునిక భక్తి 88
42. జాన్ విక్లిఫ్ – సంఘ సంస్కరణ వేగుచుక్క 90
43. జాన్‌హస్ – దేవుని వాక్యబోధకుడు 92

IV. 16వ శతాబ్దంలో సంఘము
క్రీ.శ. 1500 – 1600

గొప్ప సంఘ సంస్కర్తలు

44. మార్టిన్ లూథర్ – గొప్ప సంఘసంస్కరణకర్త 94
45. ఆశ్రమములో మార్టిన్ 96
46. లూథర్ – 31 అక్టోబర్ (క్రీ.శ. 1517) 98
47. పోరాటములో లూథర్ 100
48. వార్మ్స్ నందు లూథర్ 102
49. వార్ట్‌బర్గ్‌లో లూథర్ 104
50. సంఘ సంస్కరణ కొనసాగెను కాని ప్రమాదములు సంభవించెను 106
51. లూథర్ – అంతము వరకు శ్రమించెను 108
52. జ్వింగ్లి మరియు ఇతర సంఘసంస్కరణకర్తలు 110
53. జాన్ కాల్విన్ 112
54. పలాయనుడైన కాల్విన్ 114
55. జెనీవాలో కాల్విన్ 116
56. కాల్విన్ తిరిగి జెనీవాకు వచ్చెను 118
57. కాల్విన్ మరియు సర్వెటస్, కాల్విన్ మరణము 120
58. ప్రతికూల – సంఘసంస్కరణ 122
59. జెసూట్స్ 124
60. ఇంగ్లండ్‌లో సంఘసంస్కరణ 126
61. బ్లడీ మేరి (రక్త దాహముగల మేరి) 128
62. స్కాట్లాండ్‌లో సంఘసంస్కరణ 130
63. జాన్ నాక్స్ మరియు మేరీ స్టూవర్ట్ 132
64. భక్తుడైన బర్తొలొమయి వధ, ప్యారిస్ (క్రీ.శ. 1572) 134
65. ఆగ్స్‌బర్గ్ మత శాంతి 136
66. హైడెల్ బర్గ్ కాటకిజమ్ 138
67. ఉత్తర సింహం – గుస్టావస్ అడల్ఫస్ 140

నెదర్లాండ్‌లో సంఘ సంస్కరణ

68. నెదర్లాండ్స్‌కు సంఘసంస్కరణ ఉద్యమము వచ్చెను 142
69. నెదర్లాండ్స్... హింస మరియు విడుదల 144
70. డార్‌డ్రెక్ట్ సినాడ్ 146
71. జన్‌సెనిజమ్ మరియు పాస్కల్ 148

రోమన్ క్యాథలిక్ మిషన్

72. రోమన్ క్యాథలిక్ మిషనరీలు – లాస్ కసాస్ 150
73. రోమన్ క్యాథలిక్ మిషనరీలు – జేవియర్ 152

V. 17వ శతాబ్దంలో సంఘము
క్రీ.శ. 1600 – 1700

జర్మనీలో పియటిజమ్

74. జర్మనీలో పియటిజమ్ – ఫ్రాంకీ 154
75. జర్మనీ పియటిస్ట్‌లు మరియు వారి సువార్త సేవ 156

నెదర్లాండ్స్‌లో మరిన్ని సంఘ సంస్కరణలు

76. నెదర్లాండ్స్‌లో నాడేర్ రిఫార్మాటి (అధిక సంఘపునరుజ్జీవం) (1) 158
77. నెదర్లాండ్స్‌లో నాడేర్ రిఫార్మాటి (2) 160
78. వాన్ లోడెన్‌స్టెయిన్ 162

గ్రేట్ బ్రిటన్‌లో ప్యూరిటనిజమ్

79. పదిహేడవ శతాబ్దములో గ్రేట్ బ్రిటన్ 164
80. జాన్ బన్యన్ 166

VI. 18వ శతాబ్దంలో సంఘము
క్రీ.శ. 1700 – 1800

అమెరికాలో ఉజ్జీవ కదలికలు

81. ఇంగ్లండ్ మరియు అమెరికాలలో ఉజ్జీవం 168

82. అమెరికాలో గొప్ప మేల్కొలుపు – జోనతన్ ఎడ్వర్డ్స్ 170

జ్ఞానోదయం మరియు ఫ్రెంచ్ విప్లవం

83. జ్ఞానోదయము 172
84. సంఘములో జ్ఞానోదయ యుగము మరియు ఫ్రెంచ్ విప్లవము 174
85. కష్టసమయములు 176

VII. 19వ శతాబ్దంలో సంఘము క్రీ.శ. 1800 - 1900

నెదర్లాండ్స్‌లో ఆత్మీయ మేల్కొలుపు

86. ఆత్మీయ మేల్కొలుపు 178
87. నెదర్లాండ్స్‌లో ఉజ్జీవము 180

నెదర్లాండ్స్‌లో వేర్పాటు ఉద్యమాలు

88. నెదర్లాండ్స్‌లో పరిస్థితి 182
89. హెండ్రిక్ డి కాక్ 184
90. విడిపోవుట మరియు హింస – (క్రీ.శ. 1834) 186
91. విడిపోవుటను గూర్చి మరికొన్ని విషయములు (ఆఫ్‌స్కెయ్‌డింగ్) 188
92. వాన్ రాల్టి మరియు అమెరికాకు వలసపోవుట 190
93. లంబర్టస్ లెడెబోయర్ మరియు నూతన విభజన 192
94. ఆట్టో హెల్ డ్రింగ్ మరియు నెదర్లాండ్స్‌లోని హోమ్ మిషన్ 194
95. గ్రోయెన్ వాన్ ప్రిన్స్టరర్ 196
96. డాక్టర్ హెచ్. యఫ్. కోల్‌బ్రగ్గి 198
97. అబ్రహాం కుయ్‌పర్ 200
98. జి.హెచ్. కెర్‌స్టన్ మరియు గెరిఫార్మియర్డి గిమియంటీన్ (క్రీ.శ.1907) 202
99. నెదర్లాండ్స్ హర్‌ఓర్మ్‌డ్ కెర్క్ (డచ్ రిఫార్మ్‌డ్ చర్చ్) లో మరిన్ని ప్రసిద్ధములు 204

19వ శతాబ్దంలోని వర్గములు

100. యెహోవా సాక్షులు..... ఓ తెగ 206

19వ శతాబ్దంలో రోమన్ క్యాతలిక్ చర్చి

101. రోమన్ క్యాథలిక్ సంఘము మరియు వాటికన్ కౌన్సిల్ 208

19వ శతాబ్దంలోని ప్రపంచ మిషన్

102. పంతొమ్మిదవ శతాబ్దము – మిషనరీ యత్నము 210
103. విలియమ్ కేరీ – భారత దేశములోని మిషనరీ 212
104. మేరి స్లెసర్ – పశ్చిమ ఆఫ్రికా మిషనరీ 214
105. ఘానలో మిషన్ పని 216
106. జొహన్నెస్ థియోడొరస్ వాన్‌డెర్ కెంప్ – దక్షిణ ఆఫ్రికాలోని మిషనరీ 218
107. బానిసత్వము రూపుమాపబడుట 220
108. జేమ్స్ హడ్సన్ టేలర్ – చైనా మిషనరీ 222
109. లుడ్‌విగ్ ఇంగ్‌వెర్ నొమ్మెన్‌సెన్ – బటక్‌లోని మిషనరీ 224
110. రోమన్ క్యాథలిక్ సంఘము మరియు రెండవ వాటికన్ కౌన్సిల్ 226

VIII. 20వ శతాబ్దంలో సంఘము క్రీ.శ. 1900 - 2000

111. ఈస్టర్న్ ఆర్థోడాక్స్ చర్చ్ 228
112. లూథరన్ చర్చ్ 230
113. మెథడిస్ట్ చర్చ్ 234
114. బాప్టిస్ట్ చర్చ్ 230
115. విలియమ్ బూత్ మరియు సాల్వేషన్ ఆర్మీ 236
116. పెంతెకొస్తు ఉద్యమము 238
117. సంఘము మరియు యూదుల హింస 240
118. జాయనిజమ్ 242

IX. కాలసూచనలు

119. కాల సూచనలు 244
120. అత్యధిక విజయులం.... 246

1. సంఘ చరిత్ర అనగా నేమి?


మీరు ఈ పుస్తకమును చదువుతుండగా సంఘచరిత్రను గూర్చి చదివెదరు. కాని ఖచ్చితముగా సంఘ చరిత్ర అంటే ఏమిటి? ఆదివారమున బోధ వినుటకై సంఘమునకు వెళ్ళెడివారు దేవుని వాక్యము బోధింపబడుతుండగా వారు విందురు. వాస్తవానికి బైబిల్ ద్వారా, ఆయన వాక్య బోధ ద్వారా దేవుడు స్వయాన మనతో మాటలాడును.

ఆయన వాక్యము ద్వారా దేవుడు మనతో ఎందుకు మాటలాడును? నశించిన, పాపాత్ములైనవారిని ప్రభువు రక్షింపగోరును మరియు ఈ ఉద్దేశ్యము నిమిత్తమై ఆయన తన వాక్యమును వాడుకొనును. గనుక, దేవుని వాక్య ప్రకటన ద్వారా మరియు పరిశుద్ధాత్ముని కార్యము ద్వారా పాపులు పశ్చాత్తాపపడెదరు. దేవుని యొద్దకు రాకపోవుట వారికే వదలివేయబడినది. ప్రజలందరు దేవుని శత్రువులయ్యారు. వారి పాపమునుబట్టి ప్రజలందరు దేవుని నిత్యశిక్షపొంద తగినవారు కాని, ఒకప్పుడు దుష్టునికి చెందిన పాపుల హృదయములను మార్చి ప్రభువైన యేసు క్రీస్తునకు చెందజేయువాడు ప్రభువే. ఆయన వారిని తన ప్రశస్త రక్తము ద్వారా కొనెను గనుక వారు యేసునకు నిజముగా చెందుదురు. పాపులు విశ్వాసము ద్వారా ఆయన వారి రక్షకుడని ఎరుగుదురు. వారాయనను ప్రేమింతురు గనుక వారి హృదయమంతటితో వారు ఆయనను సేవింతురు.

పశ్చాత్తాపమునొంది ప్రభువైన యేసునందు విశ్వాసముంచిన వారందరు క్రీస్తు యొక్క సంఘమునకు చెందుదురు. మరొక విధముగా చెప్పాలంటే: వారందరు క్రీస్తు యొక్క సంఘములో సజీవ సభ్యులు మరియు వారు శాశ్వతముగా ఈ సంఘ సభ్యులైయుందురు. వారు చనిపోయిననూ, ప్రభువుతో పరలోకములో చిరకాలము ఉండెదరు. భూమిమీద దేవుని బిడ్డలెల్లప్పుడు ఉన్నారు గనుక సంఘము కూడా ఎల్లప్పుడునూ ఉనికిలో ఉన్నది. ఒకే సంఘమున్నది – క్రీస్తే దాని అధిపతి మరియు రాజు గనుక ఒకే క్రైస్తవ సంఘమున్నది.

నీవు క్రీస్తు యొక్క సంఘమును ఎక్కడ కనుగొనెదవు? ప్రపంచమందంతట ఎక్కడెక్కడైతే వాక్యము ప్రకటింపబడుతున్నదో అక్కడ నీవు దానిని కనుగొనవచ్చును. కాని క్రీస్తు యొక్క సంఘము అంతటా ఉన్నదా? లేదు. రెండు వేల సంవత్సరముల క్రితము ప్రభువైన యేసు భూమిమీదకు మానవునిగా వచ్చినపుడు, సంఘము పాలస్తీనాలో మాత్రమే ఉండెను, లేదా అది ఇశ్రాయేలని పిలువబడుతున్నట్లుగా నుండెను. ఆ సమయముకంటే ముందు ప్రభువు కేవలము తన వాక్యమును అబ్రాహాము సంతతియైన యూదులకే ఇచ్చెను. ఇది సంభవించిన విధమును బైబిల్‌లోని పాతనిబంధనలో మనము చదువవచ్చును.

కాని ప్రభువైన యేసు పరలోకమునకు ఆరోహణమైన పిమ్మట, విషయములు మారెను. ఆయన చాలాకాలము ముందే వాగ్దానము చేసినట్లు, ఆయన ఆరోహణమైన వెంటనే, ప్రభువు ఆయన ఆత్మను అనగా పరిశుద్ధాత్ముని పంపెను. పెంతెకొస్తు పండుగనాడు పరిశుద్ధాత్ముడు క్రుమ్మరింపబడెను. ఆయన క్రీస్తు యొక్క సంఘమునందు నివసించుటకు వచ్చెను.




ఆ సమయమునుండి, ఇతర దేశాలలో కూడా దేవుని వాక్యము ప్రకటింపబడేలా పరిశుద్ధాత్ముడు జాగ్రత్త వహించెను, మరియు ఎన్నడునూ సువార్త వినని వారు సువార్త వినులాగున చూచుకొనెను. ఈ ప్రక్రియ రెండువేల యేండ్లకు పైబడి కొనసాగుతూనేయున్నది. అనేక వేర్వేరు స్థలములలో ప్రజలు దేవుని వాక్యము బోధింపబడగా వినుటకై కూడుదురు, తత్ఫలితముగా సంఘములు ఏర్పడుచున్నవి.

ఈ సంఘములలో పాపులు ప్రభువైన యేసు అనుచరులగులాగున పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమును వాడును. తిరిగి జన్మించుట అను అద్భుతక్రియ ద్వారా, పాపులు మారులాగున పరిశుద్ధాత్ముడు దోహద పడును. బైబిల్‌లో ఈ ప్రక్రియ హృదయము నూతనము చేయబడుట గా కూడా పేర్కొనబడినది.

ఈ కారణము చేత ప్రపంచమందంతట క్రీస్తు యొక్క సంఘము ఎదుగుచున్నది. ప్రపంచ వ్యాప్తముగా కోట్లకొలది ప్రజలు ఇదివరకే మార్పు నొందారు. ఇంకనూ ఆ కార్యము కొనసాగుతున్నది. ఆయన వాక్యము ద్వారా మరియు ఆయన ఆత్మ ద్వారా ఈ కార్యము కొనసాగులాగున స్వయాన ప్రభువైన యేసు చూచుకొనుచున్నాడు. ఆయన వాక్యమును అంతటా బోధించుటకై ప్రభువు తన సేవకులను పంపును. అప్పుడు ఆయన ఆత్మ పాపులు దేవునివైపు మరలులాగున దోహదపడును.

మరియు ఇవన్నియూ ఎలా సంభవించును? మీరు ఈ పుస్తకమును చదువుతుండగా జవాబును కనుగొందురు.

మీరు క్రీస్తు యొక్క సంఘచరిత్రను చదివెదరు. క్రీస్తు యొక్క సంఘము ఈ భూమి మీద ఎన్ని పోరాటములను కష్టములను ఎదుర్కొనెనో చూచెదరు. అది యుద్ధమునందున్నది. దానికి అనేక శత్రువులుగలరు! కాని దాని రాజు సంఘమును కాచి భద్రపరచు సర్వశక్తిమంతుడగు రాజైయున్నాడు. ఆ కారణముచేత ఆయన అనుచరులందరు విజయోత్సవముతో పరలోకము చేరెదరు. మరొక విధముగా చెప్పాలంటే: పరలోకమందున్నది విజయోత్సవ సంఘము !



2. మీరు వెళ్ళుడి....

ప్రభువైన యేసు ఇంకనూ భూమిమీద నుండగా ఈ మాటలు ఆయనచే పలుకబడినవి. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సమస్త జనులకు భోదించుడి...." పరిశుద్ధాత్ముడు క్రుమ్మరింపబడిన తరువాత యెరూషలేములో ఓ పెద్ద క్రైస్తవ సమాజము ఏర్పడెను. దీనిని గూర్చి మనము బైబిల్‌లో చదివెదము. పెంతకొస్తు దినాన మూడు వేలమంది రక్షింపబడిరి. కొన్ని దినముల పిమ్మట ఆ సంఖ్య ఐదువేలకు చేరెను. గనుక క్రీస్తు యొక్క సంఘము క్రమేపి ఎదుగుచున్నది...

యెరూషలేములోని పెద్దసమాజమునకు అపొస్తలులు అధ్యక్షత వహించారు. మూడేండ్ల కాలము పాటు ప్రభువైన యేసుతో ఉన్న ఈ పురుషులే, అపొస్తలులు. ఆయన బోధించుచూ మరియు ప్రసంగించుచూ వెళ్ళెను. వారు ఆయన శిష్యులుగాను, అనుచరులుగాను ఉండిరి. ఇప్పుడు పెంతెకొస్తు తరువాత, వారు ప్రభువుచే పంపబడిన విధముగా సువార్తను ప్రకటించిరి. అందుకే వారు ఇప్పుడు అపొస్తలులుగా (పంపబడినవారుగా) పిలువబడుతున్నారు. ఈ మొదటి సంఘ చరిత్రకాలము అపొస్తలుల కాలముగా పిలువబడెను.

ఎంతోకాలము కాక మునుపే సంఘము హింసను అనుభవించెను. అందునుబట్టి చాలామంది యెరూషలేము విడిచి వెళ్ళిరి. వారెక్కడికి వెళ్ళినా, పెంతెకొస్తు అను అద్భుతమును గూర్చి చెప్పిరి. ఇశ్రాయేలులోని ఇతర భాగములలో వారు సువార్త పరిచారకులయ్యారు. వారు ఇశ్రాయేలులోని ఇతర భాగములకు వెళ్ళుటయేగాక, వారు ఇతర దేశములైన సమరయ మరియు సిరియాలకు వెళ్ళిరి. ఈ స్థలములలో నివసించు చాలా మంది యూదులు క్రైస్తవులై క్రైస్తవ సంఘములుగా ఏర్పడిరి. అపొస్తలులు ఆ ప్రాంతములు తిరిగి ఈ నూతన సంఘములను దర్శించిరి. ఉదాహరణకు, పేతురు యొప్పే పట్టణమునకు వెళ్ళెను (నేడు దానిని జాఫ్పా అని పిలుచుచున్నారు.)


ఆయన అక్కడ చేరుకున్నప్పుడు సంఘములోని ప్రజలు విచారముగానున్నట్లు కనుగొనెను. సంఘమునకు హాజరయ్యే ఒక స్త్రీ అప్పుడే మరణించెను. ఆమె విధవరాండ్ర పట్ల, పేద ప్రజలపట్ల దయగానుంటూ వారికి సహాయకరముగా నుండెను. ఆమెపేరు దొర్కా గాని ఆమె తబిత అని పిలువబడేది.

తబిత పరుండియున్న మరణ పడక ప్రక్కన పేతురు మోకరించెను. ఆయన దేవునికి ప్రార్థించెను. అప్పుడు ఆయన నిలువబడి ఆమెను చేతపట్టుకుని "తబిత లెమ్ము" అని చెప్పెను. ఆమె కళ్ళు తెరిచి కూర్చుండెను! ఆమె బ్రతికి ఆరోగ్యముగా సంఘమునకు వచ్చెను. మరియు ఈ అద్భుతము యొక్క ఫలితమేమి? చాలామంది ప్రభువును విశ్వసించిరి!

ఏది ఏమైనా, యూదులు మాత్రమేగాక అన్యులు కూడా సువార్త వినుట పరిశుద్ధాత్ముని చిత్తము. యూదుల మధ్యన మాత్రమేగాక అన్యుల మధ్యన కూడా సంఘము కట్టబడుట ప్రభువు చిత్తము. ప్రపంచములోని పాపులందరు క్రీస్తు నొద్దకు చేర్చబడుట ఎంత ఆశ్చర్యము! వారందరు ఆయనను రాజులకు రాజుగా సేవించి గౌరవింతురు. క్రీస్తు అన్యుల రాజు కూడాను! ఈ కారణముచేత ప్రభువు పేతురును అన్యశతాధిపతియైన కొర్నేలి ఇంటికి పంపెను. పేతురు కొరకు మనుష్యుని పంపమని పరలోకమునుండి ఒక దూత కొర్నేలితో చెప్పెను.

పేతురు కొర్నేలి గృహములో ప్రసంగింప ప్రారంభింపగా ప్రభువు అన్యులనుకూడా పశ్చాత్తాపపడగోరుచున్నాడని స్పష్టమాయెను. అన్యులమీద కూడా పరిశుద్ధాత్ముడు క్రుమ్మరింపబడెను. దేవుని ప్రేమ మరియు కరుణ ఎంత అద్భుతము!

ఈ సమయంలో మరొక గొప్ప అద్భుతము జరిగెను. గొప్ప పండితుడు, తార్షీషువాడైన సౌలు, ప్రముఖుడైన పరిసయ్యుడైయుండి, క్రైస్తవులను క్రూరముగా హింసించుచుండెను. అతడు ఇతర దూర దేశములకు వెళ్ళి క్రైస్తవులను బంధించి యెరూషలేమునకు



తెచ్చుచుండెను. ఒక సందర్భమందు, అతను దమస్కు మార్గమందుండగా, ఒక ప్రకాశవంతమైన వెలుగు పైనుండి వచ్చి సౌలుపై ప్రకాశించెను. అతడు నేలకొరిగెను. ఆకాశమునుండి ఒక స్వరము "సౌలా సౌలా నన్నెందుకు హింసించుచున్నావు?" అని పలికెను. సౌలు వణుకుతూ: "నీవెవడవు ప్రభువా" అనెను. అప్పుడు ప్రభువు "నీవు హింసించుచున్న యేసును" అని చెప్పెను. ఆయన స్వయాన ప్రభువైన యేసే అని సౌలు విన్నాక, అతడు వణుకుతూ: "నన్నేమి చేయగోరుతున్నావు" అనెను.

అతనికి తగిన శిక్షనిచ్చుటకు గాక అతనిని దేవుని సేవకునిగా చేయు నిమిత్తమై ప్రభువు – సౌలును పూర్తిగా నలుగగొట్టెను. సౌలు దేవుని అపొస్తలుడాయెను, అన్యులకై దేవుని అపొస్తలుడు! ప్రభువైన యేసును ఒకప్పుడు హింసించిన సౌలు, ఇప్పుడు ఆయన సవినయ సేవకుడయ్యెను! ఎంత అద్భుతమైన మార్పు జరిగెను! మనము దానిని సరిగా అర్థము చేసికొనవచ్చును. మొదట, జరిగిన దానిని అపొస్తలులు కూడా నమ్మలేదు.

ఇప్పటినుండి, మనము బైబిల్‌లో సౌలును గూర్చి చదివెదము, ఆయనకొక క్రొత్త పేరున్నది. ఇప్పుడు అతడు పౌలుగా పిలువబడుచున్నాడు.

3. సర్వలోకమునకు

పౌలు అన్యులకై అపొస్తలుడుగా ఎన్నుకోబడ్డాడు. దీనికర్థము అతడు రోమా మహా సామ్రాజ్యము యొక్క నలుమూలల ప్రయాణించవలసియుంటుంది. అతడు ఎక్కడెక్కడ ఈ మిషనరీ ప్రయాణములు చేసినా, అతను సువార్త ప్రకటించెను. అతడు టర్కీ, గ్రీస్ మరియు ఇటలీ దర్శిస్తూ మూడు గొప్ప మిషనరీ ప్రయాణములు చేసెను. ఆయన స్పెయిన్ కూడా వెళ్ళి యుండవచ్చును. ప్రతిచోట అన్యులు మారారు, సంఘములు ఏర్పరచబడినవి, ఎందుకంటె క్రీస్తు మరియు ఆయన వాక్యము వైపునకు ప్రజల హృదయములు తెరుచువాడు పరిశుద్ధాత్ముడే.

అపొస్తలుల కార్యములలో, పౌలు పనిని గూర్చి మరియు యూదుల నుండి అతడు తరచుగా ఎదుర్కొనిన విరోధమును మరియు వ్యతిరేకతను గూర్చి మనము చదివెదము. కాని సువార్త ప్రకటన వ్యాప్తి ఆపబడలేదు!

ఈ ప్రయాణములయందంతట అతడు అన్యుల నుండియేగాక తన స్వజనులైన యూదుల నుండి కూడా ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొనెను.

పౌలు మిషనరీ పని సమయములో ప్రపంచము



ఎలా ఉండెను? రోమాను కేంద్రముగా గలిగిన రోమా మహాసామ్రాజ్య ప్రపంచమది. ఆ సామ్రాజ్యము ఆసియా, ఐరోపా మరియు ఉత్తర ఆఫ్రికాయందంతట వ్యాపించెను. చక్రవర్తి రోమాలో నివసిస్తూ ప్రజలందరు ఆయనను దేవునిగా పూజించేలా చేసెను. ఒకే సామ్రాజ్యము గనుక పౌలు ఆ సామ్రాజ్యమందు ఎక్కడికెళ్ళినా గ్రీకు భాషను ఉపయోగించెను.

రోమా సైన్యములు చాలా త్వరగా ప్రయాణించులాగున మంచి రహదారుల సమూహముండెను. అట్టి రహదారులు పౌలుకునూ ప్రయోజనకరముగా నుండెను! సామ్రాజ్యమందంతట చట్టము మరియు న్యాయము విలసిల్లెను. చక్రవర్తి ప్రతి దేశము మరియు పరగణాలోని రాజులను మరియు గవర్నర్లను నియమించెను. ప్రజా సంబంధ క్రమమును, చట్టమును కాపాడుట వారి బాధ్యత. ఎక్కడ అలజడి చెలరేగిననూ వెంటనే దానిని అణచునిమిత్తమై ప్రతిచోటా రోమా సైనికులు నియమింపబడిరి. అక్కడ అనేక విషయములుండి అన్నియూ సంయుక్తముగా క్రీస్తు యొక్క సంఘము త్వరిత వ్యాప్తికి ఉపయుక్తపడెను. కాని వాస్తవానికి, మార్గము సుగమము చేసిన వాడు పరిశుద్ధాత్ముడే!

ఇతర అపొస్తలులు సువార్త ప్రకటించుటకై వేర్వేరు స్థలాలు వెళ్ళిరి. వారిలో ఒకడు అపొస్తలుడైన తోమా. తోమా ఎవరు? శిష్యునిగా వుంటూ తోమా తన యజమానుని చాల ప్రేమించెను. ఒకసారి యెరూషలేము వెళ్ళాలనుకొన్నాడు కాని ఆయన శత్రువులు ఆయనను చంపుచున్నారని ఆయన శిష్యులు ఆయనను హెచ్చరించారు. అప్పుడు తోమా "ఆయనతో మరణించులాగున మనమునూ వెళ్ళుదము రండి" అని చెప్పెను. ప్రభువైన యేసు మరణము తరువాత తోమా చాలా క్రుంగి నిరుత్సాహపడి ఇతర శిష్యులతో కూడుటకు నిరాకరించెను. అందుకే ప్రభువు ఆయన పునరుత్థానము పిమ్మట తన శిష్యులకగుపడినపుడు తోమా లేకుండెను. ఆ అద్భుత వార్తను వారాయనతో చెప్పిరి కాని నమ్ముటకు నిరాకరించెను. తన స్వహస్తములతో యేసు ప్రక్కన మరియు హస్తములలోని గాయములను చూచి ముట్టగోరెను. అప్పుడు మాత్రమే యేసు మరణమునుండి లేచాడని నమ్మును. ఇది ఇలా ఉండగా, ఒక వారము పిమ్మట, తోమా తిరిగి శిష్యులతో ఉండెను. అకస్మాత్తుగా యేసు వారి మధ్యన ప్రత్యక్షమై ఆయన ప్రక్కలో మరియు తన హస్తములలోని గాయములలో చేయి పెట్టి చూడుమని తోమాతో అనెను. ప్రభువు ఆయనతో 'నీవు అవిశ్వాసివి గాక విశ్వాసివైయుండుమని" చెప్పెను. తోమా హృదయములో అపనమ్మకము తొలగి "నా ప్రభువా నా దేవా" అని అతడు కేకవేసెను. ప్రభువైన యేసు మంచి కాపరియై తప్పిపోయిన ఆయన గొఱ్ఱెలను కనుగొనెను. భారత దేశమునకు ప్రయాణించిన శిష్యుడు తోమా ఇతడే. అదివరకే యూదులు వందల సంవత్సరాల తరబడి భారత దేశములో వాణిజ్యము చేయుచుండిరి గనుక తోమా వారి వాణిజ్యమార్గములను అనుసరించి దేశమును చేరుకొనెను. అక్కడ దేవుని వాక్యమును మొట్టమొదట ప్రకటించిన వ్యక్తి ఆయనే. కేరళలో దక్షిణ భారతదేశము, తోమా ఏడు సంఘములను స్థాపించి అక్కడే ఆయన హతసాక్షిగా మరణించెను.

అపొస్తలులు ఎక్కడికెళ్ళినా అన్యులు మార్చబడ్డారు మరియు సంఘములు స్థాపించబడినవి. సాధారణ ప్రజలచే కొనసాగింపబడుచున్న ఈ మిషన్ పనిని నిలిపివేయుట అసాధ్యము. అలా ఎందుకు? దానియంతటి వెనుక ఉన్నదేమి? "సర్వలోకమునకు వెళ్ళుడి" అని ప్రభువైన యేసు చెప్పినపుడు "నేను యుగసమాప్తి వరకు మీతో ఉందునని" కూడా ఆయనే చెప్పెను. స్వయాన ప్రభువైన యేసు సంఘమును కాయును. ఆయన దాని అధిపతి. ఆయన సర్వశక్తిమంతుడగు రాజు!

4. సంఘజీవితము

ఆదిమ క్రైస్తవులు భూమిమీదనుంటూ ఉండగా వారు యాత్రికులమని మరియు పరదేశులమని భావించారు. వారి ప్రభువు మరియు రాజు, యేసునందలి విశ్వాసము ద్వారా ఒకరికొకరు బాంధవ్యము గలవారుగా భావించారు. వారిలో చాలామంది సాధారణ ప్రజలుగాను, తరచుగా పేదలుగా నుండేవారు. మొదట రోమీయులు వారికై విషయములను కష్టతరము చేయలేదు. ఒక్కొక్క సంఘము పెద్దల సమూహము ద్వారా లేదా ప్రెస్బిటర్స్ ద్వారా నడుపబడుచుండెను. పై విచారణ చేయువారుగా వారు మందను కాయుచూ కూడికలను నడిపెడివారు. త్వరలో పేదవారిని జాగ్రత్తగా చూచుకొనుటకై పరిచారకులు నియమింపబడ్డారు. సంఘములో బోధకులు మరియు ప్రవక్తలు ప్రత్యేకస్థానము కలిగియుండెడివారు. ప్రజలు ఆరుబయలులో లేదా ఒకరి గృహములో కూడుకునేవారు. ఈ కూడికలు వారములో మొదటి దినాన–"ప్రభువు దినము", ప్రభువు మృతి నుండి లేచిన దినమున జరిగేవి. తరువాత సమాజము పెరుగుతుండగా, సాధారణ సంఘ భవనములు కట్టబడెను.

కూడిక చాలా మామూలుగా నుండెడిది. ప్రజలు ప్రభువునకు కృతజ్ఞతలు చెల్లించి, ఆయనయెదుట వారి విన్నపములు తెలియజేసిరి. వారు కలిసి పాతనిబంధన చదివిరి (అప్పటికింకనూ క్రొత్త నిబంధన



తయారుచేయబడలేదు) దాని తరువాత వారు ప్రసంగము వినెడివారు. ఎవరైనా మాట్లాడదలిస్తే, అది క్రమముగా జరిగినంత వరకు వారిని మాట్లాడ అనుమతించెడివారు. తరువాత సువార్తలు మరియు అపొస్తలుల పత్రికలు కూడా చదువబడెను. ఆ కార్యక్రమములో అతి ప్రాముఖ్యమైన భాగము ప్రభురాత్రి భోజనమును ఆచరించుట. ప్రభురాత్రి భోజనమును ఆచరించినప్పుడెల్లా ఆయన దీనిని స్థాపించినపుడు ఆయన పలికిన శుభప్రదమైన పలుకులు, ఆయన మరణమును జ్ఞాపకము చేసికొందురు.

ఒక వ్యక్తి సంఘములో సభ్యుడు కావలెనంటే బాప్తిస్మము తీసికోవాలి. సహజముగా బాప్తిస్మము కంటే ముందు అభ్యర్థులు క్రైస్తవ విశ్వాసమును గూర్చి హెచ్చరికలు పొందుకునేవారు. ఆ అభ్యర్థులను క్యాటక్యుమెన్స్ అని పిలిచెడివారు.

బాప్తిస్మము తరువాత ప్రభురాత్రి భోజనముండెడిది మరియు బాప్తిస్మము తీసికొన్నవారే ఇందులో పాల్గొనుటకు అనుమతింపబడేవారు.

ప్రభురాత్రి భోజనము జరుపుకోకమునుపు అగాపె లేదా ప్రేమ విందు జరిగెడిది. దీనికర్థము ప్రజలు కలిసి భోజనము చేసెడివారు. క్రైస్తవులు ప్రతిదినము ఒకరినొకరు ప్రేమించుకొనేవారు. విధవరాండ్రు, అనాథలు పోషింపబడెడివారు, పేదలను చక్కగా చూచుకొనెడివారు, రోగగ్రస్థులను, ఖైదీలను దర్శించుచుండెడివారు, మరియు బానిసలు కూడికలకు ఆహ్వానింపబడేవారు. అట్టివారికిని క్రైస్తవ దాతృత్వము చూపబడవలసియుండెను. సంఘమందు యజమానుడని పనివాడని వ్యత్యాసములేక యుండవలసియుండెను. క్రైస్తవులు వారి అనుదిన జీవితములో వారు చేయునదంతటిలోనూ ప్రభువును గౌరవింప ఆశించెడివారు. వారు క్రైస్తవులుగా మార్పునొందకమునుపు ఇతర అన్యులవలె వారును ఉండెడివారు. కాని ఇప్పుడైతే అంతయూ మారిపోయెను. గ్లాడియేటర్లు (క్రూర జంతువులతో పోరాడువారు) బహిరంగ స్థలములో ఆడుతుంటే వీరు ఇకను ఏ మాత్రమును వెళ్ళెడివారు కాదు. అన్య దేవుళ్ళ పేరట ఇచ్చే పార్టీలు మరియు విందు విలాసములలో పాల్గొనెడివారుకాదు.

దేవుళ్ళకు బలులివ్వటములో పాల్గొనువారసలేకాదు. అందుకే వారు అతి త్వరలో "భక్తిహీన ప్రజల"ని పిలువబడ్డారు. క్రైస్తవులు ఇతరులవలె మృతదేహములను కాల్చక రాతినుండి తొలచిన సమాధులలో ఆ మృతదేహములను పూడ్చెడివారు. యేసు మృతదేహమునూ ఇలాగే సమాధి చేయబడలేదా? భర్తలు ఒకే భార్యను కలిగియుండుటకు అనుమతింపబడేవారు, విడాకులు దేవునిచే నిషేధింపబడినవి. చాలా విషయములలో తమచుట్టూ ఉన్నవారికి క్రైస్తవులు భిన్నముగా జీవింపనాశించిరి. వారు దేవుని వాక్యమునకనుగుణముగా జీవింపనాశించిరి.

ఈ వ్యత్యాసములు ప్రజలు వీరిని అధికముగా ద్వేషించేలా చేసెను. "వీరు ఎందులోనూ కలువరు..." అని వారు క్రైస్తవులను గూర్చి చెప్పెడివారు. వాస్తవానికి వారి కూడికలలో వారి సొంత బిడ్డలను చంపుకుని వారి రక్తమును త్రాగుచున్నారని ఘోర, భయంకర నెపములు మోపెడివారు. ప్రజలకెందుకు ఇలాంటి భావనలు కలిగాయి? క్రైస్తవులు కూడుకొనినపుడు ప్రభు రాత్రి భోజనము తరచుగా ఆచరించెడివారు. ద్రాక్షారసము మరియు రొట్టె వధింపబడిన గొఱ్ఱెపిల్లకు సూచనగాను, అవి క్రీస్తు దేహము మరియు రక్తమునకు సాదృశ్యముగాను ఉండెడివి. వీటిని గూర్చి బయటివారికి తెలియక ఇట్టి నేరారోపణలు బయలుదేరాయి. గనుక రోమీయులు క్రైస్తవులను ఇంకా ఎక్కువగా ద్వేషింపనారంభించారు. క్రైస్తవులను రోమా సామ్రాజ్య శత్రువులనుగాను రాజ్యమునకు ప్రమాదము కలుగజేయు వారిగాను వారు భావించిరి! వారి దేవుళ్ళను క్రైస్తవులు మొక్కుటకు నిరాకరించి వారి దేవుళ్ళను ఉగ్రులనుచేశారు అందుకే కరువు కాటకాలు భూకంపములు వచ్చుచున్నవని వెంటనే క్రైస్తవులను నిందించేవారు! అతి త్వరలో ఈ ద్వేషము హింసగా చెలరేగనైయున్నది!

5. హింస

భూమి మీద క్రీస్తు యొక్క సంఘము దాడికి గురై పోరు సలిపెను. సాతానుడు సంఘమునకు గొప్ప శత్రువు. అతడు క్రీస్తును మరియు ఆయన ప్రజలను ద్వేషించును. క్రీస్తు యొక్క సంఘమును పాడుచేయుటయే వాని ఉద్దేశము. ప్రభువైన యేసు భూమ్మీద ఉన్నప్పుడు కూడా ఇదే పరిస్థితి నెలకొని యుండేది. ఈ పోరాటమందు సాతానుడు వివిధ ఆయుధములను ఉపయోగించును. అనేక ఆయుధములలో ఒక ఆయుధము హింస.

త్వరలో హింస చెలరేగెను. మనము మూడవ అధ్యాయములో చూచినట్లు అపొస్తలుల దినములలోనే హింస కలిగెను. క్రైస్తవులను హింసించులాగున సాతానుడిచే నీరో చక్రవర్తి వాడబడెను. తన సొంత తల్లి, భార్య మరియు తమ్ముని హతమార్చుటకు వెనుకాడని ఓ క్రూర మృగము నీరో! ఒక దినాన రోమ్‌లో మంటలు చెలరేగెను. ఘోర అగ్నిమంటలు నగరములో పెద్ద భాగమును నాశనము చేసెను. వేల ప్రజలు నశించిరి. ఒక ఉద్దేశముతోనే మంటలు ప్రారంభమయ్యాయని వెంటనే ప్రజలు చెప్పసాగారు.

రోమా ప్రజలు చక్రవర్తిని నిందించారు! ఆ మంటలు చెలరేగుతుంటే అతడు తన భవనపు కప్పు మీద నిల్చొని అమితానందముతో వీక్షించలేదా...? చక్రవర్తి వాస్తవానికి నగరమును తిరిగి కట్టెను, అయినను.... అనుమానము మిగిలెను. క్రైస్తవులను నిందించుట ద్వారా నీరో ఈ అనుమానమును తప్పించుకొనెను. నిప్పును (మంటను) ప్రారంభించుటలో క్రైస్తవులే దోషులని రోమా ప్రజలు నమ్మేలా చేయాలి! నిర్ఘాంతపరచే హింస చెలరేగెను. వేలకొలది క్రైస్తవులు వధింపబడ్డారు. అనేకులు మైదానములలో క్రూరమృగములకు ఎరగా వేయబడ్డారు. ఇతరులు తారుతో పూయబడి కొయ్యమ్రానుపై వ్రేలాడదీయబడినారు. రాత్రివేళ నిప్పంటించినప్పుడు, కాలుతున్న ఆ వ్యక్తులు జ్వాలలవలె తోటలను వెలుగుమయము చేసెడివారు. చక్రవర్తి మరియు మంత్రులు ఎంతో ఆనందముతో ఉరకలేస్తూ జరుగుచున్న కార్యక్రమములను తిలకించేవారు. బహుశ అపొస్తలులైన పేతురును మరియు పౌలును నీరో వధించియుండవచ్చును.

నీరో మరణించెను కాని క్రైస్తవుల పట్ల ద్వేషము కొనసాగెను! రోమా సామ్రాజ్యమునకు క్రైస్తవులు ప్రమాదకరము. వారిని నిర్మూలము చేయాలి! తరువాత వచ్చిన చక్రవర్తి డోమీషియన్ తనను దేవునిగా మ్రొక్కమని ఆజ్ఞనిచ్చెను. దానినెవరైతే ధిక్కరిస్తారో వారు చావవలెను. చాలా మంది క్రైస్తవులు చక్రవర్తిని ఆరాధించుటకు నిరాకరించిరి తత్ఫలితముగా వారు చంపబడిరి.


నీరో అనుసరించిన విధానమునే డోమీషియన్ అనుసరించెను: 'రోమా సామ్రాజ్యము క్రైస్తవులనుండి ప్రక్షాళనం చేయబడాలి'.

వాస్తవానికి సాతానుడు గర్జించు సింహమువలె తిరుగాడుచున్నాడు... కాని అపొస్తలులు చనిపోయినా ప్రభువు సంఘములను నడిపే నాయకులను ఇంకనూ లేవనెత్తుచున్నాడు, ఘోరహింస సమయాలలో కూడాను.

వీరు సంఘములలో తండ్రులవలె ఉన్న కారణము చేత వారు బిషప్‌లుగా పిలువబడ్డారు. ప్రముఖులైన బిషప్‌లు: ఇగ్నేషియస్, ఈయన అంతియొకయలోని పెద్ద సంఘమునకు బిషప్, మరియు పాలికార్ప్, స్ముర్ణయొక్క బిషప్.

ఇప్పుడు మనము ఈ ఇద్దరు బిషప్‌ల గురించి కొంత నేర్చుకోనైయున్నాము. మొదటిగా, ఇగ్నేషియస్, ట్రేజన్ చక్రవర్తి, పాక్షికముగా భూకంపముచే నాశనమైన అంతియొకయను దర్శించెను. దానికి క్రైస్తవులు నిందింపబడ్డారు! అతి ప్రముఖుడైన క్రైస్తవుడు బిషప్ ఇగ్నేషియస్ బంధింపబడ్డాడు. చంపబడుటకై ఆయన రోమ్ వెళ్ళవలసి వచ్చెను. ఆయన మైదానములో క్రూరమృగములయెదుట వేయబడెను.

ఇగ్నేషియస్ సైనికులతో పాటు రోమ్ సమీపిస్తుండగా, కొంతమంది సంఘ సభ్యులు ఆయనను కలిసికొనుటకై వచ్చిరి. వారు ఏడ్చిరి. ప్రభువునకు ఇంత నమ్మకమైన దాసుడు ఇంతఘోర మరణమును



భరింపవలసి వచ్చెను! ఇగ్నేషియస్ తన తోటి విశ్వాసులను ప్రోత్సహించెను. "నేను గోధుమ గింజను నేను ఈ క్రూరమృగముల కొరలచే చీల్చబడాలి తద్వారా నేను క్రీస్తునకు స్వచ్ఛమైన అప్పమునగుదును" అని ఆయన చెప్పెను. ఆయన మరుసటి దినము ఉదయముననే మైదానమునకు తీసుకుపోబడెను. రక్తదాహముగల సింహములు బిషప్‌ను దాడి చేయుచుండగా వేలకొలది ప్రేక్షకులు సంతోషముతో తిలకించిరి.

వెంటనే ఆయన ఆత్మ ఆయన నమ్మకముగా సేవించిన రాజు నొద్దకు వెళ్ళెను.

అధిక ఫలములు ఫలించులాగున దేవుని గోధుమ గింజ నలుగగొట్టబడినది.

6. పాలికార్ప్ (క్రీ.శ. 69-156)

యాభై సంవత్సరముల తరువాత మళ్ళీ హింస చెలరేగెను, ఈసారి అరేలియస్ చక్రవర్తి పరిపాలనలో స్ముర్ణలో కూడా వారి విశ్వాసము నిమిత్తమై కొందరు హతసాక్షులయ్యారు. తన మరణము ద్వారా సాక్ష్యమిచ్చువాడు హతసాక్షి. యేసు వారి రాజని, ఆయనే వారు ఆరాధించు ఏకైక వ్యక్తియని హతసాక్షులు సాక్ష్యమిత్తురు. వారి ఒప్పుకోలు వారి ప్రాణమును బలిగొనెను.

రాజుయెదుట హాజరుకావలెనని పాలికార్ప్‌కు ఆజ్ఞయాయెను. వయోవృద్ధుడైన బిషప్ ఇప్పుడు 86 సం॥ల వయసుగలవాడై ప్రేమపూర్వకంగా నమ్మకముగా సేవచేసి స్ముర్ణలోని సంఘమును యావత్ జీవితము నడిపెను. పారిపొమ్మని ఆయన మిత్రులు బ్రతిమాలారు. పాలికార్ప్ వారి సలహా తీసుకుని పట్టణమునకు వెలుపల ఉన్న గ్రామీణ గృహమందు ఆశ్రయము తీసికొనెను. ఏది ఏమైనా, ఓ సేవకుడు పాలికార్ప్‌ను మోసగించి అతడు ఉన్న స్థలమును సైనికులకు తెలిపెను. వారు ఆ భవనమును ఆవరించగా పాలికార్ప్ ఇంటిమీద ప్రార్థించుచుండెను. అతడు తప్పించుకుని పోయియుండ వచ్చునుగాని అలా మళ్ళీ చేయలేదు. దానికి బదులుగా "ప్రభువు చిత్తము జరుగునుగాక" అని పలికెను.

పాలికార్ప్ ఇంటి మీదనుండి దిగి వచ్చి, మొదట సైనికులు కాస్త ఏదైనా తినేలా మరియు త్రాగేలా చూచుకొనెను. వారతనిని తీసుకొని పోకమునుపు మొదట మరొక గదిలో ప్రార్థించుకొనుటకు సమయమిమ్మని వారినడిగెను. వారతని మనవి దయచేసిరి. తన ముందున్న శ్రమలను భరింప శక్తినిమ్మని తన రక్షకునికి భారముతో వేడుకొనెను. కాని అన్నిటికంటే ముఖ్యముగా తాను ఎంతో ప్రియముగా ప్రేమించిన హింసింపబడే సంఘము నిమిత్తమై ప్రార్థించెను. కఠినులైన సైనికులు తలనెరసిన బిషప్ ప్రార్థన చూస్తూ అతని ప్రశాంతతను గమనించి వారు ఎంతో కదల్చబడ్డారు. వారు పాలికార్ప్ కొరకు ఒక గాడిదకు గంతలు కట్టి పట్టణములోనికి స్వారీ చేయించారు.

కొద్ది సమయము తరువాత గవర్నరు మరియు మెజిస్ట్రేట్ ఎదుట పాలికార్ప్ నిలువబడెను. మొదట గవర్నర్ స్నేహపూర్వకముగా మెలిగెను. తన రక్షకుని ఎరుగనని బొంకమని గవర్నర్ పాలికార్ప్‌ను ప్రోద్బలము చేసెను. కాని పాలికార్ప్ మొండిగానుండెను!

అప్పుడు గవర్నరు "నాస్తికులు నిషేధింపబడుదురు గాక" అని బిగ్గరగా అరవమని చెప్పెను. పాలికార్ప్ నవ్వి ప్రజా సమూహము వైపు చూస్తూ "నాస్తికులు నిషేధింపబడుదురు గాక!" గవర్నర్‌కు అర్థము కాలేదు. పాలికార్ప్ లొంగిపోతాడని అతడు అనుకున్నాడు. "నీ క్రీస్తును దూషించు అప్పుడు నీవు విడిపింపబడుదువు" అని గవర్నర్ అనెను. దాని తదుపరి గొప్ప మరణకరపు మౌనము ఏర్పడెను. నిర్ణయాత్మకపు క్షణము వచ్చెను. ఈ ముసలివాడు ఏమి చెప్పనైయున్నాడు? వినండి! "ఎనభై ఆరు సంవత్సరములు నా రక్షకుని నేను సేవించాను. ఆయన నాకెన్నడునూ ఏ కీడు చేయలేదు. నన్ను రక్షించిన నా రాజును నేనెలా శపింతును?" అని స్పష్టముగా గొప్ప స్వరముతో పాలికార్ప్ చెప్పెను.

మరొక్కమారు గవర్నరు పాలికార్ప్‌ను రక్షింప ప్రయత్నించెను. క్రూరమృగములను గూర్చి కొయ్యమ్రానుపై కాల్చబడుటను గూర్చి చెప్పి ఆయన పాలికార్ప్‌ను భయపెట్టెను. గవర్నర్‌కు పాలికార్ప్ ఇలా బదులిచ్చెను. "కాసేపు కాల్చే మంటను గూర్చి నీవు నన్ను భయపెట్టుచున్నావు. దుష్టులకై భద్రపరచబడిన నిత్యము కాలే అగ్ని ఉన్నదని నీకు తెలియదా?"

"కుదురదు". తన విశ్వాసమును విసర్జించు లాగున పాలికార్ప్‌ను పోద్బలము చేయలేము. ఇప్పుడు ప్రజలు ఉగ్రులై "అతనిని కొయ్యమ్రానుపై కాల్చుడి" అని అరిచారు. ఆజ్ఞ జారీ చేయబడినది అంతా సిద్ధము చేయబడినది. బిషప్‌ను కొయ్యమ్రాను దగ్గరకు తెచ్చారు. "ఆగండి" నన్ను కొయ్యమ్రానుకు బంధించి నన్ను కట్టనవసరములేదు. మంటలో మధ్యన నిలుచుటకు నాకు క్రీస్తు బలమునిచ్చును" అని అతడు చెప్పెను.

చివరిసారి పాలికార్ప్ దేవునికి మొఱపెట్టెను. "సర్వశక్తిమంతుడవైన ప్రభువా, నీ దివ్యకుమారుడైన యేసుక్రీస్తుని తండ్రీ ఆయన ద్వారా మేము నిన్నెరుగుదుము నీ అభిషిక్తుని శ్రమల పాత్రలో పాల్గొనుటకు నీ సాక్షులలో నుండుటకు నన్ను యోగ్యునిగా ఎంచినందుకు నేను నిన్ను

స్తుతించుచున్నాను. నిత్యత్వము వరకు నీకే మహిమ కలుగును గాక! ఆమేన్!"

నిప్పంటింపబడినది. అప్పుడు (తరువాత క్రైస్తవులు ఒకరితోనొకరు చెప్పుకొనిరి) ఒక అద్భుతము జరిగెను. మంటలు పైకి లేచెను కాని మిణుకు మిణుకు మన్నట్లుగా ఉండెను. మంటలు అతని దేహము చుట్టూ ఒక వలయమువలె ఏర్పడి తలవరకు చేరెను. అక్కడ అగ్ని జ్వాలలు కిరీటముగా ఏర్పడెను.

పాలికార్ప్ శత్రువులు విసిగిపోయారు. మంటలు అతనిని హతమార్చకపోతే, అతడు ఖడ్గముద్వారా మరణించాలి. ఓ పదునైన కత్తి అతని గుండెలో దూరగా పాలికార్ప్ మరణించెను. మంటలు అతని దేహమును దహించివేసెను. తోటి విశ్వాసులు అతని ఎముకలు తీసికుని పూడ్చిపెట్టిరి.

ప్రకటన గ్రంథములో స్ముర్న సంఘమునకు వ్రాయబడిన పత్రికలో "మరణము వరకు నమ్మకముగా నుండుము మరియు నేను నీకు జీవకిరీటమునిచ్చెదను" అని చదివెదము. ఈ మాటలు పాలికార్ప్‌కు కూడా వర్తించును.



7. జస్టిన్ మార్టర్ (క్రీ.శ. 114-165)

ఒక్కడే ఒంటరిగా అతడు సముద్రతీరమున నడుచుచున్నాడు. కొన్నిసార్లు అతడు ఆగి సముద్రము అవతల ఏదో సుదూరముగా చూచుచున్నాడు. ఆయన కలవరపడినట్టుగా అగుపించుచున్నాడు. మళ్ళీ, సుదీర్ఘ ముగా ఆలోచిస్తూ, మళ్ళీ నడిచాడు.

ఈ వ్యక్తి ఎవరు? ఆయన ఇక్కడ ఏమి చేయుచున్నాడు ? జస్టిన్ యౌవనస్తుడు, ఇరవైఐదు ఏండ్ల వయస్సు గలిగిన గ్రీకు వ్యక్తి. ఆయన తరచుగా ఒంటరిగా నుండుటకు ఇష్టపడేవాడు. ఆయన హృదయములో ఏదో అసౌఖ్యముండేది. అందుకే ఇంకెవరునూ కలిసే అవకాశములేని సముద్ర తీరమున ఆయన ఉన్నట్లు చూచెదము. జస్టిన్ పాలస్తీనాలో జన్మించెను. ఆయన యౌవనములో ఉన్నప్పుడే, ఆయనకు విచారణ చేయు మనసు ఉన్నదని ఆయన తల్లిదండ్రులు గమనించిరి. గనుక చిరుప్రాయము నుండే, ప్రముఖులైన ఉపాధ్యాయులు ఉండు పాఠశాలకు వెళ్ళుటకు అనుమతింపబడెను.

ఈ ఉపాధ్యాయులు అన్య తాత్వికులు లేదా యోచకులు మరియు వారు జస్టిన్‌కు వేర్వేరు రకముల సబ్జక్ట్స్ లేదా అధ్యయన అంశములను నేర్పిరి. ఆయనకు ఖగోళశాస్త్రము నేర్పబడెను. గ్రీకులు వారి నేర్పు మరియు తెలివి విషయములలో ప్రసిద్ధులు.

మరియు జస్టిన్ నేర్పరియైన తాత్వికుడాయెను. అయిననూ.. గ్రీక్ నేర్చుకున్ననూ ఆయన సంతోషముగా లేడు. ఆయన నిజ సంతోషము కొరకు, సమాధాన హృదయము కొరకు ఎదురు చూచుచున్నాడు కాని ఆయన దానినింకనూ కనుగొనలేదు. ఆయన ఒంటరిగానున్నప్పుడు వీటన్నిటిని గూర్చి తలంచుచుండెను.

ఆహా చూడండి! ఆ తీరమందు మరొకరెవరో కూడా నడచుచున్నారు. ఒక వృద్ధ వ్యక్తి ఆయనవైపు నడుచుచున్నాడు. ఆయన దగ్గరకు వచ్చాక, జస్టిన్ ఆయనను నీవిక్కడ తీరమందు ఏమి చేయుచున్నావని అడిగెను.

"దూర ప్రాంతమునుండి వచ్చు నా బంధువుల కొరకు నేను ఎదురుచూచుచున్నానని" ఆ వృద్ధ వ్యక్తి బదులిచ్చెను. ఆ వృద్ధ వ్యక్తి నీ వికక్కడికి ఎందుకు వచ్చావని జస్టిన్‌ను అడిగెను. "నేను దేవునితో సహవాసము మరియు నిజసంతోషము కొరకు అన్వేషించుచున్నానని జస్టిన్ చెప్పెను. ఎంతో దయతో ఆ వృద్ధ వ్యక్తి ఆయనను చూచెను. ఆయన జస్టిన్‌ను అర్థము చేసికొనెను. ఆయన జస్టిన్ తృష్ణను అర్థము చేసికొనెను. ఆయనకూడా అన్యుల గ్రీకు తెలివి నిజసంతోషము నిచ్చునని ఒకప్పుడు భావించెను. కాని అక్కడ ఆయన దానిని కనుగొనలేదు.


వినండి! జస్టిన్ అన్వేషించునది ఎక్కడ కనుగొనగలడో ఆ వృద్ధ వ్యక్తి చెప్పనైయున్నాడు. ఆయన దేవుని వాక్యమును గూర్చి, సృష్టి మరియు మానవుడు పాపములో పడుటను గూర్చి, దేవుని దయగల వాగ్దానమును గూర్చి తానే నిజ తెలివియైన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి జస్టిన్‌కు చెప్పెను...! తన హృదయములో నిజ సంతోషము మరియు నిజ ఆనందమునకు మార్గమును వృద్ధ క్రైస్తవుడు జస్టిన్‌కు చూపించెను. సత్యం కొరకు అన్వేషించు యౌవన తాత్వికుడు మరియు వృద్ధ క్రైస్తవుడు ఒకరికొకరు వీడ్కోలు పలికి వెళ్ళిరి.

జస్టిన్‌కు అది మరపురాని సంభాషణ. ఆయన వెంటనే క్రైస్తవుల గ్రంథమైన బైబిల్‌ను పరీక్షించటం ప్రారంభించెను. క్రైస్తవ్యమును గూర్చి బోధించు అనేక క్రైస్తవులతో పరిచయమేర్పరచుకొనెను. తత్ఫలితముగా దేవుని వాక్యమందు నిజ తెలివిని సమాధానమును కనుగొనెను మరియు యేసునందు రక్షణను కూడా కనుగొనెను. జస్టిన్ క్రైస్తవుడై ఎఫెసులో బాప్తిస్మము తీసికొనెను.

ఇప్పటినుండి జస్టిన్ కూడ తన యజమానుని మరియు ప్రభువును సేవింపదలచాడు. క్రైస్తవ సంఘములలో బోధించుటకు చాలా దూర ప్రయాణములు చేసెడివాడు. ఆయన ఎక్కడికెళ్ళినా అన్య తత్వశాస్త్రమును పెల్లగించి క్రైస్తవ విశ్వాసమును సమర్థించెను, ఆయనే

స్వయాన నేర్పరియైన తాత్వికుడు గనుక సమర్థవంతముగా దానిని చేసెడి వాడు. ఆయన హేతు శక్తి గొప్పది గనుక అన్య పండితులు ఆయనకు సాటి రారు! ఖచ్చితముగా దీనినిమిత్తమై వారాయనను ద్వేషింపనారంభించిరి.

క్రైస్తవ విశ్వాసమును ఎత్తిపడుతూ ఆయన గ్రంథములను కూడా వ్రాసెను. దైవసంబంధ సమర్థవాదులలో జస్టిన్ ప్రథముడు సమర్థవాది అంటే సత్యమును ఎత్తిపట్టువాడు. దీనిని గూర్చి మనము పదవ అధ్యాయములో ఎక్కువగా చదివెదము. తన శత్రువుల తీవ్ర ద్వేష కారణాన జస్టిన్ చెఱలో వేయబడెను. వెంటనే ఆయన చంపబడాలని శాసనము జారీ చేయబడెను. ఆయనను కొరడాలతో కొట్టాక, శిరచ్ఛేదనము చేసిరి. ఏది ఏమైనా విత్తబడిన విత్తనము ఫలములు దాల్చెను. క్రైస్తవ్యము కొనసాగి వ్యాపించెను!



8. బ్లాండీన మరియు పాంటికస్

బ్లాండీన అనే యౌవన బానిస బాలిక అప్పుడే క్రైస్తవ సంఘములో చేరెను. ఆమె యజమానురాలు క్రైస్తవురాలు గనుక ఆవిడ బ్లాండీన మరియు ఇతర బానిసలకు ప్రభువైన యేసును గూర్చి నేర్పించెను. బ్లాండీన మరియు ఆమె తోడి బానిసలను మార్చులాగున దేవుడు ఆవిడ మాటలను వాడుకొనెను. క్రీ.శ. 177లో బ్లాండీనా మరియు తన యజమానురాలు ఇరువురును చెఱసాలలో వేయబడిరి. లయాన్స్‌లోని క్రైస్తవులు మానవ మాంసము తింటున్నారని ఒప్పుకొమ్మని బ్లాండీనాను బంధించినవారు కోరారు!

కాని ఆమె ఆ నేరారోపణను తిరస్కరించెను. అప్పుడు వారు ఒప్పుకొమ్మని ఆమెను ఒత్తిడి చేశారు. ఎంతో తీవ్రముగా ఆమె చిత్రహింసలు పెట్టబడినది. కాని ఇంకనూ ఆమెను బాధించువారితో "నేను క్రైస్తవురాలను మరియు మేము కూడినప్పుడు మేము ఏ తప్పిదములు చేయము" అని చెప్పెను. ఆమె ఇంకనూ ఒప్పుకొన నిరాకరించెను గనుక ఆమె చావవలసి వచ్చెను. ఆమెను క్రూరమృగములకు ఆహారముగా వేయుటకై ఓ పెద్ద మైదానమునకు తీసికొనిపోబడెను. అందులో వేలకొలది ప్రేక్షకులు కూర్చున్నారు.

బ్లాండీనా ఒక్కతే కాదు. క్రూరమృగములకు ఆహారముగా వేయబడుటకై ఇతర క్రైస్తవులు కూడా ఉన్నారు. దీనిని జన సమూహము చూడాలని ఎదురు చూస్తున్నారు.

ఆ మైదానము మధ్యన కొయ్యచ్రమును ఉంచబడినది. నేలమీద ఆమె కాళ్ళు వ్రేలాడునట్లుగా బ్లాండీనా దానికి వ్రేలాడదీయబడెను.

ఇలా ఎందుకు చేయబడెను? ఒకేమారు సింహాలు ఆమెను చంపలేవు. ఆమె శ్రమలను మరింత పొడిగిస్తూ అవి ఎగిరి ఆవిడను దాడి చేస్తుంటాయి. ఎంత ఘోర బాధ! జంతువులు విడుదల చేయబడినవి! బిగ్గరగా గర్జిస్తూ క్రైస్తవులను దాడి చేసి ముక్కలుగా చీల్చివేసెను. కాని... విచిత్రముగా అవి బ్లాండీనను దాటి వెళ్ళెను.

ఆమె ప్రార్థిస్తూ పరలోకము వైపు కన్నులెత్తి కొయ్యపై వ్రేలాడుచుండెను, ఏ క్షణములోనైన అవి ఆమెను దాడి చేయవచ్చునని ఊహించెను. కాని ఏమి కాలేదు. కాసేపటి తరువాత ఆశ్చర్యముతో ఆమె చుట్టూ చూసెను. సింహములు తిరిగి వాటి బోనులలో పెట్టబడ్డాయి. అవి ఆమెను ముట్టను కూడా ముట్టలేదు. ఆ చుట్టూరా కూర్చున్న ప్రేక్షకులు ఆశ్చర్యముతో కేకలు వేసిరి. భూమి మీద ఇలా సంభవించుట సాధ్యమా...!

బ్లాండీనా విడుదల చేయబడుతుందా? కాదు ఆమె తిరిగి చెఱసాలకు పంపబడెను. తరువాత వారి దుష్ట ప్రణాళిక ఫలించెను. మరొకసారి మైదానములో సీట్లన్ని నిండాయి. తక్కిన బందీలు మరణించనైయున్నారు. అందరికంటే ఆఖరున బ్లాండీనను ఓ పదిహేనేండ్ల అబ్బాయితో పాటు తీసికొని రాబడును. ఆయన పేరు పాంటికస్. అతనిని బంధించినవారు ఏమి చేసిననూ పాంటికస్ కూడా తన రక్షకుని విసర్జించలేదు. గనుక అతడు కూడా చంపబడాలి.

తక్కిన బందీలందరు చంపబడ్డాక పాంటికస్ వంతుకూడా వచ్చెను. అతన్ని బంధించిన అన్యులు ఇంకనూ అతన్ని రక్షించే ప్రయత్నం చేసారు. కేవలము పదిహేను సంవత్సరాల అబ్బాయి అట్టి ఘోర మరణము నొందుట విచారకరము.


ఒక్కసారి అతడు తన రక్షకుని ఎరుగనని బొంకితే, విడుదల చేయబడును. కాని పాంటికస్ పట్టు విడువలేదు! తన ప్రభువును మరియు రాజును తిరస్కరించుటకు నిరాకరించెను గనుక మైదానమునకు వెళ్ళవలసి వచ్చెను. చివరిసారిగా అతడు బ్లాండీనవైపు చూసెను. ఆమె తన వేలు ఆకాశమువైపు చూపెను. పాంటికస్ చిరునవ్వు నవ్వెను. సందేశమును గ్రహించెను.

ఆ శ్రమలో ప్రభువు తనను బలపరచును మరియు తాను త్వరలో పరలోకమందలి తన రక్షకుని చేరును. శత్రువులు తన ఆత్మనెన్నటికినీ చంపజాలరు.

ధైర్యముతో అతడు మైదానము చేరుకొనెను.

మృగములను విడిచారు త్వరలోనే తన భూసంబంధ జీవితము సమాప్తియాయెను. చివరిగా బ్లాండీనాను చంపవలసియున్నది. ఆమెను కొయ్యకు వ్రేలాడదీయరు. ఆమె శత్రువులకు మరొక ఆలోచన వచ్చెను. ఆమెను ఒక వలలో వేసి ఒక ఎద్దును మైదానములో వదిలారు. క్రూరముగా ఆ జంతువు ఆమెను దాడి చేసినను ఆ ఘోర గాయములకు అతీతముగా ఆమె ఇంకను బ్రతికేయున్నది.

ఈ సమయములో సైనికుడు మైదానము చేరి తన ఖడ్గముతో బ్లాండీనాను చంపెను. ఆమెకూడ తన శ్రమలనుండి విడిపింపబడెను. ఆమె విడనాడని రాజుతో ఆమె కూడా చిరకాలముండును.



9. పర్‌పెచ్‌వా మరియు ఫెలిసిటాస్

అది క్రీ.శ 203వ సంవత్సరము. పర్‌పెచ్‌వా ఉత్తర ఆఫ్రికాలోని కార్తేజ్‌లో నివసించేది. ఆమె ధనికురాలు మరియు విశిష్ట స్త్రీ. ఆవిడ భర్త క్రైస్తవుడు కాదు. వారికి పెళ్ళైన కొద్దికాలమునకే అతడు ఆమెను విడిచి వెళ్ళెను. పర్‌పెచ్‌వా మరియు తన పనికత్తె ఫెలిసిటాస్ చెఱసాలలో వేయబడినప్పుడు, వయస్సు ఇరవైరెండు సంవత్సరములు. పర్‌పెచ్‌వా కాటక్యూమెన్స్ గుంపులో సభ్యురాలు.

కాటక్యుమెన్స్ అంటే వీరు క్రైస్తవ్యమును గూర్చి నేర్చుకుని అటు పిమ్మట క్రైస్తవ సంఘములో చేరే యౌవనస్థులు. కాని యౌవనస్థులు క్రైస్తవ్యమును గూర్చి నేర్చుకొనకుండా చక్రవర్తి నిషేధించెను. అది వరకే సంఘ సభ్యులుగానున్నవారు అలాగే ఉండవచ్చును కాని క్రొత్త సభ్యులు సంఘములో చేరుటకు అనుమతింపబడరు.

పర్‌పెచ్‌వాకు అతి కష్టమైన సంగతి ఏదనగా చెఱసాలలో తనకున్న చిన్ని శిశువును ఉంచుకొనుటకు అనుమతినివ్వలేదు, ఆమె శిశువుకు తల్లి సంరక్షణ తప్పక కావాలి. ఓ సందర్శకుడు పర్‌పెచ్‌వాను దర్శించుటకు వచ్చెను. ఆయన ఆవిడ పెదనాయన. ఆయన ఆవిడకు పరిస్థితులను మరింత కఠినము చేసెను. తన విశ్వాసము విడనాడి ఇంటికి వచ్చి తన బిడ్డను చూసుకొమ్మని ఆయన ఆమెను బ్రతిమాలాడెను. కాని ఆమె తన మనసు మార్చుకొన నిరాకరించెను.

ఆవిడ తండ్రి చాలా ఉగ్రుడై ఆమెను కొట్టెను! మరియు ఆమె శ్రమలు అధికమాయెను. కొద్దిదినముల పిదప ఆమె మరొక చెఱసాలకు తీసికొనిపోబడెను. అది ఎంతో కటిక చీకటితోనూ ఇరుకు గదిలో ఉంచబడెను. ఒక దినాన తలుపు తెరవబడెను, ఎక్కువ వెలుతురు మరియు తాజా గాలి వచ్చే మరొక గదికి ఆమెను తరలించిరి. పర్‌పెచ్‌వా అకస్మాత్తుగా తన తల్లిని చూచెను.. ఆవిడ కూడా క్రైస్తవురాలే... తన తల్లి శిశువును ఎత్తికొనియున్నది! ఇప్పుడు తన శిశువును తనతో పాటు చెఱలో ఉంచుకుని చూచుకొనుటకు అనుమతింపబడెను.

అందరూ చూచే విధముగా క్రైస్తవులందరిని సంతవీధిలో నిలువబెట్టేవారు. వారు ప్రొకన్సల్ (మెజిస్ట్రేట్) చే ప్రశ్నింపబడుదురు. ఈ వార్త పర్‌పెచ్‌వా తండ్రి విన్నపుడు త్వరగా చెఱసాల చేరుకొనెను. తన విశ్వాసమును విడనాడమని తన తండ్రి మరొక సారి ఆమెను బ్రతిమాలాడెను. నెరసిన తన వెంట్రుకలను చూపించెను. తన ప్రశస్త శిశువును కూడా చూపెను. కాని మళ్ళీ తన తండ్రి ప్రయత్నాలు విఫలమాయెను. ఆమె విశ్వాసమును విడనాడ నిరాకరించెను.


సంత వీధిలో పర్‌పెచ్‌వాను కూడా ప్రశ్నించే సమయము వచ్చెను, తన తండ్రి తన చేతులలో శిశువును పట్టుకుని ముందుకు వచ్చి "నీ బిడ్డపై కనికరము చూపు" అని బిగ్గరగా అరచెను. పర్‌పెచ్‌వా తన బిడ్డను ఎంతో ప్రియముగా ప్రేమించినా అన్నిటికంటే తన ప్రభువు మరియు రాజు పట్ల అత్యధిక ప్రేమ కనబరచెను! ప్రొకన్సల్ ఇలా చెప్పెను. "నీ చక్రవర్తికి బలులర్పించాలి మరియు ఆయనే నీ ప్రభువు, యజమానుడని ఒప్పుకోవాలి, అప్పుడే నీవు విడుదల చేయబడుదువు" కాని యేసే తన ప్రభువు మరియు యజమానుడని చెప్పెను.

అప్పుడు తీర్పు విధింపబడెను. "సింహములకు" ప్రజా సమూహము కేరింతలు కొట్టెను. చెఱలో కొన్ని దినములున్న పిదప, పర్‌పెచ్‌వా చంపబడుటకు సమయము వచ్చెను. అది చక్రవర్తి జన్మదినము. ఆమె మరణదినము ఉదయించెను. యౌవనస్థులు ముందు మార్గమున వెళ్ళగా యౌవన స్త్రీలు వారి వెనుక వెళ్ళిరి. వారందరునూ కాటక్యూమెన్స్ పర్‌పెచ్‌వా మరియు ఫెలిసిటాస్ పేరొందిన స్త్రీ మరియు తన పనిగత్తె అక్కచెల్లెండ్లవలె ప్రక్క ప్రక్కన నడిచిరి. వారిరువురు ఒకేసారి మైదానములో ప్రవేశించాలి.

రోషముతో ఉన్న ఎద్దును వదిలిపెట్టిరి... మొదటి దాడిలో పర్‌పెచ్‌వా నేలకొరిగెను. ఫెలిసిటాస్, ఎద్దుచే అటూ ఇటూ ఈడ్వబడి చాలా గాయపరచబడెను. పర్‌పెచ్‌వా వెళ్ళి తన పనిగత్తెను లేవనెత్తెను ఒకరినొకరు తమ తమ చేతులతో అలుముకుని మరొక దాడికి

ఎదురుచూచిరి. అయితే ఈ ఇద్దరు యౌవన స్త్రీలను మైదానమునుండి తీసివేయాలని ప్రేక్షకులు కోరిరి. మొదట యౌవనస్థులను తీసుకురమ్మని అరచిరి. ఆ యౌవనస్థులు మైదానమందు ప్రవేశించగానే ఆకలిగొన్న ఎలుగుబంట్లు మరియు సింహములు దూసుకుని వచ్చి వారిని దాడి చేసి ఘోరకార్యమును ముగించెను.

అప్పుడు రెండవ మారు ఈ యౌవనస్త్రీల వంతు వచ్చెను. వారు వలలో చుట్టబడ్డారు. మళ్ళీ ఎద్దును విడిచిపెట్టిరి. ఓ సైనికుడు వచ్చి వారిని వారి శ్రమ నుండి వెంటనే విడిపించెను. ఒక కత్తి దెబ్బతో ఆ పని ఆయెను. మరొకసారి, హతసాక్షులు వారి రక్షకుని ఘనపరచిరి. వారి ప్రభువు మరియు యజమానుడు ఆయనే కాని, చక్రవర్తి కాడని ఒప్పుకొనిరి.




10. దైవ సంబంధ సమర్థవాదకుడైన టర్టూలియన్ (క్రీ.శ 160-230)

అన్య తాత్వికులు క్రైస్తవ విశ్వాసమును సవాలు చేసినపుడు క్రైస్తవ సమర్థవాదులు క్రైస్తవ సత్యమును విశ్వాసమును సమర్థింతురు. అటువంటి క్రైస్తవులు సమర్థులైన సమర్థవాదులు ఎందుకంటే వారు గ్రీకు తాత్వికుల క్రింద అధ్యయనం చేశారు. అందుకే వారు పలుకబడిన లేదా లిఖిత వాక్యమునుపయోగించి దాడిచేయువారి బారి నుండి క్రైస్తవ్యమును కాపాడుదురు. సమర్థవాదులు సమర్థులైన మరియు నేర్పరులైన దేవశాస్త్రవాదులు. వారు వ్రాసే గ్రంథములను అపాలజీస్ అందురు.

ఏడవ అధ్యాయములో మనము ప్రస్తావించినట్లుగా జస్టిన్ ఓ సమర్థవాదకుడు. మరొక ప్రసిద్ధి గాంచిన సమర్థవాదకుడు టర్టూలియన్. మొదట టర్టూలియన్ రోమ్‌లో న్యాయవాదిగా పనిచేసెను. అటు పిమ్మట ఆయన ఆఫ్రికాలోని కార్తేజ్‌కు వచ్చెను. ఆయన మార్పు తరువాత అన్యతాత్వికులను ఎదిరిస్తూ క్రైస్తవ్యమును సమర్థిస్తూ ఆయన అనేక గ్రంథములు వ్రాసెను.

క్రైస్తవులు అన్యాయముగా బాధింపబడుతున్నారని టర్టూలియన్ నొక్కివక్కాణించి వ్రాసెను. వారు న్యాయస్థానము ఎదుట హాజరైనప్పుడు తమ్మును తాము సమర్థించుకొనుటకు కూడా అనుమతించబడలేదు. కేవలము వారు క్రైస్తవులైనందున వారు నేరస్థులని ఎంచబడ్డారు. అటువంటి పేరుతో పిలువబడుట ఘనత అని వారు త్రోసిపుచ్చరు. అన్యులు క్రైస్తవ్యమును ఎగతాళి చేయుటకు వారు చేయవలసినదంతా చేసెడివారు. సాతాను హస్తములో అపహాస్యముచేయుట అనునది ప్రభావవంతమైన ఆయుధము.

యేసు వేషధారియని, మంత్రశక్తుల ద్వారా సుంకరులను, చేపలు పట్టువారిని తన అనుచరులుగా నుండుటకు ఆకర్షించుకొనెనని వారందురు ! ఎంత దుష్టమైన అభియోగమది! కాని టర్టూలియన్ వాస్తవానికి ప్రభువైన యేసు ఎవరు, అప్పుడు కార్యములో ఏమి ఇమిడియుండెడిది ఇప్పుడు ఏమిటి అని వివరించెను. టర్టూలియన్ ప్రకారము, క్రైస్తవులు తరచుగా అన్యాయముగా నిందింపబడ్డారు. చిన్న పిల్లలను వారు వధించి వారి రక్తమును త్రాగుదురనునది పూర్తిగా అవాస్తవము. వారు చేయు తప్పుడు పనులేవి? వాస్తవానికి క్రైస్తవులు వారి సత్ ప్రవర్తన సన్మార్గము ద్వారా అన్య



ప్రపంచమునకు ఆశీర్వాదముగా నుండిరి. వారు విలాసవంతపు త్రాగుబోతు విందులకు హాజరుకారు లేదా గ్లాడియేటర్లు పోట్లాడి ఒకరినొకరు చంపుకునే మైదానములకు వెళ్ళెడి వారు కారు...

అన్యులు ఏదిఏమైన దుష్ట జీవితములు జీవించెడివారు. దోచుకొనుట, దొంగతనము చేయుట అవినీతి ప్రవర్తన ఇవన్నీయూ వారి సాధారణ అభ్యాసము (అలవాటు) అన్యయాజకులు కూడా అట్టి నేరములు చేసెడివారు. ఇట్టి కార్యకలాపములు రోమా సామ్రాజ్యమునకేమాత్రమును మంచివి కావని అన్యులు తమంతట తాము ఒప్పుకొనిరి! క్రైస్తవులు చక్రవర్తిని గౌరవించరనుట వాస్తవము కాదు. వారు అతనిని గౌరవించుటయేగాక, వారతనికి లోబడి, అతనికొరకు మరియు ప్రభుత్వము నిమిత్తమై ప్రార్థింతురు. చాలా మంది భావించినట్లు వారు రాజ్యమునకు ఏవిధముగాను, శత్రువులుకారు. ఏదిఏమైన... చక్రవర్తికి వారిపై ఏ హక్కును మరియు అట్టి అధికారం లేదు గనుక అతడు వారి దేవుడని మ్రొక్కుటకు నిరాకరించిరి.



గనుక టర్టూలియన్ తనతోటి క్రైస్తవులను సమర్థించుటకు వచ్చెను. ఆయన వారి గొప్ప ఉత్తరవాది. ఈ గొప్ప హింసలయొక్క ఫలితమేమి? టర్టూలియన్ మనకు జవాబిచ్చును "హతసాక్షుల రక్తము సంఘవిత్తనము." ఈ విధముగా క్రైస్తవులు ఎంత అధికముగా హింసింపబడుతుంటే అంత అధికముగా క్రైస్తవ విశ్వాసము ప్రబలమగును. కొన్నిసార్లు క్రైస్తవుల విశ్వాసము అంత బలముగా నుండుట చూచి తరచుగా అన్యులు కూడ విశ్వాసులుగా మారే వారు. ప్రత్యేకముగా క్రైస్తవులు ఎంతో ధైర్యముతో మరణము నెదుర్కుంటుంటే అది చూసి వారు ముగ్దులయ్యారు. క్రైస్తవులు అన్యులకు కూడా ఎన్నో మంచి పనులు చేయుట వారు చూసిరి.

ఖచ్చితముగా టర్టూలియన్ సాహసవంతమైన యోధుడు, ప్రభువు నామము నిమిత్తమై దానిని సమర్థించుటకై పోరాడినవాడు. ఇందుకే ఆయన సంఘపితామహుడుగా పిలువబడెను. క్రైస్తవ విశ్వాసమును సమర్థిస్తూ ఆయన వ్రాసిన గ్రంథములను అన్యులు చదివి చాలా మంది మార్పునొందిరి. ఈ గ్రంథములను అపాలజీస్ అందురు. ఈ విధముగా ప్రభువైన యేసు బలమైన దేవుడుగా అన్యలోకములో తనరాజ్య వ్యాప్తికై కొనసాగి పనిచేయుచున్నాడు.


దాని పురోగతిని హింసకాని, అపహాస్యముకాని, అభియోగములుకాని ఆపజాలవు.

11. మార్సియన్ మరియు కేనన్

సినోప్ అను నగరము నల్ల సముద్ర తీరమందున్నది. క్రీ.శ. రెండవ శతాబ్దములో మార్సియన్ అను ధనిక వ్యాపారి నివసించుచుండెను. అతడు ఓడల యజమాని. అతని ఓడలు అటు ఇటు ప్రయాణము చేసి అమ్మకము మరియు కొనుగోలు చేసెడివి. మార్సియన్ సినోప్‌లోని క్రైస్తవ సంఘమునకు చెందినవాడు అక్కడే అతని తండ్రి బిషప్‌గా నుండెను. ఏదిఏమైనా మార్సియన్ తన తండ్రి ప్రసంగములతో ఇకను ఏ మాత్రమును సమ్మతింపలేకపోయెను. సంఘములో ఇంకా స్పష్టమైన చక్కని క్రైస్తవ్యమును బోధించాలని మార్సియన్ తలంచెను.

పాతనిబంధన యూదుల బైబిలు కాని క్రైస్తవుల కొరకైన బైబిలు కాదని ఆయన చెప్పెను. పాతనిబంధన దేవుడు కేవలము క్రూరుడైయుండి ప్రజలను శిక్షింపదలచెను కాని క్రొత్త నిబంధన దేవుడు పూర్తిగా భిన్నముగా నుండును. మనకు ఆయన ప్రసంగములో అగుపించినట్లు ప్రేమదైవమైయున్నాడని యేసు చెప్పెను.

ఒకదినాన క్రీ.శ 138వ సంవత్సరములో మార్సియన్ సినోప్‌ను వదిలి రోమ్‌కు వెళ్ళెను. ఆయన అక్కడ ఉంటుండగా ఆ నగర క్రైస్తవ సంఘమునకు పెద్దమొత్తము డబ్బునిచ్చెను. ఆయన విరాళముతో



వారెంతో సంతోషపడిరి. మార్సియన్ అక్కడి సంఘములో చేరెను మరియు అక్కడ అతడు చాలా గౌరవింపబడెను. కొద్ది కాలము పిమ్మట అతనికి వింత భావనలున్నట్లు ప్రజలు గమనించిరి. సంఘపెద్దలు అతని ఉపదేశమును విన్నప్పుడు నిర్ఘాంతపోయిరి! దానిని ఆపివేయాలి! ఐదు సంవత్సరముల పిమ్మట, మార్సియన్ బహిష్కరించబడెను. అతనిని ఓ దుర్బోధకునివలె చూచిరి. అతని భావములు దుర్బోధలని లేక అబద్ధబోధలని తిరస్కరింపబడెను. అతడు సంఘం నుండి బహిష్కరింపబడెను.

కాని మార్సియన్ ఏమి చేసెను? అతడు సొంత బిషప్‌లు మరియు పెద్దలచే సంఘమును ప్రారంభించెను. అక్కడ ఉన్న సంఘములను కూడా తనతో కలవమని ప్రోద్బలము చేసెను.

అతని భావనలు వింతగా నుండి బైబిల్ ఆధారితమైనవి కావు. అతని ప్రకారము లోకము పాత నిబంధన దేవునిచే సృష్టింపబడెను. ఈ దేవుడు యూదుల దేవుడు కనికరములేని న్యాయాధిపతి.

క్రొత్త నిబంధనదేవుడు మనము యేసు బోధలలో మరియు పౌలు పత్రికలలో చూచే విధంగా ఎలాగైనా ప్రేమగలవాడు కృపచే రక్షణ నిచ్చుదేవుడు.

మార్సియన్ ఓ ప్రణాళిక కలిగియున్నాడు. సంఘమునకు ప్రాముఖ్యమైన దానిని చేయనైయున్నాడు. ఆయన కేనన్ సంకలనము చేసెను. దాని కర్థము గ్రంథములను కలిపి దేవుని వాక్యముగా ఏర్పరచుట.

ఏది ఏమైనా ఆ చిట్టా సరైనదికాదు. అందులో పాత నిబంధన ఇమడ్చలేదు. నాలుగు సువార్తలలో కేవలము లూకా సువార్త మాత్రమే ఆ చిట్టాలో చేర్చబడెను, కేవలము మార్సియన్ దానికి చేర్పులు కూర్పులు చేసెను.

అతడు ఈ మార్గ దర్శక నియమములో పౌలు పత్రికలు పది చేర్చబడినవి.

మార్సియన్ చేసినది చాలా ప్రాముఖ్యమైనదిగా పరిగనించెను. గ్రంథముల చిట్టా సమకూర్చి దేవుని వాక్యముగా ఏర్పరచి కేనన్‌ను సంకలనం చేయు విషయ ప్రాముఖ్యతను గ్రహించేలా అది చేసెను. అట్టి చిట్టా నిజముగా చాలా అవసరము. ఈ విషయము సంఘాలలో చర్చింపబడెను. బైబిల్‌లోని ఏ గ్రంథములను కేనన్ యొక్క లేఖనాలలో చేర్చాలి?

అన్నిటికంటే ముఖ్యముగా, క్రైస్తవులు ఈ విషయమై పరిశుద్ధాత్ముని నడిపింపుకొరకు ప్రార్థించిరి. పరిశుద్ధాత్ముడు ఆయన నడిపింపు ద్వారా వారి తలంపులను నడిపించి నేడు మనకున్న విధముగా కేనన్, బైబిల్ కూర్పు చేయబడెను.

అన్నీ కలిపి అరవై ఆరు పుస్తకములుండాలి, పాత నిబంధనలో ముప్పై తొమ్మిది, క్రొత్త నిబంధనలో ఇరవై ఏడు, వీటిని కనానికల్ లేక, ప్రమాణిక గ్రంథములందుము (కేనన్ అంటే మార్గదర్శక నియము, కొలకఱ్ఱ) ఈ గ్రంథములు కేవలము నిజ దేవుని వాక్యమని సంఘముచే స్వీకరింపబడెను ఈ విషయమై సంఘము పరిశుద్ధాత్మునిచే స్పష్టముగా నడిపింపబడెను. కనానికల్, ప్రమాణిక గ్రంథములు దేవుని కార్యమని పరిశుద్ధాత్ముడు దేవునిబిడ్డల హృదయములలో కూడా సాక్ష్యమిచ్చును.

ఈ సమయమందు ఇతర మత గ్రంథములుకూడా చదువబడెను. వీటిని అపోక్రిఫల్ అ ప్రమాణిక గ్రంథములందురు. మనము ఇంకనూ వాటిని చదువవచ్చును. వాటిలో విలువైన సమాచారమున్నదిగాని ప్రొటస్టంట్ మరియు సౌవార్తిక సంఘములలో వాటికి అధికారములేదు అందుకే క్రైస్తవ బోధలను సమర్థించుటకై వాటిని వాడలేము.

ఈ ఉద్దేశము నిమిత్తము కేవలము కనానికల్ ప్రమాణిక గ్రంథములను మాత్రమే వాడవచ్చును. ఈ గ్రంథములు పరిశుద్ధాత్మునిచే ప్రేరేపింపబడెను. ప్రవక్తలు అపొస్తలులు వ్రాసినప్పుడు ఏ తప్పిదము దొర్లకుండ పరిశుద్ధాత్ముడు చూచుకొనెను.

వీరునూ పరిశుద్ధాత్మునిచే ప్రేరేపింపబడిరి. ఈ కారణముచేత, సంఘములో కేవలము కనానికల్, ప్రమాణిక గ్రంథములు మాత్రమే దివ్య అధికారము కలిగియున్నవి. నేటివరకునూ ఇది వాస్తవమే!

12. కేటకూంబ్స్

అన్యుల కాలములలో ప్రజలు చనిపోతే వారి మృతదేహములు దహింపబడేవి. ఇది నేటివరకునూ అనేక దేశములలో జరుగుచున్నది. యూదులు మృతదేహములను దహింపలేదు. పాతనిబంధనలో మృతులు పాతిపెట్టబడినట్లు మనము చదివెదము. ప్రభువైన యేసు కూడ పాతిపెట్టబడెను. అందుకే క్రైస్తవులు వారి మృతదేహములను పాతిపెట్టుదురు. దీనినే ప్రభువు కోరెను.

సాధారణముగా సమాధుల తోట కొరకు స్థలమును కొనెడివారు. ఏదిఏమైనా, సంఘసభ్యులు సాధారణముగా పేదవారుగానుండెడివారు. వారికున్న స్థలమును సాధ్యమైనంతవరకూ సద్వినియోగము చేసికొనెడివారు. అందుకే వారు నేలను లోతుగా త్రవ్వెడివారు. రాతిలో సొరంగమార్గములను చేసెడివారు. రాయి మృదువుగా నుండుట వలన అది చాలా సులువుగా నుండేది. అది టూఫా రాయి గనుక త్రవ్వుటకు చాలా సులువుగా నుండెడిది, కాని అది గాలి తగిలితే గట్టి పడేది.

వారు విశాలమైన సొరంగ మార్గము చేసి ఇరువైపుల గుంటలను త్రవ్వెడివారు. ఈ స్థలములలో ప్రజలు మృతదేహములనుంచెడివారు. సొరంగమార్గము సముదాయము అంతకంతకు పొడవుగా మారెను. రోమా నగరము క్రింద ఈ విస్తారమైన సొరంగమార్గములో వేలకొలది ప్రజలు పూడ్చిపెట్టబడ్డారు. ఈ సొరంగమార్గములను మనము "కేటకూంబ్స్" అని పిలుతుము.

కేటకూంబ్స్ వలయాలుగానుండును. మార్గదర్శి సహాయములేనట్లైతే మనము సులువుగా తప్పిపోదుము, లోతైన సొరంగములు నేల మట్టమునకు ఇరవై ఐదు మీటర్లు ఉండును. ఒకదాని మీద ఒకటి ఇరవై సమాధులుండును.

వీటికి క్రింది కప్పులుండును. సొరంగమార్గమున నీవు వెళ్ళినపుడు నీవు వంగి వెళ్లాలి. కొన్నిసార్లు నీవు ఒక సొరంగమార్గమున వెళ్ళినప్పుడు, నీవు ఒక చిన్నగది లేదా చాంబర్‌లోనికి వచ్చెదవు. కొన్నిసార్లు కుటుంబములన్నియు బంధు సముహములు సమాధి చేయబడేవి.

ఈ చిన్న గదులు లేదా చాంబర్స్ రెండు మీటర్ల పొడవు రెండు మీటర్ల వెడల్పు కలిగయుండేవి. ఆ గది యొక్క వెనుక గోడలో గోపురముండేది. గోపురము క్రింద, సమాధిపెట్టెలాగ వుండును. "సమాధిపెట్టె" తొంభై సెంటిమీటర్ల ఎత్తు, సమాధులగోడ కంటె పొడవుగానుండేవి. అవి లోతుగా నుండేవి, రెండు మృతదేహములు ఒకదాని ప్రక్కన ఒకటి ఆ సంకుచిత స్థలములో ఉంచబడేవి. సమాధి సాధారణముగా చలువరాయితో కప్పివేయబడేది.

ఈ సమాధులలో వ్రాతలుండేవి. అవి కొన్నిసార్లు సులువుగా నుండేవి. ఉదాహరణకు: "ఆయన విశ్రమించెను..." లేదా ఆయన పరుండెను మరియు ఆ వ్రాతల చివరన ఈ మాటలుండేవి. "సమాధానమందు" కొన్ని వ్రాతలు సుధీర్ఘముగానుండేవి. ఉదాహరణకు "గోర్డానియస్, తన కుటుంబమంతటితో విశ్వాసము నిమిత్తమై వధింపబడెను. వారు విశ్రమించిరి" ఇక్కడ మనము హతసాక్షుల కుటుంబమంతటిని చూచెదము! బహుశ ఈ బహిరంగ స్థలములు క్రైస్తవ కూడికలకుపయోగపడేవి, అక్కడ వారు చేరి దేవుని వాక్యము బోధింపబడగా విందురు. బహుశ కొన్నిసార్లు హింస సమయాలలో ఈ స్థలములు దాగుకొనుటకై ఉపయోగపడేవి.

ఈ సమాధి కప్పులపై, సొరంగ మార్గములలో, మనము చాలా చిత్రపటములను చూతుము. అవి చాలా మట్టుకు బైబిల్ కథలు పుష్పములు లేదా పక్షులుగాను గీసి తెలిపెడివారు.

ఉదాహరణకు, ఆదాము హవ్వల పటములో వారి పతనం చూపబడెను. అందులో కొన్ని నోవహు ఓడలోనుండుట, పావురము నోట ఒలీవకొమ్మ ఉంచుకొని ఎగురుట! అబ్రాహాము తన కుమారుని బలిగానిచ్చుటకై సిద్ధపడుట మున్నగు చిత్ర దృశ్యములు. ముగ్గురు

యౌవ్వనస్థులు అగ్నిగుండములో నుండుట మరియు సింహపుబోనులో దానియేలు మున్నగు చిత్రములు కనబడును.

యేసు భూమి మీద ఉన్నప్పుడు ప్రభువైన యేసు జీవితములో సంభవించిన సంఘటన చిత్రపటములు చాలా ఉన్నవి. మంచి కాపరి కథ అతి తరచుగా చిత్రపటముగా వేయబడెను. మంచి కాపరి తప్పిపోయిన గొఱ్ఱెను తన భుజములమీద వేసికొని మందలోనికి తీసుకు రావటం మనము చూతుము.

కేటకూంబ్స్‌లో ఉన్న చక్కటి వర్ణపటములు దేవుని వాక్యబోధను ప్రతిబింబింపచేయుచున్నవి.



13. కాన్‌స్టాంటైన్ మహా చక్రవర్తి

కాలము గడిచే కొలది, రోమా సామ్రాజ్యము నేలిన దాదాపు అనేక మంది చక్రవర్తులు క్రైస్తవ్యమును నాశనముచేయ చాలా ప్రయత్నించిరి. ఒకరి తరువాత మరొకరు దానిని తుడిచివేయ ప్రయత్నించిరి. పరిస్థితులు విషమంగా మారి కఠిన హింస అంతటా చెలరేగెను. సంఘమునకు వెళ్ళుట మరణ శిక్షగా మారెను. సంఘభవనములు నాశనము చేయబడెను, క్రైస్తవుల గ్రంథములు కాల్చబడెను, మరియు వారి ఆస్తులు జప్తుచేయబడెను. అనేకులు హతసాక్షులుగా మరణించిరి.

కాని అప్పుడు పరిస్థితులు మారెను. అదంతయూ గలేరియస్ అను చక్రవర్తితో ప్రారంభమాయెను. గలేరియస్ గొప్ప బాధతో మరణ పడకపైనుండెను. నేను క్రైస్తవ విశ్వాసమును రూపు మాపలేక పోతినని ఒప్పుకోవలసివచ్చెను. హింసను ఆపమని ఆజ్ఞాపించి ఆయన మరణించనై యుండగా.... తన నిమిత్తమై ప్రార్థించమని క్రైస్తవులను కోరెను.

గలేరియస్ మరణించెను మరియు రోమా సామ్రాజ్యపు చక్రవర్తి మక్సెంటియస్ అని ప్రకటింపబడెను. కాని కేవలం మక్సెంటియస్ మాత్రమే ఆ గొప్ప సామ్రాజ్యమునకు రాజు కాదు. సామ్రాజ్యపు పశ్చిమాన జనరల్ కూడా చక్రవర్తిగా ఎన్నుకొనబడెను. అతని పేరు కాన్‌స్టాంటైన్. అతడు మంచి జనరల్ మరియు అతని సైనికులు అతని గూర్చి మంచి అభిప్రాయము కలిగియుండిరి. ఆయననే వారు చక్రవర్తియని ప్రకటించిరి.

సామ్రాజ్యమంతయూ కలగూరగంపగా వుండెను. గతంలో ఎప్పటికప్పుడు ఒకే సమయంలో అనేక చక్రవర్తులు పరిపాలించిరి. ఒక్కొక్కరికి ఒక్కో రాజ్యముండెను. ఏది ఏమైన అందరికి అధికారము కావలసివచ్చెను గనుక ఒకరికి విరోధంగా ఒకరు పోరాడిరి. ఇప్పుడు పశ్చిమాన కాన్‌స్టాంటైన్ చక్రవర్తియాయెను. ఇది మళ్ళీ జరిగెను. అతడు సైన్యముతో రోమాకు వచ్చెను. ఆల్ప్స్ మీదుగా ప్రయాణించటము కష్టమైనప్పటికిని, అతను ఆ పట్టణమునకు కూడా చక్రవర్తిగా ఉండాలని ఆశించాడు.


ఒకసారి రోమ్ నందు, కాన్‌స్టాంటైన్ సైన్యము మాక్సెంటియస్‌తో పోరాటము చేయ సిద్ధపడిరి. కాన్‌స్టాంటైన్ సైన్యము కంటే మాక్సెంటియస్ సైన్యము మూడింతలు హెచ్చుగా నుండెను గనుక అది సులువైన యుద్ధముగా నుండదు. కాన్‌స్టాంటైన్ ఎందుకు అంత తీవ్రముగా చింతించుచున్నాడో దానిని సులువుగా చూడవచ్చును. అది ఇప్పుడు లేదా ఎప్పుడూ! యుద్ధముకంటే ముందు ఆ సాయంకాలమున ఒక్కడే బయటికి వెళ్లెను. ఆయన సమస్యను గూర్చి ఆలోచించుటకు ఒంటరిగా నుండదలచెను.

ఈ యుద్ధము చేయుటకు అతనికి ఎవరు సహాయము చేయుదురు? ఇక ఏ మాత్రమును కాన్‌స్టాంటైన్ విగ్రహములను విశ్వసించడు. క్రైస్తవుల దేవున్ని సహాయము చేయమని అతడుకోరెను. ఈ దేవుడు అట్టి అద్భుత కార్యములు చేయగలడని ప్రజలు అతనికి చెప్పిరి. క్రైస్తవురాలైన కాన్‌స్టాంటైన్ తల్లి క్రైస్తవ విశ్వాసమును గూర్చి అతనికి చెప్పెను. అందుకే అతడు క్రైస్తవుల దేవున్ని ప్రార్థించెను – ఆయన శక్తి చాలా గొప్పది!

తరువాత సాయంకాలమందు ఏమి జరిగెనో కాన్‌స్టాంటైన్ వర్ణించెను. "అతడు టైబర్ నది ఒడ్డున నిలువబడి దీర్ఘాలోచనతో రోమా నగరముపైపు దూరమునుండి చూచెను. ఉన్నట్టుండి ఏదో ఒక చాలా ఆశ్చర్యమైనది చూసెను. అక్కడ సంధ్యా కాశమందు ఎత్తున ప్రకాశించుచున్న సిలువ అగుపడెను! అది సువర్ణ ప్రకాశముతో ప్రకాశించెను. సిలువ మీద మాటలను చూడవచ్చును, కేవలము రెండు పదములు మరియు అవి ఆకాశమందు ఎఱ్ఱని ఆకాశమందు మండచున్నట్టున్నవి. ఆ రెండు పదములు : "టూటుయ్‌నికా" వాటికర్థము: ఈ సూచనలో, గెలువుము!" గొప్ప ఆనందము అతని హృదయమందు నిండెను. ఇది దేవుని జవాబు! "ఈ సూచనలో నేను జయింతునని, సిలువ క్రైస్తవుల దేవుని సంకేతము, సిలువపై దైవ కుమారుడు శత్రువులను

జయించెను" అని అతడు ఒప్పింపబడెను. కాన్స్టాంటైన్ వెంటనే తన సైన్యముపద్దకు వచ్చెను. ఆయన సైనికులందరు వారి దట్టి, శిరస్త్రాణము, మరియు జెండాలపై సిలువగుర్తు వేసుకోవాలని ఆజ్ఞ జారీ చేసెను.

మరుసటి దినము, యుద్ధము ప్రారంభమాయెను. యుద్ధము చాలా కఠోరముగా నుండెను. త్వరలో మాక్సెంటియస్ సైన్యములు వెనక్కు మరలెను. సైనికులు పారిపోయిరి. స్వయాన మాక్సెంటియస్ టైబర్ నదిలో మునిగెను. కాన్స్టాంటైన్ గొప్ప విజయమునొందెను. ఆయన విజేతగా రోమానగరంలో ప్రవేశించెను. కాని కాన్స్టాంటైన్ ఇంకనూ తృప్తి నొందలేదు. తూర్పు ప్రాంతముతో పాటు సామ్రాజ్యమంతటికిని తాను చక్రవర్తి కాదలచెను. అతని ప్రణాళిక ఫలించెను. ఒక సంవత్సరము పిమ్మట తన సైన్యములతో తూర్పునకు వెళ్ళి ఆ ప్రాంతమునకు చక్రవర్తియైన తన బావమర్దిని ఓడించెను. ఇప్పుడు కాన్స్టాంటైన్ రోమా సామ్రాజ్యమంతటికి చక్రవర్తి.



14. అద్భుత మార్పులు

"మనము కలకనువంటి వారము" మనము ఈ మాటలను 126వ కీర్తనలో చదివెదము మరియు ప్రభువు యూదులను బబులోను చెఱనుండి తిరిగి తీసుకు వచ్చాక యాదులు పలికిన మాటలివి. క్రైస్తవులు కూడా కల ప్రపంచంలో ఉన్నట్లు భావింతురు, ఇప్పుడు ఆ కాన్స్టంటిన్ చక్రవర్తి అయ్యాడు ఏమి సంభిస్తూ వస్తుంది? మూడువందల సంవత్సరముల తర్వాత బాధింపబడుట మరియు హింస సమస్యనుండి క్రైస్తవులందరికి స్వేచ్ఛ ఇవ్వబడాలని కాన్స్టాంటైన్ ఆజ్ఞాపించెను. ఇప్పుడు క్రైస్తవ్యము ఆమోదిత మతము. అనేక సంవత్సరముల భయము, శ్రమ పిమ్మట నెమ్మదికలిగెను.

క్రైస్తవుల కొరకు జీవితము సంపూర్తిగా మారెను. దౌర్జన్యముగా తీసికొనబడిన సంఘభవనములు మరియు ఆస్తులు తిరిగి ఇవ్వబడెను, పాడుచేయబడిన మందిరముల స్థానంలో నూతన మందిరములు కట్టబడినవి. వారు ప్రభుత్వ ఉద్యోగములు చేయసాగిరి. ఉదాహరణకు, క్రైస్తవులు గవర్నర్లుగా నియమింపబడిరి.

సామ్రాజ్యమందంతట ఆదివారము ప్రభువు దినముగా ఆచరింపబడెను. అటు పిమ్మట క్రైస్తవ్యము రాజ్య మతముగా మారెను. దీనికర్థము ప్రతి ఒక్కరు క్రైస్తవ్యమును స్వీకరించాలి.

క్రమేపి అన్య నమ్మకములు తగ్గిపోయెను మరియు బహిరంగ జీవితము నుండి అంతరించెను. అన్య దేవాలయములు ఎంత గొప్పవైనను అవి పడద్రోయబడెను. విగ్రహమునకు బలియర్పించుట నిషేధింపబడెను. ప్రజా జీవితంలో వ్యత్యాసము కలుగజేయుటకై అనేక ఇతర చట్టములు జారీచేయబడినవి. ఉదాహరణకు, మైదానములో ఒకరినొకరు చంపుకొను గ్లాడియేటర్స్ పోటీలు నిషేధింపబడినవి. సాధారణముగా బానిసల ముఖములపై ముద్ర వేసెడి వారు ఇదియూ నిషేధింపబడెను. బానిసలను కూడా మనుష్యులవలె చూడాలి.

ఇప్పుడు ఒకే రాజ్యము మరియు ఒకే మతమ్మున్నది. అవే రోమా సామ్రాజ్యము మరియు క్రైస్తవ్యము. సంఘము ఇప్పుడు పరిశుద్ధ రోమన్ క్యాథలిక్ సంఘమయ్యెను. (క్యాథలిక్ అంటే ప్రపంచ వ్యాప్తము). అన్యులు క్రైస్తవ్యమునకు మారుటవలన క్రైస్తవ సంఘము విస్తరించెను.

ప్రభువు వాస్తవానికి గొప్ప మరియు ఆశ్చర్యకర సంగతులు కలిగియున్నాడు! వాస్తవానికి జరిగినదేమిటంటే క్రైస్తవ సంఘమున చేరిన వారు ప్రభువునకు యథార్థముగా భయపడుటలేదు. సంఘము "లోకయుక్తంగా" మారే గొప్ప ప్రమాదముండెను. ఉదాహరణకు, ప్రజలకు ప్రశస్తవస్తువులతో నింపబడిన అందమైన భవనములు కావలసి వచ్చెను. ఆయనకు చెందటమే ప్రధానము మరియు ప్రభువునకు భయపడుట మరచుట చాలా సులభము. ఇదే నిజ ధనము. తరువాత ఏం జరిగిందో మనం చూచెదము.

హింస మరియు వెట్టి చాకిరి ఇకను లేకపోవడం ఎంత ఆశ్చర్యం! తత్ఫలితంగా సంఘాలిప్పుడు నెమ్మదిగా క్రైస్తవ సిద్ధాంతమను విషయములను ముఖ్య సంగతులను చక్కగా చర్చించుకొనవచ్చును, వాటిని ఆలోచింపవచ్చును. కాన్స్టంటిన్‌కు కావలసినది కూడా ఇదే. మరియు చాలా మంది బిషప్‌లు పెద్దలు మరియు పరిచారకులు నైసియాకు ప్రయాణమై వెళ్ళుట మనము చూచెదము. ఓ పెద్ద సంఘ సమావేశము ఇక్కడ జరుగును. వీరు మహాసామ్రాజ్యము యొక్క నలుమూలల నుండి వచ్చిరి. హాజరు అగులాగున ఆహ్వానించుటకై చక్రవర్తి తన సందేశకులను అంతటికి పంపెను. వారు హింసింపబడినది మనము చూసెదము. ఒక బిషప్ లోపలికి వచ్చాడు, అతని చేతులు అగ్నిచేత కాల్చబడి వుండెను. మరొక బిషప్ తన కుడికన్ను కోల్పోయి వుండెను. మరియొకరు తన ఎడమ కాలు తుంటినరము తెంచి వేయటంతో కుంటివాడై యుండెను.


ఇప్పుడు పరిస్థితి ఎంత భిన్నముగా మారెను!



బిషప్‌లు గౌరవముగా చూచుకొనబడుచున్నారు. చక్రవర్తి కూడా క్రైస్తవుడనిపించుకొనుటకై సిగ్గుపడుట లేదు. ఇకను కాన్‌స్టాంటైన్ రోమా నగరములో నుండుట లేదు. తూర్పున బోస్పరస్ ఒడ్డున క్రొత్త నగరమును ఆయన కట్టించెను. వీధులు మరియు అంతఃపురములు వైభవపూరిత విగ్రహములతో అలంకరింపబడెను. క్రొత్త రాజమందిరములు మరియు ఫౌంటెన్లు కూడా ఉన్నవి.

పట్టణమునకు ఆయన పేరు పెట్టబడెను. దానిని కాన్స్టెంటినోపుల్ అని పిలిచిరి. కాన్‌స్టాంటైన్ మరణించినపుడు అతనిని ఓ పెద్ద సంఘములో సమాధిచేయబడెను. అతడు మరణింపకమునుపు అతనికి బాప్తిస్మమివ్వబడెను. గనుక అతడు క్రైస్తవునివలె మరణించెను. అతడు ఎన్నో గొప్ప పనులు చేసెను అందుకే అతడు కాన్‌స్టాంటైన్ ద గ్రేట్ అని పిలువబడెను. కాని సమస్తమును నిర్దేశించినవాడు ప్రభువే. ఆయన సంఘమునకు నెమ్మదినిచ్చుటకు కాన్‌స్టంటిన్‌ను ఏర్పరచుకొనినవాడు ప్రభువే.

15. ఇంకనూ సమాధానము లేదు - ఏరియస్ దుర్బోధ



ఎట్టకేలకు సమాధానము వచ్చెను లేదా హింస సమయం ముగిసినప్పటి నుండి సమాధానము వచ్చినట్లు అగుపించెను. కాని సాతాను ఇతర ప్రణాళిక కలిగియుండెను. సంఘములో చీలికలు అసమ్మతులు బయలుదేరెను. సంఘములో గొడవలు అనునది శత్రువు చేతిలో ప్రమాదకరమైన ఆయుధము!

అలెగ్జాండ్రియాలో ఒక ప్రెస్బిటర్ (పెద్ద) ఉన్నాడు. అతడు సంఘమందు ఎంతో కష్టమును కలుగజేయుచున్నాడు. అతని పేరు ఏరియస్. యేసు తండ్రియగు దేవుడు సృష్టించిన మొదటి సృష్టమని అతడు నమ్మెను. యేసు ఉనికిలో లేని సమయమొక్కటి ఉండెను గనుక ఆయన నిత్యుడగు దేవుని కుమారుడుగా నుండజాలడు. యేసు తండ్రితో సమానుడు కాడని అతడు విశ్వసించెను.

అటువంటి వ్యాఖ్యలు చేయుట చాలా తీవ్ర విషయము, ఎందుకంటే యేసు సంపూర్ణముగా దేవుడే గాక పోతే ఆయన జరిగించిన రక్షణకార్యము వ్యర్థమైపోవును. మరొక సంఘమునుండి మరో బిషప్ దానిని తీవ్రముగా ప్రతిఘటించెను. ప్రభువైన యేసు మాత్రమే నిజ దేవుడు ఆయన నిత్యత్వమునుండి ఉండినవాడు!

ఏరియస్ సంఘములో ఆదరణనొందెను గనుక వాదనలు, చీలికలు త్వరగా ఏర్పడెను. సమస్య అలెగ్జాండ్రియా సంఘములోనే గాక తూర్పు సంఘములన్నియూ ఇందులో పాల్గొనెను. చాలా సంఘములలోని బిషప్‌లు ఏరియస్‌ను బలపరిచిరి. అంతట గలిబిలి వ్యాపించెను. పరిస్థితులు విషమంగా మారుతుంటే స్వయాన కాన్స్టంటిన్ అందులో కలుగజేసికొనెను. ఈ వాదములు ఆగాలని ఆయన కోరెను. సామ్రాజ్యములోనే గాక, సంఘమందును శాంతిని ఆయనకోరెను. అందుకే సంఘ సమావేశమునకై ఆయన ఆజ్ఞాపించెను. అట్టి సంఘసమావేశమును కౌన్సిల్ అని అందురు. సంఘములన్నియూ వారి ప్రతినిధులను పంపెను. చక్రవర్తి సమస్తమును అనగా ప్రయాణ ఖర్చులను కూడా భరించెను.

క్రీ.శ. 325లో ఆయా సంఘములనుండి పెద్దలు మరియు పరిచారకులు కాన్స్టంటినోపుల్ నగరమునకు సమీపముననున్న నైసియాలో కూడిరి. గత అధ్యాయములో నైసియా కౌన్సిల్‌ను గూర్చి మనము కొన్ని వివరాలు తెలిపాము.

అలెగ్జాండ్రియ బిషప్‌తో పాటు ఓ యౌవన పరిచారకుడు కూడ వచ్చెను. ఆయన పేరు అతనేషియస్. చక్రవర్తి సభను ప్రారంభించాక ఈ పరిచారకుడు మాట్లాడుటకు అనుమతింపబడెను. ఆయన ఎంతో ఉత్కంఠముగా ఏరియస్ భావనలను సవాలు చేసెను. ఏరియస్ తప్పు అని బైబిల్ నుండి నిరూపిస్తుంటే సభికులందరు చాలా జాగ్రత్తగా వినిరి. (దాదాపు మూడు వందల ప్రతినిధులు). అతని బోధలు సంఘబోధలతో సమ్మతించుట లేదు గనుక ఏరియస్ దుర్బోధకుడని



బహిరంగముగా అతని ప్రకటించెను. అతని బోధ దుర్బోధ.

సభ ముగింపులో అతనేషియస్‌ను ఆదరిస్తూ ఒక తీర్మానము తీసికొనబడినది. ఏరియస్ బోధన దుర్బోధయని చూపబడి అది ఖండింపబడెను. ఒక ఒప్పుకోలు చేయబడినది బిషప్‌లందరూ దానిని సమ్మతిస్తూ సంతకం చేయాలి. ఈ ఒప్పుకోలులో ప్రభువైన యేసును గూర్చి ఈ దిగువ మాటలు వ్రాయబడెను.

నేను దేవుని కుమారుడైన ఒక్క ప్రభువైన
యేసు క్రీస్తునందు విశ్వసింతును,
యావత్ ప్రపంచములకంటె మునుపు తన
తండ్రితో నుండెను,
దేవాది దేవుడు వెలుగుకే వెలుగు
దేవ దేవుడు చేయబడిన వాడుగాక
దేవుని కుమారుడు
తండ్రితో సమానుడు, ఆయన ద్వారా సమస్తమూ చేయబడెను.

ప్రతి ఒక్కరు కూడ ఈ ఒప్పుకోలు విషయమై సంతకం చేయాలి. కాని అందరు అలా చేయలేదు. ఏరియస్ నిరాకరించెను! దాని కర్థము అతడు ప్రవాసమునకు వెళ్ళును. చక్రవర్తి ఆజ్ఞమేరకు అతడు అలెగ్జాండ్రియ విడిచి దూరముగానున్న గ్రామమునకు పోయి అక్కడ నివసించాలి. అతని గ్రంథములన్నియూ కాల్చబడాలి. ఎవరునూ వాటిని కొనకూడదు లేదా అమ్మకూడదు. అలా చేస్తే వారు శిక్షింపబడుదురు. ఏరియస్ పేరు కూడ ఎన్నటికిని ఎత్తబడకూడదు.

గనుక సమస్తము చక్కగా ఉందని చక్రవర్తి భావించెను. సమాధానము మరియు ప్రశాంతత మళ్ళీ సంఘములో నెలకొనెను. అందరూ తిరిగి ఇంటికి వెళ్ళిరి. ఏరియస్ మరియు అతని అనుచరులు పొందిన ఓటమి ప్రభువు కార్యమే. మూడు సంవత్సరముల పిదప అలెగ్జాండ్రియ బిషప్ మృతినొందెను. అతని స్థానములో అతనేషియస్ బిషప్ అయ్యెను. అంతయూ ఇప్పుడు సద్దుమణిగిందా? కాదు, కానేకాదు! ఏరియస్ ఆయా స్థలములలో మిత్రులనేర్పరచుకొని ప్రజలు అతని బోధలు మరువకుండునట్లు చేసెను. ఖచ్చితముగా ఏదో జరుగనైయున్నది...

16. అతనేషియస్ మరియు ఏరియస్

ఇప్పుడు పరిస్థితులు ఎలా పరిణమించనైయున్నవి? రెండేండ్ల పాటు ఏరియస్ దూరముగా నుండిన పిదప ఆయన అలెగ్జాండ్రియాకు తిరిగి చేరుకునెను. అప్పుడేమి జరిగెను? ఏరియస్ విషయమై చక్రవర్తి పూర్తిగా తన మనసును మార్చుకొనెను. బహుశ ప్రజలాయనను ప్రభావితము చేశారేమో! కాని... అతనేషియస్ ఏరియస్‌ను తిరిగి సంఘములో చేర్చుకోడు. ఇది చక్రవర్తికి నచ్చక ఇప్పుడు అతనేషియస్‌ను ప్రవాసమునకు పంపమని ఆజ్ఞాపించెను. ఆయన ప్రవాసమునకు అదొక్కటే కారణముకాదు. ఇతర విషయములు కూడా జరుగుతున్నవని ప్రజలు చెప్పిరి.

చక్రవర్తిని చంపజూచుచున్నాడని అతనిపై నేరము మోపబడెను. అదియూగాక అతడు ఒక హత్యజేసెనని నిందవేయబడెను. అతనేషియస్‌ను వదిలించుకొనుటకు సాతానుడు అబద్ధములను మరియు అప్రతిష్టపాలుజేయు పత్రములను వాడుకొనెను.

నమ్మకమైన బిషప్ రోమా సామ్రాజ్యపు చివరనున్న మారుమూల గ్రామమునకు వెళ్ళెను. ఏరియనులు ఎంతగానో ఆనందించిరి. ఏరియస్ తిరిగి రానైయున్నాడు! వారు ఉత్సవం జరుపుకొనదలచిరి. వచ్చే ఆదివారము తిరిగి అతని గౌరవము ప్రతిష్టను ఎంతో వైభవంగా సమకూర్చునైయున్నారు. హాజరగుటకై అందరిని ఆహ్వానించిరి. కాని అన్నీ వారనుకున్నట్లు జరుగలేదు. ఆ ప్రత్యేక ఆదివారము కంటే ముందు శనివారము ఏరియస్ ప్రేగులలో రక్తముకారి త్వరలోనే చనిపోయెను..

"ప్రభువు మాట్లాడెనని" చాలా మంది ఒకరితో ఒకరు చెప్పుకొనిరి. అతి త్వరలో చక్రవర్తి కూడా మరణించెను. ఆయన తరువాత వచ్చిన చక్రవర్తి



అతనేషియస్‌ను మళ్ళీ పిలిచెను. గనుక అలెగ్జాండ్రియలోని సంఘము నమ్మకమైన దేవుని దాసుని సందేశములను మరొక్కసారి వినెను. కాని పోరాటము కొనసాగుతుండెను. ఏరియనులు పట్టువిడువలేదు. కొన్ని సంవత్సరముల పిదప అతనేషియస్ మళ్ళీ ప్రవాసమునకు పంపబడెను. కొన్నిసార్లు ఆయన గౌరవింపబడెను కాని మరికొన్నిసార్లు తిరస్కరింపబడి తరుమబడెను. ఐదు సందర్భములలో అతనేషియస్ నిర్బంధింపబడెను లేదా నిర్బంధమును తప్పించుకుని పారిపోయెను. అన్నీ కలిపి తన జీవితకాలమంతటిలో ఆయన ఇరవై సంవత్సరములు చెరలో గడిపెను.

ఒకానొక సందర్భములో అతనేషియస్‌ను బంధింపమని చక్రవర్తి సైనికులను ఆజ్ఞాపించెను. ఆయన బోధించు సంఘములలోనికి వారు చొచ్చుకొని వచ్చిరి. చిన్న ద్వారము ద్వారా అతనేషియస్ తప్పించుకొనిపోయెను. ఆయన ఐగుప్తు ఎడారికి పోయి అక్కడ ఐదు సంవత్సరములుండెను. పరిస్థితులు మారినప్పుడు, ఒక యువ చక్రవర్తిని స్వాగతించినట్లు ప్రజలు ఆయనను స్వాగతించిరి.



అతనేషియస్ ఖచ్చితముగా ఈ సులువైన సుఖమైన జీవితమును జీవించలేదు. సత్యము కొరకు ఆయన ఎదురొడ్డి నిలిచెను. ఆయన దేనికిని లొంగలేదు. సువార్తమూలమే సవాలు చేయబడెను. ఆయన రాజు సేవలో తన్ను తాను బలిగా అర్పించుకొనెను.

అతనేషియస్ డెబ్భైఐదేండ్ల వయసులో మరణించెను. చివరకు ఆయనకు నెమ్మది దొరికెను, దేవుని ప్రజలతో జీవించులాగున ఆయన నిత్య విశ్రాంతిలో ప్రవేశించెను. కొన్నిసార్లు ఇతర పట్టణములలో కూడా పోరాటము కఠినముగా చెలరేగేది. తూర్పు నగరములలో చాలామంది బిషప్‌లు అతనేషియస్‌కు విరోధులే ఒక సందర్భములో, కాన్‌స్టంటినోపుల్‌లో ఏరియన్ అను వ్యక్తిని ఆయుధబలముతో బిషప్‌ను చేయుటకై చక్రవర్తి గొప్ప సైన్యమునంపెను. నగరములో అట్టి గొప్ప పోరాటముండెను, వీధులలో చాలామంది మరణించిరి.

అతనేషియస్ మరణించిన ఎనిమిది సంవత్సముల పిమ్మట మరొక సభ జరిగెను. అది కాన్‌స్టంటినోపుల్‌లో క్రీ.శ 381లో జరిగెను. ఇక్కడ ఒక్కమారే ఏరియస్ సిద్ధాంతము ఖండింపబడెను. పరిశుద్ధత్రిత్వము మరియు క్రీస్తు దేవత్వము ఇవే క్రైస్తవ విశ్వాసమునకు మూలము. "...అది ఓ మనిషి నమ్మకముగా విశ్వసించితేనే తప్ప అతను రక్షింపబడలేడు".

పశ్చిమములోని సంఘమునకు తూర్పు సంఘమునకు ఇతర వ్యత్యాసములు కూడా ఉన్నవి. తరువాత రెండునూ పూర్తిగా విడిపోయెను. రోమ్‌తో పశ్చిమ సంఘము మరియు కాన్‌స్టంటినోపుల్‌తో తూర్పు సంఘము వాటి వాటి కేంద్రములుగా చేసికొనియుండెను.

నేటి రోజున యెహోవా సాక్షులు యేసు సృష్టింపబడిన వాడేకాని ఆయన నిత్యుడగు దేవుని కుమారుడు కాదని చెప్పుచున్నారు. ఇది నిజమైన ఏరియనిజమ్.

17. సంఘము మారనారంభించెను

"క్రైస్తవ్యము రాజ్య మతమగుట మనము చూశాము. సామ్రాజ్యమందంతట ఒకే మతమున్నది. క్రైస్తవ్యము. ఈ విధముగా క్రైస్తవ సంఘము రాజ్య సంఘమాయెను. ఒకే క్యాథలిక్ (సార్వత్రిక) సంఘం కలదు.

ఒక సందర్భమందు థియొడోసియస్ అను చక్రవర్తి తన ప్రజలందరికి ఇలా తెలిపెను. "మేము పరిపాలించు ప్రజలందరు రోమ్‌లో పవిత్ర అపొస్తులుడైన పేతురిచ్చిన సంఘమును అనుసరింపవలెనని మేము ఆజ్ఞాపించుచున్నాము" ఈ ఆజ్ఞ ఫలితముగా హృదయమందు నిజముగా క్రైస్తవులు కానివారు కూడా సంఘమందు చేరిరి. సంఘము లోకరీతిగా మారెను. విషయములు మరింత వైభవముగాను మరియు గంభీరముగాను మారెను. సంఘభవనములు మరింత విశాలముగా చేయబడెను. అధికారులు ఖరీదైన వస్త్రములు ధరించిరి. క్రొవ్వొత్తులు మరియు అగరువత్తులు ఉపయోగించి సంఘ కార్యక్రమములు మరింత ఇష్టకరముగా మరియు ఆకర్షణీయముగా చేయబడెను. గడచిన సంవత్సరముల సరళత్వము త్వరలో కనుమరుగాయెను.

ప్రతి సంఘములో సమాజమును బిషప్ నడిపించెను. ఆయన అపొస్తలుల బోధను చేపట్టును. బిషప్‌లు వారి తరువాత నాయకత్వమును చేపట్టులాగున అపొస్తలులే వారినేర్పరచారని ప్రజలు నమ్మిరి. "ఈ కారణముచేత బిషప్‌కు అవిధేయులైనవారు, దేవునికి అవిధేయులయ్యారు" అని చెప్పబడెను. సంఘములో పనిచేయువారందరికి బిషప్ అధికారిగా ఉండేవాడు. ఉదాహరణకు వారు, మత గురువులు, పరిచారకులు, ద్వారపాలకులు కార్యక్రమములను నడిపించువారు.

వాస్తవమే, ఒక బిషప్ మరొక బిషప్ కంటే అధికుడుకాడు కాని మార్పు జరుగనైయున్నది. పెద్ద పట్టణములలో వుండే సంఘము మేమే ప్రాముఖ్యమైన వారమని భావించటం ప్రారంభించిరి. ఈ పట్టణముల బిషప్‌లు ఆర్చ్ బిషప్‌లయిరి. (ఆర్చ్ అంటే ప్రధాన) అయా పట్టణములైన రోమ్, అలెగ్జాండ్రియా, కాన్‌స్టంటినోపుల్, యెరూషలేము మరియు అంతియొకయ మరింత ముఖ్య నగరములుగా మారెను. ఆర్చ్ బిషప్‌లు పేట్రియార్క్స్‌గా పిలువబడిరి. (పేట్రియార్క్ అంటే పాలించు తండ్రి) వారు గొప్ప సంఘ నాయకులైరి.

క్రమేపి రోమ్ బిషప్ అందరికంటే ప్రముఖుడైన పేట్రియార్క్ ఆయెను. ఆయన రోమ్ మొదటి బిషప్ మరియు పేతురు వారసుడని భావింపబడెను. అందుకే రోమ్ బిషప్, ఆయనే రోమన్ పేట్రియార్క్‌గా నుంటూ బిషప్‌లందరికంటే అధికుడాయెను. ఆయన ద్వారా పేతురు క్రమేపి జీవించెను...! అని భావించిరి. "పోప్‌ద్వారా క్రీస్తు తన అధికారమును చేయును" అని పోప్ భావించెను. క్రీస్తు పేరిట ఆయన సంఘమును పాలించును గనుక ఆయన క్యాథలిక్ సంఘమంతటికి అధిపతియాయెను. ఆయన రోమన్ క్యాథలిక్ సంఘమునకు పోప్ ఆయెను పోప్ అంటే పాప్పా లేదా తండ్రి. పోప్ సత్య సంరక్షకునిగా భావింపబడెను. తరువాత పోప్ తప్పుచేయని వానిగా ఎంచబడెను ఆయనమాట దేవుని వాక్యమువలె అధికారము కలిగియుండెను!

సంఘములోని వేర్వేరు నాయకుల అధికారక్రమమును గూర్చి చెప్పుటకు హైరార్కి అను పదమును మనము వాడెదము. ఉదాహరణకు బిషప్ కంటే ఆర్చ్ బిషప్ ఎక్కువ అధికారము కలిగియుండును.

ఇటువంటి హైరార్కి వ్యవస్థ, క్రైస్తవ్యము బైబిల్ ఆధారిత క్రైస్తవ్యమునుండి దారి వైదొలగెననుటకు ఓ సూచన. మారిన సంగతులు వెంటనే జరుగలేదు. అవన్నీ క్రమబద్ధమగుటకు కొన్ని వందల సంవత్సరములు పట్టెను. ఈ పరిణామముల ఫలితముగా విషయములు చీకటి మయమాయెను, క్రైస్తవ సంఘము క్రమేపి రోమన్ క్యాథలిక్ సంఘమాయెను.

సంఘజీవితపు ప్రారంభ దినములలో



మృతులను ఆరాధించుట మరొక పరిణామము. క్రైస్తవులు ఆయా హతసాక్షులు, అపొస్తలులు భక్తులయొక్క వర్థంతులను ఉత్సవములుగా జరుపుకొనెడివారు. ఇందులో తప్పేమి లేదుగాని ఉత్సవము సుళువు ఆరాధనకు దారితీయవచ్చును. తత్ఫలితము ఈ దిగువ దోషములు దరినిజేరెను. భూమి మీద ఉన్న విశ్వాసుల నిమిత్తమై పరలోకమందలి భక్తులు పరిశుద్ధులు ప్రార్థింతురని వారి నమ్మకము. ఎందుకంటే పరిశుద్ధులు దేవుని దగ్గర ప్రత్యేక స్థానము కలిగియుండి వారాయనకు సమీపముగా నుందురని వారి భావము. అందుకే వారి ప్రార్థనలకు గొప్ప విలువ ఉండును. ఆ విధముగా క్రైస్తవులు పరిశుద్ధుల పేరట ప్రార్థింతురు. అతి ప్రాముఖ్యమైన పరిశుద్ధరాలు, ప్రభువైన యేసు తల్లి మరియు 'సెయింట్స్‌డే'లలో దూర ప్రాంతములనుండి పరిశుద్ధుల సమాధులయొద్దకు చేరి ప్రార్థింతురు. ఆ సమాధులయొద్దకు చేసే ప్రయాణములనే యాత్ర చేయుట అందురు. శుభప్రదమైన ఊరేగింపులు జరుగును. ఈ ఊరేగింపులలో ఒక స్థలము నుండి మరొక స్థలమునకు జ్ఞాపికలు మోసికొనిపోబడును. జ్ఞాపికలంటే పరిశుద్ధుల అవశేషములు. అవేవనగా వారి ఎముకలు, వస్త్రాలు వారు వాడిన వస్తువులు. ఆ జ్ఞాపికలు పరిశుద్ధుల ఆరాధనలలో కూడా వాడబడేవి. ఇతర జ్ఞాపికలు కట్టముక్క లేదా క్రీస్తు సిలువ యొక్క మేకు, పేతురు గడ్డపు వెంట్రుకలు యేసు రక్తపుచుక్కలు ప్రజలు వీటన్నీటిని ఎంతో గౌరముతో చూచెడివారు. ప్రజలు వీటిని కొనుటకు ఎంతో డబ్బును ఖర్చుపెట్టేవారు. ఇట్టి జ్ఞాపికలను కలిగియుండి వీటిద్వారా అద్భుతములు జరుగునని వారు భావించేవారు. వీటి ద్వారా రోగగ్రస్థులు నయము చేయబడుదురని వారు భావించేవారు. అందరూ ఇటువంటి తప్పుడు భావనలను విశ్వసింపకపోయినా, చాలామంది అవి వాస్తవమని నమ్మిరి!

18. సన్యాసులు - ఆంథోని


హింస కొనసాగుతుండగా అనేక క్రైస్తవులు ఎడారి లేదా అరణ్యములలోనికి పారిపోయిరి. తమంతట తాముండుటకై వారు చాలా దూరము వెళ్ళిరి. కాని హింస సమసిపోయాక కూడా అనేక క్రైస్తవులు ఏకాంతమందే నిలిచిపోయిరి. వారు దైనందిన ప్రజా జీవనములోనికి రాలేదు. ఇతర అనేకులు ఏకాంతముగా నుండుటకై పట్టణములను విడిచి వెళ్ళిరి. మనము వీరిని "సన్యాసులు" అని పిలుతుము.

ఆంథోని అనే పేరు చాలా సుపరిచిత సన్యాసి పేరు. ఆయన దాదాపు క్రీ.శ. 400 యందు నివసించెను. ఆయన తల్లిదండ్రులు ఆస్తిపరులైన క్రైస్తవులు. ఆంథోని చిన్న పిల్లవానిగానున్నపుడు మౌనముగానుంటూ ఎవరితోనూ ఆడుకునేవాడు కాదు. ఒంటరిగా నుంటూ తనంతట తాను తన తండ్రి ఎస్టేట్‌లో తిరిగెడివాడు. ఆయన క్రమముగా సంఘమునకు వెళ్తూ, బైబిల్‌లో ఆయన చదివిన మరియు వినిన సంగతులను ఎన్నటికిని మరచేవాడుకాదు.

ఆయన ఇరవైయేండ్ల వయసులోనున్నప్పుడు ఒకరి తర్వాత ఒకరు తన తల్లిదండ్రులు మరణించిరి. ఒక సందర్భములో ఆయన యౌవన ధనవంతుని గూర్చిన వర్తమానము వినెను. ఆ కథలో "నీ కున్నదానిని పేదలకిమ్ము... పిమ్మట వచ్చి నన్ను వెంబడింపుము" అని ఆ యౌవన అధికారితో యేసు చెప్పెను (మత్తయి 19:16-22).


ఆంథోని కూడా అదే చేయాలని భావించెను. ప్రభువు ఆ ధనిక యౌవనుని పరీక్షింపపలికిన మాటలని ఆయనకు అర్థము కాలేదు. తదుపరి ఆంథోని తన ఆస్తులన్నియు అమ్మి పేదలకిచ్చెను. తన తల్లిదండ్రులనుండి స్వాస్థ్యముగా ఆస్తిని పొందుకొనెను గనుక ఆయన ఎంతో ధనికునిగానుండెను. అప్పుడాయన తన జన్మ స్థలమును విడిచి అరణ్యమునకు వెళ్ళెను. ఆయన కేవలము గుహలోనే పదిహేను సంవత్సరములుండెను. ఆ తరువాత ఆయన ఇంకా అడవుల్లోనికి వెళ్ళి పర్వతము దగ్గర పాడైన కోటలో ఇరవై సంవత్సరాలు నివసించెను. ఆ కొండ దగ్గర ఓ నీటి బుగ్గయూ ఉండెను. ఆయన మొక్కజొన్న పెంచి దానితో రొట్టె తయారు చేసుకునేవాడు. ఒక పూట భోజనం మాత్రమే ఆయన చేసెడివాడు, కొన్నిసార్లు అనేక దినములు ఉపవాసముండే వాడు. ఆయనకు పరుపు లేక తలదిండు లేక దుప్పటి లేక రాతినేలపై పండుకునేవాడు. గొఱ్ఱె చర్మమే ఆయన వస్త్రములు.

ఆంథోని ఇవన్నీ ఎందుకు చేసెను? ఆయన అటువంటి పేదరికమందు ఎందుకు జీవించెను? పేదరికంలో మరియు ఒంటరిగానుంటూ ప్రభువును అధికముగా సేవింపవచ్చునని ఆయన అభిప్రాయము. ఈ విధముగానుంటే తక్కువ పాపము చేతుమని ఆయన



అభిప్రాయము మరియు... ప్రభువునకు చేరువ కావచ్చును. ఇది ఆయన హృదయాభిలాష ఆయన ప్రభువునెంతో ప్రియముగా ప్రేమించెను గనుక అంతయూ, తీవ్రముగా తీసికొనెను. అయిననూ ఆంథోని హృదయము పాపాత్మకమని మరచెను. ఎందుకంటే ఆయన ఎక్కడికెళ్ళిననూ ఆయన హృదయము ఆయనతో వెళ్ళును.

ఆంథోని యొద్దకు తరచుగా చాలా మంది సందర్శకులు వచ్చేవారు. చాలామంది ఆయన పట్ల గౌరవము కలిగియుండేవారు. ఓ సెయింట్ (పరిశుద్ధుడు) గా గౌరవించేవారు. ఆయన అంతటి జ్ఞాని గనుక వారు ఆయన సలహాలకై వెంటపడేవారు. ఆయన జీవితకాలములో రెండుమార్లు కొద్దికాలము మట్టుకు అలెగ్జాండ్రియా పట్టణమునకు వచ్చెను.



మొదట హింసకాలమున వచ్చెను. ఖచ్చితముగా ఆ సమయములోనే ఆయన ఎందుకు వచ్చెను? ఆయన ఎందుకు శ్రమ తీసికొనెను? అంథోని హతసాక్షి కాదలచెను అందుకే ఆయన నేను క్రైస్తవుడనని బహిరంగముగా చెప్పెను. దీనికి అన్యులు ఆశ్చర్యపడి, ఈయనకు పిచ్చిపట్టినది వదలివేయుమనిరి....

గనుక అంథోని మరొక్కమారు తన ఒంటరి జీవితమును మరలిపోయెను. ఏరియస్ మరియు అతనేషియస్‌ల మధ్య వివాదము విపరీతముగానున్నపుడు రెండవ మారు పట్టణమును ఆయన దర్శించెను, అంథోని అతనేషియస్‌ను బహుగా బలపరచెను. ఏరియస్ దుర్బోధల విషయమై ఆయన ప్రజలను హెచ్చరించెను. ఈ సమయంలో అనేకులు మార్చబడిరి. అంథోని యొక్కబోధలు నిజముగా ప్రభువుచే ఆశీర్వదింపబడెను. అతడు తిరిగి అరణ్యమునకు వెళ్ళి మరణించు వరకు అక్కడే వుండెను. నూట ఐదు సంవత్సరాలకు అతడు మరణించెను.

వేలకొలది ప్రజలు అంథోని మాదిరిని అనుసరించి, ఆ ఏకాంత స్థలములకు వెళ్ళిరి. అనేకులు ఆంథోనికంటే కఠిన విధానము ననుసరించిరి. కొందరు వారి దేహములను హింసించుకొనిరి. కొరడాలతో తమ్మునుతాము కొట్టుకొనిరి. ఇతరులు చెప్పనలవికాని దాహమును భరిస్తూ మండుతున్న ఏడారి ఇసుకలో గంటల తరబడి వట్టి కాళ్ళతో నడిచేవారు. మరికొందరు సన్యాసులు "స్తంభ సన్యాసులు"గా మారిరి. ఎత్తైన స్తంభము మీద ఓ చిన్న అరుగు కడితే, నీలాకాశము క్రింద ఆ అరుగుమీద చాలా సంవత్సరములు సన్యాసి జీవించేవాడు. అట్టి ఒక సన్యాసి ముప్పది సంవత్సరములు జీవించెను! గంపకు తాడు కట్టి దానిలో ఆహారమునుంచి దాని సహాయముతో స్తంభముపైకి ఆహారము పంపెడివారు. ఆ స్తంభము మీద కూర్చుండుట ద్వారా వారు పరలోకమునకు సమీపముగానున్నట్లు ఈ సన్యాసులు భావించేవారు. అలా చేయుట వలన వారి రక్షణను వారు సంపాదించుకోవచ్చునని చాలా మంది సన్యాసులు భావించిరి. ఇది చాలా ఘోరపొరపాటు.

19. సన్యాసులు మరియు సన్యాస ఆశ్రమములు

ఓ సమూహముగా జీవించుటకై సన్యాసులు వెళ్ళిరి. మొదట వారి గుడిసెలచుట్టూ రాతిగోడను కట్టిరి. అటుపిమ్మట విశాల భవనములు కట్టబడెను. ఇవి సన్యాస ఆశ్రమములుగా పిలువబడెను మరియు సన్యాసులు అచ్చట నివసించుటకై వెళ్ళిరి. సన్యాస ఆశ్రమములలో నివసించువారిని సన్యాసులని అందుము.


మొదట సన్యాస ఆశ్రమములు ఐగుప్తునందు స్థాపింపబడెను. కాని చాలాకాలము గడవకమునుపే రోమా సామ్రాజ్యములోని ఇతర అనేక దేశములలో ఇంకా ఎన్నో కట్టబడెను. క్రైస్తవ సంఘములలో లోక సంబంధ సంగతులు చోటుచేసుకుంటున్నందున వారు సమాజమునకు దూరముగా వెళ్ళి నివసించిరి. సంఘ సభ్యులలో అనేకులు లోకసంబంధ జీవితము జీవించుచున్నారు.

సన్యాసులు సాధ్యమైనంతవరకు దేవుని గూర్చి మరియు ఆయనచేయు క్రియలను గూర్చి ఆలోచిస్తూ సమయము గడిపేవారు. ఆశ్రమములో నివసించుట ద్వారా తక్కువ పాపము చేయుదుమని వారు తలంచే వారు. ఎందుకంటే ఆశ్రమమునకు వెలుపల అంటే లోకములో తప్పులు చేయుటకు చాలా అవకాశములున్నవి.

వారి హృదయములలో ఇంకనూ పాపము లోతుగా కూరుకొనియున్నందున సన్యాసులు దానిని జయింపవలెనని కోరుకొనిరి. అందుకే వారు తరచుగా ఉపవాసముంటూ, ప్రార్థనలు వల్లిస్తూ, నిద్రను మాని జీవిస్తుండేవారు. ఇంకా కొన్నిసార్లు వారు తమ దేహములను కొరడాలతో రక్తము కారునంతగా కొట్టుకొని శిక్షించుకునేవారు. దేవుడు వారికి పాపక్షమాపణను దయ చేయులాగున ఆయనను ఒత్తిడి చేస్తూ తమను తాము హింసించుకునేవారు. వారి స్వంత ప్రయత్నములు మరియు శ్రమలద్వారా రక్షణ సంపాదించుకొందుమని వారిలో అనేకులు భావించేవారు. వారి స్వంతక్రియల ద్వారా రక్షణను మరియు దేవునితో సమాధానమును పొందవచ్చునని వారు తలంచిరి. ఏది ఏమైనా క్రీస్తు యోగ్యతద్వారా మాత్రమే సమాధానము మరియు రక్షణ పొందగలమని బైబిల్ స్పష్టముగా బోధించుచున్నది.


సన్యాస ఆశ్రమము చేరగోరువారు ఎవరైనా శపథము చేయవలెను. అతడు ఎన్నటికిని ఆశ్రమమును వీడనని, పేదరికములో జీవించి, స్వచ్ఛముగా బ్రతికెదనని వాగ్దానము చేయవలెను. దీనికర్థము అతడు ఆస్తిపాస్తులను మరియు స్త్రీ సాంగత్యమును విడువవలెను. వివాహము ఖచ్చితముగా నిషేధింపబడెను.

సన్యాస ఆశ్రమ అధిపతికి అన్నివిషయములలో లోబడియుండుట, ఆశ్రమ నియమ నిబంధనలకు కట్టుబడియుండుట అతిప్రాముఖ్యమైన ఆజ్ఞ. ఆశ్రమములన్నిటికి ఒకే నియమ నిబంధనలుండవు. దాదాపు కొన్ని నియమాలైనా ఒకే విధంగా కలిగియున్నవారు



ఒక ఆర్డర్‌గా తయారగుదురు. ఉదాహరణకు బెనెడిక్టిన్ ఆర్డర్ చాలా ప్రసిద్ధినొందినది. అది రోమా నగరమునకు సమీపముగానున్న సన్యాసి ఆశ్రమము, దానికి బెనెడిక్ట్ అధిపతిగా నుండెను. అందుకే దానికి బెనెడిక్ట్‌న్ ఆర్డర్ అని పేరు పెట్టబడెను. ఆయన ఆర్డర్‌లో మూడువందలకంటే పైబడిన ఆశ్రమములు చేర్చబడెను.

నిబంధనలు తరచుగా చాలా కఠినముగానుండెను. వాటిలో ఉదాహరణకు, ప్రార్థన మరియు బైబిల్ చదువుట, భోజన సమయము, వస్త్రధారణ, అనుదిన పనులు వీటన్నిటికి సంబంధించినవిగానుండెను. అతి త్వరలోనే స్త్రీలకునూ ఆశ్రమములు ప్రారంభింపబడెను. పురుష సన్యాసులను మాంక్స్ అని స్త్రీ సన్యాసులను (నన్స్) మఠకన్యకలని పిలిచేవారు. సన్యాసులు మరియు మఠకన్యకలు సన్యాస ఆశ్రమములలో చాలాచక్కటి పనులు చేసెడివారు. కొందరు సన్యాసులు బైబిల్ ప్రాతపతులను తయారు చేస్తే మరికొందరు మంచి గ్రంథములను వ్రాసెడివారు. (అప్పట్లో ఇంకనూ ముద్రణాయంత్రము కనుగొనబడలేదు). తక్కిన వారు పగలంతయూ పొలములో పనిచేసెడివారు. వారు బంజరు భూములను సహితము వ్యవసాయయోగ్యముగా మార్చిరి. ఆశ్రమ తోటలలో ఔషధ మొక్కలను పెంచెడివారు. వాటితో మందులు తయారు చేసెడివారు. సన్యాసులు ఎంతో దూర ప్రయాణము సహితము చేసి వ్యాధితో ఉన్నవారిని మరియు వికలాంగులను దర్శించెడివారు. వారికి సాధ్యమైనంతలో సహాయము చేసే ప్రయత్నము చేసిరి. కొందరు సన్యాసులు వైద్యశాస్త్రము చదివి నిపుణులైన వైద్యులుగా మారిరి. వారు ఎంతోమంది రోగగ్రస్తులకు తరచుగా దీవెనకరముగా నుండిరి. మరికొందరు ఆశ్రమ పాఠశాలలకు హాజరయ్యే వారికి చదువుట, వ్రాయుట మరియు అంకగణితశాస్త్రము నేర్పి ఉపాధ్యాయులుగా మారిరి. సన్యాసులలో కొందరు మిషనరీలుగా మారిరి.



వారు తరచుగా నశించు లోకమునకు సువార్త ప్రకటించుటకై ఎంతో దూరము ప్రయాణము చేసి వెళ్ళిడివారు. ఇట్టి మిషనరీలను గూర్చి తరువాత ఎక్కువగా చదివెదము.


మఠములు అవసరతలోనున్న వారికి ఆశ్రయముగా నుండెను. సహాయము ఆదరణ కోరువారు సన్యాసులను, మఠకన్యకలను ఆశ్రయించెడివారు. వారి ఆతిథ్యముద్వారా అనేకులు మేలుపొందిరి. బానిసలు క్రూరులైన యజమానులనుండి విడుదల చేయబడుటకై సన్యాసులు వెలచెల్లించిరి. సన్యాసులు మరియు మఠకన్యకల యొక్క కార్యములు ఎంత మంచివైనా, అట్టి సన్యాస జీవితము అట్టి భావన బైబిల్ పరమైనది కాదని మనము తిరస్కరింపవలెను. సన్యాసులు మఠకన్యకలు లోక సంబంధ జీవితమునకు వేరై బ్రతికెడి వారు, కాని దేవుని కృపను వారి ద్వారా ప్రసరింపజేస్తూ, జ్యోతులవలె ప్రకాశింపవలెనని ప్రభువు తన వాక్యమందు సెలవిచ్చుచున్నాడు. అప్పుడు బహుశ ఇతరులు తన బిడ్డల సత్‌క్రియలను చూచి దేవుని వైపు తిరుగవచ్చును!

20. ధీరుడైన బిషప్ ఆంబ్రోస్

అది క్రీ.శ. 374 ఉత్తర ఇటలీలోని మిలన్ అను అందమైన నగర మందు ఎంతో అలజడి నెలకొనియుండెను. బిషప్ మరణించెను. క్రొత్త బిషప్‌ను ఎన్నుకొనవలసియుండెను. ఆయన ఏరియస్ అయియుంటాడా? లేదా అతనేషియస్ అనుచరుడైయుంటాడా? పోరాటము ఎంత తీవ్రముగా ఉందంటే స్వయాన గవర్నర్ సైన్య సమూహముతో సంఘమునకు వెళ్ళవలసివచ్చెను. చక్రవర్తి తరపున వచ్చిన ఆంబ్రోస్ శాంతిభద్రతల విషయమై బాధ్యుడైయుండి విచారము గలవాడై నిలిచెను. ఆయన స్వయాన క్రైస్తవుడైయుండి క్రైస్తవులు ఒకరితో ఒకరు పోట్లాడుకొనుట చూచి ఎంతో బాధపడెను. ఆయన క్రైస్తవుడుగానుండెను కాని అటు సంఘసభ్యత్వం గాని బాప్తిస్మంగాని పుచ్చుకొనియుండలేదు. చాలాకాలమువరకు ఆంబ్రోస్ క్రైస్తవుడని ప్రతియొక్కరు ఎరిగి యుండిరి. ఆయన యధార్థవంతుడైయుండి కనికరము గలవానిగా నుండెను. ఆయన మిలన్‌లో ప్రేమింపబడి ఎంతో గౌరవింపబడినవానిగా నుండెను. ఆయన సంఘములో ప్రవేశింపగానే, అంతయూ సద్దుమణిగెను. ఆయన మాట్లాడటం ప్రారంభింపగానే ప్రతియొక్కరు శ్రద్ధగా వినుట ప్రారంభంచిరి. పోట్లాడుట మానమని ఈయన వారిని హెచ్చరించెను, ఎందుకంటే అట్టి పరిస్థితిలో దేవుని దీవెనలు ఆశించుట అసాధ్యము. ఆంబ్రోస్ ఓ మంచి ఉపన్యాసకుడు గతములో ఈయన న్యాయవాదిగా నుండెను. ఈయన మాటలు ప్రజలపై చెరగని ముద్ర వేసెను. ఉన్నట్టుండి స్పష్టమైన స్వరము సంఘమునందంతట మ్రోగెను. (అది ఓ పిల్లవాని స్వరమని కొందరనిరి) కొందరెవరో "ఆంబ్రోస్ బిషప్" అని చాలా బిగ్గరగా అరచిరి. అది విని ఆంబ్రోస్ నిర్ఘాంతపోయెను. ఒక్క క్షణము పాటు ఆయన ఏదియూ మాట్లాడలేదు. "ఆంబ్రోస్ బిషప్, ఆంబ్రోస్ బిషప్" అని అంతటా ఒకే మాటగా కేకలు వినబడెను. ప్రతియొక్కరు ఏరియన్స్, అతనేషియస్ అనుచరులని బేధములేక అందరు కలసి అలా కేక వేసి కోరిరి. అయితే ఆంబ్రోస్? "కాదు, కుదరదు అని ఆంబ్రోస్ తల ఊపెను. "ఇది అసాధ్యము" కాని "ఆంబ్రోస్ మా బిషప్" అని ప్రజలు అరచిరి.

ఆయన వారినుండి తప్పించుకొనలేక పోయెను. ఆవిషయమై ఆలోచిస్తానని వాగ్దానము చేశాక మాత్రమే ఈయన తన స్థలమునకు చేరుకొనెను. కాని ఆంబ్రోస్ దీనిని తన మనసునుండి తీసివేయలేకపోయెను. ప్రజల కేకలలో ఆయన దేవుని స్వరమును వినెను! ఆయన ఇక ఏ మాత్రమునూ తిరస్కరింపలేకపోయెను. ఆంబ్రోస్‌నకు బాప్తిస్మమీయబడెను. లాంఛన ప్రాయముగా ఆయన విశ్వాస ఒప్పుకోలుచేసెను మరియు ఎనిమిది దినముల పిమ్మట ఆయన మిలన్ బిషప్‌గా నియమితుడాయెను. నమ్మకమైన సంఘకాపరివలె ఈయన ఇరవై అయిదు సంవత్సరముల పాటు సంఘమునకు సేవచేసెను. ఈయన వరముగల బోధకుడు మరియు ప్రవక్త. ఈయన బోధవినుటకై అనేకులు వచ్చేడివారు. కాని దానికంటే ప్రాముఖ్యమైనదేమిటంటే, అనేకులను మార్చుటకై ప్రభువు తన బోధనువాడుకొనెను.

ఆంబ్రోస్ ఖచ్చితముగా అతనేషియస్ పక్షముననుండుటకు నిశ్చయించుకొనెను. ఈయన తన జీవితకాలమంతయూ హితబోధ నిమిత్తమై పోరాడెను. మిలన్‌లోని సంఘములన్నిటిలో ఆరోగ్యదాయక బోధలు మాత్రమే బోధింపబడవలెను. కాని ఏరియన్స్ ఇష్టపడలేదు. వారికిని ఒక సంఘము అవసరమాయెను! కాని ఆంబ్రోస్ ఆ భావనకు చెవినీయలేదు...! చక్రవర్తి తల్లి ఏరియన్స్‌గా నుంటుండగా వారికి సహాయముచేయుమని వారు ఆవిడను ఆశ్రయించిరి. ఎక్కడైతే ఆంబ్రోస్ బోధిస్తున్నాడో ఆక్షణమందే సైన్య సమూహము వెళ్ళి ఆ సంఘమును ఆక్రమించుకొనుమని ఆవిడ ఆజ్ఞాపించెను. సైనికులు ఆ భవనములో ప్రవేశింపగా ఎంతో అలజడి చెలరేగెను! ఆంబ్రోస్ ఎంతో తీవ్రముగా అత్యాసక్తితో బోధించుచుండెను. సైనికులు ఎలా స్పందించనైయున్నారు?



ప్రసంగము ముగిశాక "మేమిక్కడ పోట్లాడుటకు రాలేదు గాని, కలసి ప్రార్థించుకొనుటకై వచ్చామని" వారు చెప్పిరి. దేవుని వాక్య బోధ వెనుక అంతటి శక్తియుండెను! థెస్సలోనిక నగరములో అల్లరి చెలరేగెను. చక్రవర్తి సేవకులలో చాలామంది ఆ అలజడి మధ్యన చంపివేయబడి వీధులగుండా ఈడ్వబడిరి! థియోడాసియస్ అను చక్రవర్తి ఉగ్రుడైయున్నాడు. చక్రవర్తి చాలా ఘోరమైన కోపముగలవాడని తెలిసియూ ఆమాయక ప్రజలను శిక్షింపవద్ధని ఆంబ్రోస్ చక్రవర్తిని హెచ్చరించెను. అలా చేయనని చక్రవర్తి మాట ఇచ్చెను. కాని ఆమాట అలా ఉన్నా ఘోరసంగతులు సంభవించెను. చక్రవర్తి సైనికులు నగరవాసులను వధించిరి. ఈఘోర వధలో ఏడు వేలమంది ఊచకోతకోయబడిరి!

కొంతకాలము పిదప చక్రవర్తి మిలన్‌కు తిరిగివచ్చెను. ఇక్కడే ఆయన నివసిస్తూ క్రమముగా సంఘమునకు హాజరగుచుండెను. చక్రవర్తి మామూలుగా సంఘమునకు వెళ్తూ ప్రభురాత్రి భోజనము నందు పాల్గొనుచుండెను. కాని ఆయన అనేకులను హతము చేసెను గనుక అందులో పాల్గొనుటకు ఆంబ్రోస్ నిరాకరించెను! చక్రవర్తినే ఎదిరించటమా...? అంటే ప్రాణమును పోగొట్టుకొనుటయే....? ఆయన ఎంత ధైర్యమున్న బిషప్! సంతోషకరమైన సంగతేమనగా చక్రవర్తి కోపగించుకోలేదు గాని తనను క్షమించుమని కోరెను. ఆయన దోషమును దేవుని యెదుటను మనుషుల యెదుటను ఒప్పుకొనవలెనని ఆయన ఆశించెను. సమాజమంతటి ఎదుట ఖచ్చితముగా అదే పనిని ఈయన చేసెను. ఇప్పుడు ఆయన పాపక్షమాపణకు సూచనగా రొట్టెను పుచ్చుకొనెను. అందరూ సంతోషించిరి మరియు అందరికంటే ఎక్కువగా బిషప్ ఆంబ్రోస్ సంతసించెను.

21. అగస్టీన్ - (క్రీ.శ. 354-430) (1)

అగస్టీన్ ఉత్తర ఆఫ్రికాలో తగస్టి అను పట్టణములో క్రీ.శ. 354లో జన్మించెను. తగస్టి కార్తేజ్ అను ప్రాచీన నగర సమీపమున ఉండెను. అగస్టీన్ తల్లి మోనికా మరియు అతని తండ్రి పాట్రిసియస్. వారి వివాహ ప్రారంభములో మోనికకు పరిస్థితులు అంత సవ్యముగా లేకుండెను. పాట్రిసియస్ కఠిన హృదయుడై కోపగ్రస్తుడైయుండెను. ఏదిఏమైనా మోనిక ప్రభువునకు భయపడి తన ప్రేమ, సమర్పణ కారణాన ఆమె అనేక సంగతులను సాధించెను.

తరువాత సంవత్సరములలో తన తల్లిని గూర్చి అగస్టీన్ ఇలా చెప్పెను. "పోరాటము మరియు విబేధములున్న పరిస్థితులలో శాంతిని తీసుకొనివచ్చే వరమును ప్రభువు ఆవిడకు అనుగ్రహించెను". అగస్టీన్ పెద్దవాడవుతుండగా తప్పు ఒప్పులను గూర్చి పట్టించుకొనకుండా చాలా కఠినస్తుడాయెను.

అతడు తన స్నేహితులతో అటూ ఇటూ తిరుగుటకు ఇష్టపడేవాడు. వారందరు కలసి చెట్లనుండి పండ్లు దొంగిలించి వారి చెడు ప్రవర్తన ద్వారా యజమానులకు చికాకు కలిగించేవారు. పాఠశాలలో ఉంటుండగా తన ఉపాధ్యాయుల00ను భయపెట్టేవాడు మరియు ఇంటిదగ్గర తన తల్లిదండ్రులనుండి వస్తువులను దొంగిలించేవాడు... అతని తండ్రియైన పాట్రీసియస్, అగస్టీన్ చెడు ప్రవర్తన చూసి ఊరకే నవ్వేవాడు. అతని తల్లి, వాటన్నిటి విషయమై కన్నీరు కారుస్తూ చాలా బాధపడేది. బైబిల్ పాఠములు ఆమె నేర్పెడిది, సత్యోపదేశ తరగతులకు తనను పంపుచుండెను. కాని అగస్టీన్ శ్రద్ధ అస్సలు చూపేవాడు కాదు. తన పాపాత్మ జీవితమందు కొనసాగుటకు ఇష్టపడేవాడు. మొదట అగస్టీన్ చదువులలో శ్రద్ధలేకయుండెను, కాని తరువాత పరిస్థితి మారెను. మొదట అతని తగస్టిలో పాఠశాలలకు వెళ్ళి తరువాత కార్తేజ్‌లోని కళాశాలలకు వెళ్ళెను. అగస్టీన్ తెలివిగల యౌవనస్థుడని స్పష్టమాయెను. అతని ఉపన్యాస శాస్త్రమును మరియు న్యాయశాస్త్రమును చదివాడు. అతని భాష పట్ల సహజ భావనలు గలవాడు గనుక లాటిన్ పదసమూహములతో అందముగా కూర్పు చేసెడివాడు. కాని భక్తిహీన నగరమైన కార్తేజ్‌లో పూర్తిగా తన పాపజీవితమును ఆనందించెను. అక్కడ అతని యొక్క అనైతిక, నిర్లక్ష్య జీవితమును గూర్చి ఆమె వినినపుడు చాలా నిర్ఘాంతపోయెను. అతని ఇంటికి వచ్చినపుడు తన దుష్టజీవితమును విడువుమని విలపించి ప్రతిమాలుకొనెను. తన బిడ్డను విడిపించి రక్షింపుమని ఎన్నోసార్లు ఆమె దేవునితో ప్రార్థనలో పోరాడెడిది. కాని అదంతయూ వ్యర్థమయినట్లు అగుపించెను. తన తల్లి ఆకాంక్షను అగస్టీన్ ఏమాత్రమునూ లెక్కచేయలేదు.

పద్దెనిమిది సంవత్సరముల వయసులో అవివాహితుడైయుండి, అడియోడాటస్ అను అబ్బాయికి తండ్రియాయెను. అయిననూ తన హృదయములో ఏదో నెమ్మది లేకుండా చేయుచుండెను. ఈ పాపాత్మక



జీవితము నిశ్చయముగా తనకు సంతోషము నీయలేదు. ఆయన నిజ సంతోషమును ఎక్కడ కనుగొనగలడు? అన్య తాత్వికవేత్తలు వ్రాసిన గ్రంథములను అన్వేషిస్తూ చదివేవాడు. కాని అవి అన్నియు అందుబాటులో ఉండుటకు కాదు. అగస్టీన్ బైబిల్ కూడా చదివేవాడు. కాని ఆయన నిరుత్సాహపడ్డాడు. బైబిల్‌లోని భాష అన్యతత్వ శాస్త్ర గ్రంథములలో ఉన్న భాష అంత అందముగా ఉండెడిదికాదు. ఆయన ఇంకనూ అన్వేషిస్తూయుండెను. ఆయన మనికేయన్స్‌లో చేరెను. ఇది ఒక మత గుంపుగానుండెది. అది అన్యమతము మరియు క్రైస్తవ్యములయొక్క మిశ్రితముగానుండెను. కాని అగస్టీన్ అందులోనూ సంతోషమును కనుగొనలేదు.

కార్తేజ్‌లో ఉపన్యాస శాస్త్ర ఉపాధ్యాయుడాయెను. కాని ఆయన అక్కడ సంతోషించలేదు. అగస్టీన్ ప్రకారము, ఆయన విద్యార్థులు ఆయనకంటే ఘోరముగా ప్రవర్తించేవారు. అగస్టీన్ మధ్యధరా సముద్రము దాటి ప్రముఖ నగరమైన రోమా పట్టణమును దర్శించాలని కోరెను. బహుశ అక్కడ, అతను గౌరవము నొందిన వ్యక్తిగా మరియు ప్రసంగీకునిగా కాగలడు. ఆయన తన ప్రణాళికలను తన తల్లితో చెప్పలేదు. కాని తన ఓడ రోమానగరమునకు బయలుదేరి తీరముదాటి పోయినా తన తల్లిమాత్రము తీరమున నిలువబడి చూస్తూఉండెను. కాని... ఆయనకు వీడ్కోలు పలుకులు ఆలస్యముగా వచ్చెను ఓడ తీరముదాటెను. మోనిక చాలా విచారపడెను! ఆగస్టీన్ రోమ్‌లో చాలా కాలముండలేదు, ఆయన అక్కడ చాలినంత డబ్బు సంపాదించలేకపోయెను. అతి త్వరలో ఆయన మిలన్ నగరముచేరి అక్కడ సన్యాస శాస్త్రమునకు ఉపాధ్యాయుడాయెను. గత అధ్యాయములో చూచిన విధముగా, మిలన్‌లో ఆంబ్రోస్ బిషప్‌గా ఆయెను. సహజముగా, ఆంబ్రోస్ హృదయములను దోచుకొనే ప్రసంగికుడిగా! ఆయన ఉపన్యాసము వినాలని అగస్టీన్ చాలా ఆశపడెను. ఆంబ్రోస్ యొక్క పలుకులు జాగ్రత్తగా వినాలని ప్రతి ఆదివారము అగస్టీన్ సంఘమునకు వెళ్ళెడివాడు. మొదట ఆయన ఆంబ్రోస్ ఉపన్యాసశైలిలో శ్రద్ద చూపినా, అతి త్వరలోనే దేవుని వాక్యమునుండి ఆయన బోధిస్తున్న సందేశ విషయములలో ఆసక్తి చూపెను. బైబిల్ ఓ సాధారణ గ్రంథమేనని ఎల్లప్పుడు భావించినా అగస్టీన్ ఎంతో ముగ్ధడయ్యెను. తన కుమారుడు క్రమముగా సంఘమునకు హాజరవుతున్నాడని విన్నప్పుడు మోనిక చాలా సంతోషించెను. కాని మోనిక ఆఫ్రికాలో నివసించుట లేదా? లేదు. ఆమె అక్కడ ఇక ఏమాత్రము నివసించుట లేదు. ఆమె ఇప్పుడు అగస్టీన్‌తో పాటు నగరమునకు వచ్చి మిలన్‌లో నివసించుచున్నది. మోనిక తన కుమారుని విడిచి ఉండలేకపోయెను...! తన కుమారుని విషయమై ఎంతో బాధ చింత ఉంటే వాట న్నిటిని గూర్చి బిషప్‌తో మాట్లాడుటకై ఒక దినాన మోనిక ఆయన దగ్గరకు వెళ్ళెను. తన పోరాటము, ప్రార్థన ఇబ్బందులన్ని ఆయనతో చెప్పెను. ఈ దేవుని సేవకుని యెదుట తన హృదయమును క్రుమ్మరించెను. ఆమె వెళ్ళిపోబోతుండగా "అమ్మా, ఓదార్పునొందుము, అటువంటి ప్రార్థనల యొక్క బిడ్డను ఎన్నటికిని కోల్పోవు" అని బిషప్ తనతో చెప్పెను.



22. అగస్టీన్ -2

అగస్టీన్ హృదయములో పోరాటము జరుగుచుండెను. ఆంబ్రోస్ ప్రసంగముల ఫలితముగా తన పాపజీవితమును ముగించాలని, బేషరతుగా తన జీవితమును ప్రభువునకు సమర్పించుకోవాలని గ్రహించెను. హృదయములో నిజ సమాధానము కలిగియుండాలంటే ఇదే ఏకైక మార్గము! తనపై పాపజీవితము అంతటి అదుపు కలిగియుండెను. గనుక అగస్టీన్ తన పాపజీవితమును విడిచిపెట్టుట అసాధ్యమని గ్రహించెను. అతను తనంతట తాను బంధింపబడినట్టుగా భావించెను. పాపమునుండి తనను తాను విడిపించుకొనజాలడు. ముఖ్యముగా అతను బైబిల్‌ను చదివినపుడు తన అంతరంగ పోరాటము తీవ్రమాయెను. "ఓయీ నిద్రబోతా లెమ్ము...." అను పదములు చదివెను. "అవును ప్రభువా" "కాని ఇప్పుడే కాదు, ఎప్పుడైనా వీలుపడినపుడు" అని అగస్టీన్ జవాబిచ్చెను.


తన మిత్రుడైన అలిపియస్ తనను దర్శించెను. లోకమునకు స్వస్తిచెప్పిన సన్యాసుల జీవితమును గూర్చి ఆయన అగస్టీన్‌తో చెప్పెను. "అయ్యా" చాలా విద్యావంతులైనవారు శరీరకోర్కెలలో మునిగి తేలుతుంటే ఈ సాధారణ ప్రజలు పరలోకములో చేరెదరు." ఇదంతా ఆయనకు ఎక్కువ అనిపించెను. అగస్టీన్ ఇకను ఇంటిలో ఉండలేక పోయెను. అంజూర చెట్టుక్రిందపడి తోటలో ఏడ్చుచుండెను. "ఓ ప్రభువా ఇది ఎంతకాలము ఉండును' ' అని అరచెను. అగస్టీన్ విసిగిపోయెను.

అకస్మాత్తుగా ప్రక్కనే ఒక ఇంటిలో ఒక పిల్లవాని కేక వినెను. "టోల్లి లెగె" "తీసికుని చదువుము", ఆ పిల్లవాడు పాడెను. "అగస్టీన్ చదువుము చదువుము" అని దేవుడే చెప్పినట్లు ఉండెను ఆ కేక. తన మిత్రుడు కూర్చున్న దగ్గరకు అగస్టీన్ తిరిగి వచ్చి అక్కడ ఉన్న బైబిల్ తీసికొనెను. రోమా 13:13,14 "అల్లరితో కూడిన ఆట పాటలైనను మత్తయినను లేకయు, కామవిలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు, పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము. మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనినవారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీరము విషయమై ఆలోచన చేసికొనకుడి", అని చదివెను.

అగస్టీన్ ఇక ముందుకెళ్ళి చదువనవసరములేదు. జరిగిన దానిని తరువాత ఆయనే వర్ణించెను "అకస్మాత్తుగా నిజ శాంతి అనువెలుగు నా హృదయములో ప్రసరించి చీకటి మరియు సందేహము పారిపోయెను". గనుక ప్రభువైన యేసు ఈ పాపిని పాప శక్తినుండి రక్షించి అతని పాపములన్నియూ క్షమించెను. తన పాపము కొరకై వెల చెల్లించిన ప్రభువైన యేసు నీతి ద్వారా తన ఆత్మయందు అగస్టీన్ నిజశాంతిని కనుగొనెను.

అగస్టీన్ త్వరగా తన తల్లియొద్దకు వెళ్ళి ఈ శుభవార్త చెప్పెను. ఆమెకు ఎంత సంతోషము! దేవుడు ఆవిడ ప్రార్థనలకు జవాబిచ్చెను! మిలన్ దగ్గర ఉన్న ప్రాంతమునకు మోనిక మరియు అగస్టీన్ వెళ్ళి నివసించిరి. ఇక్కడ ప్రార్థన మరియు అధ్యయనము ద్వారా బాప్తిస్మము కొరకై సిద్ధపడెను.

ఒక సంవత్సరము తర్వాత అగస్టీన్ బాప్తిస్మము తీసికొనెను. ఈస్టర్ సమయంలో ఆంబ్రోస్, అగస్టీన్‌కు, పదిహేను సంవత్సరములు గల తన కుమారుడైన అడియోడేటస్‌కు మరియు అతని మిత్రుడైన అలీసియస్ అను ముగ్గురికి బాప్తిస్మమిచ్చెను. మోనిక అక్కడే ఉంటూ అది చూసి సంతోషముతో కన్నీళ్ళు కార్చెను. ఆఫ్రికాలోని తగస్టి వెళ్ళాలని అక్కడ ప్రభువు సేవచేయాలని అగస్టీన్ ఆశపడెను. తన తల్లి ఆయనతో వెళ్ళుటకు సిద్ధపడెను. కాని పరిస్థితులు తారుమారాయెను. ఆఫ్రికాకు వెళ్ళు నావను వెతుకుతు వారు తీరమునకు వెళ్ళగా, మోనిక అనారోగ్యముపాలాయెను. తను చాలా కాలము బ్రతుకనని గ్రహించి ప్రభువుతో ఉండుటకై ఆశపడెను. తన కుమారుని మార్పు నిమిత్తమై ఆమె ఎంతగానో ఆరాటపడెను. ఆయన మారెను గనుక వెడలిపోవుటకై ఆమె సిద్ధముగానున్నది. తల్లి కుమారులు ఒకరికొకరు వీడ్కోలు పలికిరి. పాపము



ప్రవేశింపని పరలోకము ఎడబాపలేని ఆ పరలోకములోని మహిమాన్విత జీవితమును గూర్చి ఇరువురు కాసేపు మాట్లాడుకొనిరి. మోనిక మరణించగా ఆవిడ ఇటలీలో పాతిపెట్టబడెను. అగస్టీన్ మరియు తన కుమారుడు ఆఫ్రికాకు ప్రయాణమైరి.

అగస్టీన్ ఆఫ్రికాకు వెళ్ళినప్పుడు కార్తేజ్ సమీపమున ఉన్న స్థలములో కొద్దిమంది మిత్రులతో మూడేండ్ల పాటు ప్రశాంతముగా ఏకాంత జీవితము జీవించెను. అతను అధిక సమయమును బైబిల్ అధ్యయనములో గడిపెను గనుక ఈ సంవత్సరములు అగస్టీన్‌కు ఎంతో ఉపయోగకరముగా ఉండెను. ఆయన జీవితములో చివరి వరకును దేవుని వాక్యమును ప్రేమించెను.

కొద్ది సంవత్సరముల తర్వాత తన కుమారుడు మరణించెను. ఇప్పుడు అగస్టీన్ జీవితములో అంతా సద్దుమణిగెను. కాని చాలా కాలము కాదు. ప్రభువు ఆయన నిమిత్తమై ఎంతో పని కలిగియున్నాడు! హిప్పో రీజియస్‌లో అగస్టీన్ సంఘమునకు హాజరైనపుడు, తనకు ప్రసంగము, పరిచర్యలో సహాయపడుటకై ఒక ప్రెస్‌బిటర్‌గా కావాలని వృద్ధుడైన బిషప్‌గారు కోరిరి. వెంటనే, సంఘములోవున్న వారందరు కలిసిగట్టుగా అగస్టీన్ మాకు అగస్టీన్ ప్రెస్‌బిటర్‌గా కావలని కేకలు వేసిరి కాని అగస్టీన్ దానిని తిరస్కరించెను. కాని ప్రజలు పట్టుబట్టిరి. అగస్టీన్ కన్నీళ్ళతో దానికి ఒప్పుకొనెను. ప్రెస్‌బిటర్‌గా నియమింపబడెను. ఐదు సంవత్సరముల తరువాత ఆయన బిషప్ ఆయెను. తను మరణించువరకు అనగా ముప్పై ఐదు సంవత్సములు ఆ నగరమునకు బిషప్‌గా ఉండెను!

23. అగస్టీన్ - 3

బిషప్ అగస్టీన్ చాలా బిజీగా ఉన్నాడు. అతను చేయవలసిన పనులు చాలా ఉన్నవి. అన్నిటికంటే ముందు, సహజముగా ప్రసంగించే పనియున్నది. ఆయన తన సంఘములో అనేక ప్రసంగములు బోధించుటయేగాక ఇతర సంఘములలో కూడా బోధించేవాడు. ప్రజలు ఆయన ప్రసంగములు వింటూ ఆనందించేవారు. ప్రసంగం కొనసాగుతుండగా సంఘమంతయూ నిలబడును మరియు వాక్యోపదేశకుడు కూర్చొనును. ప్రసంగం సంఘస్తులకు నచ్చెను. మరియు అవి గ్రహించుటకు సులువుగానుండెను. నేడు మనము ఇంకనూ చదువులాగున ఆయన ప్రసంగములలో అనేకము వ్రాయబడినవి, కాపీ చేయబడి చక్కగా భద్రపరచబడినవి.

కొన్ని ప్రసంగములు చాలా క్లుప్తముగాను మరికొన్ని సుధీర్ఘముగాను ఉండెను. ఆ దినములలో ప్రసంగమనేది ఓ గొప్ప సంఘటనగా నుండేది. ప్రజలు లోపలికి మరియు బయటికి వెళ్తూ వస్తుండేవారు. ప్రసంగ సమయంలో వారు సంఘములోనికి వస్తే, అగస్టీన్ అదివరకే చెప్పిన సంగతులను క్లుప్త సారాంశముగా చెప్పేవాడు. ప్రసంగ సమయంలో శ్రోతల గమనము చెదరినచో అగస్టీన్ తన ప్రసంగమును ఆపేవాడు. ప్రసంగ సమయంలో ప్రజలు తరుచుగా ఉన్నపళంగా కేరింతలు కొట్టి చేతులు చరచేవారు. కాని అగస్టీన్ దానికి బదులుగా పశ్చాత్తాప కన్నీళ్ళను కోరెను....

ప్రజల గుంపునకు అగస్టీన్ సత్యోపదేశ తరగతులు తీసుకునేవాడు. ఒక్కరికి కూడా ఎంతో సహనముతో ట్యూషన్స్ చెప్పి అనేకులకు సలహా సూచనలిచ్చేవాడు. ఆయన పండితుడైన వ్యక్తియగుటయే గాక ఆయన చాలా తెలివైనవాడు మరియు తలాంతుగల బిషప్, అనేక విషయములలో ఆయన సలహా సూచనలిచ్చేవాడు. ఆయన ప్రతిష్ఠ ఎంత దూరము వ్యాపించెనంటే దూరస్థలములనుండు ప్రజలనుండి ఉత్తరములు వచ్చుచుండెను. ప్రతిసారి కూడా ఆయన సుదీర్ఘ ప్రత్యుత్తరము వ్రాయుచుండెను. అనేక సమస్యలు జవాబుకై ఎదురుచూచుచున్నవి. వాస్తవమే వీటన్నిటికి చాలా సమయము పట్టును.



సంక్లిష్ట లౌకిక విషయములలో కూడా ప్రజలు ఆయనను సంప్రదించేవారు. ఉదాహరణకు, ఆస్తి పంపకంలో వాదన ఉంటే తనను తీర్పు ఇయ్యమని వారు అగస్టీన్‌ను అడిగేవారు. ఇట్టి విషయములలో చాలా జ్ఞానము అవసరమయ్యేది, బిషప్‌గానుంటూ అగస్టీన్ తన తుది తీర్పునిచ్చేవాడు! ఒక సందర్భమందు రోమ్‌నందలి బిషప్‌కు ఒక ఉత్తరమును సమకూర్చవలసివచ్చెను. ఆ లేఖ సిద్ధాంత చిక్కుతో కూడినది గనుక ఆ విషయమై సరిగా చూచుకొనుటకు అగస్టీన్‌కు చాలా సమయమవసరమాయెను. అందుకుగాను, ఐదు దినములపాటు తనను ఆటంక పరచవద్దని అనేక సమస్యలతో ఇబ్బంది పెట్టవద్దని తన సంఘముతో చెప్పెను. కాని తన ప్రణాళిక ఫలించలేదు. "కేవలము బలవంతంగా వారు నన్ను కలవ ప్రయత్నించిరి" అని ఆయనే చెప్పెను.

హిప్పోరీజియస్‌లో అగస్టీన్ ఓ సాధారణ ఆశ్రమం కలిగియున్నాడు. అందులో దేవుని సేవకై సమర్పించుకున్న యౌవనస్థులుండేవారు ఆశ్రమ జీవితం చాలా సరళముగానుండేలా అగస్టీన్ పరిపాలించెను. ఆయన స్వయాన మాదిరినుంచెను. ఆయన మామూలు ఆహారము తినేవాడు. ఎప్పుడైనా అతిథులు వారితో ఉంటే వారికి మాంసము వడ్డింపబడేది. ద్రాక్షరసము జాగ్రత్తగా కొలిచి ఇచ్చేవారు. వాస్తవానికి అగస్టీన్‌కి తినుటకై చాలా తక్కువ సమయము కలిగియుండెను. అవసరమునుబట్టి ఆయన ఉపవాసముండేవాడు.

తన యజమానుడైన ప్రభు యేసువలె అగస్టీన్ కూడా తన చుట్టూ ఉన్నవారిపట్ల కనికరము కలిగియుండెను. ఆయన తన గొఱ్ఱెలకై నిజ కాపరిగానుండెను, స్నేహపూర్వక మరియు కరుణా హృదయముగల వ్యక్తి, అవసరంలోనున్న ఎవరికైనా సహాయము చేయుటకు సిద్ధముగానుండెను. ఆయన విధవరాండ్రను, ఆనాథలను మరియు పేదలను పరామర్శించుటకు మరియు వారికి సేవచేయుటకు హృదయపూర్వకంగా సమర్పించుకొనియుండెను.

తన సంఘమును నడిపించుట అగస్టీన్‌కు అంత సులువైన పనేమికాదు. ఆఫ్రికా ప్రజలు ఎంతో కోపోద్రికులు. భక్తిహీనత మరియు అనైతికతో అన్య సంప్రదాయము చాలా బలముగా నుండెను. ఇట్టి కష్టముల విషయమై అగస్టీన్ పోరాడవలసి వచ్చెను.

అనేక వేదాంత అంశములపై ఆయన గ్రంథములు వ్రాసెను! అన్నియూ కలిపి ఆయన రెండు వందల యాభై గ్రంథములను వ్రాసెనని చెప్పబడెను! అతిశయముకాదు గాని, అన్ని తరములలోకెల్లా అగస్టీన్ అతి ప్రాముఖ్యమైన వేదాంతియని మనము చెప్పవచ్చును. తరువాత సంవత్సరములలో ఉదాహరణకు, కాల్విన్, అగస్టీన్ పుస్తకములను చదువుట కిష్టపడేవాడు. ప్రజలింకనూ వాటిని చదువుతూనే ఉన్నారు!

కన్‌ఫెష్షనెస్ అంటే కన్‌ఫెషన్స్, ఇది ఆయన వ్రాసిన ప్రముఖ పుస్తకము పేరు. ఈ పుస్తకము అంశముపై వ్యాఖ్యానిస్తూ, కన్‌ఫెషన్ (ఒప్పుకోలు) అంటే పాపపు ఒప్పుకోలు మాత్రమే కాదు గాని స్తుతి అర్పించుట. 'కన్‌ఫెషన్స్' గ్రంథమందు తన స్వంత జీవితములను గూర్చి ఒప్పుకోలు మరియు స్తుతి చూడవచ్చును. ఆయన చేసిన వాటిన్నిటిని గూర్చి అందులో ఆయన నిర్మొహమాటముగా వ్రాసెను. దేవుని యెదుట ఆయన పాపములన్నియూ ఒప్పుకొనెను. ఆయనను అద్భుతముగా దేవుడు విడిపించినందుకు అగస్టీన్ దేవుని స్తుతించెను!

తరచుగా దొర్లే సిద్ధాంత దోషములను గూర్చి అగస్టీన్ చాలా తీవ్రముగా ఖండించెను. ప్రధానముగా ఆయన పెలేజియస్ బోధనలు విషయమై ఆయన చాలా పోరాడవలసివచ్చెను. తరువాయి అధ్యాయమందు ఈ సమస్యలను గూర్చి మనము చదివెదము.

ప్రతి ఒక్కరునూ చాలా భయపడిరి. వాండల్స్ అనే ఘోర తెగ ప్రజలు రోమాసామ్రాజ్యములోని అనేక భాగములను జయించుచుండిరి. వారు హిప్పోకునూ ముట్టడివేసిరి. వారు హిప్పోనగర గోడలను చుట్టు ముట్టుచుండగా, తలనెరసిన అగస్టీన్ తన మరణ పడకపైనుండెను. అగస్టీన్ దావీదు పశ్చాత్తాప కీర్తనలు చదివెను. ఈ కీర్తనలలో దావీదు దేవునితో తన పాపములను ఒప్పుకొనును. ఈ కీర్తనలు అగస్టీన్ గదిలో గోడలపై వ్రాయబడియుండెను. నిర్భాగ్యుడైన పాపికి ఈ కీర్తనలు ఉచిత కృపను తెలుపును, సంఘపితరుడైన అగస్టీన్ కూడా ఈ కృప ద్వారా మేలు నొందెను. తాను చూడనాశించిన నిత్య మహిమలోనికి తద్వారా సమాధానముతో ప్రవేశించెను.

24. అగస్టీన్ మరియు పెలేజియస్ (క్రీ.శ. 360 – 435)

క్రీ.శ. 400లో పెలేజియస్ ఓ బ్రిటిష్ సన్యాసిగా ఉండెను. మనము ఆయనను రోమానగరములో చూచెదము. ఆయన అక్కడ ఉంటుండగా 'ప్రభువా మీరు కోరినది మాకు దయచేయండి మరియు మీకిష్టమైనది మీరు కోరండి" అని కన్‌ఫెషన్స్ ఆఫ్ అగస్టీన్ అను ప్రముఖ గంథములోని పదములనుపయోగించి ఓ బిషప్ ప్రార్థించుట వినెను. ఆ మాటలో అగస్టీన్ భావమేమిటంటే "ప్రభువా అలా చేయుటకు విధేయత నిస్తేనే మేము నీ ఆజ్ఞలకు లోబడగలము"

అగస్టీన్ మాటలతో పెలేజియస్ విభేదించెను. ఒక వ్యక్తి దేవుని ఆజ్ఞలకనుగుణంగా జీవించాలంటే అతడు తన స్వంత సామర్థ్యము కలిగియుండాలి. అలా చేయగలుగుటకు అతడు తన స్వచిత్తమును మంచికై ఉపయోగించాలి. పెలేజియస్ ఆదిమ పాపమును నిరాకరించును, (ప్రతి వ్యక్తి పుట్టినప్పుడు ఈ లోకమునకు తనతో తెచ్చే పాపము) ఆదిమ పాపము ఆదాము పతనముచే కలిగెను, కాని పిల్లలు పాపరహితులుగా పుడుతారని పెలేజియస్ విశ్వసించెను. ప్రతి ఒక్కరు మంచి లేదా చెడు చేయుటకు స్వేచ్ఛ కలిగియున్నారు. ఎవరైనా పాపము చేస్తే కేవలము అతడు పెడత్రోవ పట్టించబడ్డాడు గనుక అలా చేయును. అతని పాపము తన హృదయమునుండి రాదు.

మంచి చేయుటకు, మనము క్రీస్తు జీవితమును మాదిరిగా తీసుకోవచ్చును. కాని బైబిల్‌లో బోధింపబడిన దేవుని కృప ఉద్దేశ్యమేమి? మంచి చేయువారికి దేవుడిచ్చు సహాయముగా దేవుని కృప భావింపంబడుచున్నది. ఒకడు క్రమేపి మంచి చేయనెంచి తనను తాను దేవుని కృపకు పాత్రునిగా చేసికొనవచ్చును. పెలేజియస్ ప్రకారము మనుష్యుడు తన స్వంత రక్షణను సంపాదించుకొనుట సాధ్యము.


రోమ్‌లో అతని బోధలు ఎంత ప్రమాదకరమైనవో వారు గ్రహింపలేదు. కాని ఆఫ్రికాలో వారు ఖచ్చితముగా అట్టి ప్రమాదమును గ్రహించిరి! పెలేజియస్ బోధ ఇకను బైబిల్ బోధగా పిలువబడుట లేదు. ఈ విషయమై అగస్టీన్ లేఖలు మరియు కర పత్రములు వ్రాసెను. కాని ఆయన రచనలలో తన స్వంత అభిప్రాయములను వ్రాయలేదు. అ విషయమును గూర్చి దేవుని వాక్యమేమంటున్నదో దానిని మాత్రమే ఆయన వ్రాసెను. అగస్టీన్‌కు పవిత్ర లేఖనాలే అంతిమ అధికారము.

పతనము కారణాన, మానవుడు ఎంతగా చెడిపోయాడంటే, సంపూర్ణ శక్తిహీనుడిగా, ప్రభువునకు లోబడుటకిష్టపడని వాడుగా అయ్యాడని బైబిల్‌నుండి అగస్టీన్ స్పష్టముగా చూపించెను. మానవుడు దేవుని శత్రువయ్యాడు. అందుకే మానవుని చిత్తము దేవుని చిత్తమునకు మరియు ఆజ్ఞకు విరోధముగా వెళ్ళును. ఇకను మంచినెన్నుకొనుటకై మానవునికి స్వేచ్ఛా చిత్తము లేదు. పాపపు శక్తి ద్వారా మానవుడు ఆత్మీయముగా మరణించెను. మన చిత్తము నూతనము చేయబడాలి. మనము పరిశుద్ధాత్ముని ద్వారా తిరిగి జన్మించినపుడు ఇది జరుగును.

ప్రభువైన యేసు, అనుసరించుటకైన మాదిరి మాత్రమే కాదు. అన్నిటికంటే ముఖ్యముగా ఆయన రక్షకుడైయున్నాడు, ఆయన పరిపూర్ణ బలిద్వారా ఆయన ప్రజల పాపములకై వెల చెల్లించెను. ఆ వ్యక్తి ఆయన కృపద్వారా మాత్రమే రక్షింపబడును.

ఈ విధముగా అతని బలమంతటితో అగస్టీన్ పెలేజియస్ యొక్క దుర్బోధలను సవాలు చేసెను. దేవుని వాక్యమే, అతని ఖడ్గము.

పెలేజియస్‌నకు అనేక అనుచరులున్నారు గనుక అగస్టీన్ ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొనెను. వారే పెలేజియన్స్‌గా పిలువబడుతున్నారు. పెలేజియస్ అనుచరులలో బిషప్ కూడా ఉన్నారు, వారు ఆయన తప్పుడు బోధను బలపరచి ప్రకటించిరి! క్రైస్తవ సంఘము గొప్ప ప్రమాదమునందుండెను. దేవుని సంఘమును పాడుచేయుటకు మరియు అందులో గలిబిలి కలుగజేయుటకు సాతాను ప్రతి విధముగానూ



ప్రయత్నించును గనుక ఉపన్యాసము మరియు రచన రెండింటిద్వారా అగస్టీన్ పెలేజియస్‌ను కొనసాగి వ్యతిరేకించెను. ఆయన ఎదిరింపబడినా, గద్ధింపబడినా అగస్టీన్ ఎంతో ప్రియముగా సత్యమును సంరక్షించెను. సంఘ సమావేశములలో (సినాడ్స్) ఈ విషయము చర్చింపబడును గనుక మనము చక్కగా గ్రహింపవచ్చును. క్రీ.శ. 418లో కార్‌తేజ్‌లో జరిగిన ఓ పెద్ద సంఘ సమావేశములో (సినాడ్) పెలేజియస్ బోధలు ఖండింపబడెను. పెలేజియస్ బహిష్కరింపబడెను. పెలేజియనిజమ్ తప్పుడు బోధద్వారా వాటిల్లిన ముప్పు సమసిపోయెనా? అగస్టీన్ పనిద్వారా, పాపము మరియు కృపను గూర్చి లోతైన అవగాహన ఏర్పడెను, కాని సెమి-పెలేజియనిజమ్ రూపములో దుర్బోధ కొనసాగి నిలిచెను (సెమి=సగము) సెమిపెలేజియనిజమ్ అంటే రాజీపడిన ఓ విధము. మంచిని చెడును ఎన్నుకొను సామర్థ్యమున్న మానవుని స్వేచ్ఛా చిత్తము పతనము ద్వారా బలహీనపరచబడెను అని సెమిపెలేజియనిజమ్ బోధించును.

ఎన్నిక చేయుటకై దేవుని కృప అవసరము, కాని ప్రభువు కొరకు లేదా ప్రభువునకు విరుద్ధముగా తీర్మానము చేయుట అనునది ఆ వ్యక్తికే చెందును. రక్షణ సంపాదనలో మానవుడు మరియు దేవుడు సహ భాగస్వామ్యము కలిగియుందురు.

వాస్తవానికి, ఆశ్రమములలోని సన్యాసులు విషయములను ఇలా భావించిరి. వారి మంచి క్రియలు తమ రక్షణను సంపాదించుకొనుటలో ఎంతో సహాయపడును.

ఒక వ్యక్తి జన్మించినపుడు అతడు పరిపూర్ణునిగా ఉండడు లేదా పాపములేనివాడుగా ఉండడు, కాని మరోవైపు పాపము ద్వారా అతడు మరణించనూ లేదు (ఆత్మీయ మరణం). అతడు రోగగ్రస్తునిగా భావింపబడ్డాడు. ఇట్టి బోధ తప్పుడు బోధయైయుండి క్రైస్తవ సంఘములో మరింత ఆదరణపొందెను . తత్ఫలితముగా సంఘసంస్కరణ దినముల వరకు పరిస్థితులు మరింత అంధకారయుతముగా మారెను . వాస్తవానికి నేటి రోజున ఈ బోధనలలోని అనేక సంగతులు రోమన్ క్యాథలిక్ సంఘమందు చోటుచేసుకున్నవి.

25. అటవికుల చొరబాటులు - క్లోవిస్ (క్రీ.శ. 465-511)

పశ్చిమమున బలమైన రోమా మహాసామ్రాజ్యము కూలిపోవుచున్నది. దాదాపు క్రీ.శ. 400లో గొప్ప వలస (ప్రజా ఉద్యమం) జరిగెను. ఇదంతా ఎందుకు జరుగుతుంది? ఏం జరుగుతుంది? బలవంతులైన హూణులు అనే కూరజాతి ప్రజలు తూర్పునుండి వచ్చుచున్నారు. ఇతర దిశలనుండి వాండల్స్ సమీపించుచున్నారు మరియు వారు ఆఫ్రికాను జయించిరి. విసిగాత్‌లు అను మరొక గుంపు ప్రజలు రోమ్‌ను బంధించి వారు దక్షిణ ఇటలీ మరియు స్పెయిన్ నందు స్థిరపడిరి. రోమా సామ్రాజ్య సరిహద్దులలో నివసించు ప్రజలను వారు తోలివేసిరి. ఈ ప్రజలు భయకంపితులై పారిపోయిరి. రోమా సైనికులు వారికి సహాయము చేయలేకపోయిరి. తరువాత ఉద్యమకారులు ధనికులను గొప్పవారిని ధ్వంసము చేసిరి.

పశ్చిమ రోమా యొక్క చివరి చక్రవర్తి తన అధికారము నుండి తొలగింపబడెను. మరియు ఈ మహా సామ్రాజ్యము, ఇకను నిలువలేకపోయెను. తూర్పునందలి రోమ్ కాన్‌స్టంట్‌నోపుల్‌ను ముఖ్య నగరముగా చేసుకొని దాదాపు మరొక వెయ్యి సంవత్సరములు నిలిచెను. ఐరోపాయందంతట ప్రజలు పరుగెడుతున్నారు. ఆ ఖండమందంతట విదేశస్తులు వారికొరకు ఇళ్ళు కట్టుకొనుచున్నారు. నిజమైన ప్రజావలస జరుగుచున్నది.

ఈ వలస తరువాత జర్మని తెగలైన ఫ్రిజియన్స్, ఫ్రాంక్స్, శాక్సన్స్ పశ్చిమములో స్థిరపడిరి. (ఈ ప్రాంతములో నెదర్లాండు కూడా వచ్చును). ఆరాధించుట కై వారు జర్మన్ దేవుళ్ళను కలిగియున్నారు. దక్షిణ ఫ్రాన్స్‌లోని ప్రజలు క్రైస్తవ్యముతో సుపరిచితులైయుంటే, ఉత్తర ప్రాంతపువారు అన్యులై జర్మన్ తెగలవారుగానున్నారు.

పశ్చిమంలో దాదాపు క్రీ.శ. 500 సం॥లో ఫ్రాంక్‌లపై క్లోవిస్ రాజు పాలించెను. ఫ్రాంక్‌ల యొక్క ప్రాంతము నేడు మనకు తెలిసిన ఫ్రాన్స్, బెల్జియం మరియు దక్షిణ నెదర్లాండ్స్‌ను చుట్టియున్నది. క్లోవిస్ బలవంతుడైన మరియు ప్రసిద్ధుడైన వ్యక్తి. ముప్పై ఏండ్లు ఆయన రాజుగానుంటూ అనేక యుద్ధములు చేసెను. మొదట శేషితులైన (మిగిలిన) రోమీయులను తన రాజ్యమునుండి తోలివేసెను. అటు పిమ్మట అతడు ఇతర తెగలను కూడా లోబరచుకొనెను. అతను దేవుళ్ళు తనకు సహాయపడుతున్నట్లు భావించెను. దేవుళ్ళు, అన్య విగ్రహాలా..? ఆయన భార్యయైన క్లోటిల్డే ఆయనతో సమ్మతింపలేదు. మరొక దేవుని గూర్చి ఆవిడ చెప్పెను. వారి శత్రువుల పట్ల క్రూరముగా ప్రవర్తింప నిషేధించే రాజైన యేసును గూర్చి ఆవిడ చెప్పెను. ఖచ్చితంగా కఠినుడైన భక్తిహీనుడైన క్లోవిస్ చేసినది.

క్లోవిస్ తన భార్యయైన క్లోటిల్డి మాట వినెను, తన శత్రువులను ప్రేమింపమనుట ఆయనకు విపరీతముగా దోచెను!

మళ్ళీ యుద్ధము చెలరేగెను. అన్యప్రజలు ఆయన రాజ్యమును దాడిచేసిరి. వేల సైనికులతో క్లోవిస్ యుద్ధమునకు బయలుదేరెను. ఘోరయుద్ధము జరిగెను కాని చివరిగా ఫ్రాన్‌కిష్ తరుమబడెను. క్లోవిస్ యుద్ధమందు ఓడిపోతాడా? ఓడిపోతే, అదే జరిగితే ఆయన రాజ్యము కూలిపోవును! తన దేవుళ్ళకు మొఱపెటుకొనెను కాని ప్రయోజనము లేదు.

అప్పుడు అకస్మాత్తుగా తన భార్యయైన క్లోటిల్డే ఆరాధించు దేవున్ని ప్రార్థించి ఆరాధించెను. నాకు ఈ యుద్ధమందు విజయమిస్తే నేను క్రైస్తవునిగా మారుదునని ప్రార్థనలో మాట ఇచ్చెను. వారు తీవ్రముగా పోరాడిరి, పరిస్థితులు నెమ్మదిగా మారటము మొదలుపెట్టెను. ఓట మిలా అగుపించినది విజయముగామారెను! శత్రువు పారిపోయెను.

మరొక మాటలో చెప్పాలంటే, క్రైస్తవీకరణ జరిగెను.

క్లోవిస్ ఏమి చేయును? ఈ అనుభవము ద్వారా తన స్వంత దేవుళ్లకంటే క్రైస్తవుల దేవుడు బలమైన వాడని ఆయన గ్రహించెను. క్లోవిస్ తను చేసిన వాగ్దానము ప్రకారము తన మూడువేల సైనికులతో రెయెమ్స్ నగరమునకు వెళ్ళి బాపిస్మము తీసుకొనెను. క్లోవిస్



క్రైస్తవుడయ్యెను. రాజు చర్య వలన ఆయన రాజ్యప్రజలు అనేకులు బాప్తిస్మము తీసుకొని క్రైస్తవులైరి. ఫ్రాంక్‌లయొక్క ప్రాంతము క్రైస్తవదేశముగా మారెను. అనేక చోట్ల సంఘములు సన్యాస ఆశ్రమములు కట్టబడెను.


రోమా సామ్రాజ్యము కూలిపోయినా సంఘము నిలువబడెను! ఆ ప్రాంతములో నివసించు ఫ్రిసియన్ మరియు శాక్సన్ తెగ ప్రజలయొద్దకు ఫ్రాన్‌కిష్ తెగ మిషనరీలు వెళ్ళిరి. వారు ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొనిరి. ఈ మిషనరీలు గూఢాచారులని వీరిని ఫ్రాంక్ ప్రజలు పంపారని మా స్వాతంత్ర్యమును దొంగిలించు వారని వారు అనుకొనిరి. గనుక వారు అమాండస్ అను మిషనరీపై దాడిచేసి నదిలో పడవేసిరి. కాని ఆయన మునిగిపోలేదు. ఇలిజియస్ మరియు ఉల్‌ఫ్రాన్ అను ఇతర మిషనరీలతో సహా కొన్ని యేండ్లపాటు వారు ఫ్రిజియన్స్ క్రింద పని చేసిరి. ప్రభువు వారి ప్రయాసమును ఆశీర్వదించెను. సంఘములు కట్టబడెను, విగ్రహములు కూల్చబడెను. కాని ఈ ప్రజలలో నుండి అన్య ఆచారములు మరియు అలవాటులు పూర్తిగా తొలగింపబడలేదు. వారు అన్యులుగా ఉండి క్రైస్తవులుగా మారిరని మనము చెప్పలేము. అయిననూ వారు ప్రభువు సమయము చొప్పున తరువాత క్రైస్తవులుగా మారును.

26. ఐర్లాండులో క్రైస్తవ్యము - ప్యాట్రిక్

అది దాదాపు క్రీ.శ. 420 సం॥, ఐర్లాండు ఆరు బయలులో పందులు మేయుచున్నవి. వాటిని ప్యాట్రిక్ అనే యౌవనస్థుడు కాయుచున్నాడు. ఈ సువిశాల ద్వీపములో ఒంటరిగా ప్యాట్రిక్ బానిసత్వములోనికి నెట్టబడి ఈ పనిచేయుచున్నాడు.

కొద్ది సంవత్సరముల క్రితమే అతడు పైరేట్స్ స్కాట్లాండ్ నుండి బంధింపబడి, మిగిలిన తన జీవిత కాలమంతయూ బానిసగా పనిచేయుటకై ఐర్లాండుకు తీసికొని రాబడెను. ఆయన పందులచే ఆవరింపబడియుండగా వాటి మధ్య నుంచొని "ప్రభువా, ఈ బానిసత్వమునుండి నన్ను విడిపించినట్లైతే ఈ అన్యదేశమైన ఐర్లాండులో సువార్త ప్రకటించుటకై నన్ను నేను సమర్పించుకొందును" అని ప్రార్థించెను.

ప్రభువు ఈ ప్రార్థనను ఆలకించినచో అద్భుతముగా నుండును. గతములో ఆయన స్కాట్లాండ్‌లోనున్నపుడు ప్యాట్రిక్ ఎంతో దుష్టజీవితమును గడిపెను. అతని తల్లిదండ్రులు అతనిని చక్కటి క్రైస్తవునిగా పెంచదలచినందున అది వారిని ఎంతగానో బాధపెట్టెను. ఇప్పుడు ప్యాట్రిక్ ఐర్లాండులో ఉంటూ తన తల్లిదండ్రులను ఎంతగానో బాధించానని ఇప్పుడు విచారపడుతున్నాడు. అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నా, ఆరు సంవత్సరముల పిమ్మట ప్యాట్రిక్ ద్వీపమునుండి పడవ ద్వారా తప్పించుకొని పోగలిగెను. తప్పించుకొనిపోవుట అనునది ప్రార్థనకు ఫలితముగా ఆయన చూచెను. ప్యాట్రిక్ ఫ్రెంచ్ ఆశ్రమములో ఐదు సంవత్సరముల పాటు కష్టించి చదువుకొనెను. ఇప్పుడేమి జరుగనైయున్నది...?



కాని మనము ఐర్లాండుకు తిరిగి వెళ్ళి ఏమి జరుగుతుందో చూద్దాం. ఎక్కడ చూసినా డ్రమ్ శబ్దము వినబడుచున్నది. స్థానికులైన ఐరిష్ ప్రజలు ఏం జరుగుతుందో చూద్దామని ఇళ్ళనుండి బయటికి వచ్చారు. ఇంత పెద్ద శబ్దమును ఎవరు చేయుచున్నారు? దీనంతటికి అర్థమేమి? వారి గ్రామము వెలుపల ఒక అపరిచితుని చూశారు. అతని చేతిలో ఉన్న పెద్ద డ్రమ్‌ను పదేపదే కొట్టుచున్నాడు. అతని చుట్టూ చాలా మంది చేరిరి. అన్య ఐర్లాండు ప్రజలు ఆసక్తితో చూస్తున్నారు. వారింకా సమీపముగా చేరిరి. ఖచ్చితముగా దీనినే ప్యాట్రిక్ ఆశించెను! అవును, వాస్తవానికి ప్యాట్రిక్ డ్రమ్ కొట్టుచున్నాడక్కడ. రోమ్‌లో బిషప్‌గా ఏర్పరచబడి అతను ఐర్లాండుకు తిరిగి వచ్చెను. వినండి! ప్యాట్రిక్ మాట్లాడబోతున్నాడు ప్రజలందరు జాగ్రత్తగా ఆలకించుడి! ఈ అపరిచితునికి వారి భాష తెలియును. వారు ఎన్నడు కనీ వినీ ఎరుగని విషయములను గొప్ప ఉత్సాహముతో అతను చెప్పెను.

పతనమగుచున్న పాపులకొరకై తన కుమారుని పంపిన దేవుని గూర్చి ఆయన చెప్పెను.! అన్యులు కూడా ఇప్పుడు రక్షింపబడవచ్చును! ప్యాట్రిక్ గ్రామములకు వెళ్ళెను.

వీలైన చోటెల్లా అతడు సువార్త ప్రకటించెను. బోధ మరియు పాటల ద్వారా దేవుని వాక్య సందేశమును ప్రకటించులాగున ఆయన కీర్తనలను వ్రాసి సంగీతము కూర్చెను. ఐరిష్ ప్రజలు పాడుకునే అన్యపాటల బాణీలోనే ఈ కీర్తనలును పాడుకోవచ్చును. మరియు – ప్రభువు అతని పనిని ఆశీర్వదించెను. అనేక అన్యులు విగ్రహములను విడిచి క్రైస్తవులుగా మారి బాప్తిస్మం పొందిరి. ప్యాట్రిక్ సంఘములను కట్టెను, అతడు వెళ్ళిన చోటెల్లా సన్యాసులు నివసించులాగున పెద్ద ఆశ్రమములను స్థాపించెను. ఈ ఆశ్రమములు దేశము యావత్తునకు ఆశీర్వాద వనరు ఆయెను. గనుక ఐర్లాండు "పరిశుద్ధుల ద్వీపము"గా పిలువబడెను.

ప్యాట్రిక్ సన్యాసులకు తండ్రిగా ఉండేవాడు. వారు ప్రయోజనకరమైన పనిచేసేలా అతని చూచుకొనుచుండెను. ప్రతిదినము సన్యాసులు పెద్ద సంఖ్యలో వెళ్ళి బీడు భూములు సారవంతమైన భూములుగా మార్చునట్లు వారు వాటిలో కష్టపడి పనిచేసేవారు.

ఇతర సన్యాసులు కొందరు మంచి పుస్తకములను కాపీ చేస్తే మరికొందరు ఐరిష్ భాషలోనికి అనువదించిరి. కాని, అన్నిటి కంటే ముఖ్యమైనది మిషన్‌షీల్డ్ కొరకు ఎక్కువమంది సన్యాసుల తర్ఫీదు జరిగెను. వారు అన్య ప్రపంచములోనికి వెళ్ళి ఇతర దేశములకు కూడా సువార్తను ప్రకటించిరి.

ఉదాహరణకు, వారు సముద్రము దాటి స్కాట్లాండ్ వెళ్లి, దేవుని సహాయముచే ఆ ప్రదేశమును క్రైస్తవ దేశముగా మార్చిరి. వారు జర్మన్ తీరములకు, ఇంగ్లాండ్, బహుశ ఐస్‌ల్యాండ్‌కు ప్రయాణం చేసి వెళ్ళిరి. అన్యత్వము పరిపక్వమైన ఫ్రాంక్‌ల ప్రాంతమునకు కూడా వారు వెళ్ళిరి. నిశ్చయముగా సన్యాసులు చాలా మంచి పనిచేసిరి.

పేదల గుడిసెలు మరియు వ్యవసాయ కూలీల యొద్దకునూ వారు వెళ్ళి దేవుని వాక్యపు విత్తనము చాలా ఫలములనిచ్చెను. ప్యాట్రిక్ పోప్ ద్వారా బిషప్‌గా ఏర్పరచబడిననూ, అటు ఆయనగాని, ఐరిష్ మిషనరీలు కాని పోప్ ప్రభావము క్రింద లేకుండిరి. మనము రాబోయే అధ్యాయములలో చదువబోవునట్లుగా వారు రోమన్ క్యాథలిక్ బోధల పొరపాట్ల ద్వారా ప్రభావితం చేయబడలేదు.

ప్యాట్రిక్ నమ్మకమైన దేవుని సేవకునిగా వంద సంవత్సరములకు పైబడిన వయసుగలవాడై మరణించెను. గౌరవ సూచనగా ప్యాట్రిక్ ఐర్లాండు అపొస్తలునిగా పిలువబడెను.

27. పోప్ గ్రెగరి ద గ్రేట్

17వ అధ్యాయములో రోమ్ బిషప్ బిషప్‌లందరికంటే అతి ప్రముఖుడుగా ఎలా అయ్యాడో చూస్తాము. ఆయన క్యాథలిక్ (సార్వత్రిక) క్రైస్తవ సంఘమునకు పోప్ ఆయెను. పశ్చిమమందలి బిషప్‌లపై పోప్ అధికారము కలిగియుండును. ముఖ్య విషయములలో ఆయన ప్రాధాన్యత కలిగియుండును.

మహా గ్రెగరి మొదటి పోప్‌లలో ఒకడు. ఆయన అనేక సంవత్సరములు ఆశ్రమములో సన్యాసిగా ఉండి చక్కటి వరము గలవాడుగా నుండెను. ఆయన వరము గల వ్యక్తియని చాలా మంది భావించిరి గనుక ఆయన చిత్తమునకు విరుద్ధముగా మొదట రోమ్ బిషప్ గాను అటు పిమ్మట పోప్‌గాను నియమింపబడెను. ఇదంతయూ క్రీ.శ.590 సం॥లో జరిగెను, మరియు గ్రెగరి క్రీ.శ 604 వరకు పోప్‌గా ఉండెను.

ఆయన అనుదిన జీవితములో మతనాయకులందరికి నిజమాదిరిగా ఉండెను. ఆశ్రమములో ఉన్న సన్యాసులు పాపం చేయుట ఆయన చూస్తే వారిపై కఠిన చర్య తీసికునే వాడు. వారు మాట వినకపోతే వారిని ఆశ్రమం నుండి వెలివేసేవాడు. స్వాస్థ్యము పొందుకున్నాక, గ్రెగరి చాలా ధనికుడాయెను కాని అదంతయూ తన దగ్గరే ఉంచుకోలేదు. అందులో చాలా మట్టుకు పేదలకు, తక్కినది ఆశ్రమము నిమిత్తము వాడెను. సంఘములలో సంగీతమును మెరుగు పరచుటకై గ్రెగరి సంగీత పాఠశాలలు ఏర్పాటు చేసెను. ఇంగ్లీష్ కీర్తనలకు సహకార సంగీతముగానుండే సంగీతమునకు ఆయన పేరుండును. దానిని గ్రెగోరియన్ ప్లెయిన్‌సాంగ్ అందురు.


కాని అన్నిటికంటే ముఖ్యముగా, తన మిషనరీ సేవ విషయంలో గ్రెగరీని జ్ఞాపకము చేసుకొనబడును. వారు సువార్తను అన్యులకు చేరవేతురు. ఉదాహరణకు, నలభైమంది సన్యాసులతో పాటు మఠాధిపతి గ్రెగరి ఇంగ్లండ్‌కు పంపెను. (అబ్బట్ మఠ నాయకులు, మఠాధిపతి పేరు ఆగస్టీన్. సంఘ పితరులు ఆగస్టీన్ అనునతడు వేరు.)

ఇంగ్లండ్‌లో క్రైస్తవ సంఘముండెను గాని, అన్య జాతులు ఆ దేశమునకు చొరబాటుగా చేరి అన్యమతమును ప్రముఖ మతముగా మార్చిరి. దేవుడు సన్యాసుల మిషనరీ పనిని దీవించెను. కెంట్ అనే గ్రామీణ రాజు బాప్తిస్మం తీసుకున్నాక, ఆ ప్రాంత ప్రజలు అనేకులునూ ప్రభువును విశ్వసించిరి. క్రమేపి ఇంగ్లండ్ అంతయూ క్రైస్తవ ప్రభావానికి గురై అగస్టీన్ మొదటి ఆర్చ్ బిషప్ అయ్యెను. పోప్ ఫ్రాన్స్ మరియు స్పెయిన్‌కు మిషనరీలను పంపెను. గ్రెగరి అనేక పుస్తకములను కూడా వ్రాసెను. బిషప్‌లు మరియు మతనాయకులు వారి బాధ్యతలను తెలిసికొనుట కై ఈ పుస్తకములను చదివేవారు.

వారు ఈభూమి మీద తమకొరకు ధనమును కూర్చుకొనరాదు. దానికి బదులు వారి సంరక్షణకై ఇవ్వబడిన ప్రజలకొరకు తమ దృష్టిని సమయమును వెచ్చించాలి (మందలోని గొఱ్ఱెలు). ఈ విధముగా గ్రెగరి సంఘ విషయములన్నిటిలో చొరవ తీసికొనెను. బిషప్‌లు ఆయనను గౌరవించి ఆయనకు లోబడేవారు ఖచ్చితముగా ఇప్పుడు పోప్ సంఘమునకు ముఖ్య నాయకుడు.

ఈ కారణముచేత ఆయన మహాగ్రెగరీగా పిలువబడెను. కాని నిజముగా ఆయనకి పేరు తగునా....? ఈ విషయమును మరింత తీక్షణముగా చూద్దాము. ఆయన అనేక పుస్తకములలో క్రైస్తవ సిద్ధాంతమును చాలా సరళముగా వివరించెను. విచారకరముగా ఆయన సంఘ పితరుడైన అగస్టీన్ బోధలను అనుసరింపలేదు ఎందుకంటే గ్రెగరి సెమీ పెలేజియనిజమ్‌ను బలపరచెను. ఈ సెమీ పెలేజియనిజమ్ రక్షణ కృపద్వారా గాక క్రియలచే అని బోధించును.

అన్య దేవాలయములను నాశనము చేయ వద్దని ఇంగ్లాండ్‌లోని మిషనరీలకు గ్రెగరి ఒక లేఖ వ్రాసెను. వాస్తవమే అన్యదేవాలయములను తొలగించివేయాలి కాని వాటి స్థానములో భక్తుల అవశేషములు వచ్చెను. తత్ఫలితంగా అన్య ఆచారములు కొనసాగి ప్రబలెను...!



భక్తుల అవశేష ఆరాధనను మహాగ్రెగరి ప్రోత్సహించెను. భక్తుల అవశేషములు మరియు వారి ప్రతిమల వలన చాలా అద్భుతములు జరిగెనని తన పుస్తకములలో వ్రాసెను. ప్రతిమలను సంఘములలో ఉంచమని గ్రెగరి బిషప్‌లను కోరెను. వచ్చే అధ్యాయములలో మనము పర్గెటరిని గూర్చి చదివెదము. ఇది సంఘములోనికి గ్రెగరి తెచ్చిన మరొక పొరపాటు.

ఈ పోప్ కారణాన క్రైస్తవ క్యాథలిక్ సంఘము (సార్వత్రిక) రోమ్‌నుండి పరిపాలించెను, క్రమేపి స్వభావరీత్యా రోమన్ క్యాథలిక్‌గా మారెను. రోమన్ క్యాథలిక్ సంఘమునకు పోప్ అధిపతిగా ఉండును. కాని క్రీస్తు ఆయన సంఘమునకు అధిపతియని బైబిల్ బోధించుచున్నది! సంఘములో పోప్ ఎంతో అధికారమును సంపాదించుకొనెను. దానిని ఆయన ఆధిపత్యము చేయుటకు వచ్చెను.


గ్రెగరి ఎన్నో మంచిపనులు చేసెనుకాని ఆయన వలన దేవుని సంఘము ఇంకా దేవుని వాక్య సత్యము నుండి వైదొలగి పోయెను మరియు సంఘములోని పరిస్థితి అధిక అంధకారమాయెను. ఇట్టి పరిణామములను బట్టి గ్రెగరి మహా గ్రెగరి అని పిలువబడలేదు.

28. తప్పుడు బోధ

సంఘమందు తప్పుడు బోధ మరింత అధికమౌతున్నదని స్పష్టమగుచున్నది. తప్పుడు బోధ అకస్మాత్తుగా అగుపించదుగాని పరిస్థితులు క్రమేపి మారి కొన్ని సంవత్సరములు మరియు శతాబ్ధముల కాల వ్యవధిలో తప్పుడు బోధలు అభివృద్ధి చెందును.

బలిపూజ అనునది అట్టి తప్పిదములలో ఒకటి. మొదటి నుండి క్రైస్తవులు వారములో మొదటి దినము అనగా ఆదివారమున కూడుకునేవారు. కార్యక్రమములో ముఖ్యభాగము ప్రభువు బల్లను ఆచరించుట. రొట్టె మరియు ద్రాక్షరసము పంచబడినపుడును కృతజ్ఞతా ప్రార్థన అర్పింపబడేది. అందుకే ప్రభురాత్రి భోజనమును యూకరిస్ట్ అందురు. "యూకరిస్ట్" అను మాటకు 'కృతజ్ఞత' యని అర్థము.

ద్రాక్షరసము మరియు రొట్టె ప్రభువైన యేసు యొక్క నిజ దేహము మరియు రక్తముగా మారునని భావించిరి గనుక బలి అను పదము వాడబడెను. మత గురువులు రొట్టె మరియు ద్రాక్షరసమును దీవించిన పిమ్మట ఈ మార్పు జరుగునని చెప్పబడెను. (ఈ మార్పును ట్రాన్స్ సబ్‌స్టాన్సియేషన్ అని అందురు). అది మళ్ళీ మరొకమారు యేసు శరీరము మరియు రక్తముగా



మారునని అందురు. ప్రభువు ఒక్కమారే జరిగించిన కార్యక్రమం మళ్ళీ పునరావృతమగుట, పదేపదే ప్రతిదినము సంపూర్ణము చేయబడిన క్రీస్తు కార్యము చాలదు! మత గురువుచే ఇంకా ఏదో జతచేయబడాలి!

అది ప్రత్యేకమైన చిన్న బిస్కట్‌ల ద్వారా చేయబడినది గనుక అది విరుగగొట్టబడినపుడు ఒక్క ముక్కను కూడా పోనివ్వరు. వీటినే అప్పములందురు. మత గురువు అప్పమును ఆశీర్వదించాక దానిని హోస్ట్ అని అందురు. (హోస్ట్=బలి) హోస్ట్ అనునది క్రీస్తు దేహములో ఒక భాగముగా పరిగణింపబడినది గనుక దాని యెదుట ప్రజలందరు ఆరాధనలో మోకరింతురు.

ఈ విధముగా విగ్రహారాధన అభివృద్ధియాయెను గనుక ప్రభురాత్రి భోజనము బలిపూజగా మారెను. ప్రతి బలి పూజలో మతగురువు హోస్ట్ (బలి) అర్పించును గనుక బలిపూజ అనునది క్రీస్తు కలువరిలో జరిగించిన బలిని త్రోసిపుచ్చుచున్నది. దేవుని బిడ్డల పాపములు క్షమించుటకు వాస్తవానికి ఆ బలి చాలినదైయున్నది. గనుక అది పునరావృతం చేయబడనవసరంలేదు. దానికేదియూ జత చేయబడనవసరంలేదు. క్రీస్తు యొక్క బలియాగములో సవరణలు చేయుటకు మనకు హక్కులేదు.

అబద్ధపుబోధనలో మరొక సంగతి పర్గేటరి. పర్గేటరి అంటే శుద్ధి చేయు జ్వాల. పరలోకము మరియు నరకమునకు మధ్యన ఉండు స్థలము పర్గేటరి. అవిశ్వాసులు మరణంచాక వారు నరకం వెళ్ళుదురు కాని విశ్వాసులు సాధారణంగా నేరుగా పరలోకం వెళ్ళరు. సాధారణంగా వారి ఆత్మలు మొదట పర్గేటరికి వెళ్ళునని చెప్పబడినది. ఆత్మలు వాస్తవానికి ఇక్కడే వారు జరిగించిన గత పాపమునుండి కడిగి వేయబడెదరు.

ఈ జీవితములో జరిగించిన సత్‌క్రియలు నేరుగా పరలోక ప్రవేశం చేయుటకు చాలినంతగా దోహదపడవు. వారి పాపాలన్నిటికి వెలచెల్లింపబడలేదు. అందుకే ఈ చెల్లింపు అనేది పర్గేటరిలో జరుగును. ఒక ఆత్మ పర్గేటరి నుండి సాధ్యమైనంత త్వరగా ఎలా బదిలీ యగును? ఈ ప్రక్రియలో భూమి మీదనున్నవారు తమ వంతును కలిగియుందురు. వారు పర్గేటరిలో ఉన్న ఆత్మల కొరకు ప్రార్థనచేయవచ్చును. కాని అన్నిటికంటే ముఖ్యముగా, సంఘమునకు డబ్బు దానము చేయుట ద్వారా ఆత్మ విడిపింపబడును. ఈ భావనలేవియూ బైబిల్‌లో అగుపడవు.

ఒప్పుకోలును గూర్చిన బోధ మరొక తప్పిదము. ఒకవ్యక్తి తన పాపములను మతగురువుతో ఒప్పుకొనుట యే ఒప్పుకోలు. దానికర్థము రహస్యమందు జరిగించిన పాపములు కూడాను. నిజ పశ్చాత్తాపమున్నట్లైతే మత గురువు నీ పాపములు క్షమింపబడియున్నవని ప్రకటింపవచ్చును. అప్పుడు ఆ పాపి ఈ పాపముల నిమిత్తమై నిత్యశిక్షను పొందడు.

కాని ఈ భూమి మీద పర్గేటరిలో తాత్కాలిక శిక్షను తాను పొందవలసి యుండును. ఏది ఏమైనా ఈ తాత్కాలిక శిక్ష నుండి విడిపింపబడుట సాధ్యమే. ఈ తాత్కాలిక శిక్ష నుండి విడిపింపబడుటకై చెల్లించేదే 'ఇండల్జన్స్' ఈ ఇండల్జన్స్ క్షమాపణ పత్రము ద్వారా ఒక వ్యక్తి భక్తుల మరియు హతసాక్షుల సత్‌క్రియల యందు భాగము కలిగియుండుటకై అనుమతింపబడును.

వాస్తవానికి భక్తుల మరియు హతసాక్షుల మంచిక్రియల విస్తారమైన నిధిని సంఘము కలిగియున్నది. ఆ నిధిలో క్రీస్తు అనంత సత్‌కార్యములునూ ఉన్నవి. అలా సమయము గడిచేకొలది పరిస్థితులు క్షీణింపగా వారు జరిగించిన పాపముల విషయమై నిజ పశ్చాత్తాపము లేకపోయినా క్షమాపణ పత్రములు డబ్బుచే కొనడమైనది. ఆ విధముగా క్షమాపణ పత్రము పాపక్షమాపణకు ఆధారమాయెను. దీనిని గూర్చి మనము తరువాత ఇంకా ఎక్కువగా చదివెదము.

ఇటువంటి సంగతులను గూర్చి మనము బైబిల్‌లో ఏదియూ చదువము. మనిషి దేవుని ఎదుట దోషమును ఒప్పుకొనుటను గూర్చి చదివెదము గాని మంచి క్రియల ద్వారా పాపక్షమాపణాపత్రము ద్వారా శిక్షకు వెలను చెల్లించుటను గూర్చి అసలే చదువము.


29. విల్లిబ్రార్డ్ మరియు బోనిఫేస్

అది క్రీ.శ. 690 సం॥ ఫ్రిసియన్ తీరమును ఓ చిన్న పడవ సమీపించుచున్నది. అది ఇంగ్లండ్ నుండి వచ్చెను. నేడు మనము పిలచుచున్న నెదర్లాండ్ తీరమును చేరినపుడు, ఉట్రెక్ట్ చేరు వరకు రైన్ నది దిగువన పయనించెను. ఆ పడవలోనుండి పండ్రెండు మంది బయటకు వచ్చిరి. విల్లిబ్రార్డ్ తన పదకొండు మంది అనుచరులతో వచ్చెను.

ఆయన భక్తిపరుడైన సన్యాసిగా ఉంటూ, మిషనరీ కాదలచెను గనుక విల్లిబ్రార్డ్ ఇంగ్లండ్‌లోని ఆశ్రమములో కష్టించి చదివెను. అయితే ఇప్పుడు ఆయన మిషనరీ సేవను ప్రారంభించు సమయమాసన్నమాయెను. ఫ్రిసియన్‌లు నివసించు ఈ దేశమునకు రావలెనని విల్లిబ్రార్డ్ మరియు తన పదకొండుగురు అనుచరులు ఆతురపడుచుండిరి. మొదట ఆయన మిషనరీ సేవను ప్రారంభించుటకై అనుమతి నిమిత్తము పోప్‌ను కలుసుకొనుటకు విల్లి బ్రార్డ్ రోమ్‌కు ప్రయాణమాయెను. తరువాత విల్లిబ్రార్డ్‌ను ఉట్రెక్ట్‌కు ఆర్చ్‌బిషప్‌గా రోమ్‌లో పోప్ నియమించెను. ఆయన నియమింపబడుటను గూర్చి తన క్యాలెండర్‌పై ఈ దిగువ మాటలు వ్రాసికొనెను. అయోగ్యుణ్ణి అయినా బిషప్‌గా ప్రతిష్టించిరి'.

విషయములు ఆయనకు సుళువుగా లేవు. ఫ్రిసియన్ల రాజైన రాడ్‌బౌడ్ క్రైస్తవ విశ్వాసమును ద్వేషించెను. ఉట్రెక్ట్ సమీపమున విల్లిబ్రార్డ్ కట్టించిన సంఘమును నాశనము చేయునంతగా ఆయన ద్వేషించెను.

ఒకరోజున ఫ్రీసియన్‌లు నివాసముంటున్న వాల్‌చెరెన్ అను ద్వీపమునకు విల్లిబ్రార్డ్ వెళ్ళెను. ఇక్కడ వోడెన్ అను దేవుని గౌరవార్థము ఓ పెద్ద ప్రతిమను నిలువబెట్టిరి. ఈ ప్రతిమ చెంతనే పండుగలు జరుపుకొనబడుతున్నవి మరియు బలులర్పింపబడెను. ఆ



స్థలమును విల్లిబ్రార్డ్ సమీపిస్తుండగా పొడవైన తెల్లని వస్త్రములను ధరించుకొనిన మత గురువులు బలి అర్పించుటకు సిద్ధమగుచుండిరి. "క్రైస్తవులు వచ్చుచున్నారు" అని అకస్మాత్తుగా అరచిరి. మిషనరీలు వచ్చుచున్నవైపు ఈ మత గురువులు భయపెట్టుచున్నట్టుగా చూచిరి. ఈ పరదేశులు పొరపాటున మళ్ళీ ఫ్రాంకిష్ వేగులేమో అనుకొనిరి.

ధైర్యముతో విల్లిబ్రార్డ్ ముందుకు వచ్చి "అందరూ నా మాట వినుడి!" అని అరచెను "ఇక్కడ మీరు ఆరాధించునది కేవలము రాతి ముక్క అది వట్టిదేనని ఇప్పుడు మీకు చూపించెదను".

ఆయన గద పట్టుకుని ఒక్క దెబ్బతో ఆ ప్రతిమను ముక్కలు ముక్కలుగా చేసెను. ప్రతి ఒక్కరు దానిని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడు ఆ రాతిముక్క ఏమి చేయును? వారందరు అక్కడ నుంచొని ఎదురు చూస్తున్నారు... కాని ఏమియూ జరుగలేదు. ఈ సంఘటన ఫలితమేమి ? ఫ్రీసన్ వారిలో చాలామంది ప్రతిమ శక్తిని అనుమానించటం ప్రారంభించారు. వారు విల్లిబ్రార్డ్ బోధను వినుట ప్రారంభించిరి. మరియు ప్రభువు ఆయన పరిచర్యను దీవించెను. ఈ ద్వీపమందలి అనేక ఫ్రిసన్‌లు క్రైస్తవులై బాప్తీస్మం తీసికొనిరి. విల్లిబ్రార్డ్ దేశమందంతట ప్రయాణించెను. అతను డెన్మార్క్ వరకు పయనించెను. ఆయన ఎక్కడికెళ్ళినా అక్కడ అతడు ఆశ్రమములు మరియు సంఘములు కట్టెను. మరియు ఎనభైయేండ్ల వయసులో, విల్లిబ్రార్డ్ కష్టపడే మిషనరీగా మరణించెను.

ఇంగ్లండ్ నుండి ఉత్తర సముద్రమును దాటి విన్‌ఫ్రెడ్ అనే మరొక మిషనరీ ప్రయాణించెను. దిగువ దేశములలో ఉన్న ఫ్రీసన్ వారికి ఆయనకూడా సువార్తనందించాలని ఆశించెను. కాని రాడ్‌బౌడ్ అనే రాజు వ్యతిరేకత చాలా బలముగా నున్నందున విన్‌ఫ్రెడ్ ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్ళెను. ఏది ఏమైనా, ఆయన రెండేండ్లలో తిరిగి రావటం మనము చూచెదము. మొట్టమొదట పోప్‌ను చూచుటకు ఆయన రోమ్ వెళ్ళెను. పోప్ ఆయనను 'మిషనరి ఆఫ్ పీటర్'గా సువిశాల దేశమైన జర్మనీకి పంపెను. క్రూరులైన ఈ ప్రజల మధ్యన విన్‌ఫ్రెడ్ సేవ గొప్పగా దీవింపబడెను. ఆయన ప్రయాణములో వేల ప్రజలకు బాప్తిస్మమిచ్చెను. దానికి బహుమానముగా పోప్ ఆయనను ఆర్చ్‌బిషప్‌గా నియమించి 'ధార్మికుడు' అని అర్థమిచ్చునట్లుగా బోనిఫేస్ అను క్రొత్త పేరునిచ్చెను.

ఒక దినాన బోనిఫేస్ అంధకారమయమైన అడవిలోనికి వెళ్ళెను. అక్కడ అడవిలో ఓ బ్రహ్మాండమైన పెద్ద సింధూర వృక్షముండెను. అది పవిత్రమైనదైయుండి, థోర్ అను దేవునికి ప్రతిష్టింపబడియుండెను. అన్యులయొక్క పెద్ద సమూహము బలి అర్పించుటకు ఇక్కడకు చేరిరి.

అక్కడ ధైర్యవంతుడైన బోనిఫేస్ ఏం చేయనైయున్నాడు ? ఆయన గొడ్డలి తీసికొని ఆ పెద్ద సింధూర వృక్షం వైపు వెళ్ళి, దానిని నరికి వేసెను! వారి దేవుడు ఖచ్చితముగా ఆయనను ఆపివేయునని అనుకొనిరి. అటు వంటిదేమి జరుగలేదు కాని ఆశ్చర్యం కలిగించే విధంగా ఓ బలమైన గాలి వీచి ఆయన నరికేపనిలో సహాయపడగా అంత బ్రహ్మాండమైన చెట్టు వెంటనే నేలకొరిగెను. కాని అన్నిటికంటే ముఖ్యముగా అనేకులు బోనిఫేస్ బోధ విని మారిరి. ఓ చిన్ని సంఘమును కట్టుటకు ఆ కూలిన చెట్టు యొక్క కఱ్ఱనే సహాయపడెను.

క్రీ.శ. 754 సం॥లో ఒక దినాన ఒక వృద్ధుడైన వ్యక్తి ఫ్రీసన్స్ దేశమైన నెదర్లాండ్స్‌కు మరొక్కసారి దాదాపు యాభైమంది అనుచరులతో దర్శింపవచ్చెను. డొక్కం అనే స్థలం దగ్గర ఫ్రీసన్స్‌లో అనేకులు బాప్తిస్మం తీసికోనైయున్నారు. కాని ఉదయమైనపుడు క్రూరులైన ప్రజలు అక్కడ చేరిరి. బోనిఫేస్ మరియు తన అనుచరులు నిద్రించు స్థలముపై దాడిచేసి వృద్ధుడైన మిషనరీని మరియు తన అనుచరులను హతమార్చిరి. "భయపడకుడి, కీడుకు కీడు చేయుటకు దేవుని వాక్యము మనలను నిరోధించును, దేవునియందు నమ్మకముంచుడి, ఆయన మీ ఆత్మలను రక్షించును" అని బోనిఫేస్ ఈ చివరి పలుకులు పలికెను.

బోనిఫేస్ దేవుని నమ్మకమైన సేవకుడైయుండి, క్రీస్తు ఏకైక రక్షకుడని బోధించెను. మరియు బైబిల్ దేవుని వాక్యమని ఎంతో గాఢమైన గౌరవము కలిగియుండెను.

30. చార్లీమేన్ మరియు క్రైస్తవ్యము యొక్క వ్యాప్తి

మనము గత అధ్యాయములో చూచినట్లుగా పశ్చిమ ఐరోపాలో సువార్త వ్యాప్తి చేయుటకుగాను విల్లిబ్రార్డ్ మరియు బోనిఫేస్ కష్టించి పనిచేసిరి. కాని అనేకులైన శాక్సన్‌లు మరియు ఫ్రీసియన్‌లు ఇంకనూ అన్యులుగా ఉన్నారు. వాస్తవానికి, జర్మన్ మరియు ఉత్తర దిగువ ప్రాంతములలో క్రైస్తవులైన శాక్సన్‌లను అన్యులైన శాక్సన్‌లచే ఎంతో ఘోరముగా హింసింపబడిరి! అలాగని శాక్సన్‌ల మధ్యన బోనిఫేస్ పని వ్యర్థమాయెనా...?

కానేకాదు! శాక్సన్లను మరియు ఇతర అన్య ప్రజలను మార్చుట కొనసాగించుటకై ప్రభువిప్పుడు చార్లీమాన్‌ను వాడుకోనైయున్నాడు. దాదాపు క్రీ.శ. 800 సం॥లో గతంలో క్లోవిస్ ఫ్రాంక్‌లకు రాజైనట్టు చార్లీమేన్ ఇప్పుడు వారికి రాజాయెను.

చార్లీమాన్ జీవితమంతయూ యుద్ధముతో నిండియున్నది. ఆయన నలభై ఆరేండ్ల పరిపాలనలో యాభైమూడు మిలిటరీ దండయాత్రలలో పాల్గొనెను! ఆయన రాజ్యము విస్తారముగా నున్నది. అనేక వేర్వేరు తెగల ప్రజలు ఆయన రాజ్యసంబంధులైరి. ప్రతి ఒక్కరు ఈ మహారాజుకు లోబడాలి. ఆయన బలము గల వాడైయుండి ఉన్ని వస్త్రములు ధరించి ఆయన భుజములపై నీలి వస్త్రము వేసికొని గుఱ్ఱముపై స్వారీ చేయుచుండెను. పదునైన పొడవైన బంగారు పూత పూయబడిన కత్తి ఆయన ఒరలో వ్రేలాడుచుండెను.

తరచుగా చార్లీమాన్ తన సైన్యములతో తిరుగబాటు చేయు శాక్సన్‌లను చూచుకొనుటకై తూర్పు రాజ్యమునకు వెళ్ళవలసి వచ్చెను. కాని ఆయన సైన్యములు తూర్పునకు వెళ్ళుటయేగాక ఉత్తర మరియు దక్షిణ భాగములకునూ వెళ్ళెడివారు.

దాదాపు ముప్పై ఆరు సంవత్సములు పిమ్మట చార్లీమేన్ ఓ గొప్ప సామ్రాజ్యమును స్థాపించెను. తూర్పునందు డాన్యూబ్ వరకు పడమరలో అట్లాంటిక్ సముద్రము వరకు మరియు ఉత్తర సముద్రము వరకు దక్షిణ మందు స్పెయిన్ మరియు రోమ్ వరకు వ్యాపించెను.

కాని ఆయన ఎక్కడకు వెళ్ళిననూ, చార్లీమేన్ డయాసిస్‌ను స్థాపించెను. (బిషప్‌చే పరిపాలన చేయబడు ఓ జిల్లాయే డయాసిస్) చార్లీమేన్ ఆశ్రమములను మరియు సంఘములు స్థాపించెను. వాస్తవానికి ఓ పెద్ద క్రైస్తవ సామ్రాజ్యమును స్థాపించాలని ఆయన ఆశ.

ఒకే మతముచే అన్ని జాతుల ప్రజలను ఐక్యము చేయాలని ఆయన ఆకాంక్ష. అదే క్రైస్తవ్యము,.

"దేవుని కృపచే" పరిపాలన చేసితినని చెప్పిన మొదటి రాజు చార్లీమాన్. ఈ కారణముచే ఆయన ఎవరినైతే జయించెనో వారు క్రైస్తవ మతమును స్వీకరింపవలెను. వారందరు బాప్తిస్మం తీసికోవాలి. ప్రత్యేకించి శాక్సన్‌లు ఈ నిబంధనకు విరుద్ధముగా తిరుగబడిరి. కాని ఏమి చేయవలెనో ఆ చార్లీమేన్‌కు తెలియును. ఖడ్గముచే... వారు విధేయులగులాగున వత్తిడిచేసెను. వాస్తవానికి, బైబిల్ ప్రకారము ఖడ్గముచే అన్యులను పశ్చాత్తాపపడజేయుట సరైన పద్ధతి కాదు...!

క్రీ.శ.800లలో రోమ్‌నందలి పోప్‌ను ఆయన దర్శింప వెళ్ళెను. అక్కడ అందమైన సెయింట్ పీటర్ చర్చ్‌నందు పోప్ ఈయనకు చక్రవర్తిగా కిరీటము ధరింపజేసెను.

ఇప్పుడు చార్లీమేన్ పశ్చిమ ప్రాచీన రోమా సామ్రాజ్యమునకు చక్రవర్తి యాయెను. సంఘమునకు ఎంతో చేయు క్రైస్తవ చక్రవర్తిగా పోప్ ఆయనను గుర్తించెను. పేతురు తరువాత వచ్చినవాడు పోప్ అని చక్రవర్తి ఒప్పుకొనెను. కాని ఆయన పోప్ యొక్క పరిచారకుడని ఒప్పుకోలేదు. చక్రవర్తి తన డయాసిస్‌కు బిషప్‌లను నియమించుచుండెను. అవసరమైతే సంఘవిషయములను పరిష్కరించుటకై తనంతట తానే సంఘముల సమావేశమును జరిపించెడివాడు. అందుకే ఆయన బిషప్‌లకు బిషప్‌గా పిలువబడెను. తన రాజ్యవాసుల క్షేమము అందులో నిత్యత్వ క్షేమము ఆయన కోరుట, అది ఆయన బాధ్యత అని భావించేవాడు. ఆయన రాజ్యములోని సంఘము ఓ నిజమైన రాజ్య సంఘము!

ఆలయములు వారి డయాసిస్‌లలోని ఆశ్రమములలో పాఠశాలను స్థాపించవలెనని ఆయన



బిషప్‌లకు ఆజ్ఞాపించెను. విద్యార్థులు వారి పాఠములు సరిగా నేర్చుకుంటున్నారో లేదో చూచుటకు స్వయాన చార్లీమేన్ పాఠశాలను దర్శించేవాడు.

పాఠశాలలో మంచి గ్రంథాలయములు నెలకొనులాగున ఆయన ఎన్నో పుస్తకములను చేతిప్రతులుగా చేయించెను. (అప్పటికింకను ముద్రణ కళ కనుగొనబడలేదు) చార్లీమేన్‌కు జ్ఞానము పట్ల ఎంతో మక్కువ ఉండేది, ఆయా విషయాలలో ఎక్కువగా నేర్చుకొనుటకై ఆయా పండితులను ఆహ్వానించేవాడు. ఆయన లాటిన్ మరియు సంఘభాష, కాస్త గ్రీక్ భాషయూ తెలిసినవాడైయుండెను. అగస్టీన్ గ్రంథములతో సహా అనేక గ్రంథములను చార్లీమేన్ చదివేవాడు గనుక అనేక విషయములపై చక్కటి న్యాయ విమర్శచేసేవాడు. ఏది ఏమైనా ఆయన చేతి వ్రేళ్ళు దట్టముగానుండెను. గనుక వ్రాయుట నేర్చుకొనలేదు కాని ఆయన చేతులు ఎక్కువగా ఖడ్గము రళిపించుటకై అలవాటు పడినవి.

దేవశాస్త్రవాదులతో కలిసి అగస్టీన్ బోధించిన విధముగా సిద్ధాంతములను కాపాడుటకు చార్ల్‌మేన్ కోరిక కలిగియుండెను. కాని భక్తుల అవశేష ఆరాధన, భక్తుల పేరిట ప్రార్థించుట చార్లీమేన్ అనుమతించేవాడు అదే ఆయన బలహీనత.

ఏది ఏమైనా చార్లీమేన్ విగ్రహారాధనను నిషేధించెను. ఆయన వాటిని సంఘములనుండి తొలగింపజేసెను. కాని ఆయన మరణము తర్వాత విగ్రహములు మళ్ళీ సంఘములో ప్రవేశించెను. చక్రవర్తి ప్రభువు హస్తములలో పనిముట్టుగానుంటూ దేవుని రాజ్య రాకడకొరకు పనిజేసెను.

అతడు 'ప్రభువా నా ఆత్మను నీ హస్తములలోనికి అప్పగించుకొనుచున్నానని" నెమ్మదిగా పాడుతూ మరణించెను. ఇవే అతని చివరి పలుకులు.

31. తూర్పు సంఘము - గొప్ప విభజన

మనమిప్పుడు మూడు వందల సంవత్సరములు వెనక్కి వెళ్ళుదము. అది దాదాపు క్రీ.శ 501. ఇప్పుడు రెండు రోమా సామ్రాజ్యములు గలవు. రోమ్ ముఖ్యనగరముగా పశ్చిమరోమా సామ్రాజ్యము, కాన్స్టంటినోపుల్ ముఖ్యనగరముగా తూర్పు రోమా సామ్రాజ్యము.

కాని రెండు సామ్రాజ్యములలోనూ ఒకే సంఘమున్నది అదే క్రైస్తవ క్యాథలిక్ (సార్వత్రిక) సంఘము. క్రైస్తవ సంఘమంతటికి ముఖ్యుడైన పోప్ రోమ్ నందుండును. పితరుడు, సంఘమునందు రెండవ ప్రముఖుడు కాన్స్టంటినోపుల్ నందుండేవాడు. తూర్పునందు పాట్రియార్క్ (పితరుడు) సంఘమునకు ముఖ్యుడుగా భావించేవాడు. కాని పశ్చిమ మందున్న పోప్ ఆయనతో పూర్తిగా సమ్మతింపలేదు.

అతి త్వరలో తూర్పున సంఘము మరియు పశ్చిమ సంఘము మధ్యన సమస్యలు తలెత్తనైయున్నవి. భాషా బేధమే గాక సిద్ధాంత బేధమునూ కలదు (పశ్చిమ సంఘములో లాటిన్ మరియు తూర్పు సంఘములో గ్రీకు భాష మాట్లాడేవారు) ఉదాహరణకు పరిశుద్ధాత్ముడు తండ్రి, కుమారులనుండి ప్రభవించును అని పశ్చిమ సంఘము బోధించును. దీనినే బైబిల్ బోధించుచున్నది. కాని పరిశుద్ధాత్ముడు తండ్రి నుండి మాత్రమే ప్రభవించునని తూర్పు సంఘం బోధించును.

మతగురువులకైన పెండ్లి కాకుండా వుండడమును గూర్చి అనేక అభిప్రాయములు గలవు. పెండ్లి కాకుండా వుండడమంటే మతగురువులెవరునూ వివాహమాడరాదు. ఇది మతగురువులలో పై ర్యాంక్‌లలో ఉన్నవారికే వర్తించేది. బిషప్‌లకు మరియు ఆర్చ్ బిషప్‌లకు వర్తించేది. తరువాత తక్కువ ర్యాంక్‌లో ఉన్నటువంటి మతగురువులకు సంఘములో పని చేయువారికి ఈ అవివాహత్వనియమము వర్తింపజేయబడెను. ఈ విధముగా పై ర్యాంక్‌లో ఉన్నవారైనా క్రింది ర్యాంక్‌లో ఉన్నవారైనా వివాహమాడుటకు అనుమతింపబడలేదు. ఇది ఈ సమస్య చాలా దూరం వెళ్లునట్లు తూర్పు సంఘం భావించెను.

తూర్పునందు భక్తుల ప్రతిమలు వెంటనే ఉంచబడెను. ప్రజలు వాటిని ఆరాధనకై వాడెడివారు. పశ్చిమ సంఘములలో కూడా ప్రతిమలుండేవి, కాని వీటికి తూర్పు సంఘములలో ఉన్నంత ప్రాముఖ్యత ఇక్కడ ఉండేది కాదు. ప్రతిమలలో సాక్షాత్తు ఆ వ్యక్తులే ఉన్నట్టు తూర్పు సంఘములు భావించెను. ఉదాహరణకు క్రీస్తు ప్రతిమవైపు దృష్టి సారించి తదేకముగా చూచినచో దేవుని కృపాశక్తి మీ ఆత్మలోనికి ప్రవహించునని వారు నమ్మేవారు!

అందుకే తూర్పునందలి సంఘకార్యక్రమములు మరియు ఆశ్రమ జీవితము పశ్చిమముకంటే భిన్నముగానుండెను. తూర్పునందు పాటలుపాడుటకు, ప్రార్థనలకు మరియు మౌన ధ్యానమునకు అధిక ప్రాధాన్యత నిచ్చేవారు. మరియు త్వరలోనే తూర్పునందు సన్యాసులు మరియు సాధువులు అగుపించుట చూచెదము. లోకమునుండి వేరైతేనేగాని పర సంబంధ సంగతులను తలంచుట సాధ్యముకాదని వారు భావించిరి. ఇలా చేయుటవలన భూసంబంధ సంగతులకు అతీతముగా ఉండవచ్చునని భావించిరి. ఆ విధంగానైనా కనీసము వారి జీవితములో కొంత భాగమైనా "పర సంబంధ మార్గమున" జీవించవచ్చునని భావించిరి.

ప్రజలెంతో విపరీతముగా భక్తుల అవశేష ఆరాధనలో శ్రద్ధకలిగి యుండెడివారు. యోసేపు, సమూయేలు మరియు యాజకుడైన జకర్యాల యొక్క అవశేషములను కాన్స్టంటినోపుల్‌కు తెచ్చిరి. ఈ అవశేషములతో పాటు గొప్ప ఊరేగింపులు జరుపబడేవి. వీటిలో చక్రవర్తులు బిషప్ ప్రక్కనే నడిచేవారు.

కొంతమంది చక్రవర్తులకు అవశేష ఆరాధన విపరీతదశకు చేరుకొనెను. అది చేతబడి చేసినంతగా



వెళ్ళెను. గనుక చక్రవర్తులు ప్రతిమను తీసుకు వెళ్ళిరి. ఈచర్య ద్వారా సంఘములోని సన్యాసులు మరియు స్త్రీలు ఎంతగానో ఇబ్బందిపడిరి. ఈ తీర్మానమును వారు సమ్మతింపలేదు! తరువాత తియోడోరను మహారాణి తిరిగి ప్రతిమలను సంఘములోని తీసుకువచ్చెను. అది జరిగినపుడు అందరు ఆనందించిరి. ప్రతి సంవత్సరము ఈ సంఘటన ఉత్సవముగా జరుపుకొనబడెను. దానిని ఆర్థోడాక్సీ ఆదివారమని పిలుతురు. "ఆర్థోడాక్సీ" అంటే ఈ సందర్భంలో 'హితబోధ' మరియు 'స్తుతి అర్పించుట'. దివ్యారాధనలో అతి ప్రాముఖ్య సంగతి దేవునికి స్తుతి పాడుట.

ఈ వ్యత్యాసముల రీత్యా పశ్చిమ మరియు తూర్పు సంఘములు ఎంతో ఎడబాటు కలిగి దూరమాయెను. వారి మధ్యన ఉన్న విభజన ఇంకా ఎక్కువ అధికమాయెను. కాని ఇది ఇలా ఉండగా పోప్ ఇంకనూ తూర్పుసంఘముపైఅధికారముచలాయింపగోరుతున్నాడు. తూర్పునందలి గ్రీక్ పితరులు (పాట్రియార్క్స్) పోప్ ఎంతో అధికారము కలిగియుండగోరుతున్నాడని తెలుసుకొని హేళన చేయబడినట్లుగా భావించిరి. అందుకే ఇప్పుడు స్కిజమ్ (విడిపోవుట) అనునది జరగాలి.

క్రీ.శ 1054 సం॥లో కాన్స్టంటినోపుల్ పాట్రియార్క్ పోప్‌పై అనేక ఆరోపణలు చేసెను. బలిపూజ సమయంలో పులియని రొట్టెను వాడుట. ఈ విషయమును గూర్చి చర్చించుటకై పోప్ తన ప్రతినిధిని పాట్రియార్క్ నొద్దకు పంపెను గాని అది ఏ విధముగానూ సహాయపడలేదు. దానికి విరుద్ధమైనది జరిగెను. పాట్రియార్క్‌ను బహిష్కరిస్తూ పోప్ ఆజ్ఞ జారీ చేసెను. ఈ విధముగా పాట్రియార్క్ సంఘమునుండి బహిష్కరింపబడెను. ఆయన పోప్‌ను విమర్శించెను గనుక సంఘపరమైన శాపము ఆయనపై ఉచ్చరింపబడెను. పోప్‌ను ఎవరునూ విమర్శింపరాదు. ఎవ్వరు కూడానూ... ఆ విధముగా పోప్ భావించును! ఇప్పుడు పాట్రియార్క్ ఏమి చేయును? ఆయన సంఘసమావేశము చేసి పశ్చిమ సంఘమును బహిష్కరింప నిర్ణయించెను. దీని ద్వారా "మీరు మాతో ఏకముగా లేదని వారు చెప్పిరి. మేము మిమ్మును వెలివేస్తున్నాం" మనము పిలిచే ఈ విభజన ఎన్నటికిని మానలేదు. ఇప్పటినుండి తూర్పు నందలి సంఘము గ్రీక్ ఆర్థోడాక్స్ సంఘముగా పిలువబడెను. పశ్చిమమందలి సంఘము రోమన్ క్యాథలిక్ సంఘముగా పిలువబడుచున్నది.

32. అంధకార ఘడియలు

చార్లీమాన్ యొక్క గొప్పదియునూ మరియు శక్తివంతమైన సామ్రాజ్యములో ప్రజలు అంధకారఘడియలు అనుభవిస్తున్నారు. ఉత్తరము నుండి, నార్వే నుండి డెన్మార్క్ మరియు స్వీడెన్ నుండి క్రూరులైన ప్రజలు సమీపించుచున్నారు. వేగముగా పయనించు తమ పడవలతో సముద్రపు దొంగలు ఇంగ్లండ్, నెదర్లాండ్స్ మరియు ఫ్రాన్స్ తీరములను చేరుకొనిరి. పిమ్మట హింస ప్రారంభమాయెను. ప్రజలు చంపబడ్డారు. భవనములు కొల్లగొట్టబడినవి మరియు నిప్పంటింపబడినవి. సంఘములు మరియు ఆశ్రమములు నాశనము చేయబడి నిప్పంటింపబడినవి. పట్టణములు మరియు గ్రామాలు దోచుకొనబడి నాశనము చేయబడినవి. వృద్ధులు హతము చేయబడిరి మరియు యౌవనులు బానిసలుగా చెఱకు కొనిపోబడిరి.

సముద్రపు దొంగలు వెళ్తూ రక్తము, అగ్ని మరియు పొగ ఛాయలు విడిచి వెళ్ళిరి. కాని వారు పదేపదే తిరిగి వచ్చిరి. ఈ ఘోరహింస కొన్ని సంవత్సరముల వరకు కొనసాగెను. కాని నిర్భాగ్యులైన క్రైస్తవులు వారి సంఘములలో నుంటూ "ఓ దేవా మమ్మును ఈ యోధులు మరియు సముద్రపు దొంగలనుండి రక్షింపుము"..... అని మొఱ్ఱపెట్టుకొనిరి.

చార్లీమేన్ కుమారుడైన పైయస్ అయిన లూయిస్ ఇప్పుడు చక్రవర్తి యాయెను. ఆయన ఏం చేయాలన్నా అశక్తునిగానుండెను. వాస్తవానికి ఆయన రాజ్యము అంతర్యుద్ధము చిన్నాభిన్నము చేయబడెను. ఎందుకంటే అతని ముగ్గురు కుమారులు ఒక్కొక్కరు ఒక్కొక్క పరగణాపై పరిపాలన చేసిరి. సముద్రపు దొంగలు ఈ పరిస్థితిని సొమ్ము చేసికొనిరి!

చీకటి ఘడియలు... సంఘములోనూ చోటు చేసుకొనెను. అది పతన సమయం. గతములో కొందరు పోప్‌లు ప్రజలకు చక్కటి మాదిరి నుంచిరి. కాని మధ్య యుగములలో పరిస్థితులు మారెను. భక్తిహీన జీవితములు గడిపే చెడ్డపోప్‌లు వచ్చిరి. రోమ్‌నందు పరిస్థితి చాలా అంధకారమయముగా నున్నది. శతాబ్దపు మొదటి



భాగములో ఒకరి తర్వాత ఒకరు పద్నాలుగు మంది పోప్‌లు వచ్చిరి. కాని అందులో చాలమంది హతము చేయబడిరి. రోమ్‌లో కలవరము చెలరేగెను. ఒకానొక సమయమునందు ముగ్గురు పోప్‌లునూ ఉండిరి. వారందరు ఒకరిపై ఒకరు శాపవచనములు పలుకుకొనిరి!

ఈ ముగ్గురిలో ఒక పోప్ తక్కిన ఇరువురిని హతము చేసి చాలా విలాసవంతపు జీవితము సాగించెను. పవిత్ర నగరమైన రోమ్‌నందు అట్టి పరిస్థితి నెలకొనెను...! పోప్ యొక్క చెడ్డ మాదిరిని మత గురువులలో చాలా మంది అనుసరించిరి. సంఘ పరిచారకులునూ గొప్ప విలాస జీవితమును గడిపిరి. వారు విందులకు వెళ్ళి తప్ప త్రాగి వచ్చేవారు. మతగురువులు ప్యారిషనర్‌ల (ప్రజల) అవసరములను లెక్కచేయలేదు. వారు తరుచుగా పాపాత్మక మరియు భక్తిహీన జీవితం జీవించిరి. ఎంతో ఘోర దుస్థితి...! చాలా ఆశ్రమాలలో కూడాను జీవన విధానము పాపాత్మకముగానున్నది. సన్యాసులు సుఖ భోగ జీవితము జీవించిరి. పరిస్థితులు చాలా చెడ్డగానున్నది. చాలామంది సన్యాసులు స్త్రీలతో అక్రమసంబంధము కలిగియుండిరి. వారు నీచ మరియు మోస జీవితము జీవించిరి.

ప్రతి ఒక్కరు వారికిష్టమైనది చేయుచువచ్చిరి. ఇట్టి పతనము సంఘములలోను మరియు ఆశ్రమములలోను గొప్పగానుండెను. మరొక సందర్భములో ముగ్గురు పోప్‌లు రోమ్‌నందు ఒకేమారు ఏలుచుండిరి.

సంఘములో ప్రాధాన్యత కొరకు ఒకరితో ఒకరు పోరాడిరి. ఈ సమయంలో జర్మన్ చక్రవర్తి తన పెద్దసైన్యముతో రోమ్ వచ్చెను. ఆయన ముగ్గురు పోప్‌లను తొలగించి క్రొత్త పోప్‌ను నియమించెను. అప్పుడు చక్రవర్తి సంఘములో కూడా అదుపు కలిగియుండెను. వాస్తవమే, ఇలా చేయుట మంచిది కాదు గాని ఇదంతయూ పోప్‌ల చెడ్డ మాదిరిని బట్టి వచ్చెను.


స్వయాన చక్రవర్తి పోప్‌లను నియమించుచుండెను. ఆయన తరచుగా వారికి సువిశాల ప్రాంతమునిచ్చి ఆయనిచ్చిన ప్రాంతముపై ప్రభుత్వము చేయమని వారిని కోరెను. ఈ కారణముచే బిషప్‌లు చాలా అధికారము గల వారైరి. అట్టి అధికారముగల పోప్‌లకు మన్‌స్టర్ మరియు కొలోన్ ఈ ఇరువురు ఓ చక్కటి ఉదాహరణ. బిషప్‌లు లౌకిక పాలకులైరి. ఎప్పుడైనా ఒకరు బిషప్‌గా నియమింపబడితే వారు చక్రవర్తికి బహుమానమిచ్చేవారు. అయితే అతి త్వరలో ఏమి జరిగెను? ఆ యా వ్యక్తులు పెద్ద మొత్తములో చక్రవర్తికి దబ్బిచ్చి లేదా ఓ పెద్ద బహుమానమిచ్చి బిషప్‌లు కాదలచిరి. ఉదాహరణకు బిషప్ పదవి సామర్థ్యమున్న వారికి గాక పెద్దమొత్తము ఎవరైతే ఇచ్చారో వారికి దక్కుచుండెను. ఇదంతయూ స్పష్టమైన లంచమే! సంఘపరమైన పదవులు డబ్బుకు రాబడికి వనరులై వాణిజ్యపరమాయెను బిషప్‌లు కూడా ఆ సంఘ పదవులను అమ్మకమునకు బెట్టిరి. సంఘము సంత వీధిగా మారెను. సంఘ పదవులను కొనుట అనునది అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో గారడి సీమోను ధనమిచ్చి పరిశుద్ధాత్మ వరమును కొనదలచినట్లుగా ఉన్నందున దీనిని సిమోని అని పిలిచిరి.

పోప్‌కు బదులుగా చక్రవర్తియే నేరుగా బిషప్‌లను ఎన్నుకుంటూ దానిని వర్ణించుటకు "ఇన్వెస్టిట్యూర్" అను పదము వాడిరి, ఈ బిషప్‌లను నియమించే హక్కు విషయమై పదేపదే చక్రవర్తి మరియు పోప్ తీవ్ర అసమ్మతి కలిగియున్నట్టుగా మనము గమనించవచ్చును. దీనినే మనము "ఇన్వెస్టిట్యూర్ కాంట్రోవర్సి" అని యందుము.

సాతాను, దేవునికి మరియు ఆయన సంఘమునకు ప్రధాన శత్రువైయుండి, బలమైన దాడులు జరిపెను! సంఘము వెలుపలనుండి సముద్రపు దొంగల ద్వారా దాడి జరిగెను. సంఘము తన నాయకుల అక్రమ మరియు అనైతిక జీవిత విధానము ద్వారా, సిమోని అభ్యాసము ద్వారా మరియు ఇన్వెస్టిట్యూర్ వివాదముచే లోలోపల దాడి చేయబడెను. ఇట్టి సాతాను దాడులచే సంఘము శ్రమపడెను. అయినను, క్రైస్తవ్యమింకనూ నాశనము కాలేదు. తన సంఘమును కాపాడి భద్రపరచువాడు దేవుడే గనుక వినాశము అసాధ్యము!

33. క్లుని - చీకటి సమయములో ఆశాకిరణము

సమయములు చీకటిగానున్నా ఓ చిన్న ఆశాకిరణము అగుపించుచున్నది. ఈ చీకటి సమయములలో కూడాను సంఘములోని వేలాది క్రైస్తవులు నైతిక పతనమును గూర్చి చాలా బాధపడిరి. అక్కడ జరిగే సంగతుల విషయములో వారు సంతోషముగా లేరు. ఫ్రాన్స్ నడిబొడ్డున క్లుని అను నగరము ఉన్నది. క్రీ॥శ॥ 910 లో సన్యాస ఆశ్రమము స్థాపింపబడెను. ఈ సన్యాస ఆశ్రమములో ఉన్నతప్రమాణములు గల క్రమశిక్షణ ఉండవలెను. మఠాధిపతి నియమములకు ఖచ్చితముగా లోబడవలెనని కోరెను. ఆశ్రమము చుట్టూ ఉన్న ప్రజలకు సన్యాసులు చక్కటి మాదిరి చూపవలసియున్నది. అవిధేయులైన సన్యాసులు అత్యంత కఠినముగా శిక్షింపబడిరి. ఆశ్రమము యొక్క ఉద్ధేశము దైవసేవ మరియు పొరుగువానిసేవ అని ప్రదర్శింపవలెను. క్లునిలో ఒక డ్యూన్ చాలా పెద్దభూమిని కలిగియుంటే దానిలో చాలా భాగమును ఆయన దానిని సన్యాస ఆశ్రమమునకిచ్చెను. సన్యాసులు ఈ పొలములలో పనిచేయవలెను. త్వరలోనే క్లుని సన్యాస ఆశ్రమము ప్రఖ్యాతిగాంచెను. ఆశ్రమములో జరుగుతున్న సంగతుల విషయమై ప్రజలు చాలా సంతోషించిరి. ఇతర అనేక ఆశ్రమములు క్లునిలోని ఆశ్రమము మాదిరిని అనుసరించెను, ఐరోపాలోని ఇతర ఆశ్రమముల వారునూ ఈ మాదిరి అనుసరించిరి. ఈ ఆశ్రమములన్నియూ క్లునిలోని ఆశ్రమముతో కలిసెను, ఆ విధముగా క్లునియాక్ ఆర్డర్ ఏర్పడెను. సమయము గడిచేకొలది రెండువేల ఆశ్రమములు క్లునియాక్ ఆర్డర్‌లో చేరెను. ఇతర ఆశ్రమములు క్లునిలోని "మదర్ హౌస్"తో చేరాయి గనుక మఠాధిపతి వాటిని పరీక్షించుటకు ప్రయాణించుచుండెను.



పెద్దమార్పులు జరిగెను కాని రోమన్ క్యాథలిక్ చర్చ్‌యొక్కబోధలు ఇంకనూ ప్రభావితము చేయుచుండెను. క్రీ॥శ॥1073లో క్లునిలోని సన్యాసి అయిన హిల్డిబ్రాండ్ పోప్‌గా నియమింపబడెను. ఆయన ఎన్నుకోబడిన తరువాత పోప్ గ్రెగరిVII అని ఆయన పిలువబడెను. ఇప్పుడు సంఘములోని పరిస్థితులు మారుట ప్రారంభించెను. మత గురువుల అక్రమ మరియు భక్తిహీన జీవితము అంతమొందించాలని నిర్ణయించెను. అందుకే తక్కువ స్థాయి మతగురువులు అవివాహితులుగా (బ్రహ్మచర్యము) ఉండవలెనని ఆజ్ఞాపించెను. అంతకు ముందు పైస్థాయి మతగురువులు (బిషప్‌లు మరియు ఆర్చ్‌బిషప్‌లు) అవివాహితులుగా ఉండేవారు. సంఘము మరియు పాపపుప్రపంచము వేర్వేరుగా ఉండాలని ఇటువంటి పద్ధతిని పోప్ అనుసరించెను. ఈ క్రొత్త వివాహనిషేధము వలన ఏడవ ఆజ్ఞకు విరోధముగా ఎక్కువ పాపము జరిగెను.

బలవంతపు వివాహనిషేధము అనునది దేవుని వాక్యమునకు విరోధముగా నున్న గొప్ప తప్పు.
ఇతర మతగురువులు ఇదివరకే వివాహము చేసికొని పిల్లలను కనియుండిరి. ఇప్పుడు వారి సంగతేంటి? మతగురువులు వారి పిల్లలను మరియు భార్యలను పంపివేయాలి! ఇంకా ఎన్నో మార్పులు జరుగనైయున్నవి.

ఇప్పటినుండి బిషప్‌లను మరియు మతగురువులను ఎన్నుకొనే అధికారము సంఘము మాత్రమే కలిగియుండును. చక్రవర్తికి ఇందులో ఎటువంటి ప్రవేశముండదు. మత గురువు స్థానక్రయ విక్రయములు నిషేధింపబడినవి. అలా చేసిన వారు బహిష్కరింపబడిరి.

ఎవరైన తనకివ్వబడిన అధికారము కాక ఎక్కువ అధికారము చలాయిస్తే పోప్ సహించేవాడు కాదు. అది సూర్య, చంద్రులవలె యుండునని ఆయన చెప్పెను. చంద్రుడు సూర్యుని నుండి వెలుగుపొందును. అదే విధముగా చక్రవర్తులు మరియు రాజులు వారి అధికారమును పోప్‌నుండి పొందెదరు. హెన్రీ 4 అను చక్రవర్తి తనను తాను బిషప్‌గా నియమించుకొనెను. ఆయన పోప్‌ను ధిక్కరించెను. గనుక పోప్ ఇట్టి బిషప్‌లను హెన్రీతో సహా బహిష్కరించెను. బహిష్కరింపబడిన చక్రవర్తి మాకు వద్దని జర్మన్ పాలకులు (డ్యూక్స్ మరియు కౌంట్స్) చెప్పిరి. నిషేధము ఎత్తి వేయబడకపోతే వారు మరొక చక్రవర్తిని ఎన్ను కొందుమని చెప్పిరి. చర్య తీసికొనులాగున హెన్రీ ఒత్తిడి చేయబడెను.

ఆయన భార్య, తన బిడ్డతో పాటు ఆయన ఆల్ప్స్ పర్వతములు దాటి చలికాలములో కనోస్సకు వెళ్ళెను. అక్కడే పోప్ నివాసముంటున్నాడు. వెంట్రుకల చొక్కా పశ్చాత్తాప సూచనగా ధరించి నిషేధమును ఎత్తివేయమని చక్రవర్తి మనవి చేసికొనెను. అంతఃపురద్వారము దగ్గర ఆయన వేచియుండులాగున పోప్ చేసెను. మూడు పగళ్ళు మూడు రాత్రులు చల్లని మంచులో హెన్రీ నిలువబడవలసివచ్చెను. అప్పుడు పోప్ ఆయనకు పాపక్షమాపణ అనుగ్రహించెను.

ఇటు పోప్ అటు చక్రవర్తి వట్టి మాటలు చెప్పిరి. అపనమ్మక వాతావరణము నెలకొనెను. మూడు సంవత్సరముల తరువాత చక్రవర్తి తన సైన్యముతో రోమ్ మీదికి వెళ్ళి పగతీర్చుకొనెను. ఆ నగరమును ముట్టడిచేసి దానిని బంధించిరి. పోప్ తప్పించుకొని చెఱలో మరణించెను. చక్రవర్తి క్రొత్త పోప్‌ను నియమించెను. అధికారము కొరకైన పోరాటము పోప్ మరియు చక్రవర్తి మధ్య కొన్ని సంవత్సరముల పాటు కొనసాగెను.

ఇటువంటి చీకటి శతాబ్ధములలో భూమి మీద సంఘమును పరిపాలించి నడిపించినది చక్రవర్తి కాదు, పోప్ అసలేకాదు. కాని ప్రభువైన యేసు నడిపించి పరిపాలించెను. ప్రజలను శ్రద్ధగా చూచుకొనువాడు ప్రభువైన యేసు. ఆయనకు పోప్ సహాయముగాని చక్రవర్తి సహాయముగాని అక్కరలేదు!

34. యాత్రలు

తనసొంత కుమారుని సమాధి దగ్గరగాక దేవుని ప్రార్థించుటకు మరొక మేలైన స్థలముంటుందా? ప్రయాణం చేయుటకు పవిత్ర భూమికంటె మరొక మేలైన స్థలముండునా? పవిత్ర స్థలములు, పవిత్రభూమి దర్శించుట ద్వారా దేవుని సంతోషపెట్టవచ్చునని ప్రజలు భావించిరి. ఈ ప్రయాణములను యాత్రలని, అట్టి ప్రయాణము చేయువారిని యాత్రికులని మనమందుము. కాన్‌స్టంటైన్ మహాచక్రవర్తి పాలనలోకూడ ప్రజలు రక్షకుడు జన్మించి జీవించి మరణించిన స్థలమును దర్శించిరి. యాత్రికులు ఎన్నో కష్టములు ప్రయాణము దూరమైనా ఇబ్బందికరమైనా వాటిని భరించి ప్రభువైన యేసు సిలువవేయబడిన స్థలమును ఆ సిలువ చెక్కలు, మేకులు కనబడు స్థలమునకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో మోకాళ్ళుని మ్రొక్కేవారు. వారికి ఇటువంటి వస్తువులు ఎంతో ప్రశస్తముగా ఉండేవి.! ఆ వస్తువులు ఉండు చోటును ప్రతియొక్కరు దర్శించుటకు ఇష్టపడిరి! అక్కడ ప్రార్థించుట ద్వారా వారు వారి పాపములు క్షమింపబడునని మరియు రక్షణ నిశ్చయత పొందవచ్చునని విశ్వసించిరి. ఆ స్థలములో మరణిస్తే ఎంత బావుండును! యేసు ప్రభువు మరణించిన ఆ ఖచ్చితస్థలములో .... ఆ చివరి రోజున ప్రభువైన యేసు తిరిగి వచ్చినపుడు మహాతీర్పుదినమున అక్కడ ఉంటే ఎంత అద్భుతముగా నుండును....! పాలస్తీనా ఇప్పుడు ఇశ్రాయేలుగా పిలువబడుచున్నది. ఐరోపాయందంతటినుండి ప్రతి సంవత్సరము పెద్ద సంఖ్యలో యాత్రికులు పాలస్తీనాకు వెళ్ళేవారు. మనము ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ముస్లింలు పవిత్ర భూమిని జయించిరి. అయిననూ వారు యాత్ర నిమిత్తమై వెళ్ళేవారు. గనుక క్రైస్తవులు పాలస్తీనాకు యాత్రచేసినపుడు వారిని ఇబ్బంది పెట్టలేదు. ప్రభువైన యేసు సమాధి దగ్గర కట్టబడిన సంఘముతో సహా యెరూషలేములో సుందరమైన సంఘభవనములు కట్టబడెను. కాని పదకొండవ శతాబ్దము మధ్యలో పరిస్థితులు మారెను. క్రూరులైన టర్కీ తెగలు యెరూషలేమును జయించెను. యాత్రికులను వారు ఇబ్బంది పెట్టి, వారు మోకాళ్ళమీద ఉండి ప్రార్థించుచుండగా టర్కీతెగ ప్రజలు క్రైస్తవులపై దాడి చేసేవారు, వారిని గాయపరచేవారు. కొన్నిసార్లు వారు యాత్రికులను బంధించి బానిసలుగా తీసుకుని పోయి వారిని అమ్మేవారు.

ఐరోపా ప్రజలు ఈ సంగతులను గూర్చి వినినపుడు ఎంతో మండిపడిరి. ఇప్పుడు యాత్రికులతో సైనికులునూ వెళ్ళిరి. యేడువేల యాత్రికులు బయలుదేరితే వారితో అనేక బిషప్‌లు మరియు సైనికులు వెళ్ళేవారు. బిషప్‌లు వారితో పాటు ఖరీదైన వస్త్రములు, బంగారు పళ్ళెములు తీసికొని వెళ్ళేవారు. ఇటువంటి వస్తువులు దొంగలముఠాను ఆకర్షించేవి. యాత్రికులు యెరూషలేము చేరేలోపుగా చాలా పోట్లాటలు జరిగేవి. వీటిని గూర్చి పోప్ విని చర్య తీసికొనెను. పవిత్రభూమి నుండి టర్క్ ప్రజలను తరిమి వేయునిమిత్తమై "ప్రపంచమును" కోరాలని ఆయన ఆలోచించెను.

"ప్రపంచము" అనగా అందులో రాజులు, చక్రవర్తులు, బిషప్‌లు, దాసదాసీలు, కళాకారులు, వ్యాపారస్తులు మరియు కూలీలు. పాలస్తీనాలో యాత్రికులకు సహాయము చేయుటకై పోప్ ప్రతియొక్కరిని కోరెను. పోప్ ఫ్రాన్స్ వెళ్ళెను. ఆయన బహిరంగముగా నుంచొని అక్కడ చేరిన ప్రజలందరిని ఉద్దేశించి మాట్లాడెను "యేసు సిలువ ఒకప్పుడు నిలువబడిన స్థలమునకు మతయుద్ధము చేయుటకై మీరందరు వెళ్ళవలెనని ఆయన వారిని పురిగొల్పెను. ఇది నీతి కార్యము గనుక దీని విషయమై దేవుడు మీ విధేయతను కోరుచున్నాడు. ఇతర అనేక సంగతులతో పాటు మీ ప్రాణములను తెగించి సహితము టర్కీ ప్రజలతో యుద్ధము చేయవలెను. వాస్తవానికి క్రీస్తు మరణించిన నగరములో మనము మరణించుట ఓ ఘనత. మీరక్కడ మరణిస్తే మీ పాపములన్నియూ క్షమింపబడునని పోప్ చెప్పెను. మతయుద్ధములో పాల్గొనగలిగిన వారందరు తప్పక పాల్గొనాలి. దానికి సూచనగా మీ కుడిభుజముపై ఎర్రని సిలువ ధరింపవలెను.




దానికి స్పందన అద్భుతముగా వచ్చెను. "ఇది దేవుని చిత్తము, దేవుని చిత్తము" అని వేలాదిగా ప్రజలు కేకలు వేసిరి. వారు ప్రతి నగరములో పట్టణములో, గ్రామములో ఇటువంటి నినాదము చేసిరి. ఇతర దేశప్రజలు కూడా ఈ వార్త వినాలి. కాని ఎలా? పీటర్ ఆఫ్ అమియెన్స్ అను ఓ యాత్రికుడు సన్యాసియైన పీటర్ అని పిలువబడెను, ఆయన ఈ సంగతిని విదేశములలో వ్యాపింపజేసెను. ఆయన స్వయాన యెరూషలేము దర్శించి యాత్రికుల కష్టములను అనుభవించెను. ఆయన యాత్రికుని బూడిదరంగు వస్త్రము ధరించి చేతిలో సిలువ పట్టుకొని అనేక స్థలములు తిరిగి పోప్ మనవిని ప్రచారము చేసెను.

ఆ విధముగా పశ్చిమ ఐరోపా యందంతట ప్రజలు కార్యమునకు పూనుకొనిరి. పాలస్తీనాకు ప్రయాణము చేయవలెనని ప్రజలు ప్రతిచోట సిద్ధపడుచుండిరి. "ఇది దేవుని చిత్తం" అని వారు ప్రతిచోట కేకలు వేసిరి. కాని ఇది నిజముగా దేవుని చిత్తమేనా...?

35. మతయుద్ధములు

ప్రజలు ఎంతో దూరమునుండి వస్తున్నారు. వీరులు వారి అంత:పురముల నుండి వారి పనివారలతో బయలుదేరిరి. వేవేల సన్యాసులు వారి భుజములపై సిలువ గురుతు ధరించి వారి సురక్షిత మఠమును విడచి వచ్చుచున్నారు. రైతు తన పొలమును విడిచి, వారి భార్య బిడ్డలకు వీడ్కోలుపలికి కొన్నిసార్లు భార్యా బిడ్డలతో కలసి బరువైన బండ్లలో బయలుదేరేవారు. కూడిన స్థలమువైపు వేలప్రజలు కదులుచున్నారు.



ఎందుకింతమంది మతయుద్ధమునకై వెళ్ళుచున్నారు? ఇది దేవుని చిత్తమని అందరూ భావిస్తున్నారా? అందరూ అలా భావించుటలేదు. వీరులు చాలామంది ఘనతమహిమలను కోరుచున్నారు. కొందరు ప్రజలు ఉల్లాసము, సాహసములను కోరుకుంటే ఇంకొందరు ధనికులవ్వాలని ఆశిస్తున్నారు. పాలస్తీనాలో కొల్లసొమ్ము చాలా ఉందని పోప్ చెప్పలేదా?

బూలన్ యొక్క గాడ్‌ఫ్రే, ఓ ఫ్రెంచ్ వీరుడు. మొదటి పెద్ద మత యుద్ధమును నడిపించుటకు నియమింపబడెను (1096-1099 క్రీ.శ.) మతయుద్ధము ప్రారంభము చేయుటకై ఎన్నో ఏర్పాట్లు చేయవలసియుండును. ఆమియన్స్ వాడైన పీటర్‌కు చాలా పనియుండెను. "నేను ముందుకెళ్తున్నాను" అని అనేకమందిని వెంటబెట్టుకుని బయలుదేరేవాడు. తన గాడిదపై స్వారీచేస్తూ సహప్రయాణికులతో వెళ్ళేవాడు. వారందరూ తూర్పువైపు వెళ్ళుచున్నారు. మార్గములో జర్మన్ నగరములను దాటిపోవలసివచ్చెను ఆ నగరములలో అనేకమంది యూదులు నివసించేవారు.

యూదులా! యూదులు నిజంగానే ఇక్కడ నివసిస్తున్నారా? ప్రభువైన యేసును తిరస్కరించి సిలువవేసినది యూదులేకదా? వారు చేసినదానికి వారు శిక్షింపబడలెను. ఈ శిక్ష దేవుని చిత్తము! మత యుద్ధము చేయువారు కనబడిన యూదులందరిని హతమార్చారు. మేజ్ నగరంలోనే తొమ్మిదివందలమంది యూదులు వధింపబడిరి! జర్మని మరియు ఆస్ట్రియా గుండా ప్రయాణిస్తూ తూర్పుదిక్కుగా ముందుకు మత యుద్ధము చేయువారు వెళ్ళిరి.

కాని ఆహారపు నిల్వలు తరిగిపోయెను. గనుక దారిలో ఉండు పొలములలో నుండి తినుటకై దోచుకొనిరి. పొలం యజమానులు యాత్రికులపై దాడిచేసి పగతీర్చుకొనిరి. కోపోద్రిక్తులైన వ్యవసాయదారులద్వారా వేలకొలది మరణించిరి. అనేకలు దూరప్రయాణమువలన

అలసి చనిపోయిరి. తుదకు బహుకొద్దిమంది మాత్రమే కాన్‌స్టంటినోపుల్ చేరుకొనేవారు. చేరుకున్నాక వారు చేయగలిగినదంతా ఏమిటంటే మహామతయుద్ధ సైన్యము కొరకు ఎదురు చూడటమే. దానికి పూర్వము కొంత మతయుద్ధము జరిగేది, బులియన్ ద్వారా నడిపింపబడే మూడులక్షల మంది మతయుద్ధము చేయువారు చేరిరి. మార్గములో సైన్యము అంతకంతకు పెరిగి పెద్దదగుచుండెను.

యెరూషలేము నిజముగా ఎంతదూరమున్నదో వారికి తెలియదు గనుక వారి ప్రయాణసమయము అనుకున్న దానికంటే ఎక్కువ పట్టేది. ఎవరైనా అలసిపోయి ముందుకు రోడ్డు ప్రక్కన పడి మరణించేవారు. తుదకు వారు కాన్‌స్టంటినోపుల్ నగరము చేరుకొనిరి. తూర్పు రోమా సామ్రాజ్యపు చక్రవర్తి, బోస్‌ఫరస్ యొక్క ఇరుకుగావుండేదోవను దాటుటకు సహాయపడెను. వారు కష్టపరిస్థితి నెదుర్కొనుటకై తూర్పు రోమా సామ్రాజ్యము సహాయపడెను.

దాటుట ముగిశాక పాలస్తీనా మార్గమును ఏసియామైనర్ గుండా సైన్య విహారము చేసిరి. ఈ ప్రయాణము చివరన కూడా ఎంతో శ్రమయున్నది. మార్గములో వేలమంది చనిపోయిరి. మతయుద్ధము చేయువారు టర్కుల సైన్యమును ఎదిరించి ముందుకు వెళ్ళవలసి వచ్చెను. వేలమంది మతయుద్ధము చేయువారు నశించిరి. వారు ఎన్నో శ్రమలను కష్టములను ఎదుర్కొనవలసివచ్చెను. కాని మతయుద్ధము చేయువారికి విజయము కూడా కలిగెను. వారు మార్గమున అనేక పట్టణములను బంధించిరి గనుక వారికి తినుటకై చాలా దొరికెను.


కడమ మూడు సంవత్సరముల పిదప, మతయుద్ధము చేయువారు అద్దరిన యెరూషలేము గోపురములను చూచిరి. కాని వారు ఆ నగరమునకు చేరువయ్యేకొద్ది సాయుధులైన టర్కీ సైన్యసమూహములను చూడటం ప్రారంభించిరి. ఘోరయుద్ధము చెలరేగెను మతయుద్ధం చేయువారు ఆ నగర గోడలకు కట్ట గోపురములను అమర్చిరి. పోరాటము తీవ్రముగానుండెను ఇరువైపులా చాలామంది మరణించిరి కాని ఎట్టకేలకు నగరము బంధింపబడెను! ఘోర వధజరిగెను! మతయుద్ధము చేయువారు బులియన్ వాడైన గాడ్‌ఫ్రేను రాజుగా ప్రకటించిరి. కాని ప్రభువు ముళ్ళకిరీటము ధరించిన నగరంలో నేను రాజ కిరీటము ధరింపను అని ఆయన చెప్పెను. ఆయనకు పవిత్ర సమాధిని సమర్థించువాడని బిరుదునిచ్చిరి.

మరొక్క మారు యెరూషలేము ముస్లింల చేతిలో పడెను గనుక క్రొత్త మతయుద్ధములు నిర్వహింపబడెను. రెండువందలయేండ్ల కాలంలో ఏడు మతయుద్ధములు జరిగెను. తత్ఫలితముగా కోట్లకొలది మనుష్యులు మరణించిరి. వేలకొలది అబ్బాయిలు అమ్మాయిలు 7-15 సం॥ వయసుగలవారు ఏడు పడవలలో బయలుదేరిరి. ఫ్రెంచ్ తీరమున బయలుదేరి మధ్యదరా సముద్రమును దాటి పాలస్తీనావైపు వెళ్ళిరి. భీకర తుఫానులో రెండు పడవలు మునిగెను. తక్కిన పడవలు ముందుకు వెళ్ళెను.... ఐగుప్తులో ఈ పిల్లలు నిర్భాగ్యులై బానిసలుగా అమ్మబడిరి. "ఇది దేవుని చిత్తము" అని వారు నినాదం చేసిరి. కాని ఇది ఖచ్చితముగా దేవుని చిత్తము కాదు. "బలముతో గాక శక్తితో గాక నా ఆత్మద్వారా చేయుదునని సైన్యములకధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" (జెకర్యా 4:6)

36. క్లెయిర్‌వాక్స్ వాడైన బెర్నార్డ్ - మర్మయోగి (క్రీ.శ. 1090-1153)

విశ్వాసము మరియు ఆధ్యాత్మిక జ్ఞానమునకు అతీతముగానున్న హృదయపూర్వక విశ్వాసముగల వ్యక్తి బెర్నార్డ్. ఇక్కడ పరిశుద్ధ బిడ్డయైన యేసును గూర్చి మాట్లాడినపుడు తన కన్నీటిని ఆపుకొనలేని వ్యక్తి. ఈయన లోకములో జీవించెను గాని లోకస్తుడై బ్రతుకలేదు. ఈయనే సాధారణ ప్రజలకు బోధించిన ఓ క్లెయిర్‌వాక్స్ వాడైన బెర్నార్డ్ - ఓ సన్యాసి, ఓ మర్మయోగి మరియు సాధారణ ప్రజలకు బోధించిన భోదకుడు. అయన పండ్రెండవ శతాబ్దపు ఆత్మీయ సలహాదారునిగా భావింపబడెను. బెర్నార్డ్ భక్తిని బట్టి సన్యాసులలో కెల్లా అతిభక్తిపరుడైన సన్యాసిగా లూథర్ అతనిని గౌరవించెను.

క్రీ.శ. 1090 సం॥లో ఫ్రాన్స్ నగరములోని ఓ పట్టణము నందు బెర్నార్డ్ జన్మించెను. ఆయన తల్లి మరణించినపుడు ఇంకనూ చిరు ప్రాయమునందుండెను. ఆమె భక్తి పరురాలైయుండి, తన కుమారుడు ప్రభువు సేవ చేయాలని ఆశకలిగియుండెను. ఇరవై ఒకటి సం॥ వరకు బెర్నార్డ్ లోకసంబధ జీవితమును జీవించెను. కాని తర్వాత అతని జీవితములోనికి దేవుని కృపద్వారా ప్రభువు ప్రవేశించెను మరియు అతని హృదయమును మరియు జీవిత యావత్తును ప్రభువు హస్తాల్లో పెట్టెను. బెర్నార్డ్ తనతో తాను "నేను ఏమైయున్నానో అదంతయూ దేవుని కృపచే" అని చెప్పుకొనెను. బెర్నార్డ్ హృదయములో దేవునితో వ్యక్తిగత సంబంధము కలిగియుండాలని ఆరాటము కలిగియుండెను గనుక సీటక్స్‌లోని ప్రశాంతమైన ఆశ్రమంలో చేరెను. (ఈ ఆశ్రమంలో కఠిన నియమ నిబంధనలుండెను). దేవునితో సంబంధము కలిగియుండాలని ఆయన జీవితకాలమంతయూ ఆరాటము కలిగియుండెను. యౌవనుడైయున్నా అతడు ఓ మర్మయోగిగా నుండెను. దేవునితో అంతరంగ సంబంధము కలిగియుండ గోరువాడు మర్మయోగి. ఈ యౌవన సన్యాసి అతి త్వరలో ఎంతో నీతిమంతుడైన యధార్థముగా, గౌరవ ప్రదమైన, వినయముగలవాడుగా, భక్తి శ్రద్దలతో ఉపవాసముండుటను, తనపని తాను చేసికొనుటను ప్రజలు త్వరగా గమనించిరి మరియు అతడు వాక్చాతుర్యము గలవాడని కూడా వారు గమనించిరి. బెర్నార్డ్ చాలా నిజాయితీగా పాపపు ప్రమాదములను గూర్చి ప్రజలను హెచ్చరించెను. అతని మాటలు ఎంతో లోతైన ప్రభావమును చూపెను. "ఆయనే సత్యమైయున్నట్లు అగుపించెను" అని ఆయనను గూర్చి కాల్విన్ చెప్పెను. ఇరవైమూడేండ్ల వయసులో బెర్నార్డ్ ఆశ్రమమును స్థాపించి దానికి అధిపతి ఆయెను. మిలన్‌కు ఆర్చ్ బిషప్ అగుటకు బెర్నార్డ్‌కు అవకాశమియ్యబడినా అతడు ఆశ్రమములోనే నలుబదియేండ్లు ఉండెను..! కాని బెర్నార్డ్ ఆశించినది ఇది కాదు. అతడు సాధారణ సన్యాసిగా ఉండుటకు ప్రాధాన్యతను ఇస్తాడు. ఆశ్రమము విడువబడ్డ స్థలములో ప్రమాదకర లోయలో కట్టబడెను. వాస్తవానికి అది బందిపోటు దొంగలతో నిండుకొన్న లోయ మార్గములో ప్రయాణించు వారిని దాడిచేసి దోచుకొను దొంగల ముఠా ఉండే స్థలమది. అందుకే ఆ స్థలమును "చీకటిలోయ" అని పిలిచేవారు. కాని ఇట్టి చీకటిలోయకే సన్యాసులు వెళ్ళి చాలా కష్టించి పనిచేసి ఎంతో విశాల భూభాగమును వ్యవసాయయోగ్యముగాను సారవంతముగాను చేసిరి. ఆ ప్రాంతములో కరువు బెడద వచ్చినపుడు నిరుపేదలు ఆశ్రమమునకు తరలివచ్చేవారు. ఎందుకంటే అక్కడ అహారమును ఉచితముగా పంచేవారు. కొన్ని నెలలపాటు రెండువేలకంటే పైబడి ప్రజలు ఆశ్రమములో ఆహారము భుజించేవారు. ఆ పరిసర ప్రాంతములలో ఈ ఆశ్రమము గొప్ప ఆశీర్వాదముగానుండెను. ఈ లోయ 'క్లెయిర్‌వాక్స్" "వెలుగులోయ"గా మారెననుటలో అతిశయోక్తిలేదు. ఇందువలన ఈయన క్లెయిర్ వాక్స్ వాడైన బెర్నార్డ్‌గా పిలువబడెను. ఆశ్రమ జీవితము కఠినముగాను, చాలా సరళ ఏర్పాటులతోనుండెను. బెర్నార్డ్ సౌఖ్యమునకు సుఖమునకు దూరముగానుండెడివాడు. ఇక్క ప్రశస్త వజ్ర వైడూర్యములు, అలంకరణ అద్దములు, మరియు భక్తుల విగ్రహములు ఇవేవి ఇతర ఆశ్రమములలో సంఘములలో ఉన్నట్లు ఉండేవి కావు.



చాలామంది బెర్నార్డ్ మాదిరిని అనుసరించిరి. ఆయన మరణ సమయములో, అదేవిధమైన నూట అరవై ఆశ్రమములు స్థాపింపబడెను. క్రీ.శ 1300 సం॥లో పద్దెనిమిది వందల ఆశ్రమములు వెలసెను! బెర్నార్డ్ ఆశ్రమములకే పరిమితము కాలేదు. వాస్తవానికి బయటి ప్రపంచముతోనూ అతడు సంబంధము కలిగియుండేవాడు. ఆయన ఉపదేశము చేస్తే నలుమూలనుండి ప్రజలు వచ్చి దానిని ఆలకించేవారు. మంచిక్రియలు మనకు దేవుని ఎదుట ఎట్టి యోగ్యతను తెచ్చిబెట్టవు గనుక మనస్వంత ధర్మకార్యములపై ఆధారపడవద్దని తన మాటలు వినువారిని హెచ్చరించేవాడు. కాని "మీ పాపభారములచే క్రుంగిన వారైతే, నీతికొరకు ఆకలి దప్పులు గలవారైతే, భక్తిహీనులను నీతిమంతులుగా తీర్చు వానియందు విశ్వసించుడి" అని చెప్పేవాడు. అట్టి విశ్వాసముద్వారా మీరు దేవునితో సమాధానము కలిగి యుండవచ్చును. మనము జరిగించు పాపమంతటికంటే దేవుని కృప అత్యధికమైయుండును."

అనేక సన్యాసులు మరియు ఇతర సంఘపరిచారకులయొక్క దిగజారిన జీవిత విధానములకు విరోధముగా ఈయన పోరాడెను. సంఘమందలి పొరపాటులకు విరోధముగా మరియు ఆశ్రమములలో, సంఘములలో నెలకొనియున్న విలాసజీవితమునకు విరోధముగా పోరాడెను.

ఏది ఏమైనా బెర్నార్డ్ పోప్‌కు విధేయుడుగానుండెను. దీని సంగతి ఇలా ఉన్నా, పోప్ లౌకిక పరిపాలకునివలె వైభవము మరియు భోగములతో జీవిస్తుంటే ఆయనను హెచ్చరించుటకు తెగించెను. బెర్నార్డ్ భక్తిగలవాడైయుండెను సిలువపై శ్రమపడు క్రీస్తు అతనికి సమస్తముగానుండెను. క్రీస్తును పరలోక వరునిగా భావించి ప్రభువు పట్ల తీవ్ర ప్రేమను కలిగియుండెను. పరమగీతముల ఆధారముగా అతడు చేసిన ఎనభై ఆరు ప్రసంగములలో ఆయన ప్రేమను వ్యక్తము చేసినట్లు మనము గమనించవచ్చును.

ఆయన మరణిస్తూ "ప్రభువైన యేసూ నేను శిక్షాపాత్రమైన జీవితము జీవించితినని ఎరుగుదును. కాని నీవు నాకై మరణించావని ఎరిగి ఆదరణనొందుచున్నాను. నీ పవిత్ర గాయముల రక్తమును నీవు నాపై చల్లావు. ఈ సంగతులయందు దృఢ విశ్వాసము కలిగి నేను వెడలిపోవుచున్నాను" అని ప్రార్థించెను. "గొప్ప సంఘబోధకుడని" లూథర్ పిలిచిన ఈ క్రీస్తు పరిచారకుడు మహిమలో ప్రవేశించునుగాక.

37. మెండిక్యంట్ ఆర్డర్స్ - ఆసిసి వాడైన ఫ్రాన్సిస్ (క్రీ.శ. 1181-1226)

ప్రాముఖ్యముగా మధ్య యుగములో, ఒక వ్యక్తి స్వచ్ఛందముగా పేద జీవితము జీవించుటకై ఎన్నుకుంటే దానిని సమర్పితజీవితమునకు సూచనగా ప్రజలు భావించిరి. ఒక వ్యక్తి భూసంబంధమైన సంపాదనను ఆస్తిపాస్తులను వద్దని వాటికి ఎంత దూరముగా జీవిస్తే ఆ వ్యక్తి పరలోకమునకు అంత దగ్గరగా జీవించును, అని వారు భావించిరి. ఫ్రాన్సిస్ అను వ్యక్తి వర్తకము చేయువాడు. అతడు ఇటలీ నగరమైన ఆసిసిలో క్రీ.శ. 1200 లో జీవించెను. అతడు ఇట్టి జీవిత విధానమును తన ధ్యేయముగా ఉంచుకొనెను.

ఫ్రాన్సిస్ యౌవనస్థుడుగా ఉంటూ తన మిత్రులతో కలిసి పార్టీలకు వెళ్తూ రాత్రివేళ చాలా ఆలస్యముగా వచ్చుచుండెను. మొదట ఆయనకు పేదరికపు జీవితము జీవించు ఆశలేకుండెను కాని తరువాత అంతయూ మారెను.

ఆసిసి నగరమునకు మరొక నగరమునకు యుద్ధము జరిగినపుడు ఫ్రాన్సిస్ అందులో పాల్గొనెను. ఆయన బందీగా బంధింపబడి రెండేండ్లపాటు చెఱ అనుభవించెను. ఆయన విడిపింపబడిన తరువాత తీవ్ర అనారోగ్యము పాలాయెను. ఏది ఏమైనా ఆరోగ్యము మెరుగుపడెను కాని ఆయన వెళ్ళిన అనుభవములను బట్టి ఆయన తన జీవితమును భిన్నముగా చూడటము ప్రారంభించెను. ఇంతవరకు ఆయన ధనికుడై విలాసవంతజీవితము జీవించెను. కాని ఇప్పుడైతే కఠిన పేదరిక జీవితం జీవింపవలెనని ఆయన ఆశించెను.

ఆయన రెండు సంవత్సరముల పాటు నగరమునకు వెలుపల ఒక గుహలో నివసించెను. తరువాత పవిత్ర స్థలములు దర్శించు నిమిత్తమై ఆయన రోమాకు ప్రయాణమాయెను. ఆయన అడుక్కునే వారిని చూచి, ఈయన వస్త్రములు వారికిచ్చి వారి చింపిరి



వస్త్రములు ఫ్రాన్సిస్ ధరించెను. ఆయన కుష్టురోగులను కలిసికొనినపుడు వారిని చక్కగా పలకరించి చూచుకొనెను. ఇటువంటి పని ఆయన కొన్నియేండ్లుగా చేసెను.

కాని ఇంకా ఎక్కువగా చేయాలని ఫ్రాన్సిస్ ఆశపడెను. బోధచేయుటకు తను పిలుపబడెనని ఆయన భావించెను. చెప్పులు లేక బూడిద రంగు వస్త్రములు ధరించి ఆసిసి నగరపు వీధులగుండా తనంతట తాను వెళ్ళి ప్రజలకు బోధించెను. యేసు మరియు ఆయన శిష్యులు సాధారణ జీవితము జీవించిరి. ఫ్రాన్సిస్ కూడా సమస్తమును విడిచి యేసు మరియు ఆయన శిష్యుల మాదిరి అనుసరించి సాధారణ జీవితము జీవింపవలెనని కోరెను. తను పేదరికము అను వధువును వివాహమాడానని ఫ్రాన్సిస్ చెప్పెను. గనుక పేదలకు సహాయము చేయుటకై తన ఆస్తిపాస్తులన్నియూ అమ్మివేసెను.

ప్రజలు తమ చెడుక్రియలను విడిచి పశ్చాత్తాపపడవలెనని వేడుకొనెను. నిజమైన సంతోషము ఐశ్వర్యము యేసును అనుసరిస్తేనే లభించునని ఆయన బోధించెను. ఫ్రాన్సిస్ మాటలు ఎంతో ప్రభావమును చూపినందున ఎంతో త్వరగా అనేకులు ఆయన అనుచరులుగా మారిరి. ఆ అనుచరులు పేదరికము, కన్యత్వము (లైంగిక వాంఛలకు దూరముగా నుండుట) మరియు విధేయత నియమములను ఆచరింపవలెను. తమ శత్రువులను ప్రేమింపవలెనని, హింసను సంతోషముగా స్వీకరింపవలెనని ఫ్రాన్సిస్ తన అనుచరులకు నేర్పించెను.

వాస్తవమునకు ఫ్రాన్సిస్ చిరునవ్వుతో జీవించేవాడు. ఆయన తరచుగా పాటలు పాడేవాడు. జీవులన్నింటిని అనగా పక్షులను, పువ్వులను, సూర్యుని సహితము తన సహోదరులని పిలిచేవాడు! సృష్టి సౌందర్యములో సృష్టికర్త మహిమను ఆయన చూచేవాడు. ప్రపంచమంతటిని ఆయన "సహోదరీలు" అని పిలిచేవాడు. వాటికి ఆహారమిచ్చి పర్వతములను, చెట్లను నివాసముగా ఇచ్చు దేవుని స్తుతించమని పక్షులకు బోధించేవాడు. వాటిని అందమైన ఈకలతో అలంకరించువాడు దేవుడేనని బోధించేవాడు.

క్రొత్త ఆర్డర్ ప్రారంభించుటకై దాని అనుమతినివ్వమని ఫ్రాన్సిస్ పోప్ యొద్దకు వెళ్ళి అడిగెను. పోప్ దానికి అనుమతినిచ్చెను. క్రొత్త ఆశ్రమ ధర్మమునకు అనుమతి దొరికెను. దానిని పోప్ పర్యవేక్షించును. అందులో ఫ్రాన్సిస్ అనుచరులందరు చేరిరి. ఇప్పుడు వారందరు వెళ్ళి బోధించుటకై అనుమతింపబడిరి.

సన్యాసులు వారి అనుదిన ఆహారము నిమిత్తమై అడుక్కొందురు. గనుక ఫ్రాన్సిస్ ఆర్డర్ "మెండికంట్ ఆర్డర్" అని పిలువబడెను. ఇద్దరిద్దరుగా కలిసి సన్యాసులు గ్రామములకు వెళ్ళి బోధచేయుట మాత్రమేగాక అవసరతలోనున్న వారికి సహాయముచేసిరి. రోగులకు కుష్టువ్యాధిగల వారికి సహాయము చేసిరి. కాని ఒక బాధాకర సంగతిగలదు. ఫ్రాన్సిస్ ఆశ్రమ ధర్మమును పాటించు వారు రోమన్ క్యాథలిక్ తప్పులను ఖండింపరు. వారు సహితము రోమన్ క్యాథలిక్‌లుగానే మిగిలిపోయిరి.

అనేక ఆశ్రమములలో సన్యాసులు విలాసవంత జీవితములో జీవించిరి. గనుక అట్టి భక్తిహీన సుఖవిలాస జీవితమును వారు ఎదిరించి ఖండించిరి. ఫ్రాన్సిస్కన్ సంఘ భవనములు కొద్ది అలంకరణతో సాధారణ భవనములుగా ఉండెడివి. ఫ్రాన్సిస్కన్‌లు స్థాపించిన ఆశ్రమములలో, సుఖభోగాలు లేక పేదరిక జీవితమును జీవించేవారు.

వారు పాటించు ఆశ్రమ ధర్మము ఇతర ఆశ్రమములు పాటించు ధర్మముకంటే భిన్నముగానున్నందున సాధారణ సగటు ప్రజలు ఆ ఫ్రాన్సిస్కన్ ఆశ్రమ ధర్మమును గౌరవించిరి. ఈ ధర్మము ఎంతో త్వరగా ఐరోపా ఖండమందంతట విస్తరించెను! పది సంవత్సరముల తర్వాత ఐదువేలమంది మరియు ఏబై సంవత్సరముల పిమ్మట 200,000 మంది ఇందులో సభ్యులుగా చేరిరి.

చాలా మంది ఫ్రాన్సిస్కన్‌లు ఆసియా, ఆఫ్రికా అటుపిమ్మట అమెరికాకు కూడవెళ్ళిరి. మొరాకో, స్పెయిన్, సిరియా వంటి దేశాలలో వారు మిషనరీలుగా పని చేసిరి. చైనాలో కూడా వారు మిషనరీలుగా పనిచేసిరి. ఐగుప్తులోని సుల్తాన్‌కు ఫ్రాన్సిస్ స్వయాన బోధించెను ! ఇతర ప్రపంచ భాగములలో తన వాక్యము బోధింపబడులాగున ప్రభువే చూచుకొనెను.

38. మధ్యయుగములో పోప్ అధికారము

మధ్యయుగములో, ప్రపంచమంతటిని పోప్ పాలించేవాడు. రాజులు, చక్రవర్తులు ఆయనకు లోబడేవారు. పోప్ మాట దేవుని వాక్యమంత అధికారము గలదని, పోప్ భూమిమీద క్రీస్తు ప్రతినిధియని పోప్‌ను గూర్చి ప్రజలు భావించేవారు! వారికి అంతకన్నా ఏమీ తెలియదు ఇదే వారికి బోధింపబడెను!

దాదాపు క్రీ.శ. 1200 సం॥లో ఇన్నోసెంట్III పోప్‌గానుండెను. ఆయన పోప్‌లందరిలో అతిగొప్పవాడైయుండెను. ఆయన పాలన సమయములోనే పోప్ అధికారము ప్రభావము తారా స్థాయికి చేరెను. పోప్‌కు విధేయత, గౌరవము, భక్తి చూపుదునని చక్రవర్తి వాగ్దానము చేయవలెను. జర్మన్ మాత్రమే గాక ఇతర దేశములునూ పోప్ మహాశక్తిని అనుభవించెను.

ఉదాహరణకు, ఫ్రెంచ్ రాజు తన భార్యను విడిచి మరొక స్త్రీని వివాహమాడే ప్రణాళిక కలిగియుండెను. బిషప్‌లు గాని ఇతర సభ్యులుగాని ఆయనను ధిక్కరింప సాహసింపలేక పోయిరి కాని పోప్ ఫ్రాన్స్ దేశమంతటిని అధికార నిర్బంధములో ఉంచెను. దీనివలన ఫ్రాన్స్‌లో సంఘము బలిపూజ, వివాహము, శిశునామకరణము ఇవేవియూ జరిగింపలేకపోయెను. సంఘకార్యకలాపములన్నియూ ఆపివేయబడెను. సాధారణ ప్రజలకు ఇది కష్టమాయెను. పేతురు వారసుడు పరలోకద్వారము మూసెనని వారు భావించిరి. వారు ఎంతో వ్యధ మరియు భయముతో నింపబడి, రాజు తన భార్యను తిరిగి చేర్చుకొని మరొక్కమారు పోప్‌నకు లోబడుమని రాజును వత్తిడిచేసిరి!

ఇంగ్లీష్ రాజైన జాన్ – ఆయనకు మారుపేరు జాన్‌లాక్‌లాండ్ – ఆయన కూడా పోప్‌నకు లోబడేలా వత్తిడి చేయబడెను.

జాన్ అవిధేయత కారణాన పోప్ అతని బహిష్కరించెను. ఆయన రాజ్యమంతయూ నిర్బంధము క్రింద ఉంచబడెను. ఆయన పోప్‌కు లోబడ్డాక (పోప్ చెప్పింది చేస్తాను, ఆయనకు సుంకము చెల్లిస్తాను అనే షరతు) పోప్ యొక్క దాసునిగా ఉంటాననే షరతుపై తిరిగి అతని దేశమును అతనికప్పగింపబడెను. బహిష్కరణ అనేది నిజముగా చాలా బలమైన ఆయుధముగా నుండెను.

పోప్ అధికారము ఎంతగొప్పగా ఉండె నంటే, ఒక దేశము బహిష్కరింపబడినట్లైతే, ప్రజలునూ ఆ బహిష్కరింపబడిన రాజుకు లేదా చక్రవర్తికి లోబడేవారు కాదు.

క్రీ.శ. 1215 సం॥లో రోమా నగరములో ఓ సభ ఏర్పాటు చేయబడెను. డెబ్భైమంది పాట్రియార్క్‌లు ఆర్చ్ బిషప్‌లు, నాలుగువందలకంటె పైబడి బిషప్‌లు, దాదాపు ఎనిమిదివందల ఆశ్రమ అధిపతులు, ఒక్క వందకంటే పైబడిన రాజ ప్రతినిధులు హాజరైరి! పోప్ రాజకుమారునివలె ఆ సభకు అధ్యక్షతవహించెను. నేను దేవునికంటే తక్కువవాడను కాని నిశ్చయముగా ప్రజలందరికంటే మిన్నయైన వాడనని తనను గూర్చి తాను చెప్పెను. ఆయన ఇతరులకు తీర్పు ప్రకటించేవాడు కాని ఆయనను ఎవరునూ తీర్పుతీర్చేవారు కాదు. సంఘములో పరిచారకుడైన వానికి, పాపాత్ముడైన ఓ మానవునికి ఖచ్చితముగా ఇది ఓ గొప్ప అధికారము మరియు ఘనతగా నుండెను.

సంవత్సరములో కనీసము రెండు మారులైనా ప్రతియొక్కరు పాపపు ఒప్పుకోలు నిమిత్తమై వెళ్ళవలెనని ఇన్నోసెంట్ ప్రకటించెను. పోప్ అనుమతిస్తేనే ఆశ్రమ ఆర్డర్‌లు స్థాపింపబడవలెను. ట్రాన్స్ సబ్‌స్టాన్సియేషన్ అను సిద్ధాంతమును రూపకల్పన చేయుటలో అతి గొప్ప తీర్మానము జరిగెను. (29వ అధ్యాయములో చూడుము)

దుర్బోధకులకు విరోధముగా ఇన్నోసెంట్ అను పోప్ తీవ్రమైన చర్యతీసుకొనెను. వీరెవరు? క్రీ.శ 1150 సం॥లో ఆల్బి అను ఫ్రెంచ్ పట్టణము సంప్రదాయ క్రైస్తవ్యమును అంగీకరింపని ఓ గుంపుండెను. వారు మానికెయిన్‌లవలె ఉండేవారు (21వ అధ్యాయములో చూడుము). ఎందుకంటే పాతనిబంధన దేవుడు చెడ్డవాడు గనుక సృష్టియంతయూ చెడ్డది మరియు పాపాత్మకం అని బోధించేవారు. ఒకడు విప్లవాత్మకముగా ఈ పాపప్రపంచమువైపు వెనుదిప్పినపుడే రక్షింపబడునని



వారనేవారు. వివాహము, యుద్ధములో పాల్గొనుట, జంతువులను చంపుట ఇవన్నియూ నిషేధింపబడియుండెను.

వీరు తమను "కథార్స్" (స్వచ్ఛముగానున్నవారు) అని పిలుచుకునేవారు. (డచ్ భాషలో దుర్బోధకునికి 'కట్టర్' అను పదమును వాడుదురు. ఇది కథార్ అను పదమునుండి తీయబడినది). ఈ తెగ ఇతర దేశములలోనూ వ్యాపించెను. పోప్ చర్య తీసికొనును.

ఆయన ఇంక్విజిషన్‌ను కనుగొనెను. ఇంక్విజిషన్‌ను సంఘ న్యాయస్థానము, మతవిషయములలో ఒక విధమైన అంతర్జాతీయ న్యాయస్థానము. ఇందులోని న్యాయాధిపతులను ఇంక్విజిటర్స్ అని పిలచేవారు. వీరు కథార్స్‌ను, బందీలను, పశ్చిమ ఐరోపా దేశాలలోనూ వ్యాపించిన దుర్బోధకులను పరీక్షించేవారు. బందీలను వత్తిడి చేయుటకై కఠిన, క్రూర, తీవ్ర పద్ధతులను వాడకమునుపే వీరు తప్పు ఒప్పుకొని దుర్బోధ భావములను విడచిపెట్టేవారు. మరణశిక్షయే వారికి తీర్పుగా వచ్చెను. దీనిని లౌకిక అధికారులు చేపట్టిరి.

అల్బిజెన్సియన్‌ల తెగ అగ్ని మరియు ఖడ్గము ద్వారా ఎంతో హింస ఎదుర్కొనిరి. వారు పూర్తిగా తుడిచివేయబడిరి!

ఇన్నోసెంట్ పోప్ అతిశక్తివంతమైన పరిపాలకుడైయుండి తనతో విబేధించువారిని సహించేవాడు కాడు. ప్రతియొక్కరు తనకు లోబడవలెను.

క్రీ.శ 1216 సం॥లో పోప్ మరణించెను. ఆయన మృతదేహము బంగారు తీగలతో అల్లబడిన ప్రేతవస్త్రముతో కప్పబడెను. కాని ఆ చీకటి ఘడియలో, దొంగలు ఆయనపై కప్పబడిన విలువైన వస్త్రమును దొంగిలించగా ఉదయానికల్లా ఆయన తన శవపేటికలో దిగంబరుడుగా కనబడెను...

తన్నుతాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును.

39. వాల్డెన్సియన్‌లు

మనము ఈ అధ్యాయములో కూడాను "దుర్బోధకులు" మరియు వారి హింసను గూర్చి చదివెదము. రోమానగరపు బోధలతో సమ్మతింపని వారందరు 'దుర్బోధకులు" అని పిలువబడిరి గనుక రోమా ప్రకారము వారు శిక్షింపబడవలెను, తుడిచివేయబడవలెను..

పండ్రెండవ శతాబ్దపు మధ్యన ఫ్రెంచ్‌లో లయన్స్ అను నగరములో పీటర్ వాల్డన్ అను ధనిక వ్యాపారి ఉండేవాడు. ప్రభువు తన హృదయములో కార్యము చేసేంతవరకు విచ్చలవిడి జీవితం జీవించెను. అప్పుడు తన హృదయములో అలజడి మొదలై "నేను మరణిస్తే ఎక్కడికి వెళ్ళుదును? అని బాధపడటం ప్రారంభించెను. లాటిన్ బైబిల్ అతిఖరీదైనదిగా ఉన్ననూ పీటర్ డబ్బున్నవాడు గనుక ఒక బైబిల్ కొనగలిగెను. ఒకరు ఫ్రెంచ్ భాషలోనికి దానిని అనువదించిరి గనుక పీటర్ తనంతట తాను దాని చదువకోగలిగెను. పీటర్ వాక్యము చదువుతుండగా తన హృదయములో శాంతిని కనుగొనేలా ప్రభువు సహాయపడెను.

పీటర్ ఉపదేశము చేయ బయటకు వెళ్ళదలచెను. అదే కోరిక అనగా సామాన్య ప్రజలకు వాక్యమును మోసికొనిపోయే కోరిక గలవారినందరిని ఒక గుంపుగా సమకూర్చుకొనెను.

ఈ ఉపదేశకులు చాలా సాధారణ జీవితము జీవించేవారు గనుక వీరు "లయన్స్ పేదలు" అని పిలువబడిరి. ఇద్దరిద్దరు కలసి గ్రామాలగుండా ప్రయాణించేవారు. వారు ఎక్కడికి వెళ్ళినను సువార్తను వాడుక భాషలో ప్రకటించిరి. క్రీస్తే ఏకైక మధ్యవర్తి మరియు రక్షకుడని సామాన్యుని భాషలో ప్రకటించిరి గనుక వారి బోధ ఎంతో చెరగని ముద్ర వేసెను. వారి దీన సేవను ప్రభువు దీవించెను మరియు ప్రజలు మార్చబడిరి.

వాల్డెన్సియన్‌లు సంఘమునుండి తమ్మునుతాము వేరుపరచుకొనుటకు ఇష్టపడలేదు. వారు తిరుగుబాటుదారులు కాదు. సంఘము ఎక్కడ దారితొలుగుతున్నదో దానిని మాత్రమే వారు చూపగోరిరి. బైబిల్ ఆధారంగా చనిపోయిన భక్తుల ఆరాధన, వారి ఆవశేషములు బలిపూజ, పర్గెటరి, క్షమాపత్రములు, ఆశ్రమజీవితము మున్నగు వాటిని తిరస్కరించిరి. వారు పోప్ అధికారమునుకూడా ఒప్పుకొనరు. వారి అనుదిన జీవితములో ప్రతియొక్కరికి వారు మాదిరిగా ఉన్నారని వారి శత్రువులు సహితము ఒప్పుకొనిరి! వారి సిద్ధాంతము మరియు వారి జీవితశైలి బైబిల్‌కు అనుగుణముగా ఉండేవి. నిజ క్రైస్తవ్యమును గూర్చి తెలిసికొనదగిన ఏకైక సమాచార వనరు బైబిల్ మాత్రమేయని వారు విశ్వసించిరి. వారు బైబిల్ చదువుటయందు దానిని అధ్యయనము చేయుటయందు చాలా సమయము గడిపేవారు. వారిలో చాలామంది సుదీర్ఘ వాక్యభాగములను కంఠస్తము చేసేవారు! అయిననూ వారు దుర్బోధకులని పిలువబడిరి. ఎందుకంటే వారు రోమా సిద్ధాంతమును దాని తప్పిదములను ఒప్పుకొనలేదు.

పోప్ ఇన్నోసెంట్III వారిని తనవైపు త్రిప్పుకొనే ప్రయత్నముజేసెను. గత అధ్యాయమందు ఈయనను గూర్చి మనము చదివితిమి. బయటకు వెళ్ళి వారు ఉపదేశించుటకు అనుమతించెను గాని వారి ప్రసంగములను బిషప్ పరిశీలన చేయుటకు గాను సమర్పింపవలసివచ్చెను. కాని వాల్డెన్సియన్‌లు నిరాకరించిరి. ఎవరి జోక్యములేక వారు స్వేచ్ఛగా నుండగోరిరి. ఇలా అయితే వారు దుర్బోధకులుగా పరిగణింపబడి రూపురేఖలు లేకుండా చేయబడబోతున్నారు! దానిని మత న్యాయస్థానము అలా జరిగేలా చూచుకొనును.

అప్పటినుండి వారు హానికరమైన జంతువులేమో అన్న విధముగా వెంటాడబడిరి. వారు పారిపోలేనప్పుడు ఖడ్గముచే కూల్చబడిరి, చిన్న పిల్లలు సహితం చంపబడిరి. వారి పశువులు దోచుకొనబడెను, వారి ఇండ్లు కాల్చివేయబడెను మరియు వారి పొలములు ధ్వంసము చేయబడెను.

ఒకానొక సందర్భములో నాలుగువందలమంది



తల్లులు, మరియు పిల్లలు ఇటలీలోని ఒక గుహలో దాగుకొనిరి. పోప్ సైనికులు వారి దాగు స్థలమును కనుగొని గుహ ద్వారమునొద్ద చితిమంట వేయగా పొగ దట్టముగా ఆ గుహలో వ్యాపించి అందులో దాగిన వారందరు ఊపిరాడక మరణించిరి. ఆల్ప్స్ పర్వతములో అది చలికాలము గనుక చలి విపరీతముగా నుండెను. మంచువలన మార్గములన్నియూ మూయబడెను, అయిననూ వాల్డెన్సియన్‌లు బయలుదేరి పర్వతములను చేరుకొనిరి. వారి శత్రువులు వారిని వెంటాడుచున్నందున పారిపోవటం తప్ప వారికి మరో మార్గము లేకపోయెను. తల్లులు చంటిబిడ్డలను వాళ్ళతో మోసికొని పోయిరి. చాలామంది వృద్ధులు, తల్లులు, బిడ్డలు విపరీతమైన చలిచే మరణించిరి. నూట ఎనభైమంది శిశువులు చలికి గడ్డకట్టి మరణించిరి. పురుషులు ముందుకు కొనసాగివస్తున్న సైన్యమును ఆపుటకు శక్తిలేకపోయిరి. ఘోరసంగతులు సంభవించెను. వారి శత్రువుల ద్వారా చంపబడిన ఈ క్రైస్తవుల రక్తముచే మంచు రక్తమయమాయెను.

వారు ఎక్కడికి వెళ్ళిననూ చికాకు పరచబడి చిత్రహింస పడుతున్నారు. ఒక సందర్భములో ఇరవైవేలమంది ఒక నగరమందు మృతులైనట్లు గ్రంథస్థము చేయబడెను. ఇంకా అనేక ఇతర స్థలములలో అనేకులు చితిమంటలలో కాల్చబడిరి. ఈ విధముగా మత న్యాయస్థానము కొనసాగి తన కార్యములను జరిగించెను. ఈ విధముగా దుష్టుడు గర్జించు సింహమువలె అటు ఇటు తిరుగుచుండెను. ఇట్టి హింస వందలకొలది సంవత్సరములు కొనసాగెను. అయిననూ రోమ్ తన లక్ష్యమును నెరవేర్చుకొనలేదు. సంఘమందు పరిస్థితి చీకటిమయము మరియు కష్టమయముగానున్ననూ వాల్డెన్సియన్‌లు తుడిచివేయబడలేదు. ఎందుకంటే ఈ లోకములో తన వారిని కలిగియుండుట దేవుని సంకల్పము గనుక.

40. బహిష్కరింపబడ్డ పోప్

అది క్రీ.శ. 1300 సం॥లో బోనిఫేస్ VIII రోమా నగరములో పోప్‌గానుండెను. ఫ్రాన్స్‌లో ఫిలిప్ ద పేర్ రాజుగానుండెను. ఇంగ్లాండ్‌లో ఫిలిప్ యుద్ధముచేయుచున్నందున సుంకము చెల్లించుటకు ఆయనకు చాలా డబ్బు అవసరమాయెను. గనుక తన ఆధీనము క్రిందనున్న మతగురువులు ఆశ్రమములు మున్నగువాటిపై ఎక్కువ సుంకము విధించెను. ఎందుకంటే వారు చాలా ధనికులుగానుండిరి.

పోప్ ప్రకారము, మతగురువులు, ఆశ్రమములు సుంకమునుండి మినహాయింపబడవలెను. ప్రతియొక్కరును గర్విష్టియైన పోప్‌నకు లోబడవలెను. ఆయన సంఘములో మాత్రమే సంపూర్ణ అధికారమును చలాయించుట మాత్రమే గాక దేశములపై పరిపాలన చేస్తూ లౌకిక అధికారమును కూడా కలిగియుండెను. రాజులు మరియు చక్రవర్తులు ఆయనకు నమస్కారము చేయవలెను. కాని.... రాజైన ఫిలిప్ పోప్‌ను ఏ మాత్రమునూ లెక్కచేయలేదు. తన ప్రణాళికలను ఆయన కొనసాగించుచుండెను.

రాజు ఇలా ప్రవర్తిస్తే, పోప్ వేరే పద్ధతులను అనుసరించును. ఆయన ఫిలిప్‌ను బహిష్కరింప ఆలోచించెను. అది ఆయనకు భయము కలిగించెనా! ఆయన దానికి ఏమాత్రమునూ భయపడలేదు. పోప్



తనను బహిష్కరింపబోయే దినముననే, ఫిలిప్ తానే చర్యతీసికునే ఆలోచన చేసెను, ఫ్రెంచ్ సైనికులు పోప్ భవనమును దాడిచేసిరి! గర్విష్టియైన పోప్ బంధింపబడెను! మూడుదినముల నిర్బంధము పిమ్మట, ప్రజలే పోప్‌ను విడిపించిరి. ఆ చర్య చూసి పోప్ నిర్ఘాంతపోయెను. ఆ అవమానము ఆయనకు అంతుపట్టలేదు, కొద్దివారముల పిదప ఆయన మరణించెను. ఫ్రెంచ్ బిషప్ పోప్‌గా ఎన్నుకొనబడెను. క్రీ.శ.1309లో ఈ క్రొత్తపోప్ రోమ్‌నుండి ఫ్రెంచ్ నగరమైన అవిగ్నన్‌కు వెళ్ళెను!

డెబ్భై సంవత్సరముల తర్వాత, పోప్ మరియు తన వారసులందరు అవిగ్నన్‌లో నివసించిరి. ఇది చాలా విచిత్రమైన వ్యవహారము. పోప్ మరియు రోమ్ నగరము ఒకరికొకరు చెందినవారా? ప్రజలు ఈ కాలమును "పోప్ యొక్క బబులోను చెఱ" అని భావించిరి.

కొంతకాలము పాటైనా పోప్ గాక రాజు ఫ్రాన్స్‌కు అధికారిగా ఉండెను. డెబ్భైసంవత్సరముల పిదప ఓ క్రొత్త పోప్ ఎన్నుకోబడెను మరియు అతను రోమ్‌లో నివసించుటకు వెళ్ళెను. ఆయన ఫ్రాన్స్ రాజు అధికారము క్రిందనుండుటకు నిరాకరించెను. కాని ఫ్రెంచ్ రాజు ఓడిపోలేదు. అవిగ్నన్‌లో నివసించవలసిన పోప్‌ను కార్డినల్స్ ఎన్నుకొనేలా చేసెను. గనుక ఇప్పుడు ఇద్దరు పోప్‌లున్నారు! ఇది "పశ్చిమ మహావిభజన" అని పిలువబడెను. పశ్చిమ సంఘము రెండు భాగాలుగా విడిపోయెను. ఈ విషయంపై మతనాయకులైన బిషప్‌లు, మతగురువులు, ఆశ్రమ అధిపతులు విభజింపబడుట మాత్రమే గాక సామాన్య జనము కూడ విభజింపబడెను. పశ్చిమ ఐరోపాయావత్తు ఒక వర్గము రోమ్‌నందలి పోప్‌ను బలపరిస్తే, మరొక వర్గము అవిగ్నన్‌లో పోప్‌ను బలపరిస్తే, అవిధముగా యిరువర్గములుగా విభజింపబడెను. ఎంతో గలిబిలితో కూడుకొనిన వ్యవహారము!

యిరువురు పోప్‌లు ఒకరినొకరు బహిష్కరించుకుంటూ క్రీస్తు నామము పేరట శపించుకొనిరి!

ప్రజలకు ఉపదేశకులుగా నుండవలసిన బిషప్‌లు మరియు ఆర్చ్ బిషప్‌లు ఒకరితో ఒకరు అభిప్రాయబేధములు కలిగి వాగ్యుద్ధము చేసికొనుచున్నారు. ప్రజలు వారి ఆత్మీయ నాయకులపట్ల గౌరవము కోల్పోయిరనుటలో ఆశ్చర్యములేదు.

పోప్‌లు ఇరువురు విలాసవంత అంతఃపురములలో విందులు చేసికొని వేట పార్టీలు జరుపుకొంటుంటే సామాన్య ప్రజలు సంఘమునకు అధికముగా సుంకము చెల్లింపవలసివచ్చెను.

పోప్‌యొక్క దివ్య అధికారమును సామాన్య ప్రజలు ప్రశ్నించటం ప్రారంభించడంలో ఆశ్చర్యమేమి లేదు!

సంఘ సమావేశము జరుపబడెను, యిరువురు పోప్‌లు తొలగింపబడి క్రొత్త పోప్ ఎన్నుకొనబడెను. అధికారమునుండి తొలగింపబడిన ఇద్దరు పోప్‌లు సమావేశము యొక్క తీర్మానమును లెక్కచేయలేదు, సంఘర్షణ కొనసాగగా ఇప్పుడు ఇద్దరికి బదులు ముగ్గురు పోప్‌లు వచ్చిరి! పరిస్థితి మరింత గలిబిలియాయెను! బహుశ నూతన సామాన్య సంఘ సమావేశము ఇట్టి పరిస్థితులను, సంఘ కష్టములను శుద్ధి చేసి అంతము చేయునేమోయని ప్రతియొక్కరు నిరీక్షించిరి.

అందుకే క్రీ.శ.1414 సం॥లో కాన్‌స్టన్స్‌లో మహాసభ జరిగెను. వేలకొలది మతనాయకులు, కార్డినల్స్, బిషప్‌లు, ఆశ్రమ అధిపతులు, విద్యావేత్తలు హాజరైరి. చక్రవర్తులు, రాజకుమారులు, పాలకులు వారివారి బలగములతో పెద్ద సంఖ్యలో హాజరైరి.

ఏదిఏమైనా సంఘ సంస్కరణ ఫలములు కలుగుట లేదు, కాని సమావేశము ఫలింపజేయ ప్రయత్నిస్తున్నది, మరొక్కసారి పోప్ ఒక్కడే కార్యాలయ నిర్వహణ చేయుచున్నాడు. లౌకిక పరిపాలకులవలె పోప్ మరియు తన వారసులు సుఖసౌఖ్యముతో విలాస మరియు అనైతిక జీవితము జీవించిరి. రోమ్ న్యాయస్థానములో ఘోరదుష్టత్వము నెలకొనెను. ఎన్నడూ లేని విధముగా పోప్ పాలన పాపపులోతుల్లోనికి దిగజారెను! ఇప్పుడు సంఘ సంస్కరణ ఆశలు చిన్నాభిన్నమై మనిషి నిశ్శేష్టుడాయెను... దేవుడు మరొక ద్వారము తెరచును. మార్పును, సంఘ సంస్కరణను జరిగించువాడు దేవుడే! భవిష్యత్‌లో సంఘ సంస్కరణను కార్యరూపము దాల్చజేయువాడు దేవుడే.

41. గెరార్డ్ గ్రూట్ మరియు ఆధునిక భక్తి

పదిహేనవ శతాబ్దపు ప్రారంభములో సంఘము చాలా విచారకరమైన పరిస్థితిలోనున్నా, ప్రపంచ ఇతర దేశములలో నిరీక్షణాస్పద సంగతులు సంభవించుచుండెను. పరిస్థితులు దయనీయ దశలోనున్నా ప్రభువు తన సంఘమును మరువలేదని మనము వచ్చే కొన్ని అధ్యాయములలో చూచెదము.

గెరార్డ్ గ్రూట్ డెవెంటర్ నగరపు మేయర్ కుమారుడు, ఆయన క్రీ.శ. 1340 సం॥లో డెవెంటర్ నగరములో జన్మించెను. ఆయన వేర్వేరు సార్వత్రిక విద్యాలయములో దేవజ్ఞానశాస్త్రము, న్యాయశాస్త్రము మరియు వైద్యశాస్త్రము చదివి డెవెంటర్‌లో నివసించుటకు వెళ్ళెను. ఆయన విశిష్టకుటుంబమునకు చెందినవాడు గనుక ఆయనకు సంఘమునందు ఒకటి ఉట్రెక్‌నందు మరొకటి ఆకెన్‌నందు రెండు పదవులీయబడెను. వాస్తవమునకు ఈ పదవులలో గెరార్డ్ చేయవలసిన దేమియూలేదు గాని అధిక జీతమును పొందేవాడు. ఆ రోజులలో పరిస్థితులు ఇలాగే యుండెను..

ఆయన విలాసవంతజీవితముతో లోక సుఖములను పూర్తిగా అనుభవించెను.

ఒకరోజు గెరార్డ్ ఆర్నెమ్‌లోని ఆశ్రమ అధిపతిని కలుసుకొనెను. ఆ ఆశ్రమ అధిపతి ఎంతో బతిమాలుతూ ఆయనతో మాట్లాడెను. ఈ సంభాషణ పిమ్మట గెరార్డ్ జీవితము మారెను. డెవెంటర్‌లో సంతవీధిలో తన స్వంత చెడుపుస్తకములను కాల్చుట ద్వారా ఆయన ప్రారంభించెను. (చాలా గ్రంథములు మంత్రవిద్యను గూర్చి యుండెను) తరువాత ఆయన ఆర్నెమ్‌లోని ఆశ్రమమున విశ్రాంతికై వెళ్ళెను. ఆయన తరచుగా ఒక గదిలోనే ఉండి తన పాపములను ప్రభువుతో ఒప్పుకునేవాడు. ఆయన అక్కడ బైబిల్‌ను కూడా అధ్యయనము చేసేవాడు. గెరార్డ్ సన్యాసిగా మారలేదు గాని ఆశ్రమములో అతిథిగా ఉండెను. మూడు సంవత్సరముల పిమ్మట ఆయన ఆశ్రమమును వదిలి తన ధనమంతయూ పేదలకిచ్చెను. ఇప్పుడు ఆయన బయటికి వెళ్ళి బోధ చేయగోరెను. దానిని చేయుటకు బిషప్ అనుమతింపకముందు, ఆయన పరిచారకునిగా నియమింపబడవలెను.

గెరార్డ్ డెవెంటర్‌లో ప్రసంగింప ప్రారంభించెను, కాని త్వరలోనే ఇతర డచ్‌నగరములలోనూ ప్రసంగించుటకు వెళ్ళెను. ప్రజలు నాలుగు దిక్కుల నుండి ఆయన ప్రసంగములను వినుటకు సంఘములకు వచ్చిరి. ఆయన బోదించునది అందరికి అర్థమయ్యేలాగున ఆయన అనుదిన భాషలో ప్రసంగించెను. సంఘ భవనములు చిన్నవిగా ఉన్నందున ఆయన తరచుగా ఆరుబయలులో ప్రసంగించెను. ఆయన ఖచ్చితముగా ప్రజలపాపములేవో చెప్పి, పశ్చాత్తాపపడుమని ప్రాధేయపడి హెచ్చరించేవాడు. ఆయన మత నాయకులను మరియు సన్యాసులను కూడా వారి భక్తిహీన జీవితవిషయమై గద్ధించెను.

ఆయన విధేయుడు, యధార్థవంతుడు గనుక గెరార్డ్ ప్రజలపై గొప్ప ప్రభావమును చూపెను. ఏదిఏమైనా ఆయన రోమన్‌క్యాథలిక్ సంఘములో నమ్మకమైన సభ్యునిగానుండెను. సంఘమును తన కష్టములనుండి శుద్ధిచేయుటయే ఏకైక లక్ష్యముగా కలిగియుండెను.

డెవంటర్‌లో సంఘము నడిపించు పాఠశాల ఉండెను. కొంచెము అదనపు డబ్బును సంపాదించుటకుగాను, మంచి పుస్తకములను మరియు లేఖనములలోని కొన్ని భాగములను గెరార్డ్ వారిచే కాపీ చేయించెను. తద్వారా సాధారణ ప్రజలు దేవుని వాక్యములో పరిచితులైరి, మరియు వారి చీకటి సమయములలో దేవుని వాక్యము వెలుగు కిరణమువలె ప్రసరించెను.

ఈ విద్యార్థులు అందరు కలసి ఒక ఇంటిలో ఉండేవారు, గెరార్డ్ గ్రూట్ వారికి తండ్రివలెనుండెను. వారు ఆశ్రమ తరగతిలోనికి రాక "సాధారణ జీవిత సహోదరులు" అని పిలుబడిరి. దీనికర్థము వారి జీవితమును వారు కలసి పంచుకొనేవారు, మరియు వారి ఇంటికి చెందిన వ్యవసాయ పొలమునందు పనిచేసి



తమ్ముని తాము పోషించుకొనేవారు.

కొంచెము కాలమైన పిమ్మట ఇట్టి సమాజములు ఇంకా ఎన్నో వెలసెను మరియు విండెషైమ్ ఆశ్రమ ఆర్డర్‌గా వారు వృద్ధినొందిరి. క్రీ.శ. 1395లో ఈ ఆర్డర్‌ను పోప్ గుర్తించెను. అందులో తొంబై అయిదు ఆశ్రమములుండెను. సహోదరులు ఫ్లెయర్స్‌గా పేరునొందిరి, వారు ఆశ్రమములలో ఉండక, గెరార్డ్‌వలె సువార్త ప్రకటించుటకై గ్రామములకు వెళ్ళేవారు. వారు పిల్లలకు విద్యనేర్పి, డెవెంటర్ మరియు జ్వోల్ పాఠశాలలో బోధించేవారు. తరువాత ఇతర స్థలములలోనే పాఠశాలలు తెరువబడెను. విద్యావిషయములలో సహోదరులు మహా ప్రభావమును చూపిరి మరియు వారి పని అధిక ఫలములనిచ్చెను.

ఎక్కడైనా ఎవరికైనా సేవ చేయాలనే సంకల్పముతో సహోదరులు భక్తి మరియు యథార్థ జీవితమును జీవింపగోరిరి. వినయము తమను తాము విసర్జించుకొనుటలో వారు క్రీస్తును అనుసరింపగోరిరి. ఈ భక్తి విధానము "ఆధునికభక్తి" సమకాలీన భక్తిగా పిలువబడెను.

కొంచెము కాలము పిమ్మట గెరార్డ్ గ్రూట్‌కు వ్యతిరేకముగా మొదట బిషప్‌నొద్ద తరువాత పోప్‌నొద్ద ఫిర్యాదులు చేయబడెను. గెరార్డ్ తన ప్రసంగమునందు వారి భక్తిహీన జీవితవిషయమై సన్యాసులను గద్ధించెను. అట్టి సన్యాసులు ఫిర్యాదు చేసిరి. తత్ఫలితముగా తాను ప్రసంగించుటకు అనుమతింపబడలేదు, ప్రసంగము చేయుటమానివేసి పోప్‌కు విధేయుడాయెను. కాని ఆయన తన రచనను కొనసాగించెను! ఆయన ఒక సంవత్సరము పిమ్మట క్రీ.శ. 1384 సం॥లో మరణించెను.

సాధారణ జీవిత సహోదరులలో కొందరు ప్రముఖులుగానుండిరి. అట్టివారిలో థామస్ ఎ.కెంపిస్. "ద ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్" అను గ్రంథము (ద గోల్డెన్ బుక్)ను ఆయన రచింపగా అది బహు ప్రసిద్ధినొందెను. అది అనేక భాషలలో అనువదించబడెను మరియు అనేక ముద్రణలు చేయబడెను.

42. జాన్ విక్లిఫ్ - సంఘ సంస్కరణ వేగుచుక్క

జాన్ విక్లిఫ్ క్రీ.శ.1330 సం॥లో జన్మించి క్రీ.శ 1384 సం॥లో మరణించెను. ఆక్స్‌ఫర్డ్ నగరములో ప్రసిద్ధిచెందిన సార్వత్రిక విద్యాలయములో దైవజ్ఞాన శాస్త్రము అధ్యయనము చేసి క్రీ.శ 1364సం॥లో ఆయన డాక్టర్ ఆఫ్ థియాలజీ అను పట్టా సంపాదించుకొనెను. పది సంవత్సరముల పిమ్మట బ్రూగ్స్ అను నగరములో మనము చూచెదము, ఆయన పోప్ సంబంధి ప్రతినిధుల చర్చలలో పాల్గొనుచుండెను. వాస్తవానికి పోప్ అధిక సుంకములను డిమాండ్ చేసెను కాని ఇంగ్లాండ్ ప్రజలు చెల్లించుటకు నిరాకరించిరి. ఇంగ్లాండ్‌లో పోప్ పట్ల ప్రతిఘటన పెరుగుచుండెను. ఇంగ్లాండ్ కార్యకలాపములలో పోప్ కలుగజేసికొనుటను ప్రజలు ఇష్టపడలేదు. "ఇంగ్లాండ్‌నకు రాజు ఉన్నాడు, ఆయనే మా పరిపాలకుడు కాని పోప్‌కాదు!" అని ప్రజలు అరిచిరి. వారు చెప్పిన దానియంతటితో విక్లిఫ్ సమ్మతించెను. విక్లిఫ్ గ్రామ మతగురువుగా మారి ప్రతి ఆదివారము గ్రామీణ సంఘములో బోధించెను. వారి సొంతభాషయైన ఇంగ్లీష్‌లో ఆయన మాట్లాడెను గనుక ప్రజలు ఆయన మాట వినుటయందు ఆనందించిరి. (సాధారణముగా చెప్పాలంటే సంఘములలో లాటిన్ భాషమాత్రమే వాడబడెను).


ఎందుకంటే సాధారణ ప్రజలతోనే ఎంతో పని కలిగియున్నాడు, వారు బైబిల్ పట్ల అతి తక్కువ జ్ఞానము కలిగియున్నారని ఆయన గ్రహించెను. ఇందులో ఆశ్చర్యమేమియూలేదు. ఎందుకంటే సామాన్య ప్రజలు చదువలేని లాటిన్ భాషలో బైబిల్ అందుబాటులో ఉండెను. ఈ కారణముచేత విక్లిఫ్ బైబిల్‌ను ఇంగ్లీషు భాషలోనికి అనువదించెను. ఈ ఇంగ్లీష్ బైబిల్‌ను చేతితో కాపి చేయవచ్చును, మరియు ఖచ్చితముగా అదే జరుగును!

అయినను చదువలేనివారు చాలామందియున్నారు. కాని ఇది విక్లిఫ్‌ను ఆపలేదు. బైబిల్ సందేశమును ప్రకటించుటకై ఇద్దరిద్దరు గ్రామములకు వెళ్ళు లాగున ఆయన బోధకులను నియమించెను. ఆయన తన బైబిల్ అధ్యయన సమయములో సంఘములోని ఎన్నో దోషములు గ్రహించులాగున విక్లిఫ్ కళ్ళు తెరువబడెను. దేవుని వాక్యమును ఖడ్గమువలె వాడి ఈ అబద్ద బోధలకు వ్యతిరేకముగా పోరాడెను. నిజ సిద్ధాంతమునకు బైబిల్ ఏకైక పునాదియని విక్లిఫ్ విశ్వంచును. "బైబిల్ ప్రకారము సంఘమునకు శిరస్సు ప్రభువైన యేసు క్రీస్తే గాని పోప్ కాదని ఆయన చెప్పెను."

పోప్ క్రీస్తు విరోధియని విక్లిఫ్ చెప్పెను, ధనము మోసము, హింస విషయములో చూస్తే పోప్ ఖచ్చితముగా క్రీస్తుకు విరోధియైయున్నాడు. సిద్ధాంతమందు మరియు జీవితశైలియందు ప్రభువైన యేసును అనుసరించువాడే నిజమైన పోప్ !

"పోప్ మాటలు దేవుని వాక్య పరిశీలనలలో నెగ్గేవిగా ఉండవవలెనని విక్లిఫ్ చెప్పెను"! చనిపోయిన భక్తుల ఆరాధనను, ప్రతిమ ఆరాధనను, అవశేషముల ఆరాధనను, పాపక్షమ పత్రములను మరియు యాత్రలను విక్లిఫ్ వ్యతిరేకించెను. ట్రాన్స్ సబ్‌స్టాన్సియేషన్ అను సిద్ధాంతము (రొట్టె ద్రాక్షారసములు ప్రార్థించినపుడు యేసు యొక్క నిజదేహము మరియు రక్తముగా మారుట) అన్యయుతమైనది దేవదూషణయుతమైనదని విక్లిఫ్ చెప్పెను. విక్లిఫ్ ప్రకారము రొట్టె రొట్టెగాను మరియు ద్రాక్షరసము ద్రాక్షారసముగాను ఉండును. సృష్టికర్తను ఆరాధించుటకు అనగా ప్రతిష్టింపబడిన అప్పము, ఇదంతయు విగ్రహారాధన!

విక్లిఫ్ దాదాపు రెండు వందల గ్రంథములను వ్రాసెను! ఈ గ్రంథములు ఇంగ్లాండ్ యందంతట చదువబడుట మాత్రమేగాక ఇరోపా దేశములయందంతటనూ చదువబడెను. విక్లిఫ్ తన గ్రంథములలో సంఘదోషములను ఖండించెను. దీనివలన గొప్ప అల్లరి చెలరేగెను. రోమన్ క్యాథలిక్ మతనాయకులు కోపోద్రేకులైరి. పరిస్థితి వినినపుడు పోప్ విక్లిఫ్‌ను బహిష్కరించెను. మూడు నెలల కాలవ్యవధినిచ్చి



రోమ్‌నందు న్యాయస్థానము ఎదుట హాజరు కావలెనని విక్లిఫ్‌ను పోప్ ఆజ్ఞాపించెను. అక్కడికి వెళ్తే ఆయన బ్రదికి ఇంగ్లాండ్‌కు రాడని ఆయనకు తెలుసును. అందుకే విక్లిఫ్ రోమ్ వెళ్ళలేదు.

ఆయన రోమ్‌కు వెళ్ళుటకు నిరాకరించినపుడు ఇంగ్లాండ్‌లో సంఘ సమావేశమునకు హాజరుకమ్మని ఆర్చ్ బిషప్ ఆజ్ఞాపించెను. విక్లిఫ్ లండన్ వెళ్ళెను, ఎందుకంటే ఆ నగరమందు ఆయన ఇంగ్లాండ్ రాజు భద్రతక్రింద ఉండెనుగనుక. ఆ సమయములో విక్లిఫ్ రచనలు దుర్బోధకుని రచనలని ఖండింపబడెను.

అకస్మాత్తుగా ఆ సమావేశ సమయములో ఇంగ్లాండ్‌లో ఎన్నడూ జరగని దొకటి జరిగెను. ఆ భవనమంతయూ కంపించటము ప్రారంభించెను! భూకంపం వలన దాని పునాదులు కదిలింపబడెను! ప్రతియొక్కరునూ భయపడిరి! విక్లిఫ్ తన కార్యమునందు కొనసాగెను. ఆయన కొనసాగి రచనలు మరియు బోధ చేయసాగెను. ఆయన కార్యము ద్వారా మరియు అనుచరుల కార్యముద్వారా సత్యమును మరియు బైబిల్ సందేశ సరళతను చూడగలిగిరి.

బైబిల్ ద్వారా సంఘ తప్పిదములను ఎన్నో వారు చూడగలిగిరి. ఆయన శత్రువులు ఆయనను ఎంతో తీవ్రముగా ద్వేషించిరి. తరువాత వారు ఆయన సమాధి త్రవ్వి, ఎముకలను కాల్చి వాటి బూడిదను నదిలో కలిపిరి! జాన్ విక్లిఫ్ సంఘ సంస్కరణోద్యమమునకు వేకువ చుక్కవలెనుండెను. పద్నాలుగవ శతాబ్దములోనే ఆయన బైబిల్ సందేశమును ప్రజలకు స్పష్టముచేయగలిగెను.

43. జాన్‌హస్ - దేవుని వాక్యబోధకుడు

"నేను కూడా లోకపు కునుకు అను ఇంద్రజాలమందు నిద్రించితిని. నన్ను రక్షించుటకు యేసు క్రీస్తు ప్రభువునకు అభీష్టమగునంతవరకు నా శరీరాశలకు బానిసనైయుంటిని. నేను ఆత్మయందు దీనుడనైతిని. నా హృదయము నలుగగొట్టబడెను. భయముతోనూ వణకుతోను దేవుని వాక్యపు పేజీలయందు కనుగొనిన జ్ఞాన నిధినిబట్టి ఆశ్చర్యపడితిని." ఈ మాటలు జాన్‌హస్‌చే వ్రాయబడెను. (1369-1415 క్రీ.శ) బొహిమియాకు ముఖ్య నగరమైన ప్రాగ్‌లో ఆయన బోధకునిగా పండితునిగాను ఉండెను. ప్రాగ్ ఇప్పుడు చెక్ రిపబ్లిక్‌కు ముఖ్య పట్టణముగానున్నది.

క్రీ.శ. 1400సం॥లో హస్ మతగురువుగా నియమింపబడ్డాక, ప్రాగ్‌నందలి బెత్లెహేం చాపల్‌లో ఆయన పరిచారకుడాయెను. ఈ చాపల్ ఓ ఉన్నత వంశీయునిద్వారా నగరమునకు బహుకరింపబడెను. బెత్లెహేం చాపల్‌లో జరుగు ఆరాధనలో జాతీయ భాషమాత్రమే వాడబడవలెనని ఆయన చెప్పెను.

ప్రజల అనుదినభాషలో బోధించుటకు ఆయన ఆనందించెను. ఆయన తన ప్రసంగములలో ఏమని బోధించెను? బైబిల్ సెలవిచ్చునదే బోధించెను. ఆయన బోధవినుటకు వ్యవసాయదారులు, రైతుకూలీలేగాక యాజకులు కూడా వచ్చిరి. జాన్‌హస్ ఎంతోవరముగల బోధకుడు గనుక స్వయాన రాణి ఆయన బోధవినుటకై వచ్చెను.

బైబిల్‌ను తన వనరుగా వాడుతూ, అటు సామాన్య ప్రజలకు ఇటు ఉన్నత వంశీయులకు పాపము ఎంతఘోరమైనదో వివరించెను. మతగురువులు మరియు పోప్‌ను ఎవరిని కూడా లెక్కచేయక సవాలు చేసెను. మతగురువులు మరియు పోప్ వారి భక్తిహీన జీవితముద్వారా దేవుని కోపమును రేపిరి!

జాన్‌హస్ యొక్క నేత్రములను దేవుడు నిశ్చయముగా తెరిచెను. ఈ ఉద్దేశము నిమిత్తమై జాన్‌హస్ గ్రంథములను ప్రభువు వాడుకొనెను, ఎందుకంటే ఈ గ్రంథములు బోహిమియాలో కూడా చదువబడెను. అందులో మరొక్క విషయము కూడా ఉండెను.

ఒక రోజున కొందరు ఇంగ్లీష్ చిత్రకారులు తన గోడలపై కొన్ని చిత్రములను గీయుటకై అనుమతింపుమని మనవిచేసిరి. ఆయన సమ్మతించెను. వారు ముగించాక ఆయన నుంచొని ఆ చిత్రములను చూడనారంభించెను. చాలాసేపు ఆయన మాటలేక మౌనియాయెను. ఒక గోడపై ఒక వ్యక్తి ముళ్ళ కిరీటము ధరించి అపహసింపబడుతూ, ఉమ్మివేయబడుతూ గుద్దబడుచుండెను. ఆయనే యేసు. ఎదురుగానున్న గోడపై ఒక వ్యక్తి సిల్క్ ఊదారంగు వస్త్రమును ధరించి తలపై మూడు కిరీటములను ధరించియుండెను. మూడవ గోడపై సాతాను ప్రక్కన నిలువబడియుండగా ప్రభువైన యేసు ఓ దీన బోధకునివలె నుంచొనియుండెను. సాతాను ఆయనకు ఈ లోక రాజ్యములనీయజూచుచుండెను. కాని యేసు "సాతానా వెనక్కి వెళ్ళు" అని చెప్పెను. నాల్గవ గోడపై చక్రవర్తి తన ఎదుట నమస్కరిస్తుండగా పోప్ ఆయన గొంతుపై కాలుబెట్టియుండెను. "భూమిమీద మరియు పరలోకములో సర్వాధికారమీయ బడియున్నదని" పోప్ చెప్పెను.

హస్ ఈ చిత్రపటము యొక్క ప్రాముఖ్యతను చూచెను. సంఘమునకు అధిపతినని చెప్పుకొంటున్న పోప్‌కు మరియు ప్రభువైన యేసునకు ఎంత వ్యత్యాసము...!

జాన్‌హస్ దేశ పరిస్థితులకు వ్యతిరేకముగా ఎంతో తీవ్రముగా ప్రసంగింప ప్రారంభించెను. (అప్పటికే ముగ్గురు పోప్‌లుండిరి!) పోప్ సంఘమునకు అధిపతికాదు. ఆయన ఈ విషయమై పోప్‌కు ఉత్తరము కూడా వ్రాసెను. ఆర్చ్ బిషప్ కోపోద్రిక్తుడాయెను. జాన్ హస్ యొక్క రెండు వందల గ్రంధములను బహిరంగముగా కాల్చివేయమని మరియు ఆయనను బోధచేయవద్దని ఆజ్ఞాపించెను. కాని జాన్‌హస్ బోధను కొనసాగించెను. ఆయన పోప్‌ను క్రీస్తు విరోధి అని పిలిచెను! అది విని పోప్ ఆయనను తిరస్కరించెను.

విక్లిఫ్‌వలె, హస్ బైబిల్‌ను ప్రజల వ్యవహార భాషలోనికి అనువదించెను. మరొక్క మారు దేవునివాక్యము సెలవిచ్చునది ప్రతియొక్కరు అనగా పోప్, గుమస్తాలు, సామాన్య ప్రజలు తప్పక వినవలెను. ఒక ప్రముఖ సంఘ సమావేశము (కౌన్సిల్) జరుగనైయున్నది. (41వ అధ్యాయములో కాన్‌స్టన్స్ కౌన్సిల్ గూర్చి చదువుకున్నాము)



ఇప్పుడు అదే సమావేశము జరుగనైయున్నది. హస్ ఆ సమావేశమునకు హాజరు కావలెనని చక్రవర్తి కోరెను. తన సైనికులు ఆయనను క్షేమముగా ఇంటికి చేరునట్లు భద్రముగా చూచుకొందురు అని చక్రవర్తి అభయమిచ్చెను. ఆ విధముగా హస్ కాన్స్టన్స్ వెళ్ళెను. కాని ఆయన నగరమునకు చేరుకొనినపుడు, ఆయనను చెరపట్టి బందించి లోతైన కూపమునందు ఉంచిరి. కాని చక్రవర్తి తనమాటను నిలువబెట్టుకొనలేదు. "అయినా ఫరవాలేదు, హస్ దుర్బోధకుడు" అని ఆయన శత్రువులనిరి. ఏడు నెలలపాటు హింసింపబడి, కఠినముగా పరీక్షింపబడెను. తుదకు పాలిపోయి, నీరసించి, బక్కచిక్కి సభయెదుట హాజరాయెను కాని తన్ను తాను సమర్థించుకొనుటకు అవకాశమీయబడలేదు. ఆయన మాట్లాడ ప్రయత్నించినపుడు విపరీత ద్వేషపు కేకల వలన అణ చివేయబడెను. మాట వెనక్కి తీసికొమ్మని ఆజ్ఞాపింపబడెను కాని అలాచేయుటకు ఆయన నిరాకరించెను. అలా అయితే అయన మణింపవలెను. సమావేశము జరిగే మహాదేవాలయములోనికి ఆయన తీసికొనిపోబడెను. మత గురువు బలిపూజ జరుపు సమయంలో ధరించు వస్త్రములను ఆయనకు వారు ధరింపజేసిరి. ద్రాక్షారసపు పాత్ర (చాలిస్) ఆయన హస్తములలోనికి నెట్టివేయబడెను. తరువాత ఆయనను మతగురువు స్థానమునుండి తొలగించిరి. మతగురువు వస్త్రములు, ద్రాక్షారస పాత్ర (చాలిస్) తననుండి తీసివేయబడెను. "శపింపబడిన యూదా" అని పిలువబడెను! అటు పిమ్మట ఆయన నమ్మకములను ఎగతాళి చేసే విధముగా వస్త్రములను ధరింపజేసి ఆయనను మరణమునకు అప్పగింప సిద్ధపరచిరి.

దేవాలయము ఎదుట నిలిపిన కొయ్యప్రానునొద్దకు ఆయనను తీసికొని వెళ్ళిరి. కొంచెము సమయమైన పిమ్మట మంటలు మరియు పొగల మధ్యనుండి "ప్రభువైన యేసూ, సజీవుడగు దైవకుమారుడా, నన్ను కరుణించుము" మని పలికే స్వరము వినబడెను. జాన్‌హస్ ఇట్టి పలుకులు పలుకుతూ తన రాజు నొద్దకు వెళ్ళెను. మంటలు ఆరిపోయెను కాని ఆయన విస్తరింపజేసిన వెలుగు ఆరిపోలేదు... ఆయన చనిపోకమునుపు ఈ వెలుగును గూర్చి హస్ ఇలా చెప్పెను, "వందసంవత్సరములలోపల దేవుడొక వ్యక్తిని పంపును ఆయన సంఘ సంస్కరణోద్యమ పిలుపును ఆపజాలరు."

44. మార్టిన్ లూథర్ - గొప్ప సంఘసంస్కరణకర్త

లూథర్ గొప్ప సంఘ సంస్కరణోద్యమకారుడా? అవును, సంఘ సంస్కరణ ఉద్యమమునకు ప్రాముఖ్యమైన పునాది వేయుటకు ప్రభువు ఆయనను వాడుకొనెను. లూథర్ తనను గూర్చి తాను ఎలా భావించెను? ఆయన మరణమునకు మునుపు వ్రాసిన తనకు చెందిన ఓ కాగితమందు "మేము నిశ్చయముగా భిక్షకులము" అను మాటలు కనబడెను.

భిక్షగానికి తనదంటూ ఏదీ ఉండదు, తన అవసరతలనిమిత్తమై ఆయన ఇతరులపై పూర్తిగా ఆధారపడును.

మార్టిన్ లూథర్‌కు తన అనుదిన జీవితములో ప్రభువు అవసరమాయెను. దేవుని సేవకుడు, సంఘసంస్కరణకర్త అలాగేయుండును...!

మార్టిన్ క్రీ.శ.1483 సం॥లో జర్మన్‌నందలి ఏసెల్‌బెన్ అను అందమైన గ్రామములో జన్మించెను. ఆయన శిశువుగా ఉన్నప్పుడే మతగురువు ద్వారా లూథర్‌కు బాప్తిస్మమీయబడెను. శిశువులుగా నున్నపుడు చనిపోతే వారు పరలోకము వెళ్ళుదురు. ఆయన లోకములో ప్రవేశించినప్పుడు నీటి బాప్తిస్మము శిశువు పాపములను కడిగివేయును. దీనిని సంఘము బోధించును ఇటువంటి సంఘ తప్పులద్వారా సామాన్యప్రజలు పెడత్రోవ పెట్టబడుచున్నారు.

మార్టిన్ ఏడు సంవత్సరముల వయసుగలవాడైయున్నపుడు చదువుట వ్రాయుట మరియు పాడుట నేర్చుకొనుటకు పాఠశాలకు వెళ్ళెను. త్వరలో ఆయన పది ఆజ్ఞలు, ప్రభువు నేర్పిన ప్రార్థన మరియు అపొస్తలుల విశ్వాసపు ఒప్పుకోలును కంఠస్థముచేసెను.

సంఘ గాయక బృందములో ఆయన చేరెను. మార్టిన్‌కు చక్కటి స్వరముండి పాడుటకు చాలా ఇష్టపడేవాడు.

ఆయన పద్నాలుగేండ్ల వయసుగలవాడై యున్నపుడు మగ్డిబర్గ్‌లోని పాఠశాలకు వెళ్ళి రోమన్ క్యాథలిక్ బోధలను నేర్చుకొనెను. ఆయన అక్కడ ఉంటుండగా పాఠశాలయందలి గ్రంథాలయములో ఓ బైబిల్ ఉంటే దానిని చదువుతూనే చాలా సమయము గడిపెను. ఆయన చక్కగా చదివే విద్యార్థి గనుక ఏసెల్‌బెన్‌లోని పాఠశాలకు వెళ్ళెను. ఒక సంవత్సరము పిమ్మట సార్వత్రిక విద్యాలయములో పైచదువుల నిమిత్తమై వెళ్ళెను.

చూడండి! మార్టిన్ మరియు ఆయన స్నేహితులు వీధులగుండా పాడుచూ వెళ్ళుచున్నారు! ఎవరైనా తలుపు తెరచి వారి పాటలకై కొంత డబ్బిత్తురని ఆశించిరి. వాస్తవమునకు మార్టిన్ మరియు తన మిత్రులు వారి ఆహారమును వారే చూచుకొనవలెను. కొన్ని నెలల పిమ్మట మనము తరచుగా మార్టిన్‌ను, కాట్టస్ ఇంటి వద్దగాని లేదా స్కాల్బే ఇంటి వద్దగాని చూస్తాము. వీరు సంగీత రసజ్ఞులు మరియు మార్టిన్ సంగీతమును ఆనందించేవాడు. ఆయన తంతి వాయిద్యము వాయించేవాడు. రెండు సంవత్సరముల పిదప న్యాయశాస్త్రమును చదువుటకు ఉపయోగపడు సిద్ధ పాటు కోర్స్ చదివెను. తరువాత ఆయన న్యాయవాది కావచ్చును. మార్టిన్ ఇది చేయవలెనని తన తండ్రి ఆశగలవాడై ఈ విషయమై ఓ కౌంట్‌తో మాట్లాడెను (కౌంట్=ఐరోపాలోని ఉన్నత వంశీయుడు) లూథర్ తండ్రి తన కుమారుని విషయమై గర్వించెను.

ఇతర నాలుగువందలమంది విద్యార్థులతో మార్టిన్ విశ్వవిద్యాలయమునందు తన కోర్స్‌ను ప్రారంభించెను. ఎర్‌ఫర్ట్‌లోని విశ్వవిద్యాలయము తన ఇంట నుండి దాదాపు నాలుగువందల కిలోమీటర్లు దూరములో ఉండెను-కనీసము వంద కిలోమీటర్లు, మూడు దినముల నడక ప్రయాణము పట్టేంత దూరముండెను గనుక అతడు ఎర్‌ఫర్ట్‌లో నుండుటకు వెళ్ళెను.

రోమన్ క్యాథలిక్ విశ్వాసమును గూర్చి తన అధ్యాపకులతో మాట్లాడినప్పుడు బైబిల్‌లో ఉన్నవాటికి భిన్నముగా వారు సమాధానమివ్వటం లూథర్ గమనించెను. ఎర్‌ఫర్ట్‌నందునూ విశ్వవిద్యాలయములో బైబిల్‌ను చదువుటలో ఎక్కువ సమయము గడిపెను. ప్రత్యేకముగా హన్నా మరియు సమూయేలు కథ ఆయనపై



లోతైన ప్రభావమును కలిగించెను. మార్టిన్ లోతుగా ఆలోచించువాడు. ఆయన మరణమును గూర్చి చాలా ఆలోచించేవాడు. నిశ్చయముగా పరలోకము వెళ్ళుటకై ఆయన చేయగలిగినన్ని మంచి క్రియలు చేయుటకు నిర్ణయించుకొనెను. ఇంటిలోనూ సంఘమందునూ ఆయనకు ఇలాగే నేర్పబడెను. నాలుగు సంవత్సరముల చదువు పిమ్మట మార్టిన్ చక్కటి మార్కులతో ఉత్తీర్ణుడాయెను. ఇప్పుడు ఆయన న్యాయవాద శాస్త్రం చదువుటకు వెళ్ళవచ్చును. మరొకసారి ఆయన తన తల్లిదండ్రులు నివసించు మాన్స్‌ఫీల్డ్‌నుండి ఎర్‌ఫర్ట్‌కు ప్రయాణమాయెను. ఆకాశము నల్లబడెను, చీకటికమ్మెను. వచ్చే గాలివాన నుండి తప్పించుకొనుటకై తన గ్రామమునకు మార్టిన్ పరుగు పరుగునవచ్చెను. కాని సమయానికి చేరుకోలేకపోయెను. బలమైన గాలి, భయంకరమైన మెరుపులు, గాలివాన ఘోరముగా వస్తుందేమో అన్నంతగా.... చాలా భయపడి, ముందుకు వెళ్ళెను గాని తన పాదముల దగ్గర భయంకరమైన మెరుపు ఉరుములు వచ్చి భూమిని కంపింపజేయగా మార్టిన్ నేలకొరిగెను. ఆయన భయముతో "సెయింట్ ఆన్నీ, సహాయము చేయుము" నేను ఓ సన్యాసినవుతాను" అని మార్టిన్ అరిచెను.

గాలివాన తగ్గెను. మార్టిన్ వణకుతూనే నుంచొని తన ప్రయాణమును మళ్ళీ కొనసాగించెను. ఇప్పుడు ఆన్నీతో చేసిన మ్రొక్కుబడి నెరవేర్చాలి. రోమన్ క్యాథలిక్ సాంప్రదాయము ప్రకారము ఆన్నీ మరియ యొక్క తల్లి. నిశ్చయముగా మార్టిన్ ఆన్నీకి చేసిన వాగ్దానమును దేవుడు వినెను. ఇప్పుడు ఆయన తన మ్రొక్కుబడి చెల్లించాలి.

లూథర్ యొక్క తండ్రి తన కుమారుడు చేయబోవు సంగతిని విని చాలా కోపపడెను. మార్టిన్ స్నేహితులు ఆయనను అలా చేయకుండా ఆపే ప్రయత్నము చేసిరి. కాని అవి అన్నియు విఫలమాయెను. వాటి మీద నుండి వెళ్ళుచుండెను...

45. ఆశ్రమములో మార్టిన్

జూలై మాసము వేసవికాలములో ఓ చక్కటి దినమున ఎర్‌ఫర్ట్‌కు సమీపమున ఉన్న కఠిన అగస్టీనియన్ ఆశ్రమము పెద్ద తలుపు ఎవరో తట్టిన శబ్దం. మార్టిన్ ఆ భవనమునందు ప్రవేశించెను, ఆ తలుపులు నెమ్మదిగా తెరచుకొనెను... తన చిన్న గదిలో ఒక చిన్న కిటికి ఉండెను. దాని ద్వారా కాస్త వెలుతురు వచ్చుచుండెను. తన గదిలో ఒక టేబుల్, కుర్చీ మరియు పండుకొనుటకు ఒక చెక్క బల్ల ఉండెను. ఆశ్రమములో మొదటి పండ్రెండు మాసములు మార్టిన్‌కు చాలా కష్టముగానుండెను. తాను ఆశ్రమ నిబంధనలకు అన్ని విషయములలో లోబడియుందునని ప్రతిజ్ఞ చేసెను. ఓ చక్కటి బైబిల్‌కూడా ఆయనకివ్వబడెను. మార్టిన్ తప్పక బైబిల్‌ను క్షుణ్ణముగా చదువనైయున్నాడు. తాను ఏదో కష్టపడుతున్నాడని గాక, ఆశ్రమ నిబంధనలకు తట్టుకోలేక కాదు గాని బైబిల్‌లోని సంగతులు చదువుతూ అసౌకర్యమునకు అశాంతికి గురియాయెను. ఆయన దేవునితో సమాధానపడే విధముగానుంటే ఆయన ఇంకా ఎంతైనా చేయుటకు సిద్ధముగానున్నాడు. అత్యున్నత అధికారముగల న్యాయాధిపతియగు దేవుని యెదుట ఆయన తప్పక అగుపించవలెను! మార్టిన్ ఎంతో పాపాత్ముడుగానున్నట్లు భావించెను!

కాని తన పాపములన్నియూ అధిగమించుటకు ఆయన ప్రయత్నించనైయున్నాడు. ఆయన నిద్ర లేక, సెయింట్స్‌ను వేడుకొంటూ ఎక్కువ సమయము ప్రార్థనలో గడిపెను. తరచుగా ఉపవాసముంటూ మూడు రోజులు ఆహారము ఒక మెతుకైననూ ముట్టకయుండెను. చలికాలములో, కఠిక చలిలో దుప్పటి కూడా కప్పుకొనక రాత్రంతా ఆరుబయలులో పరుండేవాడు. మెలకువగా ఉండాలని రక్తము కారునంతగా తన శరీరమును బాదుకొనేవాడు. తరువాత పరిస్థితిని వివరిస్తూ "నేను చచ్చేంతగా నన్ను నేను హింసించుకొన్నాను" అని చెప్పెను.


ఒకానొక సందర్భములో తన గదిలో మతి తప్పి పడిపోయెను. ఇతర సన్యాసులు ఆయనను గౌరవించిరి ఎందుకంటే మార్టిన్ కంటె పవిత్రులెవరూ లేరని వారి భావన.

తరువాత తన జీవితములో తననుగూర్చి మార్టిన్ ఇలా చెప్పెను "తన స్వంత యోగ్యతల ఆధారముగా పరలోకము చేరిన సన్యాసులు ఎవరైన ఉంటే అది నేనే."

ఓ సంవత్సరము పిమ్మట క్రీ.శ.1507సం॥లో మతగురువుగా నియమింపబడెను. రోమన్ క్యాథలిక్ సంఘములో దేవుని సేవకుడాయెను. ఇప్పుడు ఆయన బలిపూజ జరుపుటకు అనుమతింపబడెను. మొదటి సారి జరుపుచుండగా ఆయన ఇంకనూ సమాధానపడని పరిశుద్ధ దేవుని యెదుట నిలువబడియున్నందున వణక సాగెను. విషయములు మార్టిన్‌కు మరింత కఠినమాయెను. దేవుని కృపను కోరునంతగా ప్రార్థనలో పోరాడెను గాని అది ఎక్కడనూ ఆయన కనుగొనలేకపోయెను. పాపపు ఒప్పుకోలు తన హృదయ శాంతిని అనుగ్రహింపలేకపోయెను. తాను చేసిన శ్రేష్ఠమైన మంచి క్రియలు కూడా పాపముచే కలుషితమైనవని ఆయన వాటిని గూర్చి బైబిల్‌లో చదివెను గనుక ఆ మంచి క్రియలు కూడా ఆయనకు సహాయపడకపోయెను.

అంతా సవ్యముగా చక్కగా సాగుతున్నదో లేదోయని తెలుసుకొనుటకై అగస్టీనియన్ ఆర్డర్ ఆశ్రమ అధికారి ఆశ్రమమును దర్శించుటకు వచ్చేవాడు. ఆయన పేరు వాన్ స్టాపిజ్. వాన్ స్టాపిజ్ మార్టిన్ లూథర్ ను కలుసుకొనెను. లూథర్ తన పాపములను గూర్చి చెప్పెను. దేవుని ఎదుర్కొనుటకు ఎంత భయపడుతున్నాడో, దేవునితో సమాధానమునకై ఎలా అన్వేషిస్తున్నాడో అను ఈ రెండు సంగతులు ఆయనకు తెలిపెను. పాపములకై శ్రమపడిన క్రీస్తును సూచిస్తూ వాన్ స్టాపిజ్ లూథర్‌ను ఆదరించే ప్రయత్నము చేసెను. అధిక సమయము బైబిల్ చదువుటయందు గడుపుమని ఆయన సలహానిచ్చెను. లూథర్ చాలా ప్రోత్సహింపబడెను గాని ఆయన కోరిన సహాయము వాన్ స్టాపిజ్ కూడా ఇవ్వలేకపోయెను.

వాన్ స్టాపిజ్ విటన్‌బర్గ్ నగరములోని విశ్వవిద్యాలయమునకు స్థాపకుడు. ఆయన ప్రొఫెసర్‌గా పనిచేయుచూ తనపనిలో సహాయము చేయు మరొకరి నిమిత్తమై ఆయన చూచుచుండెను. అప్పటికే పండితుడైన



లూథర్‌ను గూర్చి ఆయన ఆలోచించెను. క్రీ.శ.1512 సం॥లో విటన్‌బర్గ్ విశ్వవిద్యాలయములో లూథర్ ప్రొఫెసర్‌గా నియమితుడాయెను. విద్యార్థులకు ఉపన్యాసములిస్తూ సంఘమునందు బోధచేస్తూ ఆయన ఆశ్రమములో నివసింపసాగెను. ఆశ్రమములోని మేడగదిలో లూథర్ తన బైబిల్ చదువుతుండెను. అతడు ఆ అంశము పై తన విద్యార్థులకు ఉపన్యాసమిచ్చుచుండెను గనుక పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికను అధ్యయనము చేయుచుండెను.

రోమా 1:17లో "నీతి" అను పదమును లూథర్ చదివెను. ఆయన ఆ పదమును చాలా సందర్భములలో గమనించెను. ఆయన దానిని ఓ ఘోరపదమనెను. ఆ పదము, తన పాపములన్నిటికై దేవుడు తనను తీవ్రముగా శిక్షించును ఆయన నీతిమంతుడైన న్యాయాధిపతి అని అర్థమిచ్చెను గనుక లూథర్ ఆ పదమును ద్వేషించెనని తరువాత చెప్పెను.

బహుశ "నీతి"యను ఆ పదమునకు మరొక అర్థమున్నదేమో! ఇక్కడ "నీతి"యను పదమునకు పౌలు భావమేమి? అకస్మాతుగా సత్యము లూథర్‌పై ప్రకాశించెను. దానికర్థము క్రీస్తు నీతి! ఆయన శ్రమ మరియు మరణము ద్వారా క్రీస్తు ఆ నీతిని సంపాదించెను. ఆ నీతినే ఆయన పాపులకిచ్చును. ఈ నీతి ద్వారానే వారి పాపములన్నిటికై వారు క్షమాపణను పొందుకొనవచ్చును!

విశ్వాసము ద్వారా ఇప్పుడు క్రీస్తు నీతిని లూథర్ స్వీకరింపవచ్చును, ఓ బిక్షకుని వలె దానిని ఉచితముగా నొందుకొనెను. అదంతయూ పరలోకమునుండి తన హృదయములోనికి ఓ కాంతి కిరణము ప్రసరించినట్లుగా ఉండెను. "నేను తిరిగి జన్మించినట్లు, తెరువబడిన పరదైసులో ప్రవేశించినట్లు" భావించితినని తరువాత లూథర్ చెప్పెను.

ఎట్టకేలకు లూథర్ తన హృదయమందు శాంతి కలిగియున్నాడు. కేవలం క్రీస్తు ఆధిక్యత మరియు నీతి ద్వారానే ఆయన దేవునితో సమాధానము కలిగియున్నాడు. అది దేవుని కృపాఫలమే, కేవలం దేవుని కృపా ఫలితమే!

46. లూథర్ - 31 అక్టోబర్ (క్రీ.శ. 1517)

గంటలు మ్రోగుచుండగా ప్రజలు సమూహములుగా దేవాలయమునకు వెళ్ళుచున్నారు. వెళ్ళగలిగిన వారందరు వెళ్ళుచున్నారు. "నేడే కొనండి" "రేపు ఆలస్యము కావచ్చును" అని వారు చెప్పుచున్నారు. సంఘములో బలిపీఠము ముందు ఓ ఎఱ్ఱని పెద్ద సిలువ ఉంచబడెను. దాని ప్రక్కనే డబ్బు సంచి.... టెట్‌జెల్ అను ఓ ప్రముఖుడైన సన్యాసి మాట్లాడుట ప్రారంభించెను. దేవుడు పాపులను ఎంత ఘోరముగా శిక్షిస్తాడు అను సంగతి ఆయన ప్రజలకు వివరించుచుండెను. "కాని ఇప్పుడైతే" పాపక్షమాపణ పత్రములు అమ్మబడుచున్నవి, అవి మీ పాపమంతటికిని సరిపోవును. పోప్ ద్వారాను మీ పాపములన్నియూ క్షమింపబడినవని వ్రాయబడిన ఓ కాగితమును మీరు పొందుకొందురు. పాపక్షమ పత్రములు పరలోక ద్వారమును తెరచును! నీవు భవిష్యత్‌లో జరిగింపబోవు పాపములకొరకు కూడా పాపక్షమ పత్రములను కొనవచ్చును. మృతులైన మీ బంధువుల నిమిత్తమై మీరు పాపక్షమ పత్రములను కొంటే వారు నరకమునుండి నేరుగా పరలోకము వెళ్ళవచ్చును" టెట్‌జెల్ దీనిని వ్యాపారబద్ధము చేసెను. విషయమంతా ఏమిటంటే డబ్బు. రోమ్‌లో పోప్ ఓ మహాదేవాలయమును కట్టదలచెను.

టెట్‌జెల్‌చే వేలకొలది ప్రజలు ఎలా మోసపుచ్చబడుతున్నారో వినెను. ప్రజలు ఆయన యొద్ద పాపములు ఒప్పుకుని వాటి విషయమై పశ్చాత్తాపపడుటకు ఎలా నిరాకరిస్తున్నారో వినెను. మేము టెజెల్ నొద్ద పాపక్షమ పత్రములను కొన్నాము మేము పశ్చాత్తాప పడనవసరములేదని వారు అన్నారు. మేము మా పాపములను సురక్షితముగా నిరభ్యంతరముగా కొనసాగింపవచ్చును. వారు ఇక ఏమాత్రమును వారి పాపముల విషయమై విచారపడుట లేదు.



ఇట్టి వ్యవహారము విషయమై లూథర్ చాలా కలతనొందెను. అది అక్టోబర్ 31, క్రీ.శ. 1517. లూథర్ మరియు తన అసిస్టెంట్ విటెన్‌బర్గ్‌నందలి క్యాజెల్ చర్చ్‌వైపు నడచుచున్నారు. ఓ పొడవైన కాగితపుచుట్ట, మేకులు సుత్తె తీసుకొనివారు వెళ్ళుచున్నారు. దేవాలయపు ద్వారముపై కొన్ని దెబ్బలు సుత్తెతో వేస్తే ఆ కాగితపు చుట్ట సురక్షితముగానుండును. ఆ వాక్యములను థీసిస్ అందురు. (పరిశోధనా వ్యాసము.) అందులో పాపక్షమ పత్రపు అమ్మకము మరియు సంఘమందలి తప్పిదములు వ్రాయబడియుండెను. అందులోని విషయములు పండితులతో చర్చింప ఉద్దేశింపబడెను గనుక అవి లాటిన్‌లో వ్రాయబడెను. పండితులు దానిని చదువగలిగెదరు.

నిజముగా దీనినే లూథర్ చేయగోరెను. కాని ప్రభువైతే తన వాక్యము ద్వారా ప్రజలకు రక్షణమార్గము తెలుపగోరెను. విటన్‌బర్గ్‌లో లూథర్ చేసినది ఇట్టి ప్రక్రియను ప్రారంభించెను. అందుకే అక్టోబర్ 31, క్రీ.శ. 1517 సంఘ సంస్కరణోద్యమ "జన్మదినముగా" ఎంచబడెను.

విషయమును ముందుగా జాగ్రత్తగా పరిశీలించకుండానే లూథర్ వెళ్ళి థీసిస్ (పరిశోధనా వ్యాసమును) దిగగొట్టలేదు. "దేవుడు నాతో ఉండులాగున అన్నిటికంటే మొదట దేవుని ఎదుట నేను సాగిలపడితిని" అని తనను గూర్చి లూథర్ చెప్పెను. ఆ ద్వారమునొద్దకు అనేక విద్యార్థులు వచ్చి థీసిస్‌ను చదువనారంభించిరి. ముద్రణాలయమునకు తీసికొనిపోవుటకు వారు జర్మన్ భాషలోనికి అనువదించిరి. నకలు చేసిరి. (ముద్రణ అప్పటికే కనుగొనబడియుండెను). ముద్రణ ద్వారా వేలకొలది ప్రజలు లూథర్ థీసిస్‌ను చదివిరి. మరియు ఖచ్చితముగా ఇదే జరిగెను. గ్రామములలో పట్టణములలో సర్వత్రా ప్రజలు తొంబైఐదు థీసిస్‌ను చదువనైనా చదువుతున్నారు లేదా బిగ్గరగా ఒకరు చదువుతుంటే వినైనా వింటున్నారు. ఈ థీసిస్ ఇతర దేశములకునూ చేరెను. "దూతలు అంతటా వ్యాపించిరి" అన్నట్లుండెనని కొందరనిరి.

ఈ థీసిస్‌లో ఏమున్నది? అంశములో... సత్యముపట్ల నిజమైన యథార్థమైన ప్రేమగలిగి దానిని మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో వెలుగులోనికి తెచ్చుచున్నాము.

అందులోని కొన్ని వాక్యములు.

1. డబ్బు పెట్టెలో నాణెము పడగానే నరకమునుండి పరలోకమునకు ఆత్మ ఎగిరిపోవుట కేవలము మానవ ఊహ.
2. శిక్షనుండి తప్పించి రక్షణను దయచేయునని పోప్ జారీ చేసిన పాపక్షమ పత్రములను అమ్ముువారు, దానిని బోధించువారు పొరబడిరి.
3. తన పాపముల విషయమై నిజముగా విచారపడు ప్రతి క్రైస్తవుని దోషము పోప్ పాపక్షమా పత్రము లేకయే తొలగింపబడును!
4. సంఘముయొక్క నిజ ధననిధి దేవునికృపయైన పరిశుద్ధ సువార్త.

లూథర్ చిన్న పుస్తకములను మరియు కరపత్రములను వ్రాసెను. మనము వాటిని చదివినపుడు ప్రజలెలామోసపోయారో గ్రహింపవచ్చును. వారు చదివినపుడు మరియకు, ఆయా సెయింట్స్‌కు చేయు ప్రార్థనలు వట్టివేనని గ్రహింతురు. క్రీస్తు యోగ్యతల ద్వారానే పాపులు రక్షింపబడుదురు. సోలా గ్రేషియా– కేవలము దేవుని కృప!

ఆకలిగొన్నవారు ఆహారముకై తహతహలాడినట్లు వేలకొది ప్రజలు ఈ పుస్తకములను తీసికొని చదువగోరిరి. ఈ విధముగా ప్రభువు అనేక ప్రజల అంధకార హృదయములలో తన వాక్యపు వెలుగును ప్రసరింపజేసెను. దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు వేల ఆత్మలలో విశ్వాసమును ఎదుగజేసెను. అసంఖ్యాకమైన ప్రజలు మార్పు నొంది దేవునియందు విశ్వాసముంచిరి!

సంఘసంస్కరణోద్యమము అనేక మంది ప్రజల హృదయములలో ప్రారంభమాయెను. ఇది సర్వ సక్తిమంతుడగు దేవుని కార్యము. సోలిడియో గ్లోరియా– దేవునికే మహిమ!

47. పోరాటములో లూథర్

ప్రభువు పనిచేయు చోట సాతాను కూడా పనిచేయును. తత్ఫలితముగా కలుగు పోరాటము తీవ్రముగానుండును. పాపక్షమా పత్రములను అమ్ము యాజకుడైన టెట్‌జల్ కోపోద్రిక్తుడాయెను. "మూడు వారములలోగా నేను ఆ దుర్బోధకుని అగ్నిమంటలలో వేయుదును" అని ఆయన పలికెను. విటెన్‌బర్గ్‌లో జరిగిన దానిని రోమ్ వారు కూడా వినిరి. మొదట పోప్ పరిస్థితిని గూర్చి వినినపుడు ఆయన నవ్వెను. "సన్యాసులు వారు త్రాగినపుడు పోట్లాడుకొంటారు, పరిస్థితులు వాటంతట అవే సర్దుకుంటాయి" అని ఆయన చెప్పెను.

లూథర్ నుండి పోప్ ఉత్తరము అందుకున్నపుడు అంతయూ మానిపోయెను, పరిస్థితి అంత సులువుగా సర్దుకోదని పోప్ గ్రహించెను. పాపుల రక్షణను గూర్చిన రెఫరెన్స్‌లను బైబిల్‌నందు చూపుతూ, టెట్‌జల్ అమ్ము పాపక్షమ పత్రములను గూర్చి లూథర్ ఆయనకు వ్రాసెను. తొంభైఐదు పరిశోధనశాస్త్ర అర్థమును కూడా వివరించెను. ఆ ఉత్తరము చాలా మర్యాద గౌరవముతో కూడినదైయుండెను. లూథర్ ఇంకనూ పోప్‌ను గౌరవిస్తూ ఆయనను "పరిశుద్ధ తండ్రి" అని పిలిచెను.

పోప్ కోపించెను అరవై రోజులలోగా రోమ న్యాయస్థానము ఎదుట హాజరు కావలెనని లూథర్ ఆదేశింపబడెను. మత సంగతులను విచారించు సభ (ఇంక్విజిషన్) ఎదుట ఆయన హాజరుకావలసి ఉండెను. అయినప్పటికి, లూథర్ రోమకు వెళ్ళడు, కాని జర్మనిలో పరిక్షింపబడుటకు సిద్ధమాయెను. లూథర్ తన రచనలన్నిటిని వెనక్కి తీసికొనవలెనని కాజిటన్ అను కార్డినల్‌ను పోప్ పంపెను. బైబిల్‌నుండి అది తప్పు అని నిరూపించినపుడే అలా చేతునని లూథర్ నిర్ణయించుకొనెను. కాజిటన్ లూథర్‌ను "మృగము" అని పిలిచి, ఆయనతో మాట్లాడుటకు నిరాకరించెను. ఎందుకంటే తను అనుకొన్నది చేయలేకపోయెను. "చిన్న సన్యాసిని" బహిష్కరింతునని ఆయన బయపెట్టెను. తరువాత పోప్ ఓ ప్రముఖుడైన ఉన్నత వంశీయుని (చాంబర్లిన్) విట్టెన్‌బర్గ్‌కు పంపెను. ఈ వ్యక్తి, చక్కటి పదములతో సమస్యను పరిష్కరించే ప్రయత్నము చేసెను గాని ప్రయత్నము ఫలింపలేదు.

ఇప్పుడు ప్రసిద్ధిగాంచిన పండితుడైన డాక్టర్ ఎక్క్ లూథర్ నొద్దకు వెళ్ళి మాట్లాడెను. ఎక్క్ చాలా తెలివైనవాడైయుండి తన్ను తాను చక్కగా వ్యక్తము చేసికొనగలవాడు, అయినను లూథర్‌ను ఓడింపలేకపోయెను. లూథర్ సమస్తమును బైబిల్ నుండి నిరూపించెను. పోప్ మరియు నేర్పరులందరు మరియు గుమస్తాలు తప్పుచేయుదురని ఆయన చెప్పెను. మనకు సత్యము నేర్పునది కేవలము దేవుని వాక్యమే అధికారముగలది కేవలము దేవుని వాక్యమే. "సోల స్క్రిప్చరా" కేవలము దేవుని వాక్యమే! ఎక్క్‌కు చాలా కోపము వచ్చెను. ఆయన లూథర్‌ను అన్యుడు మరియు సుంకరియని పిలిచెను. పోప్ లూథర్‌ను బహిష్కరించెను. ఆయనను సంఘమునుండి తొలగించి, శాపగ్రస్తునిగా ప్రకటించిరి!

నలభైయొక్క దయ్యపు బోధల విషయమై లూథర్‌ను నిందిస్తూ పోప్ ఓ అధికార ప్రకటన (బుల్) జారీ చేసెను. ప్రతిచోట ప్రతియొక్కరు లూథర్‌ను బహిష్కరించేలా చేసెను. ఆయన ఎంతటి ప్రమాదకర దుర్బోధకుడో ప్రతి యొక్కరు తెలిసికొనవలెనని కోరిరి. ఆయన గ్రంథములన్నియూ కాల్చివేయబడవలెను. ఎవరునూ ఆయనను చేర్చుకొనకూడదు. లూథర్‌కు ఎక్కడ కూడాను సురక్షిత స్థలము లేకుండా చేయుటకై లూథర్‌ను బహిష్కరించుమని శక్తిమంతుడైన జర్మన్ చక్రవర్తిని కోరెను. అందరూ ఆయనను చంపేహక్కు కలిగియున్నారు. క్రీ.శ1520 సం॥లో ఒక సోమవారం ఉదయాన విట్టెన్‌బర్గ్ పట్టణమునకు వెలుపల కళ్ళలు పేర్చబడియుండెను. లూథర్ యొక్క విద్యార్థులు, సార్వత్రిక విద్యాలయపు ఆచార్యులు, ఇతర ప్రజలు కళ్ళల కుప్ప చుట్టూ సమకూడిరి.

లూథర్ తన అనుదిన ఆశ్రమ వస్త్రములను ధరించుకొని కళ్ళల కుప్ప చెంతకు వచ్చుచుండెను. లూథర్ రోమన్ క్యాథలిక్ కేనన్ చట్టమును ఒక చేత మరొకచేత పోప్ ఆజ్ఞను పట్టుకొనియుండెను. మంటలు ఆకాశమునకెగసెను. కీలక క్షణము వచ్చెను! లూథర్ కొన్ని అడుగులు ముందుకు వేసెను. మంట దగ్గరకు వచ్చెను.



ఆయన కేనన్ చట్ట గ్రంథమును, పోప్ ఆజ్ఞా పత్రమును లూథర్ మంటలో విసిరివేసెను. "మీరు దేవుని సత్యమును పాడుచేసిరి గనుక దేవుడు మిమ్మును మంటలలో పాడుచేయును", ఆమేన్" అని చెప్పిరి. దీని చేయుట ద్వారా లూథర్ తాను పెరిగి, ప్రేమించి, ఎదిగిన, తాను కాపరత్వము చేసిన సంఘమునుండి మేలుకై విడిచిపోయెను.

"నేను నిన్న చేసినది ప్రజలను నిత్యనాశనమునుండి రక్షించుటకే" అని తన విద్యార్థులతో మరుసటిరోజు చెప్పెను. దీని నిమిత్తమై "నేను జీవించినంతకాలము దేవుని వాక్య సత్యమును ప్రకటింతును" అని చెప్పెను. "దేవుని వాక్య సత్యమేమనగా ఒక వ్యక్తి క్రీస్తు నందలి విశ్వాసము ద్వారా మాత్రమే రక్షింపబడును. "సోలా ఫిడే" – విశ్వాసము మాత్రమే. "నరకమా లేక హతసాక్షియగుటయా" అను ఎన్నిక మీరు చేయవలెనని తన విద్యార్థులతో చెప్పెను. మీరు రోమన్ క్యాథలిక్ మతమునందు కొనసాగితే నశించి నరకమునకు వెళ్ళుదురని లూథర్ భావము. మీరు ఆ బోధను విశ్వసింపనట్లైతే మీరు హతసాక్షిగా మరణించుటకు సిద్ధపడవలెనని చెప్పెను. లూథర్ పరిస్థితిని పూర్తిగా ఎరిగియుండెను. శత్రువులు "గర్జించు సింహము"వలె దాడిచేయనైయున్నారు.


48. వార్మ్స్ నందు లూథర్

చార్లెస్ కేవలం ఇరవై ఒక్క సంవత్సరములు వయసుగలవాడైనా చాలా శక్తివంతమైన పరిపాలకునిగానుండెను. ఆయన రోమా మహానగరమునకు చక్రవర్తియైయుండి స్పెయిన్ మరియు దిగువ ప్రాంతములను ఏలుచుండెను.

ఆ ప్రాంతమునందు అలజడి చెలరేగెను. అదంతయూ మతసంబంధమైనదని చార్లెస్‌కు తెలుపబడెను. తన రాజ్యములో ఒకేఒక్క మతమునకు స్థానమున్నందున తప్పక ఆయన ఈ అలజడి విషయమై చర్యతీసుకొనెను. ఈ సామ్రాజ్యమునందు దుర్బోధలకు తావులేదు. ఆరోజులలో లూథర్ మరియు బైబిల్ సంబంధ బోధలు దాని ప్రచారము చేయువారు దుర్బోధకులుగా, వారి బోధలు దుర్బోధలుగా ఎంచబడెను.

లూథర్‌కు చాలా మంది స్నేహితులున్నందున, వారిలో కొందరు ప్రముఖులు గనుక ఈ పరిస్థితిని అంత సులువుగా చూస్తూ ఊరుకోరు. అట్టివారిలో జ్ఞానియైన ఫ్రెడ్రిక్, లూథర్ నివసించు స్థలమైన సాక్సని అను ప్రాంతమునకు ఆయన ఎలక్టర్‌గా నుండెను. జర్మన్ దేశములో చాలా రాష్ట్రములుండెను. ఆ ప్రతిరాష్ట్రము యువరాజులచే పాలింపబడుచుండెను. యువరాజులందరు కలసి చక్రవర్తిని ఎన్నుకొందురు, అందుకే వారిని ఎలక్టర్స్ (ఎన్నుకొనువారు) అని పిలువబడిరి. ఈ "గజ్జి గొఱ్ఱె" "దుర్బోధకుడు" చెఱలో వేయబడాలి అని డా॥ ఎక్క్ చక్రవర్తిని కోరెను. లూథర్‌తో చర్చ జరగాలని అందులో తానునూ ఉండాలని చార్లెస్ కోరెను.

క్రీ.శ1521లో వార్మ్స్ నందు డైయట్ జరిగెను. డైయట్ అనగా అది యువరాజులందరితో కూడిన ఓ ప్రాముఖ్యమైన సమావేశము. రోమన్ క్యాథలిక్ మతగురువులలో నుండి ముఖ్యమైనవారునూ అందులో పాల్గొందురు.



లూథర్ హాజరుకావలెనని ఆదేశింపబడెను. చక్రవర్తినుండి భద్రత సంబంధమైన హామీ లభించకపోయిననూ వెళ్ళమని ఆయన స్నేహితులు లూథర్‌కు సలహానిచ్చిరి. ఏది ఏమైనా వార్మ్స్ అను స్థలమునకు వెళ్ళెను. "ఇంటి కప్పుపై పెంకులు ఉన్నట్లుగా అన్ని దయ్యములున్ననూ నేను వెళ్ళుదును. ఇది దేవుని చిత్తము". నేను "అక్కడికి వెళ్ళుదును" అనెను.

వేల మంది ప్రజలు ఆయనకై కేరింతలు కొడుతూ వీధ్యోలు పలికిరి. ఆయన అక్కడ చేరుకొన్నప్పుడు అక్కడ కూడా చాలామంది ఆయనకు ఆహ్వానము పలికిరి. లూథర్ నగరమందు ప్రవేశించెననుటకు సూచనగా అందరు వినేలాగున మేళతాళ వాయిద్యములు మ్రోగెను. లూథర్ స్నేహితుడు జ్ఞానియైన ఫ్రెడ్రిక్ ఇట్టి మహా ఆహ్వానమును ఏర్పాటు చేసెను.

మరుసటి దినమున జనసంద్రమైన హాల్‌లో లూథర్ నిలువబడెను. ఆయన ఓ సాధారణ సన్యాసిగా నుంటూ దట్టమైన రంగు వస్త్రము ధరించుకొని యుండెను. ఆయన చుట్టూ రాజవైభోగము, అంతఃపుర అలంకరణ ఉండెను. చక్రవర్తి, తెల్లని ఘనమైన దుస్తులు ధరించి సింహాసనముపై కూర్చుండెను. ఆయన ప్రక్కన దేహ సంరక్షకులుండిరి. ఆయన చుట్టూ యువరాజులు, బిషప్‌లు, కార్డినల్స్ ఎర్రని మరియు ఊదారంగు వస్త్రములు ధరించుకొని ఆయన ప్రక్కన కూర్చుండిరి.

లూథర్ వణకుచున్నాడు. చక్రవర్తి యెదుట నుంచున్నందున లూథర్ వణకుచున్నాడా? ఆయన మరియు చక్రవర్తి దేవుని ఎదుట నుంచున్నందున భయపడితినని లూథర్ తరువాత చెప్పెను. పందొమ్మిది గ్రంథములు టేబుల్‌పై ఉన్నవి. "నీవు గ్రంథములు రచించావా" అని చాన్స్‌లర్ (చక్రవర్తి సలహాదారుడు) అడిగినప్పుడు అవును అని సమాధానమిచ్చెను. "ఈ గ్రంథములలో వ్రాయబడినవన్నియూ వెనక్కి తీసికొందువా?" అని లూథర్‌ను చాన్స్‌లర్ అడిగెను.

ఈ ప్రశ్న దేవుని వాక్యము మరియు ఆత్మలకు సంబంధించినది గనుక మరొక్కసారి జాగ్రత్తగా పరిశీలించుటకొరకు సమయమీయమని లూథర్ కోరగా అంతయూ నిశ్శబ్దమాయెను.

చక్రవర్తి అంగీకరించెను. మరుసటి మధ్యాహ్నము లూథర్ సభకు హాజరై జవాబీయవలెను. తన జవాబునకు ఎంతో గొప్ప పర్యవసానములుండును గనుక అది గ్రహించి లూథర్ ఎంతో తీవ్రముగా ఆ సాయంత్రము ప్రభువునకు ప్రార్థించెను. జర్మన్ ప్రజలలో చాలామంది ఆయనను బలపరచిరి. ఆయన వెనక్కి తీసికోనట్లైతే మత విషయమై గొప్ప అసమ్మతి కలిగి రెండుగుంపులు ఏర్పడును. యుద్ధము సంభవించునా? హింస చెలరేగునా? తన సామ్రాజ్యమునందు ఒకే ఒక్కమతము అనగా రోమన్ క్యాథలిక్ మతమునే చక్రవర్తి కోరుకొనెను.

"నీవు ఒక్కడవే సరియైన వ్యక్తివా, రోమన్ క్యాథలిక్ మతగురువులలోని పండితులందరు వ్యర్థమా?" అని సాతాను అతని చెవులలో గుసగుసలాడి లూథర్‌ను బాధించెను.

"ఓ నా దేవా నేను చాలా బలహీనుడను, నేను నీయందు నమ్మికయుంచుచున్నాను. నీ కుమారుని పేరట నాకు సహాయము చేయుము. నీవే నా కోట, నా దుర్గము, నా ఆశ్రయము..." అని లూథర్ ప్రార్థించెను. మరుసటిరోజు రాజభవనమందు లూథర్ హాజరైనపుడు దేవుడు తన హృదయమునందు సమాధానము మరియు ధైర్యమునను గ్రహించెను. "పోప్ మరియు సభలు పొరపడి తప్పిపోయిరి గనుకనే నేను వారిని నమ్మను. కేవలము పరిశుద్ధ లేఖనముల సాక్ష్యముద్వారా మాత్రమే నా మనస్సు మార్చుకొనుటకై ప్రోద్బలము చేయబడును" అని లూథర్ తన ఉపన్యాసమునిచ్చెను.

కాని అక్కడ ఉన్నవారందరు ఈ సంగతిని చర్చించుటకు ఇష్టపడలేదు. వారికి కావలసినదంతా ఒక్కటే "నీవు నీ నమ్మకము నిజముకాదని వెనక్కి తీసికొంటావా లేదా.." "నా మనసాక్షి దేవుని వాక్యముచే చెఱపట్టబడినందున నేను వెనక్కి తీసికోలేను. దేవా నిలుచున్న నేను, ఇంతకంటె ఎక్కువ ఏమి చేయలేను నాకు సహాయము చేయుము, ఆమేన్"! అని లూథర్ జవాబీయగా నిశ్శబ్దము నెలకొనెను.

కోపముతో ఆయన శత్రువులు పళ్ళుకొరికిరి. వారు ఓడింపబడిరి. చక్రవర్తి మరియు ఆయన పరివారము సభను విడిచి వెళ్ళగా తానున్న స్థలమునకు తిరిగి తీసికొని పోబడెను. దేవుని వాక్య శక్తిచే ఆయన జయము నొందెను.

దేవుని సత్యము ఇంకనూ నిలుచును, ఎందుకంటే ఆయన రాజ్యము శాశ్వత కాలముండును!

49. వార్ట్‌బర్గ్‌లో లూథర్

వార్మ్స్ నగరమునుండి రెండు వాహనములు బయలుదేరుచున్నవి. ఆయన విటెన్‌బర్గ్‌నకు తిరుగు ప్రయాణము చేయుచుండగా ఆయన సహోదరుడు మరియు ఆయన యొక్క స్నేహితులు చాలామంది ఆయనను అనుసరించిరి. ఆయన సురక్షిత ప్రయాణము కలిగియుండులాగున ఇరవై గుఱ్ఱపు రౌతులు లూథర్ వాహనములకు సమీపముగా వెళ్ళు లాగున చక్రవర్తి ఆజ్ఞాపించెను. రెండవ దినమున లూథర్ సైనికులను వెనక్కి పంపెను. వారు లేకయే ప్రయాణము కొనసాగించుటకు లూథర్ సంతసించెను. తరువాత అదే రోజున లూథర్ వాహనము ప్రక్కదారిలో తిరిగిపడెను. సమీప గ్రామములోనున్న తన బంధువులు ఆయనను దర్శింపగోరెను.

మధ్యాహ్న సమయములో వారు గ్రామమునుండి తిరిగి మరొకసారి బయలుదేరిరి, కాని ఇప్పుడు వారు సుదీర్ఘ, ఒంటరి, చీకటి అడవి గుండా ప్రయాణింపవలెను. అకస్మాత్తుగా రోడ్డు ప్రక్కన పొదలలోనుండి ఓ పెద్ద శబ్దము కొమ్మల చప్పుడు వినపడెను. ఆయుధములు గల ఐదుగురు లూథర్ వాహనములోనికి దూకి ఆయనను బయటకు లాగిరి! ఆయన అనుచరులు పారిపోయిరి. లూథర్‌ను దాడి చేసినవారు మరింత దట్టమైన అడవిలోనికి లాక్కొని వారి గుఱ్ఱములు నుంచున్న స్థలము దగ్గరికి తీసికొని పోయిరి. లూథర్‌ను గుఱ్ఱముపై ఉంచి ముందుకు కొనసాగించి గంటల తరబడి వారు ముందుకు ప్రయాణించిరి.

తుదకు వారి వాహనము ఓ ఎత్తైన దట్టమైన కొండను చేరుకొనెను. కొండమీద వార్ట్‌బర్గ్ అనే ఓ కోట ఉండెను. అక్కడికి చేరుకున్న వెంటనే లూథర్ ఓ బలమైన ద్వారముగుండా అదృశ్యమాయెను. తన స్నేహితులచే ఆయన బందీగా కొనిపోబడెను.


ఆ కోట లూథర్ సంరక్షకుడైన ఎలక్టర్ అయిన ఫ్రెడ్రిక్‌నకు చెందును. లూథర్ ప్రాణమునకు ముప్పున్నదని ఫ్రెడ్రిక్ గ్రహించెను గనుక "అపహరణ" (కిడ్నాప్) ఆయనే జరిగేలా చేసెను. అతిత్వరలోనే చక్రవర్తిచే లూథర్ బహిష్కరింపబడునని ఆయన ఎరిగియుండెను. ఆయన ఎక్కడ ఉన్నది ఎవరికి తెలియదు గనుక లూథర్ వార్ట్‌బర్గ్‌లో క్షేమముగా నుండెను.

ప్రభువు తన సేవకుని అలా చూచుకొనును. "మన దేవుడింకనూ సురక్షిత బలమైనకోటగానుండును."

"ఆయన నమ్మదగిన డాలు మరియు ఆయుధము"! (లూథర్ వ్యవహారభాషలో వ్రాసిన 46వ కీర్తననుండి.)

లూథర్ అపహరింపబడిన వార్త జర్మన్ దేశమంతయూ అగ్నివలె త్వరగా వ్యాపించెను. అపహరించిన వారేమి చేతురోయని తన స్నేహితులు దుఃఖపడిరి. కాని ఆయన శత్రువులైతే... దుర్బోధ తుడిచివేయబడినదని సంబరపడిరి. ఇప్పుడు లూథర్ జీవిత విధానము మారెను. ఆయన గడ్డమున్న ఉన్నత వంశీయునివలె రాజ కుమారుని వస్త్రములు ధరించి మారు వేషమున వెళ్ళెను. వారు ఆయనను "జంకర్ జార్జ్" అని పిలిచిరి. ఇలా చేయుటలో లూథర్ ఏదో ఒక పని కలిగియుండెను. త్వరలోనే ఆయన ప్రసంగములను ఉత్తరములను వ్రాయనారంభించెను. అవి విట్టెన్‌బర్గ్‌లో తన స్నేహితులకు చుట్టు ప్రక్కల సరఫరా చేయబడెను. లూథర్ గ్రంథములను ఇంటి యొద్ద కాకుండా చదువుట నిషేధింపబడెను గనుక వారు చాలా జాగ్రత్తగా ఉండవలెను.

వార్ట్‌బర్గ్‌లో లూథర్ ఓ ముఖ్యమైన దీవెనకరమైన, పెద్ద పనిని ప్రారంభించెను. ఆ పనియేదనగా క్రొత్త నిబంధన గ్రంథమును గ్రీక్ నుండి జర్మన్‌లోనికి అనువదించుట. పదకొండు వారముల పాటు ప్రతి రోజు ప్రొద్దుట ప్రారంభించి మధ్యరాత్రి వరకు పనిచేసేవాడు. జ్ఞానము మరియు ఖచ్చితమైన తలంపులను ఆ పనికి తగినట్లుగా ప్రభువే ఇచ్చెనని ఆయన చెప్పెను. ముప్పునకు గురైన దేవుని దివ్య వాక్యమును కడు జాగ్రత్తతో అనువదించు పని అది. పది నెలల పిమ్మట లూథర్ మరొక్కసారి అకస్మాత్తుగా విటెన్‌బర్గ్‌కు తిరిగి వచ్చెను. అక్కడ ప్రజల మధ్యన అల్లరి చెలరేగెను. బలవంతముగా రోమన్ క్యాథలిక్ సంఘముయొక్క దురభ్యాసములు పూర్తిగా రూపుమాపు చేయవలెనని వారు భావించిరి. అందుకే సంఘములలో విగ్రహములు, వేదికలు నాశనము చేయుటకై మతగురువులు పంపబడిరి.



గందరగోళము ఏలుబడి చేసెను. సంఘ సంస్కరణా గొప్ప ప్రమాదము నందుండెను.

లూథర్ ఈ సంఘటనలను గూర్చి విని గ్రహించి ఇప్పుడు తిరిగి విటన్‌బర్గ్ చేరుకొనెను. ఆయనకు మరియు తన అనుచరులకు మరణ శిక్ష విధింపబడెను గనుక అక్కడికి తిరిగి వచ్చుట ఆయనకు ఎంతో ప్రమాదకరము. అయిననూ ఆయన తిరిగి వచ్చెను! ఒక్క క్షణముకూడా వెనుకాడకుండా ఆ నగరమునందలి సంఘమునకు ప్రతి ఉదయము వెళ్ళి ప్రజలకు బోధించుచుండెను. ప్రశాంతముగా ఉండుమని ఆయన వారికి హెచ్చరించెను. నగరములో మరొక్కసారి సాధారణ వాతావరణము నెలకొనెను.

క్రీ.శ. 1522లో లూథర్ అనువదించిన క్రొత్త నిబంధన ఐదువేల ప్రతులు ముద్రింపబడెను. తక్కువ దినములలో అవన్నియూ అమ్ముబడెను! ముద్రికులు (ప్రింటర్స్) చాలా కష్టపడవలసిన వచ్చెను. ప్రజల అనుదిన భాషలో అనువధింపబడిన బైబిళ్ళు వేలకొలదిగా పట్టణములను మరియు గ్రామములను చేరుకొనెను. చీకటిలో జ్యోతివలె దేవుని వాక్యము అంతటయూ ప్రసరించెను. ఆ జ్యోతిని మోయువానిగా దేవుడు లూథర్‌ను నియమించెను. లూథర్ తన స్నేహితుల సహాయముచే, పాతనిబంధన అనువాదమును ప్రారంభించెను. పాత నిబంధనను ఉత్పత్తి చేయుటకు పది సంవత్సరములు పట్టెను. క్రొత్త నిబంధనతో పోలిస్తే పాత నిబంధనను అనువదించుట చాలా కష్టము. క్రీ.శ. 1534లో అది పూర్తిగా చేయబడెను.

బోధకులు అంతట వెళ్ళిరి మరియు వారెక్కడికి వెళ్ళినా వారి సందేశమును ఆలకించుటకై గుమిగూడేవారు. వారు దేవుని వాక్యము కొరకై ఆకలి గొనిరి గనుక దానిని వినుటకై ఆరాటపడిరి. కృప ద్వారా ప్రభువైన యేసు నందలి విశ్వాసము ద్వారా మాత్రమే వారు ఎలా రక్షింపబడుదురో దేవుని వాక్యము తెలుపును. ఈ విధముగా ప్రభువు తన వాక్యము ద్వారా వేల హృదయములలో పనిచేసెను. రోమన్ క్యాథలిక్ మతపు అబద్ధముల ద్వారా గాక తన దివ్య వాక్యముద్వారా, అతడు ప్రజలను మార్చును. ఇది హృదయ నిజ మార్పు, పరివర్తనము!

50. సంఘ సంస్కరణ కొనసాగెను కాని ప్రమాదములు సంభవించెను


లూథర్ సంఘసంస్కరణను కొనసాగించెను. పరిచర్య నిమిత్తమై ఆయన అనేకమైన విద్యార్థులకు తర్ఫీదునిచ్చెను. సంఘసంస్కరణ సంఘములకు అవసరమైయుండెను. వ్యవహారిక భాషలో ప్రజలకర్థమయ్యే భాషలో వాక్యమును బోధించుట అలనాటి సంఘమందు ప్రాముఖ్యమైనదిగా ఉండెను. బలిపూజను (మాస్) ఇకను ఏ మాత్రము ఆచరింపరు. (బలిపూజ జరిపినపుడెల్లా ప్రభువైన యేసు బలియర్పణ పునరావృతమగునని రోమన్ క్యాథలిక్ సంఘము బోధించెను.) ప్రభురాత్రి భోజన సమయములో ప్రతియొక్కరు రొట్టె తినుట మాత్రమే కాక ద్రాక్షారసమును కూడ త్రాగుదురు. కాని రోమన్ క్యాథలిక్ సంఘములో మతగురువులు మాత్రమే ద్రాక్షారసము త్రాగుటకు అనుమతింపబడిరి. ఎందుకంటే ద్రాక్షారసము సాక్షాత్తు క్రీస్తురక్తమువలె మారునని వారు నమ్ముదురు గనుక ఒక్క చుక్క కూడ వారు ఒలికించుటకు అనుమతిలేదు.

సంఘములు పాడవలెనని కూడ లూథర్ కోరెను. ఆయన కీర్తనలు వ్రాసెను. ఉదాహరణకు "మన దేవుడు బలమైన మహోదుర్గము" లూథర్ సంగీత ప్రియుడు గనుక ఆయనే పదములు వ్రాసి వాటికి సంగీతమును సమకూర్చెను. ఆయన వ్రాసిన కీర్తనలు అంతట వినబడసాగెను. ఇళ్ళలో, పనిస్థలములలో, సంతలో, వీధులలో, లూథర్ వ్రాసిన కీర్తనలు మారుమ్రోగుచుండెను.

క్రీ.శ. 1530లో జర్మన్ మహాసామ్రాజ్యములో మరొక సభ జరుపబడెను. సంఘసంస్కరణ ఉద్యమమును బలపరచు యువరాణి ఆ సభకు హాజరయ్యెను. లూథర్ అనుచరులు హింసింపబడుట ఖండింపబడెను. ఈ కారణము చేత సంఘసంస్కరణ ఉద్యమమును బలపరచువారు ప్రొటెస్టెంట్‌లని (తిరుగుబాటు ప్రజలని) మారుపేరుతో పిలువబడిరి. మెలాంక్తన్‌చే తయారు చేయబడిన లూథరన్ విశ్వాసపు ఒప్పుకోలు ప్రతిని యువరాజు చక్రవర్తికిచ్చెను. (మెలాంక్తన్ పండితుడు, ప్రొపెసర్, లూథర్‌కు విశ్వసనీయమైన మిత్రుడు). కాని చక్రవర్తి అస్సలు శ్రద్ధ చూపలేదు. ఆగ్స్‌బర్గ్‌లో జరిగిన సభలో మెలాంక్తన్ ప్రొటెస్టెంట్‌లను సమర్థించ ప్రయత్నించగా చక్రవర్తి వినుటకు నిరాకరించెను. తన సామ్రాజ్యములో రోమన్ క్యాథలిక్ మతము మాత్రమే ఉండవలెనని కోరెను!

క్రీ.శ. 1525లో ఇతర ప్రాంతములలో కూడ సంఘసంస్కరణ ఉద్యమము ప్రమాదమునకు గురయ్యెను. రైతుల మధ్యలో ఓ ఘోర తిరగుబాటు చెలరేగెను. చాలా కాలమునుండి ఉన్నత వర్గమునకు చెందినవారు రైతులను బానిసలవలె చూచిరి. రైతులు కటిక దారిద్ర్యమందు జీవించిరి. మొదట, లూథర్ రైతులను బలపరచెను. యువరాజులు మరియు చక్రవర్తులు రైతులను మానవతతో చూడవలెనని లూథర్ చెప్పెను. థామస్ ముంట్జర్ నాయకత్వములో రైతులు ఆయుధములు వాడుట, హత్యలు, దోపిడి చేయుట జరుగగా లూథర్ దానిని సమర్థించలేదు. (ఈ ఉద్యమము రైతుల తిరుగుబాటు అని పిలువబడెను.) సంఘసంస్కరణ ఉద్యమకారులు కోరిన స్వేచ్ఛవేరు, రైతులు కోరి పోరాడిన స్వేచ్ఛవేరు. ఆయన వాక్యము ప్రకారము దేవుని ఆరాధించు స్వేచ్ఛను సంఘసంస్కరణ ఉద్యమకారులు ఆశించిరి. సంఘ సంస్కరణ ఉద్యమము రైతుల తిరుగుబాటువలె భావింపబడెను. గనుక రైతుల తిరుగుబాటును అణచమని లూథర్ యువరాజును కోరెను. తత్ఫలితముగా జరిగిన ఘోర వధలో వేలాది రైతులు నశించిరి.

మరొక ప్రమాదము కూడ ఎదురయ్యెను. ప్రొటెస్టెంట్‌లలో ఒక విపరీత మత గుంపుకలదు. వారు నేరుగా పరిశుద్ధాత్మ ప్రేరణ ప్రకారము జీవించు గురి కలిగియుందురు. తత్ఫలితముగా వారి జీవితములలో పరిశుద్ధలేఖనములు ఏ మాత్రము ప్రాముఖ్యతలేనివాయెను. "అంతరంగపు వెలుగు" వారి భావనలు అధిక ప్రాముఖ్యతను కలిగియుండెను. వీరు నిజ పరిశుద్ధుల సహవాసము, లోకమాలిన్యము అంటని పరిశుద్ధుల సహవాసమును భూమి మీద స్థాపింప ప్రయత్నించిరి!



అది మాత్రమే గాక, వారిలో అనేకులు శిశు బాప్తిస్మమును తిరస్కరించిరి. తమ మారుమనస్సును ఎవరైతే వ్యక్తము చేసి చెప్పగలరో వారికే బాప్తిస్మమివ్వబడెను బాప్తిస్మమునుండి శిశువులు మినహాయింపబడిరి. వీరు అనబాప్టిస్ట్‌లని పిలువబడిరి. (అనబాప్టిస్ట్ ఉద్యమములో సభ్యులు కావలెనంటే శిశు బాప్తిస్మము తీసికొనిన వారు మళ్ళీ పెద్ద వారయ్యాక బాప్తిస్మము తీసికోవాలి). జర్మనీలో రైతుల తిరుగుబాటు తర్వాత అనేక అనబాప్టిస్ట్ సమాజములేర్పడెను. త్వరలో ఈ సమాజములు స్విట్జర్లాండ్ మరియు నెదర్లాండ్‌లో కూడ ఏర్పడెను. ప్రొటెస్టెంట్‌లలో యధార్థవంతులు మరియు భక్తిపరులైన ప్రజలున్నారు అంతేగాక ప్రమాదకరమైన విపరీత మతవాదులునూ ఉన్నారు. ఇట్టి ప్రజలు ఆయుధములు వాడి ప్రభుత్వాధికారముపై తిరుగబడిరి! మున్‌స్టర్ అను పట్టణములో డచ్ అనబాప్టిస్ట్ వారు ఈ భూమిమీద దేవుని రాజ్యమును స్థాపింప పూనుకొనిరి. ఒక వ్యక్తి "సీయోను రాజు" గా ప్రకటింపబడెను. ఆ పట్టణమునుండి లూథరన్ మరియు రోమన్ క్యాథలిక్ ప్రజలు వెలివేయబడిరి!

మున్‌స్టర్ నగరములో ప్రజాజీవనము పవిత్రముగా మారుటకు బదులు నానాటికి అధిక పాపయుక్తముగా మారెను. మున్‌స్టర్ పరిసర ప్రాంతములో నివసించు యువరాజు మున్‌స్టర్ పట్టణమును లోబరచుకొని విపరీత మతవాదుల పాలనను అంతమొందించెను.

సంఘసంస్కరణ ఉద్యమమునకు అనబాప్టిస్ట్‌లు ముప్పుగా మారిరి. ఎందుకు? సంఘసంస్కరణ ఉద్యమ అనుచరులంటే తిరుగుబాటు మరియు అలజడి, అల్లరి సృష్టించు అనబాప్టిస్టులని ప్రజలలో నమ్మకముండెను– అందుకే అట్టివారందరు హింసింపబడవలెను.

మెనొనైట్‌లవంటి బాప్టిస్ట్‌లున్నారు. మెన్నోసైమన్స్ దాని వ్యవస్థాపకుడు. వీరునూ శిశుబాప్తిస్మమును తిరస్కరింతురు, వీరు ఒట్టు పెట్టుకొనరు, సైన్యములో చేరరు. కాని మున్‌స్టర్‌లో జరిగిన తిరుగుబాటును వారు ఏ మాత్రమును ఒప్పుకొనరు!

51. లూథర్ - అంతము వరకు శ్రమించెను

ప్రత్యేకించి జర్మనీలో క్రీ.శ. 1530-1545 లో సంఘసంస్కరణ ఉద్యమము క్రమేపి వృద్ధియాయెను. లూథర్ కష్టింపగా, తన విశ్వసనీయమైన స్నేహితులు మరియు సహాయకుల ద్వారా పోషింపబడెను. పరిచారకులుగా కాబోవు విద్యార్థులకు ఎన్నో సంగతులు బోధించి నేర్పవలసివచ్చెను. విద్యార్థులే గాక సామాన్య ప్రజలు కూడ బైబిల్ సందేశము నెరుగక యుండిరి. ఒక సిద్ధాంతము విషయములో లూథర్ అవగాహన సరిగాలేదు. ఆయన తప్పుడు భావన కలిగియుండెను. ప్రభు సంస్కార సమయములో ద్రాక్షారసము మరియు రొట్టె యేసు శరీరము మరియు రక్తముగా మారునను రోమన్ క్యాథలిక్ సంఘము బోధను లూథర్ నమ్మలేదు. (ఈ సిద్ధాంతమును ట్రాన్స్‌సబ్‌స్టాన్సియేషన్ అని అందురు. దీనిని 29 వ అధ్యాయములో చూడగలము). క్రీస్తు శరీర స్వభావము ప్రకారము అంతట ఉండును. అలాగే ద్రాక్షారసము మరియు రొట్టెలో ఉండునని లూథర్ నమ్మెను. నాకై చిందింపబడిన రక్తము, అప్పగింపబడిన శరీరము, ప్రభురాత్రి భోజన సమయములో నాకై క్రుమ్మరింపబడి, అప్పగింపబడునని లూథర్ చెప్పెను. మనము ఈ సిద్ధాంతమును కాన్‌సబ్‌స్టాన్సియేషన్ అని అందుము. ఈ సిద్ధాంతము సంఘసంస్కరణ ఉద్యమకారులలో విబేదము తెచ్చెను. అది అనైక్యతకు దారితీసెను. ఇది చాలా విచారకరము. మనము ఈ అంశమును గూర్చి వచ్చే అధ్యాయములో ఎక్కువగా చదివెదము.

క్రీ.శ. 1525లో లూథర్ వివాహమాడెను. రోమన్ క్యాథలిక్ సంఘము మత గురువులు సన్యాసులుగా ఉండవలెనని బోధించును. లూథర్ దానిని వ్యతిరేకించి దానికి విరోధముగా పోరాడెను. ఇప్పుడు తను వివాహమాడి రోమన్ క్యాథలిక్ సంఘమునకు తిరిగి వెళ్ళలేనంత దూరమాయెను. ఆయన స్థితి ఏమిటనునది అటు మిత్రులు, శత్రువులు మరియు ఇరువురు ఖచ్చితముగా గ్రహించిరి.

క్యాథరిన్ వాన్ బోరను లూథర్ వివాహమాడెను. క్యాథరిన్ పది సంవత్సరముల వయసులో ఉన్నప్పుడు కన్యకల మఠములో చేర్చబడెను. తన జీవితకాలమంతయూ మఠకన్యకగా మఠములోనే ఉండవలసియుండెను. కాని.... మనుష్యుల తలంపులు కలిగియున్ననూ వాటన్నింటిపై దేవుడు సర్వాధికారము కలిగియున్నాడు. మఠకన్యకలు వారి మఠములలో లూథర్ గురించి వినిరి. వారు ఆయన కరపత్రికలు కొన్ని చదివిరి. ప్రభువు క్యాథరిన్ మరియు ఇతర సన్యాస స్త్రీల కళ్ళు తెరువగా రోమన్ క్యాథలిక్ సంఘము మరియు మఠములోని తప్పులను గ్రహించిరి.

తత్ఫలితముగా క్రీ.శ.1523లో క్యాథరిన్ మరియు పదకొండు మంది ఇతర సన్యాస స్త్రీలు మఠమును వదలి బయటకు వచ్చిరి. వారందరు విటన్‌బర్గ్‌నకు ప్రయాణమై వచ్చిరి. ఇక్కడ లూథర్ క్యాథరిన్‌ను కలుసుకొనెను. క్రీ.శ. 1525లో వారిరువురికి వివాహమయ్యెను.

ఆయన వివాహము చేసికొనినందున రోమన్ క్యాథలిక్ వారు లూథర్‌పై విమర్శలు చేసి ఆయనను అవమానపరచిరి. "వారిరువురికి పిల్లలు పుడితే... వారు దయ్యపు పిల్లలైయుందురు" అని హీనపరచిరి.

క్యాథరిన్ మరియు లూథర్ ఇరవై యేండ్లకంటే పైబడి వివాహజీవితమును అనుభవించిరి. జీవితంలో లూథర్‌కు ఎన్నో కష్టములు ఎదురవగా "క్యాథి" నుండి ఆయన సహాయము ఆదరణ పొందెను.

వారికి ఆరుగురు సంతానము. పదమూడు సంవత్సరముల వయస్సుగల అమ్మాయి చనిపోగా వారు చాలా బాధపడిరి. కాని పరలోకములో ఆయనతో వారి కుమార్తె ఉన్నదని నమ్మునట్లుగా, ప్రభువు వారికి సహాయము చేసెను. క్యాథరిన్ చాలా పనులలో నిమగ్నమై తన జీవితమును గడిపెను. తన పిల్లలను చక్కగా చూచుకొనుటయేగాక వారితో పాటు ఇంట్లో ఉండు అనాథలను మరియు విద్యార్థులను బాగుగా చూచుకొనెను. లూథర్ అన్నదమ్ములు మరియు అక్క చెల్లెళ్ళ పిల్లలు కూడ వారితోనే ఉండిరి! మఠము నుండి పారిపోయి వచ్చిన సన్యాసులు వీరి ఇంటిలో ఆశ్రయము తీసికొనేవారు. క్యాథరిన్ వ్యాధిగ్రస్తులను చక్కగా సంరక్షించి చూచుకొనెను. ఇవన్నియూగాక బ్రెడ్, బీర్ తయారు చేయుట, కోళ్ళు మరియు పందుల పెంపకము, కూరగాయల పెంపకము మున్నగునవి చేయుచుండెను. లూథర్ చాలా ధారాళముగా ఇచ్చేవాడు. గనుక క్యాథరిన్ రాత్రుల్లో లేచి చింతిస్తూ ఉండేది.



లూథర్ చాలా ప్రయాణములు చేసేవాడు. వేర్వేరు స్థలములలో బోధించుటకు ఆయన వెళ్ళుచుండెను. అయితే ఇప్పుడు ఆయన ఓ భిన్నమైన పని చేయబోతున్నాడు. రెండు జిల్లాలు పోట్లాడుచుండెను. వారిని సమాధాన పరచుటకై లూథర్ వెళ్ళుచుండగా క్యాథరిన్ చాలా దిగులు పడెను. లూథర్ చాలా పని చేయుచుండెను మరియు గత కొన్ని వారములుగా ఆయన అస్వస్థుడై యుండెను.

ఒక దినమంతా ప్రయాణము చేసి లూథర్ వెస్లిబెన్ చేరుకొని, ఆ రెండు జిల్లాలను సమాధానపరచెను. అక్కడ కూడ నాలుగు సార్లు బోధించెను కాని తన ప్రసంగము సాధారణ కాలవ్యవధికంటే తక్కువ ఉండెను. తక్కువ సమయములో బోధ ముగించెను.ఆరోగ్యము సరిగా లేనందున ఆయన నిద్రించెను శ్వాసతీసికొనుట ఆయనకు కష్టమయ్యెను. వైద్యుడువచ్చెను కాని ఆయన ఏమియూ చేయలేక పోయెను. మరుసటి రాత్రి లూథర్ మరణిస్తాడని స్పష్టమాయెను. "ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియగు ఓ దేవా నీ ప్రశస్త కుమారుని నాకు బయలుపరచినందుకు నా కృతజ్ఞతలు. నేను ఆయనను నమ్మితిని, నేను ఆయనను ప్రేమించి ఆయననే ప్రకటించితిని, "తండ్రీ నీ చేతులలోనికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" అని చెప్పుట, మూడుసార్లు ప్రార్థించుట ఆయన మిత్రులు వినిరి. చివరి నిట్టూర్పు విడిచి ఆయన మరణించెను.

గనుక లూథర్ తన జీవిత పోరాటముల ముగింపునకు వచ్చెను. కృపద్వారా విశ్వాస పోరాటము తన రాజు పక్షముగా పోరాడెను. "లూథర్ విశిష్టమైన దేవుని సేవకుడు" అని కాల్విన్ చెప్పెను. లూథర్ శవము విట్టెన్‌బర్గ్‌నకు తీసికొనిపోబడెను. ఆ మార్గమధ్యమున ఆయా గ్రామములు, పట్టణములగుండా వెళ్ళుచుండగా అనేక ఊరేగింపులు ప్రదర్శనలు జరిగెను. ఆయా సంఘములలో తుది వీడ్కోలుగా గుడిగంటలు మ్రోగెను. క్యాజల్ చర్చ్‌లో ఆయన తరచుగా నుంచొని సువార్త బోధించేవాడు. ఆ వేదిక (పుల్‌పిట్) ప్రక్కనే ఆయన సమాధిచేయబడెను. గొప్ప సంఘసంస్కరణకర్త సర్వశక్తిగల దేవునియెదుట తగ్గించుకొనెను. . ఈ గొప్ప సంఘసంస్కరణ కర్త ఎట్టకేలకు పరలోక గృహము చేరెను.

52. జ్వింగ్లి మరియు ఇతర సంఘసంస్కరణకర్తలు

ప్రభువు తన సంఘమునకు సంఘసంస్కరణ కర్తలైన మార్టిన్‌లూథర్‌నిచ్చుటయేగాక ఇతర సంఘసంస్కరణకర్తలను కూడ ఇచ్చెను.

ఇప్పుడు మనము వెనక్కి వెళ్ళి స్విట్జర్లాండ్‌లోని పరిస్థితిని గమనిద్దాం. అక్కడ కూడ చక్కటి ప్రసిద్ధములు నెలకొనుచున్నవి.

ఉల్రిక్ జ్వింగ్లి స్విట్జర్లాండ్‌లో నివసించెను. ఆయన లూథర్ సమకాలికుడు. లూథర్‌వలె జ్వింగ్లికూడ క్షమాపణ పత్రముల అమ్మకమును వ్యతిరేకించెను. స్విట్జర్లాండ్‌లో క్షమాపణ పత్రముల అమ్మకము దారుడైన శామ్సన్ సిగ్గులేక అమ్ముచుండెను. జురిక్‌లో పరిచారకుడైన జ్వింగ్లి ఆ పట్టణపు తలుపులు మూయించి శామ్సన్ ప్రవేశింపకుండా ఆపివేసెను. జ్వింగ్లి మునుపు రోమన్ క్యాథలిక్ మత గురువైయుండి జాగ్రత్తగా పరిశుద్ధగ్రంథమును పఠించుట ద్వారా మరియు లూథర్ రచనలు చదువుట ద్వారా రోమన్ క్యాథలిక్ మతమందలి దోషములు చూడగలిగెను.

జురిక్‌లో రోమన్ క్యాథలిక్ మరియు ప్రొటెస్టెంట్‌ల మధ్య రెండు పెద్ద మత చర్చలు జరిగెను. ఈ చర్చలలో తన శత్రువర్గమైన రోమన్ క్యాథలిక్‌లను పూర్తిగా ఓడించెను. తత్ఫలితముగా సంఘములలో బలిపూజ (మాస్) జరుపుట ప్రతిమలను వాడుట మానివేయవలెనని జురిక్ నగర సమావేశము నిర్ణయించెను. ఇక అప్పటినుండి బోధకులు సువార్తను మాత్రమే బోధింప ఆజ్ఞయాయెను. అదియుగాక బోధకు ప్రజలు మాట్లాడు అనుదిన భాషలోనే బోధింపవలెను. ప్రభురాత్రి భోజన సమయములో పాల్గొను ప్రతియొక్కరికి రొట్టె మరియు ద్రాక్షారసము కూడ ఇవ్వవలెను. సన్యాస ఆశ్రమములు పాఠశాలలు లేదా వైద్యశాలలుగా మార్చబడెను. పేదలందరిని చక్కగా చూచుకొనులాగున జింగ్లి జాగ్రత్తపడెను. బ్రహ్మచర్య నియమమును ప్రక్కనబెట్టి ఆయన వివాహము చేసికొనెను. అనేక మత గురువులు ఆయన మాదిరిని అనుసరించిరి. స్విట్జర్లాండ్‌లోని అనేక నగరములు సంఘసంస్కరణ ఉద్యమ బాట నడిచెను. కాని కొన్ని ఇతర నగరములు అందులో చేరలేదు. ఇప్పుడు దేశము రెండుగా విభజింపబడెను. ఇరువర్గములు వారి సొంత సైన్యములనేర్పరచుకొనగా పరిస్థితి తీవ్రముగా మారెను. ప్రజాయుద్ధమునకు దారితీయు పరిస్థితులేర్పడెను. జర్మన్ ప్రొటెస్టెంట్‌లైన లూథర్ అనుచరులతో జ్వింగ్లి స్నేహము చేసెను. రోమన్ క్యాథలిక్ సంఘదోషము నెదిరించుటకు, ఒకరినొకరు బలపరచుకొనుటకు ఇట్టి స్నేహము సహాయకరముగా నుండును. కాని, స్నేహముకంటే ముందు రెండు పార్టీల మధ్యన ఒప్పందము కుదరాలి. క్రీ.శ. 1529లో మార్‌బర్గ్ అను చిన్న పట్టణములో లూథర్, జ్వింగ్లి మరియు ఇతర స్నేహితులు కొందరు కూడుకొనిరి. వారు కలుసుకొని విశ్వాసపు సంగతులపై వారి అభిప్రాయములను చర్చించిరి. అన్నింటి విషయములో అందరికి ఏకాభిప్రాయము కుదిరెను కాని ఒక్క విషయము మాత్రము అలాగే ఉండిపోయెను.

మనకిదివరకే తెలిసిన విధముగా లూథర్ కాన్‌సబ్‌స్టాన్సియేషన్ సిద్ధాంతమును నమ్మును. ఆయన ప్రభురాత్రి భోజనమును స్థాపించినపుడు "ఇది నా శరీరము" అని ప్రభువు స్వయాన చెప్పలేదా? ఎర్రగా మండు ఇనుపరాడ్‌లో మంట ఉన్నట్లు రొట్టె ద్రాక్షారసములో ఆయన శరీరము మరియు రక్తము కలవు అని లూథర్ అభిప్రాయము. ఇది నా శరీరము అంటే రొట్టె మరియు ద్రాక్షారసము సూచనలని అర్థము. పాపప్రాయశ్చిత్తమునకై క్రీస్తు తన శరీరము రక్తమునర్పించెననుటకు రొట్టె మరియు ద్రాక్షారసము సూచన ప్రాయముగా కలవని జ్వింగ్లి చెప్పెను.

ఇప్పుడు పరిస్థితులు చాలా కఠినముగా మారెను. లూథర్ ఆ విషయములో అస్సలు ఒప్పుకొనుట లేదు "ఇది నా శరీరము" అను పదములను లూథర్ ప్రభురాత్రి భోజనము ఆచరించు బల్లపై వ్రాయించెను. "విట్టెన్‌బర్గ్ వాసులతో తప్ప ప్రపంచములో నేనెవరితోను కలిసి ఐక్యముగా ఉండలేను" అంటూ జ్వింగ్లి లూథర్‌వైపు తన కుడి హస్తమును చాపెను. కాని సహవాసమును వ్యక్తము చేయునట్లుగా లూథర్ తన కుడి హస్తమును చాపక "నీ భావము వేరు మా భావము వేరు" అని అనెను. ఇది వినిన జ్వింగ్లి కళ్ళలో కన్నీరు ఉబికెను. లూథరన్ ప్రొటెస్టెంట్‌లు తనను విడిచిపెట్టిరని జ్వింగ్లి భావించెను. వారు జ్వింగ్లిని అబద్ధబోధకుడిగా ఎంచిరి! జ్వింగ్లి



విషయములో లూథర్ ప్రవర్తన చాలా అవమానకరముగానుండెను. తరువాత ఇతర సంఘసంస్కర్తలు, విశేషించి కాల్విన్ - లూథర్ ఈ విషయమై తప్పు చేసెనని బైబిల్ ద్వారా నిరూపించెను.

రెండు సంవత్సరముల పిమ్మట, జ్వింగ్లి ఒక చాప్లిన్‌గా పనిచేయుచూ స్విస్ జిల్లాలనుండి సమకూర్చబడిన రోమన్‌క్యాథలిక్ సైన్యములతో జరిగిన యుద్ధములో పాల్గొనెను. జ్వింగ్లి మరణించే సైనికుని ప్రక్కన మోకాళ్ళునగా, ఒకడు వచ్చి తన తలపై రాతితో కొట్టెను. ఆయన స్పృహ తప్పి నేలకొరిగెను. చాలా గాయపడినా, కాసేపటి తర్వాత ఒక చెట్టుక్రిందకు తనను తాను ఈడ్చుకొనిపోయెను. శత్రువులు అక్కడ ఆయనను కనుగొనిరి. మరియు మాతకు ప్రార్థనచేయమనగా జ్వింగ్లి తల ఊపెను. "శపింపబడిన ఓ దుర్బోధకుడా నీకు చావు తప్పదు" అని కత్తితో పొడిచి వారు జ్వింగ్లి జీవితమును అంతమొందించిరి.

జ్వింగ్లి ప్రజలకు పరిశుద్ధలేఖనములను అందించెను. ఆరు సంవత్సరముల కాలవ్యవధిలో, ఆయన క్రొత్త నిబంధన యందంతటనుండి బోధించెను! తత్ఫలితముగా రోమన్ క్యాథలిక్ సంఘదోషములను అనేకులు గ్రహించగలిగిరి.

జురిక్‌లో, జ్వింగ్లి స్థానములో బుల్లింగర్ వచ్చెను. జ్వింగ్లి రోమన్ క్యాథలిక్ సంఘముతో వివాదము కలిగి యున్నపుడెల్లా పండితుడైన బుల్లింగర్ సహాయపడెను. బుల్లింగర్ కూడ అలయక దేవుని వాక్యమును బోధించెను.

ప్రసిద్ధిగాంచిన మరొక సంఘసంస్కరణ ఉద్యమకారుడు మార్టిన్ బూసర్ తన అనుచరుడాయెను. ఇరవైఐదు సంవత్సరములకంటే పైబడి స్ట్రాస్‌బర్గ్‌లో సంఘసంస్కరణను రగిలించుటకై బూసర్ చాలా చేసెను. పరిచర్య నిమిత్తమై విద్యార్థులు అధ్యయనము చేయుటకై ఆయన ఒక యూనివర్సిటి స్థాపించెను. జ్వింగ్లిని బలపరచు వ్యక్తులలో ఒకనిగా నుంటూ మార్‌బర్గ్‌నందు జరిగిన మత చర్చలో బూసర్ పాల్గొనెను.

53. జాన్ కాల్విన్

క్రీ.శ.1509 చిన్ని ఫ్రెంచ్ టౌన్ అయిన నోయన్‌లో జాన్ కాల్విన్ జన్మించెను. ఆయన తల్లిదండ్రులు విశిష్టమైనవారు మరియు ఆయన తండ్రి నోటరీగా పనిచేసే వాడు. యౌవనస్థుడైన జాన్ చక్కగా పెంచబడెను. ధనికులు మరియు ముఖ్యమైన ప్రజలమధ్యన ఎలా ప్రవర్తించాలో ఆయనకు నేర్పింపబడెను. చిన్న పిల్లవాడుగా ఉన్నపుడు నేర్చుకొన్న విషయములు తన జీవితములో చక్రవర్తులను, యువరాజులను ఎదుర్కొన్నపుడు సహాయపడెను.

ప్రారంభములోనే వారి కుమారుడైన జాన్ చాలా తెలివైనవాడని మరియు ఎంతో అమోఘమైన జ్ఞాపక శక్తి గలవాడని అతని తల్లిదండ్రులు గుర్తించిరి. ఆయన పద్నాలుగేండ్ల వయసు గలవాడైనా ప్యారిస్‌లోని గ్రామర్ స్కూల్‌కు వెళ్ళెను. అక్కడ ఆయన హీబ్రూ మరియు గ్రీకు భాషలను నేర్చుకొనెను. ఈ భాషలలోనే బైబిల్ ప్రధానముగా వ్రాయబడెను. ఆయన లాటిన్ భాష కూడా నేర్చుకొనెను. ఈ భాషను సంఘపితరులు (చర్చ్‌ఫాదర్స్) వాడిరి, మరియు పరిశోధనా, విద్యాభ్యాసములలో కూడా దీనిని వాడిరి. యౌవనుడైన జాన్ తనంతట తాను బైబిల్ చదవటం ప్రారంభించెను. బైబిల్‌తో పాటు అగస్టీన్ రచనలను కూడా చదివి ఆనందింప ప్రారంభించెను. కొద్ది సంవత్సరముల పిమ్మట ఆయన విశ్వ విద్యాలయమునకు వెళ్ళెను, అక్కడ ఆయన చాలా కష్టపడి చదువగా తన ఆరోగ్యము క్షీణింపనారంభించెను.

ప్యారిస్ నగరములో ఫ్రాన్స్ యందంతట పట్టణములలోనూ గ్రామములలోనూ బైబిల్ పఠనము నిమిత్తమై గుంపులుగా కూడుకొనేవారు. ఈ గుంపులలో వారి స్వంతభాషలలో క్రొత్త నిబంధనను చదివేవారు. (క్రొత్త నిబంధన అదివరకే ఫ్రెంచ్ భాషలోనికి అనువదింపబడెను.) సాధ్యమైనంత త్వరగా ఆ లేఖన పఠనమును ఆపివేయాలని పోప్ తలంచెను. లేనిచో జర్మన్‌లో సంఘ సంస్కరణ ఉద్యమము ప్రారంభమైనట్లు ఫ్రాన్స్‌లో కూడా ప్రారంభమగునని భయపడెను. వెంటనే సైనికులు ప్యారిస్‌లో ప్రవేశించి 'దుర్బోధకుల' నిమిత్తమై వెదక నారంభించిరి. (బైబిల్ చదువువారిని ఈ పేరుతో పిలిచి అపహాసించేవారు) ఎందుకంటే తమ దేశములో రోమన్ క్యాథలిక్ మతము మాత్రమే ఉండవలెనని ఫ్రెంచ్‌రాజు కోరుకొనెను. దుర్బోధకులు మత సంబంధమైన న్యాయస్థానము ద్వారా తీర్పు తీర్చబడుదురు (ఇంక్విజిషన్). జాన్ కాల్విన్ ఇలాంటి బైబిల్ పఠన గుంపులో చేరెను. వారి కూడికలలో ఎంతో సమర్థవంతముగా బైబిల్‌ను వివరించెను. ఆయన విద్యావంతుడు గనుక రోమన్ క్యాథలిక్ సంఘమందలి తప్పిదములను పసిగట్టెను. రక్షణ మార్గము బయలుపరచుమని కాల్విన్ ప్రార్థనలో దేవునితో పోరాడెను. ప్రభువు కాల్విన్ ప్రార్థన ఆలకించెను. కాల్విన్ హృదయములో దేవుని వాక్యపు వెలుగు ప్రకాశించెను. క్రీస్తునందలి ప్రాయశ్చిత్తము ద్వారా మాత్రమే పాపి రక్షింపబడును! కృప ద్వారా మాత్రమే పాపి రక్షింపబడును! దేవుని వాక్యమందు పరిశుద్ధ లేఖనములు దీనినే బోధించుచున్నవి. కాల్విన్ కూడా దీనినే బోధించును. "ఆకస్మిక మార్పుద్వారా దేవుడు నా హృదయమును లోబరచుకొని దానిని విధేయతగల దానినిగా చేసెను." అని జాన్ కాల్విన్ చెప్పెను. అప్పటినుండి దేవునికి విధేయుడైన సేవకునిగానుండ గోరెను. ఆ విధముగా తన మరణము వరకు అలాగే ఉండిపోయెను. అన్నిటికంటే ముఖ్యముగా ప్రజలకు దేవుని వాక్యమును గూర్చి వివరించి దాని అర్థమును చెప్పుటకు కాల్విన్ ఇష్టపడేవాడు.

నగరములో మొదటి హతసాక్షి నగరములో దహించివేయబడు సమయమది. ఆయన ఓ వైద్యుడు. వారి ప్రార్థనల ఫలితముగా మరియ గాక ప్రభువైన యేసు స్వస్థపరచునని ఆయన తన పేషంట్లకు చెప్పెను. ఈ వ్యాఖ్య తన ప్రాణమును బలిగొనెను. ఆయన గమనిస్తూ నుంచొనియుండగా, యౌవనుడైన కాల్విన్ తన పిడికిలి బిగించెను. ఆయన మిత్రులు ఆయనను పట్టుకొనిరి... లేనిచో వారి చట్టమును తన చేతిలోనికి తీసికొనియుండేవాడు. ప్యారిస్‌లోని విశ్వవిద్యాలయములో పండితుడైన ప్రొఫెసర్ కాప్ వైస్ చాన్స్‌లర్‌గా



పనిచేయుచుండెను. ఒక దినాన విశ్వవిద్యాలయములో ఉపన్యాసమిచ్చెను. ఆయన శ్రోతలలో ప్రొఫెసర్స్ క్యాథలిక్ మత గురువులు మరియు సన్యాసులునూ ఉండిరి. అకస్మాత్తుగా అంతయూ నిశబ్దమాయెను. ప్రొఫెసర్ చెప్పునదేమిటంటే.. క్రీస్తు కార్యము ద్వారా మాత్రమే పాపులు రక్షింపబడుదురు. ఇది దుర్బోధ అని రోమన్ క్యాథలిక్‌లు ఒకరితో ఒకరు చెప్పుకొనిరి. రోమన్ క్యాథలిక్ మతన్యాయస్థానము చర్యతీసికోనున్నందున కాల్ప్ పారిపోవలసి వచ్చెను. వారు కాల్విన్ వెంట కూడ పడిరి. కాల్ప్ ఇచ్చిన ఉపన్యాసము కాల్విన్ రచనలలోనిదేనని రోమన్ క్యాథలిక్‌లు కనుగొనిరి. కాల్విన్‌ను బంధించుటకై ఓ సాయంత్రమున సైనికులు క్యాల్విన్ ఇంటికి వెళ్ళిరి. వారు వచ్చి తలుపులు బాదుతుండగా క్యాల్విన్ మేడ గదిపైనుండెను. త్వరగా కొన్ని పేపర్లను కట్టగట్టుకొని బాల్కని గుండా ఇంటి వెనకనుండి పారిపోయి తన శత్రువులనుండి తప్పించుకొనెను. తెల్లవారు జాముననే ద్రాక్షాతోటలో పనిచేయువ్యక్తివలె వస్త్రము ధరించుకుని నగరమునుండి పారిపోయెను. ఇరవై నాలుగేండ్ల వయసుగల కాల్విన్ ఇప్పుడు తన స్వంత ఇల్లు లేక తప్పించుకుని తిరుగువానిగా మారెను.

దక్షిణమందు ఫ్రెంచ్‌లోని ఓ చిన్న పట్టణము చేరుకునేంతవరకు ఆయన ముందుకే కొనసాగి ప్రయాణించెను. అది తన స్నేహితుని నివాస స్థలము. తన స్నేహితుడైన డుట్విల్లెట్ ఆ పట్టణమునకు మత గురువుగానుండెను. ఆయన కూడా బైబిల్ చదివి సంఘమందలి అనేక తప్పిదములను గ్రహించెను. కాల్విన్‌తో మాట్లాడుటకు ఆయన చాలా సంతోషించెను. తన హృదయమందు ఆయన ఇకను రోమన్ క్యాథలిక్‌గా లేడు. ప్రతిరోజు కాల్విన్ ప్రసంగములను వ్రాయగా వాటిని ఆ పట్టణ ప్రజలకు చదివి వినిపించేవాడు. ప్రతిదినము బైబిల్‌ను ఉపయోగించి పట్టణ ప్రజలకు దేవుని గూర్చి బోధించేవాడు. ఆయన బోధవినుటకు సమీప గ్రామములు మరియు పట్టణములనుండి అనేకులు వచ్చేవారు.

దేవుని వాక్యము విత్తబడెను. అది ఫలముకాచేలా దేవుడే చూచుకొనును.

54. పలాయనుడైన కాల్విన్

కాల్విన్ కష్టపడేవాడు. అంత ఎక్కువగా తినేవాడు నిద్రించేవాడు కాదు. ఆయన లెక్చరర్‌గా ఉపన్యాసాలివ్వటము మాత్రమే గాక రాత్రింబగళ్ళు ఓ గ్రంథమును వ్రాస్తుండేవాడు. ఈ గ్రంథములో అసలు క్రైస్తవ్యము అంటే ఏమిటో వివరించెను. ప్రజలకు బోధ అవసరము. ప్రజలకు క్రైస్తవ సిద్ధాంతమును గూర్చి చాలా తక్కువ అవగాహన ఉన్నదని ఆయన గ్రహించెను. అందుకే ఆయన ఈ గ్రంథమునకు క్రైస్తవ మతబోధ అని పేరుపెట్టెను. దానికి ఇన్‌స్టిట్యూట్స్ అను అసాధారణ పేరును కలదు.

ఈ గ్రంథమందు నిజమతమును గూర్చిన ప్రతివిషయమును కూడా ఆయన వ్రాసెను. బైబిల్‌లో ప్రత్యక్షపరచబడిన విధముగా ఆయన దేవుని గూర్చి వ్రాసెను. అద్భుతమైన సృష్టి కార్యమును గూర్చి మరియు మానవుని ఘోర పతనమును గూర్చి వ్రాసెను. ప్రభువైన యేసు క్రీస్తు మరియు ఆయన కార్యమును గూర్చి వ్రాసెను. పాపుల హృదయములలో పరిశుద్ధాత్ముడు జరిగించు, తిరిగి జన్మించుట, విశ్వాసము, పశ్చాత్తాపడుట అను కార్యములను గూర్చి వ్రాసెను. ఆయన ధర్మశాస్త్రము, ప్రార్థన, సంఘమునకివ్వబడిన ఆజ్ఞలను గూర్చి వ్రాసెను. వాస్తవమునకు బైబిల్‌లో కనబడు ఈ సత్యములను అనగా క్రైస్తవ బోధలోని ఆయా సంగతులను గూర్చి వ్రాసెను. కాల్విన్ క్రైస్తవ విశ్వాసమును సమర్థించు సమర్థ వాదకుడు. ఆయన గ్రంథములో రోమన్ క్యాథలిక్ సంఘముయొక్క తప్పిదములను తెలిపెను. ప్రజలింకెంత మాత్రమును మోసగింపబడకుండ వారికి ఈ సంగతులు అవసరము. బైబిల్‌లో వ్రాయబడిన సంగతులనే వారు నమ్మవలెను.

ఇక్కడ ఈ చిన్ని పట్టణములో ఈ ప్రాముఖ్య గ్రంథమును ఆయన వ్రాయనారంభించెను. తరువాత ఆయన మరొక స్థలమునకు వెళ్ళినప్పుడు కూడా ఈ గ్రంథమును వ్రాయుట కొనసాగించెను. ఆగ్రంథము మూడు సంపుటములుగా వ్రాయబడెను. కాల్విన్ దానిని లాటిన్ భాషలో వ్రాసి ఫ్రెంచ్ భాషలోనికి దానిని అనువదించెను. ఇట్టి ముఖ్య గ్రంథమును వ్రాయుటకు కాల్విన్‌కు జ్ఞానమిచ్చినవాడు ప్రభువే. మనము ఆ గ్రంథమును చదివినట్లైతే, కాల్విన్ దేవునికి మహిమనిచ్చుటకు ఎంత ఆశగలిగియుండెనో మనము గ్రహింతుము. ప్రభువగు దేవుని పవిత్రత మరియు ఆయన వాక్య పవిత్రత పట్ల కాల్విన్ ఎంత గౌరవము కలిగియుండెనో ఆ గ్రంథమందు మనము గమనింపవచ్చును. సంఘ సంస్కరణోద్యమ వెలుగు తేజోవంతముగా బలముగా ప్రకాశించుచున్నది! కాల్విన్ గ్రంథమును చదివిన వేలమందికి అది దీవెనకరముగానుండెను. ఈ ప్రజలు రోమ్ యొక్క అబద్దపు బోధను విడిచి, తన వాక్యమందు బయలుపరచబడిన విధముగా ప్రభువు భయమును గూర్చి నేర్చుకొనిరి.

నేటివరకునూ కాల్విన్ యొక్క గ్రంథము ఎక్కువగా చదువబడుచున్నది. రిఫార్మ్డ్ డాగ్మాటిక్ థియాలజీలో కాల్విన్ గ్రంథము, సరియైన గ్రంథముగా ఎంచబడెను గనుక విద్యార్థులు మరియు బోధకులు దానిని చదువుతున్నారు. ("డాగ్మాటిక్"=క్రైస్తవ బోధకు సంబంధించినది). మార్టిన్ లూథర్ ఇన్‌స్టిట్యూట్ అను గ్రంథమును చదివినపుడు "ఈయన (కాల్విన్) ఓ మహోత్తరబుద్ధిగలవాడు" అని చెప్పెను.

మత సంబంధ న్యాయస్థానము కాల్విన్ ఎక్కడ ఉన్నది కనుగొనెను. తగిన సమయములో కాల్విన్ మరియు తన స్నేహితుడు తప్పించుకొని పోయిరి. వారు కొంత కాలము గుహలలో దాగుకొనవలసి వచ్చెను. చాలా ప్రయాణము చేసి (ఆ సమయములో వారు ప్యారిస్‌కు కూడా వెళ్ళిరి) కాల్విన్ మరియు ఆయన స్నేహితుడు తుదకు బాస్లె అను నగరమునకు చేరుకొనిరి. వారు ప్రయాణిస్తూ మార్గమధ్యమున గ్రామములలో మరియు కోటలలోనూ బోధించిరి. కాల్విన్ స్విస్ నగరమైన బాస్లెలో ఉంటుండగా కొంతకాలము నెమ్మదిని శాంతిని అనుభవించెను. ఈ నగరములోనికి మత సంబంధ



న్యాయస్థానమువారు అనుమతింపబడనందున కాల్విన్ ఏవిధమైన ఆటంకము లేకుండా తన గ్రంథమైన 'ఇన్‌స్టిట్యూట్స్' పనిని కొనసాగించవచ్చును. ఏదిఏమైనా, కాల్విన్‌కు ఫెరారలోని డచ్ రాణినుండి ఆహ్వానము అందినందున కాల్విన్ ఉత్తర ఇటలీకి వెళ్ళెను. ఓ ఫ్రెంచ్ స్త్రీ బైబిల్ కథలను ఫ్రెంచ్ రాజుయొక్క వదినగారికి చెప్పగా ప్రభువు ఆవిడ నేత్రములను తెరువగా రోమన్ క్యాథలిక్ సంఘ దోషములను గ్రహించెను. అప్పుడు ఆమె ప్రొటెస్టెంట్ రాణిగామారెను. ఆమె కాల్విన్‌ను చూచుటకు చాలా ఆనందపడెను. ప్రొటెస్టెంట్ కాందీశీకులు ఆ రాజభవనములో చేరియుండగా అందు ఓ పెద్దగదిలో కాల్విన్ బోధించుటకు ఆవిడ అనుమతినిచ్చెను.

ఇటలీలో మత సంబంధ న్యాయస్థానమువారు కాల్విన్ కొరకై వెదుకుచున్నారని వినినపుడు ఆయన గుట్టము నెక్కి అక్కడనుండి వెళ్ళిపోయెను. ఆయన ఎట్టి ఆటంకము లేక ఇన్‌స్టిట్యూట్స్ అను గ్రంథ రచన కొనసాగించుటకై స్ట్రాస్‌బర్గ్ వెళ్ళుటకు ఆయన కోరుకొనెను. స్ట్రాస్‌బర్గ్ ప్రయాణము చాలా దూరము గనుక జెనీవాలో అనగా ఓ చక్కటి సరస్సుతీరాన ఉన్న స్విట్జర్‌లాండ్‌కు వచ్చి ఆ రాత్రి గడిపెను. మరుసటి రోజున తెల్లవారుజామున తన ప్రయాణమును కొనసాగింపదలచెను. ఈ ప్రణాళిక ప్రభువు చిత్తమా...?

జెనీవాలో కాల్విన్ ఆ రాత్రి గడుపుటకై ఓ సత్రము కొరకై వెదకెను. ఆ నగరములో ప్రొటెస్టెంట్‌లు నివసింతురు. జెనీవాలో మత సంబంధన్యాయస్థానమువారు హానిచేయరు గనుక వారు అక్కడికి పారిపోయివచ్చిరి. హానిచేయుటకు అక్కడ వారికి అనుమతిలేదు. జెనీవా క్రమేపి ఓ ప్రొటెసెంట్ నగరముగా తయారయ్యెను. కొద్ది సంవత్సరముల ముందే ఫారెల్ అను బోధకుడు అక్కడికి వచ్చియుండెను. ప్రభువు ఆయన పరిచర్యను ఎంతగా దీవించెనంటే అనేకులు రోమన్ క్యాథలిక్ సంఘమును విడిచి ప్రొటెస్టెంట్‌లుగా మారిరి. అయిననూ జెనీవాలో ఫారెల్‌ను బాధించే సంగతులు కొన్ని కొనసాగుతున్నవి. చాలా మంది జూదమాడుదురు, శపించుట, ఒట్టుపెట్టుకొనుట అక్కడ జరిగేది. కొన్ని సార్లు భర్తలు తమ భార్యలను విడిచి మరొక స్త్రీలతో వెళ్ళేవారు. ఫారెల్ ఇట్టి వాటికై పోరాడెను గాని తనకు ఒక్కనికే ఆపనంతయూ వీలుపడలేదు. సహాయకుని కొరకై ఆయన ప్రభువు నడిగెను.

55. జెనీవాలో కాల్విన్

కాల్విన్ జెనీవాలో ఆ రాత్రి గడుపుచున్నాడని ఫేరెల్ వినెను. ఫేరెల్ ఇన్‌స్టిట్యూట్స్ అను గ్రంథమును చదివి "జెనీవాలో కావలసిన వ్యక్తి కాల్విన్" అని భావించెను. ఆ సాయంత్రము కాల్విన్ ఉండు సత్రమునకు ఫేరెల్ వెళ్ళెను. కొద్ది నిమిషముల తర్వాత ఫేరెల్ కాల్విన్ గదిలో ప్రవేశించెను. తెరువబడిన కిటికీకొద్ద కాల్విన్ పుస్తకము చదువుతుండగా ఫేరెల్‌ను చూచి ఆశ్చర్యపోయెను. ఫేరెల్ వెంటనే విషయానికొచ్చి "మీరు రేపు వెళ్ళనైయున్నారా"? నేను అలా జరుగనివ్వను! ఇక్కడ జెనీవాలో చేయుటకు చాలాపనియున్నది. అనెను.

"నాకు ఎటువంటి ఆటంకము లేక కొనసాగి వ్రాయవలెను గనుక నేను రేపు స్ట్రాస్‌బర్గ్ వెళ్ళనైయున్నాను నేను ప్రారంభించుటకై ఆరాటపడుచున్నాను" అని కాల్విన్ బదులిచ్చెను. "కుదరదు, ఇక్కడ చాలా మంది పాప సంబంధ జీవితము జీవిస్తున్నారు వారికి దేవుని వాక్యమునకు అనుగుణముగా జీవించుట అంటే ఏమిటో నేర్పింపబడవలెను" అని ఫేరెల్ అనెను. కాని కాల్విన్ దానికి నిరాకరించెను. తాను తన రచనను కొనసాగించుట కై నెమ్మదిని ప్రశాంతతను కోరుకొనెను.

"నీకు నెమ్మది ప్రశాంతత కావాలా, దేవుని సేవకులకు మరణము మాత్రమే ప్రశాంతతనిచ్చును" అని భావోద్వేగముతో అరచెను. అయిననూ కాల్విన్ ఒప్పుకోలేదు. ఫేరెల్ ఇంకా తీవ్రముగా మాట్లాడుతూ "నన్నొక్కడినే ఇక్కడ పోరాటము చేయమంటావా" అనెను. ఆయన కాల్విన్‌ను తన భుజము తట్టి "నీ నెమ్మది మరియు ప్రశాంతతను దేవుడు శపించును, నేనీసంగతిని దేవుని నామమున చెప్పుచున్నాను" అనెను. "క్రీస్తుకంటే నిన్ను గూర్చి నీవు అధిక శ్రద్ధ కలిగియున్నావని" అని ఫేరెల్



అనెను. మాట్లాడునది ఫేరెలేనా, కాదు నేను ప్రభువు స్వరము వింటున్నానని కాల్విన్ భావించెను. కాల్విన్ కళ్ళలో కన్నీళ్ళు తిరుగగా, నేను జెనీవాలో ఉండిపోతాను. నేను ప్రభువునకు విధేయుడనవుతాను అనెను. కాల్విన్ జెనీవాలోని పెద్ద సంఘములో ఆదివారము నాడేగాక, వారము పొడుగున బోధించుచుండెను. ఆయన ప్రసంగములను వినుటకు అనేకులు వచ్చిరి. ఆయన బైబిల్‌ను చక్కగా వివరించును! ఇట్టి బోధ వీరికి చాలా అవసరము. వారు చాలాకాలము రోమన్ క్యాథలిక్‌లుగా ఉంటూ బైబిల్‌ను గూర్చి తప్పుడు అభిప్రాయములు కలిగియున్నారు. ఆ నగరంలో జీవించు వారి జీవిత శైలికి విరోధముగా ఫేరెల్ మరియు కాల్విన్ కలసి పోరాడిరి. జెనీవా సభ వారి పనిని ప్రోత్సహించెను. ప్రజలకుపయోగపడు చట్టములు జారీ చేయబడెను. వాటిని ఉల్లంఘించినవారు శిక్షింపబడిరి, తమంతట తాము విషయములను నిర్ణయించుకొనువారు స్వతంత్రులు (లిబర్టిన్స్) అని పిలువబడిరి. చట్టములు చాలా కఠినముగానున్నందున ప్రజలు వాటిని తీవ్రముగా ఎదిరించిరి. ఈ చట్టములు దుర్వినియోగము చేయబడెను గనుక ఆ చట్టము విషయమై ఫేరెల్ మరియు కాల్విన్ బాధ్యులుగా ఎంచబడిరి. వారు బెదిరింపబడిరి. మధ్యరాత్రివరకునూ వీధులలో చాలా అల్లరి చెలరేగెను. ఫేరెల్ మరియు కాల్విన్‌లను అపహసిస్తూ పాటలు పాడెను మరియు వారిని భయపెడుతూ కరపత్రములు ముద్రింపబడెను.

మొదట జెనీవా సభ తీవ్రముగా స్పందించెను. అలజడి కలుగజేసినవారు చెఱసాలలో వేయబడిరి. కాని తరువాత సభ పట్టించుకోవటం తగ్గించెను, తిరుగుబాటుదారులు వారి అల్లరిని కొనసాగించిరి. "కొన్నిసార్లు జెనీవా నగర ప్రజలు ఆకలిగొన్న తోడేళ్ళవలెనుందురు" అని సత్రములో కాల్విన్‌తో ఫేరెల్ చెప్పిన సంగతులు ఇప్పుడు నిజమౌతున్నవి. దేవుని పనిని పాడుచేయుటకు సాతానుడు ప్రతిరోజు విషమ ప్రయత్నము చేస్తున్నట్లు కాల్విన్ మరియు ఫేరెల్ గ్రహించిరి.

పునరుత్థాన ఆదివారము ఉదయించెను. జెనీవా సభప్రకారము నేడు ప్రభురాత్రి భోజనము జరుపబడాలి. నగరములో చాలా లౌకికత్వము, అల్లరి ఉండెను గనుక అది ఆచరింపబడుటకు కాల్విన్ మరియు ఫేరెల్ సమ్మతింపలేదు. ప్రభు రాత్రి భోజనము పవిత్రమైనది గనుక అది అపవిత్ర వాతావరణము మధ్యన ఆచరింపబడకూడదు. శనివారము రాత్రి కాల్విన్ శత్రువులు ఆయన ఇంటికి వెళ్ళి ఆయనను బెదిరించిరి. మూసివున్న కిటికీలపై రాళ్ళు విసిరిరి. "ఈ మోసగాణ్ని నదిలో పారవేయుడి" అని వారు కేకలు వేసిరి. పిస్టల్ చప్పుళ్ళు కూడా వినబడెను. తత్ఫలితముగా కాల్విన్ రాత్రంతయూ నిద్రలేకయుండెను. మరుసటి ఉదయము ప్రభువునందు బలవంతుడై యుంటూనే, శారీరకముగా అలసి పాలిపోయిన కళ్ళతోనే వేదికపై బోధించుటకు వెళ్ళెను. ప్రభురాత్రి భోజనము ఎందుకు ఆచరింపబడకూడదో వివరించినప్పుడు ఎంతో నిశ్శబ్దము నెలకొనెను. ఆయన కఠిన పలుకులు ప్రజలను చాలా ప్రభావితము చేసెను. సంఘములో ఆయన శత్రువులు సహితము మౌనులైరి.

ఏది ఏమైనా, అదే మధ్యాహ్నము మరొక సంఘములో బోధించుటకై వెళ్ళెను, ఆయన స్నేహితులు దాడిచేయువారినుండి కాపాడవలసివచ్చెను. జరిగిన దానిని జనీవా సభ వినినపుడు, ఆ అల్లరి విషయమై కాల్విన్ మరియు ఫేరెల్‌ను నిందించిరి. మూడు రోజులలోగా వారు నగరమును విడిచివెళ్ళాలని సభ ఆజ్ఞాపించెను. వారు నేరస్థులవలె వారిని దేశ బహిష్కరణ చేసిరి. వారితో పాటు మరొక సేవకుడు కలిసి ముగ్గురు బాస్లె నగరమునకు నడిచి వెళ్ళిరి. నాలుగు మాసముల పిమ్మట కాల్విన్ స్ట్రాస్‌బర్గ్ వెళ్ళెను. వారి ఇండ్లనుండి పారిపోయివచ్చిన వారు ఈ నగరములో ఓ ప్రొటెస్టెంట్ సమాజము పోగై కూడుకునేవారు. ఈ కాందీశీకులకు సహాయము చేయుటలో, స్ట్రాస్‌బర్గ్ సంఘసంస్కరణ ఉద్యమకారుడైన బూసర్‌కు సహాయకుడవసరమాయెను. మొదట బూసర్‌కు సహాయము చేయుటకు కాల్విన్‌కు ఇష్టము లేకుండెను కాని బూసర్ కాల్విన్‌ను "స్ట్రాస్‌బర్గ్‌కు రమ్ము! ఇక్కడ చేయవలసిన పని చాలా ఉన్నది. వేరే మార్గమున వెళ్ళిన యోనా వలె ఉండవద్దు! కాని తరువాత ప్రభువాయనను నీనెవెకు తిరిగి పంపెను!

56. కాల్విన్ తిరిగి జెనీవాకు వచ్చెను


కాల్విన్ స్ట్రాస్‌బర్గ్‌లో కష్టించి పనిచేసెను. ఆయన అనేక ప్రసంగములు చేసి విద్యార్థులను పరిచర్యకై తర్ఫీదు చేసెను మరియు బైబిల్ అర్థమును వివరించుటకై పుస్తకములను వ్రాసెను. సంఘ కూడికలలో ఆరాధనలలో పాడుకొనుటకై ఆయన కీర్తనలను వచనములోనికి మార్చెను. స్ట్రాస్‌బర్గ్‌లో కాల్విన్ ఇడెలెట్ వాన్ బురెన్‌ను వివాహమాడెను. ఆమె విధవరాలుగా నుండి ఇద్దరు పిల్లలను కలిగియుండెను. ఆమె నెదర్లాండ్స్‌నందు జన్మించెను. మతహింసను తప్పించుకొనుటకై వారిరువురు స్ట్రాస్‌బర్గ్‌నకు పారిపోయిరి. స్ట్రాస్‌బర్గ్‌లోనే తన భర్త చనిపోయెను. ఇడెలెట్ కాల్విన్‌కు చాలా సహాయకరముగానుండెను. ఆయన అనారోగ్యముతో నున్నపుడు ఆవిడ ఆయనను చక్కగా చూచుకొనెను. ఆయన తరచుగా వేదనలో ఉండేవాడు, ఆ వేదననుండి నివారణ కలుగజేయుటకు ఆవిడ ప్రయత్నించేది. ఆయన కృంగిన వేళలో ఆవిడ ఆయనకు ప్రభువును ఆయన బలమైన విశ్వసనీయమైన యజమానుని జ్ఞాపకము చేసేది. జెనీవా నుండి ఒక ఉత్తరము వచ్చెను. అది సుదీర్ఘ ఉత్తరమైయుండి ఓ ముఖ్యమైన కార్డినల్‌చే వ్రాయబడెను. ఆయన ఆ ఉత్తరమందు నగరము మరొక్కమారు రోమన్ క్యాథలిక్ నగరముగా మారునట్లుగా పురికొల్పెను. ఫారెల్ మరియు కాల్విన్ నగరమును పెడత్రోవపట్టించి జెనీవా ప్రజలను మోసగించిరని ఆ ఉత్తరములో ఆయన పేర్కొనెను. ఆ ఉత్తరమునకు ఎవరు జవాబీయగలరు? కాల్విన్ తప్పక వ్రాయగలుగును. కాని మూడేండ్ల క్రితము నగరమునుండి ఆయనను తరిమి వేసినందుకు వారు బాధ్యులు కారా? జరిగిన సంగతి ఎలా ఉన్నా వారు స్ట్రాస్‌బర్గ్‌కు వర్తమానికుని పంపిరి. వెంటనే కాల్విన్ కార్డినల్ ఉత్తరమునకు జవాబు వ్రాయదలచెను. తిరిగి జెనీవా రోమన్ క్యాథలిక్ నగరముగా మారితే అది విచారకరముగా నుండదా? జెనీవా నగరమునకు మరియు కార్డినల్‌కు వ్రాసిన ఉత్తరము సుధీర్ఘమైనది. బైబిల్‌ను సూచిస్తూ వాస్తవమునకు ప్రజలు రోమన్ క్యాథలిక్ సంఘముద్వారా మోసపోయిరని కాల్విన్ ఆ ఉత్తరమందు తెలిపెను. వ్రాయుటకు ఆరురోజులు పట్టిన ఆ ఉత్తరము ప్రొటెస్టెంట్ విశ్వాసమును ఋజువుపరచెను. అది చదివి కార్డినల్‌కు ఏమి చెప్పాలో అర్థముకాలేదు.

తిరిగి జెనీవాలో ఇబ్బందివచ్చెను. నగరములో అల్లరి చెలరేగెను. ఆ పరిస్థితి సహకరించుటకు చాలా కష్టమైనది అని జెనీవా సభ భావించెను. మత గురువులు కూడా నగర ప్రజలను నిమ్మళపరచలేకపోయిరి. మరొకసారి "కాల్విన్ దయచేసి మాకు సహాయము చేయుము" అని సందేశము పంపబడెను. మొదట కాల్విన్ నిరాకరించెను. జెనీవాలోని అనేక మంది స్నేహితుల నుండి మరియు ఫేరెల్ నుండి (ఆ సమయములో ఫేరెల్ మరొక పట్టణము నుండుండెను) అనేక ఉత్తరములు అందుకున్నాక కాల్విన్ తిరస్కరించలేకపోయెను. ఇది ప్రభువు చిత్తము...! 1541లో కాల్విన్ జెనీవాకు తిరిగి వచ్చి అక్కడ అరవై అయిదు సంవత్సరములకు పైబడి జీవించెను! మొట్టమొదట జెనీవా సభ సహాయముతో సంఘ జీవితమును నియంత్రించు నియమములను ప్రవేశపెట్టెను. సంఘములో సరియైన నియమనిబంధనలు చాలా అవసరము. తయారు చేయబడిన నియమములను ప్రజలు అనుసరించునట్లుగా పెద్దలు మరియు పరిచారకులు చూచుకొనవలెను. నియమములను గమనింపని వారిని హెచ్చరింపవలెను. ఈ విధానమును క్లరికల్ క్రమశిక్షణ అని పిలువబడెను. నియమములన్నియూ సమ్మతింపబడ్డాక, అవన్నియూ సంఘమందు చదువబడెను. ప్రజలు మేము వాటికి లోబడుదుమని వాగ్దానము చేసిరి. కాల్విన్ నగరమునకు తిరిగి వచ్చాక మొదట ప్రసంగములో అంతయూ చాలా నిశబ్దముగానుండెను. మూడు సంవత్సరములు ఆయన నగరమునుండి బహిష్కరింపబడ్డాక ఆయన ఏమనును? కాల్విన్ మూడేండ్ల క్రితము ఎక్కడైతే తన ప్రసంగము ఆపివేసేవో అక్కడనుండి కొనసాగించెను. ఈ నగరమునకు ఎన్నడు రాలేదేమో అన్నవిధముగా ఆయన గత సమస్యలను ప్రస్తావించనే లేదు. వారి దుష్ ప్రవర్తనయంతటిని ఆయన క్షమించెను. వారి తప్పిదములకు అతీతముగా, క్రమేపి తన గొఱ్ఱెలను ప్రేమించే నిజమైన కాపరి కాల్విన్.

కాల్విన్ చాలా కష్టపడి పనిచేసెను. ఆయన


అనేక ప్రసంగములను బోధించిన యౌవనులకు మరియు పెద్దలకు సత్యోపదేశ తరగతులను నిర్వహించెను, ఆయన మత గురువులకు ఉపన్యాసములిచ్చెను, రోగులను దర్శించెను. సలహా కోరినవారికి అనేక ఉత్తరముల ద్వారా సలహాలు వ్రాసి పంపెను. ఐరోపాయదంతటినుండి రాజులు మరియు చక్రవర్తులు సహా ప్రశ్నలను సందేశములను పంపెడివారు. ఆయన ఇంకనూ పుస్తకములు వ్రాసి దాదాపు బైబిల్‌లోని పుస్తకము లన్నింటిపై వ్యాఖ్యానము వ్రాసెను. ఆయన ఎప్పుడు కూడాను తన రచనలను రాత్రి సమయమందు చేసెడివాడు. బైబిల్ వ్యాఖ్యానము నేటివరకును, ఇన్‌స్టిట్యూట్స్‌వలె వాడబడుచున్నది. ప్రొటస్టాంటిజమ్ తన బోధలలో ఎందుకు కాల్వినిస్టిక్ గానున్నదో మనము కారణమును గ్రహింపవచ్చును. (జర్మని, ఉత్తర ఐరోపా దేశములలో బోధలవిషయములో వారు లూథరన్‌లుగా మిగిలిపోయిరి.) కాల్విన్ దంపతులకు ఒక కుమారుడు పుట్టెనుగాని చిరుప్రాయమందే అతడు మరణించెను. ఆయన భార్య మరణించినప్పుడు కాల్విన్ చాలా విచారపడెను కాని ఓ ఆదరణకర సంగతి ఏదనగా ఐడెలెట్ ప్రభువుతోనున్నది. నగరములో పరిస్థితి గతములో ఉన్నంత దుర్భరముగా లేకపోయినా లిబర్టిన్స్ (స్వతంత్రవాదుల) విషయమై కాల్విన్ చాలా బాధపడెను. ఆయన ఎదురుగానే తనపేర్లు పెట్టి నిలిచేవారు. పిల్లలు ఆయనను కెయిన్ అని హేళన చేసెడివారు.

ఒక ఆదివారమునాడు కాల్విన్ ప్రభురాత్రి భోజనమును జరిపెను. కొందరు (లిబర్టిన్స్) స్వతంత్రవాదులు అందులో పాల్గొనదలచిరి. కాల్విన్‌కు వారి పాప సంబంధ జీవితమంతయూ తెలియును. రొట్టె మరియు ద్రాక్షారసముపై తన చేతులుంచి వారినుండి వాటిని కాపాడు ఉద్దేశ్యములో కళ్ళలో మంటలు సెగలు క్రక్కుతూ "మీరు నాచేతులు నరికి వేసినా సరే ఈ పవిత్ర భోజనము మీకందింపను" అని అరచెను. లిబర్టిన్స్ (స్వతంత్రవాదులు) బల్లను సమీపించుటకు సాహసించలేదు.



57. కాల్విన్ మరియు సర్వెటస్, కాల్విన్ మరణము

ఒక దినాన సర్వెటస్ అనే వ్యక్తి జెనీవాకు వెళ్ళెను. ఇరవై యేండ్ల క్రితం కాల్విన్ ఆయనను కలసియుండెను. సర్వెటస్ బోధ దోషపూరితమైనదని కాల్విన్ గ్రహించెను. యేసు దేవుని నిత్యకుమారుడు కాడు అని సర్వెటస్ చెప్పేవాడు. ఆయన త్రిత్వ సిద్ధాంతమును ఒప్పుకోలేదు. సర్వెటస్ దుర్బోధకుడైయుండి, తన రచనల ద్వారా ప్రజలను, ప్రొటెస్టంట్‌లను సహా పెడత్రోవ పట్టించే ప్రయత్నము చేసెను. జనీవాలో సంఘసంస్కరణోద్యమము ముప్పునకు లోనగుతున్నట్లు కాల్విన్ గ్రహించెను. దేవుని నామము దూషింపబడుచున్నందున కాల్విన్ ఈ విషయమై శ్రద్ధచూపెను. సర్వెటస్ న్యాయస్థానము ఎదుట హాజరు పరచబడినప్పుడు తన దోషమును ఒప్పుకొనుటకు నిరాకరించెను. ఆయన కాల్విన్‌ను అబద్ధికుడని మరియు నేరస్థుడని చెప్పెను. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి? జెనీవా సభ సమీప సేవకులను, ఫేరెల్‌ను ఈ విషయమై సలహా అడిగెను. సర్వెటస్ తన దేవదూషణాభరిత బోధలను వెనక్కి తీసికోనట్లైతే మరణ శిక్ష విధింపవలెనని అందరు సమ్మతించిరి. కాల్విన్ ఈ తీర్పును గూర్చి వినినప్పుడు చెఱసాలలో ఉన్న సర్వెటస్‌ను దర్శించెను తన పాపాత్మకమైన దోషములను ఒప్పుకొమని కాల్విన్ బ్రతిమాలెను కాని ఆయన అంగీకరింపలేదు. కాల్విన్ సర్వెటస్‌కు అధిక సహాయము చేయలేక ఆయన నిమిత్తమై ప్రార్థించెను. దుర్బోధకుడైన సర్వెటస్‌ను నగరమునకు వెలుపల కొండమీద కొయ్యమ్రానుపై వ్రేలాడ దీయబడి దహింపబడెను. జెనీవాలో సంఘసంస్కరణోద్యమము ఆగిపోకుండా ప్రభువు చూచుకొనెను. తరువాత సర్వెటస్ దహింపబడుటకు కాల్విన్‌నే కారణమని కాల్విన్ నిందింపబడెను. కాని ఇది వాస్తవముకాదు. వాస్తవానికి



సర్వటస్‌ను మరొక విధానములో శిక్షించుమని కాల్విన్ జెనీవా సభను కోరెను. కాని సభ దానికి ఒప్పుకొనలేదు.

జెనీవాలో అంతయూ సవ్యముగానుండెను. దాదాపు ప్రతిరోజు, కాండీశీకులు నగరమునకు వచ్చుచున్నందున క్రొత్త సంఘ భవనములు కట్టబడవలసివచ్చెను. జెనీవాలో ఉన్న కాండీశీకులు సంఘమునకు వెళ్ళుటకు అనుమతింపబడిరి. యౌవనస్థులు పరిచర్యకొరకై అధ్యయనం చేసి సిద్ధపడులాగున అకాడమి లేదా విశ్వవిద్యాలయము స్థాపింపబడెను. కాల్విన్ స్నేహితుడైన బేజ అకాడమికి రెక్టర్‌గా నియమింపబడెను. ఆయన పండితుడైన క్రైస్తవుడు.

కాల్విన్ మరియు ఇతర ప్రొఫెసర్ల ఆధ్వర్యములో అధ్యయనము చేయుటకు ప్రపంచ నలుమూలలనుండి విద్యార్థులు జెనీవాకు వస్తారు. వారు వారి చదువులను ముగించుకున్న తరువాత వారి సొంత ప్రాంతములలో దేవుని వాక్యం బోధించు సేవకులుగా వెళ్ళిరి. కాల్విన్ మరణ సమయములో పదిహేనువందల మంది విద్యార్థులు అకాడమిలో చదువుతుండేవారు. ప్రభువు తనరాజ్యమును వ్యాపింపజేయుటలో జెనీవా నగరము ప్రముఖ పాత్రవహించెను. కాల్విన్ తన ప్రసంగములను మరియు బోధను మానివేయవలసివచ్చెను. తనకు బలములేనందున కొనసాగించలేదు. తీవ్రమైన జ్వరము ఆయనను బలహీనపరచెను. ఆయన ఇంటి వద్దనే ఉండవలసివచ్చెను కాని తాను చేయగలిగినంతమట్టుకు తన రచనలను కొనసాగించెను. "నేను మరణించినప్పుడు మెలకువగా మరియు చురుగ్గా పనిచేయు సేవకునివలె ప్రభువు నన్ను చూడాలని" మరణించాలని" ఆయన ఆశపడెను.

ఆదివారమున ప్రభురాత్రి భోజనము ఆచరించుటకై ఆయన మిత్రులు ఆయనను మోసికొనిపోవలసివచ్చెను. పాస్టర్ బేజా ఆయనకు రొట్టె ద్రాక్షారసము అందించెను. వణకుతున్న స్వరముతో సంఘమంతటితో కలిసి "ప్రభువా నీ వాక్యము చొప్పున నీ దాసుని సమాధానముతో మరణింపనిమ్ము" అని పాడెను.

కొన్ని దినముల పిమ్మట జెనీవా సభలోని కొందరు ముఖ్య సభ్యులు కాల్విన్ ఇంటికి వచ్చిరి. వారు ఆయనకు వీడ్కోలు పలుకుటకు వచ్చిరి. ఆయన తన బలహీన హస్తములతో వారిని దీవించెను. ఇతర సేవకులు కూడా ఆయనను దర్శించిరి. ఇప్పుడు ఫేరెల్ కూడా ఎనభైయేండ్ల వయసుగలవాడాయెను. ఒక సాయంత్రమున, బేజా కాల్విన్ ప్రక్కకు పిలువబడెను. కాల్విన్ మరణిస్తున్నాడు. కాని ఆలస్యముగా వచ్చెను ఈ లోపు కాల్విన్ మరణించెను. ఈ నమ్మకమైన దేవుని సేవకుడు నిత్యత్వమందు తన రాజును స్తుతిస్తూ సమాధానముగా జీవించును. కాల్విన్ దేవుని యొద్దనుండుటకై వెళ్ళెనని జెనీవా సభ వ్రాసెను.

కాల్విన్ జీవితము మండుచున్న క్రొవ్వొత్తివలె ఉండెను. క్రొవ్వొత్తి చివరివరకు కూడా కాలి వెలుగునిచ్చును. కాల్విన్ వెలుగుచున్న క్రొవొత్తివలె తన దేహమందు అలసిపోయిననూ కాలుతూనే ఆయన ద్వారా దేవుని వాక్యము ప్రకాశించెను. కాల్విన్ మరణవార్త వినినప్పుడు జెనీవాలో, మరియు ఇతర స్థలములోనూ ప్రజలు ఎంతో విలపించిరి. ఆయన సమాధి చెంతన ఎటువంటి ఉపన్యాసములీయబడలేదు. ఆయన ఖచ్చితముగా ఎక్కడ సమాధి చేయబడెనో ఎవరికి తెలియకుండులాగున సమాధి అని గుర్తించులాగున ఆ సమాధిపై రాయిని ఉంచలేదు. ఇదంతయూ కాల్విన్ కోరికమేరకే జరిగింపబడెను. అలా కానిచో ఆయనకు అధిక మహిమా ప్రభావమును ఆరోపింతురేమోయని ఆయన భయపడెను. కాల్విన్ యేకైక కోరిక ఏమనగా తన దేవుని ఘనపరచి మహిమపరచుటయే. కాని ప్రభువు కాల్విన్ పేరుగాని ఆయన రచనలుగాని మరువబడకుండ చేసెను, నేటివరకునూ ప్రజలు ఆయన పుస్తకములను చదువుతున్నారు అవి వేల ప్రజలకు ప్రపంచవ్యాప్తంగా దీవెనకరముగానున్నవి. నేటికిని అది అలాగేయున్నది ఇది ప్రభువు కార్యము గనుక ఆపబడజాలదు.

58. ప్రతికూల - సంఘసంస్కరణ

మనము మునుపటి అధ్యాయములో చూచినట్లుగా సంఘసంస్కరణ ద్వారా రోమన్ క్యాథలిక్ సంఘము తీవ్రముగా ప్రభావితము చూపబడెను. అనేక దేశములలో లక్షలకొలది ప్రజలు ఆ సంఘమును విడిచి వెళ్ళిరి. తన సంఘము, తన ప్రజలు రోమ్‌యొక్క తప్పుడు సిద్ధాంతముల వలన అసత్యపు బోధలవలన శ్రమపడిరి. వారి క్రింద దాసత్వపు చీకటి సమయమును తన సంఘమునుండి విడిపించుచున్నాడు. సంఘనాయకులు ఈ పరిస్థితిని చూచి కలవరపడిరి. పరిస్థితులు తప్పక మారాలి... సిద్ధాంతమందు మార్పుఉండునా? అట్టి మార్పు తప్పక కావాలి! దానికి రోమ్ సమ్మతించునా?

ఇటలీలోని ట్రెంట్ అను పట్టణములో సంఘసమావేశము జరిగెను. ప్రతి విధమైన సంఘవిషయములు అక్కడే చర్చింపబడును. ప్రత్యేకించి జర్మనిలో సంఘసంస్కరణను తుడిచి వేయుట అసాధ్యము. సంఘసంస్కరణ వలన ఆరాజ్యమందంతట గలిబిలి, అనైక్యత చెలరేగెను. అందుచేత చక్రవర్తియైన చార్లెస్V ఈ సమావేశమును బలపరచెను. దేవుని వాక్యమను విత్తనము నాటబడి నానాటికి బలముగా పెరుగచుండెను. సంఘ సంస్కరణ అనునది దేవుని కార్యము దీనిని ఆయనే భద్రపరచి కాపాడుచున్నాడు. చక్రవర్తి సంఘసంస్కరణను ద్వేషించినా ఈ సభ ద్వారా రోమన్ క్యాథలిక్‌లకు ప్రొటెస్టెంట్‌లకు మధ్య సంధి కుదురునని ఆయన నిరీక్షించెను. ట్రెంట్ సమావేశము క్రీ.శ.1545 లో ప్రారంభమై క్రీ.శ.1563 వరకు కొనసాగెను. ఆ పద్దెనిమిది సంవత్సరములు వరుసగా కూడుకున్నారని కాదుగాని. కొన్ని సంవత్సరముల పాటు సభ సమావేశము కాలేదు.

ఈ సమావేశమునకు ప్రొటెస్టెంట్‌లు హాజరు కాలేదు. తీర్మానములన్నియూ పోప్‌చే ఆమోదింపబడవలెనని వారికి తెలియును. ఇదంత వ్యర్థమని వారికి తెలియును. ఎందుకంటే సంఘసంస్కరణ కార్యమును అణచివేయుటకై పోప్ నిశ్చయించుకొనియున్నాడని వారు గ్రహించిరి.

ఈ సమావేశము ద్వారా ప్రొటెస్టెంట్ మరియు క్యాథలిక్‌ల మధ్యన శాశ్వత ఎడబాటు కలిగెను. ఉచిత కృపా సిద్ధాంతము మరియు క్రీస్తుద్వారా మాత్రమే దేవునితో సమాధానపరచబడుట తిరస్కరింపబడెను. ఈ సిద్ధాంతము శాపగ్రస్తముగా ఎంచబడెను.(దీనికర్థము కఠినమైన సంఘసంబంధ శాపము వాడబడెను.) క్రియల ద్వారా రక్షణ సంపాదించుకొనవచ్చునను సిద్ధాంతము పాటింపబడెను).

పరిశుద్ధలేఖనములు మాత్రమే దివ్య అధికారము కలిగియున్నవని లూథర్ మరియు కాల్విన్ బోధించిరి. సంఘము బోధించునవియునూ అధికారమును కలిగియున్నవని సమావేశము మరొకసారి నిర్ణయించెను. ఈ సంఘసంబంధ ప్రకటనలు దివ్య అధికారమును కలిగియున్నవి. తరువాయి సంవత్సరములలో పోప్ చేయుసంఘసంబంధ ప్రకటనలు నిర్దోషమైనవని (తప్పులు లేనివని) రోమన్ క్యాథలిక్ సంఘము బోధించెను. ఇట్టి ప్రకటనలు "ఎక్స్ క్యాథిడ్ర మాట్లాడుట" అని పిలువబడెను. ఈ విధముగా సంఘ మరియు పోప్ అధికారము దేవుని వాక్యము కంటే ఘనముగా పరిగణింపబడెను. తత్ఫలితముగా, రోమన్ క్యాథలిక్ సంఘము మరియు సంఘసంస్కరణల మధ్యనున్న సంబంధము తెగిపోయెను.

రోమన్ క్యాథలిక్‌లు చదువకూడని పుస్తకముల చిట్టాను సమావేశము ఆమోదించెను. నిషేధ గ్రంథముల చిట్టా "ఇండెక్స్" అని పిలువబడెను. పర్గెటరి, చనిపోయిన భక్తులకు ప్రార్థించుట మరియు వారి శేషములను (వారి ఎముకలు, వెండ్రుకలు మొ॥) మ్రొక్కుట వీటి విషయములో ఎటువంటి సవరణలు చేయలేదు క్షమాపత్రముల అమ్మకము నిషేధింపబడెను.

సమావేశము చేసిన ప్రతిపాదనలపై చర్చలు అనుమతింపబడలేదు. ఈ ప్రతిపాదన శాశ్వతముగా చేయబడెను. అవి నేటి వరకునూ అమలులో ఉన్నవి! సమావేశ సమయములో రోమన్ క్యాథలిక్‌లు మరియు ప్రొటెస్టెంట్‌ల మధ్య ఎటువంటి సమాధానము లేకుండెను. గనుక ప్రొటెస్టెంట్‌లు వారి నమ్మకములను మార్చుకొనులాగున రోమ్ పత్తిడి విధానములు అనుసరించెను. (గత అధ్యాయములో దానిని గూర్చి మనము ఇంతకుముందే చదివితిమి) చాలా మంది ప్రొటెస్ట్‌ంట్‌లు ఫ్రాన్స్ మరియు జర్మని విడిచి వెళ్ళిరి.



సంఘసంస్కరణ ఉద్యమము పూర్తిగా నాశనమగువరకు రోమ్ ఈ హింసను ఆపలేదు. దుర్బోధకులందరు నిర్మూలింపబడవలెను. గనుక సంఘసంస్కరణ ఉద్యమమును నిలిపివేయుటకు సాధ్యమైనదంతయూ రోమ్ చేసెను. ఇట్టి వ్యతిరేకత "కౌంటర్ రిఫర్మేషన్" అని పిలువబడెను. కౌంటర్ అనగా వ్యతిరేకమైన, విరుద్ధమైన అని అర్థము.

మనము స్పెయిన్ మరియు ఇటలీ చూచినపుడు సంఘసంస్కరణ వ్యతిరేకత విజయవంతమైనదేమో అన్నట్లు తోచును. స్పెయిన్‌నందలి ప్రొటెస్టెంట్‌లు మతన్యాయస్థానము ద్వారా తరుమబడి దహింపబడిరి. స్పెయిన్‌లోని దుర్బోధకుల గుంపులన్నియూ, (ప్రొటెస్టెంట్‌లు) ఒక పెద్ద మంటలో కాల్చబడిరి. ఎంతఘోర సన్నివేశమది!

గనుక స్పెయిన్‌లోని సంఘసంస్కరణ ఉద్యమము హింసద్వారా అణచివేయబడెను. కాని సంఘసంస్కరణ కార్యము పూర్తిగా తుడిచిపెట్టబడలేదు. కొంతమంది ప్రొటెస్టెంట్‌లు అప్పట్లో అక్కడే మిగిలిపోయిరి. కొందరు నేటి వరకునూ ఉన్నారు.


ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్, దిగువ దేశములైన నెదర్లాండ్ తరువాత జర్మని మున్నగు దేశములలో మతయుద్ధములు ట్రెంట్ సమావేశముతో ప్రారంభమయ్యెను. జెసూట్స్ అను క్యాథిలిక్ సన్యాసుల గుంపు ద్వారా ప్రధానముగా హింస చెలరేగెను. వచ్చే అధ్యాయమునందు జెసూట్స్‌ను గూర్చి ఎక్కువగా నేర్చుకొందుము. వారు సమావేశమును సహితము దిక్కరించి, "ప్రొటెస్టెంట్‌లు, తోడెళ్ళు, సర్పములు మరియు హంతకులని పిలిచిరి" దుర్బోధకులందరు శపింపబడుదురు గాక" అను నినాదముతో సమావేశము ముగియబడెను.

59. జెసూట్స్

స్పెయిన్ మరియు ఫ్రెంచ్ యుద్ధము చేయుచుండెను. ఒక కోటను ఫ్రెంచ్ సైన్యము ఎంతో సాహసముతో కాపాడుచుండగా స్పెయిన్ సైన్యములు దానిని మెరుపు దాడిచేసెను. స్పెయిన్ డివిజన్ భాగము నడిపించు అధికారి ఓ యౌవనుడు మరియు ఉన్నత వర్గమునకు చెందినవాడు. ఆయన పేరు ఇగ్నేషియస్ డి లయోల స్పెయిన్ దేశస్థులనుండి ఆ కోటను ఫ్రెంచ్ సైన్యములు ఆక్రమించుకొనిరి, యుద్ధము, జరిగాక చూడగా ఇగ్నేషియస్ గాయపడిన వారిలో కనబడెను. ఫిరంగి గుండు తన కుడికాలును చాలా గాయపరచెను. తన తండ్రి అంతఃపురములో ఇగ్నేషియస్ అనారోగ్యముతో పడకపై ఉండెను. ఆయన ఆరోగ్యము మెరుగుపడుటకు చాలా కాలము పట్టెను.

అనారోగ్యముతో పడకపై ఉంటూ విసుగు చెంది ఏదైనా పుస్తకము చదువాలని నిర్ణయించుకొనెను. శూరులను గూర్చిన పుస్తకములంటే ఇష్టము గనుక ఆయన ఇతర పుస్తకములను ఆసక్తితో చదవాలని ఆశపడెను. గాని తన అంతఃపురంలో అటువంటి పుస్తకములు లేనందున భక్తుల జీవితచరిత్రలు చదివెను. ఆ భక్తులు దేవుడు మరియు ఆయన సంఘము కొరకు ఎటువంటి ముఖ్యమైన పని చేసిరి. ఇగ్నేషియస్ కూడ అదేపనిని చేయగోరెను!

ఇగ్నేషియస్ ఆరోగ్యము కుదుటపడ్డాక ముస్లింప్రజల మధ్యన మిషనరిగా పనిచేయుటకై యెరూషలేముకు వెళ్ళెను. కాని అక్కడ ఆయన పని ఫలించనందున స్పెయిన్‌కు తిరిగి వచ్చి ఆధ్యయనము చేయుటకు నిర్ణయించుకొనెను. మొదట కొద్ది సంవత్సరములో స్పెయిన్‌లో చదువులు కొనసాగించి, మరొక ఏడుసంవత్సరముల పాటు ప్యారిస్‌కు వెళ్ళి విద్యాభ్యాసము చేసెను.



ఆయన ప్యారిస్‌లో ఉండగా, ఓ చిన్న మిత్రుల బృందమును సమకూర్చెను. క్రీ.శ. 1534 లో ఇగ్నేషియస్ తనమిత్రులతో కలిసి జెసూట్స్ ఆర్డర్ స్థాపించెను. అది సొసైటి ఆఫ్ జీసస్ అని కూడ పిలువబడెను. ఆ ఆర్డర్‌కు ఇగ్నేషియస్ అధిపతిగా ఉండెను. ఆయనే దానికి జనరల్!

మత గురువులుగా ఇగ్నేషియస్ మరియు ఆయన మిత్రులు అభిషేకింపబడి క్రీ.శ. 1540లో ఆ ఆర్డర్ పోప్‌చే గుర్తింపబడెను. జెసూట్స్ ఓ సాధారణ సన్యాసగుంపు కాదు, వారు "క్లర్క్స్ రెగ్యులర్" (అంటే వీరు సన్యాసత్వము పుచ్చుకొన్నా, వీరు బోధకులు, ఉపాధ్యాయులు మరియు విషనరీలుగా కూడ విధి నిర్వహణ చేయుదురు) వారు మరొకసారి, రోమన్ క్యాథలిక్ సంఘమును ప్రపంచ వ్యాప్తముగా గొప్పదానిగా చేయదలచిరి.

అందుకుగాను వారు ప్రపంచ నలుమూలలకు ప్రయాణించిరి. పోప్ నిమిత్తమై ప్రపంచమును గెలుచట యేవారి ఆశయము. వారు మిషనరీలుగా పనిచేయుచు ప్రపంచమందంతట విస్తరించిరి. దూరమును లెక్క చేయక అన్ని స్థలములను దర్శించిరి. వారు అమెరికా, జపాన్, చైనాకు కూడ వెళ్ళిరి! వారు మెక్సికో మరియు దక్షిణ అమెరికాలో సన్యాస ఆశ్రమములు స్థాపించిరి. వారి సొసైటి త్వరితగతిని విస్తరించుచున్నందున అంతటా వారు కనబడుచుండిరి. వారు రాజమందిరములలో, చక్రవర్తులయొద్ద, సలహాదారులుగా నుండిరి. ఇతర ముఖ్యవ్యక్తులకు, చక్రవర్తులకు కాపలాదారులుగాను టీచర్‌లుగాను పనిచేయుచుండిరి. కొందరు యూనివర్సిటి ప్రొఫెసర్స్ గాను మరికొందరు వ్యాపారస్థులుగాను మరియు సాధారణ ప్రజల మధ్యన పనిచేసిరి.

గనుక వారి బోధ ద్వారా వేవేల ప్రజలను రోమన్ క్యాథలిక్ సంఘప్రభావమునకు గురి చేసిరి. జెజ్విట్‌లను పోప్ ఎక్కడికి పంపినా వారు వెళ్ళుటకుబద్ధులైయున్నారు. పోప్ వారికి చాలా అధికారమిచ్చెను! వారు బోధించుట, బలిపూజ నిర్వహించుట, పాపముల ఒప్పుకోలు వినుట, ప్రభురాత్రి భోజనము, ఇతరమైనవి నిర్వహించుట, పోప్ పక్షముగా పాపములు క్షమించు హక్కుసహితము కలిగియుండిరి. జెసూట్స్‌లు ప్రపంచవ్యాప్తముగా చాలా మిషనరి పనిచేసి 6000 మిషన్ కేంద్రములు 4000 పాఠశాలలు మరియు 300 వైద్యశాలలు స్థాపించిరి.

సంఘ సంస్కరణ ఉద్యమములో కోల్పోయిన వాటన్నింటిని సమకూర్చవలెనని వారు ఆశించిరి. వారు బోధన విధానముద్వారా సఫలులు కాకపోతే అధిక హింస విధానములు అయిన కత్తి, అగ్ని, విషమును వాడి దుర్బోధకులను (ప్రొటెస్టెంట్‌లను) చంపి వేసిరి. ఎటువంటి కనికరము చూపక జెసూట్స్ సన్యాస ధర్మము వారు వారి పనిని కొనసాగించిరి.

ప్రతి పరిస్థితిలోను జెసూట్స్‌లు పోప్, బిషప్ మరియు జనరల్‌కు విధేయత చూపుటకు బద్ధులైయున్నారు. సైన్యాధికారులకు అన్నివేళలలో లోబడవలసిన సైనికులవలె వారుండిరి. సొసైటి ఆఫ్ జీసస్ వారు సైనికులవలె ఉండిరి. (అంతకు ముందు ఇగ్నేషియస్ సైన్యాధికారిగా పనిచేసెను). కొందరు వ్యక్తులను హతము చేయవలెనని పోప్ లేదా జనరల్ ఆజ్ఞాపిస్తే హతముచేయబడవలసిన వారిలో వారి సొంతతల్లి తండ్రి ఉన్నా వెనకాడక చంపి తీరవలసిందే! విధేయుడు కానివాడు సొసైటి సభ్యుడుగా ఉండలేడు. అట్టి వ్యక్తి వెలివేయబడును. లేదా హత్య చేయబడును. రోమన్ క్యాథిలిక్ సంఘ అధికారమునకు లోబడి సేవించు నిమిత్తము సమస్తమును త్యాగము చేయవలసినదే. వారి ఆశయ సాధన నిమిత్తమై ఏ మార్గమైనా అనుసరించవచ్చుననునది జెసూట్స్‌ల యొక్క నమ్మకము "విధానమును ఫలితములు నిర్ణయించును" అని విశ్వసింతురు.

ప్రొటెస్టెంట్‌లను నిర్మూలించుటకై వారు మత చాందస వాదమును, ఉగ్రవాదమును వాడేవారు. డచ్ చక్రవర్తియైన విల్లియమ్ ఆరంజ్‌ను తన ప్రజలు "జాతిపిత" అని పిలిచేవారు. క్రీ.శ. 1584లో ప్రసిద్ధిగాంచిన డచ్ చక్రవర్తియైన విల్లియమ్ ఆఫ్ ఆరంజ్‌ను బెల్తజార్ గెరార్డ్స్ అను జెసూట్స్ మతగురువు చంపివేసెను.


జెసూట్స్‌ల చేతిలో ప్రొటెస్టెంట్‌లు పొందిన హింస చాలా గొప్పది! నాశనమునుండి స్వయాన ప్రభువే తప్పించియుండనట్లైతే రక్తమనే సముద్రములో సంఘము మునిగియుండెడిది!

60. ఇంగ్లండ్‌లో సంఘసంస్కరణ

ఇంగ్లండ్‌లో మార్టిన్ లూథర్‌వంటి వ్యక్తులెవ్వరు లేకపోయినా, దేవుని వాక్యపు వెలుగు ఆ దేశములో కూడా ప్రకాశించుచుండెను. ఇట్టి వెలుగు మార్టిన్ లూథర్ పుట్టకముందునుపే ఉండెను. మనము 43వ అధ్యాయములో చూచినట్లు, ఇంగ్లిష్ సంఘసంస్కరణ రాజదూతవలె 14వ శతాబ్దము నుండి జాన్ విక్లిఫ్ పనిచేయుచుండెను.

క్రీ.శ. 1517లో లూథర్ రచనలు ఇంగ్లిష్ భాషలోనికి అనువదింపబడ్డాక, ఆయన రచనలు ఇంగ్లండ్‌యందంతట వ్యాప్తి చెందెను. ఈ రచనలు ఇంగ్లండ్‌లోనూ సంఘసంస్కరణకు దారి తీసెను. దానికి అవి మంచిపట్టునిచ్చెను. ఇట్టి సమయములో, మతనిష్టగల రోమన్ క్యాథలిక్ రాజైన హెన్రీVIII ఇంగ్లాండ్‌ను పాలించుచుండెను. అతడు అతని భార్యయైన క్యాథరిన్ రాణికి (స్పెయిన్ దేశస్థురాలు) పిల్లలు ఉండిరి, కాని వారిలో ఏ ఒక్కరిని తన వారసులుగా ఉండాలని హెన్రిVIII కోరలేదు. గనుక రాజు క్యాథరిన్‌కు విడాకులిచ్చి తన రాజమందిరములోనున్న ఒక సాధారణ స్త్రీని వివాహమాడదలచెను. కాని దానికి పోప్ అనుమతి ఇవ్వాలి. పోప్ తన అనుమతిని వెంటనే ఇవ్వలేదు. ఆలస్యమునకు రాజైన హెన్రీ మండిపడి, పోప్ ఆజ్ఞను ధిక్కరింపగోరెను. ఏదో ఒక విధముగా ఆర్చ్‌బిషప్ అయిన క్రాన్‌మర్ ద్వారా క్యాథరిన్‌తో తనకున్న వివాహబంధము వట్టిదని కొట్టివేయించి ఆని బోలిన్ అను ఓ సాధారణ స్త్రీని పెళ్ళిచేసికొనెను.

పోప్ ఈ విషయములను సమ్మతింపక ఇంగ్లీష్ రాజును బహిష్కరించెను. హెన్రీ పార్లమెంట్ ఇంగ్లండ్ ప్రజాప్రతినిధుల సమాఖ్య ఆజ్ఞలను లెక్క చేయలేదు, రోమ్‌తో ఉన్న సంబంధమును తెగదెంపులు చేయుటకై వెంటనే తీర్మానము చేయబడెను. నేనే ఇంగ్లండ్‌లోని సంఘమునకు అధిపతినని రాజైన హెన్రి ప్రకటించెను. ఈ సంఘము రోమన్ క్యాథలిక్ సంఘముగానే ఉండును కాని పోప్ అధికారము క్రింద ఉండదు. ఇది దేశములో



చాలా గలిబిలిని కలుగజేసెను. రోమన్ క్యాథలిక్‌లలో అనేకులు రాజు చర్యలతో సమ్మతింపలేదు. వారు సంఘమునకు అధిపతి రాజు అని ఒప్పుకొనుటకు నిరాకరించిరి. హెన్రి ప్రజలను చాలా క్రూరముగా హింసించెను. మరియు రోమన్ క్యాథలిక్‌లు అనేకులు చంపబడిరి.

కాని సంఘసంస్కరణ ఇంకనూ క్రమేపి వృద్ధిచెందుచుండెను. ఇంగ్లీష్ ప్రజలు తమసొంత భాషలోనికి అనువదింపబడిన బైబిల్‌ను కలిగియుండు ఈ ప్రక్రియలో ప్రముఖ క్షణము. ఈ పని ఇంగ్లీష్ వ్యక్తియైన విల్లియమ్ టిండెల్ యొక్క పనియైయున్నది. విట్టెన్ బర్గ్‌లో లూథర్‌ను కలుద్దామని టిండేల్ వెళ్ళెను కాని టిండెల్ వార్మ్స్‌నకు పారిపోవునట్లుగా బలవంతము చేయబడెను. ఆయన అక్కడ క్రొత్త నిబంధనను అనువాదము చేయుటకై పూనుకొనెను. తన అనువాదప్రతులు ఆరువేలుగా ముద్రింపబడి ఇంగ్లండ్‌నకు పంపబడెను. రాజు మరియు ఆర్చ్ బిషప్ టిండెల్ యొక్క క్రొత్త నిబంధన చదువుటను నిషేధించిరి. కాని అది ఫలింపలేదు. పాతనిబంధన కూడ ప్రచురింపబడియుండెను. ఇంగ్లండ్ ప్రజలు వారి క్రొత్త బైబిల్‌ను చదువకుండా వారు ఆపలేకపోయిరి.

టిండేల్‌ను బంధించి ఖండించమని హెన్రీ VIII చార్లెస్ Vను కోరెను. అలా చేయుటయందు చక్రవర్తి సఫలీకృతుడాయెను, టిండేల్ ఫ్లాండర్స్‌నందు బంధింపబడి అక్కడ ఉరితీయబడెను. కాని ఆయన పని ఇంకను కొనసాగెను. టిండేల్ మరణ సంవత్సరములో ఆయన అనువదించిన బైబిల్ ఏడు ముద్రణలు చేయబడెను. టిండేల్ ప్రారంభించిన పనిని ఇతరులు ఇప్పుడు కొనసాగించుచున్నారు. ఈ పని వేలాదిమందికి దీవెనకరముగా నున్నది. చాలామంది హెన్రీVIII స్థాపించిన సంఘము విడిచి సంఘసంస్కరణ సిద్ధాంతమును అనుసరించు అనుచరులతో చేరిరి. (హెన్రీVIII స్థాపించిన సంఘములో ఇంకనూ ఎన్నో రోమన్ క్యాథలిక్ దోషములు కలవు) ఇంగ్లీష్ ప్రొటెస్టెంట్‌లు ప్యూరిటన్‌లని పిలువబడిరి. వారు స్వచ్ఛమైన సంఘమును (ప్యూర్ చర్చ్) మరియు స్వచ్ఛమైన సిద్ధాంతమును (ప్యూర్ డాక్ట్రిన్‌ను) కోరుదురు.

సంఘసంస్కరణతో ఎట్టి సంబంధము కలిగియుండకూడదని రాజు కోరెను. సంఘ అధిపతి విషయములో మార్పులేనందున వారు రోమన్ క్యాథలిక్‌లుగానే మిగిలిపోయిరి! ప్యూరిటన్‌లు హింసింపబడిరి. చాలా తరచుగా, ఒకే ఉరికంబముపై రోమన్ క్యాథలిక్‌లు మరియు ప్యూరిటన్‌లు ఉరితీయబడి నశించిరి.

హెన్రీ చాలా క్రూర వ్యక్తిగా నుండెను. ఆయనకు ఆరుగురు భార్యలుండిరి. వారిలో ఇద్దరిని ఆయన ఉరికంబమునెక్కించెను. ఉరితీయబడిన ఆ యిద్దరి భార్యలలో ఒక భార్యపేరు ఆని బోలిన్ ఆమె ప్రొటెస్టెంట్‌గా నుండెను.

క్రీ.శ.1547 లో హెన్రీVIII మరణించాక ప్రొటెస్టెంట్‌లకు స్వేచ్ఛ ఉదయించెను. హెన్రీ వారసుడైన ఎడ్వర్డ్ VI ఆధ్వర్యములో హింస అంతమొందింపబడెను. ఇంగ్లీష్ సంఘము క్రమేపి ప్రొటెస్టెంట్ విశ్వాసమునకు దగ్గరయ్యెను.

దివ్య ఆరాధన నిర్వహింపబడుట విషయములో ఆర్చ్ బిషప్ క్రాన్మర్ ఒక ప్రార్థన పుస్తకమును కూర్పు చేసెను. బైబిల్ అధికారమును అంగీకరించు ఇంగ్లీష్ విశ్వాసపు ఒప్పుకోలు ప్రచురింపబడెను. రోమన్ క్యాథలిక్‌లు జరుపు బలిపూజ రూపుమాపబడెను, విగ్రహములు తొలగింపబడెను, చనిపోయిన వారిని వారి అవశేషములను (ఉదా: గోర్లు, వెంట్రుకలు) మ్రొక్కి ఆరాధించుట ఖండింపబడెను. ఈ విశ్వాసపు ఒప్పుకోలు కాల్వినిస్ట్ నియమములపై ఆధారపడియున్నది.

భయము మరియు దిగులుతో కూడిన సమయము తర్వాత, ప్రభువు ఇంగ్లండ్‌లోని తన సంఘమునకు సమాధాన సమయమునిచ్చెను.

61. బ్లడీ మేరి (రక్త దాహముగల మేరి)

ఇంగ్లండ్‌లో ప్రభువు సంఘమునకు శాంతి సమాధానములిచ్చియుండగా సంఘసంస్కరణ ఉద్యమము చాలా గొప్పగా దూసుకు వెళ్ళెను. కాల్విన్ రచించిన అనేక గ్రంథములు ఇంగ్లీష్ భాషలోనికి అనువదింపబడెను. మరియు ఇంగ్లండ్‌లో వేలకొలది ప్రతులువ్యాప్తిలో ఉండెను. అంతయూ సవ్యముగా చక్కగా ఉండెను.

ఈ ఖండములో హింస చెలరేగగా అనేకులు ఆశ్రయము నిమిత్తము ఇంగ్లండ్‌కు పారిపోయి వచ్చిరి!

కాని యౌవనుడైన ఎడ్వర్డ్ అకస్మాత్తుగ మరణించెను. ప్రజలు ఆ విషయమై చాలా విచారపడిరి. ఎడ్వర్డ్ తర్వాత తన సహోదరి అధికారములోనికి వచ్చెను. ఆమె పేరు మేరి. ఆమె నిష్టగల రోమన్ క్యాథలిక్, మరియు ఎడ్వర్డ్VI ఆధ్వర్యములో ఉనికిలోనికి వచ్చిన సంఘమును ఆమె ప్రక్కనబెట్టెను. ఆమె రోమన్ క్యాథలిక్ సంఘమును సమకూర్చి బలపరచెను, పోప్ ఇంగ్లండ్‌లోని సంఘమునకు అధిపతిగా పరిగణింపబడెను.

ప్యూరిటన్స్ మాత్రమేగాక ఎడ్వర్డ్VI ఆధ్వర్యములో స్థాపింపబడిన సంఘసభ్యులు కూడ చాలా క్రూరముగా హింసింపబడిరి. వందలకొలది దహింపబడి హతసాక్షులుగా మరణించిరి. ఈ కారణము చేత ఆమెకు "బ్లడీమేరి" (రక్తదాహము గల మేరి) అని ఘోరముగా పేరుపెట్టబడెను. చిన్న పడవలలో ఉత్తర సముద్రము దాటి ఖండమునకు పారిపోయిరి.


స్పెయిన్ క్రూర రాజైన ఫిలిప్IIను రాణియైన మేరి వివాహమాడెను. (మనము ఫిలిప్‌ను గూర్చి తరువాత ఎక్కుగా చదివెదము) భార్యభర్త లిరువురు కలిసి ఇంగ్లండ్‌లోని దుర్బోధకులను (ప్రొటెస్టెంట్‌లను) సమూల నాశనము చేయపూనుకొనిరి! వెంటనే బిషప్ క్రాన్‌మర్ బంధింపబడి చెఱసాలలో వేయబడెను. ఇద్దరు మతగురువులు కాల్చబడి చంపివేయబడుటను చెఱగదిలో ఉంటూనే చూచెను. నేనునూ అట్టి దశకు వెళ్ళుదనని గుర్తించి మోకాళ్ళపైబడి ఆ వృద్ధుడు దేవా బలమిమ్మని దేవుని వేడుకొనెను. కాని పరిస్థితులు మారుతున్నట్టుగా అగుపించెను. ఆయన మరొక భవనములోనికి మార్చబడి, ఆయన ఎంతో చక్కగా దయతో చూచుకొనబడెను.

కొంతకాలము గడిచాక, ఒక పత్రములో గతములో చేసిన వ్యాఖ్యలు విరమించుకుంటూ సంఘమునకు అధిపతి పోప్ అని ఒప్పుకుంటాను అను మాటలుండెను. ఆ పత్రముపై సంతకము చేయుమని అధికారులు కోరగా వారు చూపిన దయ, జాలికి ఆశ్చర్యపడి ఆ పత్రములపై క్రాన్‌మర్ సంతకము చేసెను.

అంతటి ప్రముఖుడు సంతకము చేయగా తను మాట వెనక్కి తీసుకున్నంత పనైంది. అది రోమన్ క్యాథలిక్‌లకు ఓ గొప్ప విజయముగా మారెను! క్రాన్‌మర్‌ను విడుదల చేస్తారా? కాదు, కుదరనే కుదరదు! రాణియైన బ్లడీమేరి ఈ పరిణామమును, భావనను పూర్తిగా కొట్టివేసెను. అయిననూ ఆయన దహించి వేయబడబోతున్నాడు. క్రాన్‌మర్ చావక మునుపు, చివరిసారిగా బహిరంగముగా విశ్వాసమును పరిత్యజించమని కోరబడెను. ఆయన బహిరంగముగా విశ్వాసమును పరిత్యజిస్తే శత్రువులు వినాలని ఆశపడిరి.

గమనించండి! ఈ వృద్ధుడు ఆక్స్‌ఫర్డ్ నందలి సంఘములో వేదికపై నుంచున్నాడు. అందరు నిశ్శబ్దముగా ఉండగా ఆయన మాట్లాడుట ప్రారంభించెను. తను ఆ పత్రము పై సంతకము చేసినందుకు ఎంత బాధపడ్డాడో ఈ వృద్ధుడు వణకు స్వరముతో వివరింపసాగెను. తను, చేసిన పనికై కన్నీళ్ళు కార్చి పశ్చాత్తాపపడెను. "ఆ పత్రంపై సంతకము చేసి నా చేయి పాపము చేసెను. ఇదిగో నా చేయి. దీనిని శిక్షించండి" మరియు కుడిహస్తము చాపి "దీనిని మొదట కాల్చండి" అని స్పష్టమైన స్వరముతో బిగ్గరగా అరచెను.

రోమన్ క్యాథలిక్‌లు రౌద్రులయ్యారు. విజయము ఓటమిగా మారెను. ఉరితీయు స్థలమునకు ఆయనను కఠినముగా ఈడ్చుకొని వచ్చిరి. తన చుట్టూ కట్టెలు పేర్చిరి. వెంటనే కర్రలకు నిప్పంటించగా మంటలు చెలరేగెను. అక్కడ చేరిన వారందరు క్రాన్‌మర్ తన కుడి హస్తమును మంటలోనికి చాపుట చూచిరి. "నా కుడిచేయి ఎంత అపాత్రమైనది"అని ఆయన అరవటం



వారందరు వినిరి. ఆ చాపిన చేయి నల్లగా కాలేంతవరకు ఆయన మంటల్లో అలాగే ఉంచెను. క్రమేపి మంటలు తన శరీరమును కూడ ఆవరించెను. "ప్రభువైన యేసూ నా ఆత్మను చేర్చుకొనుము" అని చివరిగా అరచెను. వారు చూచిన మరియు విన్న సంగతులు మనసులో లోతుగా నాటుకొనగా ప్రజలు వారివారి ఇళ్ళకు తిరిగి వెళ్ళిరి. క్రాన్‌మర్ యొక్క మరణమే ఓ సందేశము.

రెండు సంవత్సరముల పిమ్మట రాణియైన బ్లడీమేరి మరణించెను. ఆమె తరువాత తన సహోదరియైన ఎలిజబెత్ అధికారములోనికి వచ్చెను. హింస ఆగిపోయెను. ఎడ్వర్డ్VI స్థాపించిన సంఘమును మరొకసారి క్రొత్తరాణి తిరిగి సమకూర్చెను. ఇప్పుడు ఇంగ్లాండ్‌లో ఇది "స్థిర సంఘము" (రాజ్య సంఘము)గా అయ్యెను" ఈ సంఘము అంతరంగములో ప్రొటెస్టెంట్‌గాను, బయటికి దాదాపు రోమన్ క్యాథలిక్ సంఘముగాను ఉండెను. ఈ సంఘము ద్వంద్వ ప్రమాణములను కలిగియుండెను. (దీనికర్థము దీని స్థానమును వేర్వేరు విధములుగా అనువదించలేము) (ఇప్పుడు పిలువబడుతున్నట్టుగా చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ "సగము కట్టి నిలిపివేయబడిన ఇల్లు".

ఇంగ్లండ్‌లో "ప్యూరిటన్‌ల" గుంపుగా పిలువబడుచున్న మరికొన్ని "సమాజములు" వెలసెను. వీరు విశ్వాసులుగా ఉంటూ, ఆచారవ్యవహారములేవీ పాటింపక ఇండిపెండెంట్ సంఘములుగా ఉండెను. వారు "ఇండిపెండెంట్‌లు"గా పిలువబడిరి వారు బిషప్, రాజు లేదా సమావేశము అధికారము క్రింద ఉండక పూర్తిగా స్వేచ్ఛగా, స్వతంత్రులుగా ఉండగోరిరి.

గొప్ప కష్ట సమయముల పిమ్మట, ప్రభువు ఇంగ్లండ్‌లో కూడ తన సంఘమును రోమన్ క్యాథలిక్ సంకెళ్ళనుండి విడిపించెను. ప్రభువు కార్యము భగ్నము కాజాలదు.

62. స్కాట్లాండ్‌లో సంఘసంస్కరణ


సంఘసంస్కరణ పొరుగుదేశమైన ఇంగ్లండ్‌లో దూసుకొని పోయినట్లు స్కాట్లాండ్‌లోకూడ దూసుకుని పోయెను. క్రీ.శ. 1527లో స్కాట్లాండ్‌లో విక్లిఫ్ అనుచరులు కూడ కార్యాచరణలో ఉండిరి. అక్కడ వారి జాతీయ భాషలో బైబిల్ ప్రచురింపబడెను. అది స్కాట్లాండ్ ప్రజలకెంతో దీవెనకరము. కాని అతి త్వరలోనే ఇక్కడ కూడ హింస ప్రారంభమయ్యెను.

ఈ హింస సెయింట్ ఆండ్రూస్ అను ప్రముఖ నగరమందు నివసించు ఆర్చ్‌బిషప్ వలన కలిగెను. సంఘసంస్కరణను అణగద్రొక్కుటకై ఎంతో ప్రయాసపడెను. క్రీ.శ. 1564లో ఓ అతి ప్రియమైన గౌరవప్రదమైన పరిచారకుని ఆర్చ్ బిషప్ కాల్చివేసెను. అప్పుడు స్కాట్లాండ్ ప్రజలు తిరగబడిరి. పరిచారకుని దహించినందుకు ఆర్చ్ బిషప్ గొప్ప వెల చెల్లింపవలసి వచ్చెను. ఉన్నత వర్గ సభ్యులచే ఆయన హత్య చేయబడెను.

క్రీ.శ.1542 తర్వాత మేరీ స్టూవర్ట్ స్కాట్లాండ్‌నకు రాణియాయెను. ఆమె ఇంకనూ యౌవన ప్రాయములో ఉండెను. గనుక తల్లియైన మేరీ ఆఫ్ గ్యూసి, సామ్రాజ్యపు వ్యవహారములను చూచుకొనెను. తల్లి మరియు బిడ్డ రోమన్ క్యాథలిక్ సంఘమును బలపరచిరి.

సెయింట్ ఆండ్రూస్‌నందు ఆర్చ్ బిషప్ హత్యను గూర్చి తను వినినపుడు రాణియొక్క తల్లి మేరీ ఆఫ్ గ్యూసి చాలా మండిపడెను. ఆమె నగరమునకు సేనలను పంపెను కాని ఉన్నత వర్గీయులు ఆ నగరమును కాయుచున్నందున సేనలు నగరములోనికి అనుమతింపబడలేదు. సముద్రము నుండి ఆ నగరమును దాడి చేయవలెనని మేరీ ప్రణాళిక వేసెను. (సెయింట్ ఆండ్రూస్ సముద్ర తీరమున ఉండెను). ఆ నగరమునకు ఓడల సైన్య సమూహమును పంపమని ఆమె ఫ్రెంచ్ దేశమును కోరెను.

ఆ విధముగా ఒకే సమయములో రెండువైపుల నుండి సెయింట్ ఆండ్రూస్ అను నగరము



దాడిచేయబడెను. ఆ నగర నివాసులు చాలా కాలము వరకు అడ్డుకొనిరి గాని, నగరములో ఆహార కొరత ఏర్పడెను. ఘోర తెగుళ్ళు కలిగెను గనుక విధిలేక నగరము లోబడెను. వారిలో అనేకులు బంధింపబడి ఫ్రాన్స్‌కు పంపబడిరి. ఆ బందీలలో పరిచారకుడైన జాన్ నాక్స్ ఉండెను. ఈ స్కాట్లాండ్ మత గురువు రోషముగల వాక్యోపదేశకుడు, రోమా సంబంధమైన విగ్రహారాధనను మాపి వేయ కోరికగలవాడు. నిజమైన కాల్వినిస్ట్‌గానుంటూ తన జీవితకాలమంతయూ దేవుని వాక్య సత్యము కొరకై పోరాడెను. "స్కాట్లాండ్ సంఘసంస్కరణ ఆయన వాక్యోపదేశము ఖడ్గము" వంటిది అని ఆయనను గూర్చి చెప్పబడెను.

జాన్ నాక్స్ ఫ్రాన్స్‌లో చెరఓడలో బంధీగా ఉండెను (ఫ్రాన్స్‌లో దుర్భోధకులను అనగా ప్రొటెస్టెంట్‌లను శిక్షించే ఆమోద విధానము) చెర ఓడలోని దాసుల జీవితము చాలా ఘోరముగానుండెను. వారి బలమంతయూ ఉపయోగించి తెడ్డువేసి ఓడనడుపవలెను. వారు తరచుగా కొరడాలతో కొట్టబడిరి. దాహముగొని తుదకు మరణించే వారు. కొన్నిసార్లు సముద్రయుద్ధము జరిగినపుడు వారు నీళ్ళలో ముంచి వేయబడిరి లేదా ఉప్పెనలో నశించిరి. చెరఓడలో ఉంటుండగా ప్రొటెస్టెంట్ విశ్వాసము వదలి రోమన్ క్యాథలిక్ సంఘమునకు తిరిగి రమ్మని నాక్స్ కోరబడెను. కాని వారి ప్రయత్నములు ఫలించలేదు. పంతొమ్మిది నెలలపాటు నాక్స్ చెరఓడలో బానిసగా ఘోరశ్రమనొందెను. కాని అద్భుతముగా ఒక సంగతి జరిగెను. ఒక రోజున బానిసల ఓడ స్కాట్లాండ్ రేవు చేరెను. బానిసల అధికారి నాక్స్ సంకెళ్ళు విప్పి తన్ను వెంబడింపుమని చెప్పెను. ఆయన గ్యాంగ్‌ప్లాంక్ చేరుకున్నాక ఓ పెద్ద ఆశ్చర్యము జరిగెను. ఆయన వస్త్రములు తిరిగి ఇవ్వబడెను. బానిసల ఓడ నుండి ఆయనకు విడుదల కలిగెను. నాక్స్ ఇప్పుడు స్వేచ్ఛాజీవి!

కాని ఆయన ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి, స్కాట్లాండ్‌లో ఘోర హింస చెలరేగుచున్నందున ఇంగ్లండ్ వెళ్ళుదునని నిశ్చయించుకొనెను. ఆయన ఇంగ్లండ్‌లో సురక్షితముగా ఉండును. ఆయన సాదరముగా ఆహ్వానింపబడెను మరియు రాజైన ఎడ్వర్డ్VI కు చాప్లిన్ ఆత్మీయ సలహాదారుగా ఉండెను. కాని ఎడ్వర్డ్ మరణించాక రాణి (బ్లడీ మేరి) మేరి సింహాసనమును అధిరోహించెను, ఎడ్వర్డ్ మరణించాక నాక్స్ జీవితము ప్రమాదములో పడగా ఆయన జెనీవాకు పారిపోయెను. అక్కడ ఆయన కాల్విన్‌తో కలిసి పనిచేసెను. నాక్స్ సహాయమును బట్టి కాల్విన్ సంతోషపడెను. నాక్స్ తన సొంత నగరమునకు పోదలచెను గనుక ఆయన జెనీవాలో చాలాకాలము ఉండలేదు. అక్కడ ఆయన దేవుని వాక్యమును బోధించుటకు ఇష్టపడెను.

ఆరు సంవత్సరముల తర్వాత ఆయన స్కాట్లాండ్‌కు తిరిగి వచ్చెను. కాని అతి తక్కువ కాలములోనే ఆయన దేశము విడిచి పారిపోవలసివచ్చెను. తరువాత తిరిగి వచ్చి రోమన్ క్యాథలిక్ సంఘ సంగతులకు విరోధముగా బోధించెను. నలుమూలలనుండి ఆయన చేయు వాక్యోపదేశము వినుటకై వచ్చిరి. జరుగుతున్న దానికి విరోధముగా రోమన్ క్యాథలిక్ రాణి ఏమియూ చేయలేకపోయెను. అదియూగాక బాధింపబడు సమాజములను భద్రపరచి కాపాడుదుమని స్కాట్లాండ్‌లోఉన్న వర్గమువారు ఒకరితో ఒకరు శుభప్రదముగా వాగ్దానము చేసికొనిరి. ఈ సమ్మతి "ఒడంబడిక" అని పిలువబడెను.

ఈ సమ్మతి ఫలితముగా స్కాట్లాండ్‌లో జరుగు సంఘసంస్కరణ ఉద్యమములో సాధారణ ప్రజలు ఎక్కువగా పాల్గొనిరి. హింస మరియు విగ్రహ విధ్వంస సమయము వచ్చెను. సంఘములలోని బలిపీఠములు, విగ్రహములు ముక్కలు ముక్కలుగా చేయబడెను. సన్యాస ఆశ్రయములు ధ్వంసము చేయబడెను.

ఈ సమయములో (క్రీ.శ.1560) మేరీ కూతురు (మేరీ స్టూవర్ట్) ఫ్రాన్స్‌లో ఉన్నందున తన తల్లియైన మేరీ ఆఫ్ గ్యూసి మరణించాక, స్కాట్లండ్‌కు ఎటువంటి రాణి లేక ఖాళీగా ఉండెను. ప్రభుత్వము అనగా పార్లమెంట్ (ప్రజా ప్రతినిధుల సమాఖ్య) బాహాటముగా సంఘసంస్కరణ ఉద్యమమును పోషించి బలపరచెను. శాంతి సమయము వచ్చెను. స్కాట్లాండ్ సంఘములో ప్రెస్బిటర్స్ (పెద్దలు) ప్రధాన పాత్ర వహించిరి గనుక స్కాట్లాండ్ యొక్క ప్రొటెస్టెంట్‌లు ప్రెస్బిటేరియన్స్ అని పిలువబడిరి.

63. జాన్ నాక్స్ మరియు మేరీ స్టూవర్ట్

క్రీ.శ.1516లో మేరీ స్టూవర్ట్ స్కాట్లాండ్‌కు రాణిగా వచ్చెను. ఆమె ఫ్రెంచ్ దేశములో నివసిస్తుండగానే తన భర్తయైన ఫ్రెంచ్ రాజు మరణించెను. తనంతట తాను విధవరాలుగా స్కాట్లాండ్‌కు వచ్చెను. తన తల్లి రాజు ప్రతినిధియైన గూజ్ మేరి మరణించెను గనుక స్కాటిష్ సింహాసమును అధిరోహించవలసియుండెను. తన తల్లి మరియు భర్తవలె, స్టూవర్ట్ మేరి ఓ కరడు గట్టిన తీక్షణమైన రోమన్ క్యాథలిక్‌గా ఉండెను. మేరీ అక్కడికి చేరుకోవటం చూసి స్కాట్లండ్ ప్రజలు ఇష్టపడలేదు. ఆమె స్కాట్లండ్‌ను మరొక్కమారు రోమన్ క్యాథలిక్ దేశముగా మార్చు ప్రణాళికతో వచ్చెను గనుక స్కాట్లండ్ ప్రజలు భయపడిరి. ఆమె స్కాట్లాండ్ వచ్చాక మొదటి ఆదివారమునాడు తన రాజభవనమునందు రాయల్ చాపల్‌లో (మాస్) బలిపూజ నిర్వహింపజేసెను. స్కాట్లండ్ ప్రజలు దానిని ఆచరింపలేదు. వారు నేరుగా చాపల్‌లో ప్రవేశించి బలిపీఠమును ధ్వంసము చేసి, క్రొవ్వొత్తులను ముక్కలు ముక్కలుగా చేసిరి. వేదికనుండి మరొక సారి తల ఆడిస్తున్న రోమనిజమ్ యొక్క ప్రమాదము విషయమై జాన్ నాక్స్ హెచ్చరించెను. (మాస్) బలిపూజ శపింపబడిన విగ్రహారాధన. "ఒక్క (మాస్) బలిపూజ పదివేలమంది సైన్యసమూహముకంటే ప్రమాదకరముగానుండును అదే నిజమతమును పడద్రోసెను" అని ఆయన చెప్పెను. నాక్స్ చెప్పిన సంగతిని రాణి వినినప్పుడు ఆమె యెదుట హాజరుకావలెనని నాక్స్‌ను ఆదేశించెను. ఆయన వెంటనే అంతఃపురమునకు వెళ్ళెను. ఆయన రాణికి భయపడలేదు! తమ రాణికి విధేయులుగా ఉండమని నీవు ప్రజలకు బోధించుచున్నావా అని అడిగెను. వారందరు రోమన్ క్యాథలిక్‌లుగా మారి రాణికి లోబడవలెనని చెప్పెను. కాని రోమన్ క్యాథలిక్ మతము బైబిల్ సత్యమునుండి వైదొలగెను గనుక ప్రజలు ఈ విషయమై తనకు లోబడరని నాక్స్ బదులిచ్చెను.

తను జీవించు పాపజీవితమును గూర్చి నాక్స్ మందలించినపుడు రాణి చాలా మండిపడెను. తాను కోపోద్రికురాలై నాక్స్‌ను రాజు భవనమును విడిచి వెళ్ళకమునుపు, ప్రక్కన గదులలో వేచియుండు గదులలో స్త్రీలు నిలువబడుకొనియుంటే వారి పాపజీవితమును విడిచి పశ్చాత్తాపపడుమని నాక్స్ వారిని కూడా హెచ్చరించెను. రాణి తన పాపపు అలవాటులను కొనసాగించెను. జాన్ నాక్స్ ఆమెను ఇశ్రాయేలు దుష్టరాణియైన యెజెబెలుతో పోల్చెను. మేరీ అది వినినప్పుడు వెంటనే నాక్స్ తనయెదుట హాజరు కావలెనని ఆజ్ఞాపించెను! ఆయన విషయమై ఆమె చాలా మండిపడెను! అకస్మాత్తుగా ఏదిఎలా ఉన్నా నన్ను ప్రజలయెదుట గౌరవించుమని నాక్స్‌ను బ్రతిమాలెను. "మేడమ్" అదే మీ కోరిక అయితే, నేను నిన్ను గౌరవించేలా చూచుకొవాలి అని నాక్స్ బదులిచ్చెను. నాక్స్ రాజద్రోహము చేయుచున్నాడని తప్పుడుగా నిందించి ఆయనను బంధింపజేసెను. కాని నాక్స్ నిర్దోషియని తీర్పుతీర్చబడెను. ఆయనను విడుదల చేయుటకై రాణి వత్తిడి చేయబడెను. నాక్స్‌ను హత్యచేయించుటకు ఆమె సాహసింపలేదు.

కొంతకాలము పిదప ప్రజలు తిరుగబడిరి. నానాటికి భక్తిహీనముగా మారుతున్న జీవితముగల రాణి మాకు వద్దనిరి. మేరి బంధింపబడెను గాని తప్పించుకోగలిగెను. తనమేనత్తయైన ఎలిజబెత్ ఇంగ్లండ్‌కు రాణిగా ఉండగా అక్కడికి పారిపోయెను. కాని కొంత కాలము తరువాత ఇంగ్లండ్‌లోనూ మేరీ చెఱసాలలో ఉంచబడెను. ఎందుకంటే ఎలిజబెత్‌ను పడద్రోసి తను ఇంగ్లండ్‌కు రాణి కాజూచెను. ఆమె చెఱసాలలో ఉంటూనే ఎలిజబెత్‌కు విరోధముగా రహస్యపన్నాగము పన్నెను ఇక మరొకమార్గములేక ఎలిజబెత్ మేరీ శిరచ్ఛేదనము చేయించెను.

స్కాట్లండ్‌లో జాన్ నాక్స్ సంఘసంస్కరణ ఉద్యమమునకు గొప్ప నాయకునిగా ఉండెను. ఆయన కొనసాగి రోమనిజమ్ ప్రమాదములను గూర్చి ప్రజలను హెచ్చరించెను. విశ్వసనీయమైన కాపలాదారునిగా తన నాయకత్వములో స్కాటిష్ ప్రెస్బిటేరియన్ సంఘము జాతీయ సంఘముగాను మరియు కాల్విన్ బోధలననుసరించే (కాల్వినిస్టిక్) సంఘముగా ఉండి



కొనసాగులాగున కాచి భద్రపరచెను. నాక్స్ వాడిన ఒకే ఒక్క ఆయుధము దేవుని వాక్యము. తన జీవితపు చివరిదినముల వరకు సహితము ఆయన క్రమేపి బోధించెను, ప్రజలు ఆయనను వేదికమీదకు మోసికొనిపోవలసి వచ్చెను.

ఏది ఏమైనా నాక్స్ క్రీ.శ. 1572 సం॥లో చివరి సారిగా నవంబర్‌లో బోధించెను. జరుగ బోవుదానిని ప్రజలు దాదాపు గ్రహించిరి. కార్యక్రమము ముగిశాక అందరు దారి ప్రక్కన నిలువబడి ఆయనను చూచి ఆయనతో చివరిసారిగా చేతులు కలుప (కరచాలనము) ప్రయత్నించిరి. నాక్స్ పద్నాలుగు దినముల తరువాత మరణించెను. ఆయన మరణపడకపైనుండగా ఆయనను చూచుటకు అనేకులు వచ్చిరి. నాక్స్ మనవి మేరకు తన చివరి రోజులలో అనేక వాక్యభాగములు బిగ్గరగా ఆయనకొరకై చదువబడెను. ప్రత్యేకముగా యోహాను 14వ అధ్యాయము 2వ వచనము "నా తండ్రి ఇంట అనేక నివాసములు గలవు, నేను మీ కొరకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను" అను మాటలు విని నాక్స్ కన్నీళ్ళు కార్చెను.


ఎంతో నెమ్మదిగా ప్రశాంతముగా స్కాట్లండ్ యొక్క గొప్ప సంఘ సంస్కరణోద్యమకారుని ఆత్మ ప్రభువునందు నిద్రించెను. తన సమాధి ప్రక్కన ఉన్న మోరె యువరాజు (జిల్లా గవర్నర్) ఈ దిగువ మాటలు విని నాక్స్ విషయమై చెప్పెను "ఇక్కడ నిద్రించు అయన ఏ మానవునికిని భయపడలేదు".

64. భక్తుడైన బర్తొలొమయి వధ, ప్యారిస్ (క్రీ.శ. 1572)

ఫ్రాన్స్‌నందుకూడా సంఘసంస్కరణోద్యమము ఊపందుకొంటున్నది. ప్రజలు అత్యాసక్తితో లూథర్ మరియు కాల్విన్ రచనలు చదువుచున్నారు. తన దేశమందు ఒకే ఒక్క మతము అదే రోమన్ కాథలిజమ్ కావాలని రాజైన ఫ్రాన్సిస్ I కోరుకుంటున్నాడు. సంఘ విషయములలో విబేధములు ఉండకూడదు. ప్రతియొక్కరు ఒకే విశ్వాసము కలిగియుండవలెను. ఫ్రాన్స్‌యందంతట వారి విశ్వాసము నిమిత్తమై దహింపబడిన వారి పొగ ఆకాశమునంటుచున్నది. ఎక్కడ చూసినా ఘోరహింస చెలరేగుచున్నది. ముఖ్యముగా వాల్డెన్సియన్లు దానికి బలౌతున్నారు. పశ్చిమ ఆల్పిన్ గ్రామములలో నాలుగువేలకంటే పైబడి మనుష్యులు వధింపబడిరి. వారిలో వందల కొలది బానిసలను మోసికొని వెళ్ళు ఓడలో దుర్భర మరణము నొందిరి. రాజైన హెన్రీII పాలనలో ప్రొటెస్టంట్‌ల హింస తీవ్రరూపము ధరించెను. ఈ సమయము నుండి ఫ్రెంచ్ ప్రొటెస్టంట్‌లు హ్యుగెనాట్స్ అని పిలువబడిరి. వారు సమాజములుగా కూడుకొనిరి. ఫాన్స్‌లో దాదాపు ఇట్టి గుంపులు రెండు వేలదాక ఉండేవి. హింస కలిగిననూ వారి పక్షమున అధికారము గల ప్రముఖవ్యక్తులున్నందున వారి సంఖ్య విస్తరించెను. ఉదాహరణకు ఫ్రెంచ్ నౌకా సైన్యాధికారియైన గాస్పర్డ్ డి కాలిని, వారిని బలపరచు అనేకులలో ఒకడు. కాని రోమన్ క్యాథలిక్ వారు కూడా శక్తిమంతులైయుండిరి. వారు రాజు మరియు తన భవనము ద్వారా బలపరచబడి, యువరాజైన ఫ్రాన్సిస్ మరియు యువరాజైన హెన్రీ డి గైజ్‌లు వారి నాయకులుగా ఉండిరి.

హ్యుగెనాట్‌లను తుడిచివేయాలని రాజు కోరెను. దానికి స్పెయిన్ యొక్క ఫిలిప్II సహాయము చేయనైయున్నాడు. ఒకేమారు హ్యుగెనాట్‌లందరిని వారు కలసి నిర్మూలించాలని వ్యూహము పన్నిరి కాని అకస్మాత్తుగా ఫ్రెంచ్ రాజు మరణించడంతో ప్రభువు వారి ప్రణాళికలను అంతమొందించెను. హెన్రీ కుమారుడైన చార్లెస్ IX రాజైనప్పుడు పండ్రెండేళ్ల వయసు గలవాడు, ఈలోపు తన తల్లి రాజు ప్రతినిధిగానుండెను. ఆమె పేరు క్యాథరిన్ డి మెడిసి. ఆమె ఇటలీ రాజు గృహమునందు సభ్యురాలిగానుండెను మరియు దుష్టత్వము విషయములో ఆమె ప్రసిద్ధినొందెను. ఫ్రాన్స్ అందంతట హ్యుగెనాట్స్ మరియు రోమన్ క్యాథలిక్‌ల మధ్య విపరీత పోరాటము చెలరేగెను హ్యుగెనాట్స్ గాస్పర్డ్ డి కాలిని ద్వారా మరియు నావారే వాడైన హెన్రీలచే నడిపించబడిరి. ఇది ప్రజాయుద్ధము, మరియు ఇందులో చాలా రక్తపాతము జరిగెను అనేకులు ప్రాణములను కొల్పోయిరి.

కాని అకస్మాత్తుగా అంతయూ మారెను. వారు ఊహించనిది సంభవించెను. ఇరు పక్షములవారు సమ్మతించిరి, శాంతి ఒప్పందము కుదుర్చుకొనిరి, చార్లెస్IX మరియు కాలిని వాస్తవానికి స్నేహితులైరి! హ్యుగెనాట్స్ ఎంతో సంతసించిరి! ఎట్టకేలకు శాంతి నెలకొనెను...! అది క్రీ.శ.1572సం॥లో మరియు ప్యారిస్‌లోనికి ప్రజలు ప్రవహిస్తున్నారు. నావారే వాడైన హెన్రీ మరియు ఫ్రెంచ్ రాజు సహోదరియైన రోమన్ క్యాథలిక్ సిస్టర్ మార్గరైట్ మధ్యన "సమాధానమను వివాహము" జరుగనైయుండగా ఆ ఉత్సవము నిమిత్తమై వేల ప్రజలు ప్యారిస్‌కు తరలివచ్చిరి.ఈ వివాహము ఫలితముగా హ్యుగెనాట్స్ మరియు రోమన్ క్యాథలిక్‌ల మధ్యన నిజమైన సమాధానమున్నదని ప్రతియొక్కరికి స్పష్టమాయెను. దూర ప్రాంతములనుండి ప్రముఖులైన హ్యుగెనాట్స్‌లు వారి కుటుంబములతో ప్యారిస్‌కు వచ్చిరి. డి కాలిని మరియు రాజు ప్రతి దినము కూడుకొనిరి. వారిద్దరు తీవ్ర సంభాషణలు చేసికొనిరి. కాని డి కాలిని రాజ భవనమునుండి వెళ్తుండగా, క్యాథరిన్ డి మెడిసి తన కిటికీ ద్వారా ఆయనపై మోసయుక్త చూపులు విసిరెను... ఆగస్ట్ 18న వివాహము జరుపబడెను. ఆ మూడు రోజులు ప్రతియొక్కరు వివాహవేడుకలను ఆనందించిరి, ఆగస్ట్ 22న కాలిని రాజభవనమునుండి వెళ్ళుచుండగా అకస్మాత్తుగా తుపాకీ పేలెను.. పిరికి పంద వ్యవహారముతో ఆయనను హతమార్చు ప్రయత్నముచేసిరి గాని డి కాలినికి తన భుజమందు మాత్రమే గాయమునొందెను. హ్యుగెనాట స్‌లలో అనేకులు అనుమానించి నగరమును విడిచి వెళ్ళిరి



కాని చాలామంది ప్యారిస్‌లోనే ఉండిపోయిరి. దాడి జరిగిన తర్వాత డి కాలినిని దర్శించుట ద్వారా రాజు తన స్నేహభావమును కనబరచనట్లైతే...? చీకటి అలుముకొనెను. ప్యారిస్‌లో అంతయూ ప్రశాంతముగానుండెను. అకస్మాత్తుగా పిస్టల్ మోత వినబడెను. క్యాథరిన్ డి మెడిసి ఆజ్ఞచొప్పున ఇవ్వబడిన ప్రారంభ సూచన ఇది. మరియు ఇప్పుడు... భయంకరమైన అల్లకల్లోలము చెలరేగెను. ఎక్కడ చూసిన మనుష్యులు కత్తులు మరియు తుపాకులతో కనబడిరి. ఇదంతయూ జాగ్రత్తగా సిద్ధము చేయబడెను. ఎటుచూసినా తుపాకి మోతలే! తలుపులు ధ్వంసం చేయబడుతున్నవి. ప్రతిచోట మరణ రోదన కేకలు వినబడెను. రోమనిస్ట్‌లు హ్యుగెనాట్‌లను భయంకరముగా వధించిరి. ఈ "సంధి" ప్రయత్నము కేవలము నటన గానే అగుపించెను. జంతువులు వధింపబడినట్లు వేల కొలది స్త్రీలు, పురుషులు, పిల్లలు వధింపబడిరి. రాజు స్వయాన ఆయన భవనపు బాల్కనిలో నిలువబడి, వసారాలోనుంచొని తన సొంత ప్రజలను కాల్చి చంపెను.

ఆకాశములో అరుపులు కేకలు వినినప్పుడు డి కాలిని మేల్కొనెను. జరుగుచున్న సంగతిని ఆయన వెంటనే గ్రహించెను. ఆయన స్నేహితులు ఆతురతతో ఆయన గది యొద్దకు వచ్చెను. "నేను మరణించుటకు సిద్ధముగా నున్నాను" "నన్ను నేను దేవుని కరుణకు సమర్పించుకొనుచున్నాను" అని చెప్పిరి. కొద్ది క్షణముల పిమ్మట ఓ యౌవనస్థుడు డి కాలిని గదిలోనికి పరుగెత్తుకొనివచ్చి కత్తితో దూసి చంపెను. ఆయన శవము కిటికిలో నుండి పడవేయబడెను. హెన్రీ డి గైజ్ గుఱ్ఱముచే అది త్రొక్కబడెను. మరియు తరువాత వ్రేలాడదీయబడెను. ఈ ఘోర హింసాత్మక రాత్రి "భక్తుడైన బర్తలోమయి వధ" అని పిలువబడెను (ఎందుకంటే ఆ వధ ఆగస్ట్ 24న జరిగెను, అది బర్తలోమయి దినము) రోమాలో పోప్ గౌరవ పూర్వక బలిపూజ జరిపి దేవునికి కృతజ్ఞతలు చెల్లించెను. అదే సంవత్సరమందు చార్లెస్IX నికృష్టమైన మరణమునొందెను.

65. ఆగ్స్‌బర్గ్ మత శాంతి

సంఘస్కరణోద్యమము ప్రారంభమైన జర్మన్‌కు మనము వెళ్ళుచున్నాము. మనము 42వ అధ్యాయములో చూచిన ప్రకారము జర్మన్ విశాల దేశమైయుండి వేర్వేరు రాష్ట్రములు మరియు ఎలక్టొరేట్స్ అనబడు చిన్న రాష్ట్రములు కలిగియుండెను వారు ఎలక్టర్స్ ద్వారా పరిపాలన చేయబడేవారు. ఎలక్టర్స్ చక్రవర్తిని ఎన్నుకొనేవారు. ఈ చక్రవర్తి జర్మన్ అంతటిపై అధికారము కలిగియుండును.

సంఘసంస్కరణోద్యమ సమయములో చార్లెస్ V జర్మన్ సామ్రాజ్యమునకు చక్రవర్తియైయుండెను. తన సామ్రాజ్యమునందు ఒకే ఒక్క మతమును కలిగియుండాలని ఆశించెను. అదే రోమన్ క్యాథలిక్ మతము. చార్లెస్, లూథర్‌ను దోషిగానెంచి బహిష్కరించినా ప్రొటస్టంటిజమ్ నానాటికి బలపడుతున్నందున చార్లెస్ చాలా నిరుత్సాహపడెను. చాలామంది ఎలక్టర్స్ ప్రొటస్టెంట్‌లుగా మారిరి. ప్రాన్స్‌తో, టర్కుటతో పోరాడుటలో ఎలక్టర్స్ సహాయము అవసరము గనుక మొదట చక్రవర్తి వారిపై చర్యతీసికోలేదు. కాని తుదకు యుద్ధములన్నియు సమసిపోయెను, తన సామ్రాజ్యమునందు బలప్రయోగము చేసి ప్రొటస్టంటిజమ్‌ను అరికట్టేందుకు సమయముండెను. ప్రొటెస్టంట్ ఎలక్టర్‌లు వారికి కలుగబోయే ప్రమాదము గమనించి వారు ఒకరితోనొకరు ఒప్పందము చేసికొనిరి. ఒకరిపై దాడిజరిగితే తక్కిన వారు సహాయము చేయాలి.

ఇటలీ మరియు స్పెయిన్ సైన్యబలగముల సహాయముతో చార్లెస్ V ప్రొటెస్టంట్ ఎలక్టర్స్ సైన్యముతో యుద్ధమునకు వెళ్ళెను. కాని ఎలక్టర్‌లలో ఒకడైన సాక్సని వాడైన మౌరిస్ దేశద్రోహియై తన సైన్యముతో చక్రవర్తి యొద్దకు వెళ్ళి ఆయన సైన్యములో చేరెను. తత్ఫలితముగా,



చార్లెస్ అమోఘమైన విజయము పొందెను. ఆయన విజయోత్సవముతో ప్రయాణముచేసి చిన్నపట్టణమైన విటన్‌బర్గ్‌కు చేరుకొనెను. అక్కడ ఆయనకు లూథర్ సమాధి చూపబడెను. చార్లెస్ కొద్ది నిమిషములు నిలువబడి సమాధిని చూచెను. ఆయన సైన్యాధికారియైన అల్వ యుపరాజు, చక్రవర్తి ప్రక్కన ఉంటూ "మహాప్రభో, ఈ దుర్బోధకుని సమాధి త్రవ్వి ఎముకలు వెలికి తీసి వాటిని కాల్చివేయాలి" అని చెప్పెను. కాని చక్రవర్తి "కుదరదు" నేను చనిపోయినవారితోగాక బ్రదికిన వారితోనే యుద్ధము చేయుదును అనెను. తన దాసుని సమాధిని భద్రము చేయువాడు ప్రభువే...

సంఘసంస్కరణోద్యమము ప్రమాద పరిస్థితిలో ఉన్నది. ప్రతి ఒక్కరు రోమన్ క్యాథలిక్ సంఘమునకు తిరిగి రావలెనని చక్రవర్తి ఆజ్ఞాపించెను. కాని అనూహ్యముగా పరిస్థితి మారెను. చక్రవర్తి క్షేమముగా ఆఫ్రియన్ నగరమైన ఇన్స్‌బ్రక్ చేరుకొనెను. కాని ఇప్పుడు ఏమి జరుగుతున్నది? దేశద్రోహియైన సాక్సని వాడైన మౌరిస్ తన సైన్యముతోపాటు పక్షమును (సైడ్) మార్చెను. చక్రవర్తి తన బంధువులను ఇద్దరిని బంధించి వారిని విడుదలచేయుటకు నిరాకరించినందున ప్రొటెస్టెంట్ ఉద్యమమును బలపరచ ఎన్నుకొనెను. మౌరిస్ తన సైన్యముతో ఇన్స్‌బ్రక్ పట్టణముపైబడెను. చార్లెస్‌ను బంధింపవలెనని మౌరిస్ తలంచెను. కాని మౌరిస్ ప్రణాళికను చార్లెస్ కనుగొనెను. చార్లెస్ చాలా అనారోగ్యముగానున్నందున ఆల్ప్స్‌కు ఆయనను బలమైన వ్యక్తులు కొందరు ఓ ప్రత్యేకమైన కుర్చీలో మోసికొని వెళ్ళిరి. చక్రవర్తి ఆ విధముగా తప్పించుకొని పోయెను కాని ఒంటరివాడుగా చట్టమునకు దొరకకుండా పారిపోయెను!

తత్ఫలితముగా జర్మనీలో చార్లెస్ అధికారము తగ్గిపోయి ప్రొటెస్టెంటిజమ్ భద్రపరచబడెను. దేశపరిస్థితులు గర్విష్టియైన చక్రవర్తికి ఎదురుదెబ్బగా మారినందున తన సహోదరునితో సంప్రదింపులు ప్రారంభించెను. చార్లెస్V క్రుంగిన వ్యక్తి. తన జీవిత ఉద్దేశ్యమందు విఫలుడై తన సింహాసనమును వదలుకొనెను. మూడు సంవత్సరముల పిమ్మట చార్లెస్V స్పెయిన్ ఆశ్రమములో మరణించెను. ఆగ్స్ బర్గ్ నందు రెక్‌స్టాగ్ (పార్లమెంట్) సమావేశమాయెను. తన దేశములో ఏ మతము ఉండాలి అనే హక్కును పాలకుడు కలిగియుండునని నిర్ణయించిరి. ఆ నియమమేదనగా "పరిపాలకుడే మతమునెన్నుకొనును." ఒక ఎలక్టొరేట్‌లో ఎలక్టర్ రోమన్ క్యాథలిక్‌గా ఉంటే అందులో రోమన్ క్యాథలిక్ మతము అనుమతింపబడును. కాని ఒకవేళ ప్రొటెస్టంట్ ఎలక్టర్ గవర్నర్‌గా ఉంటే ఆ ఎలక్టరేట్‌లో ప్రొటెస్టెంట్ విశ్వాసము ఆచరింపబడును. ఒకవేళ ప్రజలు ఆ పాలకుని మతమందు యిష్టపడనట్లైతే వారు మరొక ప్రాంతమునకు అనగా ఎటువంటి హింస లేక నిరభ్యంతరముగా తమ విశ్వాసమును అభ్యాసము చేసికోదగిన ప్రాంతమునకు వెళ్ళుటకు స్వేచ్ఛకలిగియుందురు.


క్రీ.శ1555సం॥లో ఒక ప్రతిపాదన డాక్యుమెంట్ రూపములో చేయబడెను. దానిపేరు "ఆగ్స్‌బర్గ్ మత శాంతి". జర్మనిలో ప్రభువు ప్రొటెస్టంట్ విశ్వాసమునకు విడుదలనిచ్చెను. కష్ట సంవత్సరములు రానైయున్నవి కాని అవి రాక మునుపు ప్రభువు తన సంఘమునకు ఓ మంచి ప్రాముఖ్యమైన బహుమానము నీయనైయున్నాడు.

66. హైడెల్ బర్గ్ కాటకిజమ్

ఇప్పుడు జర్మనీలో నెమ్మది మరియు ప్రశాంతత ఉన్నవి. హింస ఎట్టకేలకు ఆగిపోయెను. కాని జర్మన్ ప్రొటెస్టంట్‌లలో సమాధానము లేదు. విభజన, బేధాభి ప్రాయములు ఎక్కువయ్యెను – ప్రత్యేకముగా లూథర్ మరణించినందున. లూథర్ ఇంకను తప్పుడు సిద్ధాంతములు చేపట్టినట్లు 51వ అధ్యాయములో మనము చూచితిమి. వాటిలో అతి ప్రాముఖ్యమైనది, ప్రభురాత్రి భోజన విషయమైన తన బోధ. ఈ విషయమైన లూథర్ బోధ కాన్ సబ్‌స్టాన్సియేషన్ అని పిలువబడెను.

జెనీవాలో పనిచేసిన కాల్విన్ ఈ విషయమై లూథర్‌తో సమ్మతింపలేదు. జర్మన్‌లోని ప్రొటెస్టంట్‌లు లూథర్ అనుచరులు గనుక వారు లూథరన్‌లు అని పిలువబడిరి. కాని క్రమేపి కాల్విన్ బోధలు జర్మన్‌లో కూడా వ్యాపించెను. అనేకులు కాల్విన్ బోధలను అనుసరింప ప్రారంభించిరి. కాల్విన్ అనుచరులు కాల్వినిస్ట్‌లని పిలువబడిరి. కాల్విన్ బోధలు పిలువబడినట్లు, రిఫామ్డ్ థియాలజీని బలపరచునట్లు ఆ పేరుతో పిలువబడెను. ఇప్పుడు జర్మనీలో రెండు వేర్వేరు గుంపులవుతున్నవి, మరియు వారి మధ్యన తీవ్రవాదనలు జరుగుచుండెను. అన్నింటికంటే ముఖ్యముగా మూర్ఖత్వము కూడా ఉండెను. నిజ బైబిల్ సిద్ధాంత విషయములో ప్రజలకు స్పష్టమైన సరళ హెచ్చరిక కావాలి. ఫ్రెడ్రిక్ III దీనిని తన బాధ్యతగా చూచెను. పలటినేట్ అను ఎలక్టోరేట్‌కు ఆయన ఎలక్టర్‌గా నుండెను.

ఫ్రెడ్రిక్ ప్రభువునకు భయపడువాడు మరియు రిఫామ్డ్ సిద్ధాంతమును బలపరచువాడు. తాను ఎలక్టర్‌గా నియమించబడిన వెంటనే, తన సంస్థానములో రిఫామ్డ్ బోధల వ్యాప్తిని ప్రొత్సహించెను, అలా చేయుటలో ఆయన



జాన్ కాల్విన్ సిద్ధాంతమును అనుసరించెను. యౌవనులకు మరియు వృద్ధులకు ఆరోగ్యదాయకమైన సిద్ధాంతము కావాలి గనుక ఈ ఉద్దేశ్యము నిమిత్తమై ఓ మంచి స్పష్టమైన పాఠ్యపుస్తకమును సంకలనము చేయించే పనికి పూనుకొనెను. అటువంటి పుస్తకమును కలిగియుండుట చాలా ముఖ్యము, తన మనసులో ఉన్న పుస్తకమును కూర్పు చేయుటకై ఆ పనిని ఫ్రెడ్రిక్ జెకరియస్ ఉర్సినస్ మరియు కాస్పర్ ఒలేవియనస్ అను థియాలాజియన్‌లకు (దేవజ్ఞానశాస్త్రవేతలు) అప్పగించెను. ఒకరి వయసు ఇరవై ఆరు మరొకరి వయసు ఇరవై ఎనిమిది సంవత్సరములుండెను. లూథర్ స్నేహితుడైన మోలాంక్‌థన్ నేతృత్వములో విటన్ బర్గ్‌లో ఉర్సినస్ అధ్యయనము చేసెను. ఒలేవియానస్ కాల్విన్‌చే బోధింపబడి జెనీవాలోని అకాడమిలో అధ్యయనము చేసెను. ఇరువురు (జెకరియస్ ఉర్సినస్ మరియు కాస్పర్ ఒలేవియనస్) హీడెల్ బర్గ్ విశ్వ విద్యాలయమునందు ప్రొఫెసర్లుగా పనిచేసిరి. (హిడెల్‌బర్గ్ పలాటినేట్‌కు ముఖ్యనగరముగా నుండెను) వారు సమర్థవంతులైన పండితులుగా నుండేవారు అంతకంటే ముఖ్యముగా వారు ప్రభువునకు భయపడువారు.

వీరిద్దరు కలసి పనిచేసి ప్రశ్నోత్తరిని కూర్పు చేసిరి. క్రైస్తవ సిద్ధాంత ప్రశ్నోత్తరిని క్యాటకిజమ్ అందురు. ప్రశ్న మరియు జవాబు రూపములో బోధింపబడును. నేటి ప్రజలు కూడా ఆశ్చర్యపడేలా బైబిల్ ఆధారముగా ఖచ్చితముగా ప్రశ్నోత్తరి పొందుపరచబడెను. ఈ పుస్తకమును సంకలనము చేయుటలో గ్రంథకర్తలు పరిశుద్ధాత్మునిచే నడిపింపబడిరనుట స్పష్టముగా కనబడును.

స్వయాన ఎలక్టర్ ఈ పుస్తకమునకు పీఠిక వ్రాసెను. క్రీ.శ. 1563లో హీడెల్ బర్గ్‌లోని సభ ప్రశ్నోత్తరిని ఆమోదింపగా అది ముద్రింపబడెను. మొదట అది జర్మన్ మరియు లాటిన్ భాషలలో ముద్రింపబడెను. గ్రంథకర్తలు హీడెన్‌బర్గ్ నగరమునందు నివసించినందున దానికి హీడెన్‌బర్గ్ క్యాటకిజమ్ (ప్రశ్నోత్తరి) అని పేరు వచ్చెను. ఈ గ్రంథము వారు వీరు అనిలేక అందరిపై గొప్ప ప్రభావమును చూపెను. రోమన్ క్యాథలిక్ వారు, విచారకరముగా లూథరన్‌లు కూడా దీనిని వదిలించుకునేందుకు విషమప్రయత్నములు చేయుచున్నారు. ఆగ్స్‌బర్గ్‌లోని సంఘచట్ట సభయెదుట ఎలక్టర్ హాజరు కావలసివచ్చెను. తడుముకోక సందేహింపక ఫ్రెడ్రిక్ ధైర్యముగా ప్రశ్నోత్తరిలో వ్యక్తము చేయబడిన బైబిల్ బోధలను సమర్థించెను. శత్రువుల నోరు మూయబడి తన పాలిత ప్రాంతములో ప్రశ్నోత్తరిని వాడుటకు అనుమతింపబడెను. సత్యము విజయవంతముగా పెల్లుబుకులాగున ప్రభువే చూచుకొనెను.

వెంటనే ప్రశోత్తరి అనేక భాషలలోనికి అనువదింపబడి వివిధ దేశములలో వ్యాప్తిచేయబడెను. అది సంఘము మరియు పాఠశాలయందు బోధనాంశముగా వాడబడెను. ఎలక్టర్ యొక్క చాప్లిన్ అయిన డా థెనస్, ప్రశ్నోత్తరిని డచ్ భాషలోనికి అనువదించెను. అది సాధారణముగా డచ్ కీర్తనల పుస్తకము వెనుక ముద్రింపబడియుండును. దాని భావమేమిటంటే, ప్రతి ఆదివారము ప్రశ్నోత్తరిలోని ఒక్కొక భాగముపై ప్రసంగములు చేయబడాలి. ఆ పుస్తకము ఒక సంవత్సరమునకు సరిపడులాగున యాభైరెండు భాగములుగా విభజింపబడెను. మన పాపము మరియు మన స్థితి ఎంత నికృష్టమైనదో మనము ఈ రెంటినుండి ఎలా విడిపింపబడగలమో ప్రశ్నోత్తరి బోధించును. ఈ విడుదల నిమిత్తమై దేవునికి కృతజ్ఞతలు ఎలా చెల్లింపవచ్చునో కూడా అది బోధించును. క్లుప్తముగా చెప్పాలంటే దేవుని ఎదుట మన పాప స్థితి, దానినుండి దేవునిచే విడిపింపబడుట మరియు ఆ విడుదలకొరకై మన కృతజ్ఞత మున్నగు వాటిని గూర్చి ప్రశ్నోత్తరి బోధించును.

తరువాత డచ్ విశ్వాసపు ఒప్పుకోలులో ప్రశ్నోత్తరి ఎంత ప్రాముఖ్యముగా మారెనో మనము గమనించెదము. ఐక్యత యొక్క మూడు రూపములలో ఇది ఒక్కటి (రిపామ్డ్ థియాలజిని అనుసరించు దాదాపు అన్ని సంఘములు అంగీకరించిన మూడు విశ్వాసపు ఒప్పుకోలులు). "మరణము మరియు జీవమునందు నీ ఏకైక నిరీక్షణ ఏది? అను విషయముతో ప్రశ్నోత్తరి ప్రారంభమగును. ఇది అనేక మంది ప్రజలకు ఆదరణ కలిగించెను. నేటి వరకును ఆదరించుచున్నది. ప్రశ్నోత్తరి దేవునినుండి వచ్చిన బహుమానము అది బహువిలువైనది!

67. ఉత్తర సింహం - గుస్తావస్ అడల్ఫస్

ఆగ్స్‌బర్గ్ యొక్క మత శాంతిని బట్టి చాలా కాలము పాటు జర్మనీలో అంతయూ సవ్యముగా ఉండెను. కాని దాదాపు యాభై సంవత్సరముల తర్వాత సమస్తము మారెను. సంఘసంస్కరణ ఉద్యమము మరియు వ్యతిరేక సంఘసంస్కరణ మధ్యన ఎంతగా మంటలు చెలరేగెనంటే జర్మనీ యందంతట విధ్వంసము, దరిద్రత, నాశనము మరియు ఎడబాటు ఒక వరదలవలె వచ్చిపడెను.

క్రీ.శ.1619లో ఫెర్డినండ్ అను ఆస్ట్రియన్ ఆర్చ్‌డ్యూక్ జర్మనీకి చక్రవర్తి ఆయెను. ఐదు సంవత్సరముల పాటు సింహాసనమును అధిష్టించాక అధికారము అనుభవించినవాడై ఆ దేశ ప్రజలతో ఇలా చెప్పెను. "రోమన్ క్యాథలిక్ బలిపూజకు అందరు హాజరవ్వండి లేదా దేశమును విడచి వెళ్ళండి".

జర్మని సామ్రాజ్యంలోని రెండు రాష్ట్రాలైన బొహిమియా మరియు పలాటినేట్‌లో ఘోర సంగతులు సంభవించెను. ప్రొటెస్టెంట్ వ్యవస్థ అధికముగా అణచివేయబడుచుండెను. సంఘములు మూసివేయబడెను. మరియు భవనములు నాశనము చేయబడెను. కూడికలు నిషేధింపబడెను మరియు అనేకులు క్రూరముగా చంపబడిరి.

పలాటినేట్‌లోని నగరమైన హీడెల్‌బర్గ్‌నందు కాల్వినిజమ్ వర్థిల్లెను (66 వ అధ్యాయము చూడుము). ఆ హీడెల్‌బర్గ్ నగరము కొల్ల గొట్టబడెను. హీడెల్‌బర్గ్ యూనివర్సిటినుండి జెజ్విట్‌లు విలువైన పుస్తకములను యాభై బండ్లనిండ నింపి రోమ్‌కు పంపిరి. ఇది జెజ్విట్ల పనేనా? అవును, ఇది నిశ్చయముగా వారు చేసిన పనే. ఎందుకంటే ప్రొటెస్టెంట్ విధానమును పూర్తిగా సమూల నాశనము చేయాలని వారు నిర్ణయించుకొనిరి. ఈ జెజ్విట్లే చక్రవర్తికి సలహాదారులు.

జర్మన్ ప్రొటెస్టెంట్‌లకివ్వబడినదంతయూ తిరిగి రోమన్ క్యాథలిక్ సంఘమునకివ్వవలెనని చక్రవర్తియైన ఫెర్డినండ్ ఆజ్ఞ జారీచేసెను. రోమ్ మరియు జెజ్విట్‌లు సంతోషముతో కేకలు వేసిరి! సంఘసంస్కరణ ఉద్యమము శాశ్వతముగా ఆపివేయబడునేమో అన్నట్టుగా ఉండెను. చర్యతీసికొనుటకు ధైర్యము చాలక ప్రొటెస్టెంట్ ఎలెక్టర్‌ల మధ్యన విభజన ఏర్పడెను. జర్మనిలో దేవుని పని పూర్తిగా నాశనము చయబడబోతుందా?

"మన దేవుడింకను బలమైన కోటగానున్నాడు" లూథర్ కీర్తనలలోని పదములను వేలకొలదిగా స్వరములు కలిపి పాడిరి. ఉత్తర జర్మనిలోని బాల్టిక్ సముద్రపు కొనభాగాన సైనికులు మరియు నావికులు నిలువబడి పాడిరి. ఓ పెద్ద సైన్యసమూహము పడవ ద్వారా తీరము చేరనున్నది. ఈ సైన్యము ఉత్తర ఐరోపాలోని లూథరన్ విశ్వాసమును పాటించు స్వీడెన్ నుండి వచ్చెను.

వారి రాజైన గుస్తావస్ అడల్ఫస్ కూడ స్వయానవచ్చెను. ఆయన దేవునికి భయపడి జర్మనీలో తోటి విశ్వాసుల శ్రమలలో పాలుపుచ్చుకొనెను మరియు వారితో ఏకీభవించెను. ఆయన పదమూడువేల మంది సైనికులతో వారికి సహాయము చేయుటకై వచ్చెను. తన శక్తి, సామర్థ్యములపై ఆధారపడనని గస్తావుస్ తీరము చేరకమునుపే చెప్పెను. ఆయన దీనిని వారికి స్పష్టము చేసెను. ఆయన మోకాళ్ళపై పడి సురక్షితముగా చేరుకున్నందుకు దేవునికి కృతజ్ఞతలు చెల్లించెను.

స్వీడెన్ దేశపు సైన్యము చాలా క్రమశిక్షణగల సంఘము. ఒక్కొక్క సైన్య విభాగమునకు ఒక్కో చాప్లిన్ ఉండేవాడు మరియు వారు ప్రతిరోజు కూడుకొని ప్రార్థన చేసి ప్రసంగమును వినేవారు. హత్యచేయుటకు సైనికులకు అనుమతిలేదు మరియు వారు ఏ రూపములోనూ దోచుకొనకూడదు. శపించుట మరియు అబద్ధప్రమాణము చేయుట ఖచ్చితముగా నిషేధింపబడెను. చక్రవర్తియైన ఫెర్డినండ్ భయముచెందలేదు. ఆయన సైన్యము చాలా పెద్దది మరియు బలమైనది. "చల్లని ఉత్తరమునుండి మంచు రాజు దక్షిణమునకు రానివ్వండి" "ఆయన మంచు త్వరలో కరిగిపోవును" అని వెటకారముగా చెప్పెను.

కాని త్వరలో ఫెర్డినండ్ వ్యంగ్యము అంతమొందింపబడెను. చక్రవర్తి సైన్యాధికారి టిల్లి. భయంకరమైన శత్రువని ఆయనను గెలుచుట అసాధ్యమని అందరికి తెలిసిన సత్యము. ఆయన ఎన్నడునూ ఓడిపోలేదు! ప్రొటెస్టెంట్ ఎలెక్టర్స్ టిల్లికి భయపడి గుస్తావస్ అడల్ఫస్‌కు సహాయము చేయుటకై సాహసింపలేదు. కాని స్వీడెన్ సైనికులు సింహములవలె పోరాడి టిల్లి చేతుల్లోనుండి నగరమును తీసికొనిరి. ఆ పట్టణమును విడిచి వెళ్ళకమునుపు తన సైన్యము దోచుకొనుటకై హత్య చేయుటకై అనుమతించెను తత్ఫలితముగా అనేకులు తమ ప్రాణములను కోల్పోయిరి. మాగ్‌డిబర్గ్ నగరంలోనే ముప్పైవేలమంది హతులైరి.



దేవుని సంఘము నిశ్చయముగా ఎంతో తీవ్రశ్రమనొందెను.

రెండు బలమైన సైన్యములు నిలువబడి ఒకదానితో ఒకటి పోరాటము సలిపెను, కాని మహాయుద్ధము ప్రారంభము కాక మునుపు గుస్టావస్ తన సైన్యము ఎదుట నుంచొని దేవుని సహాయము, బలమునకై ప్రార్థించెను. బూరలు ఊదబడగా "మన దేవుడింకను బలమైన కోట" అనుపాట మారు మ్రోగెను. అప్పుడు ఘోరయుద్ధము మొదలయ్యెను. టిల్లి నిస్సహాయుడై రౌద్రముతో, తన సైనికులు తుదకు పారిపోవుట చూచి శపించెను. ఓటమి నెరుగనివాడు, ముప్పై ఆరు యుద్ధములు గెలిచిన వాడు, ఇప్పుడు ఓడింపబడెను. మరొకసారి గుస్టావస్ తలవంచి అద్భుత విజయమునకై దేవునికి కృతజ్ఞతలు చెల్లించెను. ఇప్పుడు జర్మని స్వీడెన్ సైన్యమును స్వాగతించెను. ఒక నగరము తర్వాత మరొక నగరము లోపరచుకొనబడెను. కాని కొన్ని సంవత్సరముల తర్వాత వారు ఎంతో నష్టపోయిరి ఉత్తర సింహమైన గుస్టావస్ అడల్ఫస్ మరణించెను. ఆయన వయసు కేవలము ముప్పై ఏడు సంవత్సరములు.

యుద్ధము సంవత్సరముల తరబడి కొనసాగెను. అది ముప్పైయేండ్ల యుద్ధము మరియు పోరాట సమయమని పిలువబడెను. అందులో కోట్లాది ప్రజలు నశించిరి. క్రీ.శ. 1648లో యుద్ధము ముగిసేసరికి జర్మనీ దారిద్ర్యముతో నిండియుండి పతనదశలో ఉండెను. కాని దీనికి అతీతముగా, ప్రొటెస్టెంట్ విధానము నాశనము చేయబడలేదు. తన సంఘమును కాచి కాపాడువాడు ప్రభువే!

68. నెదర్లాండ్స్‌కు సంఘసంస్కరణ ఉద్యమము వచ్చెను

అంట్‌వర్ప్ సముద్రపు ఓడరేవు దక్షిణ నెదర్లాండ్స్ నందు కలదు. ఈ నగరములోనే డచ్ సంఘసంస్కరణ మొదట ప్రారంభమయ్యెను. ప్రస్తుతము బెల్జియమ్‌చే ఆక్రమింపబడిన భాగము నెదర్లాండ్స్‌తో కలిసియుండెను.

క్రీ.శ.1517 లో లూథర్ రచనలు డచ్ భాషలోనికి అనువదింపబడెను. మీకు గుర్తుండియుండవచ్చు, క్రీ.శ.1517 లో మార్టిన్ లూథర్ విట్టెన్‌బర్గ్‌నందలి సంఘద్వారమునకు 95 థీసిస్ దిగగొట్టెను. ఆయన రచనలు వేలకొలది పంపిణీ చేయబడెను. మరియు అనేకులు వాటిని చదివిరి. కాల్విన్ పుస్తకములు కూడ వ్యాప్తిలో ఉండెను, అందువలన డచ్‌ప్రజలు అనేకులు కాల్వినిజమ్ వైపు మళ్ళిరి. నేటి ప్రొటెస్టెంట్ విధానము దాదాపు కాల్వినిజమ్ మూలము కలిగియున్నది.

అంట్‌వర్ప్ నగరములో ఒక ప్రింటర్ ఉండెను. ఆయన పేరు జేకబ్ వాన్ లీస్‌వెల్ట్. ఆయన క్రీ.శ. 1525లో డచ్ భాషలో బైబిల్‌ని అందుబాటులోనికి తెచ్చెను. అది లూథర్ యొక్క జర్మన్ బైబిల్‌కు అనువాదము. దానిని లీస్‌వెల్ట్ బైబిల్ అని అందురు. అందుచేత అంట్‌వర్ప్ సంఘసంస్కరణ ఉద్యమమునకు కేంద్రమై అక్కడినుండి తక్కిన నెదర్లాండ్స్ అంతట విస్తరించెను.

కాని చార్లెస్V జర్మనీ చక్రవర్తియైయుండి మరియు స్పెయిన్ రాజైయుండి నెదర్లాండ్స్‌ను పాలించుచుండెను. క్రీ.శ.1521లో డైయట్ ఆఫ్ వార్మ్స్ నందు లూథర్‌ను బహిష్కరించాక, లూథర్ రచనలను ముద్రించుట మరియు వాటిని పంపిణీచేయుట, చదువుటను చార్లెస్ నిషేధించెను. ఈ నిషేధ ఆజ్ఞ లీస్‌వెల్ట్ బైబిల్‌కునూ వర్తించెను. లీస్ వెల్ట్ బైబిల్ చిన్న చిన్న భాగములుగా విభజింపబడెను. అనేకులు ఆ భాగములను కొనిరి.

జర్మనీ ప్రొటెస్టెంట్ ఎలక్టర్‌ల ద్వారా చార్లెస్ వ్యతిరేకతను ఎదుర్కొనెనని మనకిదివరకే తెలియును. కాని నెదర్లాండ్‌లో తనకిష్టము వచ్చినట్లు ఆయన చేయవచ్చును. ఇక్కడ కూడ త్వరలోనే హింస చెలరేగెను. క్రీ.శ. 1522 లో నెదర్లాండ్స్‌లోని దుర్బోధకులను (ప్రొటెస్టెంట్‌లను) వెంటాడుటకై మతన్యాయస్థానములు వచ్చెను.


ఇదంతయూ అంట్‌వర్ప్‌లోని అగస్టీనియన్ సన్యాస ఆశ్రమమందు మొదలయ్యెను. స్వయాన లూథర్ అగస్టీన్ సన్యాస ధర్మములో సభ్యునిగా ఉండెను. ఆ నగరములో క్షమాపత్రముల అమ్మకము జోరుగా సాగుచుండెను. దాని విషయమై లూథర్ స్నేహితుడు మరియు అనుచరుడైన హెండ్రిక్‌వాన్ జుట్‌ఫెన్ ప్రజలను హెచ్చరించెను. ఆయన బోధలు వినుటకై ప్రజలు నలుమూలలనుండి వచ్చిరి. కాని శత్రువులు సన్యాస ఆశ్రమముపైబడి దానిని నేలమట్టము చేసిరి! సన్యాసులనేకులు తప్పించుకొనిరి కాని ముగ్గురు బంధింపబడిరి.

చెరలోని ఇద్దరు సన్యాసులకు బహిరంగముగా శిరచ్ఛేదన చేయుబడవలసియున్నది. వారెవరనగా, హెండ్రిక్ వోస్ మరియు జాన్ వాన్ ఎస్సెన్. శిరచ్ఛేదన స్థలము బ్రస్సెల్స్ ముఖ్యనగరము. సంతవీధిలో కట్టెలుపేర్చబడియున్నవి. దహించుటకై ఆ ఇద్దరు సన్యాసులను తెచ్చిరి. జరుగబోవునది చూచుటకై ప్రజలు అనేకులు చేరివచ్చిరి. సన్యాసుల స్థితి సరిగా లేదు.

నెలల తరబడి వారు మురికి చీకటి బిలములో బంధింపబడియుండిరి. వారి చెర సమయంలో ఈ సన్యాసులను రోమన్ క్యాథిలిక్ మతములోనికి మరల్చే ప్రయత్నముచేసిరిగాని వారి ప్రయత్నము ఫలించలేదు.

గనుక మరణ శాసనము జారీ చేయబడినది. అగ్నిచేత మరణం! కాని ఈ సన్యాసులు మొదట మతగురువు స్థానమునుండి తొలగింపబడవలెను. దీనిని డీ ఫ్రాక్డ్ అందురు. వారి ఒంటినుండి సన్యాస వస్త్రములను ఒక్కొక్కటి తీసి చింపివేసిరి అటుపిమ్మట పేర్చబడిన కట్టెలయొద్దకు తీసికొనిపోబడిరి.

మంటలు పైకి ఎగసి చెలరేగుతుండగా ఈ ఇద్దరు వ్యక్తులు పాటలు పాడుటను వినిరి. ఫెళఫెళమని మంటలు చెలరేగుతుండగా వాటికి పైపైన "ఓ దేవా! మిమ్మును స్తుతించుచున్నాము, మీ నామమును స్తుతించుచున్నాము" అను హతసాక్షుల పాటలు బిగ్గరగా వినబడెను. తుదకు వారి స్వరము వినిపించలేదు. పొగచేత కాలి మసిబొగ్గైపోయిరి. వీరు దక్షిణ నెదర్లాండ్స్‌లో మొదటి క్రైస్తవ హతసాక్షులుగా మరణించిరి. వారు మరణమువరకు నమ్మకముగా ఉండిరి.



త్వరలోనే క్రీ.శ.1525 తర్వాత నెదర్లాండ్స్ యొక్క మొదటి హతసాక్షి కూడా చంపబడెను. ఆయన వోర్డెన్ నుండి వచ్చిన మతగురువు ఆయన పేరు పిస్టోరియస్. ఆయన కూడ లూథర్‌ను గూర్చి వినెను. ఆయన పుస్తకములు చదివెను పిమ్మట విట్టెన్‌బర్గ్‌కు ప్రయాణమయ్యెను. ఆయన అక్కడ లూథర్‌ను కలిసెను. ఆయన ఇంటికి తిరిగి వచ్చాక, జాన్ పిస్టోరియస్ మత గురువుగానుండుటకు ఇష్టపడలేదు. ఇక ఇప్పటి గుంపులుగా చేరిన వారికి బోధచేయటము ప్రారంభించెను.

నిజసువార్త సందేశము ప్రకటిస్తూ ఆయన ఇంటింటికి వెళ్ళెను. ఆయన బేకర్‌గా బేకరి వస్తువులైన బ్రెడ్, కేక్ తయారు చేస్తూ జీవనోపాధి సంపాదించుచుండెను. అందుకే ఆయన జాన్ డి బక్కర్ (జాన్ ద బేకర్) అని పిలువబడెను. కాని ఆయన ఉండుస్థలమును మతన్యాయస్థానము కనుగొనెను. ఆయన హగ్యులోని గివాంగెన్‌పోర్ట్ చెరసాల యందుంచబడెను. ఆయన చెరలో ఉన్న నెలలు వర్ణింపశక్యము కానివి. ఆయనను హింసించు హింసకులు తన భార్యను పిల్లలను జ్ఞాపకము చేసి లొంగదీసికునే ప్రయత్నము చేసిరి. వాస్తవమే జాన్ తన భార్య పిల్లలను ప్రేమించెను, కాని అందరికంటే ప్రభువును అధికముగా ప్రేమించెను. బహుశ వృద్ధుడైన తన తండ్రి విశ్వాస పరిత్యాగము చేయమని బలవంతము చేసియుంటాడు. కాని తన తండ్రియూ కుమారుని ప్రభువు నిమిత్తమై త్యాగము చేయుటకై సిద్ధముగా నుండెను.

"అలాగైతే ఈ దుర్బోధకుని చంపండి" అని తన శత్రువులు కోపముతో ఉరుముతూ చెప్పిన మాటలను జాన్ వినెను. జాన్ డి బేకర్ సజీవ దహనము చేయబడబోతున్నాడు. ఆయన చుట్టూ మంటలు ఆవరించుచుండగా" ఓ మరణమా నీ ముల్లెక్కడ" అని ఆయన అరచుట ప్రజలు వినిరి. ఆయన మరణించుటకు భయపడలేదు. "ప్రభువైన యేసూ, వీరు చేసిన దానిని క్షమించుము ప్రభువైన యేసూ, నన్ను జ్ఞాపకము చేసికొనుము" అని ఆయన మాటలు మారుమ్రోగెను. తుదకు భూమిమీద ఆయన స్వరము మౌనమాయెను కాని పరలోకమందు తన రాజును నిత్యము స్తుతించును!

69. నెదర్లాండ్స్... హింస మరియు విడుదల

మత న్యాయస్థానము దుర్బోధకులను (ప్రొటెస్టెంట్‌లను) హింసించుట ఆగక సాగెను. క్రీ.శ. 1527లో వెండెల్‌మెట్ అని పిలువబడు మొన్నికెండెమ్ నివాసియైన ఒక స్త్రీ బైబిల్ చదివినందుకు చెరసాలలో వేయబడెను. ఆమె దుర్బోధకురాలివలె (ప్రొటెస్టెంట్‌గా) దహించి వేయబడెను.

డెన్ బ్రియల్‌కు సమీపముననున్న గ్రామములోని వృద్ధుడైన ఓ మతగురువు భిన్న బోధలు చేసెను. యేసుమాత్రమే రక్షకుడని ఆయన ప్రకటించెను. అది ఆయన ప్రాణమునకు ముప్పు తెచ్చిపెట్టెను. పరిస్థితులు మరింత గడ్డుగా మారెను. ఎవరి కుటుంబములోనైనా బైబిల్ కనబడితే కుటుంబమంతయు చెరసాలలో వేయబడి తుదకు చంపబడిరి. అనేకులు ఉరితీయబడిరి, సజీవ సమాధి చేయబడిరి లేదా నీళ్ళతో నింపబడిన గొట్టములో ముంచబడిరి. అమాయకులనేకులు చంపబడిరి.

క్రీ.శ. 1561, నవంబర్ 1వ తేదినాడు అంతయూ చీకటిగానుండెను. ఆ జిల్లా పర్యవేక్షణ చేయు గవర్నర్ బెల్జియమ్‌లోని టూర్నిక్‌లో తన రాజమందిరములో ఉండెను. రాజమందిరము వెలుపల ఒక వ్యక్తి గోడవైపు నడుచుచున్నాడు. ఆయన అక్కడికి రాగానే ఆ గోడ అవతలికి ఒక ప్యాకెట్ విసిరి వేసెను. మరుసటి ఉదయమున ఆ ప్యాకెట్ దొరికెను. అందులో చిన్న పుస్తకము మరియు ఫిలిప్II ను ఉద్దేశించి వ్రాసిన ఉత్తరము ఉండెను. ఫిలిప్II స్పెయిన్ రాజైయుండి నెదర్లాండ్స్‌పై కూడ పాలన చేయుచుండెను. క్రీ.శ. 1555లో తన తండ్రియైన ఫిలిప్V తరువాత ఈయన రాజాయెను. ప్రొటెస్టెంట్ విధానమును పూర్తిగా తుడిచి వేయవలెనని ఫిలిప్II కూడ ఆశించెను.

దొరికిన ప్యాకిట్ స్పెయిన్‌లోని ఫిలిప్‌కు పంపబడెను. ఆ పార్సిల్‌లో దొరికిన చిన్న పుస్తకము విశ్వాసపు ఒప్పుకోలును గూర్చినది. జెనివాలోని యూనివర్సిటిలో కాల్విన్ ఆధ్వర్యములో గ్యూడోడి బ్రెస్ అను వ్యక్తిచే ఆ పుస్తకము కూర్పు చేయబడెను. అతను ఈ పుస్తకంలో వ్రాయుట ద్వారా ప్రొటెస్టాంట్‌లు నిజముగా ఎలాంటివారైయున్నారో రాజునకు అతను చూపించాలని ఆశించెను. ఎందుకనగా, అనబాప్టీస్టులు ప్రభుత్వమును రూపు మాపాలని ఆశించిన విధముగా ప్రొటెస్టాంట్‌లుకూడా తిరుగుబాటు చేయు ప్రజలని రాజు భావించాడు. రాజునకు కూడా వారి విశ్వాసమును గూర్చి తెలుపుట అవసరమైయున్నది. ఎందుకనగా రాజుకు తప్పుడు సమాచారం ఇవ్వబడినది....! తాను అతని పుస్తకమును మరియు ఉత్తరమును చదివినప్పుడు రాజు మిక్కిలి కోపగ్రస్తుడాయెను. అతడు, ఈ చిన్న పుస్తకమును వ్రాయుటకు కారకుడైన వానిని పట్టుకొనమని ఆజ్ఞను జారి చేసెను! విచారముగా, ఆరు సంవత్సరముల తర్వాత గ్యూడో డి బ్రెస్ దొరికెను. అతడు పట్టబడి స్కెల్డ్‌పై ఉరితీయబడెను.

గ్యూడో డి బ్రెస్‌చే వ్రాయబడిన విశ్వాసపు ఒప్పుకోలు (ముప్పై ఏడు శీర్షికలతో సమకూర్చబడినది) ప్రస్తుతము కూడా ఉపయోగపడుతుంది. అది సంఘ సంస్కరణ సిద్ధాంతములను సులువుగా అర్థం చేసుకునే విధముగా వివరించును. తర్వాత అది నెదర్‌లాండ్స్‌లోని ప్రాముఖ్యమైన విశ్వాసపు ఒప్పుకోలులలో ఒకటిగా మారెను. అది "మూడు విధములైన ఐక్యత"లో ఒక డాక్యుమెంట్‌గా చేర్చబడెను.

కాల్వినిజమ్ ఘోర వ్యతిరేకతను ఎదుర్కొంటూ కూడా అభివృద్ధి చెందెను. కాని కేవలం కాల్వినిజం మాత్రమే ఎదగలేదు. రెసిస్‌టెన్స్ ఉద్యమము కూడా నెదర్‌లాండ్స్‌లో మొదలాయెను. ప్రత్యేకముగా, ఫిలిప్ తన జనరల్ అల్వాను దేశమునకు పంపినపుడు అల్వా అనేకమంది ప్రొటెస్టాంట్‌లను చంపెను మరియు కాల్వినిస్టిక్ పట్టణములలో నివశించు ప్రజలను వధించెను.

అద్భుతముగా, దేవుడు ప్రొటెస్టాంట్‌ల పక్షమున మాట్లాడుటకు ఒక వ్యక్తిని పంపెను. అది గొప్ప రాకుమారుడైన ఆరెంజ్ యొక్క విల్లెమ్, హైలెండ్, జీలాండ్ మరియు ఉట్రెక్ట్. చక్రవర్తియైన విల్లెమ్ బ్రసెల్స్‌లోని రాజభవనములో రోమన్ క్యాథలిక్ విధానమందు పెంచబడినా, క్రీ.శ. 1566లో ఆయన రోమన్ క్యాథలిక్ సంఘమును విడిచిపెట్టెను. క్రీ.శ. 1573 లో కాల్వినిస్ట్‌లతో చేరెను. స్పెయిన్‌ను ఎదిరించటములో ఆయనే మూలవ్యక్తి.



నెదర్లాండ్స్‌లో అణచివేయబడు ప్రజలకు సహాయము చేయుటకై జర్మనీలో ఉన్న అతడు మరియు అతని సహోదరుడు సైన్యములను సమకూర్చిరి. గనుక స్పెయిన్‌తో యుద్ధము ప్రారంభమై అది నలభైయేండ్లపాటు కొనసాగెను. వారు కోరిన విధముగా దేవునియందలి విశ్వాసమును వ్యక్తము చేయుటకొరకైన పోరాటము! దాని విషయములో ఎన్నో అవరోధములను ఎదుర్కొనవలసివచ్చెను. "శక్తిగల చక్రవర్తితో సంధిచేశావా" అని విల్లెమ్‌యొక్క స్నేహితుడడుగగా, "అవును నేను అత్యంతశక్తివంతమైన రాజాధిరాజుతో అనగా ప్రభువగు దేవునితో శాంతి ఒప్పందము చేసితినని" చెప్పెను.

క్రీ.శ. 1581 లో ఉత్తర నెదర్లాండ్స్ ఫిలిప్II తో పొత్తు కుదుర్చుకొనెను. ఏ ప్రభుత్వమైతే ప్రజలను వధచేయునో ఆ ప్రభుత్వముపై తిరుగబడుటకు ప్రజలు హక్కు కలిగియుండిరి. ఉత్తర నెదర్లాండ్స్ స్పెయిన్ మరియు రోమ్‌నుండి విడిపోయి ప్రొటస్టెంట్, కాల్వినిస్టిక్ గణతంత్ర సంయుక్త రాష్ట్రములుగా ఏర్పడెను. (యునైటెడ్ ప్రావిన్సెస్) తరువాత బెల్జియమ్‌గా పిలువబడిన దక్షిణ నెదర్లాండ్స్ చాలా మట్టుకు రోమన్ క్యాథలిక్ గానే మిగిలిపోయెను.

అందరికి విభూతము కలిగించేటట్లుగా క్రీ.శ 1584 లో చక్రవర్తియైన విల్లెమ్ ఒక పిరికివాని ద్వారా హత్యచేయబడెను. కాని పోరాటము కొనసాగెను. క్రీ.శ. 1588లో ఒక్కదెబ్బకే ఇంగ్లాండులో సహితము ప్రొటెస్టెంట్ విధానమును నాశనము చేయవలెనని రాజైన ఫిలిప్ కోరెను. స్పెయిన్ ఓడరేవునుండి వేలకొలది నావికులు, సైన్యాధికారులచే నడిపింపబడు శక్తివంతమైన, బలమైన ఉత్తర సముద్రము వైపు బయలుదేరెను. ఈ బహుఓడల సమూహము ఆర్మంద అని పిలువబడెను. ఆర్మంద అనగా ఓటమిలేని సమూహము. కాని గాలి ఓడలను స్కాట్లాండ్ కోస్తా తీరము వైపు నెట్టెను. గొప్పఉప్పెన చెలరేగగా స్పెయిన్ ఓడలు రాళ్ళకు తగిలి బద్దలాయెను. "దేవుని శ్వాసవలన చెదరగొట్టబడిరి" అని నెదర్లాండ్స్‌లోని జ్ఞాపకార్థ పతకముపై వ్రాయబడెను. అవును ఇది నిశ్చయముగా ప్రభువుయొక్క కార్యమని చెప్పవచ్చును.

70. డార్‌డ్రెక్ట్ సినాడ్

శతాబ్దము మారిన వెంటనే అనగా క్రీ.శ. 1600లో డచ్ సంఘజీవితము అలజడి మరియు భయముతో నిండుకొనినదాయెను. లెయ్‌డెన్ యూనివర్శిటీలో ఒకరితో ఒకరు సమ్మతింపని ప్రొఫెసర్లు ఉండిరి. ఒకాయన పేరు ఆర్మీనియస్. ఎవరైతే దేవుని నమ్ముటకై ఎన్నిక చేయబడుదురో అట్టి వారిని దేవుడు రక్షించునని ఆయన బోధించును. ఒకడు తన రక్షణను సాధించుకొనుటకు తనంతట తాను ఎంతో చేయవలసి ఉండును అని ఆర్మీనియస్ చెప్పెను. దేవునియందు విశ్వాసముంచాలా లేదా విశ్వాసముంచకూడదా అను విషయములో అట్టి ఎంపిక చేయుటలో ఒకడు స్వేచ్ఛ కలిగియుండును.

ఒక వ్యక్తి రక్షణను సంపాదించుకొనుట యొక్క ప్రాముఖ్యతను నొక్కిపక్కాణించి ప్రజలను రోమన్ క్యాథలిక్ సిద్ధాంతములోనికి తీసుకొని వెళ్ళే ప్రయత్నము ఆయన చేయుచున్నాడని ప్రజలు ఆయనను అనుమానించిరి.

లెయ్‌డెన్ నుండి వచ్చిన మరొక ప్రొఫెసర్ ఉండెను ఆయన పేరు గొమారస్. ఆయన ఓ కాల్వినిస్ట్, దయగల, రక్షణార్థమైన దేవుని చిత్తమునకు ఆర్మీనియస్ సిద్ధాంతము న్యాయము చేయలేదు గనుక గొమారస్ ఆర్మీనియస్ సిద్ధాంతములను ఖండించెను. రక్షణ మన సహకారముపై ఏ మాత్రమును ఆధారపడదు! గనుక మనము రక్షింపబడ్డామంటే, ఆ ఘనత దేవునికి మాత్రమే చెందును! ఈ సంగతిని దేవుని వాక్యము బోధించుచున్నది. ఇదే విషయమును గొమారస్ తన విద్యార్థులకు నేర్పించెను.

ఆర్మీనియస్ తన భిన్నబోధను తన విద్యార్థులకు బోధించగా పరిస్థితి చేజారెను. విద్యార్థులు రెండు వర్గములుగా విడిపోయిరి, తత్ఫలితముగా ఒక్కయూనివర్సిటినుండి రెండు రకములైన మతగురువులు బయలుదేరిరి. సాధారణ ప్రజలు కూడ సిద్ధాంత విబేధములను గూర్చి మాట్లాడటం ప్రారంభించిరి! గోమారస్ బోధలను బలపరచువాడు గొమారిస్ట్ అని, ఆర్మీనియస్ అని పిలువబడిరి. ఇట్టి విబేధములచే అనైక్యత, అసమాధానము, జగడము పుట్టెను.

ప్రభుత్వము ఈ విషయమై చర్య తీసికొనదలచెను! గనుక ఆర్మీనియస్ ఒక డాక్యుమెంట్‌ను కూర్పుచేసిరి. అదే రిమాన్ స్ట్రన్స్. ఈ డాక్యుమెంట్‌లో వారి ఆక్షేపణలు, తాము నమ్ము విషయముల సమర్థన ఉండును. వారు ఈ డాక్యుమెంట్‌ను హాలెండ్ ప్రావిన్సియల్ సమావేశమునకు సమర్పించిరి. ఇట్టి ఆర్మీనియన్‌లు రిమాన్‌స్ట్రంట్‌లని పిలువబడిరి. కౌంటర్ రిమాన్‌స్ట్రన్స్ కూర్పుచేసి గొమారిస్ట్‌లు సమాధానమిచ్చిరి. అందులో వారు రిమాన్‌స్ట్రంట్స్‌కు విరుద్ధమైన సంగతులు పొందుపరచిరి. అప్పుడు గొమారిస్ట్‌లు కౌంటర్ రిమాన్‌స్ట్రంట్స్ అని పిలువబడిరి.

ఈ రిమాన్‌స్ట్రన్స్ నందు ఇతర ప్రాముఖ్య బేధాభిప్రాయములు కలవు. క్రీస్తు బలియర్పణ సార్వత్రికము. క్రీస్తు అందరి నిమిత్తమై మరణించెను. ఒక వ్యక్తి రక్షింపబడ్డాడా లేదా అనునది ఒకని విశ్వాసముపై ఆధారపడియుండును. విశ్వాసులు దేవుని కృపనుండి పడిపోవచ్చును, దేవుని కృపను కోల్పోవచ్చును. ఒకడు తన రక్షణను గూర్చి ఎన్నటికిని నిశ్చయముగా నుండలేడు అని రిమాన్‌స్ట్రంట్స్ బోధించిరి. ఎంతఘోర చీలికలు మరియు కలవరము సంఘమందు ప్రవేశించెను!

సంఘసమాఖ్యకిది అనుకూల సమయము. నెలకొనిన సిద్ధాంత విభేధముల విషయములో సమాఖ్య విచారణ చేసి తీర్పుతీర్చును. ఈ విధముగా జరిగెను. క్రీ.శ. 1618 మరియు 1619లో డార్‌డ్రెక్ట్‌నందు సంఘసమాఖ్య కూడెను. ఎంతోమంది ప్రొఫెసర్‌లు మరియు విదేశ సంఘ ప్రతినిధులు సమావేశమునకు హాజరైరి.

సమాఖ్య అధ్యక్షుడు సామర్థతగల మతగురువు. ఆయనపేరు బాగర్‌మన్. రిమాన్‌స్ట్రంట్స్ మరియు సమాఖ్య సభ్యుల మధ్యన వాడివేడిగా తీవ్ర తర్జనబర్జనలు జరిగెను. బైబిల్ వెలుగులో సిద్ధాంతములు పరీక్షింపబడుచుండగా రిమాన్‌స్ట్రంట్స్ సభను జరగనివ్వకుండ ప్రతిరోజు అల్లరి సృష్టించిరి. చెప్పబడు సంగతులను వారేమాత్రమును లెక్కచేయలేదు. తుదకు అధ్యక్షుడు అలసిపోయి రిమాన్‌స్ట్రంట్స్ సభను విడిచి వెళ్ళవలెనని చెప్పెను.


"వెళ్ళండి", "వెళ్ళిపోండి" అని ఆయన బిగ్గరగా అరచి చెప్పెను.

రిమాన్‌స్ట్రంట్స్ సిద్ధాంతము ఏకగ్రీవముగా ఖండింపబడి తిరస్కరింపబడెను. రిమాన్‌స్ట్రంట్స్‌ను వ్యతిరేకిస్తూ ఐదు ప్రకరణలు కూర్పు చేయబడెను. ఈ ఐదు ప్రకరణలు కేనన్స్ ఆఫ్ డార్డ్రాక్ట్ అని పిలువబడెను మరియు విశ్వాపు ప్రమాణమని పిలువబడెను. బెల్జిక్ ఒప్పుకోలుతోపాటు (విశ్వాస ప్రమాణమును గ్యుడో డి బ్రెస్ కూర్పుచేసెను) ఈ కేనన్స్ మరియు హీడెల్ బర్గ్ క్యాటకిజమ్ ఈ మూడు విశ్వాస ప్రమాణములుగానుండెను అవి "మూడు విధముల ఐక్యత" అని పిలువబడెను.

ఈ మూడు విశ్వాస ప్రమాణములు కలిసి దేవుని సంఘము ఒప్పుకొనిన సత్యమును తెలుపును "మీరు విశ్వాసము ద్వారా కృప చేత రక్షింపబడియున్నారు ఇది మీ వలన కలిగినది కాదు దేవుని వరమే" (ఎఫెసీ 2:8) అను మాటలలో మూడు విశ్వాసప్రమాణములను క్లుప్తీకరించి చెప్పవచ్చును.

ఆర్మీనియన్ మత గురువులు తొలగింపబడిరి. ఈ తీర్మానమునంగీకరింపనివారు చెరకు పంపబడిరి (దాదాపు రెండువందలమంది), ఇవేగాక మరెన్నో ఇతర సంగతులను సంఘసమాఖ్య చర్చించెను. డాక్యుమెంట్స్ కూర్పు చేయబడెను, నియమము లేర్పడెను. వ్యవస్థీకరింపబడిన సంఘము వాటి ప్రకారము పనిచేయవలెను. ఈ డాక్యుమెంట్స్ మరియు నియమములు "చర్చ్ ఆర్డర్ ఆఫ్ డార్‌డ్రెక్ట్" అని పిలువబడెను.

మరొక ప్రాముఖ్య తీర్మానము తీసికొనబడెను. ఆదిమ భాషలైన హీబ్రూ మరియు గ్రీక్ భాషల ఆధారముగా డచ్ భాషలోనికి బైబిల్‌ను అనువదింపవలెను. కొన్ని సంవత్సరములపాటు, పండితులు దేవునియందు భయంకలిగినవారు బైబిల్‌ను అనువాదము చేసిరి. క్రీ.శ. 1637 లో వారు (డచ్ పార్లమెంట్‌కు) ప్రజాప్రతినిధులు అనువాదము చేసిన బైబిల్ మొదటి ప్రతిని ఇచ్చిరి. ఈ క్రొత్త అనువాదము స్టేటెన్ వర్‌టేలింగ్ (రాష్ట్రముల అనువాదము) అని బైబిల్‌ను స్టేటెన్ బిజ్‌బెల్ (రాష్ట్రబైబిల్) అని పిలిచిరి. ఎందుకంటే ఈ పనిచేయుటకు ఆజ్ఞనిచ్చినది ఖర్చులు భరించినది రాష్ట్రముల సైన్యాధికారే. (జనరల్). వీరు చేసిన పనివలన బైబిల్ అనువదింపబడి కోట్లాది ప్రజలకు నిత్య ఆశీర్వాదమునకు హేతువాయెను.



71. జన్‌సెనిజమ్ మరియు పాస్కల్

సంఘ సంస్కరణ సమయములో రోమన్ క్యాథలిక్ సంఘములో పరిస్థితులెలా ఉండెను? సంఘ సంస్కరణ వృద్ధియగుచుండగా, తాము ప్రొటెస్టెంట్ లవ్వకుండానే, రోమన్ క్యాథలిక్ సంఘములో ప్రవేశించిన దోషములనుండి ఆ సంఘమును శుద్ధీకరించవలెనని కొందరు తలంచిరి.

అటువంటి ఒక వ్యక్తి ప్రసిద్ధిచెందిన వాడైయుండెను. ఆయనపేరు కొర్నేలియస్ జన్‌సెన్ (క్రీ.శ. 1585 -1638). ఆయన లువెయిన్ (బెల్జియమ్) లో చదివెను. తరువాత ప్రొఫెసర్ అయ్యెను. క్రీ.శ. 1636లో ఆయన వైప్రెస్‌కు బిషప్‌గా నియమింపబడెను. జన్‌సెన్, ఆగస్టీన్ యొక్క రచనలు చదువుట యందు ఎక్కువ సమయము గడిపెను. తత్ఫలితముగా రోమన్ క్యాథలిక్ సంఘదోషములను ఆయన కనుగొనగలిగెను. ఆగస్టీనస్ అను పేరుగల పుస్తకమును జన్‌సెన్ వ్రాసెను. అందులో అగస్టీన్ సిద్ధాంతమైన పాపము మరియు కృపయను సిద్ధాంతమును సమర్థించెను. బాప్తిస్మము తర్వాత ఒకడు తన స్వేచ్ఛా చిత్తమును బట్టి పాపము చేయును గనుక దేవునియెదుట దోషియై నిలుచును. క్రీస్తు కృపద్వారా మాత్రమే మానవుడు తన చిత్తమును దేవుని చిత్తమునకు లోబడజేయును. మానవుని హృదయములో మంచిని కనగొన ఆశపడుట కుదరని పని, మానవుడు తన మంచి క్రియలన్నిటితో తన రక్షణ నిమిత్తమై ఏమియూ జత చేయలేడు. మరియు ఆ పుస్తకములో రోమన్ క్యాథలిక్ సంఘము యొక్క సెమి పెలేజియనిజమ్‌పై తన అభ్యంతరమును స్పష్టము చేసెను.

మొదట నిజ విశ్వాసమనునది హృదసంబంధ సంగతి. జీవితము దేవుని చట్టమునకు లోబడినట్లు, రక్షణ కొరకైన హృదయ, చిత్తప్రవృతి, గ్రహింపుల యొక్క మార్పు ప్రధానమైయుండును. పైపై మతభక్తి మరియు విశ్వాససంగతులను తేలికగా తీసికునే వైఖరి మొదలగు వాటిని జన్‌సెన్ స్పష్టముగా తిరస్కరించెను. ఆయన చెరసాలలో వేయబడుట ఆశ్చర్యమేమి కాదు. కొంతకాలము పిమ్మట జన్‌సెన్‌యొక్క ఐదు ప్రతిపాదనలను పోప్ కొట్టివేసెను అదియూ జన్‌సన్ మరణించాక. ప్యారిస్ దగ్గర పోర్ట్ రాయల్ అను మఠము కలదు. ఈ మఠములో జన్‌సన్ బోధలు ఎంతగానో స్వీకరింపబడెను. మఠకన్యకల అధిపతి ఆధ్వర్యములో పోర్ట్ రాయల్‌లో జీవితము ఉన్నత ప్రమాణమునకు చేరుకొనెను. తీవ్ర సిద్ధపాటు తర్వాత మఠకన్యకలు ప్రభురాత్రి భోజనము (యూకరిస్ట్)లో పాల్గొనిరి. 'అయోగ్యముగా ప్రభువు బల్లలో పాల్గొనకూడదని వారు మఠములో హెచ్చరింపబడిరి. రోమన్ క్యాథలిక్ సంఘములో అట్టి హెచ్చరికలేవి వినిపించటము లేదు. ఫ్రాన్స్‌లో పోర్ట్-రాయల్ ఓ ప్రముఖ ఆత్మీయ కేంద్రముగా మారెను.

కాని పోర్ట్-రాయల్‌లో మఠకన్యకల పరిస్థితి కష్టతరమాయెను. వారు జన్‌సన్ బోధలను బలపరచిరి గనుక మఠకన్యకల ఆశ్రమము నుండి ఇతర కాన్వెంట్‌లకు మార్చబడిరి. తుదకు పోర్ట్ రాయల్ నేలమట్టము చేయబడెను.

జన్‌సెన్‌ను బలపరచినవారు జన్‌సెనిస్ట్‌లని పిలువబడిరి. ఒక ముఖ్యమైన జన్‌సెనిస్ట్ ఉండేవాడు. ఆయన పేరు పాస్కల్.

పాస్కల్ గణితశాస్త్ర మేధావి. ఆయన యౌవనములో ఉన్నపుడే కష్టమైన లెక్కలను సులువుగా చేసేవాడు. తద్వార పాస్కల్ చక్కటి పేరు సంపాదించుకొనెను. ఆయన ధనికుడైయుండి జీవితమును అనుభవించెను, ఆరు గుర్రములచే లాగబడు గుఱ్ఱపుబండిలో ప్రయాణము చేయుటకు ఇష్టపడెను.


కాని ఒక సంఘటన జరుగగా ఆ సంఘటన తన జీవితమును పూర్తిగా మార్చివేసెను. తన గుఱ్ఱపు బండిలో ప్యారిస్‌లోని వంతెనపై స్వారి చేయుచుండగా, ఆయన గుఱ్ఱములు మొండిగా ప్రవర్తించెను. అవి వంతెన ఇరుప్రక్కల ఉండు ప్రహరి గోడను దాటి నీళ్ళలో దూకెను. పగ్గములు తెగెను మరియు గుఱ్ఱపు బండి మధ్యాకాశములో వ్రేలాడుచుండెను. పాస్కల్ నీట మునిగి మరణించు ప్రమాదమును త్రుటిలో తప్పించుకొనెను. స్వస్థ వచ్చాక తాను దేవునితో కలిసికొంటినని ఒప్పింపబడెను. ఇప్పుడు ఆయన జీవితము మారిపోయినది.

ఆయన పోర్ట్ రాయల్ మఠమును క్రమముగా దర్శిస్తూ అక్కడికివచ్చే సందర్శకులతో పాస్కల్ తన రచనలలో జన్‌సెన్ బోధలను సమర్థించెను. దేవుని

ఎరుగని వ్యక్తియొక్క దౌర్భాగ్యమును గూర్చి ఆయన వ్రాసెను. లౌకిక సుఖభోగములవలన ఈ దౌర్భాగ్యత తోలివేయబడలేదు. ఇట్టి దౌర్భాగ్యతను తొలగించుకోవాలంటే ఒక వ్యక్తికి దేవుడు-యేసుక్రీస్తుద్వారా తనను తాను మానవునికి బయలుపరచుకొనిన సజీవుడగు దేవుడవసరము!

మనము యేసుక్రీస్తు ద్వారా మాత్రమే దేవుని చూడవచ్చును. యేసుక్రీస్తు ద్వారా మనలను మనము చూచుకోవచ్చునని పాస్కల్ వ్రాసెను.

పాస్కల్ రోమన్ క్యాథలిక్ సంఘములోనే ఉండిపోయెను. అయినా తన కొద్దికాల జీవితములో (39 సం॥ల ప్రాయములో మరణించెను) ఆయన ప్రొటెస్టెంట్ సిద్ధాంతమును సమర్థించెను. జన్‌సెనిజమ్ నెదర్లాండ్స్‌లోను మరియు ఇతర దేశాలన్నిటిలోను వ్యాపించెను. జన్‌సెనిజమ్ యొక్క స్వరమును రోమన్ క్యాథలిక్ సంఘనాయకులు వినిరా? లేదు, వినలేదు. సిద్ధాంత విషయమందు వారు మారలేదు. "అతి గొప్ప క్రైస్తవ సుగుణములను వధించే ప్రక్రియలో వారున్నారు. ఉదాహరణకు : సత్యము కొరకైన ప్రేమ అని తన సొంత సంఘమైన రోమన్ క్యాథలిక్ సంఘమును గూర్చి పాస్కల్ చెప్పెను.



72. రోమన్ క్యాథలిక్ మిషనరీలు - లాస్ కసాస్

క్రీ.శ. 1492లో పోర్చ్‌గీస్ దేశస్థుడైన కొలంబస్ అమెరికాను కనుగొనెను, మరియు త్వరలోనే స్పెయిన్ మరియు పోర్చుగల్‌నుండి వచ్చిన వలసప్రజలు ఈ క్రొత్త ఖండమును ఆక్రమించుకొనిరి. వలస ప్రజలు మాత్రమే అమెరికా వెళ్ళిరి. ఐరోపానుండి వచ్చిన రోమన్ క్యాథలిక్ మిషనరీలు కూడ వారితో వెళ్లిరి. ఉదాహరణకు వారు మెక్సికో మరియు పెరూకూ ప్రయాణించిరి. డొమినికన్ మరియు ఫ్రాన్సిస్కన్ మిషనరీలు అక్కడికి మొదట వెళ్ళిరి. తరువాత జెజ్విట్స్‌నూ చేరిరి.

ఇద్దరిద్దరుగాను, ముగ్గురుగాను, కాళ్ళకు చెప్పులు లేక ఆయుధము లేమియూ లేక ఈ మిషనరీలు పట్టణములు మరియు గ్రామములకు ప్రయాణించిరి. మొదట వెళ్ళినపుడు అనువాదకుని సహాయముతో స్థానికులతో మాట్లాడిరి. కాని తరువాత వారు భాషను అధ్యయనము చేసి స్థానిక భాష నేర్చుకొని ఆ భాషను వారి స్థానిక భాషలో మాట్లాడిరి. మిషనరీలు త్వరలోనే ప్రజలకు బాప్తిస్మమిచ్చిరి. వీలైన చోట విశేషించి శిథిల దేవాలయములు ఉన్నచోట చిన్న సన్యాస ఆశ్రమములు మరియు సంఘములు కట్టబడెను. అలా చేయుటవలన అక్కడ జరిగిన మార్పును మిషనరీలు స్పష్టముగా ప్రదర్శించిరి.

ప్రసిద్ధిగాంచిన లాస్‌కసాస్ అను డొమినికన్ మిషనరీ ఉండెను (క్రీ.శ.1474-1566). తోటలు నాటించువానిగా ఆయన అమెరికా వెళ్ళెను. సెంట్రల్



అమెరికా చేరుకొని వలస ప్రజలు స్థానిక ఇండియన్‌లను ఎలా దోచుకోనిరో ఈయన చూచెను. వారి తోటలలో ఇండియన్‌లను బానిసలుగా వాడుకొనిరి. వలస ప్రజలు వారిని చాలా బాధించిరి. లాస్‌కసాస్ తన సొంత కళ్ళతో స్థానికుల బాధను చూచెను. తత్ఫలితముగా ఆయన మిషనరి అగుటకు నిర్ణయించుకొనెను.ఆయన మతగురువుగా అభిషేకింపబడిన పిమ్మట, లాస్ కసాస్ బానిసల బాధలను చేతపుచ్చుకొనెను. తన శేషజీవితమంత ఇండియన్‌లకు సహాయము చేయుటలోనే గడిపెను. కాని వలస ప్రజలు వ్యతిరేకించిరి! వారైతే ఇండియన్‌ల ద్వారా వెట్టి చాకిరి చేయించుకొనిరి.

గనుక ఈ పని విషయమై ప్రభుత్వాధికారుల ప్రోద్భలము పొందుటకై లాస్ కసాస్ స్పెయిన్‌కు చాలాసార్లు ప్రయాణించెను. కాని వలస ప్రజలను బలపరచు వారినే ఈయన కలుసుకొనెను!

కాబట్టి ఇస్పూరి అను నది ప్రక్కన లాస్ కసాస్ స్వయానొక ప్రాంతమును కనుగొని తన మిత్రుల సహాయముతో బానిస పనితో సహాయము లేకయే పనివారిని దుర్వినియోగము చేయకయే పనిచేయ ప్రయత్నము చేసెను. కాని చెప్పుటకు విచారము కాని కొద్దికాలము గడువకమునుపే ఈ ప్రాజెక్ట్ విఫలమాయెను.

మరొక్కసారి లాస్ కసాస్ స్పెయిన్‌కు తిరిగి వచ్చెను. ఆయన రాజుతో మాట్లాడగా దక్షిణ అమెరికాలోని ఒక దేశమైన పెరూకు ఆయనను పంపెను. పెరూలో ఎటువంటి దురాచారములు జరగకుండా చూచుకొనవలెనని రాజు లాస్ కసాస్‌కు ఆజ్ఞ జారీ చేసి పంపెను. మేము రాజాజ్ఞకు లోబడుదుమని పెరూ నివాసులు వాగ్దానము చేసిరి కాని వారు వాస్తవమునకు అవేవియూ లెక్క చేయక జీవించిరి. లాస్ కసాస్ పేరూ విడిచి సెంట్రల్ అమెరికా మెక్సికోకు ప్రయాణమై వచ్చెను. అక్కడ ఆయన ఎదుగుచున్న ఇండియన్ సంఘములను స్థాపించెను. అక్కడ ఆయన డెబ్భైసంవత్సరములు జీవించి బిషప్‌గా ప్రతిష్టింపబడెను. ఆయన వారి బిషప్‌గా ఉంటూ అన్యాయము మరియు దురాచారములు చేయు వలస ప్రజలకు క్షమాపత్రము (అబ్‌సోల్యూషన్) లివ్వవద్దని తన మత గురువులకు ఆజ్ఞాపించెను. (అబ్‌సోల్యూషన్ అనగా రోమన్ క్యాథలిక్ సంఘము ప్రకారము పాపక్షమాపణ పత్రము). ఇప్పుడు వలస ప్రజలేగాక మతగురువులు కూడ లాస్ కసాస్‌పై తిరుగబడి ఆయన ఆజ్ఞలను పాటించుటకు తిరస్కరించిరి. తిరుగుబాటు చాలా తీవ్రముకాగా, మూడు సంవత్సరముల పిమ్మట మేలుకొరకే ఆయన స్పెయిన్‌కు తిరిగివచ్చెను.

ఇండియన్‌లను మరియు నీగ్రోలను చక్కగా చూచుకొమ్మని రాజు మరియు అతని మంత్రులతో ఇరవై ఏండ్ల తరబడి అక్కడ ఉంటూ వారిని మనవి చేసుకొనెను. వాస్తవమునకు ఆయన నీగ్రోస్ నిమిత్తమై పోరాడెను. నీగ్రోలను ఆఫ్రికానుండి అమెరికా వారి తోటలలో వారిచేత బానిస పని చేయించుకొనేవారు. విచిత్రమేమిటంటే, లాస్ కసాస్ ఇట్టి పరిస్థితులను వ్యతిరేకించలేదు. ఇండియన్స్ నీగ్రోల వలె బలవంతులుకారు గనుక నీగ్రోలు బానిసలుగా వాడబడితే ఇండియన్‌లకు కాస్త భారము తగ్గునని భావించి ఆ పరిస్థితిని ఆయన ఎదిరించలేదు. ఏది ఏమైనా ఆయన నీగ్రోలకు సువార్త ప్రకటించెను వారిని కూడ చక్కగా సభ్యతతో చూచుకొమ్మని వాదించెను.

లాస్ కసాస్ వేలకొలది ఇండియన్‌లకు మరియు నీగ్రోలకు బాప్తిస్మమిచ్చెను లాస్‌కసాస్ ప్రారంభించిన పనిని అనేక మిషనరీలు కొనసాగించిరి. ఆయన ఉంచి వెళ్ళిన మాదిరిని తక్కిన మిషనరీలు అనుసరించిరి. ఆయన పడిన ప్రయాస ఫలితముగా "ఇండీస్ అపొస్తలుడని" లాస్‌కసాస్‌కుపేరు పెట్టబడెను.

73. రోమన్ క్యాథలిక్ మిషనరీలు - జేవియర్

మిషన్ పని నిమిత్తమై అమెరికా వెళ్ళినట్లే రోమన్ క్యాథలిక్ మిషనరీలు ఇతర ప్రపంచదేశములకునూ వెళ్ళిరి. ఇందులో జెజ్విట్‌లు చాలా చురుగ్గా నుండిరి.

క్రీ.శ.1583లో చైనాలో పనిచేయుటకై మాటియో రిక్కి వెళ్ళెను. స్థానికుల ఆచారవ్యవహారములు అలవరచుకొనవలెనని రిక్కి ఒప్పింపబడెను. అందుకే ఆయన పితృ ఆరాధన ప్రారంభించెను.

రిక్కి చేసిన దానిని మరొక సన్యాసధర్మము వారు వినినపుడు పోప్‌కు సమాచారము తెలిపిరి. అట్టి విధానమును ఖండింప చేయుటలో వారు సఫలులైరి.

క్రీ.శ. 1610లో రిక్కి మరణించేసరికి చైనాలో వందలకొలది సంఘములు స్థాపింపబడెను. పెకింగ్‌లోని న్యాయస్థానము వారికి రిక్కి గడియారములు బహుమతులుగా ఇచ్చెను. గనుక ఆయన న్యాయస్థానమునుండి చాలా సహాయము పొందుకొనెను.

క్రీ.శ.1604నుండి భారతదేశములో మిషనరీగా పని చేసిన రాబర్ట్ నొబిలి, మాటియో రిక్కి వాడిన పద్ధతిని వాడెను. బ్రాహ్మణులకు (భారతదేశపు మతగురువులు) సువార్తనందజేయుటకై ఆయన వారివలె జీవించటము ప్రారంభించెను. భారతదేశపు ఇతర సమాజ ప్రజలను సువార్తచే ప్రభావితము చేయవలెనంటే ఇతర మిషనరీలు ఆయా సమాజ ప్రజల సంస్కృతి ఆచారపద్ధతులను అనుసరింపవలెను.

రిక్కి మరియు నొబిలి వాడిన సేవా విధానమును బైబిల్ దృక్పథములో చూచినట్లైతే, అది సరైనది కాదని తెలియును. ఇట్టి పద్ధతి వాడినపుడు, క్రీస్తుద్వారా మాత్రమే సమాధానపడుట అను సంగతి బోధలో కీలకాంశముగా ఉండదు. తత్ఫలితముగా మత వ్యవహారములలో అన్య సంప్రదాయములు కొనసాగును.

మరొక ప్రముఖ మిషనరీ ఉండేవాడు. ఆయన పేరు ఫ్రాన్సిస్ గ్జేవియర్ (క్రీ.శ. 1500-1553). ఆయన ఓ జెజ్విట్.

పోర్చుగల్ రాజుయొక్క మనవి ప్రకారము క్రీ.శ. 1541 లో భారతదేశపు తీరముననున్న గోవాలో పనిచేయుటకై వెళ్ళెను. ప్రత్యేకించి పోర్చ్‌గీస్ యొక్క వలస ప్రజల మధ్యన పనిచేయుటకై వెళ్ళెను. ఆయన భారతదేశమునకు ప్రయాణమై వచ్చుచుండగా ఓడలో ఉన్నవారందరికి చాలా సహాయకరముగా నుండెను. ఆయన ప్రతియొక్కరికి విశ్వసనీయ మిత్రునిగానుండి అవసరతలో ఉన్నవారందరికి ఆత్మీయ సహాయము చేసెను. ఎవరైనా అనారోగ్యము పాలైతే, ఓడలోని తన సొంత క్యాబిన్‌లో పడుకొనుటకై అనుమతించేవాడు.

గోవా చేరాక, ఆయన పోర్చ్‌గీస్ ప్రజల మధ్యనేగాక భారతీయుల మధ్యనూ పనిచేయుటకై వెళ్ళెను. ఆయన వారి భాష నేర్చుకొని, అపొస్తలుల విశ్వాసము, ప్రభువునేర్పిన ప్రార్థన, పదిఆజ్ఞలు, విశ్వాస పాఠములు మొదలగునవి వారికొరకై అనువదించెను. అతి పేదలు పరవ జాలరుల మధ్యన ఆయన పనిచేసెను.

సమయమనక స్థలమనక జేవియర్ ప్రజలకు బాప్తిస్మమిచ్చెను. ఒకసారి వరుసగా ముప్పై గ్రామములలో ఉండు ప్రజలకు బాప్తిస్మమిచ్చెను రోమన్ క్యాథలిక్ బోధ ప్రకారము బాప్తిస్మమను ఆజ్ఞ (శాక్రమెంట్) దేవుని వాక్యముకంటే ముఖ్యమైనది. రోమన్ క్యాథలిక్ సంఘము రక్షణ మరియు బాప్తిస్మమునకు ముడిపెట్టెను. సాధ్యమైనంతవరకు ప్రజలు బాప్తిస్మము తీసికోవలసిందే!

పరవ ప్రజల మధ్యన (జాలరులు) జేవియర్ సంవత్సరముల పాటే పని చేసినా ఆయన వారిపై లోతైన ప్రభావము చూపెను. జేవియర్ ఆగక తనపనిని కొనసాగించెను. మొదట ఆయన శ్రీలంక, తరువాత మలక్క ఆ తరువాత మొలక్కస్‌కు వెళ్ళెను. తుదకు ఆయన జపాన్, చేరుకొనెను, అక్కడ కూడ ఆయన స్థానిక ప్రజలకొరకై విశ్వాస ప్రమాణమును అనువదించెను.జేవియర్ తప్పక భాషలలో ప్రవీణుడై యుండాలి!

కాని ఇప్పుడు, డచ్ మరియు ఇంగ్లీష్ వర్తీకులు జపాన్ చేరిరి. స్పెయిన్ మరియు పోర్చుగ్రీస్ ఇరువురికి



పొసగక స్నేహితులుగా ఉండలేదు గనుక పోట్లాటలు మొదలయ్యెను. తత్ఫలితముగా దాదాపు క్రీ.శ. 1600 లో క్రైస్తవ్యమును నిషేధింపవలెనని జపాన్ చక్రవర్తి నిర్ణయించెను. తరువాత హింస కూడ చెలరేగెను. ఏదిఏమైనా రెండువందలకంటే పైబడి సంఘములు అదివరకే కట్టబడెను.

గ్జేవియర్ యొక్క తరువాయి గురి చైనాలో పనిచేయుట. కాని అక్కడ పని ప్రారంభించక మునుపే చైనా తీరమందు ఓ ద్వీపమందు జాలరి గుడిశెలో గ్జేవియర్ మరణించెను. ఈ ఫలానా మిషనరీ, ఫ్రాన్సిస్ జేవియర్ తన సన్యాస ధర్మమునకు ఓ ఆస్తివంటివాడు. ఎంతో ఆసక్తి సంతోషముతో ఉరకలు వేస్తూ ఆయన పనిచేసెను.

ఈయన ద్వారా వేలకొలది అన్యులు రోమన్ క్యాథలిక్ సభ్యులుగా మారిరి. ఈ కారణము చేత పోప్ ఈయనకు "పునీతుని" (సెయింట్) హోదాను ఇచ్చెను (సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్) మనము గమనిస్తున్నట్లుగా ప్రొటెస్టెంట్ విధానము శిశుదశలో ఉండగా రోమన్ క్యాథలిక్ సేవ చాలా వ్యాప్తి చెందుచుండెను.

74. జర్మనీలో పియటిజమ్ - ఫ్రాంకీ

ఐరోపాలో ప్రొటెస్టెంటిజమ్ వేర్వేరు రూపములుగా ఉండెను. అందులో పైయటిజమ్ ఒకటి. దానిని మనమిప్పుడు చూడబోవుచున్నాము.

పియటిజమ్ అను పదము పియటాస్ అను లాటిన్ పదమునుండి వచ్చెను. దానికర్థము భక్తి లేదా మంచితనము. పియటిజమ్ అనునది ప్రొటెస్టెంట్ సంఘమందలి ఓ ఉద్యమము. అది పదిహేడవ శతాబ్దపు ప్రారంభములో వృద్ధియాయెను. ఈ సమయములో బైబిల్ మరియు కొన్ని మత సిద్ధాంతముల విషయములో అదొక ఆధ్యాత్మిక, బుద్ధి సంబంధమైన సంగతిగా ఉండెను. అవునని పైపైకి ఒప్పుకొనుటగా ఉండేది. ప్రజలు తరచుగా "హృదయముతో కాక "తలతో" నే నమ్మేవారు. దేవునితో సంభాషణ వ్యక్తిగత అనుభవముగా ఉండేది కాదు మరియు అది వెనక్కి నెట్టబడియుండేది. పశ్చాత్తాపము కొరకైన ఆహ్వానము, ప్రభువునందలి భయము మున్నగునవి బోధలయందు వినపడేవి కావు. పరిస్థితులు ఇంత మందకొడిగా ఉన్న ఈ సమయములో నిజ ఆత్మీయ జీవితమును గూర్చి బైబిల్ చెప్పునది బోధించు మనుష్యులను ప్రభువు లేపెను. మొదటిగా నిజ ఆత్మీయ జీవితమంటే అది హృదయ సంబంధమైనదైయుండెను. మరియు భక్తియుత జీవన విధానములో స్పష్టమవ్వాలి. అది దేవుని పరిశుద్ధ ధర్మశాస్త్రమునకు పూర్తిగా విధేయత చూపు జీవితముగానుండును. ఐరోపా దేశాలైన జర్మనీ, నెదర్లాండ్ మరియు ఇంగ్లాండ్‌లలో ఇది ఏవిధముగా వృద్ధినొందెనో మనము గమనించబోవుచున్నాము.

స్పెనర్ (క్రీ.శ. 1635- 1705) అను వ్యక్తి పియటిజమ్ జర్మనీకి తీసుకురావాలని ఆశపడుచుండెను. ఈయన పియటిజమ్‌కు పితరుడని పిలువబడెను. ఆయన ఫ్రాంక్‌ఫర్ట్‌లో లూథరన్ పరిచారకునిగా ఉంటూ సాంప్రదాయ సిద్ధాంతముపట్ల అధిక గౌరవము కలిగియున్నారు కాని నిజక్రైస్తవ జీవిత విధానము పట్ల చింతలేక యుండిరి. నిజ క్రైస్తవ జీవిత విధానము కొరతగా ఉండెను. ఆత్మీయ జీవితమును పునరుజ్జీవించుట కై తన ఇంటిలోనే కూడికలు జరిపించుట ప్రారంభించెను. త్వరలోనే అదే విధముగా ఇతర పట్టణములలోనూ కూడుకొనసాగిరి.

స్పెనర్‌కు ఓ మతగురువు సహాయకునిగా ఉండేవాడు. తరువాత ఆయన స్పెనర్‌కంటే ప్రముఖుడు కాబోతున్నాడు. ఈ స్నేహితునిపేరు ఫ్రాంకి, ఈయన బైబిల్‌ను హీబ్రూభాషలో ఆరుకంటే ఎక్కువసార్లు చదివెను. స్పెనర్ "క్రీస్తునందు నా తండ్రి" అని ఫ్రాంకి చెప్పెను. వారిరువురు నిర్జీవ నామకార్ధ క్రైస్తవ్యమును తరచుగా ఎదుర్కొనిరి. అట్టి క్రైస్తవ్యమునకు విరోధముగా వారు పోరాడిరి వారు తరచుగా ఎదుర్కొనిన విశ్వాసము పొడిబారి ఎండినదైయుండెను. అది మత అలవాటువలె ఉండేది.


ప్రయోగాత్మక క్రైస్తవ్యమును చూడవలెనని స్పెనర్ మరియు ఆయన స్నేహితుడు కోరుకొనిరి. ఇది మాట్లాడుకొను క్రైస్తవ్యము కాదుగాని అనుదిన జీవితములో అభ్యాసము చేయబడి ప్రదర్శింపబడు జీవితము.

ఈ ఇద్దరు వ్యక్తులు వాస్తవమునకు లూథరన్ సంఘమును విడువలేదు. కాని వారు జరుపు కూడికలను బట్టి, వారు సంఘములో భాగముగా లెక్కింపబడలేదు. ఇది వారికి సంఘముతో పోరాటమునకు దారితీసెను!

హల్లె నగరములో ఇటీవలే ఒక యూనివర్సిటీ స్థాపింపబడినది. అందులో ఫ్రాంకి ప్రొఫెసర్‌గా నియమింపబడునట్లు చూచుకొనెను. అదియూగాక హల్లెకు సమీపముగానున్న గ్రామములో ఫ్రాంకి పరిచారకుడాయెను. బిక్షగాండ్లు వచ్చి తన తలుపు తడితే ఆయన వారినెన్నడు పంపివేయలేదు. ఫ్రాంకి వారిని ఇంట్లోకి ఆహ్వానించేవాడు. ఆయన వారితో మాట్లాడేవారు. వారి అజ్ఞానమునుబట్టి ఆయన ఆశ్చర్యపడేవాడు. పిల్లలు కూడ ఆయన ఇంటికి వచ్చేవారు వారికి కూడ బైబిల్ అస్సలు తెలిసియుండేది కాదు.

ఒక పాఠశాల తెరవబడాలి! అడుక్కునే పిల్లలను పాఠశాలలో చదువులు ఉచితముగా నేర్పబడాలి. మొదట ఇక్కడే వారు బైబిల్‌ను గూర్చి తెలుసుకోవాలి. కాని దీనికి డబ్బుచాలా ఖర్చవుతుంది. ఫ్రాంకీ తన బయట తలుపునకు చందా సంచి ఒకటి వ్రేలాడదీసెను. దానిని వ్రేలాడదీయుటకు గల కారణములను తెలుపుతూ కొన్ని బైబిల్‌లోని వచనములు వ్రాసెను.

ఆ సంచిలో డబ్బులు పడుటకు కొన్ని నెలలు



పట్టెను. అందులో ఎక్కువ కానుకలు వేయబడలేదు అయినాసరే పాఠశాలను ప్రారంభింపవలెనని ఆయన ఆశపడెను. దేవుడు తనను అవమానపరచడని గట్టిగా నమ్మెను.

మొదట, కొందరు విద్యార్థులచే సహాయము చేయబడినవాడై తన ఇంటియందే పిల్లలకు బోధించెను. త్వరలోనే విద్యార్థుల సంఖ్య యాభైకంటే ఎక్కువగా పెరిగెను గనుక పెద్ద ఇంటిని అద్దెకు తీసికోవలసి వచ్చెను. పాఠశాల పేరు అంతటా వ్యాపించినందున పాఠశాల విస్తరించెను, ధనికులు సహితము వారి పిల్లలను ఆ పాఠశాలకు పంపిరి. తత్ఫలితముగా పాఠశాలకు డొనేషన్‌లు పెరిగెను. ఆర్థిక పరిస్థితి మెరుగుపడెను.

తరచుగా వీధిపిల్లలు ఫ్రాంకీ ఇంటికి వచ్చేవారు. ఆ పిల్లలకు దిక్కు దెస ఎవరు ఉండేవారు కాదు. "వేద పిల్లలను సంరంక్షించుకొనుటకై అనాథ ఆశ్రయము" స్థాపింపవలెనని ఫ్రాంకీ కొత్త ప్రణాళికను తయారు చేసెను. ఈ ప్రాజెక్ట్‌కు కూడ ఆయన మరొకసారి ప్రభువు సహాయమును కోరెను.

ఇక .....అనాథ ఆశ్రమము వాస్తవమయ్యెను. త్వరలోనే రెండవ అనాథ ఆశ్రయము కట్టబడెను.

కాని... విషయములు అక్కడే ఆగలేదు. ఇంకా ఎక్కువ భవనములు కట్టబడెను. వాటిలో విధవరాండ్ర గృహము, ఐదు పాఠశాలలు, వాటిలో రెండింటికి హాస్టల్ వసతి కలదు. ఒక సాంకేతిక పాఠశాల వైద్యశాల, ముద్రణా పనులు, మిషనరీ శిక్షణ కళాశాల. హల్లెలోని ఈ సంస్థలన్నియూ "ఫ్రాంకీ ఫౌండేషన్స్‌గా" పిలువబడెను. ఒకసారి, ఎవరైనా ఈ భవనములన్నింటిని చూచి ఆశ్చర్యపడినపుడు "నేను వాస్తవమునకు ఏమియూ చేయలేదు నా నిమిత్తమై అదంతయూ ప్రభువు చేసెను" అని ఫ్రాంకీ చెప్పెను.

75. జర్మనీ పియటిస్ట్‌లు మరియు వారి సువార్త సేవ

స్వయాన జర్మనీకి ఏ విధమైన (ఓవర్‌సీస్ కాలనీలు) లేవు. గనుక వారికి విదేశ సేవ పట్ల తక్కువ ఆశక్తి కలిగివుండిరి.

భారత దేశములోని ట్రాంకోబారు యొక్క డానిష్ కాలనీ నందు పనిచేయుటకు కొంత మంది మిషనరీలను పంపమని డ్యానిష్ రాజు ఫ్రాంకీని ఒక దినాన కోరెను. క్రీ.శ. 1706లో రాజు మనవికి ఫ్రాంకీ స్పందించెను. ఇద్దరు మిషనరీలు హల్లె నుండి భారత దేశమునకు ప్రయాణమైరి. త్వరలోనే ఇతర మిషనరీలు కూడ వచ్చిరి గనుక 'హల్లె' మొదటి లూథరన్ మిషనరీ పనికి కేంద్రమాయెను.

జర్మనీ సరిహద్దు ప్రాంతమునకు సమీపముననున్న స్విట్జర్లాండ్ నగరమైన బాస్లిలో కూడ జర్మనీ పియటిస్ట్‌లు స్థిరపడిరి. ఇక్కడ కూడ ప్రజలు మిషనరీలుగా తర్ఫీదునొందిరి గనుక క్రీ.శ. 1815లో బాస్లి మిషనరీ సొసైటి ఏర్పడెను. ఈ సొసైటీ ఆఫ్రికా, చైనా మరియు భారత దేశమునకు మిషనరీలను పంపును. వారు భారత దేశములో మలబారు తీరమందు పనిచేసిరి. అనేక సంవత్సరముల పిమ్మట మిషనరీలు ఇండోనేషియా ద్వీపమైన బోర్నియాకు వెళ్ళి స్థానిక దయాక్‌లకు వైద్య సేవ చేసి సువార్త బోధించిరి. స్థానికులైన దయాక్ నర్సింగ్ సిబ్బంది సహాయముతో ఒక వైద్యశాల, అనేక క్లినిక్‌లు కట్టబడెను.

విద్య సేవ మరువబడలేదు. స్థానికులైన పిల్లలకొరకు బోర్డింగ్ స్కూల్ మిషనరీల ద్వారా స్థాపింపబడెను, వారు టీచర్ ట్రెయినింగ్ కళాశాలను ప్రారంభించిరి. అటుపిమ్మట, దేవశాస్త్రజ్ఞాన కళాశాలను కూడ స్థాపించిరి. ఆయా సంస్థల స్థాపన ఫలితముగా



క్రీ.శ.1955లో నూటముప్పై ఏడు దయాక్ ప్రొటెస్టెంట్ సంఘములు ఏర్పడెను.

హల్లెలో ఫ్రాంకి విద్యార్థి ఒకడుండెను. అతడు ఒక గౌరవ ప్రదమైన కుటుంబము నుండి వచ్చినవాడు. ఆయన పేరు కౌంట్ వాన్ జింజెన్‌డార్ఫ్ (క్రీ.శ.1700-1760). అతడు పదవ యేటనుండి హల్లెలోని స్కూల్‌కు వెళ్ళెను. అక్కడ ఆయనను పదహారవ యేట వరకు ఫ్రాంకీ చూచుకొనెను. వాన్ జింజెన్ డార్ఫ్ పై చదువుల నిమిత్తమై మరొక స్థలమునకు వెళ్ళెను. చదువుల నిమిత్తమై ఎన్నో ప్రయాణములు చేసెను. అక్కడ దేవుని పట్ల భయభక్తులుగల ప్రజలను కొందరిని కలిసికొనెను మరియు సిలువ వేయబడిన క్రీస్తు పటమును చూచి తన మిగిలిన జీవితమును ప్రభుయేసు సేవలో గడుపుదునని తీర్మానము చేసెను.

ధనికుడైన ఈ జమిందారునకు సాక్సనిలో విస్తారమైన భూ సంపద ఉండెను. అందులో మొరేవియన్ బ్రదరన్ వారు స్థిరపడుటకై అనుమతినిచ్చెను. జాన్ హస్ ఒకసారి బొహేమియలో ప్రసంగించెను. మొరేవియన్ బ్రదరన్ బొహేమియనుండి వచ్చిరి. ఇక్కడ సాక్సనిలో వారు ఒక కాలని స్థాపించిరి. దానిపేరు హెర్న్‌హట్ హెర్నెహట్ అనగా "ప్రభువు పరిరక్షణలో" అని అర్థము.

వాన్ జింజెన్‌డార్ఫ్ ఈ సహవాసమునకు నాయకుడయ్యెను. త్వరలోనే అతడు బిషప్‌గా ప్రతిష్టింపబడెను. కాని ఇటు సంఘముతో అటు ప్రభుత్వముతో సమస్యలు తలెత్తినపుడు జింజెన్‌డార్ఫ్ సాక్సని విడిచి వెళ్ళవలసివచ్చెను. ఏది ఏమైన హెర్న్‌హట్ చక్కగా నిర్వహింపబడుచుండెను.

ఇప్పుడు జింజెన్‌డార్ఫ్ విదేశ ప్రయాణము ప్రారంభించెను. మొదట ఐరోపా దేశములతో ప్రారంభించి తరువాత అమెరికా కూడ దర్శించెను. ఆయన వెళ్ళిన ప్రతి చోట మొరేవియన్ బ్రదరన్ సహవాసములను స్థాపించెను.

జింజెన్‌డార్ఫ్ ఎల్లప్పుడు సువార్త సేవను ఎక్కువగా నొక్కివక్కాణించేవాడు గనుక ఇతర అనేక హెర్న్‌హట్టర్‌లు ఆయన మాదిరిని అనుసరించిరి. అన్యులకు సువార్త ప్రకటించుటకై హెర్న్‌హట్టర్‌లు దేశ విదేశములు సంచరించిరి. వారు ఉత్తరమున ప్రయాణించి గ్రీన్‌లాండ్ తీరములు దర్శించిరి. అక్కడ వారు కొరికే చలిలో మంచు తుఫానుల వలన ఎంతో కష్టపడిరి. ఆఫ్రికాలోని బంగారు తీరములకును వారు వెళ్ళిరి. అక్కడ వేడి వాతావరణమువలన వేసవి కాలపు జబ్బుల వలన ఎంతో బాధపడిరి. వారు రష్యా, దక్షిణ ఆఫ్రికా మరియు దక్షిణ అమెరికాలకును వెళ్ళి సువార్త ప్రకటించిరి.

సూరినామ్‌లోని కుష్టురోగ పీడితులకు హెర్న్‌హట్టర్‌లు సహాయము చేసిరి. వైద్యులు మరియు నర్సులు ఎంతో ఇష్టపడి కుష్టురోగులకు త్యాగముతో సేవ చేసిరి!

హెర్న్‌హట్టర్స్‌లో చాలామంది సేవా పొలములోనే మరణించిరి. వారు రోగములతో, క్రూర మృగముల వలన స్థానికులచే హత్య చేయబడి మరణించిరి, ఎంతో శ్రమనొందిరి.

చాలాకాలము తరువాత వారి ప్రయాసమునకు ఫలితము కలిగినా, వారు నిరాశపడక ప్రయాసపడిరి. యేసుకొరకై ఆత్మలను సంపాదించుటయే వారి అంతిమ ఉద్దేశ్యము గనుక వారు సువార్త పనిని విడువక చేసిరి.

జింజెన్‌డార్ఫ్ మరణించే సరికి, రెండు వందలకంటె పై బడి మిషనరీలు సేవకై పంపబడిరి!

వారు ప్రపంచమందంతట మొరేవియన్ బ్రదరన్ సహవాసములు స్థాపించిరి.

హెర్న్‌హట్టర్స్ క్రీస్తు కొరకు సమర్పించుకున్నవారు. వారు క్రీస్తును ప్రేమతో 'రక్షకుడని' పిలిచేవారు. వారి బోధలలో యేసు మరియు తన సిలువ కీలకముగా నుండును, వారి కీర్తనలలోను యేసు మరియు తన సిలువ ప్రధానముగానుండెను, కాని తండ్రియగు దేవుడు మరియు పరిశుద్ధాత్ముని గూర్చి అంత ఎక్కువగా నొక్కివక్కాణించేవారు కాదు.

76. నెదర్లాండ్స్‌లో నాడేర్ రిఫార్మాటి (అధిక సంఘపునరుజ్జీవం) (1)

నెదర్లాండ్స్‌లో, ఏడవ శతాబ్దములో ప్రభువు పని చేయుచుండెను. సిద్ధాంతము మాత్రమేగాక అభ్యాసము, తలజ్ఞానము మాత్రమే గాక హృదయానుభూతి ముస్నగు సంగతులను మాత్రమే తమ బోధలలో నొక్కి వక్కాణించు వ్యక్తులను దేవుడు లేవనెత్తెను. ఇట్టి భక్తి పరంపర ధోరణిని డచ్ ప్రొటస్టంటిజమ్‌లో నాడిరి రిఫార్మాటి (అధిక సంఘపునరుజ్జీవం) అందురు.


నెదర్లాండ్‌లో ఈ కాలములో, నిజ భక్తి ప్రక్కకు నెట్టివేయబడెను. పాపాత్మకమైన సుఖములు అయిన నాట్యము, జూదము సర్వసాధారణము లాయెను. వ్యాపారము మరియు వాణిజ్యము వలన జర్మన్, నెదర్లాండ్స్ వంటి దేశములు అధికముగా వర్ధిల్లెను. తత్ఫలితముగా వారు విలాసవంత జీవితము జీవించిరి. ఇట్టి పరిస్థితులను ఎదుర్కొనుటకై ఎంతో మంది పరిచారకులు బాధ్యత వహించి పనిచేసిరి. నిజ విశ్వాసమంటే అవగాహనతో మాత్రమే కూడుకొనినది కాదు గాని అది హృదయ సంబంధమైనది అని వారు బోధించిరి.

నాడిరి రిఫార్మాటిలో ప్రసిద్ధిగాంచిన మత గురువు బెర్నార్డస్ స్మిటిగెల్ట్. ఆయన క్రీ.శ.1665-1739 వరకు జీవించెను. ఆయన బాల్యమందే ప్రభువునకు భయపడేవాడు. దేవుడు ఆయనకు ప్రత్యేక తలాంతులిచ్చాడను సంగతి ఎంతో త్వరగానే ప్రస్ఫుటమాయెను. యౌవనస్థునిగా ఉన్నపుడే గ్రామర్ స్కూల్‌కు వెళ్ళి ప్రాచీన భాషలను అధ్యయనం చేసెను. అటు పిమ్మట ఆయన దేవశాస్త్ర జ్ఞాన అధ్యయనము నిమిత్తమై ఆయన ఉట్రెక్ట్ వెళ్ళెను. ఇక్కడ ఆయన భక్తిగల ప్రవర్తనను బట్టి ఇతర విద్యార్థులు ఆకర్షింపబడి ఆయనను గౌరవించిరి. "అకాడమిలో దేవుని భక్తి శ్రద్ధలు గల దీనుడు మరియు హూందాతనము గలవాడు" అని స్మిటిగెల్ట్‌ను గూర్చి చెప్పబడెను.

రెండు సంఘములకు కాపరిగా కొంత కాలము పనిచేసిన పిమ్మట ఆయన మిడిల్‌బర్గ్‌నకు వెళ్ళి తన జీవితపు చివరిదశ వరకు అక్కడే ఉండిపోయెను. ఆయన మిడిల్‌బర్గ్ నందు ఉపదేశిస్తే సంఘములు ప్రజలతో కిక్కిరిసిపోయేవి. ప్రజలు చేయు పాపములను ఆయన ఖండించినపుడు, ఆయన మాట ప్రభావము వలన సంఘభవనపు గోడలు దద్దరిల్లేవి! ఆయన ఎవరిని కూడ విడిచి పెట్టేవాడు కాదు. శపించుట, ప్రమాణము చేయుట, జూదము మరియు ప్రభువు దినమును అపవిత్రముగా ఆచరించుట ముస్నగు పాపములన్నియు దేవుని తీర్పునిమిత్తమై కేకలు వేయుచున్నవి అని ఆయన బిగ్గరగా అరచి చెప్పేవాడు.

స్మిటిగెల్ట్ యొక్క బోధనా విధానము నిర్మోహమాటముగా ఉండేది. ఆయనకు లేఖనములపై మంచి పట్టు ఉండేది. "విశ్వాస మర్మములు" ఆయనకు బాగుగా తెలియును. వాటిని రాత్రి, పగలు ధ్యానము చేసేవాడు. విశ్వాసుల ఆత్మీయ జీవితమును గూర్చి ఆయనకు చక్కటి అవగాహన ఉన్నందున, వారు ఆత్మీయ పోరాటము చేయునపుడు, ఆయన దేవుని వాక్యమునుండి వారికి చక్కటి ప్రోత్సాహము మరియు సలహా ఇచ్చేవాడు. ఏదో రకంగా సమాధానము శాంతి అనిగాక, స్మిటిగెల్ట్‌కి శాంతి చాలా ప్రాముఖ్యము! అన్ని విషయములలో ఆయన దేవుని వాక్య సత్యమునకు లోబడేవాడు. ఆయన భూస్థాపన దినమున ఆదికాండము 5:24 ఆధారముగా సందేశము ఇవ్వబడెను. హనోకు దేవునితో నడచెను, ఈ మాటలు బెర్నార్డస్ స్మిటిగెల్ట్ జీవితమును గూర్చి ఖచ్చితముగా తెలుపును.

విల్‌హెల్మస్ ఎబ్రాకెల్ (క్రీ.శ.1635-1711) తన ప్రసంగములు మరియు పుస్తకముల విషయములో ప్రసిద్ధి. ఆయన బాల్యము నుండి ప్రభువును ప్రేమించేవాడు. ఆయన తండ్రియైన ధీయోడోరోస్ ఎబ్రాకెల్ లీయువార్డెన్ సమీపమున ఉన్న మక్కమ్ అను స్థలములో సేవకునిగా పనిచేయుచుండెను. ఆయన చాలామంచి పేరుగల వాడు. విల్‌హెల్మస్ నిమిత్తమై తల్లిదండ్రులు ఇరువురు కలిసి ప్రార్థించేవారు. విల్‌హెల్మస్ యొక్క కుటుంబము బీయర్స్ అను చిన్న గ్రామములో నివసించేవారు. ప్రతి సోమవారము ఉదయము తన గ్రామమునుండి లీయువార్డెన్ వెళ్ళి అక్కడ ఆయన వారమంతయు ఉండేవాడు. ఆయన స్కూల్‌కు వెళ్తున్న ప్రతిసారి వారి ఊరి బయటవరకు వెళ్ళి అక్కడ ఆయన కొరకు ప్రార్థించి, అతను చాలాదూరము వెళ్ళేంతవరకు అక్కడే ఉండి ఆయన తండ్రి వచ్చేవాడు. "తండ్రి ఈ విధముగా చేయుటవలన నేనునూ స్కూల్‌కి వెళ్తూ ఉండగా మరింత భారముగా ప్రార్థించేవాడినని" విల్ హెల్మెస్ చెప్పెను. తన తండ్రి ప్రభువును ప్రేమించిన విధముగా



తను కూడా ఆయనను ప్రేమించునట్లుగా విల్‌హెల్మస్ ప్రార్థించేవాడు.

ఫ్రిస్‌లాండ్‌లోని అనేక స్థలములలో విల్‌హెల్మస్ పరిచర్య చేసెను. ఆయన నలభై తొమ్మిదవయేట రాట్టర్ డామ్‌నకు వచ్చి అక్కడ ఓ నమ్మకమైన సంఘకాపరిగా పనిచేసెను. ప్రజలు ఆయనను ఓ మంచి బోధకుడని చాలా ప్రేమించేవారు. "పాండిత్యమును చక్కగా వాడుకోవలెను గాని ప్రసంగ సమయములో దానిని ప్రదర్శింపకూడదు" అనునది ఆయన ప్రసంగ ఉద్దేశ్యము.

ప్రభువు దినమున ఆయన ఎలాగో ఒక లాగున సంఘమునకు వచ్చెను. బోధ సమయములో చాలా సార్లు కూర్చుని విశ్రాంతి తీసికోవలసి వచ్చెను. తన సంఘములో బోధ చేయటం అదే చివరిసారి. కూడిక ముగిశాక ఆయనను సంఘస్థులు ఇంటికి మోసికొని వెళ్ళిరి. వారము పిమ్మట విల్‌హెల్మస్ మరణించెను. "నా చుట్టూ ఎంతో ప్రశాంతత ఉన్నది. నేను దేవునితో సమాధానము కలిగియున్నాను" అని మరణముకంటె ముందు చెప్పెను.

రిడిలిజ్‌కి గాడ్స్ డియంట్ (క్రైస్తవుని యొక్క యుక్తమైన సేవ) అను తన పుస్తకము చాలా ప్రసిద్ధిగాంచినది. వందేండ్ల కాలములో 20 సార్లకంటే పైబడి పునఃముద్రణ చేయబడెను. ఈ పుస్తకములో ప్రధానముగా క్రైస్తవ విశ్వాసము మరియు క్రైస్తవ జీవితము గూర్చి వ్రాయబడెను. విశ్వాసంలో బలహీనులైనవారిని ఎంతో శ్రద్ధతో ప్రోత్సహించెను. కృపా గురుతులు దేవుని వాక్యమందు అగుపడును. అట్టివారి దృష్టిని ఆయన దేవుని వాక్యము వైపు మరల్చెను. దేవుని రక్షణను కోరువారిని హెచ్చరిస్తూ "నీ హృదయములో చాలా తక్కువ దేవుని కృప కనపడినా, చూచి దానిని గుర్తించుము" అని చెప్పెను. విల్‌హెల్మస్ ఎ బ్రాకెల్ పరిచారకునిగా ఉంటూ అనేకులకు ఆశీర్వాదకారకమాయెను. ప్రేమ మరియు గౌరవ సూచనగా ఆయన "ఫాదర్ బ్రాకెల్" అయ్యాడు అనుటలో ఆశ్చర్యము లేదు.

77. నెదర్లాండ్స్‌లో నాడేర్ రిఫార్మాటి (2)

నాడిరి రిఫార్మాటి (అధిక సంఘ పునరుజ్జీవం) సమయములో జీవించిన మరొక ముఖ్యమైన వ్యక్తి ఒయేషియస్ (క్రీ.శ 1589-1676). గిజ్స్‌బర్టస్ ఒయేషియస్ బాల్యము నుండే చదువుల పట్ల ఎంతో అభిరుచి కలిగియుండేవాడు. అన్నిటికంటే ముఖ్యముగా ఎంతో భక్తిగలవాడుగా ఉండేవాడు. 15వ యేట దేవశాస్త్రమును అధ్యయనము చేయునిమిత్తమై యూనివర్సిటి ఆఫ్ లెయ్‌డెన్‌కు వెళ్ళెను. త్వరలోనే ఆర్మినియన్‌లు మరియు గొమారిస్ట్‌లకున్న తీవ్ర విబేధములను ఆయన ఎదుర్కొనెను. మానవుని చిత్తము ఆ విబేధ అంశము. విశ్వసించుటకు లేదా విశ్వసించక పోవుటకు మానవునికి స్వేచ్ఛా చిత్తమున్నదా?

విద్యార్థుల మధ్య ఉన్న విబేధమును ఒయేషియస్ చూచెను. ఒక వర్గము వారు గొమారస్‌ను ఆమోదిస్తే మరొక వర్గము వారు ఆర్మేనియస్‌ని ఆమోదించిరి. ఆయన వ్యక్తిగత ఒప్పింపులను బట్టి ఒయేషియస్ గొమారస్‌ను బలపరచెను. ఆయన ప్రొఫెసర్ వైపు ఆకర్షింపబడెను. తత్ఫలితముగా ఒయేషియస్ దేవశాస్త్రజ్ఞాన అవగాహనలో గొమారస్ కీలక పాత్ర వహించును. విద్యార్థులను వ్యతిరేకించు విషయములో ఒయేషియస్ ప్రొఫెసర్ కొరకు సత్యము కొరకు పోరాడెను. కాని అదే సమయములో తను కష్టపడి చదివెను. ఆయన శ్రమించి బైబిల్ మూల భాషలను నేర్చుకొనెను. మరియు సిరియ, అరబిక్ భాషలను కూడ నేర్చుకొనెను. వాదోపవాద శాస్త్రము, తర్కము, కవిత్వము మరియు సంగీతము పట్ల ఓయేషియస్ అధిక ఆసక్తి కలిగియుండెను. ఆయన ఆ విధముగా విద్యను పరిపూర్ణముగా అభ్యసించెను. దేవుడు తనకిచ్చిన తలాంతులను చక్కగా వాడి జీవితపు చివరి దశవరకు ఆయన చదువులు కొనసాగించెను.

లెయ్‌డెన్‌లో తన కోర్స్ ముగించుకొని ఇప్పుడు ఒయేషియస్ హ్యూస్‌డెన్ పట్టణమునకు సమీపముననున్న ఓ చిన్న గ్రామములో సేవ చేసెను. కాని గ్రామస్థులు ఇంకను రోమన్ క్యాథలిక్ సాంప్రదాయములను ఆచరించుచుండిరి. సంఘపునరుజ్జీవ బోధలు వారికింకను కొంచెమైనను తెలియదు. కాబట్టి పరిస్థితి చూడబోతే ఆ స్థలములో ఒయేషియస్ చేయవలసిన సేవ చాలా ఉంది కదూ!


ఆరు సంవత్సరముల పిమ్మట ఆయన హ్యూస్‌డెన్‌లోనే పరిచారకుడై అక్కడ పదిహేడు సంవత్సరములు పరిచర్యచేసెను. ఇక్కడ ఉంటున్న సమయములో ఆయన ఎక్కువగా అధ్యయనము చేయుటలో సమయము గడిపెను. సంఘ పరిణామములను కూడ జాగ్రత్తగా గమనించుచుండెను. ఒయేషియస్ అనేక ప్రాంతములలో ఓ పండితుడుగా మరియు సమర్థతగల దేవజ్ఞానశాస్త్ర మేధావిగా పేరుపొందెను.

క్రీ.శ. 1618లో ప్రసిద్ధి గాంచిన సినాడ్ ఆఫ్ డార్ట్ సమావేశమైనపుడు, ఒయేషియస్ కూడ ఓ సభికునిగా హాజరాయెను. ఆ సమావేశములో 29 సం॥లు గలవాడైయుండి అతియౌవన సభికునిగా హాజరాయెను. క్రీ.శ. 1634లో ఉట్రెక్ట్ యూనివర్శిటిలో ప్రొఫెసర్‌గా ఆయన నియమింపబడెను. ఈ యూనివర్సిటి అప్పుడే స్థాపింపబడియుండెను. భక్తికి పాండిత్యమునకు ఉన్న సంబంధమును గూర్చి ఉపన్యాసమిచ్చి తన అధ్యాపక వృత్తిని ఒయేషియస్ ప్రారంభించెను.

ఈ ఉపన్యాస ముఖ్యాంశము ఉట్రెక్ట్‌లో తన భావి పనిని ఎంతో ప్రభావితము చేసెను. చదువులు చదువుల కొరకే కాదు అని ఆయన విశ్వసించేవాడు. ఒయేషియస్ ప్రకారము, ఈ లోకములో ఒకే అంతిమ ఉద్దేశమున్నది, అదే మన జీవి నిరంతరము పునరుజ్జీవం పొందుట. విద్యకు మూలము దేవుని వాక్యము. దీనిని మనసులో పెట్టుకుని దేవజ్ఞాన శాస్త్రమును "శాస్త్రములకు పట్టపు రాణి" అని పిలిచెను.

రిఫార్మ్డ్ బోధలకు ఉట్రెక్ట్ ఒక కంచుకోటగా మారెను. అక్కడ నుండియే రోమన్ క్యాథలిక్ వారితో పోరాటము, ఆర్మినియన్ అనుచరులతో వాదోపవాదము, బైబిల్ ఆధార రహిత సంగతి అయిన సబ్బాతు ఆచరణను ఖండించుట మున్నగునవి నిర్వహింపబడెను. దేశము మరియు సంఘమును గూర్చి ఒయేషియస్ అధికముగా భారము కలిగియుండెను. ప్రభువు భయము కలిగియుండమని, బైబిల్ వారి మార్గనిర్దేశినిగా మార్చుకొనుమని ఆయన ప్రజలను బ్రతిమాలెను.

చిన్న పిల్లలకు విశ్వాస మూల పాఠములు చెబుతూ ఒయేషియస్ ఎక్కువ సమయములను



గడుపుచుండెను. ప్రొఫెసర్ అయ్యుండి స్కూల్ టీచర్‌గా పనిచేయుటయా అని చాలామంది వాపోయారు. ఒక రోజున విదేశపు దేవజ్ఞాన శాస్త్రజ్ఞులు ఒయేషియస్‌ను దర్శించిరి. ఆయన అనాథలకు బైబిల్ కథలు చెప్పుట వారు చూచిరి.

మిడిల్ బర్గ్‌లోని జీన్ డి లబాడి అను వ్యక్తి యొక్క బోధలను ఒయేషియస్ పరిశీలింపవలసి వచ్చెను. "తిరిగి జన్మించిన విశ్వాసులతో మాత్రమే" స్వచ్ఛమైన సంఘమును కలిగియుండాలి అని జీన్ డి లబాడి ఆశించెను.

గనుక లోకమునకు వేరై జీవించగోరిన విశ్వాసులను లబాడి సమావేశపరిచెను. ఆయన అలా చేయుట ద్వారా సంఘ ఐక్యతను పాడు చేసెను. తత్ఫలితముగా గిరిఫార్మిర్డె కర్క్ (రిఫార్మ్డ్ చర్చ్) నుండి పరిచారకునిగా తొలగింపబడెను. (ఆయన అనుచరులు లబాడిస్ట్‌లని పిలువబడిరి)

అన్నా వాన్ స్కూర్మన్ పండితుడు మరియు ఒయేషియస్ యొక్క విద్యార్థి. ఆయన లబాడిస్ట్‌లతో చేరెను. ఒయేషియస్ మరియు అతని విద్యార్థులకు మధ్య వివాదము చెలరేగెను. ఒయేషియస్ అంతము వరకు కష్టించి పనిచేసెను. ఆయన మరణ దశకు దగ్గరవుతుండగా "ఎక్కడికెళ్తున్నావని నన్నెవరు అడుగనవసరము లేదు" యేసు ఉన్నచోటికి నేను వెళ్ళుచున్నాను మేము ఐక్యపరచబడియున్నాము, మమ్ములెవరు విడదీయలేరు" అని చెప్పాడు.

ఒయేషియస్ భూస్థాపన సమయములో 2 సమూయేలు 3:38 ఆధారముగా సందేశము ఇవ్వబడెను "పడిపోయినవాడు ఇశ్రాయేలు వారిలో ప్రధానుడనియు పెద్దలలో ఒకడనియు మీకు తెలియదా?" ఒయేషియస్ నిజముగా ఓ గొప్ప పండితుడు. పనికై సమర్ధత గలవాడు అన్నిటికంటె ముఖ్యముగా గొప్ప భక్తిపరుడు.

78. వాన్ లోడెన్‌స్టెయిన్

ప్రసిద్ధిగాంచిన కవి-బోధకుడు అయిన ఓడొకస్ వాన్ లోడెన్ స్టెయిన్ (క్రీ.శ.1620-1677) ఒయేషియస్ యొక్క విద్యార్థి మరియు మిత్రుడు. వాన్ లోడెన్‌స్టెయిన్ యొక్క బోధనా విధానము తీవ్రముగాను నిబ్బరముగాను ఉండును. హృదయములో భక్తిని మరియు అనుదిన జీవితములో పరిశుద్ధతను ఆయన నొక్కివక్కాణించేవాడు. ఆయన బోధించినపుడు ప్రజల పాపాత్మక జీవితమును మరియు వారి అనాగరిక జీవితమును ఖండించేవాడు. అనుదిన జీవితములో భక్తిని కలిగియుండాలని ఆయన బోధించేవాడు మరియు వ్యక్తిగతముగా బైబిల్ సత్యమును అనుభవింపవలెనని ముఖ్యముగా బోధించేవాడు. ఈ నిజభక్తి కొరకైన పోరాటము వాన్ లోడెన్ స్టెయిన్ జీవిత లక్షణములను ప్రతిబింబించును.

పాలక వర్గమునకు చెందిన ఓ విశిష్ట కుటుంబమునుండి వాన్‌లోడెన్ స్టెయిన్ వచ్చెను. ఆయన తండ్రి డెల్ట్‌లో ఊరిపెద్దగా ఉండేవాడు. ఓడోకస్ మంచి క్రైస్తవ వాతావరణము నందు పెరిగెను. చిన్న వయసునుండే ఆయనకు సత్యజ్ఞానము క్షుణ్ణముగా తెలుపబడెను. ఇటువంటి బోధను దేవుడు ఎంతగా దీవించాడంటే, ఓడోకస్ వాన్ లోడెన్ స్టెయిన్ యౌవన ప్రాయములోనే ప్రభువునకు భయపడి జీవించేవాడు.

యూనివర్సిటీ ఆఫ్ ఉట్రెక్ట్ వెళ్ళి అక్కడ నేర్పరి



మరియు భక్తి పరుడైన ఒయేషియస్ పర్యవేక్షణలో చదువుకొనెను. తదుపరి వారు చిరకాల స్నేహితులైరి. 24 సం॥ల ప్రాయములో ఆయన ఓయెటెర్మర్‌లో పరిచారకుడాయెను. అక్కడ తను సేవచేయ ప్రారంభించినది మొదలుకొని ఆయన భక్తి మరియు బోధ ప్రజలపై చెరగని ముద్రవేసెను.

"దేవుని కొరకై జీవించు ప్రజలెక్కడ? దేవుని మహిమపరచుట మాత్రమే జీవిత ఉద్దేశముగల కుటుంబాలెక్కడ? యేసు సన్నిధిని అనుభూతిగా పొందే కూడికలెక్కడ? దేవుని వాక్యపు శక్తి వలన కీడునుండి వైదొలగి మేలైన దానిని చేయగోరే ప్రజలను మనమెక్కడ చూచెదము? దేవుని వాక్య బోధద్వారా వ్యక్తిగతముగా ఆయన నీకు రక్షణ ఆహ్వానమిస్తున్నాడని నీవెందుకు గమనించవు? నీవు యేసుకు విరోధముగా పోరాటము చేయుట ఆపివేస్తే నీ ఆత్మ రక్షింపబడును. సుఖ భోగముల సంబంధమైన కోర్కెలను ప్రక్కన బెట్టమని నేను మనవి చేయుచున్నాను. అప్పుడు మాత్రమే నీవు నిజ సుఖమును కనుగొందువు...." అని తన ప్రసంగములలో శ్రోతలను అడిగేవాడు.

ఓడొకస్ వాన్ లోడెన్ స్టెయిన్ వరముగల బోధకుడు. ఆయన గంభీర భాషను వాడి చూపించుకొనడు. "నా ప్రసంగములు ఎక్కువ వెలుగును ప్రసరింపచేయలేని మసకబారిన అద్దమువలె ఉండకూడదని" ఆయన చెప్పేవాడు.

ఆయన సంఘములో ఒక ప్రొఫెసర్ ఉండేవాడు. ఈయనలో అపొస్తలుల ధోరణి ఉన్నదని, అపొస్తలులు ఈయనలాగే అచ్చం బోధించియుండేవారని" ఆయన చెప్పెను.

ఆయన శత్రువులు సహితము ఆయనను "ఓ సజీవ మార్గదర్శి" అని పిలిచేవారు. తరువాత ఆయన ఉట్రెక్‌లో పరిచర్య చేయుచుండగా, ఆయన కీర్తన రచయితగా మరియు కవిగా పేరుపొందెను. ఆయన సాధారణముగా ఆదివారపు కూడిక ముగిశాక కీర్తనలు మరియు పద్యములు వ్రాసేవాడు. ఇలా రచనలు చేయుటవలన ఆయన కష్టించి ప్రసంగించినందున సేద దీర్చుకునే వాడు. ఆయన రచనల పేరు ఉటిస్పానింగ్ (ఆధునిక డచ్ భాషలో ఆపేరును ఆంట్ స్పానింగ్ అని అందురు దానికర్థము విశ్రాంతి, సేదదీరుట.) కీర్తనలు, కవితలు ఒక వ్యక్తియొక్క హృదయపు లోతును తాకును. ఆయన కీర్తనలు మరియు కవితలలో ఇదే సందేశము కనబడును:

చెడుపాటలకు వట్టి కథలకు స్వస్తి చెప్పండి,
పరలోక ప్రేమను ప్రత్యక్ష పరచే దేవుని వాక్యము,
నా ఆత్మకు అనుదిన ఆనందము,
ఓ ప్రభువా, పై నుండి నీ ఆత్మను పంపుమని ప్రార్థిస్తున్నాను!

ఆయన వ్రాసిన పాటలు ప్రజలు పాడునట్లు చేయుటకై, పాపులర్ ట్యూన్స్ వాడి ఆయన రచించిన కీర్తనలకు సంగీతము కూర్పు చేసేవాడు. వాన్ లోడెన్ స్టెయిన్ స్వయాన వాటిని తరచుగా పాడుకునేవాడు సంఘ కూడికలలో కీర్తనలు మాత్రమే పాడవలెనని ఆయన భావించేవాడు.

ఆయన ధనికుడైనా, వాన్ లోడెన్ స్టెయిన్ సాధారణ జీవితము జీవించేవాడు. పేదలకు, రోగులకు ఎంతో సహాయము చేసేవాడు ఆయన శ్రద్ధగలవాడుగాను దీనుడుగాను పేరొందెను. కాని ప్రజలు జూదమాడినపుడు సుఖ విలాసములలో పాల్గొన్నపుడు ఆయన వారిని కఠినముగా గద్దించేవాడు.

పిల్లలకు మరియు పెద్దలకు ఎక్కువ సమయము వెచ్చించి విశ్వాసమూల సంగతులను నేర్పెడివాడు. విద్యార్థుల సహవాసమునకు ఆయనే స్వయాన అధికారిగా ఉండేవాడు ఆయన నమ్మకమైన సంఘ కాపరిగా ఉంటూ, తన సంఘ విశ్వాసులను దర్శించినప్పుడు వారి ఆత్మీయ స్థితిగతులు ఎలా ఉన్నయో గమనించి చూచేవాడు.

ఒక దినాన వాన్‌లొడెన్ స్టెయిన్ తీవ్ర అనారోగ్యమునకు గురియయ్యెను. ఆయనకు వీడ్కోలు పలుకుటకై చాలామంది వచ్చిరి. "చనిపోవటమంటె ఇంతేనా? ఇదంతా నేను పూల పాన్పుమీద పడుకున్నట్లుంది"అని మరణించబోయేముందు చెప్పెను. ఇంకా ఏమైన మీరు చెప్పదలచారా? అని విశ్వాసులు అడిగినపుడు" నాకున్నదంతా యేసే, అంతేచాలు అని చెప్పాడు.

మనుష్యుల నోళ్ళు మరియు శక్తివంతమైన దూతలు,
ఏకముగా కూడి పాడుడి,
యేసును స్తుతించి మహిమ పరుచుడి!

79. పదిహేడవ శతాబ్ధములో గ్రేట్ బ్రిటన్

61వ అధ్యాయములో క్వీన్‌మేరీ (బ్లడీమేరీ) ఆధ్వర్యములో చెలరేగిన హింసను గూర్చి మనము చదువుకున్నాము. క్రీ.శ.1603లో ఎలిజబెత్ మరణించగా ఆవిడ సహోదరుడు జేమ్స్ అధికారములోనికి వచ్చెను. అతడు ఇంగ్లండ్, స్కాట్‌లండ్, ఐర్లాండ్‌లకు అతడు జేమ్స్I, రాజాయెను. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌కు అధిపతిగా మారి ఈ సంఘమును కూడ స్వీకరించుమని స్కాట్‌లండ్ వారిని ఆ రాజు వత్తిడి చేసెను. ఆయన పెద్ద ఎత్తున ఎదిరింపబడెను మరియు రాజు ఆజ్ఞను స్వీకరించని ప్రెస్బిటేరియన్‌లు (స్కాటిష్ ప్రొటెస్టంట్‌లు) హింసింపబడిరి. ప్యూరిటన్‌లు (ఇంగ్లీష్ ప్రొటెస్టంట్‌లు) స్థిరపరచబడిన, చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌నకు తప్పక తిరిగి రావలెనని జేమ్స్ ఆజ్ఞాపించెను. తిరిగి రాని వారు హింసింపబడుదురు.

క్రీ.శ. 1625లో జేమ్స్ మరణించగా చార్లెస్ I, అధికారము చేపట్టెను. క్రొత్త రాజు తండ్రి విధానమును అవలంభించెను. ఆయనకు విరోధముగా చర్యలు తీసికొనబడెను గనుక ప్యూరిటన్స్ మరియు ప్రెస్బిటేరియన్స్ అధిక హింసను ఎదుర్కొనిరి. చార్లెస్ పెత్తనమును బట్టి రాజుకు మరియు పార్లమెంట్ (పాలక కార్యవర్గము)నకు మధ్య గొప్ప పోరాటము చెలరేగెను. తత్ఫలితముగా ప్రజాయుద్ధము జరిగెను. ప్రొటెస్టెంట్ ఉద్యమము చేయు ఇంగ్లిష్ గ్రామీణులతో చార్లెస్ మరియు అతని సైనికులు యుద్ధము చేసిరి. ఇంగ్లిష్ వారు కూడ ఆలివర్ క్రామ్‌వెల్ (క్రీ.శ.1599-1658) ఆధ్వర్యములో సైన్యముగా తయారైరి.

ఆలివర్ క్రామ్‌వెల్ ఓ క్రైస్తవ విశ్వాసి, యౌవన దశలో పార్లమెంట్ సభ్యుడయ్యాడు. ఐరోపాలోని ప్రొటెస్టెంట్ ఉద్యమమును ఆయన బలపరచెను. గస్టావస్ అడల్ఫస్ జర్మన్ ప్రొటెస్టంట్‌లకు సహాయము చేయ ప్రయత్నించినపుడు ఇంగ్లాండు సహాయము చేయనందుకు ఆయన చాలా సిగ్గుపడ్డాడు. మానవ ప్రయత్నము పట్టించుకోదగినది కాదని ఆయన ఎంతో గాఢముగా ఒప్పించబడ్డాడు. దేవునితో వ్యక్తిగత సంబంధమును క్రామ్‌వెల్ నొక్కి వక్కాణించేవాడు. కృపద్వారా నీతిమంతునిగా తీర్చబడుట, క్రీస్తు యోగ్యతపై ఆధారపడుట మున్నగు విషయములు విశ్వాసిని బలపరచును. సిద్ధాంతమును ప్రయోగాత్మకముగా అనుదినము వ్యక్తిగతముగా అన్వయించుకొనుటను గూర్చి క్రామ్‌వెల్ శ్రద్ధ చూపేవాడు. ఈ కారణము చేత ఉన్నత వర్గము చేత అణచివేయబడు కడుబీద రైతులకు తన సహాయము నందించేవాడు.

ప్యూరిటన్‌లు, ప్రెస్బిటేరియన్‌లు, ఇండిపెండెంట్‌లు మరియు బాప్టిస్ట్‌లు వీరందరితో అనగా వేర్వేరు మతశాఖలద్వారా, ప్రొటెస్టెంట్‌ల ద్వారా క్రామ్‌వెల్ సైన్యమును తయారు చేసెను. (వీరు డిసెంటర్స్ లేదా నాన్‌కన్‌ఫార్మిస్ట్‌లు అని పిలువబడిరి. ఎందుకంటే వారు స్థిరపరచబడిన సంఘము అనగా చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో సభ్యులుగా నుండుటకు నిరాకరించిరి).

క్రామ్‌వెల్ విపరీత క్రమశిక్షణ గలవాడు. ఆ సైన్యములోనున్నవారు శపింపకూడదు, దాని బదులు సైనికులు కీర్తనలు పాడి ప్రార్థింపవలెను. క్రామ్‌వెల్‌కు మిలిటరి అనుభవము లేకపోయినా ఆయన సైన్యము చాలా బలముగలది. రెండు సందర్భాలలో ఈ సైన్యము వలన కింగ్ చార్లెస్ ఓడింపబడెను. క్రామ్‌వెల్ యొక్క సైన్యము బహిరంగముగా వారి విజయమును బట్టి దేవునికి కీర్తనలు పాడి ఆయనను స్తుతించేవాడు!

తుదకు పార్లమెంట్ చార్లెస్‌కు మరణ శిక్ష విధించెను. ఇప్పుడు ఇంగ్లండ్ పార్లమెంట్‌చే పరిపాలింపబడే (గణతంత్ర) రిపబ్లిక్, కామన్ వెల్త్‌గా మారెను. ప్రభుత్వములో క్రామ్‌వెల్ అత్యంత అధికారముగల వ్యక్తిగా మారెను. ఇంగ్లండ్‌నకు మతస్వేచ్ఛ కలుగజేయుటకు దేవుడు తనను పిలిచెనని ఆయన భావించెను మరియు ఇంగ్లీష్ కామన్ వెల్త్ సంరక్షకుడాయెను.

తదుపరి సంవత్సరములలో రిఫార్మ్డ్ థియాలజిపై ఆధారపడ్డ ప్రొటెస్టెంటిజమ్ ఇంగ్లండ్‌లో చాలా విస్తరించెను. సినిమా హాల్స్, నాట్యశాలలు మూయబడెను. మద్యము సేవించుట మరియు శపించుట



నేరములుగా ఎంచబడెను. జీవితము అనుదినము భక్తి శ్రద్ధల వైపు మరలెను. దీనినే ఇంగ్లండ్‌లో ప్యూరిట నిజమ్ అని అందురు. ఒక ముఖ్యమైన సంఘ సమావేశములో విశ్వాస ప్రమాణము నిరూపింపబడెను. సిద్ధాంతమందు కాల్వినిస్టిక్‌గా నుండి వెస్ట్‌మిన్‌స్టర్ కన్‌ఫెషన్‌గా పిలువబడెను. ఈ ఒప్పుకోలు ఎంతో ప్రభావితమై అనేకులకు ఒక గొప్ప ఆశీర్వాద కారకమాయెను. ఈ దశలో కూడ దేవుడు భక్తిగల బోధకులను లేవనెత్తెను, దేవుడు వారి పరిచర్యను దీవించెను. కాని... మళ్ళీ పరిస్థితులు మారుట ప్రారంభమాయెను.

క్రీ.శ.1660లో ఇంగ్లండ్ మరియు స్కాట్‌లండ్ మరొకసారి రాజు పాలన క్రిందకు వచ్చెను. ఆయన పేరు చార్లెస్II ఆయనకూడ ఒకే ప్రభుత్వము ఒకే సంఘమును కలిగి యుండవలెనని ఆశించెను. అదే చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ ఆయన డిసెంటర్స్‌ను ఎంతో కఠినముగా వ్యవహరించెను.

ఏ పరిచారకులైతే చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో సభ్యులుగా నుండుటకు ఇష్టపడరో అటువంటివారిని వారి పదవి నుండి తొలగించిరి. తొలగించబడిన తరువాత కూడ వారు బోధచేస్తే వారు చెఱసాలలో బంధింపబడుదురు లేదా బహిష్కరింపంపబడుదురు. అక్రమముగా బోధచేస్తే అది మరణ శిక్షతో సమానము! (ఈ కాలములోనే జాన్‌బన్యన్ జీవించెను మనము ఆయనను గూర్చి వచ్చే అధ్యాయములో చదువు కొందుము)

చార్లెస్ II తరువాత, జేమ్స్ II అధికారములోనికి వచ్చెను. ఆయన మూడేండ్ల పరిపాలనలో పద్దెనిమిది మంది డిసెంటర్స్‌ను (తిరుగుబాటు దారులను) చంపివేసెను. పరిస్థితి ఎంత కష్టముగానున్నది! ఇదియు గాక రాజు రోమన్ క్యాథలిక్స్‌కు ఎక్కువ అధికారమిచ్చెను వారికి సహాయము చేయమని కొందరు పలుకుబడిగల వ్యక్తులు విల్లెమ్ III ని కోరిరి. విల్లెమ్ డచ్ దేశాధిపతి. విల్లెమ్‌కు పరిస్థితులు కష్టముగానున్నా క్రీ.శ.1688లో పెద్ద సమూహముతో ఇంగ్లండ్‌కు వెళ్ళెను. (జేమ్స్ II విల్లెమ్ యొక్క మామ!) జేమ్స్ ఫ్రాన్స్‌కు పారిపోగా, విల్లెమ్ III మరియు ఆయన భార్య మేరీ ఇంగ్లండ్‌కు రాజుగాను రాణిగాను నియమితులైరి. ప్రభువు ఇంగ్లండ్‌లోని తన ప్రజలను వత్తిడి, కష్ట సమయమునుండి విడిపించెను.

80. జాన్ బన్యన్

క్రీ.శ.1628లో బెడ్‌ఫోర్డ్‌కు సమీపమునన్ను ఎల్‌స్టో అను చిన్న గ్రామములో జాన్ పుట్టెను. ఆయన తండ్రి తపిల చెంబు పాత్రలు, పెన్నములకు మాట్లువేసేవాడు (టింకర్), ఆ రోజుల్లో ఈ పని అంత గౌరవ ప్రదమైనది కాదు. ఆయన స్కూల్‌కు వెళ్ళి చదువుట మరియు వ్రాయుట నేర్చుకొనెను. చిన్న పిల్లవాడిగా అతను ఉన్నపుడు, దైవ తీర్పు మరియు నరకమును తలచుకుంటేనే ఎంతో భయపడేవాడు. కాని ఆయన పెరిగి పెద్దవాడవుతుండగా అటువంటి తలంపులన్ని మటుమాయమాయెను. ఆయన మిత్రులతో కలిసి చాలా అల్లరి చేసేవాడు. రానురాను జాన్ భక్తిహీనుడుగా మారెను. అబద్దములు, శపించుట, ప్రమాణము చేయుట మున్నగు పాపములు చేయుటలో జాన్ అంతటి చెడ్డవాడు లేడు. తన యౌవన దశలో అక్రమ జీవితము జీవించెను. సైన్యములో చేరుటకై జాన్ నిర్ణయించుకొనెను. అక్కడ ఎంతో గుర్తుండిపోవులానున అతడు మరణమునుండి తప్పించుకొనెను. ఒక రోజు జాన్ గార్డ్ డ్యూటీ (కాపల కాయుట) చేయవలసివచ్చెను. ఆ రాత్రి మరొక సైనికుడు జాన్‌కు బదులుగా పనిచేయుచుండగా తలలో తూటా దూరి చనిపోయెను...

చాలాకాలము కాకమునుపే జాన్ సైన్యము విడిచిపెట్టి వివాహము చేసికొనెను. ఇలాగనైనా, తన మార్గము మార్చుకొని, జీవితమును తీవ్రముగా తీసికుంటాడను నిరీక్షణతో తన మిత్రులు ఆయనకు ఇటువంటి సలహా ఇచ్చిరి. జాన్ మరియు అతని భార్య చాలా పేదవారు వారికి తినడానికి కంచము త్రాగుటకు చెంబు మాత్రమే ఉండేవి. తన భార్య, కేవలం రెండు పుస్తకములు మాత్రమే వారి నూతన గృహమునకు తీసుకొనివచ్చెను. భార్యయొక్క తండ్రి భక్తిగలవాడు గనుక ఆయననుండి ఈమె ఆ పుస్తకములు తెచ్చుకొనెను. కొన్ని సార్లు భార్యాభర్తలు ఇరువురు ఆ పుస్తకమును కలిసి చదివేవారు. అతని భార్య ఆదివారము తనతోపాటు సంఘమునకు రమ్మని బలవంతము చేయుచుండెను. కాని జాన్ ఇంకనూ తన చెడునడతలను కొనసాగించుచునేయుండెను.

ఆదివారము మధ్యాహ్నము వేళ టిప్‌క్యాట్ అను ఆట ఆడుట ఆయనకు చాలా ఇష్టముగా నుండెను. ఆయన యథావిధిగా ఆ ఆట ఆడుచున్నపుడు అకస్మాత్తుగా ఆకాశమునుండి "నీ పాపములు విడిచి పరలోకము వెళ్ళెదవా లేక నీ పాపములతో నరకము వెళ్ళెదవా?" అను ఒక స్వరమును జాన్ వినెను. ఇక భయపడి ఆ ఆట ఆడుట మానివేసెను. ఎంతగొప్ప పాపి అతను! ఆయన పరలోక మార్గమును వెదకటము ఆలస్యమాయెను. కావున తన పాపపు జీఇతము కొనసాగించుటయే అతడు చేయవలసిన పని.

జాన్ ప్రవర్తన మునుపటికంటే ఘోరమాయెను. అతను శపించి, ప్రమాణము చేస్తుంటే అది ఒక దినాన ఓ స్త్రీ చూచి, జాన్ బన్యన్ లాంటి చెడ్డవ్యక్తిని ఎక్కడనూ చూడలేదని చెప్పెను (ఆమెకు స్వయాన మత భక్తిలేదు) "నీవు శపించుట మరియు ప్రమాణము చేయుట ద్వారా ఈ పట్టణములోని యౌవనస్థుల జీవితములు నాశనము చేయుచున్నావు" అని ఆవిడ చెప్పెను. ఆ రోజు నుండి జాన్ అల్లరి పనులు చేయుట మాని బైబిల్ చదువుట ప్రారంభించెను.


ఆయన టింకర్‌గా (తపిల చెంబులకుమాట్లు వేసే కంచరవాడు) తన జీవనమును కొనసాగించెను (ఇత్తడి పాత్రలకు రంధ్రములు పడితే వాటిని సరిచేయుట). ఒక రోజున అతను పని చేయుచుండగా బెడ్‌ఫోర్డ్ నందు ముగ్గురు స్త్రీలు మాట్లాడుకొనుచుండిరి. దేవుడు వారి హృదయములో పనిచేయు విధమును గూర్చి మాట్లాడుకొనుచుండిరి. వారి మాటలు జాన్ మనసును తట్టెను. తన దగ్గర లేనిదేదో వారి దగ్గర ఉన్నట్లు జాన్ గమనించెను. ఆయన ఆత్మీయముగా ఎంత దరిద్రుడైయున్నాడో ఆయన తెలిసికొనెను. ఎంతో ఆతురతతో ఆయన పరలోక రాజ్యమును అన్వేషించుట మొదలు పెట్టెను. ఆయన ప్రతి దినము ప్రార్థించి లేఖనములు పరిశోధించుచుండెను. ఆయన ఏదైన సత్యమును గ్రహించలేకపోతే, బెడ్ ఫోర్డ్‌లోని ఆ ముగ్గురు భక్తిగల స్త్రీల యొద్దకు వెళ్ళేవాడు. ఆ స్త్రీలు మిస్టర్ గిఫోర్డ్ బోధించు బోధను వినుటకు జాన్‌ను తీసికుని వెళ్ళెను. తన ఘోర స్థితిని జాన్ గ్రహించటం ప్రారంభించెను. తన పాప భారము అధికమగుట మొదలయ్యెను. ఆ భారముతో రాత్రింబగళ్ళు ఆయన క్రుంగిపోయెను. "నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును త్రోసివేయను" అను మాటలతో ప్రభువైన యేసు మాట్లాడి ఆయనకు విడుదలనిచ్చెను. యేసు ఇప్పుడు జాన్ యొక్క రక్షకుడాయెను!

త్వరలోనే జాన్‌కు బాప్తిస్మమీయబడెను. ఆయన తలాంతుగల వ్యక్తియని ప్రజలు గమనించి బోధ చేయుటకై వెళ్ళమని వారు ఆయనను ప్రోత్సహించిరి.

మొదట ఆయన బెడ్‌ఫోర్డ్ నందు ప్రసంగించి అటు పిమ్మట ఇతర గ్రామములకు కూడ వెళ్ళెను. ప్రజలు ఆయన ప్రసంగములు విని ఆనందించిరి. కొన్ని యేండ్ల తరువాత అతడు ప్రసంగించుచుండగా బంధింపబడెను. (అరెస్ట్ చేయబడెను) ఆ రోజులలో చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ ఆమోదించిన మత గురువులు మాత్రమే బోధించుటకు అనుమతి కలిగియుండిరి. జాన్ ప్రసంగించుటను ఆపుటకు నిరాకరించెను గనుక పదమూడు యేండ్లు చెఱసాలలో వేయబడెను. విశేషముగా చివరి ఏడు సంవత్సరములు భరించుటకు చాలా కష్టముగానుండెను. అతడు చెఱసాలలో ఉన్ననూ తనతోటి కఠిన నేరస్థులకు వాక్య సందేశము అందించుచుండెను.

ఇక్కడ, ఈ రోతగా వుండే చెరసాలలలో నుండి బన్యన్ తన ప్రసిద్ధిగాంచిన "యాత్రికుని ప్రయాణము" (పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్) అను పుస్తకమును వ్రాసెను. యాత్రికుని ప్రయాణము అను ఈ పుస్తకములో, కాల్వినిజమ్‌ను రమ్యమైన ఆహ్లాదకర రంగులతో అభివర్ణింపబడెనని చెప్పబడెను. వందకు పైబడి వేర్వేరు భాషలలో ఈ పుస్తకము అనువదింపబడెను.

క్రీ.శ. 1672 లో బన్యన్ చెఱసాలనుండి విడుదల పొందెను. అక్కడ నుండి నేరుగా వెళ్ళి మళ్ళీ బోధింప ప్రారంభించెను. ఆత్మల పట్ల ఆయనకున్న లోతైన కనికరము అనేకులను ఆకట్టుకునెను. అతను లండన్‌లో ప్రసంగిస్తే మూడువేల మంది వచ్చిరి. తన ప్రసంగమును దేవుడు దీవించుట చూచి బన్యన్ ఆనందించెను. క్రీ.శ.1688 లండన్‌లో అధిక సంఖ్యగల ప్రజలకు బోధ చేయవలసియున్నది కాని మరణము సమీపించుచున్నది. ఆయన యధావిధిగా బోధించాడు కాని మరుసటి రోజు అనారోగ్యముతో పడకలో ఉండెను. రెండు రోజుల పిమ్మట జాన్ బన్యన్ మరణించెను. "నేను దూరము నుండి నగరమును చూడగలుగుతున్నాను మరియు పట్టణపు ద్వారము తెరువబడుట చూడగలుగుతున్నాను" అని తన చివరి మాటలు పలికెను.



81. ఇంగ్లండ్ మరియు అమెరికాలలో ఉజ్జీవం

18వ శతాబ్దములో ఇంగ్లండ్‌లో సంఘజీవితము దిగజారుతుండెను. సాధారణ ప్రజలు తరచుగా త్రాగుడు, అక్రమ జీవితాలు జీవిస్తూ బాహాటముగా పాపాత్మక జీవితము జీవించుచుండెడి వారు. సాధారణ ప్రజలేగాక మతగురువులు కూడ పాపభోగములలో మునిగి తేలుచుండెడివారు. కాని ప్రజలు వారి పాపముల విషయమై పశ్చాత్తాపపడునట్లుగా బోధించు బోధకులను మరొక్కసారి దేవుడు లేపెను.

జాన్‌వెస్లీ (క్రీ.శ.1703-1791) యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ నందు దేవజ్ఞాన శాస్త్రము అధ్యయనము చేయుచుండెను. తన చదువులు ముగించుకొని అమెరికాకు బయలుదేరెను. జాన్ తీవ్రముగానుంటూ, ప్రశాంత బుద్ధి కలిగి జీవించేవాడు. అమెరికాలో నివసించు భారతీయులను మార్చుటకై ఆయన వెళ్ళదలచెను. కాని ఆయన అమెరికాకు ఓడలో బయలుదేరుతుండగా (75వ అధ్యాయములో గమనించినట్లు) అతనివలె మిషనరీలుగా వెళ్తున్న హర్న్‌హట్టర్స్‌ను కలుసుకొనెను. వారిని కలుసుకున్న జాన్ నిర్ఘాంతపోయెను. వారితో మాట్లాడాక, నీతిగా, మర్యాదగా బ్రతికినా తాను ఇంకనూ మారని వ్యక్తిగా ఉన్నట్లు జాన్ గమనించెను. అమెరికాలో తన పని కుప్పకూలిపోగా ఇంగ్లండ్‌కు తిరిగి వచ్చెను. దేవునియందు నిజ విశ్వాసములేదని తెలిసాక అతడు చాలా బాధపడెను. కాని క్రీ.శ.1738లో ఇంగ్లండ్‌లో ఉండగా, తన జీవితములోనే ఒక ముఖ్య దినము ఉదయించెను! ఆయన ఒక కూడికకు హాజరైనపుడు, ప్రసంగీకుడు మార్టిన్ లూథర్ పుస్తకములోనుండి కొన్ని సంగతులను చెప్పెను. ఆ తరువాత జాన్‌యొక్క జీవితము మలుపు తిరిగెను. ఇప్పుడైతే ఆయన ప్రతియొక్కరికి సువార్త ప్రకటింపవలెనని ఆశపడెను. "సువార్త పనికొరకు ప్రపంచము వేదిక" అని ఆయన చెప్పెను.


ఈ పని విషయములో జాన్ మిత్రుడైన జార్జ్‌వైట్‌ఫీల్డ్ (క్రీ.శ. 1714-1770) జాన్‌ను బలపరచెను. జార్జ్‌వైట్ ఫీల్డ్ యౌవనస్థుడుగా ఉండగా, పాపజీవితమును గడిపెను. అతడు అనుకోకుండ ఒక రోజున సంఘమునకు వెళ్ళినపుడు మతగురువు ప్రసంగించెను. పలుకబడిన మాటలను ప్రభువు ఉపయోగించెను. మారుమనస్సు పొంది ప్రభువు సేవ చేయాలని జార్జ్‌వైట్‌ఫీల్డ్ కోరుకొనెను. వెస్లీవలె వైట్‌ఫీల్డ్ అధ్యయనము చేయుటకై ఆక్స్‌ఫర్డ్ వెళ్ళెను. అక్కడ జాన్ వెస్లీ, చార్లెస్ వెస్లీ మరియు జార్జ్‌వైట్‌ఫీల్డ్ కలిసి ఒక క్లబ్ ప్రారంభించిరి.

అందులోనికి ఇతర విద్యార్థులకునూ ప్రవేశము కలదు. వారు ప్రతి సాయంత్రము కూడుకునేవారు. వారు కూడికను ప్రార్థనతో ప్రారంభించి, వారి ముందు బల్లమీద తెరువబడిన బైబిల్ ఉండగా, వారి విశ్వాస జీవితము మరియు చదువులను గూర్చి మాట్లాడుకునే వారు. పేదవారు మరియు చెఱలో ఉన్న వారి మధ్య సేవచేయు నిమిత్తమై సిద్ధపడేవారు. యౌవనస్థుల గూర్చి కూడ వారు ఆలోచించేవారు, వారములో రెండు సార్లు వారు ఉపవాసముండేవారు.

వారు వారి సమయమును ఓ పద్ధతి చొప్పున వాడుకునే వారు గనుక అపహాస్యరీతిగా మెథడిస్ట్‌లని వీరు చేయు పని అంటే గిట్టనివారు పేరు పెట్టిరి. వెస్లీ మరియు ఆయన మిత్రులు జరిగించు కూడికలను ఎగతాళిగా "హోలీ క్లబ్స్" అని పిలిచేవారు.

ఆయన తన కోర్సు ముగించుకున్నాక వైట్‌ఫీల్డ్ కూడ శుభవార్త సందేశకునిగా మారాలని ఆశపడెను. మొదట్లో ఆయన మరియు ఆయన మిత్రులు ఇంగ్లండ్‌లో స్థాపింపదలచుకోలేదు కాని తుదకు సంఘమును స్థాపింపవలసివచ్చెను. వారు బోధించు విధానమును బట్టి వారికి చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో అనుమతి లభించలేదు. వారు పాపము మరియు కృపను గూర్చి బోధించేవారు. పాపముల విషయమై పశ్చాత్తాపపడమని వారు ప్రజలను కోరేవారు. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో ఇటువంటి సందేశములు అస్సలు వినబడవు. గనుక వారికి ఆ సంఘములలో అనుమతి లేక వీధులలో బహిరంగ బోధచేసేవారు.

వైట్‌ఫీల్డ్ వరముగల బోధకుడు. బొగ్గు గనులలో



పనిచేయు పేదకార్మికుల మధ్య వైట్ ఫీల్డ్ బోధించుట ప్రారంభించెను. ఆయన తన మొదటి ప్రసంగమును దాదాపు రెండువందలమంది వినిరి. మరొక కూడికలో వెయ్యి మంది మరియు ఒక నెల తరువాత ఇరవై వేల మంది కూడికకు హాజరైరి!

వారు బొగ్గు గనులలో పనిచేయువారు "గనుక నల్లటి బుగ్గలపై కన్నీరు కారెను" అని స్వయాన వైట్‌ఫీల్డ్ తన ప్రసంగముల స్పందనను గూర్చి చెప్పెను. వైట్‌ఫీల్డ్ ప్రసంగము ద్వారా ప్రభువు ప్రజల హృదయములను తెరచెను. ఉజ్జీవము ప్రారంభమైనపుడు దాని ఎదుట ఎవరునూ నిలువలేకపోయిరి. వెస్లీ (గుఱ్ఱపు స్వారీ చేస్తూ) దేశమందంతట ప్రయాణించెను. దూర ప్రాంతములనుండి వేలాదిగా ప్రజలు వచ్చి అద్భుత సువార్త సందేశము వినేవారు. ప్రజలు నావికులైనా, సంతవీధులలో ఉన్న వారైనా, ఆసుపత్రులు, చెఱసాలలో ఉన్నవారైనా వెస్లీ మరియు వైట్‌ఫీల్డ్ ఎవరిని ఉద్దేశించి ప్రసంగించినా పశ్చాత్తాప పిలుపునిచ్చేవారు.

ప్రతిచోట ప్రజలు ఒక నాయకుని పర్యవేక్షణ లలో గ్రూప్‌లుగా కూడుకునేవారు. ఈ కూడికలలో వారు ఆత్మీయ సంగతులను గూర్చి మాట్లాడుకునేవారు. ప్రతిదీ చక్కగా నిర్వహింపబడులాగున ముఖ్యముగా వెస్లీచూచుకునేవాడు. ఈ సువార్తికులు, ఉజ్జీవ ప్రసంగీకులు అమెరికాకు కూడ వెళ్ళిరి. అక్కడ కూడ వారి పని చాలా దీవింపబడెను. మెథడిస్ట్ ఉద్యమములో వేల కోట్ల ప్రజలు చేరిరి.

వైట్‌ఫీల్డ్ ప్రసంగ విధానము వెస్లీ ప్రసంగ విధానమును వేర్వేరుగా ఉండును. వైట్‌ఫీల్డ్ తన ప్రసంగములలో ఉచిత కృపను గూర్చి మాట్లాడేవాడు. వైట్‌ఫీల్డ్ కాల్విన్ మరియు గోమారస్‌ల యొక్క అనుచరుడు. మానవుని స్వేచ్ఛా చిత్తమును నొక్కి వక్కాణిస్తూ వెస్లీ ఆర్మీనియస్ బోధలు చేసేవాడు. ఈ వ్యత్యాసముల కారణము చేత రెండు వేర్వేరు మెథడిజమ్ రూపములు ఏర్పడెను.

82. అమెరికాలో గొప్ప మేల్కొలుపు - జోనతన్ ఎడ్వర్డ్స్

జర్మనిలోని భక్తి ఉద్యమ సంబంధమైన మిషనరీలు వలసవచ్చి స్థిరపడిన ఉత్తర అమెరికా దేశస్థుల మధ్యన చాలా సువార్తపనిచేసిరి. మనము దీనిని 75వ అధ్యాయములో చూచితిమి. అమెరికా ఖండములో అనేక జీవితములు మారే సమయము వచ్చెను. గొప్ప మేల్కొలుపు సమయము ఉదయించెను. అదంతయూ క్రీ.శ.1734వ సంవత్సరం చివరిలో ఆరంభయాయెను. జోనతన్ ఎడ్వర్డ్స్ బోధన ప్రభావము క్రింద ఉత్తర అమెరికాలోని నార్త్ ఆంప్టన్ అను చిన్న పట్టణములో మొదట కొద్దిపాటి యౌవనస్థుల మార్పుతో ప్రారంభమై అటుపిమ్మట కుటుంబములన్నియూ మార్పునొందెను. ఈ జోనతన్ ఎడ్వర్డ్స్ ఎవరు? జోనతన్ ఎడ్వర్డ్స్ (క్రీ.శ.1703-1758), బాల్యము నుండి ప్రభువునకు భయపడి జీవించేవాడు. అతడు స్నేహశీలి, మరియు చక్కటి నడవడి గలవాడు. అతడు దేవుని వాక్యమును ధ్యానించు నిమిత్తమై అడవులలో అటూ ఇటూ తిరిగేవాడు. క్రీ.శ. 1727లో నార్త్ ఆంప్టన్‌లో పరిచారకుడాయెను, అక్కడ తన తాతయైన స్టాడర్‌తో కలిసి పనిచేసెను. ఆయన అదివరకే గత నలభైఏడు ఏండ్లుగా సేవచేయుచుండెను.

నిజ ఆత్మీయ జీవితము కొరకైన అవసరతను ఎడ్వర్డ్స్ తన ప్రసంగములలో నొక్కి చెప్పేవాడు. వారికి కావలసిందంతా యుక్తమైన జీవితము మరియు సంఘమునకు క్రమముగా వెళ్ళుట ఇంతేకదా! అని భావించేవారు. పట్టణములో ఆత్మీయ జీవిత ప్రమాణములు సరిగాలేవని ఎడ్వర్డ్‌యొక్క తాతగారు ఫిర్యాదు చేసిరి. సంఘమునకు హాజరగుటలో సంఖ్య తగ్గుముఖము పట్టెను. అనేక యౌవస్థులు పాప సంబంధ జీవితము జీవించిరి.

యౌవనస్థులలో గొప్ప మార్పు ప్రారంభమాయెను. ఎడ్వర్డ్ ప్రసంగములు యదార్థముగా సవాలుతో కూడుకొనియున్నవి గనుక వారు వాటిపై ఆసక్తి చూపుట ప్రారంభించిరి. ఇద్దరు యౌవనస్థులు అకస్మాత్తుగా మరణించటముతో సంఘమంతయూ చలించెను.

తన ప్రసంగములలో పాపము, కృప, విశ్వాసముద్వారా నీతిమంతునిగా తీర్చబడుట మున్నగు సిద్ధాంతములను ఎడ్వర్డ్స్ నొక్కివక్కాణించేవాడు "ఆత్మదేవుని పరిచర్యద్వారా ఎండిన ఎముకలకు జీవము కలుగును" అని స్వయాన ఎడ్వర్డ్ చెప్పెను. "మార్పు అను పని వేగవంతముగా జరిగెను" అని తరువాత తన పుస్తకమందు వ్రాసెను. "ఈగలు ముసిరినట్లుగా" యేసు క్రీస్తు నొద్దకు ఆత్మలు వచ్చెను. కొన్ని నెలలుగా పాపులు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి నడిపించబడిరి. పట్టణమంతయూ దేవుని సన్నిధితో నిండుకొన్నదేమో అన్నట్లుగా ఉండెను. దేవుని సేవలో సంఘము నిమగ్నమైయుండెను.

తన జీవితములో ఈ సంవత్సరములు అత్యంత సంతోషకరమైనవని ఎడ్వర్డ్స్ చెప్పెను.

"ఉజ్జీవ జ్వాలలు" ఇతర స్థలముకునూ వ్యాపించెను, మారుమనస్సు సంబంధ సంగతులు ఇంగ్లండ్ వరకు వ్యాపించెను. ఈ ఉజ్జీవ జ్వాల త్వరలో చల్లారెను.

క్రీ.శ. 1740లో ఓ గొప్ప మెథడిస్ట్ ఇంగ్లండ్ నుండి అమెరికాకు వచ్చెను. ఆయన పేరు విట్‌ఫీల్డ్ (82వ అధ్యాయము చూడుము) ఆయన బోధించినపుడు వినుటకై వేలాదిప్రజలు తరలివచ్చిరి. దుకాణదారులు దుకాణములు మూసి, వ్యవసాయదారులు దున్నుట మానివేసి అత్యాసక్తితో వారు దేవుని వాక్యము వినిరి. వాక్యపరిచర్య ఎడ్వర్డ్స్‌తో చల్లని గాలివలె వీచి ఇప్పుడది ఉప్పెనగా మారెను. సుమారు ముప్పైవేలనుండి యాభైవేల మధ్యలో ప్రజలు మారుమనస్సునొంది సంఘములో చేరిరి.

ఈ గొప్ప మేల్కొలుపు సమయములో మరొకసారి ప్రభువు జోనతన్ ఎడ్వర్డ్స్ ప్రసంగములను ఆశీర్వదించెను, ఆయనతోపాటు ఆయన ఆత్మీయ సహోదరుడును స్నేహితుడైన విట్‌ఫీల్డ్ సువార్త ప్రకటించుచుండెను. ఉజ్జీవ ఉద్యమమును బలపరచుటలో ఎడ్వర్డ్స్ చాలా జాగ్రత్తగా ఉండెను. కూడిక జరుగునపుడు,



ముగిశాక ప్రజలు భావోద్రేకములోనికి, పిచ్చి చేష్టలలోనికి వెళ్ళుచుండెడివారు గనుక దాని విషయమై ఆయన జాగ్రత్తగా ఉండేవాడు. అంతరంగ చిహ్నముల విషయములో ఎడ్వర్డ్స్ జాగ్రత్తగా ఉండేవారు. నిజమైన మార్పు నడవడిలో కనిపించాలి! ఈ సత్యములు నొక్కివక్కాణించుట ద్వారా అన్ని విషయములు సవ్యదిశలో వెళ్ళులాగున జాగ్రత్తపడెను.

కొద్ది సంవత్సరముల పిదప తన సొంత సంఘములో ఎడ్వర్డ్స్ సమస్యలను ఎదుర్కొనెను. నిజమైన కాల్వినిస్ట్‌గా ఉంటూ సంఘ క్రమశిక్షణను పాటించెను. విశ్వాసులు మాత్రమే ప్రభువు బల్లలో పాల్గొనవలెనని ఆయన విశ్వసించెను. పరిస్థితులు తనపై వచ్చినప్పుడు అతడు 23 సం॥లుగా పరిచర్య చేసిన ఆ సంఘము నుండి వెలివేయబడెను.

ఎడ్వర్డ్స్ జీవితముతో పరిస్థితులు కష్టతరమాయెను. తను తన భార్య మరియు పదిమంది పిల్లలు వీధిన పడినంతపనైంది. తరువాత ఓ చిన్న సంఘములో సేవచేయుటకై అనుమతింపబడెను. ఇక్కడ అనువాదకుని సహాయముతో ఆ పరిసర ప్రాంతములలో నివసించు ఇండియన్స్‌కు వాక్యబోధచేసెను. ఇక్కడ ఎనిమిదేండ్లకాలముపాటు సేవ సంతోషముగా చేసెను. సేవ దీవింపబడెను. ఆర్మీనియన్ సిద్ధాంతము అమెరికాలో అంతకంతకు ప్రబలుతుండెను. ఇక్కడ ఎడ్వర్డ్స్ ప్రసంగ పరిచర్యతో పాటు పుస్తకములు వ్రాసెను. ముఖ్యముగా ఆర్మీనియనిజమ్‌ను సవాలు చేస్తూ వాటిని వ్రాసెను. ఆయన రచనలవలన ఆయన పేరు మోసిన దేవజ్ఞాన శాస్త్రజ్ఞుడయ్యెను. ఈ విధముగా ఆయన పేరు ప్రఖ్యాతులు అమెరికా ఖండమును దాటి వ్యాపించెను.

తుదకు ఆయన ప్రసిద్ధిగాంచిన ప్రిన్స్‌టన్‌లోని యూనివర్సిటీకి ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడెను. ఆ విధముగా ఆయన తగిన గౌరవ మర్యాదలు పొందెను. రెండు నెలల పిమ్మట ఈ నమ్మకమైన, యదార్థమైన దేవుని దాసుడు మరణించెను.

83. జ్ఞానోదయము

పదిహేనవ శతాబ్దము జ్ఞానోదయ శతాబ్దము. ఈ జ్ఞానోదయము బైబిల్‌లోని జ్ఞానోదయమువంటిది కాదు. బైబిల్‌లో చెప్పబడిన జ్ఞానోదయము పరిశుద్ధాత్ముని కార్యము. మనమెంతటి దౌర్భాగ్యులమో గ్రహించులాగున, పాప చీకటి హృదయములను పరిశుద్ధాత్మ దేవుడు దేవుని వాక్యమును వెలిగింపజేయును. కాని, పరిశుద్ధాత్ముడు మనలను దేవునియొద్దకు తీసికొని వచ్చును. పరిశుద్ధాత్ముడు ప్రభువైన యేసు లోకమునకు వెలుగైయుండి మన చీకటి హృదయములలో నివసించుటకు ఇష్టపడుచున్నాడు. "చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి తీసుకొని రాబడిరి" అని మనము పాపులను గూర్చి చదివెదము. మనము తెలుసుకునే ఈ జ్ఞానోదయము దేవుడు మాత్రమే అనుగ్రహించు ఆశ్చర్యకరమైన వెలుగును గూర్చినది కాదు. మనము నేర్చుకొను జ్ఞానోదయము చాలా భిన్నమైనది.


పదిహేడవ శతాబ్దపు తరువాయి సంవత్సరములలో వేర్వేరు రంగములలో చాలా పురోభివృద్ధి జరిగెను. చాలా నూతన పరిశోధనలు, క్రొత్తవి చాలా కనుగొనబడినవి, ప్రత్యేకించి భౌతిక శాస్త్ర రంగములో శాస్త్రవేత్తలు వేర్వేరు నియమములను కనుగొనిరి. భూమితోపాటు ఈ విశ్వమందు ఇతర గ్రహములు కలవని అవి ఈ విశ్వముద్వారా కదులును అని వారు పరిశీలించిరి. భూమి విశ్వమునకు కేంద్రబిందువని కొపెర్నికస్ ముగింపునకు వచ్చెను. ఈ సంగతి సాధారణముగా అంగీకరింపబడెను. సూర్యుడు ఒక కేంద్రముగా ఉంటే దాని చుట్టూ సూర్యచంద్ర నక్షత్రాదులన్నియు ఒక నిర్ధారిత నమూనా ప్రకారము తిరుగును. ఐజక్ న్యూటన్ పండితుడైయుండి ఎక్కువ సమయమును నక్షత్రములను అధ్యయనము చేయుటయందు గడిపెను. గురుత్వాకర్షణ శక్తి ఎట్లు పనిచేయునో ఆయన వివరించెను.

హేతువు మరియు బుద్ధియొక్క శక్తులు ఇప్పుడు తీవ్ర పాత్ర వహించెను. మానవ అవగాహన సామర్థ్యముపై ఖచ్చితమైన నమ్మకం బయలు దేరెను. హేతుబద్ధ ఆలోచనా విధానము రానురాను బలపడసాగెను.

సాంఘిక వ్యవహారములలో మానవ హేతుకతయొక్క శక్తులు కలిగియున్న ఆధిపత్యమును వర్ణించుటకై "రేషనలిజమ్" హేతువాద మందలి నమ్మకము ఐరోపా ఖండమంతటిని వరద ప్రవాహమువలె కుదిపివేసెను.

డికార్టెస్ అను తత్వవేత్త, లాటిన్‌లో ఆయన పేరు కార్టిసియస్, ఆయన క్రీ.శ.1596 - 1650 లో జీవించెను. మానవ గ్రహింపు శక్తులపై ఆధారపడమని ఆయన ప్రజలను ప్రోత్సహించెను. డికార్టెస్ ఇటు గణితశాస్త్రము అటు తత్వశాస్త్రమందునూ ప్రవీణుడైయుండెను. హేతుశక్తి ఒకనిని నిజమైన మానవునిగా చేయునని ఆయన చెప్పెను. "నేను ఆలోచిస్తున్నాను గనుక ఉనికిలో ఉన్నాను" అను సామెత డికార్టెస్ చెప్పినదే. ఇది చాలా ప్రసిద్ధమైనది. జ్ఞానము మరియు సత్యమునకు హేతువు మూలము. మరియు జాగ్రత్తగా చేసిన తలంపు వలన పైరెండు లభించునని ఆయన చెప్పెను. ప్రజలు ఇకను పరిశుద్ధ లేఖనముల అధికారమునకు తమను తాము లోబరచుకొనుటకు ఇష్టపడుట లేదని అర్థమగుచున్నది. ఫ్రాన్స్‌లో పరిస్థితులు దుర్భరముగా మారెను. వారు క్రైస్తవ్యమును గూర్చి మాట్లాడు విధానము చాలా భయంకరమైనది. క్రైస్తవ విశ్వాసము అపహాస్యము మరియు అవహేళన చేయబడెను. భక్తిహీనులైన మనుష్యులు వారి రచనలలో క్రైస్తవ విశ్వాసమును మూలకు విసిరివేసిరి. వారిలో ఒక తత్వశాస్త్రవేత్త వోల్‌టేర్ (క్రీ.శ.1694-1778) జెసూట్స్‌చే నడుపబడుచున్న రోమన్ క్యాథలిక్ స్కూల్ నందు చదివెను. అక్కడి విద్యాభ్యాసమువలన కలిగిన ఒకే ఫలితము ఏదనగా, తన హృదయములో తిరుగబాటు భావనలు మరియు సంఘ సంబంధమైనది ఏది ఉన్నా దానిని ద్వేషించెను. పవిత్రముగా ఉన్న ప్రతి దానిని గూర్చి ఆయన అపహాస్యమును కుమ్మరించెను. 'పాలిపోయి తెల్లబారిన బాధితుడు' అని అతడు సిలువపై శ్రమ పడిన క్రీస్తును గూర్చి వ్యంగ్యముగా చెప్పెను. 'ఆ చెత్త సంగతిని నలిపివేయండి' అని సంఘమును గూర్చి చెప్పెను.

ఆయన పుస్తకములు విషమువలె ఉండెను. ఆ రచనలు కోట్లాది ప్రజలను మోసపరచెను. కాని ఈ దూషకుడు మరణపడకకు చేరగా హేళన ఆగిపోయెను.



మరణము సమీపించు చుండగా ఆయనకు చిరుచెమటలు పట్టెను. ఆయన పడక చుట్టు చేరినవారందరు జరుగునదంతయూ గమనింపసాగిరి. కోపముతో కూడుకొనిన ఆయన అరుపులను వారు భరించలేకపోయిరి. ఆయన పుస్తకమును చదివిన వారందరు మరణపడకపై ఉన్న ఆయనను చూచియుంటే ఎంత బాగుండియుండును" అని ఫ్రెంచ్ వైద్యుడు వ్రాసెను.

ఈ సమయములో గొప్ప ప్రభావమును చూపిన మరొక వ్యక్తి ఉండెను. ఆయన పేరు రోసె. "మనుష్యులందరు సృష్టికి వెళ్ళవలెను" అని ఆయన నమ్మకముగానుండెను. ఆయన ప్రకృతిని దేవుడని మ్రొక్కెను. చిన్నబిడ్డలు గ్రామీణ ప్రాంతములో పెరగాలి, వారికిష్టమైనది వారిని చేయనివ్వండి, అప్పుడు వారు సంతోషముగానుందురు. చిన్న పిల్లలను చెడ్డవారికి ఎంత దూరముగా ఉంచితే అంత సహజముగా వారి హృదయములలో మంచి తనము వృద్ధియగును అని ఆయన చెప్పెను. పిల్లలు పుట్టినపుడు ఏమియూ వ్రాయబడని తెల్లని ఖాళీ కాగితమువలె లోకములో ప్రవేశించుదురని రోసె విశ్వసించెను.

ఈ జ్ఞానోదయ యుగము, బైబిల్ బోధించు ప్రకాశింపబడుటతో ఎట్టి సంబంధము లేకయుండెను. జ్ఞానోదయము కలిగిన వ్యక్తి దేవుని అవసరత ఏమియూ లేక గర్విష్టియైయుండును. తను తెలుసుకోవలసిన దంతయూ తెలిసికొనియున్నాడు, ఏదైతే చేయబడాలో స్వయాన తాను చేయగలుగుతున్నాడు గనుక అతడు ఏ మాత్రమును దేవునిపై ఆధారపడుటకు ఇష్టపడుటలేదు.

సంఘ జీవితము, మరియు మత భావనపై జ్ఞానోదయము ఎట్టి ప్రభావమును కలిగియుండును? తరువాత జరుగబోవు దానిని గూర్చి వచ్చే అధ్యాయములో తెలిసికొనునైయున్నాము.


84. సంఘములో జ్ఞానోదయ యుగము మరియు ఫ్రెంచ్ విప్లవము

దేవుని వాక్య అధికారమును త్రోసి పుచ్చువారు పండితులు మరియు శాస్త్రవేత్తలు మాత్రమే కాదు. జ్ఞానోదయము ద్వారా సాధారణ ప్రజలునూ ప్రభావితము చేయబడిరి. పండితులకు మరియు శాస్త్రవేత్తలకు అంత తెలిసినా... ఫ్రాన్స్‌లో పరిస్థితులు చాలా దుర్ధశలో ఉండెను. ఫ్రాన్స్‌లోని రోమన్ క్యాథలిక్ సంఘము చాలా మట్టుకు నాశనము చేయబడెను. హ్యూగెనాట్స్ యొక్క హింస మీకు గుర్తుండియుంటుంది.

అధిక మొత్తములో పన్నులు కట్టుటకై ఫ్రెంచ్ ప్రజలు ఒత్తిడి చేయబడిరి. ఆ డబ్బు అంతటిని రోమన్ క్యాథలిక్ మతగురువులు మరియు రాజు తన రాజమందిరములో మాత్రమే విచ్చలవిడిగా ఖర్చుపెట్టిరి. తత్ఫలితముగా అసంతృప్తులైన సగము కరువు అనుభవించు సాధారణ ప్రజలు రానురాను మండిపడిరి. తమ్మును బాధించువారిని ద్వేషించిరి. తుదకు అది ఘోర తిరుగుబాటుకు దారితీసెను. తిరుగుబాటు మరియు విప్లవ బీజములు నాటుటకు వోల్టైర్ మరియు రూసో రచనలు ప్రత్యేకముగా కారణభూతమయ్యెను.

క్రీ.శ. 1789 లో ఘోర ఫ్రెంచ్ విప్లవము చెలరేగి అది కొన్ని సంవత్సరములవరకు కొనసాగెను. అది మొదట ప్యారిస్‌నందు ప్రారంభమై త్వరలోనే తక్కిన దేశమంతయూ వ్యాపించెను. సాధారణ ప్రజల కోపము మరియు ఉగ్రత రాజ కుటుంబము మరియు రోమన్ క్యాథలిక్ సంఘముపై ఉండెను.

వేలకొలది మతగురువులు, సన్యాసులు, భూస్వాములు మరియు ఇతర ముఖ్య వ్యక్తులు హత్య చేయబడిరి. తుదకు విప్లవమును ఎవరు ఏ రూపములో అడ్డుకొనినా వారందరిని చంపివేసిరి. క్రీ.శ. 1793లో



రాజు మరియు రాణియూ శిరచ్ఛేదనము చేయబడిరి. రెండువేలకంటే పైబడి సంఘములు నాశనము చేయబడెను. జర్మనీలో పరిస్థితి చాలా స్థిరముగా ఉండెను. క్రీస్తు పునరుత్థానము మానవ హేతుకతకు విరోధముగా ఉన్నందున ప్రొటెస్టెంట్ సంఘము క్రీస్తు యొక్క పునరుత్థాన సత్యమును బోధింపలేదు. గనుక జర్మనిలో కూడ దేవుని వాక్య అధికారము తక్కువ అంచనా వేయబడెను.

నెదర్లాండ్స్ నందు ఏమి జరుగుచున్నది? పరిస్థితులు ఫ్రాన్స్‌లో ఉన్నట్టుగా దుర్భరముగా లేవు ఏదిఏమైనా నెదర్లాండ్స్‌లో కూడా జ్ఞానోదయము చాలా నష్టము కలుగజేసెను. మానవ మనసు గ్రహింపగలవాటికి మాత్రమే బైబిల్ అధికారము వర్తించును అని ప్రజలు క్రమేపి నమ్మటము ప్రారంభించిరి. మానవ గ్రహింపు శక్తుల అధికారముతో రుజువు చేయబడు సంగతులను మాత్రమే ప్రజలు విశ్వసించిరి. మానవ హేతుకత దేవుని వాక్యము కంటే ఎక్కువ అధికారమును కలిగియుండుటను మనము చూచెదము. పద్దెనిమిదవ శతాబ్దములోని ఆలోచనా విధానము 'మానవ కేంద్రితము. ఇట్టి పరిస్థితులను గూర్చి సంఘము హెచ్చరించదా? హెచ్చరించలేదు. భక్తి హీనమైన జ్ఞానోదయముయొక్క బోధలు సంఘములోనికి కూడ చొచ్చుకొని వచ్చెను. ప్రజలు నిశ్చయముగా విశ్వమును సృష్టించిన సర్వాధికారిని గుర్తించిరి. సృష్టిని బలపరచు నిదర్శనము మన చుట్టూఉన్న లోకమునుండి తీసికొనబడెను. మహా అంటే, ఈ విషయములో బైబిల్ కొంత అనుబంధ సమాచారము మాత్రమే ఇవ్వగలదు. అది కూడ మానవ హేతుకతను విబేధించినంతవరకు.

ఇట్టి సర్వాధికారియగు దేవుని సేవించుట మంచిదని ప్రజలు నిశ్చయముగా విశ్వసించిరి మరియు ధర్మకార్యములను కూడ నమ్మిరి. మంచి మరియు చెడును ఒకని మనస్సాక్షి మరియు అవగాహన నిర్ణయించును. ఆయనకు దేవుని ధర్మశాస్త్ర సహాయము అవసరమేలేదు. ప్రభువైన యేసు మంచిగుణములతో కూడిన జీవితము జీవించి ఇతరులు అనుసరించులాగున మంచి మాదిరి ఉంచిపోయెను. ఆయన ఓ ముఖ్య బోధకునిగా పరిగణింపబడెను. తన ప్రజల పాపముల నిమిత్తమై సిలువలో తన అర్పణద్వారా వెలచెల్లించి .. దేవునితో సమాధాన పరచుటకు యేసు సంచకరువు అని పరిగణింపబడలేదు.

మంచిగానుండుట మరియు మంచి చేయుటకు మానవునికి సామర్థ్యము కలదు. దేవుని కృపగొప్పగా సహాయపడును అయితే అది అంత ప్రాముఖ్యమైనది కాదు. ఒక వ్యక్తి అన్ని వేళలా పరిపూర్ణుడుగా, విద్యాపంతునిగా ఉండకపోవచ్చును. కాని అతడు పూర్తిగా పతనమైనవాడు కాదు (పతనమైనవాడు దేవుని దృష్టిలో మంచి చేయలేనివాడు) జన్మపాపము "ఆదిమ పాపమునుది" లేదు (జన్మ సమయములో వచ్చిన పాపము)

పెంపకము మరియు విద్యద్వారా ప్రజలు మెరుగుపడి నానాటికి మేలైన వారగుదురు. గనుక సువార్త నైతిక వాదము యొక్క క్రొత్తరూపములోనికి మార్చబడెను. (సుగుణ జీవితమును జీవించుట). ఇట్టి ఆలోచన విధానమును మానవ మనసు సులువుగా స్వీకరించును. పరిచారకులు జ్ఞానోదయమును బలపరచుచూ వేదికలమీద నుండి ప్రకటింపబడగా ఇట్టి భావనలు సంఘములలో విరివిగా వినబడెను. గనుక దేవునియందలి నిజ విశ్వాసము నుండి సంఘము దూరముగా వెళ్ళిపోయెను. క్రైస్తవ శాస్త్రమును అనుమానించి ప్రశ్నించు శాస్త్రమైన స్కెప్టిసిజమ్ సంఘమును చేజిక్కించుకొని అది అందులో ఆధిపత్యస్థానము వహించెను! ప్రజలకు దేవుని వాక్యమంటే ఏ మాత్రమును గౌరవము లేదు కాని మానవ అవగాహన శక్తులపట్ల ఎంతో గౌరవమును కలిగియుండిరి!

బైబిల్‌లో వర్ణింపబడిన అద్భుతములు ఇకను అంగీకరింపబడలేదు. "యెహోషువా ప్రార్థించగా సూర్యుడు నిలిచెను". దీనిని విశ్వసింపమనుట, మానవుని అవగాహననుండి నిశ్చయముగా అధికముగా ఆశించుటయే. ప్రకృతి నియమముల ప్రకారము అట్టి సంఘటన అసాధ్యము గనుక అది నిజము కాదు. దేవుని విశ్వసించు పరిచర్యలు మరియు దేవుని బిడ్డలు ఇట్టి అవిశ్వాస వైఖరిని ఖండింపగా విమర్శకులు వారిని వారి మాటలను విమర్శించి హేళన చేసిరి.

పద్దెనిమిదవ శతాబ్దపు చివరన, జ్ఞానోదయము ద్వారా ప్రసరింపచేయబడిన 'వెలుగు' అను చీకటి నెదర్లాండ్స్ లోనూ నెలకొనెను. సంఘసంస్కరణ మరియు తదుపరి సంఘసంస్కరణ సమయములో నెదర్లాండ్‌లో దేవుని వాక్యపు వెలుగు ప్రకాశమానముగా వెలిగెను!

85. కష్టసమయములు

ఫ్రెంచ్ విప్లవము పెనుతుఫానుగా మారి నిశ్చయముగా చాలా నష్టము కలుగుజేసెను. ఈ విప్లవమును పెనుతుఫాను మేల్కొలుపు ఫలితము, వొల్టైర్ మరియు రూసోల ఆలోచనల ప్రతిపాద ఫలితము. పరిపూర్ణ సంతోషము మరియు స్వేచ్ఛ అందరికి అందుబాటులో ఉన్నదని వారు చెప్పిరి. ఎటువంటి విధానము అవసరము లేకుండెను. "స్వేచ్ఛ, సమానత్వము మరియు సహోదరత్వము" అను నినాదములు అణగారిన ప్రజల మధ్యన వినబడెను. ఈ భావనలు ఇతర ప్రదేశములోను వ్యాపించెను. కొన్ని దేశములలో సమాజము దాని పరిస్థితులు వేగవంతముగా మారుచుండెను. అదే విప్లవము ఇంగ్లండ్‌లోని పారిశ్రామిక విప్లవము గతములో మానవుని శారీరక బలమే అందుబాటులో ఉన్న శక్తి వనరు. కాని పరిస్థితులు మారనైయున్నవి. ఆవిరియంత్రము కనుగొనబడెను. ఇప్పుడు చాలా పని యంత్రములు చేయును మరియు ఉత్పాదన సామర్థ్యము కని విని ఎరుగని రీతిలో అధికమాయెను. అందుకే కర్మాగారములలో ఎంతో మంది కార్మికులు అవసరమైరి. పొలములలో పని చేయువారు ఇప్పుడు కర్మాగారములలో పనిచేయ ప్రారంభించిరి. ఇనుము, బొగ్గు గనులున్నచోట ఉండుటకై చాలామంది ఇష్టపడిరి. సమీప పట్టణములు మరియు గ్రామములు త్వరితగతిన విస్తరించెను! స్త్రీలు మరియు పిల్లలు కూడ పనిచేయుచుండిరి! పనికి కొదువ లేదు! జీతము తక్కువ కాని ఎక్కువ గంటల తరబడి పనిచేయాలి. ఇందువలన ప్రజలు ఇంగ్లండ్‌లోనేగాక ఐరోపా దేశములలో కూడ బాధపడి అసంతృప్తులైరి.

క్రీ.శ.1789లో ప్యారిస్‌లో ప్రారంభింపబడిన ఫ్రెంచ్ విప్లవ ఒరవడి క్రీ.శ.1795లో బలమైన సైన్యాధికారియైన నెపోలియన్ అధికారములోనికి వచ్చినపుడు అంతమొందెను. ఆయన సామర్థముగల సైన్యాధికారి మరియు ఆయన సైనికులు ఆయనను గౌరవించిరి. ఆయన మరియు ఆయన సైన్యము ప్రాంతాల తరబడి జయించిరి.

ఆయన ఉక్కుపరిపాలన క్రింద ఐరోపా ఖండము అధిక భాగము మూల్గుచుండెను. ఆయనను జయించుట అసాధ్యమేమో అన్నట్లు తోచెను.

క్రీ.శ. 1804లో పోప్ నెపోలియన్‌ను కిరీటధారిగా చేసెను. గతించిన శక్తివంతమైన రోమా సామ్రాజ్య దినములు మరలా వస్తున్నావేమో అన్నట్లుండెను. నెదర్లాండ్స్ కూడ నెపోలియన్ పాలనకు తల ఒగ్గవలసి వచ్చెను. అది విడుదల సైన్యమని భావించి, ఫ్రెంచ్ సైనికులను సహోదరులని భావించి నెదర్లాండ్స్ ఆహ్వానించెను గనుక నెదర్లాండ్‌వారిని గెలుచుట ఫ్రెంచ్ సైనికులకు సులువాయెను. నూతన సంతోష, అభివృద్ధియుగము ఉదయించెనని చాలామంది అభిప్రాయపడిరి.

విల్లెమ్ వి హోస్ ఆఫ్ ఆరంజ్ డచ్ అధిపతి క్రూర పాలకుడుగా మారగా ఆయన ఇంగ్లండ్‌కు పారిపోవలసివచ్చెను. ఫ్రెంచ్ ప్రజలు చేసినట్లు డచ్ ప్రజలు కూడ "లిబర్టి ట్రీ" చుట్టూర నాట్యముచేసిరి.

విప్లవకారులు వాడిన ఓ చెట్టు లేదా గుమ్మము, అమెరికా స్వాతంత్రోద్యమ సంప్రదాయము స్వాతంత్ర్యపు స్వేచ్ఛ సౌభ్రాతృత్వ పాటలు పాడుట, ఇదంతయూ మేల్కొలుపు ఫలము!

కాని అతి త్వరగా నెపోలియన్ నెదర్లాండ్‌ను కొల్లగొట్టటంతో నెదర్లాండ్స్‌లో ఎక్కడ చూచినా పేదరికమే కనబడెను. నెపోలియన్ సైన్యబలము పెరుగులాగున నెదర్లాండ్స్ సైనికులను పంపుటకై ఒత్తిడి చేయబడెను. ఐరోపా యుద్ధభూములలో లేదా రష్యా మంచులో వేలాది డచ్ దేశస్థులు మరణించిరి! ఈ విధముగా పరిస్థితి క్షీణించుచుండెను.

కాని పరిస్థితులు మారుట ప్రారంభమాయెను. ఆయనకు భయపడి ఆయనను నమ్మిన వారి ప్రార్థనలు దేవుడు వినెను. వారి చుట్టూ ఎన్నో కష్టములున్ననూ, దేవుని బిడ్డలు కొందరు ఉండిరి.

క్రీ.శ. 1812 అంతములో వేర్వేరు దేశాల సంయుక్త సైన్యముల వలన నెపోలియన్ పదేపదే



ఓడింపబడెను. క్రీ.శ. 1815లో నెపోలియన్ నిరంకుశపాలన అంతమొందెను, నెదర్లాండ్స్ స్వాతంత్ర్యము లభించెను.

నెపోలియన్ అంతమొందినందున ఐరోపా సంఘములు చక్కగా ఎదుగుతున్నాయా? స్వేచ్ఛా స్వాతంత్ర్యములు సంఘములో నెలకొనెను (దేవుడు, బైబిల్ ఈ సాంప్రదాయ భావనలు ఏ మాత్రమును గౌరవింపబడలేదు) సంఘ విభేదములు పట్టించుకొనకుండ, ప్రజలు శాంతి స్వాతంత్ర్యములను అనుభవింపవలెనని కోరిరి. ఇది ఆత్మీయ నిర్లక్ష్యతకు దారితీయును గనుక ఇది చాలా ప్రమాదకరము.

సంఘములో ఆత్మీయ కలవరము నెలకొనెను. చాలా మంది మతగురువులు ఇక ఏమాత్రమును సరళ, బైబిల్ సందేశములైన మానవుని పాపము మరియు దేవుని కృపను గూర్చి బోధించుట లేదు. అంతట సంఘ సభ్యత్వము తగ్గిపోయెను. లౌకిక విచ్చల విడి జీవన విధానము నానాటికి అధికమాయెను. క్లుప్తముగా చెప్పాలంటే, పంతొమ్మిదవ శతాబ్దము మొదటి భాగములో ఆత్మీయ బలహీనత ఉండెను. ఐరోపా మరియు అమెరికా యందంతట మేల్కొలుపు భావన కలిగెను.

కాని ప్రభువు మరొక మారు ఉజ్జీవమును మేల్కొలుపును తీసుకునివచ్చెను, నిద్రమత్తులైన ఆత్మలకు మేల్కొలుపు సమయము, సమాజ జీవితము మరియు సంఘ జీవితములో ముఖ్యమైన సంగతులు సంభవించుట ప్రారంభమాయెను. ఈ ఉజ్జీవము ఐరోపా అంతట చెలరేగెను.

86. ఆత్మీయ మేల్కొలుపు

పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభములో స్విట్జర్లాండ్‌లోని యూనివర్శిటి ఆఫ్ జెనీవాలో పరిస్థితులు చాలా విచార స్థితిలోనున్నవి. ఇక్కడ కూడ మేల్కొలుపు భావన నెలకొనియున్నది. వందసంవత్సరముల కంటెముందు కాల్విన్ యూనివర్సిటిని స్థాపించెను. ఇక్కడ సంఘ సంస్కరణ వాతావరణం చాలా తక్కువ ఉన్నది. యూనివర్సిటిలోని విద్యార్థులకు వారమునకు ఒక్కసారి మాత్రమే బైబిల్ ఉపన్యాసము చేయబడును పాత నిబంధన గూర్చి కూడ ఉపన్యాసము చేయుబడును అది కూడ హీబ్రూభాష నేర్చుకునే ఉద్దేశ్యముతో క్రొత్త నిబంధనను గూర్చి ఏమియు తెలియకయే కొందరు విద్యార్థులు నాలుగేండ్ల కోర్స్ ముగించుకునేవారు. విశ్వాసపు ఒప్పుకోలులను అసలు పట్టించుకునేవారు కారు. క్రీస్తు దైవత్వము, మూల పాపము, అద్భుతములు సత్యము మున్నగు వాటిని అనుమానించిరి. మనుష్యులు మంచి యోగ్యమైన జీవితము జీవిస్తే తక్కిన దంతా సరిగానేయుండును.

దేవుని వాక్యమును గూర్చి వినే విద్యార్థులే లేరా? కొందరున్నారు! మరికొందరు విద్యార్థులు వారి తరగతులలో ఇవ్వబడు ఉపన్యాసముల విషయములో సమ్మతించుటలేదు. క్రీ.శ. 1714లో స్థాపింపబడిన మొరేలియన్ చర్చ్ (హెర్న్‌హట్టర్స్) యొక్క బ్రాంచ్ జెనీవాలో కలదు. విద్యార్థులు అక్కడి సహోదరులను సంప్రదించేవారు. విద్యార్థులు, మొరేవియన్ బ్రదరన్ కలిసి ఒక బృందముగా కూడుకునేవారు, స్థానిక పరిచారకులు కూడ వారితో కలిసేవారు. జెనీవా మతగురువులు దానిని ఒప్పక ఆ కూడికలను నిషేదించిరి. విద్యార్థులు భవిష్యత్తులో మత గురువులగుటకు అనుమతింపబడరని తెలిసినా విద్యార్థులు మాత్రము తప్పక సహవాసమునకు హాజరయ్యేవారు.

కొద్దికాలము తరువాత స్కాట్‌లాండ్ బోధకుడు జెనీవాకు వచ్చిరి. ఆయనపేరు రాబర్ట్ హల్దానె. స్కాట్‌లాండ్‌లో జరిగే ఉజ్జీవ ఉద్యమమునకు రాబర్ట్ మరియు తన సహోదరుడు సారధ్యము వహించిరి. ప్రసంగీకులు దేవుని వాక్య సరళ ప్రసంగములకు తిరిగి రావలెనని సహోదరులు భావించిరి. వారు అభిషేకింపబడనందున ప్రెస్బిటేరియన్ సంఘములలో బోధించుటకు అనుమతింపబడలేదు గుడారములలోను, బహిరంగముగాను వారు వాక్యము బోధించుచుండిరి. ఇట్టి పరిచర్య వలన గొప్ప ఉజ్జీవము కలిగెను. ఇద్దరు సహోదరులు కలిసి రెండువందలమంది సువార్తికులను స్కాట్‌లాండ్‌లో పనిచేయుటకై తర్ఫీదు చేసిరి.

క్రీ.శ. 1816లో కాల్విన్ నివసించి పనిచేసిన చోటికి అనగా జెనీవా పట్టణమునందు సువార్త సత్యమును బోధించుటకై రాబర్ట్ వెళ్ళెను. ఇరవైమంది విద్యార్థులు రాబర్ట్ బోధ వినుటకై ఆసక్తితో వచ్చిరి. విద్యార్థులు ప్రశ్నలడిగితే, బైబిల్ ఏమి చెబుతున్నది అను మారు ప్రశ్న అడిగి జవాబిచ్చేవాడు రాబర్ట్, దీని వలన విద్యార్థులు చాలా ఆశ్చర్యపోయేవారు. "కాల్విన్ వలె రాబర్ట్ హల్దేనె బైబిల్ తెలిసినవాడు" అని విద్యార్థులు పిలిచేవారు.

గ్రామర్ స్కూల్‌లో పనిచేయు ఒక వ్యక్తి ఉండేవాడు ఆయనపేరు సీజర్ మలాన్. ఒక రోజున ఆయన విద్యార్థులతో కలిసి రోమీయులకు వ్రాసిన పత్రిక 5వ అధ్యాయము చదువుతుండగా అందులోని మాటలు కొన్ని ఆయన మనసును ఆకట్టుకొనెను. సీజర్ మలన్ రాబర్ట్ హల్దేన్‌ను కలిసినపుడు, దేవుని వాక్యపు శక్తివలన ఒకని అంతరంగము ఎలా నూతన పరచబడునో హాల్డెన్ ఆయనకు వివరించెను. పరిశుద్ధాత్మ శక్తిద్వారా దేవుని వాక్యము "రక్షించు శక్తి యగును" సీజర్ మలాన్‌కు ఇదే జరిగెను.

జెనీవాలోని రివెయ్‌ల్ (ఉజ్జీవము)నకు నాయకుడాయెను. మనుషులు కేవలం మంచిగా మరియు యోగ్యమైన జీవితము జీవించినంత మాత్రమున మనుష్యులు రక్షింపబడలేరని ఆయన తన ప్రసంగములలో సెలవిచ్చేవాడు, యేసుక్రీస్తునందలి పశ్చాత్తాపము మరియు నిజ విశ్వాసము వలన మాత్రమే రక్షణ లభించును.



ఆ కారణము చేత జెనీవా సంఘములోనికి వచ్చుటకు మరియు గ్రామర్ స్కూల్‌లో బోధించుటకు నిషేధింపబడెను. తన సొంత తోటలో కట్టబడిన చాపెల్‌లో ఆయన బోధించుచుండెను.

సంఘమును చీల్చుట మలాన్‌కు ఇష్టము లేకయుండెను. సంఘము కాల్విన్ బోధలను అనుసరింపవలెనని ఆశించెను. సంఘములోని శత్రుత్వము కారణాన మలాన్ మరియు ఆయన అనుచరులు హిపోక్రిట్స్ (వేషధారులు) అని ముద్రింపబడిరి. వీరు సంఘమును విడిచి వెళ్ళునట్లుగా వత్తిడి చేయబడిరి. అందుకే ఫ్రీ చర్చ్‌లు స్థాపింపబడెను. వారి విద్యార్థుల నిమిత్తమై దేవజ్ఞాన శాస్త్రకోర్సులు ప్రారంభించిరి. ఈ సంఘములు సంఘసంస్కరణ సిద్ధాంతమును బోధించి చేపట్టినందున వారు తమను 'సంఘసంస్కరణ ఉద్యమ వారసులు' అని పిలుచుకునేవారు.

సువార్తను వ్యాపింపజేయుటలో వారు ఎక్కువ సమయమును గడిపినందున స్విట్జర్‌లాండ్‌లోని అనేక భాగములలో ఉజ్జీవము వ్యాపించెను. కొద్దికాలము పిమ్మట మలాన్ ఆయన స్నేహితులు కలిసి పశ్చిమ ఐరోపాయందంతట సువార్త బోధ యాత్రలు చేసిరి. వారు ఎక్కడికి వెళ్ళినా దేవుని వాక్య సత్యమును ప్రకటించిరి. ఈ సత్యము కేవలము మేధా సంబంధమైనది కాదుగాని హృదయమందును అనుభవింపవలెను.

ఇతర దేశములలోను ఉజ్జీవములు కలిగెను. తత్ఫలితముగా ఫ్రాన్స్, జర్మని, స్కాండినేవియా మరియు నెదర్లాండ్స్ సంఘములలో మార్పు బైబిల్ ఆధారితమైనది కలిగెను. ఐరోపా ఖండములో ఆత్మీయ మేల్కొలుపు ఉజ్జీవం కలుగజేయుటలో కార్యము ప్రారంభించెను!

87. నెదర్లాండ్స్‌లో ఉజ్జీవము

నెదర్లాండ్స్‌లోనూ ఆత్మీయ మేల్కొలుపు ఉదయించెను. రివెయ్‌ల్ అనగా ఉజ్జీవ సమయము, మరొకసారి బైబిల్ ఆధారిత క్రైస్తవ్యము ప్రజల జీవితములలో పనిచేయ ప్రారంభించెను. ఈ ఉజ్జీవములో అధికముగా నిమగ్నమైన వ్యక్తి విల్లెమ్ బిల్డర్‌డిజ్క్ (క్రీ.శ.1756-1831) ఆయన గొప్ప పండితుడు మరియు వరముగలిగిన కవి.

విల్లెమ్ బాల్యము నుండి ఫ్రెంచ్ లాటిన్ భాషలు నేర్చుకొనెను. విల్లెమ్ తన ఆరవయేటనుండి పదహారవయేట వరకు పడకలో లేదా కుర్చీలోనే ఉండేవాడు. ఎందుకంటే కాలికి తగిలిన గాయము మానలేదు. పడకలో ఉంటూనే అనేక గ్రంథములు పఠించెను. యూనివర్సిటీ ఆఫ్ లెయ్‌డెన్‌లో న్యాయశాస్త్రము అధ్యయనము చేశాక హేగ్‌లో న్యాయవాదిగా పనిచేసెను. అన్యాయముగా నేరము మోపబడిన క్రైస్తవుల పక్షముగా వాదించెను తరచుగా తాను కేస్‌లను గెలిచి తన ప్రసిద్ధిచెందెను. బిల్డర్‌డిజ్క్ గూర్చి తెలుసుకొనినవారు ఆయన పాండిత్యము తెలివి విషయమై ఆశ్చర్యపోయేవారు.

క్రీ.శ.1795 నెదర్లాండ్స్‌నకు ఫ్రెంచ్ సైన్యములు ఆహ్వానింపబడినపుడు, ఫ్రెంచ్ అధికారమును బిల్డర్‌డిజ్క్ తిరస్కరించెను గనుక ఆయన దేశ బహిష్కరణ చేయబడెను. రాయల్ హౌస్ ఆఫ్ ఆరంజ్‌ను బిల్డర్ డిజ్క్ బలపరచెను. క్రీ.శ.1813లో డచ్ రాయల్ ఫ్యామిలీ నెదర్లాండ్స్ మరలి వచ్చినపుడు ఆయన సంతోషించెను.

ఫ్రెంచ్ అధికారులు దేశమును విడిచి వెళ్ళిరి గాని ఉజ్జీవ ఆత్మ మాత్రము విడిచివెళ్ళలేదు. ఉజ్జీవ ఆత్మ గిరిపార్మీర్డెకెర్‌క (నెదర్లాండ్స్ రిఫామ్డ్ చర్చ్) నందు ఉజ్జీవ ఆత్మ ఉండెను.

తన భాషావరమును వాడుతూ, బిల్డర్‌డిజ్క్ ఉజ్జీవమునందు నిమగ్నమాయెను. అందుకే ఆయన "డచ్ ఉజ్జీవ ఉద్యమ పితామహుడు" అని పిలువబడెను. ఆయన నమ్మకముల కారణాన ఉజ్జీవ మతగురువులనబడిన వారివలన వ్యతిరేకత ఎదుర్కొనెను. వారు ఆయనను ద్వేషించి శత్రువుగా భావించిరి. వారు ఆయనను "క్రూర మృగము" అని పిలిచి అర్హుడైనా యూనివర్సిటి ప్రొఫెసర్‌గా నియమింపనివ్వలేదు.

ఎన్ని ఎలా ఉన్నా, బిల్డర్‌డిస్క్ తన ఇంటివద్దనే విద్యార్థులకు ఉపన్యాసములిచ్చుచుండెను. ఒక యౌవనస్థుని పేరు ఇసాక్ డ కోస్ట. ఆయన యూదుడు, గతములో ఆయన కుటుంబము పోర్చుగల్‌లో నివసించెను. డ కోస్ట తన మిత్రుని తీసుకుని వచ్చెను. ఆయన పేరు కపదోస్. ఆయన కూడ యూదుడైయుండి యూనివర్సిటి ఆఫ్ లెయ్‌డెన్‌లో వైద్యశాస్త్రము అధ్యయనము చేసెను.

బిల్డర్ డిజ్క్‌నకు ఆ యూదులైన యౌవనస్థులకు గాఢ స్నేహమేర్పడెను. వారు బిల్డర్ డిజ్క్ ఉపన్యాసములు విని ఎన్నో క్రొత్త సంగతులు నేర్చుకొనిరి. అన్నిటి కంటె ముఖ్యముగా బైబిల్‌లో ప్రత్యక్షపరచబడిన విధముగా ప్రభువైన యేసును గూర్చి బిల్డర్ డిస్క్ వారికి బోధించెను. వాగ్దానము చేయబడిన మెస్సీయ యేసు అని చాలామంది యూదులు విశ్వసింపరు కాని ఈ ఇద్దరి అభిప్రాయములు మారెను. వారిరువురు ప్రభువైన యేసు క్రీస్తు వారి రక్షకుడని విశ్వసించిరి! బిల్డర్ డిజ్క్ యొక్క వాక్య పరిచర్య ఫలభరితమాయెను.

మారిన ఈ ఇద్దరు యూదులు వారి కుటుంబముల ద్వారా శ్రమపెట్టబడిరి. డ కోస్టకు అదివరకే పెళ్ళి నిశ్చితార్థము చేయబడియుండెను. తన మార్పును గూర్చి తనకు కాబోయే భార్యతో చెబితే వారి బంధం చెడిపోవునని భయపడెను. కాని ఆయన ఊహించని విధముగా పరిస్థితులు మారెను. ఆయనకు కాబోయే భార్య కూడ మారుమనస్సు పొందెను! అతను పాపియని గ్రహించి ప్రభువైన యేసును రక్షకునిగా స్వీకరించెను!

డ కోస్ట మరియు కపదోస్ బాప్తిస్మము తీసికొనిరి. ఇరువురు బిల్డర్ డిస్క్ యొక్క విశ్వసనీయమైన అనుచరులుగా మారి ఉజ్జీవమును బలపరచిరి.

సంఘములో అపనమ్మకపు ఆత్మ ప్రబలెనని డ కోస్ట తన పుస్తకమందు వ్రాసెను! పిల్లలకు చక్కటి బోధ దొరకులాగున డ కోస్ట సండే స్కూల్స్ స్థాపించెను.



దేశమందంతట ఈ ఇద్దరు యూదుల ప్రచురణలు మరియు వారి కార్యకలాపములు అనేకుల గమనమును ఆకట్టుకొనెను. ఎంతో అలజడి కూడ కలిగెను. స్వేచ్ఛావాదులు బైబిల్ బోధను నమ్మనివారు ఇదంతయు చూచి ఉగ్రులైరి. వీరిని డ కోస్ట మరియు కపదోస్ దౌర్భాగ్యులని పిలిచి ఎగతాళి చేసిరి.

పండితులైన డచ్ ఉజ్జీవ ఉద్యమకారులు తమను తాము సంఘమును వేరు చేసుకొనుటకు ఇష్టపడలేదు. తప్పులను చక్కబెట్టుటకు వారు ఇష్టపడిరి. వారు పోరాడునదంతయూ దేనితోనంటే, సంఘములలో ప్రకటింపబడు దుర్బోధలు, తప్పుడు సిద్ధాంతము పైపై క్రైస్తవ్యము.

ఇట్టి పరిణామము ప్రభువునకు భయపడి ఆయన మాటకు విధేయులు కాగోరే నెదర్లాండ్ ప్రజలకు ఎంతో ప్రోత్సాహము నిచ్చెను.

88. నెదర్లాండ్స్‌లో పరిస్థితి

క్రీ.శ. 1618/1619లోని డార్‌డ్రెక్ట్ సమావేశము తర్వాత, నెదర్లాండ్స్‌లో ఒకే ఐక్య సంఘముండేది, అదే గెరిఫార్మియర్డి కెర్క్ (రిఫామ్డ్ చర్చ్). ఈ సంఘము డచ్ సమాజముపై గొప్ప ప్రభావము చూపెను. ప్రభుత్వ సభ్యులు తరచుగా గెరిఫార్మియర్డి కెర్క్‌నందు సభ్యులుగా ఉండేవారు. మతగురువులకు జీతములు చెల్లిస్తూ, ప్రభుత్వము సంఘమును చూచుకొనుచుండెను. స్మిటిగెల్ట్, ఎ బ్రాకెల్, వాన్ లోడెన్ స్టెయిన్, ఒయేషియస్ మొదలగు భక్తిగల బోధకులు రిఫార్మేషన్ సిద్ధాంతములను బోధించిరి. (76,77 మరియు 78 అధ్యాయములను చూడుము) నాడిరి రిఫార్మాటి (అధిక సంఘపునరుజ్జీవము) అనగా పదిహేడవ శతాబ్దపు వాతావరణమును ఈ దైవజనులు ప్రతిబింబింపచేసిరి.

పద్దెనిమిదవ శతాబ్దములో ప్రతీది మారెను. మేల్కొలుపు భావన నెదర్లాండ్స్‌లో కూడ నెలకొనెను, గెరిఫార్మియర్డి కెర్క్‌పై ప్రభావము చూపెను.

క్రీ.శ. 1795లో ఫ్రెంచ్‌వారు నెదర్లాండ్స్‌నకు వచ్చినప్పుడు రిపబ్లిక్ ఆఫ్ ది యునైటెడ్ ప్రావిన్సెస్ పూర్తిగా కుప్పకూలెను. (క్రీ.శ. 1648 నుండి నెదర్లాండ్స్ ఆ విధముగా పిలువబడెను) ఫ్రెంచ్ ఆక్రమణ మరియు దాని పరిపాలన ప్రారంభమాయెను.

క్రీ.శ. 1796లో మత స్వేచ్ఛ అనుగ్రహింపబడెను. వారి సొంత సంఘములు స్థాపింపబడెను. వారి సొంత సంఘములను స్థాపించునట్లుగా రోమన్ క్యాథలిక్‌లు, రెమోన్‌స్ట్రంట్స్ (70వ అధ్యాయము) లూథరన్స్‌కు మరియు మెనొనైట్స్ (50వ అధ్యాయము) అనుమతింపబడిరి.



ఫ్రెంచ్ ఆక్రమణ ముగిశాక నెదర్లాండ్స్‌లో చక్రవర్తి ఎన్నుకోబడెను, ఆయన హౌస్ ఆఫ్ ఆరంజ్‌లో సభ్యునిగా ఉండెను. ఆయన పేరు విల్లెమ్I ఆయన క్రీ.శ.1815 నుండి 1840 వరకు పరిపాలించెను.

ఇట్టి అల్లకల్లోల సమయములో గెరిఫార్మియెర్డి కెర్క్ నందు ఏమి సంభవించుచుండెను? క్రీ.శ.1815లో ఫ్రెంచ్ నిరంకుశత్వము నుండి నెదర్లాండ్స్ విడుదల పొందినా గెరిఫార్మియెర్డి విచార దశలోనేయుండి పోయెను. మత గురువులలో అనేకులు "ప్రకాశింపబడుట" అను భావముతో బాధింపబడిరి. అట్టి బోధకులు అనేకులు బయలుదేరిరి. రాజు చర్య తీసుకోవాలని నిర్ణయించెను. మతగురువులు తగిన సమయములో జీతము పొందుకొనులాగున శ్రద్ధవహించెను. ఫ్రెంచ్‌ల పరిపాలనలో మతగురువులలో అనేకులకు సక్రమముగా జీతములు అందలేదు గనుక వారిలో చాలామంది ఎంతో పేదరికములో జీవించిరి.

భవిష్యత్‌లో సంఘము ఎలా నిర్వహింపబడి పరిపాలింపబడవలెనో దాని విషయమై ప్రభుత్వము ఒక కార్యాచరణ ప్రణాళికను తయారు చేసెను. ఈ విషయ ఆమోదమును పరిశీలించుటకై రాజు పదకొండుమంది మతగురువులను కమిటీగా నియమించెను. కమిటీ డాక్యుమెంట్స్‌ను ఒప్పుకొనుటకు సమ్మతించెను. భవిష్యత్‌లో సంఘ సంగతులన్నియూ ఈ క్రొత్త నిబంధనల క్రిందికి వచ్చును.

నెదర్లాండ్స్ హర్‌వర్మ్‌డి కెర్క్ (గతములో గెరిఫార్మ్‌డ్డి కెర్క్ అని పిలువబడు డచ్ రిఫామ్డ్ సంఘమునకు క్రొత్త పేరు పెట్టబడెను) యొక్క సాధారణ సమావేశము జరుపబడనైయున్నది. మొదటి సారిగా రాజు సమావేశ సభ్యులను నియమించెను. సమావేశము తీసికొనిన నిర్ణయములన్నియూ ఆచరణలో పెట్టబడకమునుపు రాజుచే అవన్నియూ అమోదింపబడవలెను. సమావేశములో ఇతర సభ్యులను చక్రవర్తి నియమించెను.

మత గురువులు ఒక సంఘము నుండి మరొక సంఘమునకు వెళ్ళదలచినప్పుడు రాజు మొదట తన సమ్మతిని తెలుపవలెను. నిబంధనల ప్రకారము సంఘ కార్యక్రమములలో కీర్తనలే గాక ఇవాంజలిస్కె బండిల్ (సువార్త కూర్పు) నుండి పాటలునూ పాడవలెను.

ఇప్పుడు రాజు సంఘ కార్యకలాపములను నిర్వహించును. ఇది మంచి విషయమా? మంచిది అసలు కానేకాదు. జాతీయ ప్రభుత్వమునకు రాజు అధిపతి కాని, ఆయన సంఘమునకు అధిపతి కాదు. యేసు క్రీస్తు సంఘమునకు అధిపతియని, దాని పరిపాలన సంగతులు ఆయన వాక్యమందు స్పష్టముగా తెలుపబడెను.

సంఘమును కాపాడి పోషించుటలో రాజు ఖచ్చితముగా బద్ధుడైయున్నాడు కాని సంఘమునందు ప్రతివిషయమును నిర్వహించుటకు ఆయనకు అధికారము లేదు. ఈ క్రొత్త నియమ నిబంధనల ఫలితముగా, క్రీ.శ.1618/1619 సమావేశములో డార్‌డ్రెక్ట్ సంఘ క్రమము రూపొందింపబడెను. ఇదంతయూ ప్రక్కన పెట్టబడెను.

ఈ చర్యలకు విరోధముగా నిరసనలు మొదలాయెను, ఆమ్‌స్టర్‌డామ్ సంఘ సమావేశము తన అసమ్మతిని వ్యక్తపరచెను కాని రాజు సర్వాధికారము కలిగియుండెను. సమ్మతించనివారు సంయమనము పాటించాలి. జీతములను ప్రభుత్వమే భరించుచున్నది!

పరిస్థితులను మరింత దుర్భరము చేస్తూ "సిద్ధాంత స్వేచ్ఛ" ఇవ్వబడెను. దానికర్థమేమిటంటే, ప్రతి మత గురువు ఫలానా విషయము సరైనదని భావిస్తే, దానిని చెప్పవచ్చును. డ్రీ ఫార్ములియెరెన్ వాన్ ఎనిగెయ్డ్ (మూడు విధములైన ఐక్యత) ఇవి గెరిఫార్మర్డికెర్‌కలో ఖచ్చితమైన అధికారము కలిగియున్న మూడు విశ్వాసపు ఒప్పుకోలులు.

"ప్రకాశితులైన" మత గురువులు వారికి తోచినది వారు చెప్పే స్వేచ్ఛను కలిగియున్నారు. సత్యమును బోధింపక దుర్బోధలు చేయువారి మాటలు వినుటకై ఎక్కువ మంది ప్రజలు ఆసక్తి చూపలేదు. వాక్యము బోధించు సంఘములు మరియు బోధకుల కొరకై ప్రజలు వెదకి వాటికే వెళ్ళేవారు నశించిన పాపి ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మాత్రమే రక్షణ పొందగలడని బోధించు వాక్యోపదేశకుడు. అట్టి వాక్యోపదేశకుడు వారి గ్రామములో మరియు పట్టణములో లేనట్లైతే, మరొక ప్రాంతమునకు వెళ్ళేవారు లేదా ఇంటియొద్ద ఉండేవారు. ఉదాహరణకు, స్మిటిగెల్ట్ లేదా ఎ బ్రాకెల్ లాంటివారు చేసిన బోధలను వారివారి గుంపులో బిగ్గరగా చదివేవారు. నెదర్లాండ్స్ కష్టపరిస్థితిలో ఉన్నది. ఉన్నది ఒకే రిఫామ్డ్ చర్చ్, కాని రెండు వేర్వేరు రకముల మత గురువులు ఉండిరి!

89. హెండ్రిక్ డి కాక్

క్రీ.శ. 1801లో గ్రోనింగెన్ పరిగణలోని పట్టణమైన వీన్‌డమ్ నందు హెండ్రిక్ డి కాక్ జన్మించెను. తరువాత దైవజ్ఞాన శాస్త్రము అధ్యయనము చేయుటకై ఆయన యూనివర్శిటీ ఆఫ్ గ్రోనింగెన్‌కు వెళ్ళెను. పెలేజియస్ బోధలను ఆసక్తితో బలపరచు ప్రొఫెసర్ ఆధ్వర్యములో ఆయన అధ్యయనము చేసెను. మూల పాపము అను సిద్ధాంతమును పెలేజియస్ తిరస్కరించెను. ఈ విషయమై అగస్టీన్ మరొక అభిప్రాయము కలిగియుండెను. సంఘ సంస్కరణను గూర్చి విద్యార్థులకు అసలు బోధింపనే లేదు. లూథర్ మరియు కాల్విన్ వంటి వ్యక్తులను ప్రస్తావింపలేదు. గ్రానింగెన్‌లోని ప్రొఫెసర్‌లు, మంచి చేయుటకు ఎన్నుకునే స్వేచ్ఛా చిత్తము మానవునికి కలదు అను బోధించు ఆర్మీనియస్‌ను అనుసరించిరి. హీడెల్‌బర్గ్ ప్రశ్నోత్తరి మానవుని పరిపూర్ణ పతనమును గూర్చి తెలుపును గనుక ఈ డాక్యుమెంట్ సరైనది కాదని కొట్టివేసిరి. గనుక ప్రశ్నోత్తరిని ప్రక్కనబెట్టిరి. యేసు నిజముగా దైవ మానవుడను సత్యమును వారు తిరస్కరించిరి. క్రీస్తు ద్వారా రక్షణ అంటే మానవుడు మెరుగైన జీవితము జీవించుట. ఇతరులు అనుసరించుటకై మంచి మాదిరి చూపిన వాడు యేసు అని భావింపబడెను. పాపము మరియు కృప అను సిద్ధాంతములు పూర్తిగా నిర్లక్ష్యము చేయబడెను.

యూనివర్శిటీ ఆఫ్ గ్రోనింగెన్‌లో ప్రకాశిత ఆత్మ గొప్పగా ఏలుచుండెను. దీనికర్థము మానవ హేతువాదమందు శక్తి ఉన్నదని పూర్తి అభయముంచుట, దానిపై పూర్తిగా ఆధారపడుట. మానవుని చమత్కారము ద్వారా ఆయన మేలైన ప్రపంచమును తయారు చేయును. సర్వాధికారియైనవాడు ఉన్నాడని ప్రతియొక్కరు విశ్వసించిరి, మనము యోగ్యమైన మంచి జీవితం జీవించిన పిదప, ప్రేమగల తండ్రి మనలను పరలోకపు పరదైసునకు తీసుకుపోవును.

యూనివర్శిటీలో హెండ్రిక్ డి కాక్ బోధించిన ప్రశ్నోత్తరి, ఆయన బాల్యములో ఉన్నప్పుడు ఆ పెద్దమనిషి బోధించిన ప్రశ్నోత్తరి భిన్నముగా ఉన్నవి. బైబిల్ బోధించునదంతయూ ఆ పెద్ద మనిషి కొనసాగి బోధించెను. తత్ఫలితముగా హెండ్రిక్ హృదయములో పోరాటము చెలరేగెను. ఆ కారణము చేత ఆయన భారముతో ప్రార్థించెను. ఇప్పుడు హెండ్రిక్ సత్యమును అన్వేషింప ప్రారంభించెను.

క్రీ.శ. 1829లో గ్రోనింగెన్‌కు ఉత్తరమున ఉన్న ఉల్‌రుమ్ అను చిన్న గ్రామములో హెండ్రిక్ డి కాక్ పరిచారకుడాయెను. ఉల్‌రుమ్‌లో "నేనేదైనా మంచి చేసి నా రక్షణను సంపూర్ణము చేయదలచినట్లైతే, నేను శాశ్వతముగా తప్పిపోవుదును! నా రక్షణ, నా సొంత క్రియలపై కాక, మరొకదానిపై ఆధారపడియుండాలి. అని అతనితో చెప్పు ముసలి రైతును హెండ్రిక్ డి కాక్ కలుసుకొనెను".

తన మనసులో నుండి బయటికి రాలేని విధముగా ఈ మాటలు తనపై ముద్రవేసెను. ఒకరు ఆయనకు కాల్విన్ యొక్క పేరుగాంచిన "ది ఇన్‌స్టిట్యూట్స్" అను పుస్తకమునిచ్చిరి. (ఆయన యూనివర్శిటీలో ఉండగా ఈ పుస్తకమును గూర్చి విననే లేదు!). కాల్విన్ వ్రాసిన పుస్తకములతో పాటు స్మిటిగెల్డ్, ఎ బ్రాకెల్ వంటి పాత భక్తుల రచనలు చదివెను.

ఆయన కేనన్స్ ఆఫ్ డార్ డ్రెక్ట్ మూడు డచ్ విశ్వాసపు ఒప్పుకోలులు ఉన్నవి. మూడింటిలో ఇది ఒకటి. ఆయన ఈ పుస్తకమును శ్రద్ధగా చదివెను. తరువాత తన సంఘస్తులందరికి ఒక్కొక్క ప్రతిని అందజేసెను.

రిఫార్మ్డ్ సిద్ధాంతములను, గత తరములో దేవుని బిడ్డలు నమ్మి పాటించిన సిద్ధాంతములను హెండ్రిక్ డి కాక్ ఇప్పుడు నేర్చుకోవటం ప్రారంభించెను.


బైబిల్ సత్యమును గ్రహించులాగున ప్రభువు ఈ సంగతులను డి కాక్ యొక్క కళ్ళు తెరచెను. అతడు తప్పిపోయిన పాపియని ఒప్పుకొని, ప్రభువైన యేసు కార్యము ద్వారా మాత్రమే, రక్షింపబడుదునని గ్రహించెను. రక్షణకు మూలము యేసు మాత్రమేనని అది హెండ్రిక్ డి కాక్‌కు కూడ అందుబాటులో ఉన్నదని తెలుసుకొనెను. దేవుని సంపూర్ణమైన అద్భుతవెలుగు మహిమ అతని ఆత్మపై ఉదయించెను!

ఇప్పుడు అతని ప్రసంగ విధానము పూర్తిగా మారిపోయెను! దూర ప్రాంతములనుండి అనేకులు అతని బోధ వినుటకై వచ్చిరి. కాలి నడకన, గుఱ్ఱపు బండ్లపై, పడవలపై ప్రజలు ఆయా ప్రాంతములనుండి ఉల్‌రుమ్ సంఘమునకు వచ్చిరి. ప్రజలు గంటల తరబడి ప్రయాణము చేసి రావలసివచ్చెను, ఫ్రిజ్‌లాండ్ మరియు డ్రెంత్ నుండి అనగా దూర ప్రాంతములనుండి ప్రజలు వచ్చిరి.

వాక్యము వివరింపబడుచుండగా అనేకులు, ప్రత్యేకముగా సాధారణ ప్రజలు ఆతురపడుచూ వినుచుండిరి. హెండ్రిక్ డి కాక్ ప్రసంగములను స్వయాన ప్రభువే దీవించెను.

సంఘ భవనములో స్థలము లేనప్పుడు డి కాక్ బహిరంగ స్థలములో బోధించెను. మరొక ప్రాంతపు ప్రజలు, వారి సొంత పరిచారకుని ద్వార, వారి పిల్లలకు బాప్తిస్మమిప్పించుటకు ఇష్టపడలేదు. ఈ వ్యక్తి ప్రకాశింపబడుటను బలపరచి బైబిల్‌ను నమ్మువాడు కాదు. అటువంటి పరిచారకునిచే వారి పిల్లలకు బాప్తిస్మము ఇప్తిస్తే ఆ సంఘపు విశ్వాసపు ఒప్పుకోలులో పాలిభాగస్తులైనట్లవుతుంది. ఈ తల్లిదండ్రులు ఆ విధముగా సమ్మతింపలేక వారిబిడ్డలకు బాప్తిస్మమిమ్మని డి కాక్‌ను కోరిరి. డి కాక్ సమ్మతించి ఆ బిడ్డకు బాప్తిస్మమిచ్చెను. ఆయన చేసిన దానిని బట్టి డి కాక్‌కు ఇతర మత గురువులకు విబేధములు వచ్చెను.

ఇద్దరు బోధకులు ఆయనను గూర్చి కరపత్రిక వ్రాస్తూ వారు ఆయనను" విడతీయువాడు" "మోసగాడు" అని వ్రాసిరి. మరొక కరపత్రికలో "ఎగసిపడు మృగము" అని వ్రాసిరి. ఆయన అనుచరులు "దొడ్డిలోని ఆవులు" (వారికి సొంతగా బుద్ధి లేదు అని అర్థమిస్తూ) డి కాక్ కూడ కరపత్రిక వ్రాస్తూ మతగురువులను "తోడేళ్ళు" అని పిలిచెను. క్రీస్తు మందను దాడి చేయు తోడేళ్ళు వారు. డి కాక్ శత్రువుల హృదయములలో ద్వేషము అధికమగుచున్నది. ఆయన బోధను వారు నిషేధించిరి. డి కాక్ మూడు నెలల పాటు వాక్యము బోధింపకుండ నిషేధింపబడెను.



90. విడిపోవుట మరియు హింస (క్రీ.శ. 1834)

హెండ్రిక్ డి కాక్ తీసుకొనిన చర్యను బట్టి అతడు అనేక ప్రశంసలందుకొనెను. ఇతర సాంప్రదాయ మతగురువైన హెచ్.పి.స్కాల్టి కూడ ఆయనను బలపరచెను. హెర్ వార్మ్‌డికెర్క్ నుండి డ్రచ్ రిఫామ్డ్ చర్చ్ 88వ అధ్యాయము చూడుము) విడిపొమ్మని స్కాల్టి డి కాక్‌నకు సలహా ఇచ్చెను. కాని అలా చేయుటకు డి కాక్ ఇష్టపడలేదు. పనులు సక్రమముగా చేయుట ఆయనకిష్టము, తనను సంఘ పదవి నుండి తొలగించిన సంఘ అధికారులకు మనవి చేసికొనెను. స్థానిక కౌన్సిల్ మరియు రాజునకు ఉత్తరము వ్రాసెను. కాని అది వ్యర్థమాయెను, వారు రెచ్చిపోయి ఆయన తొలగింపును మూడు నెలల నుండి రెండు సంవత్సరములపాటు పొడిగించిరి. డి కాక్ హగ్యు వెళ్ళెను. ఆయన రాజుకు విన్నవించుకొనెను కాని రాజు లెక్క చేయలేదు. డి కాక్ తొలగింపబడెను.

పరిగణింపవలసిన మరొక సంగతియూ కలదు. సంఘ కార్యక్రమములలో కీర్తనలు పాడకూడదని, వాటిలో బైబిల్ రహిత సంగతులు కలవు అని చెప్పు పుస్తకము వ్రాయబడెను. గ్రంథకర్త అభిప్రాయముతో ఏకీభవిస్తూ డి కాక్ ఆ పుస్తకమునకు ఉపోద్ఘాతము వ్రాసెను.

ఇది చివరి అస్త్రము! ఆయన శత్రువులకు మరింత ఆధారము లభించెను. ఎటువంటి పరిశోధన చెయ్యకయే మత గురువు సభ్యత్వమునుండి సంఘ అధికారులు డి కాక్‌ను తొలగించిరి. డచ్ రిఫామ్డ్ సంఘములో డి కాక్ పరిచారకునిగా లేడు. అయినాసరే సంఘమునుండి విడిపోవుట డి కాక్‌కు ఇష్టములేదు. పరగణ సంఘపు అధికారులకు మనవి చేసుకొనెను గాని అది వ్యర్థమాయెను. అధికారులు అతనిని "గాలిసంచి" అనీ అనిరి.

అయితే ఒక సంఘటన జరిగెను, దాని పరిణామము చాలా వరకు వెళ్ళెను. క్రీ.శ. 1834లో ఓ సాయంకాల సమయమున, సంఘ సమావేశము మరియు ఉల్‌రుమ్ సంఘ సభ్యులు డి కాక్ వారి పరిచారకునితో కలిసిరి (సంఘమును నడిపించు పెద్దలు మరియు పరిచారకులు), మోకాళ్ళుని గౌరవప్రదముగా వారు కూడికను ప్రార్థనతో ప్రారంభించిరి. ఒక పెద్ద పేపర్ చివరన సంతకము చేయుటకై ప్రతి ఒక్కరికి అవకాశము ఇవ్వబడెను. సంతకము చేయలేనివారు వ్రేలిముద్ర వేసిరి. వారు అలా చేయుట ద్వారా అక్టె వాన్ అఫ్‌స్కెయ్‌డింగ్ ఆఫ్ వెడర్ కీయర్ (తిరిగి వచ్చుట అను పత్రము)పై సంతకము చేసిరి. డచ్ రిఫామ్డ్ సంఘము నుండి తమ్మును తాము ప్రత్యేక పరచుకొన్నామని సంతకము చేసిన వారందరు చెప్పిరి.

వెడర్ కీయర్ (తిరిగి వచ్చుట) అను పదము వాడుట ద్వారా "మేము గెరిఫార్మియెర్డి కెర్క్‌లో గతములో బోధింపబడు సిద్ధాంతములకు మేము తిరిగి వచ్చెదమని వారు చెప్పిరి. గెరిఫార్మియెర్డి గతములో ఉన్నట్లు మేము కొనసాగిస్తాం, మేము క్రొత్త మత శాఖను ఏర్పాటు చేయుట లేదు".

ఆఫ్‌స్కెయ్‌డింగ్ ఇప్పుడు వాస్తవమాయెను! సంఘ అధికారులకు, ప్రభుత్వమునకు, రాజుకు, సమాచారము అందజేయబడెను. డచ్ రిఫామ్డ్ సంఘము నుండి విడిపోవుట హెండ్రిక్ డి కాక్‌కు ఏ మాత్రమును ఇష్టము లేదు. దేవుని సేవకుడు వాక్య బోధ చేయమానలేడు గనుక అతనికి మరొక మార్గము లేదు!

ఉల్‌రుమ్ సంఘములో డి కాక్ బోధించుటకు అధికారము లేదు. అందుకే ఆయన పెద్ద ఇళ్ళలో, గోదాములలో లేదా బహిరంగ స్థలములో బోధ చేయుచుండెను. కాని ఇదియునూ నిషేధింపబడెను. అది శనివారమైనా పోలీసులు వచ్చారు, ఉల్‌రుమ్‌కు సైనికులను పంపివేశారు. ఎవరైతే డచ్ రిఫామ్డ్ సంఘము నుండి వెళ్ళి పోయారో వారి ఇండ్లలో వందమంది సైనికులను భరింపబద్ధులైయున్నారు. శాంతి భద్రత పాటించు నిమిత్తమై అన్నటు...!


ఆదివారము నాడు పోలీసులు డ్రమ్ వాయిస్తూ సంఘము చుట్టూ సైరవిహారము (మార్చింగ్) చేసేవారు. ఆ రోజున డి కాక్ ఇల్లు విడిచి వెళ్ళకూడదు. ఆయన ఇంట్లో పండ్రెండుగురు సైనికులున్నారు. వారు ఇంట్లో సామానులను దుప్పట్లను, పడకలను, ధ్వంసము చేసిరి. కాని డి కాక్ మాత్రము బయటికి వెళ్ళి బోధచేయుచుండెను. అందుకు గాను ఆయన పెద్ద మొత్తములో జరిమానా చెల్లించి, నేరస్థునివలె మూడు నెలలు చెఱసాలలో ఉంచబడెను.

దేశములోని అనేక స్థలములలో ఆఫ్‌స్కెయ్‌డింగ్ (తిరిగివచ్చుట) సంచలనం రేపెను. ఇళ్ళలో కూడుకొను గుంపులు సంఘములుగా ఏర్పడి పెద్దలు మరియు పరిచారకుల ద్వారా నడిపింపబడెను. అనేకమైన మత గురువులు పదవుల నుండి తొలగింపబడి డచ్ రిఫామ్డ్ చర్చ్‌ను విడిచిపెట్టిరి. అట్టివారిలో స్కాల్టి, వాన్ రాల్టి, వాన్ వెల్జ్‌న్, బ్రమ్మెల్ కాంప్, గెజిల్లి మీర్‌బర్గ్ వంటి దైవజనులుండిరి. డచ్ రిఫామ్డ్ చర్చ్‌నుండి బయటకు వచ్చిన వారికి బోధచేస్తూ ఈ దైవజనులు దేశ నలుమూలల ప్రయాణము చేసిరి.

ఆ కారణము చేత పరిస్థితి కష్టముగా మారెను. ద్వేష శత్రు భావనలు బయలు దేరెను. డచ్ రిఫామ్డ్ చర్చ్‌ను వదలివచ్చిన మత గురువులు బోధలను వింటూ ఇళ్ళలో ప్రజలు కూడుకొనేవారు, లేదా కూడుకొనినవారిలో ఒకరు ప్రసంగమును బిగ్గరగా చదువగా అందరు వినేవారు, ఇటువంటి గుంపులపై పోలీసులు, సైనికులు దాడి చేసి వారిని తుపాకులతో కర్రలతో కొట్టి, హింసించిరి. ఎక్కడైతే ఇరవైమందికంటే పై బడి ప్రజలు కూడు కుంటే, అట్టి కూడిక నిషేదింపబడినది.

"పరిశుద్ధ ప్రజలు" "మతఛాందసవాదులు" డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోయినవారంటే సాధారణ గ్రామీణులకు ఇష్టము లేదు గనుక వీరును సంతోషముగా హింసలో పాలుపొందుచూ వారిని హింసించిరి. డి కాక్ అనుచరుల ఇండ్లు ధ్వంసము చేయబడెను, గ్రామీణులు వారిపై మట్టి చల్లిరి, ఎగతాళి చేసిరి. డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోయిన వారు అధిక జరిమాన చెల్లించిరి. వారు జరిమాన చెల్లింపలేకపోతే వారి ఆస్తులు జప్తు చేయబడి అమ్మివేయబడెను! హింస అంతటా వ్యాపించెను... ఎక్కడైతే డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోయిన వారున్నారో అక్కడ హింస, విధ్వంసము కనబడెను.

అయినను ఈ సహవాసములు నానాటికి విస్తరించెను. సంవత్సరము లోపల వంద సహవాసములు ఏర్పడెను. నిజ బైబిల్ బోధ వినుటకై అనేకులు ఆసక్తి చూపుచుండిరి, ఇట్టి బోధమాత్రమే వారి ఆత్మల ఆకలిని తీర్చును.




91. విడిపోవుటను గూర్చి మరికొన్ని విషయములు (ఆఫ్‌స్కెయ్‌డింగ్)

క్రీ.శ. 1836 లో పరిస్థితులు మెరుగుపడ నారంభించెను. విడిపోవుటను (ఆఫ్‌స్కెయ్‌డింగ్) ఆపుట అసాధ్యమని రాజు గ్రహించటం ప్రారంభించెను. డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి వెళ్ళిపోయినవారు క్రొత్త మత శాఖను ప్రారంభిస్తున్నామని ఒప్పుకుంటే వారు కూడుకొనుటకు అనుమతింపబడుదురు. అప్పుడు వారు ఒక మత కూడికగా కూడుకొనుటకై అనుమతింపబడుదురు.

ఇందులో ఏమి ఇమిడియున్నది? మీకు గుర్తుండియుండచ్చును, డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోయినవారు, మూల సంఘమైన గిరిఫార్మిర్డిక్ (రిఫామ్డ్ చర్చ్) యొక్క కొనసాగింపుగా ఉన్నామనే చెప్పేవారు. ఈ సంఘము సంఘ సంస్కరణ దినము నుండి ఉనికిలో ఉన్నది. ఇప్పుడు వారు చేయునదంతా ఏమిటనగా మార్టిన్ లూథర్, ఎ బ్రాకెల్ మరియు ఒయేషియస్‌లచే బోధింపబడిన విధము ఉన్న రిఫామ్డ్ ధియాలజికి తిరిగి వచ్చుచున్నారు. వారు క్రొత్త మతశాఖను స్థాపించుటలేదు. కాని వారు కూడుకొనుటకై అనుమతి కోరినట్లైతే, వారు క్రొత్త మత శాఖను (డినామినేషన్) ప్రారంభించినట్లగును మరియు గిరిఫార్మిర్డిక్ అను పేరు వాడు హక్కును కోల్పోవుదురు.

అందుచేత విడిపోవుటను ఆమోదించు సంఘముల మధ్యలో చీలికలు మొదలాయెను. వారు హింస ద్వారా అలసిపోయారు గనుక వారు విడిగా కూడుకొనుటకై అనుమతింపబడిరి. వారిపేరు ఇకనుండి చారిత్రాత్మక పేరుగాక క్రిష్టిలిజ్కి ఆఫ్గిస్కెయడ్‌న్ గెమీన్‌టె (క్రిష్టియన్ చర్చెస్స్ ఆఫ్ సెస్సెన్) అని పిలువ బడిరి.

క్రీ.శ. 1838లో ఉట్రెక్ట్ సంఘముతో పాటు మత సమావేశ అనుమతికొరకు కోరిన వారిలో మొట్ట మొదటి పరిచారకుడు హెచ్.ఫి.స్కాల్టి.



అనుమతింపబడినవారు ఇప్పుడు నెమ్మదిగా స్వేచ్ఛగా కూడుకొనవచ్చును. ఇతర సంఘములు ఆ షరతుకు ఒప్పుకొనలేదు. ఒప్పుకొనక గిరిఫార్మ్డి పేరు ఇంకనూ వాడిరి గనుక హింసింపబడిరి. ఈ హింస వారు భరింపజాలని హింస గనుక వారి సంఘమునకు గిరిఫార్మ్డి గెమీంటెన్ ఆండర్ హెట్ క్రూయిస్ (సిలువను మోయు రిఫామ్డ్ చర్చెస్). పేరును క్రూయిస్గె మియెన్టెన్ (సిలువను మోయు సంఘము) అని కుదించిరి. తత్ఫలితముగా డచ్ రిఫామ్డ్ చర్చ్‌ను వదలిపెట్టిన వారి మధ్యలో గొడవలు, విభజనలు వచ్చెను. క్రీ.శ. 1840లో క్రొత్త రాజైన విల్లెమ్ II సింహాసనమెక్కినప్పుడు హింస క్రమేపి తగ్గి తుదకు ఆగిపోయెను.

డచ్ రిఫామ్డ్ చర్చ్ విడిచిపోయిన వారి మధ్యన అనేక సంగతులను బట్టి విచారకరముగా విభజన కలిగెను. క్రిస్మస్, ఈస్టర్ మానివేయుట, పరిచారకులు ఎటువంటి వస్త్రము ధరించాలి, బాప్తిస్మము ఇచ్చుట, సంఘజీవిత పరిపాలన మొదలగు వాటి విషయమై వాదన చెలరేగెను.

క్రీ.శ. 1834 (ఆఫ్‌స్కెయ్‌డింగ్) విడి పోవుట తర్వాత ఏర్పడిన సంఘములలో పరిచారకుల కొరత ఉండెను. క్రీ.శ.1834 లో విడిపోవుట తర్వాత నెదర్లాండ్స్ దేశమందంతటిలో పదిమందికంటె తక్కువమంది పరిచారకులుండిరి. డి కాక్ ప్రస్తుతమున్న స్థలములో అనగా గ్రొనింగెన్‌లో పరిచర్యకై మనుష్యులకు తర్ఫీదునిచ్చుటకై ఒక కోర్స్ ప్రారంభించెను. దేశములోని ఇతర ప్రాంతములలో ఇతర పరిచారకులు కూడ తర్ఫీదునివ్వటం ప్రారంభించిరి. విద్యార్థులకు సిద్ధపాటు శిక్షణ ఏదియూలేని కారణాన కోర్స్‌లు చాలా ప్రాథమికముగా నుండెను. పగలు పనిచేసి వారి కుటుంబములను పోషించుకుని సాయంత్రము తరగతులకు హాజరై అధ్యయనము చేయుచుండెడి వారు. తరువాత ఒక కళాశాల లేదా అకాడమి స్థాపించుటకై ప్రణాళికలు చేయబడెను.

క్రీ.శ. 1849 సంఘ సమావేశములో ప్రణాళికలను అమలు చేద్దామని నిర్ణయించిరి. ఐదు సంవత్సరముల పిమ్మట కళాశాల సిద్ధముగానున్నది. విడిపోవుట అను సంఘటన జరిగిన ఇరవై సంవత్సరముల తర్వాత కాంపెన్‌లో ఒక సెంట్రల్ థియలాజికల్ కళాశాల తెరువబడెను. ఇతర స్థలములలోని కోర్స్‌లన్నియూ కలిపి క్రొత్తగా ఏర్పరచబడిన కళాశాలలో ఒక క్రొత్త కోర్స్ ప్రారంభించిరి. (క్రీ.శ. 1842లో డి కాక్ మరణించెను). ఆ కళాశాలలో డి కాక్ కుమారుడు లెక్చరర్‌గా పని చేసెను.

"దేవుడు మనకొరకై గొప్ప కార్యములు చేసియున్నాడు గనుక మనము సంతోషించుదము" అని పరిచారకుడు మరియు లెక్చరర్ అయిన ఎ బ్రమ్మెల్ కాంప్ ప్రారంభోత్సవములో చెప్పెను. చాలా సంవత్సరముల పాటు మత స్వేచ్ఛ కొరకై దరఖాస్తు పెట్టుకున్న క్రిప్పిలిజ్‌కి ఆఫిసెయ్‌డెన్ గెమెన్‌టీన్ (క్రిష్టియన్ చర్చెస్ ఆఫ్ ద సెసెశన్) కూస్ గెమెనెటెన్‌తో కష్టకాల సంఘముతోపాటు ఉనికిలోఉండెను.

క్రీ.శ.1869లో మరొక ముఖ్య సంఘటన జరిగెను. రెండు మత శాఖలు కలిసి ఒక క్రొత్త మత శాఖగా ఏర్పడెను. రెండు వేర్వేరు మతశాఖలుగా కొనసాగుట దేవుని వాక్య ప్రకారము కాదని రెండు సంఘములునూ గ్రహించెను అభిప్రాయ బేధములున్నా ఐక్యత కలిగియుండమని దేవుని వాక్యము కోరుచున్నది.

క్రిష్టిలిజ్‌కి గిరిఫార్మ్డి కెర్క్ (క్రిష్టియన్ రిఫామ్డ్ చర్చ్) అని క్రొత్త మత శాఖకు పేరు పెట్టబడెను. క్రొత్త మత శాఖలో మూడు సంఘములు చేరలేదు. చేరక గిరి ఫార్మ్డి గిమీన్‌టెన్ ఆండర్ హెట్ క్రూస్ (కష్టకాల రిఫామ్డ్ చర్చెస్) అలా ఉండిపోయెను.


92. వాన్ రాల్టి మరియు అమెరికాకు వలసపోవుట

క్రీ.శ. 1840లో ప్రజలు ఐరోపా వదలి అమెరికాకు వెళ్ళిరి. "క్రొత్త ప్రపంచము"లో స్థిరపడుటకై జర్మనీ, ఇంగ్లండ్, ఐర్లండ్ స్కాండినేవియా నెదర్లాండ్ మొదలగు దేశాల ప్రజలు స్వదేశము విడిచి వెళ్ళిరి.

డచ్ రిఫామ్డ్ సంఘమును విడిచి వెళ్ళినవారు కూడ వలస వెళ్ళుటకై ఆసక్తి చూపిరి. వాస్తవానికి ఆ సమయములో ఆర్థిక, సాంఘీక పరిస్థితులు సంతృప్తికరముగా లేవు. గ్రామీణులు, కూలి పనిచేయువారు, చిన్న వ్యాపారము చేయువారు పేదరికమును ఎక్కువగా అనుభవించిరి. అమెరికాలలో పరిస్థితులు చక్కగా ఉన్నాయని వారు వినిరి.

అమెరికాలో మత స్వేచ్ఛ ఉన్నదని డచ్ రిఫామ్డ్ సంఘము నుండి విడిపోయిన వారు విని ఆకర్షితులైరి. డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోవుటలో నాయకత్వము వహించిన వారు వారి మందను ఒంటరిగా విడిచి పెట్టి వెళ్ళుటకు ఇష్టపడలేదు. ఎట్టి పరిస్థితులలోను వారి ప్రజలు చెదరిపోవుట వారికిష్టములేదు. వారందరు ఒక దగ్గరే ఉండి ఒక కాలనీ స్థాపింపవలెను.

ఒక పరిచారకుడు వలస ఏర్పాట్ల విషయములో సహాయపడెను. దీని నిర్వహణ అంతటికి ఆయనే ఇన్‌చార్జ్‌గా ఉండెను. ఆయన పేరు ఎ. బ్రమ్మెల్ కారిప్. ఆయన బావమర్ది పేరు హెచ్.వాన్ రాల్టి ఆయన పరిచారకుడు ఆయన చాలా పని చేయుచుండెను. డ్రెంతి మరియు ఓవరిజ్‌సెల్ పరగణాల నుండి వచ్చిన వారు



అనగా క్రీ.శ. 1834లో విడిపోవుటను బలపరచిన వారు వందమందికంటెపైబడి, మరియు రాల్టి కుటుంబము కలిసిరి. వారందరు కలిసి రాట్టర్‌డామ్ నుండి అమెరికాకు బయలు దేరిరి. వాన్ రాల్టి ఆధ్వర్యములో అక్కడ వారు ఒక కాలనీ స్థాపింపదలచిరి. దాటి పోవునపుడు ఇద్దరు పిల్లలు మరియు ఒక పెద్దవ్యక్తి మరణించిరి. ఈ వలస వెళ్ళిన వారు అమెరికాకు చేరుకునే సమయానికి ఆమెరికాలో చలికాలము ప్రారంభమాయెను. వీరు వస్తున్న సంగతి రిఫార్మ్డ్ చర్చ్ పాస్టర్‌కి తెలియును గనుక (అమెరికాలోని ప్రొటెస్టెంట్ మతశాఖ) వారి సంఘస్తులు వలసవచ్చేవారికొరకు సాధ్యమైనన్ని ఏర్పాట్లు చేసిరి. అయినాసరే ప్రజలు చలికాలమును గోదాములలో గడప వలసి వచ్చెను.

ఇది ఇలా ఉండగా వాన్‌వాల్ట గ్రామీణ ప్రాంతమును అన్వేషించు నిమిత్తమై వెళ్ళెను. మిషిగన్ సరస్సు తీరమున ఉన్న అడవిని క్రొత్త కాలనీ కొరకై ఎన్నుకొనిరి. ఫిబ్రవరి మాసములో ఆ ప్రాంతములో సహాయపడుటకై కొంతమంది పురుషులు, ఒక స్త్రీ ముందుకు వచ్చిరి. వారు ఎడ్లబండిపై ప్రయాణము చేసిరి, పొలములో నేలపై వారు పడుకొనిరి.

పురుషులు అడవిలోని చెట్లు నరుకుట ప్రారంభించిరి మరియు స్థానిక భారతీయులు వారికి సహాయపడిరి. చెట్ల మొద్దులతో వారు ఇండ్లు తయారు చేసిరి. జొన్నలతో ఆహారము ఎలా తయారు చేసుకోవాలో వారికి అక్కడి స్థానిక భారతీయులు చూపించిరి.

చెక్క ఇండ్లు సిద్ధముగానున్నప్పుడు భార్యాభర్తలు మరియు వారి పిల్లలు కలిసి వాటిలో నివాసము చేసిరి. వారు చాలా అనాగరిక పరిస్థితులలో జీవింపవలసి వచ్చెను. వారు ఆ ప్రాంతమునకు చేరిన తరువాత సమాధులను త్రవ్విరి. ఆదివారము విశ్రాంతిదినము, మొద్దులమీద కూర్చుని వాన్ రాల్టి ప్రసంగించగా వారు వినిరి.

ఎండకాలము పరిస్థితులు తీవ్రముగా ఉన్నందున అనేకులు అనారోగ్యముపాలై మరణించిరి. ఆ మొదటి పట్టణమునకు పునాదులు వేయబడెను. దాని పేరు హోలండ్! అనేకులు వలస రాగా క్రొత్త గ్రామములునూ ఏర్పడెను.

విస్తారమైన డచ్ కాలనీ ఒకటి స్థాపింపబడెను. "ఈ స్థలములో ఎటువంటి ఆటంకములు లేకుండ మనము ప్రభువును సేవింపవచ్చును" అని వాన్ రాల్టి చెప్పెను. క్రీ.శ. 1849 నాటికి ఏడు గ్రామములు ఏర్పడెను. ఏడు గ్రామములలో సంఘమునకు వెళ్ళువారుండిరి. ఏడు గ్రామాలకు గాను ఐదింటిలో వారికి స్వంత సంఘభవనములుండెను. నలుగురు పరిచారకులు ఐదు సంఘములను చూచుకొనుచుండిరి. మూడు పాఠశాలలు కూడ స్థాపింపబడెను.

క్రీ.శ. 1850లో ఈ సంఘములు రిఫార్మ్డ్ సంఘములో చేరెను. అమెరికా సంఘమునకు చెందిన వారందరు వలస వచ్చిన వారికి మొదటి నుండి సహాయపడిరి. కొద్ది సంవత్సరముల పిమ్మట వలస వచ్చి స్థిరపడినవారు క్రిష్టియన్ రిఫార్మ్డ్ చర్చ్‌ను స్థాపించిరి.

క్రీ.శ. 1847లో మరొక పరిచారకుడు డచ్ రిఫార్మ్డ్ చర్చ్ నుండి బయటకు వచ్చిన వందమంది వ్యక్తులతో అమెరికాకు వెళ్ళెను. అట్లాంటిక్ దాటుటకై వారు నాలుగు ఓడలలో బయలుదేరిరి. స్కాల్టి, ఫైరీస్ ఆఫ్ లోవకు వెళ్ళి పెల్ల అను పట్టణమును స్థాపించెను. (తూర్పు యోర్దానులోని పట్టణము పేరు పెల్ల, యెరూషలేములో క్రీ.శ.70లో రోమీయులు క్రైస్తవులపై దాడి చేసినప్పుడు పెల్ల అను స్థలమునకు వెళ్ళి తలదాచుకొనిరి. తూర్పు యోర్దానులోని పెల్ల అను స్థలము వలె ఈ పెల్ల కూడ ఆశ్రయపురముగా మారెను. ఈ క్రొత్తనగరమైన పెల్ల, ఇతర అనేక స్థలములకు "తల్లి కాలనీ"గా మారెను.

స్కాల్టి బోధించిన సంఘ భవనములన్నియు ఆయనవే. ఆయన అమెరికా మతశాఖలతో చేరక స్వతంత్రముగా సేవచేసెను. తరువాత ఆయన అనుచరులలో అనేకులు అమెరికా మతశాఖలో చేరి రిఫార్మ్డ్ సంఘములో సభ్యులుగా చేరిరి. ఇతరులు కొంతమంది క్రిష్టియన్ రిఫార్మ్డ్ చర్చ్ అను డచ్ మతశాఖలో చేరిరి.

93. లంబర్టస్ లెడెబోయర్ మరియు నూతన విభజన

దక్షిణ హోలండ్‌లోని పరగణలోని ఒక చిన్న గ్రామములో అనగా బెంతూయ్‌జెన్‌లో లంబర్ట్‌స్ లెడెబోయర్ పరిచారకునిగా ఉండెను. క్రీ.శ.1838లో ఆయన బోధించటము ప్రారంభించెను. ఆయన బాలుడుగా ఉన్నప్పుడు, పరిచారకునిగా మారాలని ఆశపడెను. తల్లిదండ్రులు కూడ అలా ఆశపడిరి. బాల్యమునుండే లంబర్టస్ దేవుని వాక్యముపట్ల గొప్ప గౌరవము చూపెను. పద్దెనిమిదవయేట దేవజ్ఞాన శాస్త్రము చదువు నిమిత్తమై యూనివర్సిటీకి వెళ్ళేంతవరకునూ బైబిల్ పట్ల ఇట్టి గౌరవమును అతడు కలిగియుండేవాడు. బైబిల్‌లో వ్రాయబడినదంతయూ దేవుని వాక్యము కాదని ప్రొఫెసర్‌లు ప్రకటించినపుడు లంబర్టస్ చాలా బాధపడెను. లెయ్‌డెన్ యూనివర్సిటీలో ప్రకాశిత ఆత్మ ఉద్భుతముగానుండెను. ఇతర విద్యార్థులవలె లంబర్టస్ బైబిల్ సత్యములను అనుమానించలేదు. అతడు భక్తి, గౌరవ జీవితము గడిపెను ఇతర విద్యార్థులు విందులు వినోదములకెళ్ళినప్పుడు, ఇతడు అట్టి వాటిలో పాల్గొనేవాడు కాడు.

లెడెబోయర్ ప్రసంగములు సాంప్రదాయబద్దమైనవి కావు కాని ప్రారంభములో ప్రసంగములు హృదయము నుండి గాక తలజ్ఞానము నుండి ఆయన చేసేవాడు. ప్రభువు లంబార్టస్ కళ్ళు తెరువగా పాపమును గ్రహించగా పరిస్థితులు మారటము ప్రారంభించెను. తాను పాపియని గ్రహించి, యేసు నొద్దకు తరలివచ్చినపుడు, యేసుక్రీస్తు ప్రభువు తన వ్యక్తిగత రక్షకుడాయెను. లంబార్టస్ ప్రభువైన యేసు ద్వారా లంబార్టస్ లెడెబోయర్ దేవునితో సమాధానము పొందుకొనెను. లెడెబోయర్ ఎంతో మిన్నగా తన ప్రభువుని మరియు యజమానుని ప్రేమించేవాడు! ఆయన ఒక రోజున సారవంతమైన పొలమును కొనెను. యేసు యొక్క ఆత్మీయ ముద్దు ఆ పొలముకంటె గొప్పది అని చెప్పెను.


లెడెబోయర్ ప్రసంగములు మారెను. ఇప్పుడు ఆయన బోధించునదంతయూ తన వ్యక్తిగత అనుభవమే. తన సంఘము ఆ వ్యత్యాసమును గమనించెను! యేసు ప్రభువు వారి జీవితములకు ప్రభువైయుండవలెనని మరియు విశ్వాసము ద్వారా "ఆయన మేపు గొఱ్ఱెలై" ఉండవలెనని అతడు వారితో చెప్పెను. ప్రభువైన యేసు మాత్రమే పాపులను రక్షించునని అతడు చెప్పెను. విశ్వాసమంటే అవగాహనతో మాత్రమే కూడుకొనినది కాదు గాని మన హృదయములతో కూడుకొనినది అని అతను చెప్పెను.

లెడెబోయర్ ఇలా బోధించుట తన సంఘము ఎన్నడునూ వినలేదు, ఉల్‌రుమ్‌లో కొద్ది సంవత్సరముల క్రితము హెండ్రిక్ డి కాక్ ఆధ్వర్యములో జరిగినది ఇప్పుడు బెంతూయ్‌జెన్‌లో జరుగుచున్నది. (89 అధ్యాయము చూడుము). సువార్త సత్యములను ప్రేమించు అనేకులు ఇప్పుడు లెడెబోయర్ బోధ వినుటకై గుంపులు గుంపులుగా వచ్చుచుండిరి.

లెడెబోయర్ డచ్ రిఫామ్డ్ చర్చ్‌లో పరిచారకునిగా ఉంటూ, సంఘమునకు వర్తించు నియమ నిబంధనలకు కట్టుబడియుందునని సంతకము చేసియుండెను. గాని అతడు అలా సంతకము చేసినందుకు బాధపడెను. ఎందుకంటే ఆ నియమ నిబంధనలు దేవుని వాక్యమునకు విరుద్ధముగా ఉన్నవి. ఆ నియ నిబంధనల అసలు అర్థము మరియు తీవ్రతను ఇటీవలే అతడు గ్రహించెను.

క్రీ.శ. 1840లో ఒక ఆదివారము ఉదయమున, వణకుతూ మెట్లెక్కుతూ లెడెబోయర్ గురువు యొక్క పీఠము (పుల్‌పిట్) దగ్గరకు వచ్చెను. డచ్ రిఫామ్డ్ చర్చ్‌కు అన్వయింపబడు నియమనిబంధనలను ఇక ఎన్నటికిని పాటింపనని, బోధించుటకు ముందే అతడు చెప్పెను. సంఘములో కీర్తనలతో పాటు పాటలు పాడవలెను అనునది ఒక నిబంధన. అనేక పాటలలో బైబిల్ విరుద్ధ సంగతులు చాలా ఉన్నందున, వాటిని పాడుట లెడెబోయర్‌కు ఇష్టము లేదు.

గురువుయొక్క పీఠములో (పుల్‌పిట్) ఒక నియమనిబంధన ప్రతి మరియు పాటల పుస్తకము ఉండెను. లెడెబోయర్ ఆ రెండింటిని నేలకు విసరికొట్టెను! అక్కడ కూర్చున్న స్త్రీ వెళ్ళి వాటిని ఏరి తీసుకువచ్చి "అలా చేయవద్దు" అని చెప్పెను. అక్కడే వాటిని వదిలేయండి, ఈ కార్యక్రమము తరువాత మనము వాటిని పూడ్చివేద్దాం" అని లెడెబోయర్ చెప్పెను. ఖచ్చితముగా అదే జరిగెను. కార్యక్రమము ముగిశాక, మూడు వందలమంది సంఘస్థులు అందరు కలిసి తోటలోనికి వెళ్ళి ఒక గుంట త్రవ్వి ఆ పుస్తకములను పూడ్చి పెట్టిరి.



పుస్తకములు పూడ్చివేయబడ్డాయి కాని తరువాత ఏమిజరుగును?

లెడెబోయర్ పదవి తొలగింపబడెను, ప్రసంగించు అధికారము కోల్పోయెను. తొలగింపబడినా సరే మరుసటి ఆదివారము ప్రసంగించుటకై సంఘమునకు వెళ్ళగా లోపలికి వెళ్ళుటకు ఆయనకు అనుమతి లభించలేదు.

ఆయన తన ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, సంఘస్తులు అతనితోపాటు చాలామంది వచ్చిరి.

రెండు నెలల పిమ్మట డచ్ రిఫార్మ్డ్ చర్చ్ నుండి లెడెబోయర్ పరిచారకుని స్థానము నుండి తొలగింపబడెను. కాని అతడు మాత్రము కొనసాగి బోధించెను. అతడు పెద్ద ఇండ్లలో, గోదాములలో, పట్టణములలో మరియు గ్రామములలో బోధించుచుండెను. అతి తక్కువ సమయములో సంఘములు స్థాపింపబడెను. ఈ సంఘములు లెడెబోయయాన్ని గెమీంటెన్ (లెడెబోరియన్ సంఘములు) క్రీ.శ. 1834లో విడిపోయిన ఇతర సంఘములతో లెడెబోయర్ కలుస్తాడా? ఈ గుంపులలో చీలికలు ప్రారంభమౌతున్నపుడు, వాటిలో ఇతడు చేరడు.

పది సంవత్సరములలో క్రొత్త మత శాఖలో ఈయన ఒక్కడే పరిచారకునిగా ఉంటూ దాదాపు ఇరవై సంఘములు స్థాపించెను. గనుక లెడెబోయర్ ఎంతో కష్టపడవలసివచ్చెను మరియు అనేక ప్రయాణములు చేయవలసివచ్చెను. క్రీ.శ. 1851లో ఆయనకు కాస్త సహాయము లభించెను. ఆయన పి. వాన్ డిజ్‌కిని పరిచర్యకొరకై ఓయ్‌ఫెనార్‌గా నియమించెను. (ఓయ్ ఫెనార్ అనగా అనధికార బోధకుడు)

లెడెబోయర్‌ను పెద్ద మొత్తములో జరిమానాను కట్టమని చెప్పిరి కాని అతడు ఏ తప్పు చేయనందున జరిమాన కట్టుటకు నిరాకరించెను. ఆ కారణము చేత నాలుగు వారములపాటు ఒక్కసారి, పద్దెనిమిది నెలలపాటు మరొకసారి ఆయన రెండు మారులు చెఱసాలలో వేయబడెను. అతడు చెఱసాలలో ఒంటరివాడుగా, విడువబడ్డాడని భావించెనా? లేదు "వారు నాతో పాటు ప్రభువును బంధించిరి" అని అతడు చెప్పెను.

94. ఆట్టో హెల్ డ్రింగ్ మరియు నెదర్లాండ్స్‌లోని హోమ్ మిషన్

మనము ఇదివరకు గమనించిన ప్రకారము పంతొమ్మిదవ శతాబ్దము అనేక దేశములలో హోమ్ మిషన్‌కు నిలయముగా ఉండెను (హోమ్ మిషన్ అనగా స్వదేశ సేవ)

హోమ్ మిషన్ జర్మన్ మరియు ఇంగ్లండ్‌లోనే గాక నెదర్లాండ్స్‌లో కూడ జరుగుచుండెను. నెదర్లాండ్స్‌లో హోమ్ మిషన్ విషయములో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తి ఆట్టో హెల్‌డ్రింగ్ (క్రీ.శ. 1804-1876). హెల్ డ్రింగ్ పేదవారికి మాటలయందును, క్రియలయందును, సువార్త ప్రకటించుచుండెను. పంతొమ్మిదవ శతాబ్దములో చాలామంది పేదలుండిరి. సాంఘీక పరిస్థితులు భయంకరముగా నుండెను, అవసరతలోనున్న వారికి సహాయము లేకుండెను. కాని సంఘములు అటువంటి వారికి సహాయము చేయలేదు. ఒక చిన్న గ్రామములో పరిచారకునిగా ఉంటూ పేదల కష్ట బాధలను వర్ణిస్తూ ఆయన అనేక చిన్న పుస్తకములు వ్రాసెను. "కలరా కంటే కష్టములు ఘోరమైనవి" అని ఒక పుస్తకమునకు పేరు పెట్టెను.

ఏదిఏమైనా, పరిస్థితులు మెరుగుపరచుటకై ఏమేమి చేయబడాలో దానిని ఎలా అమలు చేయాలో ఆ పుస్తకములో వ్రాసెను. తన గ్రామములోని నిరుద్యోగులకు పని దొరికేలా అతడు చర్యతీసుకొనెను. అతడు ఊరకే వారికి అన్నము పెట్టక, వారు బంగాళ దుంపలు మరియు కూరగాయలు పెంచుటకై వారికొరకై కొంత పొలమును కొనెను. దానిని సేద్యము ఎలా చేయాలో కూడ హెల్‌డ్రింగ్ వివరించెను ఆడపిల్లలకు కుట్టుట నేర్పింపబడెను. అలా చేయుట ద్వారా పేదలకు బయట నుండి సహాయముగాక తమంతట తాము తమ కాళ్ళపై నిలబడేలా చేసెను.

ఒకసారి వెలువి (నెదర్లాండ్‌లోని చిత్తడినేల ఉన్న అడవి ప్రాంతము) గుండా ఆట్టో హెల్‌డ్రింగ్ నడుస్తూ పాత ఇండ్లలో పేదలు నివసిస్తున్న కాలనీని చూచెను. అక్కడి నేల చాలా మంచిది కాని నీళ్ళు లేవు, సంఘము, పాఠశాల మున్నగునవియూలేవు.

డబ్బును కోరుతూ హెల్‌డ్రింగ్ ధనికులైన తనమిత్రులకు వ్రాసెను. డబ్బును ఖర్చుపెట్టి కొంతమంది నిపుణులను పిలిచెను. అక్కడ బావి త్రవ్వబడెను, క్రైస్తవ విధానములో చదువు నేర్పింపబడెను. హెల్‌డ్రింగ్ శ్రమ ఫలితముగా, ఆ ప్రాంతము కొద్ది సంవత్సరములలోనే ఓ మాదిరి గ్రామముగా మారెను. అక్కడ మంచి క్రైస్తవ పాఠశాల మరియు చక్కటి సంఘము ఏర్పడెను. ఆ స్థలము హోండర్‌లో అని పిలువబడెను.

గౌడలోని స్త్రీల చెఱసాలను అందులోని పరిస్థితులను చూచి హైల్ డ్రింగ్ కలత చెందెను. అందుచేత పాపము చేత అక్రమములో జీవించు యౌవన స్త్రీల నిమిత్తమై జెట్టెన్‌లో అతడు ఒక హోమ్‌ను ప్రారంభించెను. పిల్లలకొరకై కూడ ఒక హోమ్‌ను అతడు స్థాపించెను. యౌవన దశలోనున్న అమ్మాయిల కొరకు ఒక హోమ్‌ను అతడు కట్టించెను.

ఈ సంస్థలలో పనిచేయుటకై సూపర్‌వైజర్‌లు మరియు అసిస్టెంట్‌లు కావాలి. హోమ్‌లలో పనిచేయు అమ్మాయిలకు తర్ఫీదునిచ్చుటకై అతడు ఒక కళాశాలను తెరచెను.

వల్క్‌త్యువెల్ కెర్క్ అను పేరుగల సంఘమును క్రీ.శ. 1870లో అతడు తెరచెను (వాస్తవానికి ఆశ్రయకొండ పైనున్న సంఘమని దాని కర్థము)

ఆరు సంవత్సరముల పిమ్మట హెల్ డ్రింగ్ చనిపోయినప్పుడు, అతని సంఘ భవనము ప్రక్కననే పాతిపెట్టబడెను. జెట్టెన్‌లో స్థాపింపబడిన హోమ్‌లన్నిటికి హెల్‌డ్రింగ్ సంస్థలు అని పేరు పెట్టబడెను. గనుక ఆయన పని కొనసాగెను మరియు ఆయన పేరు చిరస్థాయిగా మిగిలిపోయెను.

హోమ్ మిషన్‌లో (స్వదేశ సేవ) ప్రముఖ పాత్ర వహించిన మరొక ముఖ్యమైన వ్యక్తి జాన్ డి లియోఫ్‌డి (క్రీ.శ. 1814-1869) ఆయన మెనోనైట్ సంఘకాపరి. క్రీ.శ. 1849లో ఆమ్‌స్టర్‌డామ్‌లోని జోర్డాన్ అను స్థలములో, నిరుపేదలు, కూలిపని చేయువారు


నివసించుకోటలో నివసించుటకై ఆయన వెళ్ళెను. ఆయన వీధులగుండా నడుస్తూ వారి స్థితిగతులను చూచి ఆయన ఎంతో బాధపడెను. ప్రజలక్కడ కూలిపోయిన ఇళ్ళలో నివసిస్తూ ఎంతో కష్టమును అనుభవించుచుండిరి. అక్కడి మురికి మరియు పేదరికము ఎంతో భయంకరముగా ఉండెను! అక్కడి అక్రమము చెప్పనలవి కానిది!

కెనాల్ ప్రక్కన ఉన్న ఇండ్లలో పాస్టర్ డి లియఫ్‌డి బైబిల్ స్టడీస్ ప్రారంభించెను. త్వరలో వందలకొలది వ్యక్తులు ఈ కూడికలకు హాజరవటం ప్రారంభించిరి.

జోర్డాన్ యొక్క ఇతర ప్రాంతములకునూ డి లియఫ్‌డి వెళ్ళి సువార్తపనిచేసెను. అదియూ గాక ఆదివారపు ఆరాధన ప్రారంభించెను, పిల్లలకు ప్రత్యేక కార్యక్రమము జరుపబడెను. వీధులలో పగలంతా ఊరకే తిరుగు పిల్లల కొరకై నర్సరీ స్కూల్స్ ప్రారంభింపబడెను. ఈ నర్సరీ స్కూల్‌నందు పిల్లలకు బైబిల్ కథలు నేర్పింపబడెను.

పని విస్తరించినందున డి లియఫ్‌డికి ఎక్కువ మంది సహాయకులు అవసరమైరి. తన స్వంత గృహములోనే సువార్తికులు శిక్షణకొరకై కళాశాలలను తెరచెను. సాయంత్రపు వేళ ఆమ్‌స్టర్ డామ్‌లోని పేదల ప్రాంతములకు వెళ్ళి వారు సువార్త కరపత్రికలు మరియు బైబిల్స్ పంచిరి.

క్రీ.శ. 1855లో టాట్ హెయల్‌డెస్ వోక్స్ (ప్రజలందరికై రక్షణ) అను పేరుగల సంస్థ ఏర్పాటు చేయబడెను. నెదర్లాండ్స్ ప్రజలందరికి సువార్త ప్రకటించుటయే దాని ఉద్దేశము! త్వరలోనే దేశములోని ఇతర ప్రాంతములలో ఈ సంస్థ శాఖలు తెరువబడెను, డి లియఫ్‌డి విద్యార్థులు వెళ్ళి సువార్తికులుగా పనిచేయుచూ ప్రజలందరికై రక్షణ అను శుభవర్తమానము ప్రకటించిరి.




95. గ్రోయెన్ వాన్ ప్రిన్స్టరర్

పంతొమ్మిదవ శతాబ్దములోని ఉజ్జీవ ఉద్యమమునకు రివైవల్ అను పేరు పెట్టబడెను. "ఆత్మీయముగా నిద్రించు" వారిని మేల్కొలుపుటయే దాని ఉద్దేశము. ప్రకాశిత ఆత్మ నెదర్లాండ్‌లోను మరియు అనేక స్థలములలోను వ్యాపించి సంఘములో గందర గోళము సృష్టించుచున్నందున దాని ప్రమాదమును గూర్చి బిల్డర్ డిజ్క్ మరియు డ కోస్ట అను వారు హెచ్చరించిరి. బిల్డర్ డిజ్క్ మరియు డ కోస్టలతో పాటు గ్యుల్లామి గ్రోయెన్ వాన్ ప్రిన్స్టరర్ అను వ్యక్తిని ప్రస్తావించుట ఆవశ్యకము (క్రీ.శ. 1801-1876)

గ్యుల్లామి ఒక విశిష్టమైన కుటుంబము నుండి వచ్చిన యౌవనస్థుడిగా, సకల విద్యను అభ్యసించినవాడు. అడ్వకేట్‌గా పనిచేద్దామని ఆయన యూనివర్సిటీ ఆఫ్ లెయ్‌డెన్‌లో న్యాయశాస్త్రము అధ్యయనము చేసెను. ఆయన లిటరేచర్ కోర్సుకూడ చేసెను. ఇరవై రెండవయేట ఆయన ఈ రెండు సబ్జక్ట్‌లలో డాక్టరేట్ పొందుకొనెను.

అదియూగాక పండితుడైన విల్లెమ్ బిల్డర్ డిజ్క్ నుండి ప్రైవేట్ పాఠములు నేర్చుకొనెను. క్రీ.శ. 1829లో క్యాబినేట్ రాజైన విల్లెమ్ Iనకు సెక్రెటరీగా నియమింపబడు వరకు గ్రోయెన్ లాయర్‌గా పనిచేసెను.

గ్రోయెన్ మతపరముగా ఉదారత్వము గలిగి పెంచబడెను. కాని పరిస్థితులు అతి త్వరలోనే మారటం ప్రారంభించెను. తన భార్య మరియు రాజు యొక్క చాప్లిన్ ప్రభావము వలన సంఘ సంస్కరణ సత్యములనెరిగి వాటిని ఆయన ప్రేమించెను. ఉజ్జీవ ఉద్యమమును బలపరచు వ్యక్తులు విశ్వసించి, ఆచరించిన సంఘ పునరుజ్జీవ సత్యములు గనుక గ్రోయెన్ కాల్వినిస్టిక్ బోధలను బలపరచెను. తన మిత్రులతో పాటు గ్రోయెన్ తన ఇంటిలోనే కూడికలు జరుపటము ప్రారంభించెను. వారు కలిసి పైపై భక్తిని గూర్చి మాత్రమేగాక ప్రయోగాత్మక



వ్యక్తిగత మతమును గూర్చి మాటలాడిరి. గ్రోయెన్ తన వ్యక్తిగత పాపము మరియు దేవుని కృపను గూర్చి బలమైన అవగాహన కలవాడై, వ్యక్తిగత విశ్వాసపు నిశ్చయతకొరకై ఆశపడెను.

క్రైస్తవ్యము ఇటు సమాజమునకు మరియు ప్రభుత్వమునకు చాలా ప్రాముఖ్యమైనదని ఆయన గ్రహించెను. గ్రోయెన్ యొక్క రచనలలో మనము ఈ ఒప్పుకోలును స్పష్టముగా చూడవచ్చును, "మనదేశమైన నెదర్లాండ్స్ సువార్తను ఒప్పుకుంటే అది మన దేశమును వర్ధిల్లజేయును, సువార్త తిరస్కరణ దేశమునకు నష్టము."

గ్రోయెన్ ప్రకారము, సంఘము, సమాజము మరియు ప్రభుత్వము దేవుని సర్వాధికారమును ఒప్పుకొనవలెను. మానవ నియమ నిబంధనలకు దేవుని వాక్యము మరియు చట్టము మూలముగా ఉండాలి.

క్రీ.శ.1834లో అంటే ఈ సమయములోనే ఆఫ్‌స్కెయ్‌డింగ్ (డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోవుట, 90 అధ్యాములో చూడుము) జరిగెను. డచ్ రిఫామ్డ్ చర్చ్‌నకు గ్రోయెన్ విశ్వసనీయముగా ఉండెను కాని దాని నుండి విడిపోయిన వారికి ఆయన సహాయము చేసెను. విడిపోయిన వారు డచ్ రిఫార్మ్‌డ్ చర్చ్‌కు సంబంధించివారు కాకపోయినా, వీరు రిఫామ్డ్ బోధలను నిశ్చయముగా స్వీకరించి పంచుకొనినవారు. ఈ ప్రజలు సాంప్రదాయ సిద్ధాంతమును మరియు బైబిల్ ప్రమాణములను గౌరవించి ఆచరించిరి. కాని తన సంఘమందు అలా చేయలేదు. విడిపోవుట (ఆఫ్‌స్కెయ్‌డింగ్)ను బలపరచు అనేకులలో నిజమైన భక్తి శ్రద్ధలను చూచినప్పుడు ఆయన ఎంతగానో ఇష్టపడెను.

ఈ ప్రజలు అన్యాయముగా బాధింపబడినపుడు గ్రోయెన్ చాలా బాధపడెను. కావున ఈ విషయమును ఖండిస్తూ క్రీ.శ.1837లో ఆయన ఒక పుస్తకమును ప్రచురించెను. వారి దుస్థితిని వర్ణిస్తూ "విడిపోవుటను బలపరచు సంఘస్తుల ఇండ్లలోకి ఒకేసారి మూడు వారముల పాటు పది పండ్రెండుగురు సైనికులు బలవంతముగా నెట్టివేయబడి అక్కడే ఉండిరి. ఒక సభ్యుని ఇంటిలోనికి వారి అధికారితో పాటు ముప్పై ఒక్క మంది సైనికులు నెట్టివేయబడి ఆ ఇంటిలో నివసించిరి. ఇలా సైనికులు వారి ఇండ్లలో జొరబడి వారికెంతో బాధను కలుగజేసిరి. ఒక చిన్న గదిలో భార్య, భర్త వారి ఐదుగురు పిల్లలు ఉండగా ఎనిమిదిమంది సైనికులు అందులో జొరబడిరి. తల్లి బిడ్డ అనారోగ్యముతో పడకలో ఉంటే వారు ఆ విధముగా చేసిరి".

డచ్ రిఫామ్డ్ చర్చ్‌ను విడిచిన సాధారణ దీన ప్రజలు, ధనికుడును పండితుడైన ఉజ్జీవ ఉద్యమ నాయకునిద్వారా ఎంతో ప్రోద్భలము ప్రోత్సాహమునొందిరి. డచ్ రిఫామ్డ్ చర్చ్ నుండి విడిపోయిన సాధారణ దీన ప్రజలు ఇచ్చు స్పష్టమైన సాక్ష్యమువలన తన భర్త సాక్ష్యము బలపరచబడెనని అతని భార్య చెప్పెను.

డచ్ రిఫామ్డ్ చర్చ్‌నుండి విడిపోయినవారివలె, ఆ సంఘములోని నియమ నిబంధనల విషయమై గ్రోయెన్ కూడ ఇష్టపడలేదు. మేలు నిమిత్తమై సంఘ విషయములు మారాలని ఆయన ఆశించెను. హేగ్‌లోని తన మిత్రుడు డ్రియ్‌ఫార్మలెయ్‌రెన్ వాన్ ఎనిగెయేడ్‌నకు (ఐక్యత యొక్క మూడు రూపాలు, 70వ అధ్యాయము చూడుము) సంఘ సమావేశము లోబడవలెనని వారి ఉత్తరములో వ్రాసిరి. క్రీ.శ. 1618లో సినాడ్ ఆఫ్ డార్ట్‌లో మూడు విధములైన ఐక్యతను ప్రతిపాదించిరి. కాని సంఘ సమావేశము దానికి నిరాకరించెను. సిద్ధాంత స్వేచ్ఛ తప్పక అమలులో ఉండవలెనని వారు చెప్పిరి. ఆయన ఉజ్జీవ ఉద్యమమును నిజముగా బలపరచువాడైయుండి, కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించు విద్యార్థులకు బోధింపబడు తీవ్రమైన తప్పులను గ్రోయెన్ ఖండించి వాటి కొరకై పోరాడెను.

ఒకసారి ఆయన ఈ పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ "క్రీస్తు దేవుని కుమారుడా కాదా, మన సమస్త పాపమునుండి క్రీస్తు రక్తము కడుగుతుందా లేదా అని కళాశాలలను అడుగనవసరము లేదు గనుక మనము దేవునికి వందనస్తులమైయున్నాము. వ్యవసాయ కూలీపనివాడు, ప్రభువుచే బోధింపబడినవాడు, అవిశ్వాసియైన పండితుడు దైవజ్ఞాన శాస్త్రికంటే తెలివైనవాడు."

తాను ఎంతో ప్రియముగా ప్రేమించిన సత్యము కొరకై గ్రోయెన్ వాన్ ప్రిన్‌స్టరర్ ఎన్నో పోరాటములు చేసెను. "విశ్వాసి జీవితములో శ్రమ మరియు కష్టములు అంతర్భాగమని పోరాటములను" గూర్చి ఆయన వ్యాఖ్యానించెను.

96. డాక్టర్ హెచ్. యఫ్. కోల్‌బ్రగ్గి

హెర్మన్ గెరార్డ్ కోల్‌బ్రగ్గి కుటుంబములో హెర్మన్ ఫ్రెడ్రిక్ ప్రథమ సంతతిగా పుట్టెను. (ఆయన తన కుటుంబము మరియు స్నేహితులకు ఫ్రిట్జ్ అని తెలియును) నెదర్లాండ్స్ నగరమునకు ముఖ్య పట్టణమైన ఆమ్‌స్టర్ డామ్‌లో క్రీ.శ. 1803లో ఫ్రిట్జ్ జన్మించెను.

ఎన్నో బైబిల్ కథలు చెప్పే భక్తిగల అవ్వను ఫ్రిట్జ్ కలిగియుండెను. అవ్వ ఈ కథలు చెబుతుండగా, చలిమంట కాచుకొనుచూ, అక్కడ పరిచిన చలువ రాళ్ళ పై ఉన్న బైబిల్ కథలను తెలుపు చిత్రమును చూస్తుండేవారు. ఆ చిత్ర పటములు చక్కగా అలంకరింపబడియున్నవి. ఆయన బాలుడుగా ఉన్నప్పటి నుండి పరిచారకునిగా ఉండాలని ఫ్రిట్జ్ కోరుకునేవాడు. ఆయన స్కూల్‌లో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. ఆయనకు ప్రాచీన భాషలు చక్కగా వచ్చును. ఆయన చదువుల సమయములో దేవుని వాక్య సత్యమును గూర్చి ఫ్రిట్జ్‌కు చాలా సందేహములు కలిగెను. దేవుడున్నాడా లేదా అని సందేహించేవాడు ఈ ప్రశ్నలన్నియు ఆయనను కలవరపరచి ఇబ్బంది పెట్టెను.

ఆయన ఇరవై రెండేండ్ల వయసులో ఉండగా ఫ్రిట్జ్ యొక్క తండ్రి చనిపోయెను. ఆయనే తన కుటుంబస్తులందరిని చూచుకోవలసిన ఆయన తన చదువులను ఎలా కొనసాగిస్తాడు? ఫ్రిట్జ్ తన హృదయములో అనుమానముతో పోరాడుతుండగా ఫ్రిట్జ్ ఆత్మయొక్క చీకటిని తరిమి దానిని వెలిగించుటకై ప్రభువు ఆయనపై కనికరపడి తన వెలుగును పంపెను. నేను శ్రమ పొందినప్పుడు, ప్రభువు నాకు ఆశ్రయమైయుండి నాకు ఆదరణ నిచ్చెను" అని ఫ్రిట్జ్ చెప్పెను.


ఆయన ట్యూటర్‌గా పనిచేయుచు తన చదవులు కొనసాగించెను. తన ఇరవై మూడవ ఏట హెర్స్ టెల్డ్ ఇవాంజలిస్క్-లూథర్‌సెకెర్క్ నందు అసిస్టెంట్ పరిచారకునిగా పనిచేయుటకై అనుమతిపొందెను. ఆయన ప్రసంగములు అలజడిని కలుగజేసెను. ఇతర సంఘములనుండి మనుష్యులు ఆయన బోధ వినుటకై వచ్చు చుండిరి. అధ్యయనము వలన కంటే తన ప్రార్థన వలన ప్రసంగములు ప్రభావవంతముగా ఉండెను. యెహెజ్కేలు ప్రవచించినపుడు, ఎలాగైతే జరిగెనో ఆ విధముగా ఎండిన ఎముకలలోనికి జీవము రావాలని ఆశించి ఆయన బోధించెను. (యెహెజ్కేలు 37:1-14).

కొల్‌బ్రగ్గి పశ్చాత్తాపము, మారుమనస్సు మరియు మానవుని పాపము, దేవుని కృపను గూర్చి బోధించెను. మృతతుల్యమైన మతమును గూర్చి ఆయన బోధించెను. అది కూడ ప్రకాశిత ఆత్మ సమయములో! అటు వంటి బోధ హర్ వోర్మ్‌డి కెర్క్ (డచ్ రిఫామ్డ్ చర్చ్) నందు త్వరలోనే శత్రుత్వము కలుగజేసెను. కోల్‌బ్రగ్గికి పిచ్చి పట్టిందని ప్రజలు చెప్పేవారు. క్రీ.శ. 1827లో ఆమ్‌స్టర్ డామ్‌లో హెర్స్ టెల్డ్ ఇవాంజలిస్క్ లూథర్‌సి కెర్క్ ఒక పరిచారకుడు కోల్ బ్రగ్గికి పూర్తి విరుద్ధముగా బోధించెను. ఆయన పరిచారకునిపై నేరము మోపెను కాని కన్‌సిస్టోరి (సంఘ పెద్దలు మరియు పరిచారకులు) ఆయన హృదయము దుష్టత్వముతో నిండియున్నదని, ఆయన గర్విష్టి అని వారు చెప్పిరి. కోల్‌బ్రగ్గి తన నేరారోపణను ఉపసంహరించుకోలేదు గనుక ఆయన బోధ చేయుటను ఆపివేసిరి "నేను సత్యము కొరకు పోరాడుతాను, ఇప్పుడు సత్యము నిమిత్తమై శ్రమపడుటకు సిద్ధముగా ఉన్నాను" అని జవాబిచ్చెను.

ఆయనకు ఎన్నో కష్టములు వచ్చెను. కోల్‌బ్రగ్గి తన అధ్యయనములో నిమగ్నమైయున్నా ఇప్పుడైతే ఆయనకు ఎటువంటి ఆదాయ వనరు లేక ఉన్నాడు. ఆయన కీర్తన 45 ఆధారముగా పరిశోధన అధ్యయనము (థీసిస్) అద్భుతముగా పోషించెను.

క్యాథరిన్ యొక్క సంరక్షకురాలి యొద్ద నుండి అనుమతి లభించాక క్రీ.శ. 1829లో కోల్ బ్రగ్గి క్యాథరిన్ ఎంగల్ బర్ట్‌ను వివాహమాడెను. కీర్తన 45 ఆధారముగా పరిశోధన రచన చేసి క్రీస్తును హెచ్చించెను అను సంగతి వినిన పిమ్మట క్యాథరిన్ యొక్క అవ్వ అనుమతినిచ్చెను. ఒక వ్యక్తి క్రీస్తును, క్రీస్తు వధువును ఎత్తిపట్టుకున్నట్లయితే, ఆయన అట్టి వ్యక్తిని తనవాడని చెప్పుటకు వెనుకాడడు, నేను అట్టి వ్యక్తిని గూర్చి సిగ్గుపడనని" అమె చెప్పెను.

యౌవన జంట వెళ్ళి ఉట్రెక్ట్‌లో నివసించెను. కోల్ బ్రగ్గి ఉట్రెక్ట్ హెర్మ్ ఓర్మిడి కెర్క్ (డచ్ రిఫామ్డ్ చర్చ్) లో చేరుటకు ఆశపడెను గాని నిరాకరింపబడెను! తరువాత 15 కష్ట సంవత్సరములు వచ్చెను. సంఘ అధికారులతో జరిగిన సంప్రదింపులు ఫలింపలేదు. ఆయన భార్య మరణించెను. తనను బలపరచేవారు లేక ఆయన ఒంట రిగా పోరాడవలసివచ్చెను. రివెయ్‌ల్‌ను (ఉజ్జీవ ఉద్యమము



అధ్యాయము 87) బలపరచు వారి మధ్య ఆయన ఆహ్వానింపబడెను కాని ఇంత ఇబ్బందిలో ఉన్న ఈయనకు ఎలా సహాయపడాలో వారికి తెలియలేదు. కోల్ బ్రగ్గి దేవుని వాక్యమును బోధింపవలెనని ఆతురపడెను గాని అధికారము అందుకు అనుమతింపలేదు.

కోల్‌బ్రగ్గి తుదకు జర్మని చేరుకొనెను. అక్కడ ఎబెర్‌ఫెల్డ్ అను పట్టణములో జర్మన్ చర్చ్‌ను విడిపోయిన క్రైస్తవ ప్రజలుండిరి. ఈ ప్రజలు కష్టపరిస్థితిలో ఉండగా వారికి సహాయము చేయాలని ఆశపడి వారికి బోధించటము ప్రారంభించెను! అక్కడ పరిస్థితులు మెరుగుపడెను, సంఘము స్థాపింపబడెను, దాని పేరు నెదర్లాండిస్కె రిఫార్మియర్టి గెమ్‌ఇండి (డచ్ రిఫార్మ్డ్ కాంగ్రిగేషన్).

తదుపరి కోల్ బ్రగ్గి క్రొత్తగా ఏర్పడిన సంఘమునకు కాపరి ఆయెను. దేవుని వాక్యమును వివరించుటలో కోల్‌బ్రగ్గి ఎంతో నిపుణుడాయెను. "నేను బోధింపలేకపోతే నా జీవితము వ్యర్థమే" అని ఆయన చెప్పెను. భక్తిహీనులు విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడగలరని తన ప్రసంగములన్నిటిలో ఆయన బోధించేవాడు. రక్షణ కవసరమైన దంతయూ అనుగ్రహించువాడు దేవుడే, మానవుడు దానికేదియూ జత చేర్చనవసరమేలేదు!

కోల్ బ్రగ్గి తన రచనల ద్వారా ఇతర దేశములలోనూ ప్రసిద్ధి చెందెను. నెదర్లాండ్స్‌లో కూడ ఆయన పని ప్రశంసింపబడెను. అనేక హెర్‌వార్మిడి కెర్కెన్ (డచ్ రిఫామ్ చర్చెస్స్)లలో బోధించుటకై అనధికారపూర్వకముగా అనుమతింపబడెను.


ఒక సందర్భములో ఆమ్‌స్టర్‌డామ్‌లో ఆయన వెయ్యి మందికి బోధించెను! ఈ గొప్ప ఆత్మీయ యోధుడు తన మరణ పడకపై ఉంటూ, "యేసు నామములో పాపక్షమాపణ కలదని ప్రతియొక్కరికి చెప్పండి", అని సువార్త ప్రకటించెను. ఏదైనా ఇంతకంటే సులువైనది కలదా?

97. అబ్రహాం కుయ్‌పర్

క్రీ.శ. 1834 మరియు క్రీ.శ. 1840లోని (ఆఫ్‌స్కెయ్‌డింగ్) విడిపోవుట తర్వాత డచ్ రిఫామ్డ్ చర్చ్‌లో జరుగుతున్న సంగతులను ఆమోదింపనివారు చాలా మంది ఉండేవారు. (లంబార్టస్ లెడెబోయర్‌ను తొలగించిన పిమ్మట జరిగిన సంఘటన, 93వ అధ్యాయము చూడుము) అట్టివారిలో డ కోస్ట, గ్రోయెన్ వాన్ ప్రిన్ స్టరర్ మరియు కోల్ బ్రగ్గి మొదలగు వ్యక్తులుండేవారు. వీరితో పాటు ఇతర అనేక దైవజనులు సంఘ సంస్కరణ కొరకై ఆశపడిరి.

నిబంధనలను బైబిల్ ఆధారితమైనవిగా చేయుమని సంఘసమావేశమునకు పదే పదే విజ్ఞప్తులు వచ్చెను (88వ అధ్యాయము చూడుము). సంఘ సంస్కరణ కొరకైన మనవులు త్రోసివేయబడెను. తప్పుడు బోధలు చేయు మత గురువుల సంఖ్య నానాటికి పెరిగెను. ఇట్టి మత గురువులు (మోడ్రనిస్ట్‌లని) ఆధునికులని పిలువబడిరి. వారిని అనేకులు వ్యతిరేకించిరి కాని సంఘ అధికారములు చర్య తీసుకొనలేదు. కొన్నిసార్లు (తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ పేరట ఇచ్చుటకు బదులుగా) విశ్వాస, నిరీక్షణ, ప్రేమల పేరట బాప్తీస్మమిచ్చిరి. కొన్నిసార్లు కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు తిరిగి మరొక పరిచారకుని ద్వారా బాప్తీస్మమిప్పించిరి. ప్రభువైన యేసు దేవుని నిత్యకుమారుడను విషయమును ఆధునిక మతగురువులు తిరస్కరించిరి. వారి సంఖ్య నానాటికి పెరుగుచుండెను. వారిపై ఎటువంటి చర్యలు తీసికొనబడలేదు. ఎక్కడ చూసినా సిద్ధాంత స్వేచ్ఛ కనిపించుచున్నది....!

ఉన్న ఒకే ఒక్క ప్రత్యామ్నాయము మళ్ళీ విడిపోవుట ! తరువాత జరిగే మార్పులలో అబ్రహం కుయ్‌పర్ ఒక ముఖ్యమైన పాత్రవహించబోవుచున్నాడు. అబ్రహాం కుయ్‌పర్ (క్రీ.శ. 1837-1920) ఓ పరిచారకుని కుమారుడు మరియు నెదర్లాండ్ పట్టణములోని మిడ్‌ల్‌బర్గ్ నందు తన బాల్యమును గడిపెను. ఆయన పద్దెనిమిదవయేట యూనివర్సిటి ఆఫ్ లెయ్‌డెన్‌కు వెళ్ళి అధ్యయనము చేయుటకు వెళ్ళెను. అబ్రహం చాలా



తెలివైన వాడు, మూడేండ్లలోనే దేవజ్ఞాన శాస్త్రము డిగ్రీ కొరకు అర్హత సంపాదించెను! ఆయన తన చదువులు కొనసాగించి రెండేండ్ల తర్వాత డాక్టర్ ఆఫ్ థియాలజి పట్టా సంపాదించెను.

(నెదర్లాండ్స్) బెటువె లోని బీసెడ్ అను చిన్న గ్రామములో ఆయన పరిచారకునిగా పనిచేయుట ప్రారంభించెను. కుయ్‌పర్ తన సిద్ధాంత నమ్మకాల విషయములో సగము సాంప్రదాయము, సగము ఆధునికత కలిగియుండేవాడు. కుయ్‌పర్ యూనివర్సిటిలో ఉండగా ఆధునిక బోధలను బలపరచు లెక్చరర్స్ ద్వారా దేవజ్ఞాన శాస్త్రమును నేర్చుకొనెను. కాని గొప్ప మార్పు రానైయున్నది.

బీసెడ్‌లో దీనులు, భక్తి శ్రద్ధలుగల కొందరు వ్యక్తులను కలుసుకొనెను. వారి మాటలు, జీవిత విధానము ఆయనపై ఎంతో ప్రభావము చూపెను. వారిలో ఒక వృద్ధ స్త్రీ ఉండెను ఆవిడ పేరు పియట్టి బాల్తాస్. ఆవిడ యొక్క సంభాషణ కుయ్‌పర్ హృదయముపై చెరగని ముద్రవేసెను. తత్ఫలితముగా కాల్విన్ మరియు కోల్ బ్రగ్గి యొక్క పుస్తకములు చదువుట ప్రారంభించెను. ఒక పరిచారకుడు ఆయా సంగతులను స్పష్టముగా గ్రహించుటకు ఈ పుస్తకములు దోహదపడునని పియట్టి గట్టిగా విశ్వసించెను.

తరువాత కుయ్‌పర్ బీసెడ్ విడిచి మతగురువు పదవి చేపట్టుటకు ఉట్రెక్ట్‌కు వెళ్ళెను. ఆయన అక్కడికి వెళ్ళినప్పుడు పియట్టి బాల్తస్ చాలా బాధపడెను. కుయ్‌పర్ ఆవిడను మరువలేదు. ఆయన అధ్యయన గదిలో ఓ మూలన ఆవిడ చిత్రపటమును ఉంచుకునేవాడు. కుయ్‌పర్ తన కుటుంబములో ఎంతో క్రమ శిక్షణ కలిగి చక్కగా నడుచుకునేవాడు. ఆ యింటివారు నిజముగా ప్రభువు సేవ చేసేవారు. దినమునకు మూడుసార్లు భోజనము పిమ్మట, కుయ్‌పర్ బైబిల్ చదువగా కుటుంబమంతయూ మోకాళ్ళ మీద ఉండి ప్రార్థించి ప్రభువునకు కృతజ్ఞతలు చెల్లించుదురు.

కుయ్‌పర్ భార్య చంకలో బుట్టపెట్టుకుని ఇంటి నుండి బయటకు వెళ్ళుచుండెను. అప్పుడే ఎవరైనా ప్రసవించిన పేద తల్లులుంటే వారి దగ్గరకు వెళ్ళి వారికి సహాయపడేది. కుయ్‌పర్ ప్రసంగించినపుడు సంఘభవనము నిండిపోయేది. ఆయన బాప్తీస్మ కార్యక్రమము చేసినప్పుడు 70 లేదా 80 మంది బాప్తీస్మము పిల్లలు బాప్తీస్మము తీసికునేవారు. పిల్లలెవరైనా మతోపదేశము కొరకు వస్తే, ఆ ఫలానా పిల్లవాడు కీర్తనల నుండి నాలుగువందలకంటే పైబడి వచనములను కంఠస్తము చేయాలని కోరేవాడు. ప్రతిసారి కుయ్‌పర్ మతోపదేశము చేసినపుడెల్లా వారు నేర్చుకొనిన దానిని ఒక వ్యాసముగా వ్రాయాలని కోరేవాడు.

కుయ్‌పర్ పుస్తకములు, శీర్షికలు, లేఖలు వ్రాయుటలో చాలా నిమగ్నమై యుండేవాడు. చాలా రాత్రివరకు ఆయన తరచుగా పనిచేసేవాడు. ఆయనకు తలనొప్పి కలిగినపుడు ఒక చల్లని బట్ట నొసట వేసికుని తన పనిలో కొనసాగేవాడు. సంఘ సంస్కరణను ఆయన చాలా తీవ్రముగా కోరేవాడు క్రీ.శ. 1870లో ఆమ్‌స్టర్‌డామ్ అను నగరములో ఉట్రెక్ట్ నందు సంఘ సంస్కరణ భారీయెత్తున చెలరేగెను. ఆ ఉట్రెక్ట్‌లో కుయ్‌పర్ సంఘ కాపరి బాధ్యత వహించెను.

కుయ్‌పర్ మంచి ప్రజానాయకుడిగాను, వ్యక్తిగాను, రచయితగాను మంచి పేరు తెచ్చుకొనెను. "మనము ఈ భవనమును పునఃనిర్మాణము చేయాలి. లేదు మనము మరొక భవనముకే మారాలి" అని ఒక ఉపన్యాసములో సెలవిచ్చెను. డచ్ రిఫామ్డ్ చర్చ్ (హెర్‌ఓర్మిడి) నందు పరిస్థితులు మెరుగుపడక పోతే ఆయన మరియు తన అనుచరులు అక్కడ నుండి వెళ్ళాలని అనుకొనిరి.

"పాడైన క్రీస్తు మందను" ఎంత కష్టమైనా సరే పునరుద్ధరణ చేయాలని ప్రయత్నించెను. ఆయన ప్రయత్నముల ఫలితముగా, ఆమ్‌స్టర్ డామ్ సంఘములలో సాంప్రదాయ మతగురువులు మాత్రమే సంఘములలో పనిచేయులాగున చర్యలు తీసికొనెను.

ఆమ్‌స్టర్‌డామ్‌లోని సంఘము దుర్బోధల ద్వారా ప్రభావితము కాకుండు నిమిత్తమై, అట్టి బోధలను ఆపుటకై కుయ్‌పర్ చాలా ప్రయాసపడెను. తుదకు ఇదంతయూ సంఘ అధికారులతో తీవ్రమైన గొడవలకు దారి తీసెను. కుయ్‌పర్ మరియు తన సంఘ సభ్యులలో చాలామంది బంధింపబడిరి. వారు విడిపోయిరి. ఆ విడిపోవుటను డోలియాంటి అని పిలిచిరి. దాని కర్థము ప్రస్తుత సంఘ పరిస్థితుల విషయములో విచారపడువారు (డోలిఫుల్).

కుయ్‌పర్ మరియు తన అనుచరులు కలిసి ఒక స్వతంత్ర మత శాఖతో కలిసిరి. క్రీ.శ. 1892లో వారందరు క్రొత్త సంఘ సమావేశముగా మారి గెరిఫార్మియర్డి కెర్కెన్ ఇన్ నెదర్‌ల్యాండ్ (రిఫామ్ చర్చెస్ ఇన్ నెదర్లాండ్స్) అని పిలువబడిరి.

98. జి.హెచ్. కెర్‌స్టన్ మరియు గెరిఫార్మియర్డి గిమియంటీన్ (క్రీ.శ.1907)


91వ అధ్యాయములో క్రీ.శ.1869 తరువాత కూడ క్రొత్తగా ఏర్పడిన క్రిష్టిలిజ్‌క్ గెరిఫార్మియర్డి కెర్క్ (క్రిష్టియన్ రిఫామ్డ్ చర్చ్) నందు చేరుటకు ఇష్టపడని ఇండిపెండెంట్ క్రుయ్స్గిమియంటెన్ (చర్చెస్ ఇన్ అడ్వర్సిటి) ఇంకనూ ఉండెను.

ప్రారంభములో అటువంటి క్రుయ్స్గిమియంటెన్ సంఘములు నాలుగు మాత్రమే ఉండెను. క్రమేపి సంఘముల సంఖ్య పెరిగి పదమూడాయెను. ఈ పదమూడు సంఘములన్నియూ కలిసి గెరిపార్మయర్డి గిమియంటీన్ (రిఫామ్డ్ చర్చెస్ ఇన్ అడ్వర్సిటి) అను క్రొత్త మతశాఖగా వెలసెను.

ఈ క్రొత్త మతశాఖలో పరిచారకులు కొందరే ఉన్నందున ఆయా సంఘములు దర్శించి బోధించి బాప్తీస్మము, ప్రభురాత్రి భోజనము ఇచ్చేవారు. వారిలో ఒక బోధకుడు ప్రసిద్ధికెక్కెను. ఆయన పేరు జి. హెచ్.కెర్‌స్టన్. గెర్రిట్ హెండ్రిక్ కెర్‌స్టన్ హెన్రీ అని కూడ పిలువబడెను. ఆయన క్రీ.శ.1882లో జన్మించెను.

ఆయన తండ్రి సైన్యాధికారిగా పనిచేయుచుండెను. పదవయేట ప్రభువు ఆయనను మార్చెను. "నశించు పాపిగా ఉంటూ, నా ఆత్మీయ స్థితిని గూర్చి బాధపడుచూ అనేక రాత్రులు గడిపితిని. పండ్రెండు నెలలు గడిచిన తరువాత ప్రభువును తెలుసుకొని రక్షణ మార్గమునకు యేసు అని నమ్మితిని" అని ఆయన చెప్పెను. హెన్రికి చదువుట అంటే ఎంతో ఇష్టము.

ఆయన ప్రత్యేకముగా స్మిటెగెల్ట్, ఎ బ్రాకెల్ మరియు కామ్రి మున్నగు దైవజనుల రచనలు చదివెను. ఈ పుస్తములు ఆయనకు భవిష్యత్‌లో చాలా ఉపయోగపడనున్నవి. ప్రభువు హెన్రీని సేవకై పిలిచినపుడు ఆయన వయసు పదకొండు సంవత్సరములు. "నా జనులను ఓదార్చుడి, నా జనులను ఓదార్చుడి" అను



యెషయా 40:1 వాక్యభాగము ద్వారా ప్రభువు మాట్లాడెను.

కాని ఆయన ఏ సంఘములో పనిచేయాలో ఆయనకు అర్థము కాలేదు. టీచర్ కావలెనని ఆయన నిర్ణయించుకొనెను. డిప్లొమా చేశాక హగ్యులో హెన్సి పదవి చేపట్టెను. క్రీ.శ.1901లో రిజ్‌సెన్‌లో నుండుటకై ఆయన వెళ్ళెను. క్రుయ్స్గిమియంటీన్ సంఘమునందు అతడు మొదటిసారిగా బోధించెను. (దీనికర్థము ఈ మతశాఖలో ఆయన ప్రసంగించుటకు అనుమతింపబడెను). హెన్సి కెర్‌స్టన్ తన ప్రసంగమును మధ్యలో ఆపివేయగా ఆ సంఘములోని మరొక పరిచారకుడు దానిని ముగించెను. తరువాత ఆయన లిస్సిలో చక్కగా బోధించెను.

త్వరలో కెర్‌స్టన్ క్రుయ్స్గిమియంటీన్‌లో అధికారిక సాధారణ బోధకునిగా నియమింపబడెను. జీలాండ్ పరగణలో మెలిస్కెర్కి అను గ్రామములో ఒకే ఒక్క సంఘం (క్రుయ్స్గిమియంటీన్) ఉండెను. మెలిస్కెర్కి సంఘ పెద్దలు మరియు పరిచారకులు కోరగా కెర్‌స్టెన్ సమ్మతించి ఆ సంఘములో బోధించెను. క్రిస్ట్మస్ మరియు క్రొత్త సంవత్సరము మధ్యన ఉండు ఒక వారములోనే కెర్‌స్టన్ మెలిస్కెర్కి సంఘమునందు ఎనిమిదిసార్లు కెర్‌స్టన్ బోధించెను. ఆ వారములో ఆయన ఎన్నోసార్లు మోకాళ్ళూని దేవునికి ప్రార్థించేయుంటాడు.

మెలిస్కెర్కిలోని సంఘము కెర్‌స్టెన్‌ను కోరగా ఆయన "బోధించు పెద్దగా" పంతొమ్మిది ఏండ్లలోనే నియమింపబడెను. ఆయన పరిచర్యను దేవుడు సమృద్ధిగా దీవించెను.

సాధారణ నాయకుడు ప్రభురాత్రి భోజనమిచ్చుట పిల్లలకు బాప్తిస్మమిచ్చుట చేయకూడదు. అందుకే క్రీ॥శ॥ 1905లో మిల్‌స్కెర్కి సంఘము కెర్‌స్టెన్‌ను పరిచర్య కొరకై అభిషేకించెను. (క్రుయ్స్గిమియంటీన్, సంఘము మొదట అనుమతినిచ్చెను)

93వ అధ్యాయములో లెడెబొయెరియన్ సంఘములలోని సంఘసంస్కరణను గూర్చి మనము చదివెదము. ఈ మతశాఖలో పరిచారకుల కొదువ చాలా ఉన్నది. ఇరవైమూడు కంటే పైబడి సంఘములకు గాను ఇద్దరే మత గురువులున్నారు. దీనికర్థమేమిటనగా లెడెబోరియన్ సంఘములకు కూడా కెర్‌స్టన్ వెళ్ళి బోధించుచుండెను. (ఆయన వాస్తవమునకు సాధారణ నాయకుడుగా ఈ సంఘములకు వెళ్ళి బోధించేవాడు). లెడెబోరియన్ సంఘములు క్రురియ్స్గిమియంటిన్ సంఘములు వేర్వేరు మతశాఖలుగా కొనసాగకూడదని కెర్‌స్టెన్ భావించెను.

లెడెబోరియన్ సంఘస్తులతో ఈయన ఈ సంగతులను చర్చించెను. ఆ విధముగా రెండు సంఘములు కలిసి ఒక మతశాఖగా ఏర్పడెను. కాని ఇతర సమస్యలను జాగ్రత్తగా చూచుకొనవలెను. పెద్ద సమస్య. చందోబద్దముగా, శ్లోకరూపముగా ఉండు (మెట్రికల్) కీర్తనలు ఈ కీర్తనలు డాతీన్ అను వ్యక్తి వ్రాసిన పాత సంపుట. క్రీ.శ.1773లోని కొత్త సంపుటి కూడ కలదు. ఈ క్రొత్త మతశాఖలో దేనిని వాడాలి? ఆయా చర్చ్ కౌన్సిల్ ఆయా పరిచారకులు ఆయా కీర్తనల సంపుటి వాడులాగున అనుమతించిరి. ఆ సమస్యలన్నియూ సమసిపోయెను గనుక, క్రొత్త మతశాఖ చక్కగా ముందుకు కొనసాగవచ్చును.

ఇదంతయూ క్రీ॥శ॥1907లో రాట్టర్‌డామ్‌లో జరిగెను. క్రూయ్స్గిమియంటీన్ నుండి పదమూడుమంది ప్రతినిధులు మరియు లెడెబోరియన్ సంఘములనుండి ఇరవైమూడు ప్రతినిధులు ఈ సభకు హాజరైరి. ఈ క్రొత్త మతశాఖకు గెరిపార్మియర్డి గిమియంటీన్ (రిఫామ్డ్ సంఘములు) అని పేరు పెట్టబడెను.

కాని ఆ సమావేశమునకు లెడెబోరియన్ సంఘపరిచారకులైన లారెన్స్ బూని హాజరుకాలేదు. ఈ రెండు మతశాఖలు విలీనమగుటను నేను ఆమోదింపను అని చెప్పెను. ఆయన సంఘము ఇతర సంఘములు ఇట్టి కలయికను ఒప్పుకొనలేదు. వారు పాల్గొనక, వారందరు కలిసి ఊడ్ గెరిఫార్మియరి గిమియంటీన్ (ఓల్డ్ రిఫామ్డ్ కాంగ్రిగేషన్)గా ఏర్పడిరి.

అరవై సంవత్సరముల పిమ్మట క్రీ.శ.1953లో గెరిఫార్మియర్డి గిమియంటిన్ (రిఫామ్డ్ సంఘములు) విచార దశ గుండా వెళ్ళెను. సంఘము రెండుగా విడిపోయెను. ఈ విభజన ఫలితముగా గెరిఫార్మియర్డి గిమియంటీన్ ఇన్ నెదర్లాండ్ (నెదర్లాండ్‌నందలి రిఫామ్డ్ సంఘములు) అనురెండు వేర్వేరు మతశాఖలేర్పడెను.

99. నెదర్లాండ్స్ హర్‌ఓర్మ్‌డ్ కెర్క్ (డచ్ రిఫామ్డ్ చర్చ్)లో మరిన్ని ప్రసిద్ధములు

క్రీ.శ. 1887 లో నెదర్లాండ్స్‌లోని సంఘ జీవితము విచారదశలో ఉండెను. డచ్ రిఫామ్డ్ సంఘమందలి మూడు చీలికలను గూర్చి మనము చదువుకొన్నాము. క్రీ.శ. 1834లో మొదటి చీలిక, క్రీ.శ.1840లో లంబార్టస్ లెడిబోయర్ తొలగింపబడిన తరువాత, మూడవది అబ్రహాం కుయ్‌పర్ ఆధ్వర్యములో క్రీ.శ.1886 లో (90,93,97 అధ్యాయములు చూడుము.)

తత్ఫలితముగా, అనేకులు డచ్ రిపామ్డ్ చర్చిని విడిచి వెళ్ళిరి. ముఖ్యకారణము అనేక సంఘ కాపరులు తమకిష్టము వచ్చిన విధముగా బైబిల్‌కు విరుదనీఈముగా బోధించుట. చీలికలు జరిగినా, డచ్ రిపామ్డ్ చర్చిని వదిలినా రిఫామ్డ్ దేవ జ్ఞానశాస్త్ర బైబిల్ సత్యములను బలపరచు అనేకమంది గలరు. వారి ఆదిమ నమ్మకములను సంఘములో సమకూర్చుటకై, వారు చాలా ప్రయాసపడిరి. గనుక క్రీ.శ. 1906 లో గెరిఫార్మియర్డి బాండ్ (రిపామ్డ్ లీగ్) ఏర్పడెను. డచ్ రిఫామ్డ్ చర్చ్ నందు డచ్ రిఫామ్డ్ సిద్ధాంతమును పునఃస్థాపన చేయదలచుకొనినవారందరు ఈ క్రొత్త లీగ్‌లో చేరిరి. సంఘమును విడుదల చేసి సాంప్రదాయ సిద్ధాంతమును సమకూర్చుటయే వారి ఉద్దేశము. దేవుని వాక్యము మరియు డ్రియ పార్ములియరెన్ వాన్ ఎన్‌గెయిడ్ (మూడు విధముల ఐక్యత -70వ అధ్యాయము చూడుము.) డచ్ రిఫామ్డ్ చర్చ్ తీవ్ర అనారోగ్యమునకు గురైనదని బాండ్‌ను బలపరచువారు భావించి దానిని సమకూర్చుటకై ఆశపడిరి.

క్రీ.శ. 1945లో పరిస్థితులు మారెను. క్రీ.శ.1816 నిబంధనలు తొలగింపబడవలెనని రెండవ ప్రపంచ పరిణామముల తర్వాత ప్రజలు భావించిరి. డచ్ రిఫామ్డ్ చర్చ్ నిర్వహణ మారవలెను! సంఘ పరిస్థితులను చూచుకోవలసినది సంఘ సమావేశముగాని, ప్రభుత్వము కాదని క్రీ.శ. 1816 లో నిర్ణయింపబడెను. (1618/1619) లోని ప్రముఖ సమావేశము తర్వాత మరొకసారి సాధారణ సమావేశము జరిగెను! డచ్ రిఫామ్డ్ చర్చ్ ఎగ్జిక్యూటివ్ కమిటీలు మరియు 1816 నిబంధనల ప్రకారము నిర్వహింపబడకూడదని సమావేశము నిర్ణయము తీసికొనెను. దానికి బదులు పరిచారకులు, పెద్దలు, సేవకుల ద్వారా నడిపింప బడవలెను.

సంఘ నిర్వహణ నిమిత్తమై క్రొత్త నియమ నిబంధనలు ఏర్పరచబడెను. క్రీ.శ. 1951లో ఈ క్రొత్త నిబంధనలు అమలులోనికి వచ్చెను. డచ్ రిఫామ్డ్ చర్చ్ నిర్వహణలో గొప్పమార్పులు చేయబడెను. కాని "సిద్ధాంత స్వేచ్ఛ" ఇంకనూ కొనసాగుతుందా లేదా? మూడు విశ్వాసపు ఒప్పుకోలులు (డ్రియె ఫార్ములియరిన్ వాన్ ఎన్‌గెయ్‌డ్) అంగీకరింపబడెను. "సంఘ విశ్వాసపు ఒప్పుకోలునకు విరుద్ధముగానున్న దానిని ఆపివేయవలెను" అనునది సంఘ నియమము. కాని సిద్ధాంత స్వేచ్ఛ ఇంకనూ కొనసాగుచున్నది. డచ్ రిఫామ్డ్ చర్చ్ లోలోపల విభజింపబడియుండెను. యేసు దేవుని కుమారుడు కాదు, కేవలము మానవుడు, సిలువలో మరణించినవాడు మన పాపమునకు ప్రాయశ్చిత్తము చేయలేదు. దేవుని వాక్యము పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడలేదు గాని తప్పులుచేయు మానవులచే వ్రాయబడెను. అను తప్పు బోధలు సంఘములో ఆధునికులు చేయుచుండిరి.

క్రీ.శ. 2004 లో అబ్రహాం కుయ్‌పర్ మరియు ఇవాంజెలికల్ చర్చ్‌వారు స్థాపించిన నెదర్లాండ్స్‌లోని మూడు సంఘములు అనగా నెదర్లాండ్స్ హర్ ఓర్మిడి కెర్క్ (డచ్ రిఫామ్డ్ చర్చ్) గిరిఫార్మియర్డి కెర్కెన్ ఇన్ నెదర్లాండ్స్ (రిఫామ్డ్ చర్చెస్ ఇన్ నెదర్లాండ్స్) అన్నియూ కలిసి క్రొత్త



మతశాఖగా పేరు ప్రొటెస్టంట్‌సి కెర్క్ నెదర్లాండ్స్ (ప్రొటెస్టెంట్ చర్చ్ ఆఫ్ నెదర్లాండ్స్ మరియు దాని సంక్షిప్త, పదము పికెయన్) ఏదిఏమై నా ఐక్యత మంచిది కాని ఈ ఐక్యత దేవుని వాక్య పునాదులపై ఆధారపడినది కాదు. స్వలింగసంపర్క వివాహములను పికెయన్ సంఘము అంగీకరించెను. ఇది చాలా విచారకరము.

ఈ కారణము చేత డచ్ రిఫామ్డ్ సంఘములు పికెయన్ సంఘమును విడిచి హెర్ ఓర్మిడి కెర్క్ లేదా హెచ్‌హెచ్‌కె (రిస్టోర్డ్ రిఫామ్డ్ చర్చ్) గా పిలువబడెను. గొప్ప సంఖ్యలో సంఘములు చేరినా నెదర్లాండ్స్ ముఖ్య ప్రొటెస్టెంట్ చర్చ్ (పికెయన్) నందు బైబిల్ విరుద్ధ బోధలు కొనసాగెను.

100. యెహోవా సాక్షులు..... ఓ తెగ

ప్రపంచ ప్రధాన మతములన్నింటిలోను విపరీత తెగలు అగుపించును. ఈ సంగతి క్రైస్తవ మతమునకు కూడ వర్తించును. ఉనికిలోనున్న వేర్వేరు తెగలను లెక్కించుట దాదాపు అసాధ్యము.

నిజ సత్యము, స్వచ్ఛమైన సత్యము కొరకై పోరాడువారని (అదే తెగ) వారందురు. అలా చేయుటలో సత్యము యొక్క సంగతులను వారు మితిమీరి నొక్కివక్కాణింతురు. సంఘముతోనున్న సంబంధ బాంధవ్యములను తెంచి వేసుకొని, స్వతంత్ర గుంపుగా ఉండెదరు. వారికి మాత్రము విడిపోయామనే బాధ అస్సలు ఉండదు.

మాకే సత్యజ్ఞానము పూర్తిగా ఉన్నదని తెగ సభ్యులు భావింతురు. వారే నిజ సంఘము! వారిలో మాత్రమే నిజ ఆత్మీయత ఉన్నదని వారు భావింతురు. వారు స్వనీతి పరులైయుందురు. వారికి బైబిల్ చాలదు. ఆ ఫలానా తెగ నాయకుని దర్శనము లేదా ప్రత్యక్షత



ప్రాముఖ్యమని వారు భావింతురు. ఈ దర్శనములు లేదా ప్రత్యక్షతలు బైబిల్‌ను ప్రక్కన పెట్టేటట్లు ఉండును. ప్రభువు తన వాక్యమందు ప్రత్యక్షపరచిన దానికంటే మాకు ఎక్కువ తెలియునని ఈ ప్రజలు తలంచెదరు.

మానవుని పాపము మరియు దేవుని కృప అను రిఫార్మ్డ్ బోధ ఈ గుంపులలో అస్సలు వినపడవు, కొన్నిసార్లు ఇట్టి బోధ అస్సలు కనబడదు. ప్రభువైన యేసు రెండవ రాకడ త్వరగా వచ్చునని ఈ తెగల ప్రజలు సాధారణముగా చెప్పుదురు. తేదీలు, దినములు కూడ నిర్ణయించి రెండవ రాకడను గూర్చి గొప్ప ఆసక్తితో చెప్పెదరు.

ఇప్పుడు మనము యెహోవా సాక్షులు అను అతి పెద్ద తెగను గూర్చి తెలిసికొందము. అమెరికాలోని చార్లెస్ రస్సెల్ (1852–1916) అను వ్యాపారవేత్త ప్రభువైన యేసు క్రీ.శ. 1874లో తిరిగివచ్చునని ప్రకటించెను. ఈ సంఘటన జరుగనందున, దేవుని రాజ్యము మొదట పరలోకములో అటు పిమ్మట భూమి మీద ఆ రాజ్యము ప్రత్యక్ష పరచబడునని రస్సెల్ క్రీ.శ. 1874 లో చెప్పెను. క్రీ.శ. 1914 లో "ఏర్పరచబడిన వారి"తో యేసు భూమి మీదకు వచ్చి ప్రపంచమును ఏలును. ఆయన పాలన వెయ్యేండ్లకాలము ఉండును. ఇది జరుగనపుడు, తేదీ మార్చి, పరిస్థితులను సవరించెను.

రస్సెల్ మరణము తర్వాత జోసఫ్ ఫ్రాంక్లిన్ రూథర్‌పోర్డ్ మరియు తన అనుచరుడు అవే ఘోర తప్పులను ప్రచారము చేసిరి. ఈ తెగవారు యుగాంత సంఘటనల గూర్చి ఎక్కువగా ప్రచురించుతారు. "కావలివాని కోట" అను పత్రికలో బైబిల్ వాక్య భాగములను వారి స్వంత అభిప్రాయమునకు అనుగుణముగా ప్రచురిస్తారు. యెహోవా సాక్షుల ప్రకారము సంఘములన్నియూ తప్పుడు సంఘములు, అదియుగాక సంఘములు సాతాను దుర్గములు! సాతానుచే నడిపింపబడునవి.

అంతిమ యుద్ధము, మహాయుద్ధము ఇక్కడే భూమిమీద జరుగునని సాక్షులందురు! అర్మెగెద్దోను (మెగిద్దో, ఇశ్రాయేలు దేశములో విశాల ప్రాంతము) యుద్ధములో సాతాను మరియు వాని సైన్యములు, మేలుకొరకై ఓడింపబడుదురు. ఎన్నుకొనబడిన 1,44,000 వ్యక్తులకు అటు పిమ్మట పరలోకములో నిత్యజీవము అనుగ్రహింపబడును. మరో గొప్ప విశ్వాసుల సమూహమునకు "క్రొత్త భూమి"పై స్థలమివ్వబడును.

ఈ సందేశము తెలుపుటకై యెహోవా సాక్షులు ఇంటింటికి వెళ్ళుదురు. వారి మార్గములు మార్చుకొనుట సాధ్యమని వారందురు, కాని వారు పశ్చాత్తాపపడకపోతే వారికొరకు ప్రమాదము ఉన్నది. ఇళ్ళు దర్శించుట వారికి అత్యవసరము. సాక్షులు సమయము కేటాయించి ఇళ్ళు దర్శింపవలెను. ప్రపంచవ్యాప్తముగా రెండువందలకంటే పైబడి దేశములలో, ఆరున్నర కోట్ల సాక్షులద్వారా యెహోవా సాక్షుల పని జరుగుచున్నది.

వారు నరకమును నమ్మరు, ఈ దయ్యపు నమ్మకమును సంఘము కనిపెట్టెనని వారందురు. అవిశ్వాసుల సంపూర్ణ నాశనమును వారు విశ్వసింతురు. వారు త్రిత్వ సిద్ధాంతమును సవాలు చేస్తారు. క్రీస్తు భూమి మీదకు రాక ముందు, దేవునిచే సృష్టింపబడిన దూతవలె యేసు ఉండెనని యెహోవా సాక్షులందురు. గనుక ఆయన నిత్యుడగు దేవుని కుమారుడు కాదు. క్రీస్తు శరీర పునరుత్థానమును యెహోవా సాక్షులు నమ్మరు.

పరిశుద్ధాత్ముడు దేవుని యొద్దనుండి వచ్చిన వ్యక్తిత్వశక్తి కాదు అని వారు నమ్ముదురు.

వారి నమ్మకముల ప్రకారము, ప్రభుత్వము మరియు దేశము సాతాను సంస్థలు. ప్రతి విధమైన రక్తమార్పిడిని వారు తిరస్కరింతురు. యెహోవాసాక్షుల బోధలో ఒక ముఖ్య సంగతి లోపముగానున్నది. క్రీస్తు దేవుని కుమారుడని, పాపుల రక్షకుడని, విశ్వాసము అవసరమని మున్నగు సంగతులు లోపముగా ఉన్నవి.

101. రోమన్ క్యాథలిక్ సంఘము మరియు వాటికన్ కౌన్సిల్

పద్దెనిమిదవ శతాబ్దపు చివర, రోమన్ క్యాథలిక్ సంఘము కూడ ఫ్రెంచ్ విప్లవ ప్రభావము నుండి బాధపడుచుండెను (84వ అధ్యాయము చూడుము) అనేక భవనములు కూల్చబడి మతగురువులనేకులు హతమార్చబడిరి.

కాని పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభములో రోమన్ క్యాథలిక్ సంఘము మరొక్కమారు స్థిరపడి బలపడెను. పోప్ అధికారము పెరిగి కన్య మరియ ఆరాధన, తీవ్రగతిన పెరిగెను. బిషప్‌లతో మాట్లాడి ఆదిమ పాపము లేకయే (తల్లిదండ్రుల నుండి సంక్రమించిన పాపము) మరియ జన్మించెనని పోప్ పయస్ IX క్రీ.శ. 1854లో ప్రకటించెను. ఈ సిద్ధాంతము పేరు ఇమ్మాక్యులేట్ కన్‌సెప్షన్ ఆఫ్ మేరి. (మరియ యొక్క పాపరహిత జన్మ). ఈ సంగతి సంఘము యొక్క అధికార సిద్ధాంతమాయెను. దీనినెవరూ ప్రశ్నింపకూడదు.

ఈ కారణము చేత రోమన్ క్యాథలిక్‌వారు మరియకు ప్రార్థనలు చేయుదురు. వారు జపములు చెప్పినపుడు ఆవే మరియ (హెయిల్ మేరి) అని ఎడతెగక పలుకుతూ ప్రార్థించెదరు. పూసలతో ఉన్న దండను పట్టుకొని మౌనముగా జపములు చెప్పుచుందురు.

తన కుమారుడైన ప్రభుయేసు నొద్ద విజ్ఞాపన చేయు వ్యక్తిగా, రోమన్ క్యాథలిక్ వారు మరియను గతములో, పరిగణించేవారు కాని ఇప్పుడైతే రక్షణలో సహాయపడు వ్యక్తిలా వారు మరియను చూస్తున్నారు. మరియ తన జీవిత ప్రారంభము నుండి (పాపరహిత కన్యక) . పాపము లేని మంచి క్రియలు చేయుచుండెను.

క్రీ.శ. 1854 లో కన్య మరియ సిద్ధాంతము ప్రకటింపబడినపుడు రోమ్ గంటలు మ్రోగగా "అవర్ బ్లెసెడ్ మేరి" అను విగ్రహముపై పోప్ బంగారు కిరీటమును పెట్టెను. కొద్ది సంవత్సరముల తర్వాత ఫ్రెంచ్ గ్రామమైన లూర్దులో కన్య మరియ కనిపించెనని వారు భావించిరి. ఈ ప్రదర్శనలు వేర్వేరు సందర్భములలో, ఒక గుహలో జరిగెను. అక్కడ అనేక స్వస్థతలు కలుగగా లూర్దు అను స్థలము యాత్రా స్థలముగా మారెను.

రోమ్‌లో వాటికన్ పోప్ నివాస స్థలముగా మారెను. తరువాత వాటికన్ చుట్టూ అనేక భవనములు కట్టబడి నగరముగా ఏర్పడెను. క్రీ.శ. 1869 మరియు 1870లలో రోమా నగరములో మొదటి వాటికన్ కౌన్సిల్ జరిగెను. ఈ గొప్ప సమావేశములో ముఖ్య సంగతులు చర్చింపబడెను.

పోప్ దోషరహితుడు, ఆయన అధికార బలము మున్నగు సంగతులు చర్చింపబడెను. అన్నింటిపై సంఘ అధికారము చలాయింపవలెనను వాంఛ కలిగి పోప్ పయస్ కౌన్సిల్‌ను సమావేశపరచి ఆయా తీర్మానములు చేయబడులాగును ఆజ్ఞాపించెను. పోప్‌కు అధికారము ఉన్న సంస్థ సంఘము లేదా సంఘం బిషప్‌లు నాయకత్వము వహించు సంస్థ మున్నగు విషయములు తరతరములుగా చర్చింపబడుచునేయున్నవి. సంఘమును పాలించు హక్కు పోప్ మాత్రమే కలిగియుండునని పయస్ కోరెను.

మొదట బిషప్‌ల సలహాను కోరినట్లైయితే పోప్ అటువంటి స్థితిని కోరియుండవచ్చునని కౌన్సిల్‌లో ఒక కార్డినల్ చెప్పెను. కార్డినల్స్ వ్యాఖ్యద్వారా పోప్ అభ్యంతరపడెను. పెద్దచర్చ జరిగెను కాని విషయముపై సమ్మతింపు రాలేదు. ఐక్యత లేకున్నా, "నా పక్షమున కన్య మరియ గలదు, విషయము కొనసాగవలెను" అని పోప్ ఖండితముగా చెప్పెను.

పోప్ వ్యతిరేకులు చాలామంది సభ నుండి వెళ్ళిపోయిరి. తరువాత ఓట్ వేయగా మతగురువులనేకులు పోప్‌ను బలపరచిరి. ఈ క్రింది ఆజ్ఞ అమలులోనికి వచ్చెను. "పోప్ పలికినదంతా వేద వాక్యము గనుక సంఘము దానిని సంఘ సిద్ధాంతముగా ఆచరించాలి". ఎక్స్‌కెథడ్రా అంటే సింహాసనము నుండి లేదా కుర్చీ నుండి పోప్ క్రైస్తవులందరి ఉన్నత అపొస్తలిక అధికారముతో, బోధనికుగా మాటలాడును. గనుక పోప్ దోషరహితుడు తత్ఫలితముగా ఆయన మాటలు పరిశుద్ధగ్రంథమాట లంత అధికారము కలిగి యుండును.



రోమన్ క్యాథలిక్ చర్చ్ అంతటిని పాలించువాడు, బిషప్‌లకు అధికారమిచ్చువాడు పోప్ అని కౌన్సిల్ నిర్ణయించెను. ఈ మాటను కౌన్సిల్ సభ్యులందరు దాదాపు అంగీకరించిరి. మనస్సాక్షి నిమిత్తమై ఇట్టి పాలనను అంగీకరింపనివారు – రోమన్ క్యాథలిక్ సంఘమును విడిచిపెట్టిరి. వారు క్రొత్త మత శాఖను ప్రారంభించి వారు దానికి, 'రోమన్ క్యాథలిక్స్' అని గాక 'ఓల్డ్ క్యాథలిక్స్ అని పేరు పెట్టిరి.

క్రొత్త ఏర్పాట్లు క్రొత్త సిద్ధాంతములను బట్టి రోమన్ క్యాథలిక్ సంఘమందలి పరిస్థితులు మసకబారుతున్నవి. కన్య మరియ ఆరాధన వలన పరిస్థితులు ఇంకా దిగజారెను. మరియను గూర్చి పోప్ ఇలా చెప్పెను "సంఘమునకు తల్లియైన మరియకు ఈ దేవుడు రక్షణ మర్మమును అప్పగించెను". కాని "నేనే ప్రభువును, నా మహిమను మరొకనికి ఇచ్చువాడను కాను" (యెషయా 40:8) అని ప్రభువు ఆయన వాక్యములో చెప్పెను.

102. పంతొమ్మిదవ శతాబ్దము - మిషనరీ యత్నము

పంతొమ్మిదవ శతాబ్దము "ప్రొటెస్టంట్ మిషన్ శతాబ్దము" అని సరిగా పిలువబడెను. పద్దెనిమిదవ శతాబ్దములోను పయటిస్ట్ మరియు హెర్నహట్టర్ యొక్క పనిని చూచితిమి (75 వ అధ్యాయము.) వారు దూరదేశములలో పనిచేయు ప్రభుత్వ సంస్థల మరియు వ్యాపార సంస్థల సహకారము మీద వారు ఆధారపడిరి. ఈ సంస్థలు మిషనరీ పనికి సహాయపడక దానికి అడ్డుకొనిరి. వారు సువార్త పనికంటే డబ్బు సంపాదన పైనే దృష్టిపెట్టిరి.

పంతొమ్మిదవ శతాబ్దములో పరిస్థితులు మారెను. విదేశ వలస వెళ్ళి స్థిరపడిన అనేకులు, మిషన్ సేవను మాతృదేశపు బాధ్యతయని గుర్తించిరి. అనేక ప్రపంచ దేశములలో స్థిరపడిన చాలా మంది క్రైస్తవులు, మిషన్ పనికై పిలువబడి పనిచేయగా, ఎన్నో శ్రమలున్నా, అనేకులు వారి అడుగుజాడలలో నడిచిరి! "ఇది యెహోవా వలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము" (కీర్తన 118:23) ఆ పరిణామములు అంత అద్భుతముగా నుండెను.

క్రీ.శ. 1795 మరియు 1815 మధ్యన జరిగిన యుద్ధము కారణాన ఐరోపా ఖండము మరియు ఇతర ప్రపంచ దేశాల మధ్య చాలా తక్కువ సంబంధములుండెను. మిషన్ పని, వ్యాపార పనులపై ఆధారపడి యుండెను. యుద్ధ సమయములో వ్యాపారము బొత్తిగా నిలిచిపోయెను. ఇతర కాలనీలతో సంబంధము కలిగియున్న ఒకే ఒక్క దేశము గ్రేట్ బ్రిటన్. దాని వలస రాజ్యముల కారణాన ఈ చిన్న దేశము ఓ పెద్ద సామ్రాజ్యమునకు కేంద్రమాయెను.

ఇంగ్లండ్‌లో ఇదివరకే అనేక మిషనరీ సంస్థలు ఉండెను. క్రీ.శ. 1698 లో క్రైస్తవ జ్ఞాన ప్రచార సభ ఒకటి స్థాపింపబడెను. అది క్రైస్తవ సాహిత్య పంపిణీకి ప్రసిద్ధిచెందెను. కాని పంతొమ్మిదవ శతాబ్దములో పరిస్థితులు త్వరగా అభివృద్ధిచెందెను. క్రీ.శ. 1804లో బ్రిటీష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటి స్థాపింపబడెను. ప్రపంచ వ్యాప్తముగా దేవుని వాక్యమును వ్యాప్తి చేయుటలో ఈ సంస్థ చాలా గొప్ప పనిచేసెను. అదేగాక తర్జుమా పనికూడా జరిగెను. ప్రొటెస్టెంట్ సంఘములు చిన్న పెద్దవి ఆ పని చేసెను.

పరిస్థితులు అంతటితోనే ఆగిపోలేదు. బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటి స్థాపింపబడిన తర్వాత యునైటెడ్ కింగ్‌డమ్ అందంతట అనేక నూతనమైన మిషనరీ సంస్థలు వెలసెను. ప్రత్యేకముగా లండన్ మిషనరీ సొసైటీ ఎక్కువ సేవపై దృష్టిపెట్టెను. వేర్వేరు మతశాఖల ద్వారా అనేక మిషనరీ సొసైటీలు స్థాపింపబడెను. స్థాపకులు ఒకరితో ఒకరు కొన్ని ఏర్పాట్లు చేయవలసివచ్చెను. బ్రిటీష్ సంఘముల మధ్యన ఐక్యత కొరవడియుండెను. అనైక్యత మిషన్ ఫీల్డ్ దాక వెళ్ళకూడదు. మతశాఖ వ్యత్యాసములుగాక సువార్త మాత్రమే ప్రకటింపబడవలెను.

ఆ విధముగా అనేక మతశాఖలు మరియు మిషనరీ సొసైటీలు కలిసి పనిచేయటం ప్రారంభించెను. యునైటెడ్ కింగ్‌డమ్‌నకు వలస రాజ్యములు చాలా ఉండెను. గనుక ఇంగ్లీష్ మరియు స్కాటిష్ మిషనరీలు చేయవలసిన పని చాలా ఉండెను! వారు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారతదేశము మరియు ఆఫ్రికా కోస్తా తీరముల వెంబడి వెళ్ళి సువార్త పనిచేసిరి.

అమెరికా సంయుక్త రాష్ట్రములలోను మిషన్ పనిపై ఎంతో శ్రద్ధపెట్టి పనిచేసిరి. అమెరికా మిషనరీలు చాలామట్టుకు చైనా మరియు జపాన్ వెళ్ళిరి. క్రీ.శ. 1807లో రాబర్ట్ మోరిసన్ చైనాలోని కాంటన్ నగరమునకు వెళ్ళి బైబిల్‌ను చైనా భాషలోనికి అనువదించెను.

క్రీ.శ. 1797లో ఒక డచ్ డాక్టర్ నెదర్లాండ్సి జెండింగ్ నూట్స్ కాప్ (డచ్ మిషనరి సొసైటి) నెదర్లాండ్స్‌లో స్థాపించెను. క్రీ.శ. 1813 అనగా ఫ్రెంచ్



ఆక్రమణ వరకు సొసైటీ వాస్తవమునకు మిషనరీలను పంపలేదు. ఈ పంపబడిన మిషనరీలు ఇండోనేషియాలో వలస ప్రజల మధ్యన పని చేసిరి.

ప్రొటెస్టెంట్ సంఘముకంటె ముందే రోమన్ క్యాథలిక్ సంఘము మిషనరీ పనిని ప్రారంభించెను (72 మరియు 73అధ్యాయములు చూడుము). ఈ మిషనరీ పనికై రోమన్ క్యాథలిక్ సంఘము వేర్వేరు ఆర్డర్ల నుండి మనుష్యులను వాడుకొనెను. (ఒకే ఒక్క నియమము ప్రకారము జీవించు సన్యాసులు, మఠకన్యకల గుంపు 19వ అధ్యాయము చూడుము) అవసరమైనపుడు సంఘము క్రొత్త ఆర్డర్లు స్థాపించెను. దాని ద్వారా అవసరమైన మిషనరీలను పంపెను. పంతొమ్మిదవ శతాబ్దములో కూడా రోమన్ క్యాథలిక్‌లు మిషన్ ఫీల్డ్‌లో పనిచేసిరి. ప్రత్యేకముగా సెంట్రల్ మరియు సౌత్ అమెరికాలో రోమన్ క్యాథలిక్ మిషనరీలు ముఖ్యముగా స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ మరియు ఫ్రాన్స్ నుండి పంపబడిరి. తరువాత మిషన్ ఫీల్డ్‌లో పనిచేయుటకై జర్మని మరియు నెదర్లాండ్స్ నుండి కూడా ఆయా వ్యక్తులు వెళ్ళిరి.

ప్రపంచవ్యాప్తంగా ఈ మిషనరీల ద్వారా ఎంతో గొప్ప పని చేయబడెను!

103. విలియమ్ కేరీ - భారత దేశములోని మిషనరీ

విలియమ్ కేరీ (క్రీ.శ. 1761- 1831) సెంట్రల్ ఇంగ్లండ్‌లోని ఓ చిన్న గ్రామములో పెరిగెను. చిన్న వయసులో ఉండగానే ఆయన తోటమాలి క్రింద పనిచేసెను. విలియమ్ తెలివైన వాడు గనుక తన గ్రామములో లేఖన భాగములు వల్లించుటకు అనుమతింపబడెను. పదహారు సంవత్సరముల వయసులో ఉండగా చెప్పులు కుట్టువానిగా పనిచేసెను.

విలియమ్ ప్రతిరోజు పనికి పోయి వస్తుండగా ఆ చెప్పుల తయారీ స్థలములో ఓ భక్తిగల వ్యక్తిని కలుసుకొనెను. ఈ వ్యక్తి విలియమ్ యొక్క మార్పుకు దోహదపడెను. ఇతరులు విలియమ్ యొక్క మార్పును గమనించి "పరిశుద్ధుడైన చెప్పులు కుట్టువాడు" అని ఎగతాళిగా ఆయనను పిలిచేవారు.

ఇక ఏ మాత్రమును స్థాపిత సంఘములో (చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్, 61 అధ్యాయము చూడుము) కొనసాగలేనని విలియమ్ భావించెను. ఆ కాస్త మాత్రమే సజీవ విశ్వాసము కనబడుచున్నందున ఆయన బాప్టిస్ట్ సంఘములో చేరెను. తనకు ఖాళీ సమయమున్నపుడు, విలియమ్ తనంతట తాను ఆదిమ భాషలు నేర్చుకొనెను. ఆదిమ భాషలైన హీబ్రూ మరియు గ్రీక్‌లో బైబిల్ వ్రాయబడెను. అవిగాక మరొక మూడు భాషలు నేర్చుకొనెను. అసాధారణ వరముచే ఆయన దీవింపబడెననునది అతి త్వరలోనే స్పష్టమాయెను. భవిష్యత్‌లో ఆయనకు ఈ వరము చాలా ఉపయోగకరముగా ఉండబోవుచున్నది. విలియమ్ ఇరవై నాలుగు సంవత్సరముల వయసులో బాప్టిస్ట్ సంఘమునకు పరిచారకుడాయెను. ఆ సంఘమునకు పరిచారకుడుగా ఉండిన ప్రారంభ దినములలో తన పరిచర్య ధర్మము ద్వారా చాలినంత ఆర్థిక పోషణ లభించనందున, తన జీవనోపాధి నిమిత్తమై చెప్పులు కుట్టుపనిని యథావిధిగా కొనసాగించెను. అమెరికాలో జరుగు పునరుజ్జీవమును గూర్చి ఆయన వినినపుడు, తాను కూడ మిషనరీ కావలెనని ఆశించెను.

పరిచారకుల సదస్సులో విలియమ్ మిషన్స్ పనిని గూర్చి మాట్లాడెను. మిషనరీ పరిచర్య ధర్మము సంఘము యొక్క భుజములపై ఉన్నదని ఆయన చూచెను. "యౌవనస్థుడా! కూర్చొనుము. అన్యులను రక్షించుట సముచితమని దేవుడు చూచినచో నీ సహాయము లేకయే ఆయన చేయగలడు అను పలుకులు వారి స్పందనగా అతడు పొందుకొనెను. సంఘము మిషనరీ పని నిమిత్తమై, బాధ్యతచేత మరియు నడవడివలన సంఘము బద్దురాలైయున్నదని ఆయన వర్ణిస్తూ పుస్తకము వ్రాసెను. విలియమ్ కేరి యొద్ద చాలినంత డబ్బులేనందున, ఆ పుస్తకమును ముద్రించుటకు ఆరు నెలలు పట్టెను.

కాని ప్రజలు... ఆ పుస్తకములోని సందేశము గ్రహించాక కేరీ హృదయవాంఛ నెరవేర్చబడెను. 1792వ సంవత్సరములో బాప్టిస్ట్ మిషనరీ సొసైటి స్థాపింపబడెను. "దేవుని నుండి గొప్ప సంగతులను ఆశించండి, దేవుని కొరకు గొప్పపనులు చేపట్టండి", అని నినాదము ఆధారముగా పరిచారకుల సదస్సులో కేరీ బోధింపగా అదంతయూ సంభవించెను. పంతొమ్మిదవ శతాబ్దములో జరుగబోవు గొప్ప మిషనరీ పనికి ఇది మూలమాయెను. మిషనరీ సేవకు స్వచ్ఛందముగా ముందుకు వచ్చిన వ్యక్తి స్వయాన కేరియే సమయమొచ్చినపుడు భారతదేశము ఇంగ్లిష్ వారి పాలనలో ఉండగా, ఈ ఖండమునకు ఆయన పంపబడెను.

కాని ఇంగ్లిష్ ఈస్ట్‌ఇండియన్ ట్రేడింగ్ కంపెనీ సహకరించుటకు తిరస్కరించినందున పరిస్థితులన్నియూ సవ్యముగా లేకుండెను. ఇదంతయూ ఇక్కడ మా పనిని భంగము చేయునని వారనిరి. భారతదేశములో మిషనరీ పనికి స్థానము లేదు అనిరి. ఏవి ఎలా ఉన్నా, కేరీ మాత్రము బయలుదేరెను. స్నేహపూర్వకమైన నావికుడు ఓడలో ఆయనతోపాటు ప్రయాణించుటకు విలియమ్‌ను అనుమతించెను, కాని బలమైన ఉప్పెన కారణాన ఓడ రేవుకు తిరిగి రావలసివచ్చెను. అయినా సరే కేరీ పట్టు విడువలేదు. ఆయన మరొక ఓడనెక్కి ఆరునెలల ప్రయాణము చేసి కలకత్తా నగరము చేరుకొనెను.

కలకత్తాలో మిషనరీ పని చేయుటకు ఆయన అనుమతింపబడనందున ఓ బురద ప్రాంతములో పులులుండు స్థలములో ఓ వ్యవసాయ కూలీగా ఆయన పనిచేయటము ప్రారంభించెను. ఆరు నెలల పిమ్మట ఒక ఫ్యాక్టరీలో ఉద్యోగము దొరుకగా ఆయన జీతము కాస్త మెరుగుపడెను. ఆయన తోటి ఉద్యోగులకు సువార్త బోధించెను, వారి భాష నేర్చుకొనెను. కొన్ని మిషన్ కేంద్రములు త్వరలోనే స్థాపించెను. భారతదేశములో మిషనరీలు అవసరము లేదను. ఇంగ్లిష్ వర్తకులచే ఆయన దేశమునుండి వెళ్ళగొట్టబడెను.


ఇప్పుడు కేరి భారతదేశములోని డానిష్ కాలనీకి వెళ్ళెను. ఆయన అక్కడ ప్రింటింగ్ పనులు ప్రారంభించి బైబిల్‌ను వేర్వేరు భారతదేశపు భాషలలోనికి అనువదించెను. ఇప్పుడు బైబిల్ గ్రంథములు భారత ఖండమందంతట వ్యాపించెను, దేవుని వాక్యము చదువబడెను. కేరీ క్రమేపి పండితుడుగా మారి ప్రథమ శ్రేణి భాషావేత్తగా పేరుతెచ్చుకొనెను. ఆయనకు ముప్పై నాలుగు భాషలు తెలుసు.

కలకత్తాలో ఓ యూనివర్సిటీ కలదు. అందులో భారతీయ భాషలు బోధించుటకై ఒక లెక్చరర్ కావలసివచ్చెను. కేరీకన్న మంచి లెక్చరర్ వుంటారా? మరియు కేరి నియమింపబడెను. ఎంత అధ్భుతమైన మార్పు జరిగెను. మొదట ఆయన కలకత్తా నుండి తరిమివేయబడెను, కాని ఇప్పుడు రమ్మని ఆహ్వానింపబడెను.

ఆయన లెక్చరర్ పని చేయుటలో బిజీగా ఉన్నా, కేరీ తన మిషనరీ పనిని కొనసాగించెను. తత్ఫలింతముగా భారతదేశములో అరవైమూడు మిషనరీల ద్వారా ముప్పై మిషన్ స్టేషన్స్ స్థాపింపబడెను. మరియు చివరిదే కాని గొప్పసంగతి నలబై భారతీయ భాషలలో బైబిల్ ముద్రింపబడెను.

కేరి సంఘములు మరియు పాఠశాలలను స్థాపించెను. క్రైస్తవులుగా మారిన భారతీయులు మిషనరీలుగా తర్ఫీదు పొందుటకై కాలేజ్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్‌ను స్థాపించెను. బ్రిటిష్ ప్రభుత్వము అనేక బానిసక్రూర చర్యలను అంతమొందించులాగున కేరీచూచుకొనెను. ఉదాహరణకు, భారతదేశములో ఒక పురుషుడు చనిపోతే, బ్రతికియున్న అతని భార్య చితిమంటలలో పారవేయబడుచుండెను. హైందవ సంప్రదాయము ప్రకారము బ్రతికియున్న భార్య చనిపోయిన భర్తతోపాటు మృతుల ప్రపంచములోనికి వెళ్ళవలెను. చిన్నపిల్లలు అనేకులు గంగానదిలో ముంచబడి నది దేవతకు బలి ఇవ్వబడిరి.

క్రైస్తవ జీవితము ఎలా జీవించాలి అను విషయమై కేరి ప్రజలకు సమస్తము బోధించెను. విలియమ్ కేరి ప్రజలకు సమస్తము బోధించెను. విలియమ్ కేరి 'ఫాధర్ ఆఫ్ మోడర్న్ మిషన్స్' గా పిలువబడెను. ఆయన "దేవుని నుండి గొప్ప సంగతులు ఆశించెను", దేవుని బలము చొప్పున, "దేవుని కొరకై గొప్పసంగతులు చేపట్టెను".




104. మేరి స్లెసర్ – పశ్చిమ ఆఫ్రికా మిషనరీ

క్రీ.శ. 1848లో స్కాట్‌లాండ్ నగరములోని అబర్డీన్‌లో మేరి స్లెసర్ జన్మించెను. ఆమె యౌవన దశలో నున్నపుడే కాటన్ మిల్‌లో పనిచేయుచుండెను. ఆ పనిని ఆమె చాలా గంటలు చేసి అలసిపోయేది. అయినాసరే ఆమె సండేస్కూల్‌లో ఒక చిన్న తరగతిలో బోధించుచుండెను. ఆ తరగతిలోని విద్యార్థులు మురికి వాడల నుండి వచ్చినవారు మరియు వారు బాగా అల్లరి చేసేవారు. అటువంటి పిల్లలకు బోధించుట అంత సుళువుకాదు. మిషనరీ కావలెనని మేరిస్లెసర్ చాలా కాలమునుండి ఆశపడుచుండెను. పదేపదే ఈ విషయమై ఆమె ప్రభువునొద్ద ప్రార్థించెను.

ఆమె 25 సం॥ల వయసులో నున్నపుడు ఆఫ్రికాలో ప్రసిద్ధిగాంచిన మిషనరియైన డేవిడ్ లివింగ్‌స్టన్‌ను గూర్చి వినెను. బయటకు వెళ్ళి మిషనరీ సేవ చేయు సమయము వచ్చెనని ఆమె గ్రహించెను. అనేక కష్టములను ఎదుర్కొనవలసియుండునని తల్లి మరియు కూతురు మాట్లాడుకొనిరి. "ప్రమాదములా?" అని తల్లి ఆశ్చర్యపడెను, "యేసు నా పక్షముగా ఉండగా అవి లెక్కకురావు!"

మిషనరీగా వెళ్ళుటకై మేరి, స్కాట్లండ్ సంఘము యొక్క మిషనరీ బోర్డ్‌కు అప్లికేషన్ పెట్టెను. కొద్ది సంవత్సరముల పిమ్మట నైజిరియా (ఆఫ్రికా) లోని కలబార్‌కు ఆమె పంపబడెను. అక్కడ ఆమె మిషనరీ టీచర్‌గా స్థిరపడెను. ఆమె మొదట అక్కడికి వెళ్ళినపుడు వారితో సంభాషించలేకపోయెను. ఎందుకంటే వారి భాష తనకు తెలియదు. ఆమె వారి భాష నేర్చుకొనుటకు బైబిల్ కథలు చెప్పుటకు మూడు సంవత్సరములు పట్టెను. ఆమె పూరిగుడిసెలలో ఉంటూ, అరటిపండ్లు, చేపలు మరియు దుంపలు తింటూ బ్రదికెను. మలేరియాతో బాధపడి స్కాట్‌లాండ్‌నకు తిరిగివచ్చెను. ఆరోగ్యము కుదుట పడిన పిమ్మట మేరి తిరిగి నైజీరియాకు వచ్చెను.

ఆమె ఆయా ప్రాంతములు ఆ దేశములోనే ప్రయాణించెను. తన చుట్టు పిల్లలను చేర్చుకొని వారితో ఆడి ప్రభువైన యేసును గూర్చి ఆవిడ చెప్పెను. తరువాత స్త్రీలు మరియు పురుషులు కూడా ఆమె చెప్పు మాటలు వినుటకై వచ్చిరి. ఆమెకున్న ధైర్యమును బట్టి వారిపట్ల ఆమె చూపు ప్రేమను బట్టి ఆ ప్రజలు చాలా ఇష్టపడిరి. వారు గౌరవమును చూపుతూ ఆమెను 'మా' (తల్లి) అని పిలిచిరి.



ఒక గ్రామములో కవలపిల్లలు పుట్టారు. ఆ విషయము విని వెంటనే ఆమె ఆ గ్రామమునకు దోనె ఎక్కి వెళ్ళెను. కవలపిల్లలు దురదృష్టము మరియు మరణము తెచ్చెదరని గ్రామస్థులు నమ్మిరి. కొన్నిసార్లు వారు ఈ కారణముచే కవలపిల్లలను అడవిలో విడిచిపెట్టి వెళ్తే అడవి జంతువులు వచ్చి ఆ పిల్లలను తినివేయుచుండెను. ఆమె సమయమునకు వెళ్లినపుడు అలా వదలివేసిన కవల పిల్లలను మేరి రక్షించుచుండెను. అలా ప్రయాణమై పోవునపుడు ఆమె నైజీరియా ప్రజలకు సువార్త చెప్పి ఆనారోగ్యముగానున్నవారికి మందులిచ్చుచుండెను. విషయమేమిటంటే స్థానికులు ఆవిడకు ఎటువంటి హాని చేసేవారు కాదు.

సరిగ్గాలేని ఆ దోనెలలోచేయు ప్రయాణములు కొన్నిసార్లు ప్రమాదకరముగా నుండెను. నదులలో మొసళ్ళు మరియ నీటి ఏనుగులు ఉండేవి. నరమాంసభక్షకులు నదీ తీరమున దాగుకొని ఉండేవారు. ముసిరే దోమలు విషభరితముగా కాటువేసేవి. ఆ కారణముచే మేరి చాలాసార్లు జ్వరముతో గ్రామమునకు వచ్చుచుండెను. కొన్నిసార్లు మేరి మురికిగా ఉన్న గుడిసెలలో నివాసముండెను.

నల్లజాతి యొక్క రాణి రమ్మని మేరిని పిలిస్తే భయపడక మేరి ఆవిడ యొద్దకు వెళ్ళెను. మేరి ఆహ్వానమందుకొని వెళ్ళి సువార్తను అదే అవకాశముగా అందించుచుండెను. అడవి లోపలికి కూడ మేరి ప్రయాణించు చుండెను. దక్షిణ నైజీరియాలోని నరమాంసభక్షకులైన క్రూర ఒకొయాంగ్ ప్రజల యొద్దకు వెళ్ళాలని మేరి ఆశపడెను.

"ఓ తెల్ల తల్లీ నీవు అక్కడికెళ్తే తిరిగి రాలేవు వారు నిన్ను చంపుదురు" అని నల్లరాణి చెప్పెను. అలా, హెచ్చరించినా మేరి ఒంటరిగానే ఆ అడవిలో ప్రయాణించెను. ఆమెకు ఎంత ధైర్యము! కొంతమంది నల్లజాతి పిల్లలతో మేరి ప్రతివారము ఆ వర్షపు అడవిగుండా ప్రయాణించుచుండెను. ఆ దారిన క్రూర మృగములు మరియు స్థానికులు వెళ్ళేవారు. తుదకు, నరమాంస భక్షకుల గ్రామములలోనే అతి క్రూరగ్రామమైన ఎకెంజ్‌కు వచ్చెను. ఆయుధములు లేకయే ఓ తెల్లజాతి స్త్రీ ఆ గ్రామములో ప్రవేశించుట చూచి గ్రామపెద్ద ఇడెమ్, ఆశ్చర్యపడెను. ఆవిడను తినవద్దని ఆ గ్రామ ప్రజలకు ఆజ్ఞాపించెను. అదేగాక స్కూల్ ప్రారంభించుటకై ఆయన అనుమతినిచ్చెను. మేరి పిల్లలకు బోధించి, అవసరత ఉన్నవారికి సహాయము చేసి బైబిల్ కథలను నేర్పెను. పిల్లలతో వారి తల్లిదండ్రులు కూడా వచ్చి మేరిని దర్శించిరి. వంట వండుట, పిల్లల బట్టలు ఉదుకుట, రోగులను చక్కగా చూచుకొనుట మున్నగు విషయములను తన దగ్గరకు వచ్చిన స్త్రీలకు మేరి నేర్పెను. బైబిల్ కూడా వారికి నేర్పెను.

కాని పరిస్థితులు మారి కష్టతరమాయెను. ఆ ప్రాంతమంతయూ అంటురోగము వ్యాపించగా ఆ పరిసర గ్రామములలో వేలాది మంది మరణించిరి. మందులు అందుబాటులో లేవు. మేరి వారిని చక్కగా చూచుకొని వారి బాధను నివారణ చేయుచుండెను. ప్రమాదములెన్నున్నా లెక్కచేయక గ్రామ గ్రామములు పగలనక రాత్రనక దర్శించుచుండెను.

నాగరికతకు దూరముగా ఉంటూ నరమాంసభక్షకుల మధ్యన మేరి పనిచేసెను. నల్లజాతివారు కూడ ఆమె యొక్క ప్రేమ సాహసములకు ఆశ్చర్యపడి "ఒకొయోంగ్ యొక్క తెల్లరాణి" అని పిలిచేవారు. వారు మేరి కొరకై ఇల్లు మరియు సంఘమును కట్టిరి, ఒకొయోంగ్ ప్రాంతములో సువార్త చక్కటి ఫలములు ఫలించెను. అల్లరి, త్రాగుడు ఇవన్నీ సమసిపోయెను. కవలపిల్లలను క్రూరమృగములకు పారవేయుటలేదు. తమతోటి మనుష్యులను నరమాంసభక్షకులు తినుట లేదు. వాస్తవానికి ఎంతోమంది నల్లజాతి ప్రజలు మిషనరీలు కావలెనని ఇష్టపడిరి. తెల్ల తల్లి మేరి వృద్ధురాలాయెను. నలబై సంవత్సరములు ఒంటరిగా పోరాడిన నమ్మకమైన ప్రభువు దాసురాలు క్రీ.శ. 1915 లో మరణించి విశ్రాంతిలో ప్రవేశించెను.

"మా తల్లి చనిపోయెను" అని ఆవిడ సమాధియొద్ద నిలువబడి స్థానికులు ఏడ్చిరి. "సకల ఆశీర్వాదములిచ్చు దేవుని స్తుతించుడి, మీరు ఏడ్వకండి" అని ఓ నల్లజాతి వృద్ధ స్త్రీ ఏడ్చుచున్న వారిని ఉద్దేశించి చెప్పెను.

105. ఘానలో మిషన్ పని

అది క్రీ.శ. 1832 ఘానవైపు ఆఫ్రికా తీరము వెంబడి ఓడ వెళ్ళుచున్నది. వర్తకము నిమిత్తము ఘానాకు వెళ్ళవలెనని తెల్లవారు చూతురు. ఇంకా ఏమున్నది... ఘానలో బంగారము దొరుకును! అందుకే దేశము "బంగారము తీరము" అని పిలువబడుచున్నది. కాని.. అమెరికాలోని తోటలలో పనిచేయుటకు ఘాన నుండి కోట్లకొలది బానిసలు పంపబడిరి.

తమను తాము ధనికులనుగా చేసికొను నిమిత్తము మాత్రమే వర్తకులు ఘానాకు వచ్చెడివారు. కాని.... ఓడ ఆఫ్రికా తీరము సమీపించుచున్నది. అందులో కొందరు వ్యక్తులున్నారు వారి ఉద్దేశ్యము తమను తాము ధనికులను చేసుకొనుట కాదుగాని దానికి బదులు వారు ఘాన ప్రజలకు కొంత ఇవ్వవలెనని చూచుచున్నారు. స్థానికుల భాష నేర్చుకొని వారి మాతృభాషలో వారికి బైబిల్ సత్యములు బోధింపవలెనని, వారు మొదట ఆశపడిరి. ఘాన ప్రజలకు సువార్త అందించుటకు ముగ్గురు మిషనరీలు వచ్చిరి.

మిషనరీలు ఒసు అని పిలువబడు కోస్తా తీరపు గ్రామమునకు వెళ్ళి గుడిసెలలో నివసించిరి. ఆ ప్రాంతములో ట్వి భాష మాట్లాడేవారు. ప్రతి సాయంత్రము కొద్దిమంది ఆఫ్రికన్స్ (స్థానికులు) గుడిసెల యొద్దకు వచ్చి పెట్రోలియమ్ దీపపు కాంతిలో మిషనరీలకు ట్వి భాషయొక్క మొదటి పదములను నేర్పిరి.

కాని మిషనరీలు నివసించు స్థలములో దోమలుండెను, దోమల ద్వారా వ్యాధులు కలుగును. నాలుగు నెలలోనే ఉష్ణ ప్రాంతపు జ్వరము వలన బలహీనపడి ఇద్దరు మిషనరీలు మరణించిరి.

మూడవ మిషనరీ అయిన రీస్ అనబడు వ్యక్తి మాత్రమే ఒంటరిగా మిగిలిపోయెను.

క్రీ.శ. 1835లో రీస్ ఒసును విడిచి వెళ్ళెను. ఆయన అక్వాపెమ్ కొండలలో నివసించుటకు వెళ్ళెను. వర్తకుడైన లుట్టెరాడ్ట్‌తో కలిసి రీస్ ప్రయాణమయ్యెను. ఒక సంచిలో తన బైబిల్, ఆయన జర్నల్, పెన్, పేపరు మరియు కొన్ని బట్టలు తీసుకుని తన భుజములపై పెట్టుకొని మోసికొని వెళ్ళెను. రెండు దినముల తర్వాత ఇద్దరు వ్యక్తులు అక్రపాంగ్ అను గ్రామము చేరుకొనిరి.

త్వరలోనే గ్రామస్థులు అత్యాసక్తులై వారి గుడిసెలు విడిచి ఆ ఇద్దరు వ్యక్తుల వెంట వెళ్ళిరి. ఇద్దరు వ్యక్తులు రాజమందిరమునకు వెళ్ళిరి. రాజు మరియు అక్రపాంగ్ గ్రామ పెద్దలు, వారిని స్వీకరించుటకై ఇష్టపడిరి. "మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని అనువాదకుని ద్వారా రీస్‌ను అడిగిరి. పరలోకపు దేవుని పలుకులు అందించుటకు మేము ఇక్కడికి వచ్చితిమి. మేము ఇక్కడ నివసించుటకు మీరు అనుమతిస్తే, స్థానికులకు శుభవర్తమానము తెలిపెదము.

"ఐరోపీయుడా..... నీవు చక్కగా మాట్లాడితివి" అని చెప్పి రాజు తలవూపి, అనుమతినిచ్చెను.

త్వరలోనే, రీస్ గ్రామమునకు చక్కగా అలవాటుపడెను. రీస్ నిమిత్తమై ఇల్లు కట్టుటకై రీస్‌కు సహాయపడుటకై రాజు కొంతమంది సహాయకులను పంపెను. కాని రీస్ బుద్ధిహీనుడని ప్రజలు భావించిరి.

"మొదలు నీ ప్రణాళికలను దయ్యములు పాడు చేయకుండ చూచుకొనుము" అని వారు ఆశ్చర్యపడి చెప్పిరి. పితరుల ఆత్మలు బ్రతికియున్న వారిపై ప్రభావమును చూపును గనుక వాటికి బలులర్పించి వాటిని శాంతింపజేయవలెను. అలా చెప్పి చెట్లు నరుకుట, మొద్దులను రంపముతో కోయుట, రీస్‌నకు వదలిపెట్టి సహాయకులు వెళ్ళిపోయిరి. ఇంకా ఏమి జరిగెననగా ఆయనయొక్క మొద్దులలో చాలా మొద్దులు అగుపించక మాయమయ్యెను.

రీస్ అక్రపంగ్ నందు రెండు సంవత్సరములు పనిచేసెను. ఆయన స్థానిక భాష నేర్చుకొని ప్రజలకు దేవుని గూర్చి చెప్పుటకు దానిని ఆయన వాడెను. ఆయన చుట్టూ ఉన్న ప్రజల హృదయములలో చింత భయము నిండుకొనియుండగా ఆయన హృదయములో వారిపట్ల కనికరము నిండుకొనెను. రీస్ ఎంతో ఆసక్తితో సువార్త బోధించెను కాని ఆయన వ్యతిరేకతను ఎదుర్కొనెను. ఆయన ప్రయాసకు ఫలములు కనిపించలేదు తుదకు బాసెల్‌లోని కార్యాలయము ఆయనను తిరిగి రమ్మని ఆజ్ఞాపించెను. తన పనినుండి విరామము తీసికొనుట మంచిదని రీస్ గ్రహించెను (ఫర్లో అనగా మిషనరీ సెలవుదినములను వర్ణించు పదము). రాజు మరియు

పెద్దల నుండి సెలవు తీసికొనుటకై అతడు వెళ్ళగా, "తెల్లవారి గ్రంథము (బైబిల్) చదువు, ఇద్దరు వ్యక్తులను చూపగలిగితే మేము నీ సందేశమును స్వీకరింతుము" అని చెప్పిరి.

రీస్, రాజు మాటలను మరువక ఆయన బాసెల్‌లో చేరుకుని విషయమును మిషన్ బోర్డ్‌తో చర్చించెను. వెస్టిండీస్‌లోని బ్రిటిష్ కాలనీలో బానిసత్వము నుండి విడిపింపబడి క్రైస్తవులుగా మారిన ఆఫ్రికా ప్రజలుండిరి. బహుశ రీస్‌తో వారు ఆఫ్రికా వెళ్తే బాగుండును "తెల్లవారి పుస్తకము" బైబిల్ మీకునూ ప్రాముఖ్యమని అక్రపంగ్‌లోని ఆఫ్రికన్‌లకు వారు చెప్పవచ్చును.

ఆ కారణముచేత వెస్టిండీస్‌లోని జమైకాలోని నల్లజాతి క్రైస్తవుల యొద్దకు రీస్ వెళ్ళెను. అదుగబడిన సంగతిని వారు వినినపుడు వెస్టిండియన్ క్రైస్తవులు ఆ విషయమును చాలా జాగ్రత్తగా ఆలోచింపవలసి వచ్చెను. వారు లేదా వారి పితరులు బానిసత్వమునకు నెట్టివేయబడిన స్థలమునకు తిరిగి వచ్చెదరా? యీ ఆలోచన విషయములో వారిలో చాలామంది ఆసక్తి కనబరచలేదు.

కాని చివరికి రీస్‌తో ఆఫ్రికా వెళ్ళుటకు ఆరు కుటుంబములు వచ్చెదమని ప్రకటించిరి. బయలుదేరు సమయము రాగా కన్నీరు కార్చబడెను. "మా కొరకు ప్రార్థించుడి" అని రీస్‌తో వెళ్ళు ప్రజలు చెప్పిరి. క్రైస్తవులు జీవించు విధానమును ఆఫ్రికాలో నివసించు ప్రజలకు తెలుపుటకై వెళ్ళుచున్నామని చెప్పిరి. దేవుడే మనకు సహాయము చేయును గాక".

రీస్ అక్రపంగ్ విడిచి వెళ్ళి మూడు సంవత్సరములు గడిచెను అయితే ఇప్పుడు అనేకమంది ఆఫ్రికా క్రైస్తవ ప్రజలను వెంటబెట్టుకొని వచ్చుచున్నాడు. ఆయనతో అనేక యౌవన మిషనరీలు కూడ వచ్చిరి. ఘానలోని ఆఫ్రికా ప్రజలు దుష్టశక్తులకు భయపడక తెల్లవానివలె ధైర్యముగా ఎలా బ్రతుకవచ్చునో ఖచ్చితముగా తెలుపుటకై వెస్టిండీస్ నుండి నల్లజాతి క్రైస్తవులు వచ్చిరి. ఇప్పుడు ఘానలో దేవుని వాక్యమను బీజము మొలకెత్తుట ప్రారంభించెను. ఆవగింజ పెరిగి పెద్ద వృక్షముగా ఎదిగి ఫలములనిచ్చెను. (మత్తయి 13:31,32)

క్రీ.శ. 1978 లో ఘానలోని సంఘము తన 150 వార్షికోత్సవమును జరుపుకొనెను. వార్షికోత్సవ కార్యక్రమములకు వేవేల ప్రజలు హాజరైరి. మిషనరీలు గౌరవింపబడిరి, బీచ్‌లో పెద్ద సిలువను ఆవిష్కరించిరి.



106. జొహన్నెస్ థియోడొరస్ వాన్‌డెర్ కెంప్ - దక్షిణ ఆఫ్రికాలోని మిషనరీ

జొహన్నెస్ థియోడొరస్ వాన్ డెర్ కెంప్ లెయ్‌డెన్ యూనివర్సిటిలో విద్యార్థిగా ఉండెను. (1747-1811) రాట్టర్‌డామ్ నందు నివసించు క్రైస్తవ తల్లిదండ్రులకు ఆయన పుట్టెను. జొహన్నెస్ తన తల్లిదండ్రులకు అధిక బాధ మరియు విచారము కలుగజేసెను. యూనివర్సిటీలో ఇతర విద్యార్థులతో పాటు ఆయన అక్రమ మరియు అల్లరి జీవితము జీవించెను. తరువాత అతని డచ్ పట్టణమైన జ్విన్‌డ్రెక్ట్ నందు వైద్యుడాయెను. జొహన్నెస్ వాన్‌డెర్ కెంప్ తన తల్లిదండ్రులకు విశ్వాసమునకు తనను తాను బొత్తిగా దూరపరచుకొనెను.

ఎలాగైనా సరే, ఒకదినాన విషయములు మారెను. ఒక రోజు తన భార్య మరియు బిడ్డతో కలిసి నదిలో పడవలో ప్రయాణమైరి. అకస్మాత్తుగా ఉరుము మెరుపులతో కూడిన గాలి వీచగా పడవ తలము నకలాయెను మరియు తన స్వంత కళ్ళెదుట తన భార్య మరియు బిడ్డ మునిగిపోవుట చూచెను. తను తలమునకలైన పడవను పట్టుకొని వ్రేలాడి తనను తాను రక్షించుకొనెను.

ఇప్పుడు జొహన్నెస్ థియోడరస్ వాన్‌డర్ కెంప్ ప్రపంచములో ఒంటరివాడుగానుండెను. ఆయన చాలా క్రుంగి పోయెను. అన్నిటికంటే ముఖ్యముగా దేవునియెదుట తనను తాను దోషిగా చూచుకొనెను. హృదయపూర్వక పశ్చాత్తాపముతో తన తల్లిదండ్రులయొక్క దేవుని వెదకుట ప్రారంభించెను. మరియు ... ప్రభువు ఎంతో దయతో అతని పాపములన్నియూ క్షమించెను.


ప్రభువా! నేను మిగిలిన నా జీవితమంతా ఏమి చేయాలి? అని జొహన్నెస్ వాన్‌డర్ కెంప్ ప్రార్థన చేయుట ప్రారంభించెను.

లండన్ మిషనరీ సొసైటి మిషనరీలు కావలెనని ప్రకటించటము జొహన్నెస్ వినెను, గనుక ఈ ప్రకటన తన ప్రార్థనకు ఫలితముగా భావించెను.

క్రీ.శ. 1798 లో దక్షిణ ఆఫ్రికాకు ఓడలో ప్రయాణమయ్యెను. ఆయన నెదర్లాండ్స్ విడిచి వెళ్ళకమునుపు, ఆయన స్నేహితులు కొందరు (నెదర్లాండ్‌సె జెండింగ్‌స్జెనూట్స్ కాప్ (డచ్ మిషనరి సొసైటి)ని స్థాపించిరి. తను ఓడ ప్రయాణము చేస్తూనే, వాన్‌డర్ కెంప్ సువార్త ప్రకటించుటకై అవకాశము కలిగియుండెను. ఓడలో దిగువ భాగమున మూడువందల మంది ముద్దాయిలు బంధింపబడియుండిరి. వారు ఆస్ట్రేలియాలోని మరణశిక్ష విధించు కాలనీకి తీసికొని పోబడుచుండిరి, అట్టి వారికి వాన్‌డర్ కెంప్ కేప్ ఆఫ్ గుడ్ హోప్ చేరుకొనెను. కేప్ ఆఫ్ గుడ్ హోప్‌లో డచ్ బోవర్స్ నివసించుచుండిరి. (బోవర్ ఆఫ్ డచ్ నుండి దక్షిణ ఆఫ్రికాకు వలస వచ్చిన ప్రజలు వారు తరచుగా భూస్వాములుగాను/ రైతులుగాను పనిచేయుచుండిరి). వారు నల్లజాతి ప్రజలను వారి బానిసలుగా ఉంచుకునే వారు. ఆ రోజుల్లో కఫిర్స్ మరియు హాటెన్‌టాట్స్. అని వారిని సూచించి చెప్పేవారు. వాన్‌డర్ కెంప్ దక్షిణ ఆఫ్రికాకు వచ్చెనని వారు వినినపుడు వారు ఆయనను ఎగతాళి చేసి నవ్విరి. "హాటెన్‌టాట్స్‌కి సువార్త ప్రకటించుటయా" అసలు ఆత్మనే లేదు. అని వ్యంగముగా చెప్పిరి.

ఆయన చుట్టూ ఉన్న బానిసత్వమును చూస్తూ వాన్‌డర్ కెంప్ కోపముతో మండిపడెను. "వీరు జంతువులేమో అన్నట్లుగా ఈ బడుగు జీవులు, దుష్టదేశములో క్రూర చట్టము ప్రకారము అమ్మబడిరి. క్రైస్తవులమని చెప్పుకొను వారి ద్వారా వారు తమ పిల్లల నుండి వేరు చేయబడిరి అని ఆయన లండన్‌కు ఉత్తరము వ్రాసెను. ఈ దీన బానిసలకు వాన్‌డర్ కెంప్ దేవుని వాక్య సందేశమును బోధించెను. ఆయన త్వరలోనే బోవర్స్ ద్వారా వ్యతిరేకతను ఎదుర్కొనగా ఆ స్థలము విడిచి హాటెన్‌టాట్స్ (నేటి రోజున వారు కోయ్‌కోయ్ అని పిలువబడుచున్నారు) స్వేచ్ఛగా నివసించు, వారి స్వదేశమునకు వెళ్ళెను. కాని కోయ్‌కోయ్ ప్రజలు తెల్లవారిని ద్వేషింతురు గనుక ఆయన చేయు ఈ ప్రయత్నము చాలా ప్రమాదకరమైనది.

కాని కొన్ని ఎద్ద బండ్ల సహాయముతో వాన్‌డర్ కెంప్ ప్రయాణమయ్యెను. చాలా కష్టముతో నాలుగు నెలలు ప్రయాణము చేసి కోయ్‌కోయ్ ప్రదేశము చేరుకొనెను. కోయ్‌కోయ్ ప్రజలు అతనిని ఉండనిచ్చిరి కాని ఈ తెల్ల మనిషిని అస్సలు నమ్మరు. వాన్ డెర్ కెంప్ ఇక్కడ కూడ పలువిధములైన వ్యతిరేకతను ఎదుర్కొనెను. అక్కడ పరిస్థితులు దుర్భరముగా మారెను. ఇంకా ముందుకు వెళ్ళవలెనని ఆయన నిర్ణయించుకొనెను. కొందరు కోయ్‌కోయ్ ప్రజలు ఆయన వెంట వెళ్ళిరి. ఒక ఏకాంత ప్రాంతములో వాన్ డెర్ కెంప్ ఒక ప్రాంతమును స్థాపించెను. ఆయన దానిని బెతెల్స్ డార్ప్ (బేతెల్ గ్రామము) అని పిలిచెను. అక్కడ కోయ్‌కోయ్ ప్రజలు



కొన్ని గుడిసెలను మరియు ఒక సంఘ భవనమును నిర్మించిరి. వాన్‌డెర్ కెంప్ ఈ చిన్న సంఘభవనములో ప్రతి ఆదివారము బోధించుచుండెను. వారమంతయూ ప్రజలు కష్టపడి పనిచేసేవారు. భూమి కఠినమై నిస్సారవంతముగా ఉండెను. గనుక అక్కడ పరిస్థితులు కష్టముగా ఉండెను. అయిననూ బెతెల్స్ డార్ప్ క్రమేపి వృద్ధియగుచుండెను. కోయ్‌కోయ్ ప్రజలనేకులు ఈ గ్రామమునకు చేరిరి. క్రూరముగా బాధింపబడిన బానిసలు అనేకులు ఈ "ఆశ్రమ గ్రామమునకు" పారిపోయి వచ్చిరి, మరియు వాన్ డెర్ కెంప్ కొందరు బానిసల నిమిత్తము డబ్బు చెల్లించి వారిని విడిపించెను. కొద్ది నెలలోనే బెతెల్స్‌డార్ప్‌నందు 1150 మంది ప్రజలు నివసించిరి. ప్రతి దినము వారు బైబిల్ నుండి ఉపదేశింపబడిరి. విత్తనము ఫలించులాగున ప్రభువే చూచుకొనెను.

కాని అన్నిటికంటే ముఖ్యముగా, ఈ బెతెల్స్ డార్ప్ నుండి కేప్ కాలని ప్రాంతములకు అనేక మిషనరీలు బయలుదేరిరి. ఈ మిషనరీలైన కోయ్‌కోయ్ ప్రజలు మునుపు త్రాగుబోతులుగానుండిరి.

ఇటువంటి క్రైస్తవ నివాసములకు బెతెల్స్ డార్ప్ "తల్లి" వంటి దాయెను. మిషనరీలు చాలా కష్టపడిరి. వీరు బోవర్స్ చేతిలోపడినప్పుడు క్రూరముగా హింసింపబడిరి. అయినా సరే ... మిషన్ పని కొనసాగెను.

వాన్‌డెర్ కెంప్ తీవ్ర అనారోగ్యమునకు గురయ్యెను. అన్నియేండ్ల శ్రమ ప్రయాస ఆయనపై ప్రభావమును చూపెను. మరణము సమీపించెను. కోయ్‌కోయ్ ప్రజలనేకులు మరియు ఇతర గ్రామస్థులు ఆయనకు వీడ్కోలు పలుకుటకై వచ్చిరి.

"నీవు దైవజనుడవు, నీవు దేవునిచే పంపబడి తిరిగి దేవుని యొద్దకు వెళ్ళుచున్నావు" అని ఒక వృద్ధుడు చెప్పెను. "అవును నిజమే, నా స్నేహితుడా" అని వాన్ డెర్ కెంప్ తన బలహీన స్వరముతో చెప్పెను. నీ ఆత్మలో వెలుగు ఉన్నదా అని ప్రశ్నింపగా, వాన్‌డెర్ కెంప్ బదులివ్వ ప్రయత్నించగా నోటమాట రాదాయెను. "అవును అది వెలుగే" అని మెల్లని స్వరముతో తన చివరి పలుకులు పలికి, "కోయ్ కోయ్ ప్రజల జాతిపిత" మరణించెను.

107. బానిసత్వము రూపుమాపబడుట

పదిహేడు మరియు పద్దెనిమిది శతాబ్దములలో బానిస వ్యాపారము అతి గొప్ప కీడుగా నుండెను. అది ఎంతో ఘోర కృంగుదలను మరియు దౌర్భాగ్యమును కలుగజేసెను.

ఆఫ్రికాలో గ్రామాలు గ్రామాలు కాల్చి వేయబడెను, నేలమట్టము చేయబడెను. గ్రామములనుండి నల్లజాతి ప్రజలు పారిపోగా వారు బందింపబడిరి. వారిని సంకెళ్ళతో బంధించి వారిని ఊరేగింపుగా పశ్చిమతీరమునకు తీసికొని వెళ్ళిరి. అక్కడ పశువులను అమ్మకమునకు పెట్టినట్లు బానిసలను అమ్మకమునకు పెట్టిరి. చాలామంది ప్రయాణములోనే నశించిరి, అయిననూ ఆఫ్రికా ఖండములోనే చాలామంది బానిసలుండిరి...

ఆఫ్రికాలోని పశ్చిమ తీరములోని ఘనా అను దేశమునకు ఇంగ్లీష్ మరియు డచ్ రేవుల నుండి ఓడలు బయలుదేరెను. ఘనలో బానిసలు కొనబడి సముద్రము మీదుగా ఓడలో అమెరికాకు పంపబడిరి. ఓడ ప్రయాణము ప్రారంభము కాకమునుపు వారి దేహములపై కొరివితో కాల్చి గురుతులు పెట్టేవారు. అక్కడ ఓడ రేవునందు వెంటనే ఓడ అందుబాటులో లేనట్లైతే తాత్కాలికముగా వారు బానిసలను మురికి స్థలములో బంధించేవారు. అమెరికా చేరాక మంచి ధరకు వారిని అమ్మివేసేవారు. బానిసలు చెఱకు తోటలలో పనిచేయుటకై అవసరమైయుండెను.

వ్యాధులు, కొరడాలతో కొట్టుట సాధారణముగా జరుగుచుండెను. ఓడలలో పరిస్థితులు చాలా ఘోరముగా



ఉండినందున, బానిసలతో కిక్కిరిసియున్నందున చాలామంది దారిలోనే మరణించిరి. ఓడ సామర్థ్యమునకు మించి బానిసలను తీసుకునిపోయేవారు. ఓడలలో చాలా మంది బానిసలను పేర్చి నింపుకొని తీసికుపోయేవారు.

నిర్దయతో కూడిన దురాచారములు చాలా జరిగెడివి. నల్లజాతీయుల కుటుంబములు చీల్చివేయబడెను. కొందరు బానిసలు ఓడ ప్రయాణము మధ్యలోనే ఓడ నుండి సముద్రములో దూకి మరణించేవారు.

ఈ బానిసలను చూచుకొనుటలో డచ్ మరియు ఇంగ్లీష్ వారు చాలా క్రూరముగా ప్రవర్తించిరి.

పంతొమ్మిదవ శతాబ్దములో "క్రైస్తవ మనస్సాక్షి మాట్లాడుట ప్రారంభించెను". బానిసత్వ నిర్మూలనలో గుర్తుంచుకోదగిన ఒక ముఖ్య వ్యక్తి విలియమ్ విల్బర్‌ఫోర్స్ (1759-1833) విల్బర్‌ఫోర్స్ ఇంగ్లీష్ పార్లమెంట్‌లో సభ్యునిగా ఉండేవాడు. ఆయన మారుమనసుపొందాక, చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో పరిచారకుడవ్వాలని విల్బర్‌ఫోర్స్ ఆశపడెను. కాని ఆయన స్నేహితుడైన న్యూటన్ అలా చేయవద్దని చెప్పెను. పార్లమెంట్ సభ్యునిగా ఉంటూనే ప్రభువు సేవ చేయవచ్చునని న్యూటన్ విల్బర్‌ఫోర్స్‌కు సలహానిచ్చెను.

న్యూటన్ సలహా వాస్తవమాయెను. ఆ రోజులలో ఇంగ్లండ్‌లోని దురాచారములను నిర్మూలించుటకై తన మిత్రులతో కలిసి విల్బర్‌ఫోర్స్ చాలా పనులు చేసెను. పేదలు మరియు వికలాంగులైన పిల్లలకొరకు విల్బర్‌ఫోర్స్ మరియు తన స్నేహితులు పాఠశాలను స్థాపించిరి. సువార్తీకరణ నిమిత్తమై తక్కువ ఖరీదుతో కూడుకొనిన సువార్త పత్రికలు బైబిల్‌లు ముద్రించిరి. బానిస వ్యాపార విషయములో చర్య తీసికొనుట తన విధియని విల్బర్‌ఫోర్స్ గుర్తించెను. బానిసత్వ నిర్మూలనను ఒక బాధ్యతగా దేవుడే నా భుజములపై ఉంచెనని విల్బర్‌ఫోర్స్ భావించెను.

బానిస వ్యాపారమునకు విరోధముగా క్రీ.శ. 1789లో విల్బర్‌ఫోర్స్ మొదటి గొప్ప ఉపన్యాసము చేసెను. ఆ ఉపన్యాస ఉద్దేశము నెరవేర్చబడుటకు పద్దెనిమిది సంవత్సరములు పట్టెను. కాని తుదకు బానిసత్వ నిర్మూలనను పార్లమెంట్ ఆమోదించెను. ఈ దినము విల్బర్‌ఫోర్స్‌ను గొప్ప జ్ఞాపకార్థ దినముగా నుండెను.

బానిసల వ్యాపారము నిర్మూలింపబడెను కాని బానిసత్వమింకనూ ఉండెను. ఇరవై ఆరు సంవత్సరముల పిమ్మట, 1833వ సంవత్సరములో బ్రిటిష్ సామ్రాజ్యమందంతట ప్రతి విధమైన బానిసత్వమును రూపుమాపుటకై పార్లమెంట్ సమ్మతించెను. ఇంగ్లీష్ కాలనీ ప్రాంతములన్నింటిలో నుండి బానిసలు విడిపింపబడిరి.


ఈ తీర్మానము విషయమై విల్బర్‌ఫోర్స్ అధికముగా సంతోషించెను. మూడు దినముల పిమ్మట ఆయన మరణించెను. హల్ నగరములో అనగా ఆయన జన్మస్థలములో ఒక మ్యూజియమ్ కలదు. బానిసత్వపు సమస్యలు మరియు విలియమ్ జ్ఞాపికలు భద్రపరచబడెను. మ్యూజియమ్ తోటలో ఈ గొప్ప వ్యక్తియొక్క విగ్రహము ప్రతిష్టింపబడెను.

అమెరికాలో కూడ చాలా పరిస్థితులు మారుచున్నవి. పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభంలో ఉత్తర అమెరికాలోని అనేక సంఘములు ఈ బానిసత్వపు దురాచారమును ఖండించెను. దక్షిణ రాష్ట్రములు బానిసత్వ నిర్మూలనలో ఆసక్తిని కనుబరచలేదు గనుక ఉత్తర మరియు దక్షిణరాష్ట్రముల మధ్యన వివాదము పుట్టెను. తత్ఫలితముగా 1861లో ప్రజాయుద్ధము చెలరేగెను. ఉత్తరములోని బానిసత్వమును ఖండించువారు. దక్షిణ ప్రజలను (బానిసత్వమును కోరువారు) ఓడించిరి. ఈ ఘోర పోరాటములో గొప్ప క్రైస్తవ ప్రెసిడెంట్ అయిన అబ్రహాం లింకన్ ప్రధాన పాత్రపోషించెను. అది ఆయన ప్రాణమును తీసికొనెను. బానిసత్వమును బలపరచు ఉగ్రవాది ఒకడు అబ్రహాం లింకన్‌ను చంపివేసెను. ఏదిఏమైన తుదకు 1865 సం॥లో బానిసత్వము నిర్మూలింపబడెను.

108. జేమ్స్ హడ్సన్ టేలర్ - చైనా మిషనరీ

జేమ్స్ హడ్సన్ టేలర్ క్రీ.శ. 1832 నుండి 1905 వరకు జీవించెను. ఇరవై ఒకటవ సంవత్సరము పడినపుడు ఆయన ఇంగ్లండ్ విడిచి చైనాకు వెళ్ళెను. చైనాలో ప్రభువైన యేసునెరుగని కోట్లాది ప్రజలున్నారని జేమ్స్ వినెను గనుక సమయము వ్యర్థము చేయక ప్రయాణము ప్రారంభించెను. చైనా ఖండములో ప్రతి గంటకు వెయ్యిమంది మరణించి నరకమునకు వెళ్ళుచున్నారని ఆయనకు తెలుపబడెను.

జేమ్స్ హడ్సన్ టేలర్ యొక్క తండ్రి వైద్యుడుగాను, మందులిచ్చువానిగాను మరియు సువార్తికునిగాను పనిచేయుచుండెను. ఓ ఇంగ్లీష్ మిషనరీ సొసైటీ ద్వారా జేమ్స్ మిషన్ ఫీల్డ్‌కు పంపబడెను. చైనాలోని అనేక స్థలములలో ఆయన వైద్యునిగాను, సువార్తికునిగాను కష్టించిపనిచేసెను. ఆయన పని చాలామట్టుకు నింగ్‌పో పట్టణంలో జరిగెను. చైనా ప్రజల వస్త్రధారణ అతను వేసుకొని, ఆయా స్థలములకు వెళ్ళి సువార్త ప్రకటన చేసెను. ఆయనను పంపిన మిషనరీతో తెగతెంపులు చేసికొనెను. ఎందుకు? ఏ విషయములో? మిషనరీ సొసైటి కొన్నిసార్లు అప్పుచేసి మిషనరీ జీతములిచ్చుచుండెను "డబ్బు కొదువైంది అంటే విశ్వాసము కొదువైనట్లు" అని జేమ్స్ టేలర్ చెప్పెను.



టేలర్ యొక్క జీవిత ఉద్దేశము" ప్రభువు చూచుకొనును" (ఆదికాండము 22:14)" ప్రభువు మనకింతవరకు సహాయపడెను" అని తన జీవితములో టేలర్ పదేపదే చెప్పెను (1 సమూయేలు 7:12)

ఆరోగ్య కారణమునుబట్టి ఐదుసంవత్సరముల పిమ్మట ఇంగ్లండ్‌కు తిరిగి వచ్చెను. నింగ్‌పో భాషలోనికి బైబిల్‌ను అనువాదము చేస్తూ ఇంటియొద్ద కూడ తన మిషన్ పనిని కొనసాగించెను. ఆయన చైనాకు తిరిగి వెళ్ళినపుడు కొంతమందికి తర్ఫీదునిచ్చి తనతో పాటు తీసికొని వెళ్ళెను.

క్రీ.శ. 1865లో హడ్సన్ టేలర్ ఇంగ్లండ్‌లో స్వయాన ఒక మిషనరీ సంస్థను ప్రారంభించెను. దానిపేరు చైనా ఇన్ లాండ్ మిషన్ ('సి.ఐ.యమ్'), ఈ సంస్థ క్రమేపి ప్రసిద్ధిచెందెను. క్రీ.శ.1866 లో హడ్సన్ తన భార్య పిల్లలు మరియు పదహారు జతపని వారితో చైనాకు వచ్చెను. చైనాలో హడ్సన్ యొక్క జీవితము ప్రార్థనతో మరియు అనేక ప్రార్థన ఫలితములతో నిండియున్నది! హడ్సన్ పరిశుద్ధాత్మ మరియు విశ్వాసముతో నిండుకొని దేవుని చిత్తమునకు సంపూర్ణముగా లోబడి జీవించెనని ప్రజలు ఆయనను గూర్చి చెప్పిరి.

ఇంకా వంద మంది మిషనరీలు కావాలి. ప్రార్థించమని చైనా ఇన్‌లాండ్ మిషన్‌ను కోరెను. సంవత్సరము తర్వాత ప్రార్థన ఫలితముగా వంద మంది మిషనరీలు సేవకై సిద్ధముగా నుండిరి. మరొక సంవత్సరము రెండువందల మిషనరీల కొరకై ప్రార్థించగా, రెండు వందలమంది ముందుకు వచ్చిరి.

ఈ మిషనరీలలో ఏ ఒక్కరు కూడ నిర్ణీత జీతము పుచ్చుకొనరు. ఈ సి.ఐ.యమ్, మిషనరీ సొసైటి విశ్వాస నియమములపై ఆధారపడియున్నది. అది చక్కగా ఎదిగే సొసైటి! చైనా ఇన్ లాండ్ మిషన్ మత శాఖకు చెందినది కాదు. విద్యార్హతలు అవసరము లేదు. క్రీస్తునందు యథార్థముగా విశ్వాసముంచిన, ప్రభువునకు భయపడు యౌవనస్థులను ఆ సంస్థ చేర్చుకొనెను. స్త్రీలు కూడ చేర్చుకొనబడి వారునూ మిషనరీలుగా పంపబడిరి. తత్ఫలితము ఆ మిషనరీ సొసైటిలో సగముకంటె ఎక్కువ స్త్రీలుండిరి.

చైనా సామ్రాజ్యములో వీలైనంత త్వరగా సువార్తను వ్యాపింపచేయవలెనని టేలర్ గురి కలిగి యుండెను. అందుకే మిషనరీలకు నిర్ణీత జీతములు లేవు. వారు ఎల్లపుడు సువార్తపని నిమిత్తమై ముందుకు వెళ్ళేవారు.

ప్రారంభ దినములలో ఆ సొసైటిలో మిషన్ కేంద్రములు ఉండేవి కాదు. తరువాత మిషన్ కేంద్రములు ఏర్పడెను. క్రీ.శ. 1895 నాటికి రెండు వందల అరవై కేంద్రములు ఏర్పడెను. పాఠశాలలు కట్టబడెను. స్థానిక సంఘములు స్థాపింపబడెను.

క్రీ.శ. 1895 కల్లా ఆరువందల నలభై మిషనరీలు మరియు నాలుగు వందల అరవైరెండు చైనీస్ అసిస్టెంట్‌లు మిషన్ ఫీల్డ్‌లో పనిచేయుచుండిరి. ఇరవైయవ శతాబ్ద ప్రారంభములో మిషనరీలు పనిచేయు స్థలములో తిరుగుబాటు చెలరేగెను. అనేక మిషన్ కేంద్రములు నాశనము చేయబడెను. నూట ముప్పై ఐదు మంది మిషనరీలు, వారి కుటుంబములు, వేలకొలది చైనా క్రైస్తవులు హత్యచేయబడిరి.

జరిగిన నష్టమునకు పరిహారము చెల్లించుటకు చైనా ప్రభుత్వము ముందుకు వచ్చెను గాని చైనా ఇన్ లాండ్ మిషన్ దానిని నిరాకరించెను. వారి అవసరతలు ప్రభువు తీర్చునని వారు నమ్మిరి.

చైనాపై బ్రిటిష్ చేసిన యుద్ధముల కారణాన సువార్త సేవ చాలా దెబ్బతినెను. తత్ఫలితముగా ఎంతో మంది మిషనరీలు చంపబడిరి... కాని సేవ కొనసాగెను.

టేలర్ యాభై సంవత్సరముల పాటు చైనాలో పనిచేసెను. ప్రతిదాని కొరకు ఆయన ప్రభువును నమ్మెను. మిషనరీగా తనను పిలిచిన వాడు స్వయాన ప్రభువు కాదా? ప్రభువు ఆయనను సిగ్గుపడనీయలేదు! క్రీ.శ.1905 లో టేలర్ మరణించే సరికి చైనా ఇన్ లాండ్ మిషన్‌లో ఎనిమిది వందల ఇరవై మిషనరీలు పనిచేయుచుండిరి. ప్రభువు పని ఆగక సాగెను.

109. లుడ్‌విగ్ ఇంగ్‌వెర్ నొమ్మెన్‌సెన్ - బటక్‌లోని మిషనరీ

జర్మనీలో నివసించు కాపలాదారుని కుమరుడు లుడ్‌విగ్ ఇంగ్‌వెర్ నొమ్మెన్‌సన్ (కీ.శ. 1834-1918). పదమూడు సంవత్సరముల వయసులో లుడ్‌విగ్ అనారోగ్యము పాలాయెను. నేను అనారోగ్యము నుండి కోలుకుంటే మిషనరీగా అవుతానిని లుడ్‌విగ్ దేవునికి వాగ్దానము చేసెను. ఆ విధముగా ఆయన కోలుకుని తన మాటను నిలువబెట్టుకొనెను. ఇరవైమూడు సంవత్సరములు పడినపుడు లుడ్‌విగ్ మిషనరీ కాలేజ్ వెళ్ళునట్లుగా, ఆ గ్రామములోని పరిచారకుడు లుడ్‌విగ్ జర్మనీ, ఇంగ్లీష్ మరియు లాటిన్ భాషలు నేర్పించెను.

క్రీ.శ. 1861 లో రెనిష్ మిషన్ అను జర్మన్ మిషనరీ సొసైటీ నొమ్మెన్‌సన్‌ను ఇండోనేషియాలో పనిచేయుటకై పంపెను. ఆ సమయంలో ఇండోనేషియా డచ్‌ల వలస స్థలముగానుండెను. స్థానిక తెగల మధ్యన యుద్ధము చెలరేగుతున్నందున బటక్ (సుమత్ర ద్వీపములో నివసించు ప్రజలు) వారి మధ్య పనిచేయుటకై డచ్ ప్రభుత్వము అనుమతినివ్వలేదు. ఇద్దరు అమెరికన్ మిషనరీలు అదివరకే హత్య చేయబడిరి. వారి శవములను స్థానికులు తినివేసిరి.

కాని ఏదో ఒక విధముగా నొమ్మెన్‌సన్ సుమత్ర ద్వీపమును చేరుకొనెను. ఆయన మరొక దారి ఎన్నుకొని ఒక పాత పడవలో సముద్రము దాటి వెళ్ళెను. సుమత్రలో చేరాక, నరమాంసభక్షకులు ఇంకనూ నివసించు ప్రాంతమునకు నొమ్మెన్‌సన్ వెళ్ళగోరెను. ఎందుకంటే అక్కడ మూఢాచారాలు చాలా ఉండెను. "ఈయన చేయదలచుకున్నది చాలా ప్రమాదకరముగా ఉన్నది", అని చాలా మంది మిషనరీలు అభ్యంతరము చెప్పిరి. నొమ్మెన్‌సన్ మాత్రము భయపడక అతను బయలుదేరెను.

బటక్ చేరుకునిన తరువాత నొమ్మెన్‌సన్ తనంతట తాను ఒక చిన్న ఇల్లు కట్టుకొనెను. మొద్దులు మరియు వెదురు బొంగుముక్కలతో ఇల్లు కట్టెను. ఒక దినాన బటక్ ప్రజలు కొందరు వెదరు బొంగులను నరికి వేసిరి. తెల్లవాని ఇల్లు తన తలపై కూలితే వాడు తప్పక చనిపోవును అని అనుకొనిరి. వారు అనుకొనిన విధముగా జరిగెను! అకస్మాత్తుగా భూమి కంపించెను. నొమ్మెన్‌సన్ బయటకు గబగబా బయటికి రాగా, ఆ ఇల్లు కూలిపోయెను.

నొమ్మెన్‌సన్‌కు భూతవైద్యులు అన్నములో విషము పెట్టిరి. కాని నొమ్మెన్‌సన్‌కు అస్సలేమి కాలేదు. విషము ఏ మాత్రమును ప్రభావము చూపలేదు. తరువాత భూతవైద్యుడు క్రైస్తవునిగా మారెను. బలవంతుడైన కొండ దేవునికి నరబలి ఇవ్వవలసి వచ్చెను. ఒక గొప్ప పండుగ సమయములో ఆ బలి ఇవ్వబడబోవు వాని పేరు చెప్పెదనని మాంత్రికుడు చెప్పెను. తప్పక ఆ వ్యక్తి తెల్లవాడైయుండును. ఈ వ్యక్తి సంవత్సరము కంటే పైబడి మన దేశములో కాపురముంటూ, వెళ్ళకుండా ఉన్నాడు. ఆ నరవధ దినము రాగా నొమ్మెన్‌సన్ ఆయుధములు లేకయే సాయుధులైన ద్వీప వాసుల మధ్యన నిలువబడెను. వారి బెదిరింపుల మధ్యన నిలువబడెను. అతడు తప్పక చంపబడాలి అని వత్తిడి చేస్తున్నా నొమ్మెన్‌సన్‌మాత్రము ప్రజలను ఉద్దేశించి మాట్లాడెను. అకస్మాత్తుగా మేఘములు ఉరిమెను. ద్వీపవాసులందరు అక్కడనుండి ప్రాణములను అరచేతిలో పెట్టుకొని పారిపోయిరి.


మరొక సందర్భములో నొమ్మెన్‌సన్ కాళ్ళు నరికి నదిలో పారవేయుదమని బటక్ ప్రజలు ఆలోచించిరి. నొమ్మెన్‌సన్ నవ్వి తన వయెలిన్ తీసికొని చక్కటి సంగీతము వాయించెను. గనుక ఈ విధముగా నొమ్మెన్ జీవితమునిండా ప్రమాదములు, రక్షింపబడుట అనేకములు గలవు.

మూడేండ్లు గడిచాక బటక్ ప్రజల మొదటి గుంపు అనగా నలుగురు పురుషులు, నలుగురు స్త్రీలు ఐదుగురు పిల్లలు బాప్తీస్మము తీసికొనిరి. అందుచేత క్రొత్తగా బాప్తీస్మము తీసికొనిన వ్యక్తులు వారి వంశము నుండి వెలివేయబడిరి. వారి కుటుంబస్తులు వారి ఆస్తులు లాగివేసుకొని వారిని చంపుదుమని భయపెట్టిరి. అప్పుడు వారు నొమ్మెన్‌సన్ యొద్దకు ఆశ్రయము కొరకు వచ్చిరి.

ఆయన వారికి బట్టలు, ఆహారము ఇచ్చెను. వారు ఉన్న ప్రాంతమునకు ప్రహరిగోడ కట్టి దాని చుట్టు గొయ్యి తవ్వించెను. వారు ఆ ప్రాంతములో వరి మరియు ఇతర పంటలు పండించవచ్చును. ఆ పొలములోనే చిన్న గ్రామము స్థాపింపబడెను. దానికి వ్రెడెస్‌డార్ప్ (సమాధాన గ్రామము) అను పేరు పెట్టిరి. ఇప్పుడు మిషన్ ఫీల్డ్‌లో పరిస్థితులు మెరుగుపడటము ప్రారంభించెను. పదేండ్ల కాలములో బటక్ ప్రాంతములో రెండువేల మంది క్రైస్తవులైరి. ఎనబై ఏడవ సంవత్సరములో నొమ్మెన్‌సన్ మరణించేసరికి 17,000 మంది ప్రభువును విశ్వసించి క్రైస్తవులైరి.

నలబై సంవత్సరముల తర్వాత 6,00,000 మంది క్రైస్తవులతో బటక్ క్రిష్టియన్ చర్చ్ ఇండోనేషియాలోని ప్రొటెస్టెంట్ మతశాఖలోనే అతిపెద్ద సంఘముగా మారెను. 6,00,000 క్రైస్తవులు పదకొండు వందలకంటే పైబడి సంఘములలో చేరిఉండగా వారికి ఒక వెయ్యి వాక్యోపదేశకులుండిరి. దాదాపు జనాభా అంతయూ క్రైస్తవ్యమునందున్నట్లుగా అర్థమగు చున్నది. స్త్రీలు మరియు అమ్మాయిలకొరకై బైబిల్ స్కూల్ స్థాపింపబడెను. కుష్టురోగులు, గ్రుడ్డివారు, మరియు వికలాంగుల నిమిత్తమై కూడా కాలనీ స్థాపింపబడెను.

"నొమ్మెన్‌సన్ ఓ అరుదైన వ్యక్తి" అని రెనిష్ మిషన్ చెప్పెను. బటక్ మిషన్ ఫీల్డ్‌లో ఆయన ముఖ్యుడు. ఆయన గొప్ప వ్యక్తికాదు గంభీరమైన వ్యక్తిత్వము గలవాడు కాదు కాని, యధార్థమైన విశ్వాసముగలవాడు. ఎంతో ధైర్యము, సహనము గలవాడు. లుడ్విగ్ ఇంగ్వెర్ నొమ్మెన్‌సన్‌ను మిషన్‌ఫీల్డ్‌లో పనిచేయుటకై పంపిన అతని ప్రభువు మరియు యజమానుడే ఆయనకు ఈ వరములన్నియూ ఇచ్చెను.



110. రోమన్ క్యాథలిక్ సంఘము మరియు రెండవ వాటికన్ కౌన్సిల్

క్రీ.శ. 1869 మరియు 1870 మధ్యన మొదటి వాటికన్ కౌన్సిల్‌ను గూర్చి మనము 101వ అధ్యాయములో చదువుకొంటిమి. పోప్ అధికార నిరంకుశత్వము నిర్దోషత్వము మున్నగు సంగతులను కౌన్సిల్‌లో చర్చింపబడెను.

ఒక శతాబ్దము తర్వాత అటువంటి కౌన్సిల్ ఒకటి జరిగెను. అది క్రీ.శ. 1962-1965 వరకు జరిగెను. అది రెండవ వాటికన్ కౌన్సిల్ అని పిలువబడెను. రెండవ వాటికన్ కౌన్సిల్ సర్వమత సమ్మేళనము. ఈ కౌన్సిల్ లోని చర్చ ఫలితములు, నిర్ణయములు ప్రపంచ వ్యాప్తసంఘమును ప్రభావితము చేయనైయున్నవి. ఈ మహా సంఘ సమ్మేళనము పోప్ జాన్ XXIII అధికారములోనికి వచ్చిన కొద్దినెలలకే జరిగెను. సంఘములో ఆత్మీయ ఉజ్జీవము రావలెనని ఆయన ఆశించెను. ఆధునిక ప్రపంచములో సువార్త ప్రకటనయను సంఘము యొక్క బాధ్యతను గుర్తు చేయదలచెను. అందుకే ఇటువంటి సమావేశమునకు పిలుపునిచ్చెను. ఈ కౌన్సిల్ వాటికనమ్ II, అని పిలువబడెను. ఈ కౌన్సిల్ ఇరవై ఒకటవ శతాబ్దములోని సంఘమునకు ఆత్మీయ పునాదులు వేసెను. ఈ ప్రక్రియ సంఘమును నూతన పరచుట అని పిలిచిరి. మరొక మాటలో చెప్పాలంటే సంఘమును ఆధునికరించవలెను.



క్రీ.శ. 1962 లో ప్రపంచ నలుమూలలనుండి రెండువేల ఐదువందల మంది బిషప్‌లు రోమ్‌లోని వాటికన్ నగరమునందు ఈ సభకు హాజరైరి. వృద్ధులైన బిషప్‌లకు నడచుట కష్టమాయెను గనుక కెథడ్రల్ చర్చ్ ఆఫ్ సెయింట్ పీటర్ వరకు బస్‌లో వెళ్ళిరి. సంఘ ద్వారము నొద్ద యాజకుల గాయక బృందము కీర్తనలు పాడుచుండిరి. మత గురువులు గంభీరమైన వస్త్రములు వేసికొని ఊరేగింపుగా సంఘములోనికి నడుచుచూ వచ్చిరి. తుదకు పోప్ బృందము వచ్చెను. పోప్ సింహాసనము మీద ఉండగా వారాయనను మోసికొని వచ్చిరి.

ఇతర సంఘముల ప్రతినిధులు కూడా కౌన్సిల్‌కు హాజరైరి. అప్పుడు మహా సంఘ సదస్సు ప్రారంభింపబడెను. ఏది ఏమైనా, పోప్ జాన్, తరువాయి సంవత్సరము అనగా క్రీ.శ. 1963 లో మరణించెను. ఆయన మరణించకమునుపు అన్ని సంఘములను ఉద్దేశించి ఒక పత్రమును విడుదల చేసెను. ఆత్మీయ సంగతులు అందులో ప్రధానాంశముగా ఉండెను. ఆ పత్రములో ప్రపంచశాంతికై ఆయన చాలా ప్రయత్నించెను.

క్రీ.శ.1965 వరకు పోప్‌జాన్‌పాల్ VI, కౌన్సిల్‌తో కొనసాగెను. లోకములో సంఘస్థానమును గూర్చి బిషప్‌లు పునరాలోచన చేసిరి. ఈ బిషప్‌లు కౌన్సిల్ ఫాదర్స్ అని పిలువబడిరి.

అనేక మార్పులు చేయవలెనని కౌన్సిల్ నిర్ణయించెను. స్థానిక సంఘములోని బిషప్‌లు మరియు సాధారణ సంఘప్రజల స్థానమును బలపరచబడవలసియున్నది. పోప్ యొక్క అధికారము మార్పులేక, నిరంకుశముగా నుండును! పోప్ మొదట బిషప్‌లను సంప్రదించకయే. మరియు "సంఘము యొక్క తల్లి" అని ప్రకటించెను. ఇప్పటి నుండి సంఘ కూడికలలో అనుదిన వాడుక భాష వాడవలెనని కౌన్సిల్ నిర్ణయించెను. (ఇంతకు ముందు సంఘ కూడికలలో లాటిన్ భాషవాడేవారు). సంఘమందలి సాధారణ ప్రజలపట్ల శ్రద్ధకలిగి యున్నట్లుగా ఈ పరిణామము తెలుపుచున్నది. కౌన్సిల్ ఫాదర్స్ (బిషప్‌లు) ప్రజాస్వామ్యమును వాక్ స్వాతంత్ర్యం మరియు మత స్వేచ్ఛను ప్రకటించిరి. ఇతర మతములను గౌరవింపవలెను, ఇతర క్రైస్తవ మత శాఖల పట్ల ఉదార వైఖరి చూపవలెను.

మరొకసారి, ఇట్టిమార్పులు చీలికలు విభేదములకు దారితీసెను. విషయములు విపరీత దశకు చేరుకొనెనని, ఈ ఆధునికత చాలా దూరము వెళ్ళెనని సమ్మతింపనివారు భావించిరి.

మత గురువులుగానున్నవారు బ్రహ్మచారులుగానే ఉండిపోవలెను. మార్పులు చేయుటకు పోప్ ఇష్టపడలేదు. వారు వివాహము చేసుకోకూడదు. తత్ఫలితముగా చాలామంది మత గురువులు వారి పదవికి రాజీనామా చేసిరి. బిషప్‌లయొక్క సమావేశములలో ఈ వ్యవహారములు అతివిస్తారముగా చర్చింపబడెను. సంఘకాపరత్వములలో స్త్రీలు మరియు, వివాహిత వ్యక్తులు పాల్గొనాలని బిషప్‌లలో చాలామంది కోరిరి. అటువంటి విషయములలో సంఘనాయకులకు అధిక స్వేచ్ఛ ఇవ్వబడవలెనని ఇతర బిషప్‌లు కోరిరి. పోప్ అధికారముపై ప్రశ్నలు పెరుగుతూనేఉన్నవి. ఇట్టి పరిణామములు రోమన్ క్యాథలిక్ సంఘము నందు అలజడిని సృష్టించుచున్నవి.

బయటి ప్రపంచముతో సంబంధములు పెంచుకొనే మార్గములకొరకు పోప్ అన్వేషించుచుండెను. ఆయన చెఱసాలలు మరియు ఆసుపత్రులు దర్శించెను. ఆయన ఇశ్రాయేలు, భారతదేశము మరియు తూర్పు దేశములు దర్శించెను. ఆయన విదేశ సహాయము కోరెను. ఆయన విజ్ఞప్తి చక్కగా స్వీకరింపబడెను. రోమన్ క్యాథలిక్ చర్చ్ ద్వారా నిర్వహింపబడిన ప్రపంచ యూత్ కార్యక్రమములలో ప్రస్తుతపు పోప్ అయిన బెనెడిక్ట్ XVI పాల్గొని ఆనందించెను. 2005లో కొలోన్‌లో ప్రపంచ యూత్ దినము జరిగెను. అందులో వేలాది యౌవనస్థులు కేరింతలుకొట్టి పోప్‌ను ఆహ్వానించిరి. సిడ్నీ (ఆస్ట్రేలియా) లో ప్రపంచవ్యాప్తముగా వచ్చిన యౌవనస్థుల హృదయములను పోప్ గెలుచుకొనెను. పోప్ అభీష్టము చొప్పున తరువాయి ప్రపంచ యూత్ దినము స్పెయిన్‌లో జరగాలని నిర్ణయించిరి.

111. ఈస్టర్న్ ఆర్థోడాక్స్ చర్చ్

క్రీ.శ. 1054 లో క్రైస్తవ సంఘములో జరిగిన విభజనను గూర్చి మనము 31వ అధ్యాయములో చదువుకొంటిమి. అంత వరకు సంఘము ఒకటిగా ఉండెను. ఒకటి పశ్చిమమున మరొకటి తూర్పున, రోమా సామ్రాజ్యమందలి సంఘము విడిపోయెను. అప్పటినుండి రెండు క్రైస్తవ సంఘములుండెను. తూర్పునందలి ఉన్న సంఘము గ్రీక్ క్యాథలిక్ చర్చ్ అని పిలువబడెను. దాని కేంద్రము కాన్స్టంటినోపుల్ నగరము. పశ్చిమమందలి సంఘము రోమన్ క్యాథలిక్ చర్చ్ దాని కేంద్రము రోమా నగరము. తరువాత ఈ రెండింటిని ఐక్యపరచుటకై ప్రయత్నములు జరిగెను కాని అవి ఫలించలేదు.

తూర్పునందలి సంఘమును గ్రీక్ క్యాథలిక్ చర్చ్ అని పిలుచుటకు బదులు ఈస్టర్న్ లేదా ఈస్టర్న్ ఆర్థోడ్డాక్స్ అని పిలుచుట మేలు. ఎందుకంటే ఈ సంఘము తూర్పు ఐరోపా, దక్షిణ ఐరోపా మరియు మిడిల్ ఈస్ట్‌లోను స్థాపింపబడెను. ఈ సంఘములకు ఆదిమ సంఘమైన గ్రీక్ చర్చ్‌కు అసలు సంబంధమేమియు లేకుండెను. కోట్లమంది సభ్యులతో ఈస్టర్న్ చర్చ్ చాలా ఎదిగెను. ఈస్టర్న్ చర్చ్ "వన్ హోలీ క్యాథలిక్ చర్చ్" (ప్రపంచవ్యాప్త) గా భావించెను. ఆదిమ సంఘములో ప్రతిపాదించిన సిద్ధాంతములను మాత్రమే ఈ సంఘము అంగీకరించును. సంఘము రెండుగా విడిపోకమునుపు ఆదిమ సంఘములో కౌన్సిల్స్ (మహాసభలు) జరిగెను. తరువాత ప్రతిపాదింపబడిన సిద్ధాంతములు త్రోసివేయబడెను.

ఈస్టర్న్ మరియు వెస్టర్న్ సంఘముల మధ్యన రాజకీయపరమైన వ్యత్యాసములుండెను. కౌన్సిల్ ఆఫ్ నైసియాలోని విశ్వాసపు ఒప్పుకోలునకు వెస్టర్న్ చర్చ్ ఫిలోక్యును జతచేసెను. (ఫిలోక్యు అను పదము లాటిన్ నుండి వచ్చెను. దానికర్థము కుమారుని నుండి) విశ్వాసపు ఒప్పుకోలును ఫిలోక్యును జతచేయుట ద్వారా, పరిశుద్ధాత్ముడు తండ్రి మరియు కుమారుని నుండి బయలు వెడలునని వెస్టర్న్ చర్చ్ చెప్పెను. "నేను మీకు సత్యము చెప్పుచున్నాను, నేను వెడలిపోవుట అవసరమైనయున్నది. నేను వెళ్ళినయెడల, నేను ఆయనను మీయొద్దకు పంపుదును" (యోహాను 16:7). ఈస్టర్న్ చర్చ్ దీనిని ఒప్పుకోలేదు. వారి సిద్ధాంతము ప్రకారము పరిశుద్ధాత్ముడు కుమారుని నుండి రాడు. ప్రభువైన యేసు నందు నమ్మకముంచుటకు పరిశుద్ధాత్ముడే స్వయాన విశ్వాసమిచ్చును, ఇదే పరిశుద్ధాత్ముని ప్రభువైన యేసు విశ్వాసులకు వరముగా నిచ్చును. గనుక ఈ వ్యాఖ్య విశ్వాసుల ఆత్మీయజీవితముపై ప్రభావము చూపును.

ఈస్టర్న్ ఆర్థోడాక్స్ సంఘము నందు అనేక సంఘములున్నాయి. ఈ సంఘములు నిర్వహింపబడు విధము ఒక్కొక్క దేశములో ఒక్కొక్క రకముగా నుండును. సంఘములు ఒకే విశ్వాసమును కలిగియుండును కాని ఆయా దేశములలోని సంఘములు, ఆయా లక్షణములు కలిగియుండును. పశ్చిమ సంఘము (వెస్ట్)తో పోలిస్తే ఈస్టర్న్ సంఘము అధిక ఐక్యత కలిగియుండెను. రోమన్ క్యాథలిక్ చర్చ్‌వలె ఈస్టర్న్ ఆర్థోడాక్స్ చర్చ్‌నకు పోప్ ఉండడు. నియమము ప్రకారము బిషప్‌లందరు సమాన ప్రాముఖ్యత కలిగియుందురు. వారు పాట్రియార్క్ లేదా ఆర్చ్ బిషప్ ద్వారా పరిపాలింపబడుదురు. పోప్‌వలె పాట్రియార్క్ అధికారము కలిగియుండడు, కాని సంఘ సమావేశముల (సినాడ్) పై పాట్రియార్క్ అధికారము కలిగి యుండును. 'సములైన వారిలో పాట్రియార్క్ ప్రథముడు'.


ప్రాచీన సంఘము పాట్రియార్క్‌చే పరిపాలింపబడును. పాట్రియార్క్‌లు కాన్స్టాంటినోపుల్, అలెగ్జాండ్రియా మరియు యెరూషలేమునందు ఉన్నారు. ఇటీవలి పాట్రియార్క్‌లు మాస్కో (రష్యా), రుమేనియా మరియు సెర్బియాలలో ఉండిరి. గ్రీస్ మరియు ఆల్బేనియాలలో ఈస్టర్న్ ఆర్థోడాక్స్ కలదు. పశ్చిమ ఐరోపా, అమెరికా, చైనా మరియు జపాన్‌లలో అధిక సంఖ్యలో ఆర్థోడాక్స్ క్రైస్తవులుందురు. ఆఫ్రికా మరియు ఇండోనేషియా మరియు కొరియాలలో ఆర్దొడాక్స్ "మిషనరీ చర్చ్స్" కలవు.

క్రీ.శ.1054 కంటే ముందు వెలసిన ప్రాచీన ఆర్దొడాక్స్ చర్చెస్ కలవు. ఈ సంఘములు సిరియాలో –

సిరియన్ ఆర్థొడాక్స్ చర్చ్‌యని, ఈజిప్ట్‌లో – కాప్టిక్ చర్చ్ అని ఆర్మేనియాలో – ది అపోస్టలిక్ చర్చ్ అని పిలువబడెను.

ఫిలోక్సు సమస్యతోపాటు పోప్ నిరంకుశత్వమును కూడ ఈస్టర్న్ ఆర్థొడాక్స్ చర్చ్‌లు తిరస్కరించును. మతగురువులు వివాహమాడవచ్చును కాని బిషప్‌లు కాదు. సన్యాస ఆశ్రమముల నుండి బిషప్‌లు ఎన్నుకొనబడిరి గనుక వారు. అవివాహితులు. ఈస్టర్న్ ఆర్థోడాక్స్ చర్చ్ మరియు రోమన్ క్యాథలిక్ చర్చ్‌లకు పెద్దగా వ్యత్యాసములేమి లేవు. అందుకే "ఈస్టర్న్ ఆర్థొడాక్స్ మరియు రోమన్ క్యాథలిక్‌ల సంబంధము అక్కచెల్లెళ్ళ వంటి సంబంధము" అని ఈస్టర్న్ ఆర్థోడాక్స్ దేవజ్ఞాన శాస్త్రి చెప్పెను.

ఇప్పుడు మనము రష్యాలోని సంఘమును గమనిద్దాం. క్రీ.శ. 988లో రష్యన్ చర్చ్ ఏర్పడెను. క్రైస్తవ్యము దేశపు అధికార మతముగా స్వీకరింపబడినపుడు ఇది జరిగెను. క్రీ.శ.1054 లో కాన్‌స్టంటినో పుల్‌తో పాటు రష్యన్ చర్చ్‌కూడా రోమ్ నుండి విడిపోయెను. తరువాత కాన్‌స్టంటినోపుల్ యొక్క పాట్రియార్చేట్ నుండి కూడ రష్యన్ చర్చ్ విడిపోయెను. అప్పటి నుండి క్రీ.శ.1917 వరకు రష్యన్ సంఘము స్వతంత్ర్యము గాను దేశఅధికార సంఘము గాను ఉండెను. రష్యన్ చర్చ్ సంఘ సమావేశములు (సినాడ్) ద్వారా పరిపాలింపబడెను. కమ్యూనిస్ట్‌ల కాలములో సంఘము ఎంతో హింసింపబడెను (క్రీ.శ. 1917 విప్లవము తర్వాత కమ్యూనిస్ట్‌లు అధికారములోనికి వచ్చిరి). క్రీ.శ.1990 తర్వాత క్రొత్త సన్యాస ఆశ్రమములు మరియు సంఘభవనములు కట్టబడుటకు సంఘము అనుమతింపబడెను. మరొకసారి పాఠశాలలో మత విద్య బోధన అనుమతింపబడెను.



112. లూథరన్ చర్చ్

4 6 అధ్యాయము చూడుము, మార్టిన్ లూథర్ బోధలను బలపరచిన వారు లూథరన్స్ అని పిలువబడిరి. కాల్విన్ బోధలను బలపరచినవారు కాల్వినిస్ట్లని పిలువబడిరి. సంఘ ఉద్యమములో కాల్వినిజమ్ తర్వాత లూథరనిజమ్ ముఖ్యమైనది. ప్రపంచవ్యాప్తముగా అన్ని దేశములలోనికి లూథరనిజమ్ వ్యాపించెను. ప్రపంచవ్యాప్తముగా ఎనభైకోట్ల లూథరన్లు ఉంటే ఒక్క జర్మనిలోనే ఇరవై ఐదుకోట్ల లూథరన్లు ఉన్నారు. ఉత్తర యూరప్, ఆఫ్రికా, భారతదేశము, చైనా, అమెరికా, ఆస్ట్రేలియా మరియు ఇండోనేషియాలలో లూథరన్ సంఘములు కలవు. స్కాండినేవియాలో లూథరన్ సంఘము అధికారిక రాష్ట్రసంఘముగా నుండెను. సంఘసంస్కరణ సమయములోనే, తూర్పు యూరప్లో అనేక లూథరన్ సంఘములు చాలా ఏర్పడెను. కాని రెండు ప్రపంచయుద్ధములు జరిగినందున సంఘములు చాలా శ్రమపడెను.

లూథరన్ మరియు లూథరనిజమ్ అను పదములను మొదట లూథర్ విరోధులు వాడిరి. "లూథరన్ల తెగ" అని చెబుతూ ఈ ప్రజలు సంఘసంస్కరణ అని పిలిచి ఉద్యమమునకు ప్రాతినిధ్యము వహించిరి. లూథర్ అనుచరులు లూథరన్ మరియు లూథరనిజమ్ అనుపదముల వాడుకను ఒప్పుకోలేదు. తన పేరుతో సంఘమును ప్రారంభించు తలంపు లూథర్కు అసలే లేకుండెను.

గనుక లూథర్ బోధలను బలపరచువారు. 'ఆగ్స్బర్గ్ ఒప్పుకోలును బలపరచు సంఘములని పిలువబడుటకు ఇష్టపడిరి. తరువాత మళ్ళీ లూథరినిజమ్ అను పేరు వచ్చెను. లూథరన్ సంఘ సహవాసములను లేదా స్వయాన లూథర్ను సూచిస్తూ అట్టి పదము వచ్చెను.

'ఆగ్స్బర్ ఒప్పుకోలులో' ఏమున్నది? క్రీ.శ. 1530లో ఆగ్స్బర్గ్లో లూథరన్ సమావేశములో (డైయట్ – పార్లమెంట్) వారి విశ్వాస తీర్మానమును ప్రతిపాదించిరి. లూథర్ యొక్క ప్రత్యేక స్నేహితుడైన మెలాంక్తన్ ఆగ్స్బర్గ్ విశ్వాసపు ఒప్పుకోలును వ్రాయుటలో ముఖ్యపాత్ర వహించెను. లూథరన్ బోధ ఇరవై ఐదు ప్రకరణలుగా చేయబడెను. విశ్వాసపు ఒప్పుకోలులో ఇది మొదటి భాగము. రెండవ భాగములో రోమన్ సంఘములోని దురాచారాలు ప్రస్తావింపబడెను. లూథర్ మరియు మెలాంక్తన్ రోమన్ క్యాథలిక్ సంఘముతో ఇంకనూ సమాధాన పడుటకు ప్రయత్నించిరి గనుక ఆ విశ్వాసపు ఒప్పుకోలులో మృదువైన పదములను వాడిరి.

యాభై సంవత్సరముల తర్వాత "బుక్ ఆఫ్ కాంకర్డ్" అను పుస్తకము ప్రచురింపబడెను. లూథరన్స్లో విబేధములు చాలా ఉండెను. గనుక సమైక్యత భావము కొరకై ఆ పుస్తకములో తెలుపబడెను. బుక్ ఆఫ్ కాంకర్డ్లో లూథరన్ సంఘముయొక్క విశ్వాసపు ఒప్పుకోలు, ఆగ్స్బర్గ్ ఒప్పుకోలు, మరియు ఆదిమ సంఘము విశ్వాసపు ఒప్పుకోలు లూథర్ యొక్క క్లుప్త మరియు వివరమైన విశ్వాసబోధిని, పోప్ అధికారముపై మెలాంక్తన్ వ్రాసిన శీర్షికలు మొదలగునవి ఉండెను. లూథరన్ సంఘములన్నియూ బుక్ ఆఫ్ కాంకర్డ్లోని నమ్మకములను నియమములను పాటించును.

లూథరన్స్ మరియు కాల్వినిస్ట్లు కలిసియుండక పోవుట ఎంత విచారము! పదహారవ శతాబ్దములోని రెండవ భాగములో ఈ రెండు పార్టీలు విపరీత వాదములు కలిగియుండిరి. ప్రభురాత్రి భోజనమును గూర్చి వారు సమ్మతింపలేకపోయిరి. ప్రభురాత్రి భోజనములోని రొట్టె మరియు ద్రాక్షారసములో ప్రభువైన యేసు నిజముగా అనగా రొట్టెలో తన శరీరము మరియు ద్రాక్షారసములో రక్తము ఉండునని వారు భావించిరి. యేసు ఆరోహణమయ్యాక ఆయన అంతట ఉండుట సాధ్యమని లూథర్ చెప్పెను. ఈ విషయములో కాల్వినిస్ట్లు లూథర్ను ఒప్పుకోలేదు.

జర్మనీలోని లూథరన్ సంఘములో కొన్ని శతాబ్దముల పాటు లాండెస్కిర్చెన్లు అధిక సంఖ్యలో ఉండిరి. (లాండెస్ కిర్చెన్ = జర్మని దేశపు స్వతంత్ర

సంఘములు) ఈ రాష్ట్రపాలకులు సంఘవిషయములపై ఎంతో ప్రభావమును కలిగియుండిరి. తరువాత ఆత్మీయనాయకత్వము బిషప్‌కు అప్పగింపబడెను. కొన్నిసార్లు సంఘము (సినాడ్ = ధర్మసభ) ద్వారా పరిపాలింపబడెను.

క్రీ.శ.1948లో జర్మనిలోని లూథరన్ సంఘములు కలిసి యునైటెడ్ ఇవాంజెలికల్ చర్చ్ ఆఫ్ జర్మనీగా ఏర్పడెను. ఇటీవల సంఘాధిపతులు గణనీయముగా ఉండెను. సంఘములో పనిచేయుటకు ఇష్టపడువారు కొదువైరి. సాధారణముగా చూస్తే సమాజము ప్రత్యేకముగా పిల్లల పెంపకము క్రైస్తవ ప్రభావము లేకయే ఉండిరి.

క్రీ.శ. 1923లో లూథరన్ వరల్డ్ స్థాపింపబడెను. లూథరన్ సంఘములలో చాలామట్టుకు ఐక్యత కలిగెను. జెనీవాలోని ప్రధాన కార్యాలయము నుండి ఫెడరేషన్ వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్‌తో కలిసి పనిచేసెను. ఈ రెండు సంస్థలు కలిసి చాలా పనిచేసెను. వాటిలో పేదరిక చర్చ్ సువార్తను ప్రోత్సహించెను. ఆఫ్రికా, దక్షిణ అమెరికాలలో సంఘములు స్థాపింపబడెను. సువార్త పనిద్వారా ముఖ్యముగా అనేక సంఘములు స్థాపింపబడెను.



113. మెథడిస్ట్ చర్చ్

ఇంగ్లండ్ మరియు అమెరికాలలో చెలరేగుతున్న ఉజ్జీవ ఉద్యమములను గూర్చి 81వ అధ్యాయములో మనము చదువుకొంటిమి. ఈ ఉద్యమములలో పాల్గొనిన ముఖ్యవ్యక్తులైన ఇద్దరు ఇంగ్లిష్ బోధకులను గూర్చి అనగా జార్జ్ విట్‌ఫీల్డ్ మరియు జాన్ వెస్లీల యొక్క జీవితములను గూర్చి మరియు వారి పనిని గూర్చి చదివెదము. వారు మరియు వారి మిత్రులు వారి జీవితములను సరిదిద్దుకునే (మెథడ్) పని చేసిరి గనుక వెస్లీ మరియు విట్‌ఫీల్డ్‌లను ఎగతాళి చేస్తూ వారికి మెథడిస్ట్‌లని మారుపేరు పెట్టిరి. అనారోగ్యము గల వారిని మరియు చెఱలో ఉన్నవారిని శ్రద్ధగా చూచుకొనుచూ వారి సమయమును ఉపవాసము మరియు ప్రార్థన ధ్యానముల యందు గడిపిరి. వెస్లీ మరియు తన అనుచరులు అది వాస్తవమని ఆ మారుపేరును స్వీకరించిరి. మేము దేవుని వాక్య నియమముల ప్రకారము జీవింపగోరుచున్నాము గనుక మేము మెథడిస్ట్‌లమని చెప్పిరి.

ఆ విధముగా పద్దెనిమిదవ శతాబ్దములో మెథడిస్ట్ ఉద్యమము పుట్టెను. ఈ క్రింది పారగ్రాఫ్‌లలో ఈ ఉద్యమ వ్యాప్తిని గూర్చి మనము చదువ బోవుతున్నాము.


ఆ కాలములో ఉన్న చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లోని నిర్జీవ సాంప్రదాయ భక్తికి ప్రతి చర్యగా మెథడిజమ్ ప్రారంభింపబడెను. సంఘము దిగజారిన స్థితిలో ఉండెను. మానవుని పాపము మరియు దేవుని కృపను గూర్చి గాక మంచి క్రియలు మరియు నీతి జీవితమును గూర్చి మాట్లాడుతుండేవారు. వాటి ప్రస్తావనే లేదు. బాప్తీస్మమిస్తే ఒక బిడ్డ ఆటోమ్యాటిక్‌గా "తిరిగి జన్మించును" అని ప్రజలు భావించిరి (యోహాను 3:3)

అశ్రద్ధ వైఖరి దేశములో చాలా నెలకొనియుండెను. అజ్ఞానము మిక్కుటముగా ఏలుతుండెను. ఆ సమయములో ప్రభువు సహాయమువలన శక్తివంతమైన బోధను ప్రారంభించిరి. ప్రభువు దీవెనల ఫలితముగా మృతతుల్యత నాశనము నెలకొనిన స్థలములో ఆత్మీయ ఉజ్జీవము బయలుదేరెను. క్రొత్త మత శాఖను ప్రారంభించుట విట్‌ఫీల్డు మరియు వెస్లీల ఉద్దేశ్యము కాదు. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో బోధించుటకు వారికి అనుమతి లేనందున వారు ఒక మత శాఖను ప్రారంభింపవలసి వచ్చెను. ఆ విధముగా మెథడిస్ట్ సంఘము ప్రారంభింపబడెను. విట్‌ఫీల్డ్ వెళ్ళి అమెరికాలో బహిరంగముగా బోధింపగా ఆ దేశములో కూడ గొప్ప ఉజ్జీవము మొదలయ్యెను.

పశ్చాత్తాపపడి సువార్తను విశ్వసింపమని వారి శ్రోతలను హెచ్చరించుటలో వాడిన మెథడ్ (పద్ధతి)ని బట్టి మెథడిజమ్ అను పేరు వచ్చెను. నేరుగా సువార్త బోధించు శైలి మెథడిస్ట్‌లకున్నది. గత పాతజీవితముతో ఖచ్చితముగా తెగతెంపులు చేసికొనుమని వారు ప్రజలను వేడుకొనిరి. శ్రోతలు తమ జీవితమును రక్షకుడును ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచునట్లుగా పాపమునకు విరోధముగా దేవుడు కలిగియున్న ఉగ్రతను గూర్చి, నరకపు మంటలను గూర్చి మాట్లాడి, పరిచారకులు వారి హృదయములలో లోతైన దోష భావమును పుట్టించిరి. ఇది వారి జీవితములో నిజమైన మార్పు కలుగజేయవలెను. లోక సుఖములైన త్రాగుడు మాని, నిజమార్పును వారు ప్రదర్శింపవలెను.

ఒప్పింపబడిన కాల్వినిస్ట్‌గా (రోమా 8:29-30) ప్రకారము ఏర్పరచబడుట అను సిద్ధాంతమును నమ్మెను. వెస్లీ అసలు ఈ అంశమును ప్రస్తావించుటకే ఇష్టపడలేదు. కృపను చూపుటకు లేదా చూపకపోవుటకు దేవుడు స్వేచ్ఛ కలిగియున్నాడని విట్‌ఫీల్డ్ చెప్పెను. తనకిష్టము వచ్చినట్లు ఆయన ఎక్కడైనా ఎప్పుడైనా పనిచేయును. ఒక ప్రసంగము బోధింపబడినపుడు వారి స్వచిత్తము చొప్పున క్రీస్తు కొరకై తీర్మానము చేయుస్థితికి తీసుకునిరావాలి. అందువలన ఉజ్జీవ ఉద్యమములో చీలిక ఏర్పడెను. రెండు వేర్వేరు మెథడిస్ట్ గుంపులు ఏర్పడెను.

వారికి వ్యత్యాసములున్నా ఈ ఇరువురు దేవుని సేవకులు ఒకరితో ఒకరు చక్కటి సంబంధము కలిగియుండిరి. పరలోకములో వెస్లీని చూచెదవా అని విట్‌ఫీల్డ్‌ను అడిగితే, నాకేమి భయంలేదు. ఎందుకంటే వెస్లీ దేవుని సింహాసనమునకు చాలా సమీపముగానుండును. నేను దానికి దూరముగా ఉందును గనుక ఆయనను చూచుట అసాధ్యముగానుండును అనెను. విట్‌ఫీల్డ్



మరణించినపుడు, ఆయన భూస్థాపన సమయములో, విట్‌ఫీల్డ్ యొక్క స్నేహము సున్నితమైనది, ధారాళమైనదని వెస్లీ చెప్పెను. మెథడిస్ట్‌లు బైబిల్‌తోపాటు అపొస్తలుల విశ్వాసమునకు బైబిల్ మాత్రమే పునాదిగా ఉండును. వారు ఆత్మీయ పరిపూర్ణతకై పోరాడుదురు మరియు బైబిల్ సత్యమును వ్యక్తిగతముగా అనుభవించుటను గూర్చి ఎక్కువగా నొక్కివక్కాణింతురు.


ఇటు ఇంగ్లండ్ మరియు అమెరికాలలో సంఘజీవితము మరియు ఆత్మీయ అభివృద్ధిని గూర్చి మెథడిజమ్ గొప్ప ప్రభావమును చూపెను. ప్రత్యేకముగా అమెరికాలోని సంఘజీవితములో మెథడిస్ట్‌లు చాలా ముఖ్యమైన పాత్ర వహించిరి. మొదట ఇంగ్లండ్‌లో ఈ ఉద్యమము ప్రారంభమైనా, అమెరికాలో మెథడిస్ట్ సంఘమునకు ప్రోద్బలము కలదు మరియు ఈ సంఘము ఆ దేశములో ఎంతో ప్రభావమును చూపెను.

ఉజ్జీవ ఉద్యమ ఫలితముగా ప్రజాజీవనములో గొప్ప మార్పులు చోటు చేసికొనెను. మెథడిస్ట్‌లు సమాజమునుండి వెలివేయబడిన వారిని మరియు పేదవారిని శ్రద్ధగా చూచుకొనిరి. క్రీ.శ. 1807 లో వెస్లీ బానిస వ్యాపారమును ఖండించి దానికి వ్యతిరేకముగా పోరాడెను. ఆయన మరణించిన అరవైయేండ్లకు బానిసత్వమును నిషేధిస్తూ పార్లమెంట్‌లో చట్టము చేయబడెను.

మిషన్ ఫీల్డ్‌లో మెథడిస్ట్ మతశాఖ చాలా కష్టించి పనిచేసెను. ఆసియా, ఆఫ్రికా మరియు దక్షిణ అమెరికా మున్నగు దేశములలో మెథడిస్ట్ సంఘములు ఏర్పడెను. ప్రపంచ వ్యాప్తముగా ఇరవై ఐదుకోట్ల మెథడిస్ట్‌లు ఉన్నారని అంచనా వేయబడెను.

114. బాప్టిస్ట్ చర్చ్

ముంచుట అనునది గ్రీకు పదము యొక్క అర్థము. ఆ గ్రీక్ పదము నుండి బాప్టిస్ట్ అను పదము వచ్చెను. ప్రొటెస్టెంట్ సంఘములలో అనేకులు బాప్టిస్ట్ నియమములను అనుసరించిరి. దేవునివైపు తిరిగి ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచిన వారికి బాప్టిస్ట్ సంఘములలో బాప్తిస్మమిస్తారు. నదిలోగాని సంఘ బాప్తిస్మ తొట్టిలో గాని (బాప్టిస్టి) బాప్తిస్మమిస్తారు. బాప్తిస్మ తొట్టిలో నీటిని నింపి, బాప్తిస్మము తీసికునే వ్యక్తిని ముంచి పరిచారకుడు బాప్తిస్మమిచ్చును. ఒక వ్యక్తి ముంచుటద్వారా బాప్తిస్మము తీసికుంటే ఆ వ్యక్తిని బాప్టిస్ట్ అని పిలుతురు. ఒక వ్యక్తి తన విశ్వాసమును బహిరంగముగా వ్యక్తపరచినపుడు బాప్తిస్మమివ్వబడును. శిశువులు ఆ చిన్నవయసునందు ప్రభువైన యేసునందు విశ్వాసముంచలేరు గనుక బాప్టిస్ట్‌వారు శిశువులకిచ్చు చిలకరింపు బాప్తిస్మమును తిరస్కరింతురు. బాప్టిస్ట్ ఉద్యమములోని సంఘములు వేర్వేరు భేదాభిప్రాయములు కలిగియుందురు. సాంప్రదాయ, బైబిల్ ఆధారిత సంగతులను నమ్మేవారున్నారు మరియు స్వేచ్ఛా వాదులును ఉన్నారు. ఇంగ్లండ్‌లో బాప్టిస్ట్ ఉద్యమమును పరీక్షించినపుడు ఈ వ్యత్యాసములను మనము గమనించెదము.



యాభై నాలుగుమంది ముంచుటద్వారా బాప్తిస్మము తీసికున్నపుడు లండన్‌లో క్రీ.శ.1640 లో మొదటి బాప్టిస్ట్ చర్చ్ స్థాపింపబడెను. కొద్ది సంవత్సరముల తర్వాత ఏడు సంఘములు ఏర్పడెను. కాని ఈ సంఘములు ఎందుకు ఏర్పడెను? ఒక బిడ్డ బాప్తిస్మము తీసికొనినపుడు ఆమె/అతడు తిరిగి జన్మించును. ఇట్టి విషయమును చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ బోధించును (అధికారిక సంఘము) చిన్న బిడ్డలు బాప్తీస్మక్రమములో ఈ విషయములు స్పష్టముగా ప్రస్తావింపబడెను. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ పరిచారకులందరు ఈ సంగతులను విశ్వసింపరు. బైబిల్ ఇలా బోధించుట లేదు. "తిరిగి జన్మింపజేయువాడు" పరిశుద్ధాత్ముడే. బాప్తిస్మము ద్వారా ఒక బిడ్డ తిరిగి జన్మించునని బోధిస్తే, పరిశుద్ధాత్మ అవసరత ఎక్కడ? అందుకే చాలామంది శిశుబాప్తీస్మమును తిరస్కరించి విశ్వాసుల బాప్తిస్మమును బలపరచిరి. బాప్టిస్ట్‌లపై చర్చ్ అఫ్ ఇంగ్లండ్ చట్టబద్ధ చర్య తీసికునెను. బోధకులనేకులు జైల్‌లో వేయబడిరి. బాప్టిస్ట్‌లలో దేవునికి భయపడువారు అనేకులుండిరి. జాన్ బన్యన్ మరియు చార్లెస్‌స్పర్జన్ ఈ ఇద్దరు పరిచారకులు పేరు, ప్రసిద్ధిగాంచిన బాప్టిస్ట్ పరిచారకులు.

జాన్ బన్యన్‌కు అంతగా చదువులేదు. (క్రీ.శ.1628-1688) క్రీ.శ.1653 లో బెడ్‌ఫోర్డ్‌లో 'ముంచుట ద్వారా బాప్టిస్ట్ చర్చ్ నందు చేర్చుకొనబడెను. క్రీ.శ. 1658లో అతడు లైసెన్స్ లేకయే బోధించుచుండెను. అందుకు ఆయనను చెఱసాలలో వేసిరి. దాదాపు పదమూడు సంవత్సరములపాటు ఆయన అందులో ఉండెను. "యాత్రికుని ప్రయాణము" అను ప్రసిద్ధిగాంచిన పుస్తకమును చెఱసాలలో ఉంటూ వ్రాసెను. తన అంతరంగ జీవితమును చర్చించు పుస్తకము "ప్రధాన పాపుల పట్ల విస్తరించుచున్న కృప" అను ఇతర పుస్తకములు ఎన్నో వ్రాసెను. (క్రీ.శ.1666)

నీటి బాప్తిస్మము దేవుని ఆజ్ఞ అని విశ్వసించినా, దానిని విగ్రహముగా చేయుటను ఆయన తిరస్కరించెను. విశ్వాసుల బాప్తిస్మము ఆచరింపని వారితో దానిని ఆచరించువారు సహవాసము చేయలేరు. అలా సహవాసము చేయని వారితో జాన్‌బన్యన్ సమ్మతింపలేదు. లండన్ ప్రయాణములో ఉండగా తీవ్రమైన జలుబుతో క్రీ.శ.1688 ఆగస్ట్ 31న మంచు కొండపై తన స్నేహితుని ఇంటిలో మరణించెను. లండన్‌లోని బన్‌హిల్ ఫీల్డ్‌లోని సమాధుల తోటలో ఆయన సమాధి కలదు.

మెట్రోపాలిటన్, టాబర్నకిల్ బాప్టిస్ట్ చర్చ్ లండన్‌లో చార్లెస్ హడ్డన్ స్పర్జన్ (క్రీ.శ.1834-1892) ప్రవీణుడైన బోధకునిగా పని చేసెను. బైబిల్ యొక్క రిఫామ్డ్ సత్యములను చేపట్టే వేలమంది సభ్యులుగల సంఘములకు వ్యాకపరిచర్య చేసెను. ఆయన పుస్తకములు వ్రాసెను, చారిటబుల్ సంస్థను మరియు మినిస్టర్స్ కాలేజ్ స్థాపించెను. తరువాత ఆ కళాశాల 'స్పర్జన్స్ కాలేజ్' అని పిలువబడెను. బన్యన్‌వలె స్పర్జన్ వ్యక్తిగత విశ్వాసము మరియు అనుదిన పరిశుద్ధత మున్నగు సంగతులను దృష్టిపెట్టి ఆచరించి బోధించేవాడు. బాప్తీస్మముపై వారికున్న స్వంత అభిప్రాయముల విషయములో రాద్ధాంతము చేయలేదు.

యూరప్‌లో శ్రమపడు అనేక బాప్టిస్ట్‌లు పద్దెనిమిదవ శతాబ్దములో ఆశ్రయముకై ఉత్తర అమెరికాకు వెళ్ళగా, బాప్టిస్ట్ బోధలు అక్కడ కూడ వ్యాపించెను. అమెరికాలో బాప్టిస్ట్ సంఘము అతిపెద్ద ప్రొటెస్టెంట్ మతశాఖగా మారెను. ఈ రోజున అమెరికాలోని బాప్టిస్ట్ సంఘములో నలభై ఏడు కోట్ల సభ్యులున్నారు. బాప్టిస్ట్ మతశాఖ శాఖోపశాఖలుగా విడిపోయెను. క్రీ.శ.1845 లో సువార్త పని నిమిత్తమై సొసైటీలు ఏర్పడెను. ఉదాహరణకు సదరన్ బాప్టిస్ట్ కన్వెన్షన్ చాలా పెద్దది దాని సిద్ధాంతము సాంప్రదాయబద్ధమైనవి. బాప్టిస్ట్‌లు సువార్త పని ద్వారా అనేక ప్రపంచ దేశములలో వ్యాపించిరి. భారతదేశములో రెండుకోట్ల కంటే పైబడి బాప్టిస్ట్‌లు మరియు నైజీరియా (ఆఫ్రికా) దాదాపు రెండు కోట్ల బాప్టిస్ట్‌లు గలరు.

మన ప్రభువైన యేసు రాజ్యములో బాప్టిస్ట్‌లు కూడ స్థానము కలిగియున్నారని మనము చూడవచ్చును.

115. విలియమ్ బూత్ మరియు సాల్వేషన్ ఆర్మీ

సాల్వేషన్ ఆర్మీ పంతొమ్మిదవ శతాబ్దములో స్థాపింపబడెను. అప్పటి సమాజములో, పేదరికము మరియు అణగారిన తనము చాలా ఉండెను. గనుక అట్టివారికి సువార్త అందించు ఉద్దేశముతో సంఘముగా గాక సంస్థగా అది ప్రారంభింపబడెను.

విలియమ్ బూత్ క్రీ.శ.1829 నుండి 1912 వరకు జీవించెను. ఆయన బాల్యములో పేదరికముననుభవించెను. లండన్‌లో విలియమ్ 'బానిసవలె' పనిచేసెను.ఆయన పద్నాలుగు సంవత్సరముల వయసులో ఉండగా విలియమ్ మరియు ఆయన మిత్రుడు సువార్త పనిచేసిరి. వారిరువురు బహిరంగ కూడికలు జరిపిరి. ఒక ఆదివారము మురికి వాడలలోని పేద ప్రజలను విలియమ్ సమకూర్చి వారిని సంఘమునకు తీసుకువెళ్ళెను. తన అతిథులను (పేదవారిని) తీసుకుని వేదికకు దగ్గరగా కూర్చుండబెట్టెను. కాని ఆ సంఘకాపరికి అది నచ్చలేదు. మురికిగానున్న ఆ వ్యక్తులు అంత ముందు స్థలములో కూర్చోవటం ఆయనకిష్టము కాలేదు. పేదవారికి సంఘములో అనుమతి కలదు కాని వెనుక ఉన్న ద్వారము ద్వారా రావాలి. బూత్ వారి వెనుక కూర్చోవాలి.

విలియమ్ సువార్తపనిని కొనసాగించెను. తరువాత ఆయనకు వివాహము జరిగెను. ఆయన భార్యతో కలిసి విలియమ్ మురికివాడలలోని ఇండ్లు దర్శించేవాడు. వారు కఠిన వ్యక్తులు, జూదము ఆడు ప్రజలు, జీవితమంటే లెక్కలేని ప్రజలు, త్రాగుబోతులైనవారి యొద్దకు వెళ్ళేవారు. క్రుంగిన స్త్రీల యొద్దకు, ఒంటరిగా నుండి క్రుంగిన స్త్రీల యొద్దకు, ఆకలితో ఒకపూట ఆహారం కోసం ఎదురు చూచు స్త్రీల యొద్దకు విలియమ్ మరియు అతని భార్య వెళ్ళేవారు. వారు దర్శించు స్థలములు త్రాగుబోతులు అల్లరిచేసి కొట్లాడే స్థలములుగాను శపించుట దూషించుటయునూ అక్కడ ఉండెను. అట్టి ప్రజలకొరకు విలియమ్ సంగీత కార్యక్రమములు నిర్వహించి వారిని ఆకర్షించేవాడు. బైబిల్ సందేశము బోధింపబడు గదికి ఆయన వారిని ఆహ్వానించేవాడు. నశించిన దానిని వెదకి రక్షించుటకై యేసు వచ్చెనని క్రీస్తు ప్రేమను గూర్చి ఆయన వారికి బోధించేవాడు.

విలియమ్ బూత్ శ్రమలు, నిందలు బాధలు అనుభవించినా పట్టువిడువలేదు. అనేకులు పాపపు మురికి నుండి విడిపింపబడిరి, త్రాగుబోతులు త్రాగుడు మానివేసిరి మరియు దొంగలు దొంగతనము ఆపివేసిరి.

బూత్ సంఘమును గాక సైన్యమును ప్రారంభింప దలచెను. రేయనక, పగలనక, పాపముతో మరియు దయ్యములతో పోరాడు సైన్యము. ఎఫెసీ పత్రిక ఆరవ అధ్యాయములో దేవుడిచ్చు సర్వాంగ కవచము ప్రస్తావింపబడియున్నది.

క్రీ.శ.1865లో బూత్ సైన్యమును నిర్వహించెను. ఈ సంస్థ తరువాత సాల్వేషన్ ఆర్మీయని పిలువబడెను. విలియమ్ సైన్యనాయకునిగా ఉంటూ జనరల్ పదవి కలిగియుండెను ఆయనక్రింద ఆయన భార్య అడ్జుటంట్‌గానుండెను. ఆయన కుమార్తె ఉన్నత అధికారిగాను తన కుమారుడు జనరల్ స్టాఫ్‌కు చీఫ్‌గా ఉండెను. ఆయన క్రింద లెఫ్టినెంట్, కల్నల్స్, మేజర్స్, క్యాప్టన్స్, సైనికులు ఉండిరి. బూత్ అనుచరులందరికి యూనిఫామ్ ఇవ్వబడెను. వారి మీటింగ్ స్థలము 'సిటడెల్' (కోట) అని పిలువబడెను. ఒక పత్రికకు విలియమ్ బూత్ సంపాదకునిగా నుండెను. ఆ పత్రిక పేరు "వార్‌క్రై (యుద్ధపోరు).

పురుషులు మాత్రమే గాక స్త్రీలు కూడ సైన్యములో చేరిరి. ఎవరైనా ఈ సైన్యములో చేరదలచినట్లయితే వారు గతపాప సంకెళ్ళను తెంపి వేయాలి మరియు ప్రభువు యెదుట మోకాళ్ళుని వారి పాపములు ఒప్పుకోవాలి. వారు కూడికలకు క్రమముగా హాజరు కావాలి. అంతమాత్రమే గాక వీధులలోనికి వెళ్ళి 'ఆత్మలను సంపాదించాలి' వారి కూడికలలో బోధించు బోధకుడు శ్రోతల భావోద్రేకముల విషయమై పాటుపడును. వారి హృదయములలో దోష భావమును రగులజేసి, యేసునందు విశ్వాసముంచుమని ఆయన వారిని


బ్రతిమాలును. "విశ్వాసము దేవుని వరము" అను సంగతి త్వరలోనే మరువబడెను.

వారి సమావేశములలో ఉజ్జీవ కీర్తనలు పాడబడెను. వారి సమావేశములలో విరివిగా సంగీతము, చప్పట్లు కొట్టుట, హృదయపూర్వకముగా 'హల్లెలూయ' అని కేకలు వేయుట ఉండును. సాంఘిక సంక్షేమము మరియు సువార్త ప్రకటన అవినాభావ సంబంధము కలిగి యుండెను. త్రాగుడు ఎక్కువగా నున్న స్థలములకు సాల్వేషన్ ఆర్మీ సైనికులు వెళ్ళి దర్శించేవారు. వారు వ్యభిచార గృహములను దర్శించేవారు.

క్రీ.శ.1890లో బూత్ ఒక పుస్తకము వ్రాసి అందులో ఇళ్ళులేని వారి బాధలు, చేయుటకు పనిలేని వారి గతి, నేరస్థుల బాధలు వర్ణించెను. అదియూగాక భక్తిహీన కుటుంబములలో జన్మించిన పిల్లలు వారి పెంపకము మరియు స్థితిగతులను వివరించెను.

తత్ఫలితముగా బూత్‌కు చాలా ఆర్థిక సహాయము లభించెను. ఇండ్లు, చిల్డ్రన్ హోమ్స్, దిక్కులేని వారికి, ఇతర అనేక వ్యసనములతో బాధపడువారికై చెఱనుండి విడిపింపబడిన వారికి, అడుక్కునే వారికి ఇంకా ఎన్నో ఎన్నెనో ఆశ్రయస్థలములు, హోస్టళ్ళు కట్టుటకు ఆ డబ్బును వాడెను.

సైన్యము విస్తరించెను. సాల్వేషనిస్ట్‌లు (సాల్వేషన్ ఆర్మీ సోల్జర్స్) అమెరికాలో, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మరియు ఇండోనేషియాలలో వారి పనిని ప్రారంభించిరి. ఎంతో దీనముగా, తను తన భార్య ప్రారంభించిన దీన పరిచర్య ప్రపంచ వ్యాప్తసంస్థగా అభివృద్ధియాయెను. మరో యాభైయేండ్ల తర్వాత సాల్వేషన్ ఆర్మీ తొంభై వేర్వేరు దేశములలో పనిచేయుచుండెను. సాల్వేషన్ ఆర్మీ సైనికులు వారి జనరల్‌ను నమ్మకముగా అనుసరించిరి. "ఆత్మల కొరకై వెళ్ళండి, శ్రమయైనా వెళ్ళండి" అనునది వారి జనరల్ జీవిత ధ్యేయము.



116. పెంతెకొస్తు ఉద్యమము

క్రైస్తవ్యములోనే, పెంతెకొస్తు ఉద్యమమని పిలువబడు సంఘముల గుంపులు కలవు. ఈ సంఘములు పరిశుద్ధాత్మ వ్యక్తిత్వము మరియు ఆయన పనిని ఎక్కువగా నొక్కివక్కాణించిరి. పెంతెకొస్తు దినమున అపొస్తలులపై పరిశుద్ధాత్ముడు కుమ్మరింపబడుటను గూర్చి మనము అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో చదివెదము. పెంతెకొస్తు దినమున సంఘములో మరియు విశ్వాసుల హృదయములో నివసించుటకు దిగివచ్చెను. ఇది క్రైస్తవ సంఘ ఎదుగుదలకు దోహదపడెను. ఈ సమయములో అనగా అపొస్తలుల దినములలో, ప్రవచన వరము, అన్య భాషలలో మాట్లాడు వరము, ప్రార్థన ద్వారా స్వస్థత అను ప్రత్యేక వరములను తన సంఘమునకు అనుగ్రహించెను. ప్రభువు ఈ వరములను ఆదిమ సంఘమునకు అనుగ్రహించెను. ప్రభువు క్రొత్త నిబంధనను తన సంఘమునకిచ్చినపుడు మొదట ఇచ్చిన ప్రత్యేక వరములు ఇకను అవసరము లేదు. నేడు దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు మాట్లాడును.

ఆదిమ సంఘమునకు పరిశుద్ధాత్మచే ఇవ్వబడిన ప్రత్యేక వరములు నేడునూ ఉన్నవని పెంతెకొస్తు ఉద్యమము విశ్వసించును. మిషన్ ఫీల్డ్‌లో కొన్ని ప్రత్యేక సందర్భములలో ప్రభువు అద్భుతములు మరియు ఆశ్చర్యకార్యములను ప్రభువు వాడుకొనును. ఈ అన్యలోకములో, సువార్తను ఎదిరించు లోకములో ఆయన వాటిని వాడి ఆయన వాక్యమునకు విజయమునిచ్చును.



అనుదిన జీవితములో తన ప్రజలను నడిపించి నిర్దేశించుటకై పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమునువాడును. ఇరవైయవ శతాబ్దం ప్రారంభమైనది. ఎంత త్వరిత గతిన పెరిగినదంటే ఇరవైయవ శతాబ్దం ప్రారంభములో 150 కోట్ల పెంతెకొస్తు వారున్నారు. 400-600 కోట్ల పెంతెకొస్తు వారున్నారని కొందరు అంచనా వేసిరి.

ప్రొటెస్టెంట్ సంఘములలోనే పెంతెకొస్తు ఉద్యమము మొదలయ్యెను. క్రీ.శ.1906 లో అమెరికాలోని మెథడిస్ట్ సంఘము ఆత్మ బాప్తిస్మము పొందుకొనెనట. వారు అంతకు ముందెన్నడు మాటలాడని అన్యభాషలలో మాట్లాడుట ప్రారంభించిరి. "భాషలలో మాట్లాడుట" అనునది ఆత్మయందలి బాప్తిస్మ సూచనయని వారు విశ్వసించిరి.

పెంతెకొస్తు సంఘములలో ఆత్మద్వారా తిరిగి జన్మించిన వారు గలరు. వారు మాత్రమే ఆత్మీయ జీవితములో "ఉన్నతదశకు" చేరిన వారునూ గలరు. ఆత్మచే బాప్తీస్మము పొందిన ఈ అనుభవమును వారు "రెండవ ఆశీర్వాదము" (సెకండ్ బ్లెస్సింగ్) అని వారందురు. పరిశుద్ధాత్ముడు మరియు ఆయన దయచేయు వరములు పెంతెకొస్తు బోధలలో కీలక పాత్ర వహించును. తత్ఫలితముగా ప్రభువు యొక్క రక్షణ కార్యము తెరవెనుకకు వెళ్ళి కనుమరుగైపోయే ప్రమాదము కలదు.

"అసెంబ్లీస్ ఆఫ్ గాడ్" మరియు "ఫోర్ స్క్వేర్ గాస్పల్" అను వేర్వేరు పేర్లుగల సంఘ గుంపులు అమెరికాలో బయలుదేరెను. పెంతెకొస్తు ఉద్యమము అమెరికా నుండి ఉత్తర యూరప్, ఇంగ్లండ్ జర్మనీ మరియు నెదర్లాండ్స్‌కి వ్యాపించి అక్కడ నుండి యావత్ ప్రపంచమునకు ప్రాకెను.

పెంతెకొస్తు ఉద్యమములోని వేర్వేరు సంఘములు వేర్వేరు విధములుగా ఉందురు. జర్మనీ యొక్క వేర్వేరు నగరములలో ఈ వ్యత్యాసములు తీవ్రవాదోపవాదములలో గొడవలకు దారితీసెను. "తీవ్ర దశకు" వెళ్ళని ఓ మాదిరి భావములుగల పెంతెకొస్తు గుంపువారు కూడ ఉన్నారు. పెంతెకొస్తు సంఘములవారు చిన్నబిడ్డలకు బాప్తీస్మమివ్వరు కాని నూతన శిశు దీవెన నిమిత్తమై ప్రత్యేక కూడికలను జరిపింతురు. విశ్వాసులకు ముంచుట బాప్తిస్మమును వారు ఆచరింతురు.

పెంతెకొస్తు సంఘములలో జరుగు కూడికలలో ప్రజలు వారి భావోద్రేకములను ఉల్లాసముతో వ్యక్తపరచెదరు. దేవుని సన్నిధి ద్వారా మరియు పరిశుద్ధాత్మ నింపుదల వలన వారికి పూనకం వచ్చును. ఉల్లాసభరితమైన గీతాలాపన, చేతులెత్తుట, నాట్యము చేయుట ఎగురుట మున్నగు వాటిద్వారా పై సంగతులు జరుగును. దర్శనములు మరియు దేవుని ప్రత్యక్షతకై ప్రజలు ఆశపడెదరు. దేవునికై నిర్ణయము చేయుట ప్రజలవంతు. వారి హృదయాలు పరిశుద్ధాత్మకై తెరిచినపుడు వారు గొప్పగా సహాయము పొంది బలపరచబడుదురని వారందురు. "నాకు వేరుగా మీరేమియూ చేయలేరు" (యోహాను 15:5) అను ప్రభువు మాటను మరచుట చాలా తేలిక.

దినములు గడిచాక ఆత్మలోని బాప్తీస్మము మరియు అన్య భాషలలో మాట్లాడుట వీటికి తక్కువ ప్రాధాన్యతనిచ్చిరి. ఇప్పుడైతే ప్రార్థన ద్వారా స్వస్థత మరియు హస్తనిక్షేపణ వీటికి అధిక ప్రాధాన్యత నిచ్చుచున్నారు. ఇట్టి పరిణామములు ప్రజలను ఎంతో ఆకర్షించుచున్నవి. ఇట్టి సంగతులపై ప్రపంచ వ్యాప్తముగా ఆసక్తి త్వరిత గతిలో పెరుగుచున్నది.

"విశ్వాస స్వస్థత" విషయములో దీర్ఘ ప్రార్థనలు మరియు చేతులుంచి ప్రార్థించుట ద్వారా ఎక్కువ లాభమును ఆశించి మందుల సహాయమును కొందరు తీసి కొనుటలేదు. స్వస్థపరచుమని ప్రభువును బలవంతము చేస్తూన్నారేమో, అన్నట్టుగా ఉండును. ఫలితముగా ప్రభువుగాక స్వస్థత ప్రార్థన చేయువ్యక్తి అధికమహిమను పొందుతున్నాడు.

ప్రార్థన ద్వారా ప్రభువు రోగిని నయముచేయును. వినయముగా యథార్థముగా ప్రార్థించిన వ్యక్తి ఫలితమును ప్రభువునకు వదలిపెట్టును. ప్రభువు మందులను దీవిస్తే, ఆ వ్యక్తి స్వస్థపరచబడితే మహిమ ఆయనకే చెల్లును.

117. సంఘము మరియు యూదుల హింస

క్రీ.శ.1939 లో రెండవ ప్రపంచ యుద్ధము జరిగెను. ఈ యుద్ధము క్రీ.శ.1945 వరకు ఆగలేదు. మొదటి ప్రపంచయుద్ధముకంటే రెండవ ప్రపంచయుద్ధము ఘోరముగా జరిగెను. ఈ భీకర పోరాటములో కోట్లకొలది సైనికులు మరియు ప్రజలు ప్రాణాలు కోల్పోయిరి.

క్రీ.శ.1933లో అడాల్ఫ్ హిట్లర్ జర్మన్ ప్రభుత్వమునకు నాయకుడాయెను. జర్మనీ అంతటిపై ఖచ్చిత అధికారము సంపాదించుకునేంతవరకు ఆయనకు తృప్తికలుగలేదు. జర్మన్ సరిహద్దులతో ఆయన ఆశలు ఆగిపోలేదు.

రష్యా నాయకుడైన స్టాలిన్‌తో ఆయన శాంతి ఒప్పందము చేసికొనెను. తరువాత ఆయన చెకొస్లొవేకియాతో దానిని కలిపెను. (చెకొస్లొవేకియాలో చెక్ రిపబ్లిక్ మరియు పొరుగుదేశమైన స్లొవేకియా ఉన్నాయి). ఆయన పోలెండ్‌పై దండెత్తి వెళ్ళెను. క్రీ.శ.1940 లో నార్వే, డెన్మార్క్, నెదర్లాండ్స్ బెల్జియమ్ మరియు ఫ్రాన్స్ దేశములు జర్మన్‌చే దాడి చేయబడెను. హిట్లర్ ఆయన దృష్టిని ఇంగ్లండ్‌పై మరల్చెను. కాని జర్మని మరియు ఇంగ్లండ్ విమాన దళముల మధ్య యుద్ధము జరిగెను. జర్మన్ విమాన దళము ఘోరపరాజయము పాలాయెను.

క్రీ.శ.1941లో అమెరికా కూడ ఆ యుద్ధములో పాల్గొని ఇంగ్లండ్‌ను బలపరచెను. హిట్లర్ అధికారములోనికి వచ్చినది మొదలుకొని యూదుల జాడ ఏమియూ లేకుండ తుడిచిపెట్టవలెనని నిశ్చయించుకొనెను. జర్మని ప్రజలకు యూదులు బద్ధ శత్రువులని ఆయన చెప్పెను. అందుకే వారిని సమూల నాశనము చేయవలెను! (అట్టి జాతి నిర్మూలనను జెనోసైడ్ అని పిలుతురు) దక్షిణ పోలండ్‌లోని ఆస్విట్జ్ అను స్థలములో జాతి నిర్మూలన శిబిరము కట్టబడెను. ఈ శిబిరము చాలా మారుమూల స్థలములో నిర్మింపబడెను గనుక అక్కడ జరుగు సంగతులు బయటి ప్రపంచమునకు ఏ మాత్రమును తెలియరావు.

వేలకొలది యూదులను రైళ్ళలో కుక్కి తీసికుని వెళ్ళి జాతి నిర్మూలన శిబిరములోని గ్యాస్ చేంబర్స్‌లో చంపేవారు. (వాయువుతో నిండిన గదులు) ప్రత్యేక పొయ్యిలలో వారి శవములను కాల్చెడివారు. సాతాను పనియైన యూదులను ద్వేషించుట (యాంటి సెమిటిజమ్) చాలా వేగముగా విస్తరించుచున్నది. అది జర్మన్ సరిహద్దులోనే ఆగిపోలేదు. హిట్లర్ ఆక్రమిత ప్రాంతములోనున్న యూదులను చెఱగా పట్టుకొని పోయిరి. పశువుల మందలవలె వేలకొలది యూదులను జాతినిర్మూలన శిబిరములకు తరలించిరి. జాతి నిర్మూలన శిబిరములు ఆస్విట్జ్, డచావు, సోబిబర్ అను స్థలములలో కలవు. ఆ స్థలములలో బానిసత్వము క్రూరత్వము, హింస, వేదింపు ఉండును.

క్రీ.శ. 1942 కల్లా ఈ ఘోరపరిణామములు పశ్చిమమునకు చేరెను. ఈ దారుణ పరిస్థితులు ప్రొటెస్టెంట్ మరియు రోమన్ క్యాథలిక్ సంఘముల నిరసనకు దారి తీసెను. డచ్ సంఘములు కూడ నిరసనలో పాల్గొనెను. యూదులు వారి తోటి దేశస్థులు! డచ్ సంఘ ప్రతినిధులందరూ కూర్చొని ఈ సంగతులను చర్చించిరి. వారు కాన్వెంట్ దర్ కెర్‌కెన్ (కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ – సంఘముల సహవాసము) ఈ సంస్థ పని చేయుటము ప్రారంభించెను!

వారి విజ్ఞప్తిలో అనేక సంగతులు ఉండెను. కాని యూదులను హింసించుట ఆపివేయవలెనని జర్మన్ ప్రభుత్వమును వారు కోరిరి. యూదుల బాధలలో సంఘములు పాలుపంచుకొనెను. ఈ యూదులు అబ్రహాము సంతతి, ఈ జాతి నుండి లోకరక్షకుడు పుట్టెను గనుక వీరి విషయమై సంఘములు శ్రద్ధకలిగియుండిరి. ఈ నిరసన డచ్ సంఘములన్నింటిలో చదువగా గొప్ప స్పందన వచ్చెను.

జర్మన్ అధికారుల నియమ నిబంధనల విషయములో కూడ కాన్వెంట్ నిరసన తెలిపెను. అట్టిపని చేయుటలో కాన్వెంట్ సభ్యులలో అనేకులు ప్రాణములకు తెగించిరి. బోధకులలో అనేకులు పశుప్రాయమైన



యూదాజాతి నిర్మూలన అను సంగతిని ఖండించి వారి సంఘములలో దాని విషయమై ప్రార్థించిరి. తత్ఫలితముగా బోధకులు బంధింపబడి యూదాజాతి నిర్మూలన శిబిరములో వేయబడిరి.

రెండవ ప్రపంచ యుద్ధ సమయములో యూదులు చాలా బాధింపబడిరి. కుటుంబములుగా యూదులు ఆ శిబిరములలో మరణించిరి. ఆరుకోట్ల యూదులు – చంపబడినట్లు అంచనా వేయబడెను. ఈ యూదుల ఘోర వధను హోలొకాస్ట్ అని పిలుతురు.

కొంతమంది వారి ఇళ్ళలో యూదులకొరకై రహస్య స్థావరములు కట్టి వారిని రక్షించిరి. ఈ విధముగా యూదులు జర్మన్ సైనికులనుండి తప్పింపబడిరి. మారుమూల పొలములలో యూదులు దాచబడిరి. వారిని దాచిపెడితే వచ్చే శిక్ష మరణము గనుక ఇలా చేయుట చాలా ప్రమాదకరము!

యూదులు క్రైస్తవుల ఇండ్లలో ఆశ్రయము తీసికొనినందున యూదులలో కొందరు క్రైస్తవులైరి. భోజన సమయములో బైబిల్ చదువబడగా వినిరి. అది యూదుల గ్రంథము కాదుగాని, క్రైస్తవులు వాడిన గ్రంథములో పాత క్రొత్త నిబంధనలు కలవు. క్రైస్తవుల ద్వారా కాపాడబడిన యూదులు మారి ప్రభువైన యేసునందు విశ్వాసముంచిరి!

118. జాయనిజమ్

పంతొమ్మిదవ శతాబ్దపు అంతమున డెర్ జుడెన్‌స్టాట్ (యూదా రాష్ట్రము) అను పుస్తకము ప్రచురింపబడెను. యూదులకొరకు స్వదేశమొక్కటి ఏర్పడాలి. అను అంశము ఆధారముగా ఈ పుస్తకము వ్రాయబడెను. పాలస్తీనా, సీయోనుకోట, యెరుషలేము కట్టబడిన స్థలము అదొకటే స్థలమని నిదర్శనమాయెను. యెరూషలేము నడిబొడ్డున ఆలయము కట్టబడినది. యూదులు అబ్రాహాము యొక్క సంతతి, ఆయనకు దేవుడు దేశమును వాగ్దానము చేసెను. ప్రభువైన యేసు జననము వరకు యూదా సంతతి ప్రజలు యెరూషలేములో నివసించిరి. ఇప్పుడు ప్రపంచపు నలుమూలలనుండి యూదులు మరొకసారి పాలస్తీనా దేశమునకు తిరిగి రావలసివచ్చెను. ఇటువంటి భావనలు లేదా ఆశలు జాయనిజమ్ అని పిలువబడెను.

ఇరవైయవ శతాబ్దపు ప్రారంభములో 150,000 యూదులు యూరప్ విడిచి పవిత్ర దేశము (పాలస్తీనా)నకు వచ్చిరి. మరువబడి విడువబడిన చోట పట్టణములు, నగరములు, కర్మాగారములు, ఉద్యానవనములు వెలసెను. "యెడారి రోజా పుష్పమువలె వికసించును"(యెషయా 35:1) అను మాటలు నెరవేరెను.

ఇటువంటి వలస, ఈ ప్రాంతములో నివసించు యూదులకు అసూయ కలుగజేసెను. అదియుగాక వారికి యూదామతమంటే లెక్కలేదు. యూదులు తిరిగివచ్చుచుండగా అరబ్బులు అడ్డుకుని వారిపై 'పవిత్ర యుద్ధమును' ప్రకటించిరి. హింస, రక్తపాతము జరిగెను. పశ్చిమ ఐరోపాలో యూదాజాతి ద్వేషము అధికముగా ఉన్నందున, వారు హత్య చేయబడుచున్నందున యూదులు సమూహములుగా వచ్చుచుండిరి. తత్ఫలితముగా నాజీ జర్మని నుండి సోవియట్ యూనియన్ మరియు పోలండ్ నుండి క్రీ.శ.1930 లో యూదులు అధిక సంఖ్యలో పాలస్తీనాకు తిరిగి వచ్చిరి.

క్రీ.శ.1945 లో రెండవ ప్రపంచ యుద్ధము ముగిసెను. తరువాయి సంవత్సరములలో నాజీలయొక్క హింస అధికమైనందున పాలస్తీనాకు వలసవచ్చు యూదుల సంఖ్య పెరిగెను.

క్రీ.శ.1947 లో 65,000 యూదులు పాలస్తీనాలో కలరు. పాలస్తీనాను ఒకటి అరబ్బులకు మరొకటి యూదులకని రెండు రాష్ట్రములుగా విభజింపవలెనని ఐక్యరాజ్య సమితి నిర్ణయించెను.

క్రీ.శ.1948లో ఇశ్రాయేలు అను యూదా స్వతంత్ర రాష్ట్రముగా ప్రకటింపబడెను. ఇశ్రాయేలు మొదటి ప్రధాన మంత్రియైన డేవిడ్ బెన్ గురియన్ ఈ సంఘటనను గూర్చి మాట్లాడుతూ, "స్పష్టముగా ప్రవచన నెరవేర్పుచేయు రాష్ట్రమును కలిగియుండుటయే మా ధ్యేయము" అని చెప్పెను.

స్వాతంత్ర్యము ప్రకటింపబడిన వెంటనే యూదా రాష్ట్రము, పొరుగు అరబ్‌లచే దాడి చేయబడెను. కాని యూదులు ధైర్యముగా నుండి ఇంకా విస్తరించిరి. తరువాత వచ్చిన సంవత్సరములలో గొప్ప శత్రువును సహితము యూదులు తరిమి వేయగలిగిరి. వేయి సంవత్సరముల క్రితము దావీదు గొల్యాతును జయించినట్లుగా యూదులు వారి శత్రువులను గెలిచిరి.


ప్రపంచపు నలుమూలలనుండి ప్రతి సంవత్సరము వేల సంఖ్యలో యూదులు పాలస్తీనాకు తిరిగి వచ్చుచుండిరి. వారు అరబ్‌ల చేతిలో కొన్నిసార్లు ఓడిపోవలసి వచ్చినా, దాడి చేయబడినా, యూదులు పాలస్తీనాకు వచ్చుచునే యుండిరి. "ఇది ప్రభువు వలన కలిగినది, ఇది మాకెంతో ఆశ్చర్యముగానున్నది" (కీర్తన 118:25).

క్రీ.శ.1950 నుండి యూదులు ప్రపంచపు నలుమూలలనుండి వచ్చి ఇశ్రాయేలు పౌరులుగా మారుటకు అనుమతింపబడిరి. దీనివలన వలస ఇంకనూ పెరిగెను. ఇశ్రాయేలునందు నివసించు ఇశ్రాయేలీయులు యూదా మతము ఆజ్ఞలను ఏ మాత్రము లెక్క చేయుట లేదు. కాని ఇశ్రాయేలులోని కొందరు యూదులు భక్తి శ్రద్ధలతో సంప్రదాయములతో జీవించిరి. (ఆర్థోడాక్స్

యూదులు యూదా మతము యొక్క నియమ నిబంధనలను అతి జాగ్రత్తగా ఆచరించువారు). యేసు వాగ్దానము చేయబడిన మెస్సీయ అని నమ్మరు గనుక ఆ యూదులు క్రొత్త నిబంధనను తిరస్కరించి, వారి గ్రంథముగా పాతనిబంధనను మాత్రమే స్వీకరింతురు. యేసు నిజమెస్సయ అని విశ్వసించిన యూదులు కలరు. ఇట్టి ప్రజలు మెస్సియానిక్ బిలీవర్స్ లేదా మెస్సియానిక్ యూదులని పిలువబడి మెస్సియానిక్ కాంగ్రిగేషన్స్‌గా కూడుకొందురు.

పశ్చిమ సంఘములు ప్రత్యేకముగా నెదర్లాండ్స్ వారు యూదులకు సువార్త ప్రకటించుటకై ప్రయాసపడుచున్నారు. మెస్సియానిక్ పెరుగులాగున ప్రభువు వారి పనిని దీవించులాగున వారు నిరీక్షించిరి. ఇశ్రాయేలు దేశము మెస్సియాను అనుసరించు దేశముగా మారాలని వారు ప్రభువునకు ప్రార్థించిరి. ఎందుకనగా యూదులు దేవుని నిబంధన జనులు– వారి పితరుడైన అబ్రాహాముతో స్వయాన ప్రభువు నిబంధన చేసెను.

తన స్వంత ప్రజలుగా నుండుటకై ప్రభువు ప్రత్యేకముగా ఎన్నుకొనిన నిబంధన ప్రజలను గూర్చి రోమా 11:1 లో అపొస్తలుడైన పౌలు వ్రాసెను "దేవుడు తన ప్రజలను ప్రక్కన బెట్టెనా? అట్లనరాదు" 2వ వచనములో ఈ మాటను ఈ క్రింది విధముగా నొక్కి వక్కాణించెను, "తాన ముందే ఎరిగిన ప్రజలను దేవుడు విసర్జించెనా?"



119. కాల సూచనలు

దాదాపు రెండువేల యేండ్ల క్రితము ప్రభువైన యేసు క్రీస్తు స్వయాన ఈ భూమి మీద జీవించుచుండెను. ఇక్కడ ఆయన తన పని ముగించుకొనిన తర్వాత పరలోకములోని తన తండ్రి యొద్దకు వెళ్ళెను. ఆయన 'అధికారము మరియు అధిక మహిమ'తో తిరిగి వచ్చెదనని ప్రభువైన యేసు ఈ లోకమును విడిచి వెళ్ళకమునుపు వాగ్దానము చేసెను (మత్తయి 24:30). ఆ మహా దినమున, ఆయన రాకడ దినమున, సమాధులలో నుండి మృతులు లేచెదరు మరియు ప్రభువైన యేసు ఈ గ్రహము మీద నివసించిన ప్రజలందరికి తీర్పుతీర్చును.

అది ఎప్పుడు జరుగును? ఎవరికిని తెలియదు... పరలోకములోని దూతలకునూ తెలియదు. రకరకముల ప్రకటనలు చేయబడినవి. కాని ఏవియూ నెరవేరలేదు. ప్రభువు యొక్క రెండవ రాకడ సమయము (ఆయన తిరిగి వచ్చుట) దేవునికి మాత్రమే తెలియును.

కాని ప్రభువు రాకడను గూర్చి ముందే తెలుపబడినది. ఆ ప్రభువైన యేసు భూమి మీద ఉండగా స్వయాన ఆయనే తన రెండవ రాకడను గూర్చి చెప్పెను. ఆయన రాకడ దినము కంటే ముందు జరుగు సంగతులను ఆయన చెప్పెను. ఈ సంఘటనలు 'కాల సూచనలు'గా పిలువబడెను.

పరిశుద్ధ గ్రంథములోని వేర్వేరు భాగములలో ఈ సూచనలు వర్ణింపబడినవి. ఉదాహరణకు యుద్ధములు, భూకంపములు, కరువులు తెగుళ్ళను గూర్చి ప్రభువు చెప్పెను. ఈ సందేశమును ఉదహరించుటకై ప్రభువు యేసు అంజూరపు చెట్టును గూర్చి చెప్పెను. చెట్టు ఆకులు రాలి క్రొత్త చిగురు వచ్చినపుడు ఎండాకాలము వచ్చుచున్నదని తెలిసికొందుము. మన ప్రపంచములో కరువు కాటకములు జరుగుతుంటే ప్రభువు తిరిగి వచ్చుదినము సమీపించుచున్నదని తెలిసికొందుము. ఈ సూచనలు మన ప్రస్తుత సమాజములో మనము చూడవచ్చును. భూకంపము సంభవిస్తే ఒక్కక్షణములోనే వేలకొలది ఇండ్లు కూలిపోవును అనేకులు తత్ఫలితముగా నిరాశ్రయులగుదురు. భూకంపములు మరియు సునామీలలో గ్రామములు సహితము తుడిచి వేయబడెను. నీటి పొంగు మరియు ప్రవాహమువలన వందలకొలది ప్రజలు కొట్టుకొని పోయిరి!

అటువంటి దేశములలో కరువు ఆకలి చావులు అధికముగా నుండును. వేలాది ప్రజలు మరణించిరి. చిన్నపిల్లలు తినుటకేమైన దొరుకు నేమోయని చెత్త చెదారములో వెదకు చుందురు. అట్టి సమయములలో వ్యాధులు ప్రబలి అనేకులు మరణింతురు. అటువంటి వ్యాధులకు మంచి ఉదాహరణ ఎయిడ్స్! ఆ రోగమునకు ప్రభావవంతమైన మందు కనుగొనబడలేదు. అనారక్షిత, అక్రమలైంగిక సంబంధములు కలిగియున్నవారు వేలకొలదిగా ఈ ఘోరవ్యాధివలన మరణింతురు. ఎయిడ్స్ సోకిన వారందరు అక్రమ సంబంధం కలిగియున్నారని కాదు. కొందరు రక్త మార్పిడి మరియు కొందరు అశుభ్రమైన పరిసరములద్వారా ఇట్టి వ్యాధులకు గురియగుదురు. చిన్న పిల్లలు అనాథలుగా చేయబడుదురు మరియు అనేకులు ఈ వ్యాధివలన శ్రమపడుదురు.

'యుద్ధములు మరియు యుద్ధములను గూర్చిన వార్తలు' కాల సూచనలని ప్రభువు చెప్పెను. ఇప్పుడు యుద్ధములను గూర్చిన వార్తల మధ్యన మనము జీవించుచున్నాము. ఆఫ్రికా ఖండములో విప్లవములో చంపివేయబడిన వారందరిని గూర్చి ఆలోచించుము. మన ఆధునిక లోకములో శాంతి సమాధానము కరువయ్యాయి.

ఈ సూచనల విషయములో ప్రజలు ఎలా స్పందిస్తున్నారు. స్వయాన ప్రభువే మనకు, ఈ విషయమై జవాబిచ్చును. జలప్రళయము కంటే ముందున్న పరిస్థితులు నేడును ఉన్నవి (ఆదికాండము 7 మరియు 8) ఆ సమయములో మనుష్యులు తీర్పు అంటే లెక్కలేకుండా జీవించిరి. వారు నోవహు సందేశమును నిర్లక్ష్యము చేసి భక్తిహీన జీవితము జీవించిరి. నేటిరోజున అనేకులు బాహాటముగా పాపములో మరోమారు ఆలోచించకుండా జీవించుచున్నారు. తీర్పుదినము దగ్గరగా ఉందంటే వారు అపహాస్యము చేయుచున్నారు. (IIపేతురు 3:3) "గత దినములవలె నేటి దినములునూ ఉన్నవి." రేపు కూడ ఇలాగే ఉండే అవకాశమున్నది". కాని ప్రభువు దినము రాత్రి దొంగ వచ్చినట్లుగా వచ్చును" అని పేతురు చెప్పెను.

(II పేతురు 3:10) దానికర్థము అది ఆ దినము అకస్మాత్తుగా ఉండును.

అపొస్తలుడైన పౌలుకూడ "కాల సూచనలను" గూర్చి వ్రాసెను. "మొదట భ్రష్టత్వము సంభవించి నాశన పుత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనే గాని ఆ దినము రాదు" (2 థెస్స 2:3). దీనికర్థము ప్రభువు తిరిగి రాకమునుపు, మనుష్యులు ప్రపంచవ్యాప్తంగా దేవుని వాక్య సత్యమునుండి తొలగిపోవుదురు.

అనేక దేశములలో ఇది ఇదివరకే జరుగుచున్నది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లాం మతము బలపడుచున్నది. ఇస్లాం మరియు ప్రపంచ మతముల ద్వారా కూడ నిత్యరక్షణ ఉన్నదని పేరుమోసిన క్రైస్తవులు నమ్ముచున్నారు. ఇతర మతముల.... దేవుని వాక్యమును తిరస్కరించి ధిక్కరించినా, వారు పై సత్యమును నమ్ముదురు. చివరి దినములలో సంఘము అధిక హింస మరియు శ్రమను పొందునని ప్రభువు చెప్పెను. సంఘము శ్రమ, హింసను అనుభవించుచునేయున్నది. కాని చివరి దినములలో "మహాశ్రమల కాలము" వచ్చును (మత్తయి 24:21).

అయితే అప్పుడు దేవుని సంఘమునకేమగును? వచ్చే అధ్యాయములో మనము ఈ ప్రశ్నను గమనించెదము. లోకము ఇంకను ఎందుకు అంతము కాలేదు? ప్రభువే స్వయాన మనకు జవాబిచ్చును. మొదట రాజ్యసువార్త సర్వలోకములో ప్రకటింపబడును. అప్పుడు అంతము వచ్చును" (మత్తయి 24:11)

యేసు మాటలు త్వరలోనే నెరవేర్చబడబోవుచుండగా, దేవుని వాక్యము బోధింపబడని స్థలములు ఇంకా కొన్ని మాత్రమే ఉన్నవి. ఈ సంగతులన్ని ప్రభువు ఎందుకు చెప్పెను? "ఆయన ఏ ఘడియలో వచ్చునో మీకు తెలియదు గనుక కనిపెట్టి యుండుడి." (మత్తయి 24:42). పద్దెనిమిదవ శతాబ్దము యొక్క ఇంగ్లీష్ బైబిలు వ్యాఖ్యానకర్త ప్రభువు మాటలపై ఈ విధముగా వ్యాఖ్యానించెను. "మన ఆత్మల అవసరత విషయములో అత్యంతశ్రద్ధపెట్టి కనిపెట్టి ఉండడమే మన అతి ప్రాముఖ్య కర్తవ్యము."



120. అత్యధిక విజయులం....

దేవుని సంఘము పోరాటము, వేదన మరియు శ్రమతో నిండియున్నది. ఆయన సంఘము అనుభవించిన శ్రమలను గూర్చి వ్రాయవలెనని సంఘము యొక్క రాజైన ప్రభువైన యేసుక్రీస్తు తన అపొస్తలుడైన యోహానుకు ఆజ్ఞాపించెను. ఇవి వ్రాసే సమయానికి యోహాను పత్మాసు ద్వీపములో పరవాసిగా ఉండెను. ప్రకటన 12:13-17లో యోహాను వ్రాసిన ఇతి వృత్తమును చదువ వచ్చును. 13వ వచనములో ఘటసర్పము స్త్రీని హింసించెను. దేవుని మహాశత్రువైన సాతానును గూర్చి వర్ణించుటకై మహాఘట సర్పము అను పదము వాడబడెను. తనను తాను కాపాడుకొనలేని నిస్సహాయతను గూర్చి వర్ణించుటకై స్త్రీ అను పదము వాడబడెను.

మొదట ఘట సర్పము క్రీస్తుపై ప్రచండ కోపము రౌద్రము చూపెను. క్రీస్తు సిలువపై తన మరణము ద్వారా సాతానును ఓడించి క్రీస్తు పరలోకమునకు వెళ్ళాక ఘట సర్పము స్త్రీని (సంఘమును) దాడి చేసెను.

9 వ వచనములో ఘట సర్పము తన నోటినుండి నీళ్ళు నదీ ప్రవాహముగా ఆమె వెనుక (సంఘము) వెళ్ళగ్రక్కి ఆమెను ముంచి వేయ ప్రయత్నించెను. దేవుని సంఘమును తుడిచిపెట్టు సాతాను



దాడులను ఈ సంఘటన అభివర్ణించును. మనము గత అధ్యాయములో చూచినట్లు ఈ దాడులు బాధాకరమైన హింసరూపములోనే గాక తప్పుడు సిద్ధాంత బోధల రూపములో కూడ జరిగెను. సంఘము పొందిన బాధలన్నిటిని వ్రాస్తే చాలా సమయము స్థలము పట్టును గనుక మేము అవన్నియూ వ్రాయుటలేదు. కాని బలహీన మరియు తనను తాను కాపాడుకోలేని దుర్బల స్త్రీ (సంఘము) అనుభవించిన శ్రమలు నిశ్చయముగా విపరీతమైనవి! అయిననూ ఈ యెడారి లాంటి భూసంబంధ జీవితములో స్త్రీ పోషింపబడి బలపరచబడెను. దేవుని సంఘము నాశనము చేయబడలేదు!

ఘట సర్పము దాడినుండి తప్పించుకొనుటకై స్త్రీకి రెండు రెక్కలు ఇవ్వబడెను అని మనము 14వ వచనములో చూడవచ్చును. ఒక రెక్క విశ్వాసము మరొకటి ప్రార్థన. హింస సమయములో స్థిరముగా నిలుచుటకై విశ్వాసము ద్వారా స్త్రీ బలము పొందును. ఆయన నామమును కాదనక ఒప్పుకొనునట్లుగా ప్రార్థనలో ఆమెను తన రాజు బలపరచునట్లుగా ప్రార్థనలో కోరును. ఈ కారణము చేత దేవుని బిడ్డలు హతసాక్షులుగా మరణిస్తూ వారి ప్రభువునకు యజమానునకు కీర్తనలు పాడిరి. ఈ దుర్బల స్త్రీ మహాఘట సర్పముకంటే బలవంతురాలని తనను తాను నిరూపించుకొనెను. వారి రాజు బలమందు బలవంతులైరి, వాస్తవమునకు వారు అత్యధిక విజయులైయున్నారు...

భవిష్యత్తులో ఏమి జరుగబోతోంది? "ఈ లోకములో మీకు శ్రమ కలుగును" (యోహాను 16:33) అని యేసు స్వయాన చెప్పెను మరియు ఆయన మాటలు గతము ప్రస్తుతము మరియు భవిష్యత్‌నకునూ వర్తించును."సాతాను ఇంకనూ గర్జించు సింహమువలె తిరుగాడుచున్నది" (2 పేతురు 5:8) ప్రపంచదేశములలో అనేక క్రైస్తవులు ఎంతో ఒత్తిడి చేయబడుతున్నారు. వారు దేవుని వాక్యము అధ్యయనము చేయుటకై కూడుకుంటే వారు కొట్టబడి వారి కూడికలు చెల్లాచెదురు చేయుచూ పాస్టర్‌లు చెఱసాలలో వేయబడుచున్నారు. వేలకొలది క్రైస్తవులు ఉత్తరకొరియాలోని చెఱ శిబిరములలో మరణించుచున్నారు.

తప్పుడు మతములైన ఇస్లాం, హిందూ మరియు బౌద్ధమతములు క్రైస్తవ్యం పట్ల రానురాను అధిక ద్వేషమును చూపుచున్నారు. పశ్చిమ యూరప్‌లో ఇస్లాం మతము పెరుగుతున్నది. కొద్దిమంది మాత్రమే సంఘములకు వెళ్ళుచున్నారు. మనుష్యులు సమూహములుగా క్రైస్తవ బోధను త్రోసిపుచ్చుచున్నారు.

క్రైస్తవ్యము విభజింపబడియున్నది, విశ్వాస నమ్మకములు ఒకటే ఉన్న సంఘములు ఐక్యముగా నుండుటకు ఇష్టపడుటలేదు. అమెరికా మరియు పశ్చిమ ఐరోపాలోని అనేక సంఘములు దేవుని వాక్యపు బలమైన పునాదులకు స్థానమివ్వక దోషము మరియు అబద్ధబోధకు అవకాశమిచ్చుచున్నారు. విశ్వాస ప్రకరణములను వారు తీవ్రముగా తీసికొనుటలేదు. ఇందువలన వారి మత విశ్వాసముల విషయములో పైపైన ఉంటున్నారు. తత్ఫలితముగా పాపము కృప, విశ్వాసము మరియు పశ్చాత్తాపము మున్నగు సిద్ధాంతములను బైబిల్ ఆధారముగా మాట్లాడుటలేదు.

ఇది నిజముగా దేవుని వాక్యమా కాదా అని కొందరు బైబిల్ అధికారమును ప్రశ్నించిరి. యేసు దేవుని కుమారుడా కాదా అని క్రీస్తు దైవత్వమును ప్రశ్నించిరి. ఘట సర్పము శక్తి చాలా గొప్పది! "నీకు అప్పగింపబడిన దానిని కాపాడుము" (1 తిమో 6:20). మనందరి కొరకైన దేవుని హెచ్చరిక ఇది. "మనకు అప్పగింపబడినది" పరిశుద్ధగ్రంథము, శాశ్వత దేవుని వాక్యము. ఈ దేవుని వాక్యము సంఘజీవితమునకు ఏకైక ప్రమాణము. పోరాటము అధికమైనా ప్రభువు సహాయము వలన బహుశ్రద్ధతో దేవుని వాక్యమును కాపాడుట సంఘము యొక్క విధి.

కాని వారి శ్రమలన్నిటిలో, దేవుని బిడ్డలు ధైర్యము పొందవచ్చును. ఈ బలహీనమైన హింసింపబడిన స్త్రీ.... యేసు యొక్క వధువు! ప్రభువైన యేసు, బలవంతుడైన వరుడు, తన వధువును ఘట సర్పము మ్రింగి వేయకుండ ఆయన కాపాడును. చివరి దినమున, ప్రభువైన యేసు క్రీస్తు బలమైన విజయుడుగా వచ్చును. మరియు..... ఆయన బిడ్డలు ఆయన బలమందు బలవంతులై అత్యధిక విజయులగుదురు.....!